# 'ముత్యమాల' రామాయణం



'మల్లెమాల'

# రామాయణం

ప్రచురణ :

మల్లెమాల ప్రచురణలు, హైదరాబాద్.

ప్రథమ ముద్రణ - 2005

ప్రతులు : **పదివేలు**

వెల : రూ. 250/-
US $ 20

© **సర్వహక్కులు రచయితవి**

ప్రచురణ :
**మల్లెమాల ప్రచురణలు,** హైదరాబాద్.


ప్రతులకు :
**మల్లెమాల ప్రచురణలు**
**శబ్దాలయ,** ఎల్.వి.ప్రసాద్ మార్గ్,
బంజారా హిల్స్, హైదరాబాద్ - 34
ఫోన్ : 040 - 23547637

ముఖచిత్రం :
శ్రీ యం.ఎ. సుభాన్ మరియు
**స్పెక్ట్రమ్ గ్రాఫిక్ స్టూడియో,** చెన్నై - 17
ఫోన్: 044-28142708

రేఖాచిత్రాలు :
**ఆనంద్ ఎ.వి.భి.యస్.**

డి.టి.పి. :
**యస్. అజీమ్**

ముద్రణ :
**అనుపమ ప్రింటర్స్,** 126, శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364



# అంకిత కుసుమాలు

చిన్ననాటి నుండి శ్రీరామ! నన్ను నీ
కన్నబిడ్డలీల కాచినావు!
ఇంతచేసినందు కేమీయలేక, నీ
కథను వ్రాసినాడ! కావ్యముగను.

నీ కృపతో రూపొందిన
ఈ కావ్యము స్వీకరించి ఇందలి ఫలమున్
లోకులకు నీవె పంచుము
నాకీ సంతృప్తిచాలు నళినదళాక్షా!

— మల్లెమాల

# కృతజ్ఞతాంజలి



జి. పుల్లారెడ్డి - వారి సతీమణి

పిలువకయెపల్కి వచ్చి నా తలుపు తట్టి
మించు భక్తిని నీవు రచించుచున్న
మధుర మంజులగాథ రామాయణమును
నేను ముద్రింతుననినట్టి మాననీయ !

చేయి సాచకుండ చేసిన సాయము
అమ్మ ప్రేమకన్న అమితఘనము
అట్టివర మొసంగి ఆశీర్వదించిన
నిన్ను మరువ బ్రతికి నన్నినాళ్ళు

పుల్లన్నా! మీ దంపతు
లుల్లమ్ములు పల్లవింప నొకరికొకరుగా
చల్లగ చిరకాలము వ
ర్ధిల్లుడు భద్రాద్రి రామదేవుని దయతో.

— మల్లెమాల

# నేను - నా శ్రీమతి



ఆలుమగలు దుఃఖమైన సంతసమైన
కలసి పంచుకొనిన కాపురమ్ము
నిత్య వైభవముల నిలయమై విలసిల్లు
ప్రణయసౌఖ్యమచట పరిఢవిల్లు॥

— మల్లెమాల

# ముందుమాట

**యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే,**
**తావద్రామాయణ కథా లోకేషు ప్రచలిష్యతి.**

"ఈ భూమండలం మీద పర్వతాలు నిలిచి ఉన్నంతకాలం, నదులు, ప్రవహిస్తూన్నంత కాలం రామాయణ కథ ప్రజల మనస్సులలో మెదలుతూ నాలుకలపై నర్తిస్తూ ఉంటుంది".

వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణాన్ని గూర్చి, ఆ శ్రీరామ కథను గూర్చి బ్రహ్మదేవుడు కొన్ని వేల సంవత్సరాల క్రితం చెప్పిన అమోఘ మైన జోస్యం ఇది. శ్రీ రామకథ, దానిలో సహజంగా ఉన్న లోక ప్రియత్వం చేతా, బ్రహ్మదేవుని ఆశీస్సుచేతా భారతదేశంలోనే కాకుండా ఎన్నో ఇతర దేశాలలో కూడ అనేక మైన రూపాలు సంతరించుకుని కొన్ని వేల సంవత్సరాలనుంచి వ్యాప్తిలో ఉంది. కాంబోడియా నుంచి జావా వరకు ఉన్న దేశాలలో సాహిత్యంలోనే కాకుండా, నృత్యమూ, శిల్పమూ మొదలైనవాటిలో కూడ రామాయణ కథా ప్రభావం కనబడుతూన్నది. భారతదేశంలో ఆసేతు హిమాచలం దీనికున్న ప్రభావం సాటి లేనిది. ఎన్ని గుళ్లో, ఎన్ని గోపురాలో, ఎన్ని శిల్పాలో! రామాయణ కథను స్పృశించని ఏ సాహిత్య ప్రక్రియా భారతీయ భాషలలో, దేనిలోనూ లేదు. సాహిత్య భాషలుగా అభివృద్ధి చెందని ఆ యా ప్రాంతీయ భాషలలో కూడ జానపదగీతాలలోనూ, నృత్యాలలోనూ, కథాకథనాలలోను ఇది చోటు చేసికొన్నది.

దాదాపు పది పన్నెండు వందల సంవత్సరాలకు పూర్వంనుండి సాహిత్య భాషగా వికసించిన తెలుగులో రామాయణకథా సంబంధంలేని సాహిత్య ప్రక్రియ లేదు.

ఇరవై యొకటవ శతాబ్దం ప్రథమ వర్ష పంచకంలో మల్లెమాలవారు తెలుగు వారికి అందించిన అపూర్వమూ అసాధారణమూ అయిన సాటి లేని సువర్ణోపాయనం ఈ మల్లెమాల రామాయణం. ఇలాంటి అత్యద్భుతమైన, ఆనందఘనమైన (ఆనందపు ముద్ద యైన) ఉపాయనాన్ని నికటభవిష్యత్తులో, రాబోయే నాలుగైదు శతాబ్దాల కాలంలో, ఎవరైనా తెలుగు జాతికి అందించ కలుగుతారా అనేది సందేహాస్పదం. ఇలా అన్నంత మాత్రాన సరిపోదు. ఇలాంటి సందేహం కలగడానికి కారణం ఏమిటో కూడ చెప్పవలసి ఉంటుంది. అదేదో చూద్దాం -

ఇదొక మహాకావ్యం. ఒక మహాకావ్యం వ్రాయాలంటే అందుకు తగిన సాధన సామగ్రి పుష్కలంగా ఉండాలి. దానిని తగిన రీతిలో వినియోగించు కోవాలి. అప్పుడే అది మహాకావ్యం అనిపించుకొంటుంది. ఇది రామాయణానువాదం కాదు; రామాయణాన్ని ఆధారంగా తీసికొని రచించిన ఒక స్వతంత్ర మహాకావ్యం.

ఈ మహాకావ్యం ఆవిర్భావం ఒక విశిష్టమైన రీతిలో జరిగిం దనే విషయం కవియే వినయాంజలిలో తెలిపి ఉన్నారు. రెండు కావ్యాలు కరుణ నుండే పుట్టాయి. పక్షుల శోకాన్ని చూడగా కలిగిన మానసిక వేదననుండి ఆనాటి రామాయణం ఆవిర్భవిస్తే

భారతమాత దీనావస్థ చూడగా కలిగిన మానసిక సంక్షోభం నుండి ఈ కావ్యం పుట్టింది. ఈ విధంగా "శోకత్వ మాపద్యత యస్య శోకః" అని కాళిదాసూ, ఆ మాటలే అనువదిస్తూ "శోకః శ్లోకత్వమాగతః" అని ఆనందవర్ధనుడూ (ధ్వన్యాలోకంలో) చెప్పి నట్లు రెండు చోట్లా శోకమే శ్లోకంగా మారింది.

చక్కని బుద్ధిబలం ఉంటే చాలు, శాస్త్రాలు అధ్యయనం చేయవచ్చు. సాంకేతిక విద్యలను వశం చేసికొనవచ్చు. కాని, ఉత్తమ మైన కావ్యం రచించా లంటే బుద్ధిబలంతో పాటు ప్రతిభ కూడా ఉండాలి. ప్రతిభా విహీనుడైన కవి రచించిన కావ్యం ప్రభావిహీనంగా ఉంటుంది. అలాంటిది పద్యబద్ధమైనా, మరే రూపంలో ఉన్నా కావ్యమే కాదని ఆలంకారికుల నిర్ణయం.

సహజమైన ప్రతిభ ఉన్నవాడే సహజకవి అవుతాడు. మల్లెమాలవారి ప్రతిభావిశేషం ఈ కావ్యంలో అడు గడుగునా స్పష్టంగా ప్రతిఫలిస్తూ ఉంటుంది. దీనికి తోడు విస్తృత మైన లోకజ్ఞానం, అసాధారణమైన మేధాశక్తి, అనగా ఎన్నో ప్రాచీన కావ్యాలనుంచీ ఆధునిక కావ్యాలనుంచీ వందలకొలది పద్యాలను ధరించగలిగిన ధారణాశక్తి, మానవతాదృష్టి ఇవన్నీ కూడ కలిసి ఈ సుమనోహర కావ్య రూపాన్ని ధరించాయి.

వాల్మీకి రామాయణం, మొదటినుండి చివరిదాకా, అతి మనోహరంగానూ లయాత్మకంగానూ నడుస్తుంది. మల్లెమాల రామాయణం కూడా వినగానే అర్థం అవడం అనే ప్రసాద గుణంతో, సద్యోభావానుభూతిని కలిగించే ద్రాక్షాపాకంతో, వైదర్భీ శైలిలో, మృదువైన పదాల గుంఫనంతో నడిచింది. వెదకి చూచినా ఒక్క వ్యర్థపదం కనపడదు. మచ్చున కొక్కపద్యం;

సీతారాములు గోదావరీ తీరాన కూర్చుని ఉన్నప్పుడు రాముడు సీతతో అన్నమాట లివి :

సీ. **చిగురెండ ఒడిలోన సిరిమల్లె నవ్విన**
**కనుపించు వెలుగులో కలవు నీవు**
**చిరుగాలి కెరటాలు వరివెన్ను నూపిన**
**మొలకెత్తు కులుకులో కలవు నీవు**
**నీలిమబ్బును గాంచి నెమలి నర్తించిన**
**కదలాడు హొయలులో కలవు నీవు**
**నెలవంక స్పర్శతో సెలయేరు పొంగిన**
**చెలరేగు నురుగులో కలవు నీవు**

తే. **ఇచ్చ టచ్చట అననేల నీ విశాల**
**విశ్వమందున చైతన్య విలసితమ్ము**
**లైన ప్రత్యంశమందు ప్రత్యణువునందు**
**కంటి కగుపించు కమ్మని కలవు నీవు.** (అరణ్య కాం. 233)

అలతి అలతి తెలుగు నుడులతో కవితామతల్లికి సొబగులు దిద్దగలిగిన ఈ కవి లేఖిని ప్రౌఢవాగ్గుంభనలు కూడ కలిపి ఆమెను ఎట్లు సంభావింపగలదో చూడండి...

చ. అరుణమయూఖ మాలికల నల్లన విచ్చిన కన్నె తామరల్
గరువపు వానజల్లులకు గంతులు వేయుచు నాడుబేడిసల్
మురిపెము లొల్కుచున్ భువన మోహనకాంతులు గ్రుమ్మరించు నీ
స్ఫురిత విశాల నీల నవసుందర బంధుర దివ్య నేత్రముల్.

(అరణ్య కాం. కాం. 232)

ఇలాంటి అలంకారాలు ఈ కావ్యం నిండా రత్నదీపాలలా మనకు దర్శనమిస్తాయి.

నిజానికి కావ్యానికి ఆయువుపట్టు వక్రోక్తి. దీనిలో అనేక భేదాలున్నాయి. వాటిలో ప్రధానమైన రెండు రకాల వక్రతలు ఈ మహాకావ్యంలో ప్రారంభంనుంచి చివరిదాకా కనపడతాయి - అవి ఉపచార వక్రత, ప్రకరణ వక్రత అనేవి. ఉపచార వక్రతను ప్రభావజనకంగా ఉపయోగించడంలో మల్లెమాలవారు సిద్ధహస్తులు.

అచేతనాన్ని చేతనంగాను, అమూర్తాన్ని మూర్తంగాను చిత్రించడం ఉపచార వక్రత. కొన్ని ఉదాహరణలను రుచిచూద్దాం -

ఆకారంలేని రౌద్రాన్ని సాకారమైన మహాసర్పంగా భావించి అది పరశురాముని కళ్ళల్లో నుండి బుసకొట్టుతూన్నదని వర్ణించాడు కవి (అయోధ్యాకాండ 21). అలాగే అయోధ్యాకాండం 311వ పద్యంలో దశరథుని గతాన్ని కూడా మహా సర్పంగా చిత్రిస్తూ "కాటువేయగ నున్నది గతము నన్ను" అంటాడు.

మరొక ఉదాహరణ : శ్రీరాముని దర్శనభాగ్యం కోసం యెన్నో యేండ్లుగా యెదురు చూస్తున్న శబరి...

**చాల యేండ్లనుండి చర్మచక్షువులతో**
**నిన్ను గాంచవలయునన్న ఆశ**
**పండుటాకు మేన ప్రాణాలు నిలిపెను**
**ఎపుడు కనికరింతువీవు తండ్రి .**

అని రాముని ప్రార్థిస్తూ ఉంటుంది. అదే సమయానికి లక్ష్మణ సమేతుడై అక్కడికి వచ్చిన శ్రీరాముడు భక్తిపారవశ్యంలో మునిగియున్న శబరిని చూసి అమృత తుల్యమైన వాక్కుతో శబరీ అని పిలుస్తాడు. ఆ పిలుపు శబరికి మేలుకొలుపయిందంటారు మల్లెమాల.

**ఆ పిలుపు మేలుకొలుపై**
**దాపున వేంచేసియున్న దశరథరామ**
**క్ష్మాపతిగని ఆ యోగిని**
**నాపున్నెము నడచివచ్చినదియని తలచెన్.**

పిలుపే మేలుకొలుపు. ఇదొక వక్రత. పుణ్యం నడిచివచ్చిందనడం మరొక వక్రత. ఇలాంటి చిత్రీకరణలు మరికొన్ని చవిచూడాలంటే అరణ్యకాండములోని 141, 150, 189, 203, 475 పద్యాలను తిలకించండి.

కిష్కింధకాండలో వాలి తారతో ఇలా అంటాడు.

**భీరు వన్నమాట వీరుని చెవిసోక**
**వెరచు నన్న సత్య మెరుగుమీవు!**
**అనికి జంకి నేనె వెనుకంజ వేసిన**
**గుండె పగిలి చచ్చు భండనమ్ము.**

అత్యద్భుతమైన వక్రోక్తి. ఇలాంటి సహృదయ గ్రాహ్యాలైన మధురోక్తులు ఈ మహాకావ్యంలో కోకొల్లలుగా మనకు దర్శనమిస్తాయి. లోకప్రసిద్ధమైన వాల్మీకి రామాయణంలోని ఔచిత్యానికి భంగం కలుగకుండా, మల్లెమాలవారు ఈ రామాయణంలో సహజ సుందరంగా చేసిన మార్పులు వారి అద్భుత కల్పనాశక్తికి నిలువెత్తు సంకేతాలు.

చిత్రకూటంలో ఉన్న శ్రీరాముణ్ణి తిరిగి అయోధ్యకు తోడ్కొని వెళ్ళడంకోసం భరతుడు సమస్త పరివారంతో అక్కడకు వస్తాడు. అందులో తల్లులు ముగ్గురు కూడా ఉన్నారు. వారు ధరించి ఉన్న శ్వేతవస్త్రాల ద్వారా దశరథుని మరణవార్తను రాముడికి తెలియజేస్తాడు కవి. ఆ పద్యం పరికించండి.

**శ్వేత వస్త్రాల మాటున చింతదాచి**
**తన్మయత్వములో మున్గి తన్నుజూచు**
**తల్లులను గాంచి రాముడు తండ్రి నాక**
**మునకు జనె నని దుఃఖాన మునిగిపోయె.**

అలాగే, అదే సన్నివేశంలో పుత్రవ్యామోహంతో నీకు అపచారం చేశాను. నాయనా! నన్ను మన్నించు అంటుంది కైకేయి రామునితో. అందుకు సమాధానంగా శ్రీరాముడు

**అడవులకు నన్ను బంపించినందువలన**
**తాపసుల మధ్య జీవన తత్త్వ మెరిగి**
**నడచుకొనునట్టి భాగ్యము నాకు దక్కె**
**లోక కల్యాణ ఫలితమ్ము నీకు దక్కె."**

అంటాడు. ఇలాంటి ఉదాత్త భావాలు ఋషితుల్యుడైన కవి నుండే జాలువారుతాయి.

అలాగే, సుందరకాండంలో హనుమంతుడికి అప్పుడప్పుడు అతని తోక సలహాలిస్తూ ఉంటుంది. ఇదొక చమత్కార కల్పన. అదే కాండంలో పార్వతీదేవి, బాలా రూపంలో హనుమంతునికి కర్తవ్యబోధ చేసి ఉత్సాహవర్ధకమైన మాటలు చెపుతుంది. (సుం.కాం. 64-75).

సీతారామలక్ష్మణులు పంచవటిలో ఉన్నప్పుడు ఒక ఎలుగుబంటి పనసపండు తీసికొనివచ్చి ఉపాయనంగా ఇచ్చి వారిపట్ల పరమభక్తిని ప్రదర్శిస్తుంది. (అరణ్య.కాం. 183-189). అక్కడే మరొక ఘట్టంలో..

ఒక ఆవు అప్పుడే పుట్టిన దూడతో కూడ వచ్చి సీతారాములకు సేవచేస్తూ అక్కడే ఉండిపోతుంది. ఆవును, దూడను వెతుక్కుంటూ వచ్చిన గొల్ల ఆ తల్లి,

బిడ్డను శ్రీరాముని సన్నిధిలో చూసి మురిసిపోతాడు. ఇది అత్యంత సుందరమైన ఘట్టం.

ఈ ఘట్టంలో కవి, పల్లె జీవితం మీద తనకున్న అభిమానాన్ని, గొల్లవాని నిష్కపటమైన హృదయాన్ని, వానిపై సీతారాములు చూపిన అవ్యాజమైన అనురాగాన్ని అత్యద్భుతంగా చిత్రించి మనం కోల్పోయిన మానవతానుబంధాలను పునరుద్ధరించు కోవలసిన అవసరాన్ని సూచించాడు. ఇవన్నీ విశిష్టమైన కల్పనలు.

మారీచుడు మాయలేడిగా మారి సీతాపహరణానికి తోడ్పడ్డాడన్న బాధతో అరణ్యంలోని జింకలన్నీ సీతామాతను అపహరించిన దుర్మార్గుడు ఈ దిక్కుగా వెళ్ళాడని శ్రీరామునకు సూచిస్తూ, ఆ అన్నదమ్ములిద్దరినీ తమ వెంట తీసుకొనిపోయి, జటాయువు కొన ఊపిరితో పడి ఉన్న చోటు చూపిస్తాయి. జటాయువు సీతను రావణుడు అపహరించి తీసుకువెళ్ళాడని చెప్పి ప్రాణం వదులుతాడు. ఆయాచితంగా జింకలందించిన సహాయానికి ముగ్ధుడైన శ్రీరాముడు తానూ అయాచితంగానే వాటికొక వరమిస్తాడు. ఆ వరం పద్యరూపంలో ఇలా సాగుతుంది -

"అడవి తల్లి కిలను ఆయువుండెడుదాక
ఉదధులందు నీరముండు దాక
మేను వీడి గూడ మీ దివ్య చర్మముల్
యతుల కాసనమ్ము లగును గాక!" ఎంత అందమైన ఊహ.

ఇహ వర్ణనలు - ఏ వస్తువైనా, ఏ సంఘటననైనా కళ్ళకు కట్టినట్లు వర్ణించడం మల్లెమాల వారిలో ఉన్న ఒకానొక అనితర సాధ్యమైన సహజ చాతుర్యం. అలాంటి వర్ణనలు ఈ మహాకావ్యంలో అడుగడుగునా దర్శనమిస్తాయి. ఆ వర్ణనలను చదువుతున్నంత సేపూ, పఠిత ఈ ప్రపంచాన్ని పూర్తిగా మరచి, అలౌకికమైన ఆనందాన్ని పొందుతాడు. ఆ రసానుభూతికి తార్కాణంగా ఒకటి రెండు ఉదాహరణలైనా చవిచూపించకపోతే ఈ కావ్యానికది అసంపూర్ణ పరిచయమే అవుతుంది.

అత్రిమహాముని ఆశ్రమంలో సీతారాములు ప్రవేశిస్తారు. అనసూయ సీతను లోనికి తీసికొనివెళ్ళి ఆమెను ఆదరించి, నీ కల్యాణ వృత్తాంతం చెప్పమని కోరుతుంది. అంతే! మైథిలి ఊహలు మిథిలలోని కల్యాణమండపానికి వెళ్ళిపొయ్యాయి. ఆ తన్మయత్వంలో శ్రీరాముడు శివధనుర్భంగము గావించిన ఘట్టాన్ని సీత అనసూయతో ఇలా వివరిస్తుంది. ధనుర్భంగ దృశ్యాన్ని సీత చూడలేదు. చెలికత్తె ద్వారా తెలుసుకొని పులకించి పోతుంది. ఇంతకూ చెలికత్తె సీతతో ఏమి చెప్పింది. ఇదిగో..., ఇలా చెప్పింది...

సీ. జనకు డచ్చెరువంద ధనువు ఛేదించిన
రాకుమారుని పేరు రాము డనుచు
అతని నేత్రద్వయ మ్మప్పడే విరిసిన
రమ్యరాజీవ పత్రమ్ము లనుచు
ఆతని ముద్దుమో మన్ని వేళలయందు
వెలుగు లీనెడు చంద్రబింబ మనుచు

అతని వక్షః స్థల మ్మతిలోక సౌందర్య
మునకు కాణాచియై దనరు ననుచు

ఆ. ఆచితూచి యాత డాడెడు మాటలు
కండచక్కెరంత కమ్మ ననుచు
చెప్పి చెప్పి నన్ను చెలికత్తె మధురోహ
లందు దేలియాడు నటు లొనర్చె.

ఆ ఊహలేమిటో చూద్దాం...

సీ. పున్నమ జాబిల్లి పుడమికి దిగివచ్చి
పులకింత లెదపైన చిలికినట్లు
శక్రకోదండము సారెసారెకు వంగి
చెవిలోన గుసగుసల్ చెప్పినట్లు
తెలిమబ్బు కన్నియల్ తేరులో అరుదెంచి
తుంపురుల్ నిలువెల్ల తురిమినట్లు
మండువేసవిలోన మంచి గంధపు వాన
కుండపోతగ పైన కురిసినట్లు

తే. మానసమునందు అవ్యక్తమధురమైన
ప్రణయ భావతరంగముల్ పర్వు లెత్తె
ఆగలేనని వరమాల వేగిరముగ
రామభద్రుని కంఠ మలంకరించె.

తన్మయత్వంతో తాను అతిగా మాట్లాడినానేమో అన్న శంక సీతకు కలిగింది. అందుకు అనసూయను మన్నింపు కోరింది. అలా చెప్పినందుకు అనసూయ సీతను అభినందించి నా ముసలిమనసుకు మధువు బూసినావమ్మా అనింది... ఎంత సున్నితమైన భావాన్నయినా చిన్న చిన్న మాటలతో ఇంత మనోహరంగా ఆవిష్కరించడం మల్లెమాలకు తప్ప మరొకరికి సాధ్యం కాదని నా అభిప్రాయం. హేమంత ఋతు వర్ణనం అడుగడుగునా వక్రోక్తులతో ఎంత అద్భుతంగా సాగిందో గమనించండి...

సీ. మధ్యాహ్న సూర్యుడు మబ్బులు నేసిన
దుప్పటి నొంటిపై గప్పకొనియె!
అగ్నిదేవుడు తన్ను ఆవహించిన చలిన్
ముదమార గుండెల కదుముకొనియె!
చెంగు చెంగున గెంతు జింకలు పొదరిండ్ల
దూరి పూదుస్తులు దొడుగుకొనియె
కొదమ సింగమ్ములు గుహల కౌగిళులందు
మదన తాపమ్ముతో ఒదిగిపోయె!

తే. పచ్చపచ్చని పచ్చిక బయళులన్ని
మంచు మైదానముల రీతి మారిపోయి
పడుచుగాలులు పొరలాడు పాన్పులాయె!
అతులితమ్మౌర? హేమంత ఋతువు మహిమ.

రావణాసుర వర్ణనం...

మ. అది లంకేశుని కొల్వుకూట మడుగో! అగ్రాసనాసీనుడై
గదపై దక్షిణ హస్తముంచి సురలున్, గంధర్వులున్, కిన్నరుల్
బెదరన్ తమ్ములు, మంత్రులున్, బుధవరుల్ వేష్టింప ముక్కంటియే
సదనమ్మందున నిల్చి చర్చలను తా సాగించున ట్లొప్పెడిన్.

సీ. కను లెర్రజేసెనా? కాలచక్ర మ్మాగి
తలవంచి జోహారు సలిపి తీరు!
గదను పైకెత్తెనా? గడగడ వణకుచు
మరణదేవత జంకి శరణు గోరు
పంచాక్షరీ మంత్ర పఠనమ్ము జేసెనా?
కైలాస శిఖరమే కదలియాడు
సకల శాస్త్ర పురాణ చర్చసాగించెనా?
వేదముల్ చెవియొగ్గి విన దొడంగు

తే. ఇన్ని యోగ్యత లర్హత లున్న వీరు
డెవ్వ డీరేడులోకాల నెరుగ జెప్ప
మనుచు నే రాయి నడిగిన ఆ క్షణమ్మె
అసుర విభుడైన రావణుం డని వచించు.

వర్షఋతు వర్ణన...

సీ. ఉత్తుంగ శిఖరాలనుండి జారెడు జల
ధారలు ముత్యాల దండలాయె!
నిండార పండిన నేరేడు పండులు
కదలికల్లేని భృంగమ్ము లాయె!
జలభారమున గిరి తలలపై వాలిన
కరి మబ్బు లున్మత్త గజములాయె!
గొంతెండి పోయిన గురుసైకతమ్ములు
పొంగిన చన్నీటి బుగ్గలాయె!

తే. మెల్లమెల్లగ సాగెడు పిల్లకాల్వ
లెల్ల హోరెత్తి పరువెత్తు యేరులాయె!
రాత్రి పవలును మొగలి సౌరభము గ్రోలి
వర్షఋతువంత పరిమళ భరిత మాయె. (కి.కాం.133)

అలాంటి వర్షఋతువులో వియోగీ, యోగీ అయిన రామసుగ్రీవులు ఎలా ఉన్నారో పరికించండి -

సీ. భార్యా వియోగపు బాధతో రాముడు
గడియనే దినముగా గడపె నచట!
కలికిపర్యంకమే గద్దెగా కపిరాజు
ఋతువొక్క గడియగా బ్రతికె నచట
నిద్రకన్నెరుగక నిరతమ్ము రాముడు
కాంత దిగులుతోనె గడపె నచట!
నిద్రలో సైతమా భద్ర వానరనేత
కమ్మని కలలతో గడపె నచట!

ఆ. గతము మరువలేక మతిలేని వాడుగా
పుడమివల్లభుండు గడపెనచట
గతము విస్మరించి కనుపించునదె స్వర్గ
మనుచు గడపె భాను తనయు డచట. (కి.కాం.135)

ఆ. అవనిలోన గలుగు ఆనంద మంతయు
సూర్యనందనునకు సొంతమాయె!
ముందుచూపులేక ముల్లోకముల గల
శోకమంత రాము సొంత మాయె. (కి.కాం.136)

సుందరకాండ మొత్తం పద్యరత్నాల ఖని. హనుమంతుని వర్ణనం, లంకా నగర వర్ణనం, రావణ వర్ణనం, పుష్పకవర్ణనం, పానశాలా వర్ణనం, హనుమంతుడు రావణుని ఎదుట చేసిన శ్రీరామ వర్ణనం... ఒకటేమిటి? ప్రతి వర్ణనా పరిమళభరితం.

ఈ మహాకావ్యమంతా పద్యాలలోనే నడిచింది. చివరికి "అంతనా తాపసోత్తముండిట్లనియె" వంటి సంధాయక వాక్యాలు కూడా లేవు. ఈ విషయంలో మల్లెమాల రామాయణం మూలగ్రంథంతో పోటీపడుతుంది. ఒక్క వ్యర్థపదం కూడా లేకుండా పద్యకావ్యాన్ని నడిపించడం ఎంత క్లిష్టమైన విషయమో పద్య కవితా విశారదులకు మాత్రమే సుబోధం.

మల్లెమాల వారు ఈ కావ్యంలో కొన్నిచోట్ల సందర్భానుసారంగా ద్విపదలు, మంజరీ ద్విపదలు, గీతమాలికలువాడి కథా కథనానికి క్రొత్త సొబగులు దిద్దినారు. చాలాచోట్ల కవి ఉపయోగించిన పాత్రానుగుణమైన భాష ఈ మహాకావ్యానికి వన్నె చేకూర్చింది. అవన్నీ ఉదహరించడం కంటె పఠితలా రసానందాన్ని స్వయంగా ఆస్వాదించడమే ఉచితంగా ఉంటుంది.

రామాయణంలో ప్రధాన రసం కరుణరసం అనీ, మహాభారతంలో శాంతరసం అనీ సిద్ధాంతీకరించాడు ఆనందవర్ధనుడు. అంటే ఈ కావ్యాలలో ఇతర రసాలుండవని కాదు. అవీ ఉంటాయి. మల్లెమాల రామాయణం రసభావాదుల పుట్ట. ఎక్కడ తడిమినా

ఏవేవో భావాలూ, రసాలూ చిప్పిలుతూనే ఉంటాయి. భవిష్యత్తులో ఎందరో ధీమంతులు, తమ పి.హెచ్.డి.ల కోసం మల్లెమాల రామాయణాన్ని విస్తృతంగా పరిశీలన జరుపుతారనడంలో నాకెలాంటి సందేహం లేదు. పి.హెచ్.డి. పరిశీలనకు అర్హమైన ఘట్టాలు కావ్యంలో అనేకం ఉన్నాయి.

అరణ్యకాండంలో సీతారామ వనవిహార ఘట్టంలో శృంగారరసం ఆస్వాద యోగ్యంగా జాలువారింది.

దశరథునికీ, కైకకూ మధ్య జరిగిన సంభాషణ, రాముని అరణ్య గమన సందర్భంలో కౌసల్యాదుల శోకం, సీతారాముల విరహం, ఇవన్నీ కరుణరసానికి అద్దం పడుతాయి. శూర్పణఖా వృత్తాంతాదులు హాస్యరసస్ఫోరకాలు. మున్యాశ్రమాది వర్ణనలు శాంతరసోద్దీపకాలు. పుష్పక, లంకాదుల వర్ణనలు అద్భుత రసానికి ఆలవాలాలు. ఇహయుద్ధకాండ మొత్తం రౌద్ర,వీర, భయానక, బీభత్స రసాలను అత్యద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

**సామాజిక స్పృహ** : ఇది ఈనాడు ఎక్కు ప్రచారంలో ఉన్నపదం. పదం క్రొత్తగా కనబడినా దీని అర్థం అతి ప్రాచీనమైనది. ఈ మహాకావ్యం సమాజశ్రేయస్సు అనే భావంలోనే ఆవిర్భవించింది. రెండు మూడు ఘట్టాలలో కవి స్పష్టంగా సమాజంలో సుఖశాంతులను నెలకొల్పడానికి అవసరమైన పద్ధతులు సూచించాడు.

1. శ్రీరామునికి యౌవరాజ్యపట్టాభిషేకం చెయ్యాలని నిశ్చయించిన దశరథుడు ఆతనికి రాజధర్మాలను ఉపదేశిస్తాడు. ఇది అతి సంక్షిప్తంగా ఒక్క సీసపద్యంలో నడిచింది.. నడిచింది..

సీ. ప్రభువు ముఖ్యమ్ముగా ప్రజల సంక్షేమమే
కలలోన సైతము దలపవలయు
కామక్రోధాదుల నేమాత్రమును జాలి
దలపక ఛీకొట్టి తరుమవలయు
సచివులతో సదా సంప్రదింపు లొనర్చి
వారితోడ్పాటును బడయ వలయు
సర్వకాలముల కోశాగారముల నెల్ల
నొక్కింత తరుగక నుంచవలయు

తే. అన్నిటిని మించి దండనాయకులతోడ
సఖ్యముగనుండి యిసుమంత శత్రుభయము
లేని విధమున జనుల బాలింపవలయు
నని హితవు దెల్పె పుత్రున కవనివిభుడు. (అయో.కాం. 28)

2. రాముడు భరతునకు రాజధర్మాలు ఉపదేశించిన ఘట్టం రెండవది. ఈ సందర్భంలో కవి మూల రామాయణంలో ఉన్నదానికి చిన్న మార్పు చేశాడు. ఈ మార్పు చాల ఉచితజ్ఞతతో చేసిన మార్పు.

రాముని మాట కాదనలేక భరతుడు అయోధ్యకు తిరిగి వెళ్లి రాముని పక్షాన రాజ్యపాలనం చేయడానికి అంగీకరించి రాజ్యపాలనకు సంబంధించిన విషయాలేవైన ఉపదేశించమని అన్నగారిని కోరుతాడు. అప్పుడు రాముడు రాజధర్మాలు బోధిస్తాడు. ఇది విస్తృతంగా 14 పద్యాలలో (అయో.కాం. 503-516) జరిగింది. ఇక్కడ రాముని ద్వారా కవి కళాసంస్కృతుల పోషణ ప్రభువు కర్తవ్యం అని బోధించడం వాటిపై ఆయనకు గల మక్కువను సూచిస్తున్నది.

విభీషణుడు రావణునకు ఉపదేశించడం వంటి అనేక ఘట్టాలలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ లోకక్షేమాన్ని గూర్చిన ఎన్నో విషయాలు ఈ కావ్యంలో మనకు గోచరిస్తాయి.

అటు పండితులకు ఇటు పామరులకూ అర్థం అయి ఆనంద జనకంగా ఉండే రామాయణం ఈనాడు తెలుగులో ఉన్నదా అంటే సందేహమే. ఆ కొరతను తీర్చినదీ మల్లెమాల రామాయణం. అందరికీ అర్థమయ్యే అతి సరళమైన భాషతో, అద్భుతమైన కల్పనా విశేషాలతో, ఆనంద డోలికలలో ఊగులాడించే ఈ రామాయణం అందించినందుకు ఉత్తమ సాహిత్య ప్రియులైన ఆంధ్రులందరూ శ్రీ మల్లెమాలకు కృతజ్ఞతాబద్ధులై ఉంటారు.

తాము రచింప తలపెట్టిన మాతృసందేశంలో భాగంగా శ్రీ మల్లెమాల రచించిన రామవనగమన వృత్తాంతాన్ని విన్న వెంటనే ఇదే శైలిలో రామాయణం అంతా వ్రాస్తే ఆంధ్రలోకానికి మహోపకారం చేసిన వారవుతారని నేను అన్నప్పుడు దానికి అంగీకరించి శ్రీ మల్లెమాల ఇంతటి చక్కని మహాకావ్యాన్ని ఆంధ్రులకందించడం అందరికంటె కూడ నాకు మహానందదాయకంగా ఉంది. నేను వెలిపుచ్చిన కోరికకు భరతమాత ఆదేశం మరింతబలం చేకూర్చింది. ఇది ఇంకా ప్రమోదావహం.

కొన్ని దశాబ్దాలుగా మాధుర్యాన్ని పంచిపెట్టడమే తమ జీవిత పరమధ్యేయంగా పెట్టుకున్న శ్రీ జి.పుల్లారెడ్డిగారు వారి సతీమణి శ్రీమతి నారాయణమ్మగారూ దాదాపు 25 విద్యా సంస్థల ద్వారా వేలాది యువతీయువకులకు జ్ఞానామృతాన్ని పంచుతున్నారు. ఆ ఆదర్శ దంపతులు కావ్యరసామృతాన్ని కూడ ఆంధ్రులందరికీ అందజేయడానికి స్వయంగా ముందుకు రావడం వారి సత్కార్యాచరణ దీక్షకు తార్కాణం.

రామరాజ్యకాలంలో రాముని సర్వలోక ప్రియత్వాన్ని గూర్చి వర్ణిస్తూ వాల్మీకి మహాముని -

"యశ్చరామం న పశ్యేత్తు యంచ రామోనపశ్యతి
నిన్దితః సపుమాన్‌లోకే స్వాత్మాప్యేనం విగర్హతే"

అని అంటాడు. "రాముని దర్శనం ఎవడు చేసికొనలేకపోయాడో, ఎవనిమీద రాముని చూపులు ప్రసరించలేదో అతణ్ణి లోకులందరూ 'అయ్యో! పాపం! దురదృష్టవంతుడు!' అని నిందించే వారట! వాని అంతరాత్మయే వానిని నిందించేదట" అని భావం. అదే **ధోరణిలో...**

"న పిబేద్యో మల్లెమాల రామాయణరసామృతమ్,
వఞ్చితం తం వదేల్లోకః మనుతే స్వం స వఞ్చితమ్"

"మల్లెమాల రామాయణంలోని రసామృతాన్ని ఆస్వాదించనివానిని చూచి లోకులు 'అయ్యో!పాపం!' అనుకుంటారు. తానేదో కోల్పోయినట్లు అతడే బాధపడతాడు" అని అనవచ్చు.

మంచుకొండ ఠీవి, మరుమల్లియల తావి తగ్గనంతకాలం మల్లెమాల రామాయణంలోని ప్రతిపద్యం ప్రజల హృదయంలో గుబాళిస్తూనే ఉంటుంది. ఇది సత్యం.

శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు

హైదరాబాదు
22-12-2005

# వినయాంజలి

**ఈ రామాయణ కావ్యము**
**నే రచియించితిని అనుట నేరము, నాచే**
**శ్రీరాముడు వ్రాయించెను**
**కారుణ్యామృతము జిలికి కమనీయముగా॥**

శ్రీరాముడు...

అసంఖ్యాక ప్రజానీకానికి ఆరాధ్య దైవం.

అందులో నేనూ ఒకణ్ణి.

అతి చిన్న వయసులో నన్ను చుట్టుముట్టిన ఆపదలే నా మనసునా ఆపద్బాంధవుడి వైపు మళ్ళించాయి. ముఖ్యంగా నా అనారోగ్యం.

ఆరోగ్యానికి మించిన ధనము, ఆత్మ విశ్వాసానికి మించిన బలము లేదని కదా సత్యసూక్తి.

కడగండ్లు నాపై కసిగా కాలు దువ్వినప్పుడూ, ఆరోగ్యం అస్తవ్యస్తమైనప్పుడూ, ఆ దయామయుని అభయహస్తమే నన్నాదుకొనింది -

ఆ పురుషోత్తముడికి పూజా కుసుమంగా శ్రీమద్రామాయణాన్ని వేలాది మంది బాలబాలికలతో చలన చిత్రంగా రూపొందించాను. ఆ చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ బహుమతి నందుకోవడం నా జీవితంలో ఒక తీయని అనుభూతి.

అంతటితో నా బాధ్యత తీరిపోలేదనుకుంటాను. గత సంవత్సరం యాభైయేడవ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా "భారతమాత" నా స్మృతిపథంలో ప్రత్యక్షమై మహాత్మాగాంధి కలలుగన్న రామరాజ్య నిర్మాణం కలగానే మిగిలిపోయిందని విచారం వ్యక్తం చేసి మానవాభ్యుదయానికి మార్గదర్శకమైన "రామాయణగాథ"ను పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో కావ్యంగా వ్రాయమని నన్నాదేశించింది. అది... నా తలకు మించిన భారం -

అయినా...

అన్నిటికీ రాముడున్నాడనే విశ్వాసంతో ఆ మహామాత ఆదేశానికి తలవంచాను.

విశ్వసాహిత్యంలో...

పరిపూర్ణమైన మానవధర్మాన్ని ప్రతి హృదయంలో ఆవిష్కరించే మహాకావ్యం శ్రీమద్రామాయణం...

ఆదికవి వాల్మీకి ఆధ్యాత్మిక వరంగా మనకందించిన రామాయణాన్ని ఎందరో మహాకవులు వివిధ భాషల్లో రచియించి జన్మ చరితార్థం చేసుకున్నారు. తెలుగులో కూడా అనేకమంది పండిత కవులు రామకథను అమృతోపమానంగా అక్షరబద్ధం చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు.

ఆ పరంపరలో నేనూ ఒకడుగా రామాయణ రచనకు శ్రీకారం చుట్టి తపోదీక్షతో సంవత్సరకాలంలో పూర్తి చేశాను.

ఇప్పుడు నా వయసు 82 సంవత్సరాలు. ఈ వయసులో నేను రామాయణం వ్రాయడమేమిటి?

ఈ కావ్యానికి నేను లేఖకుణ్ణి మాత్రమే. రసావిష్కరణమంతా రాముడిదే.

ముఖ్యంగా ఇక్కడొక మాట చెప్పాలి. నేనీ కావ్యరచన ఆరంభించిన నాటినుండి ఏరోజుకారోజు. అమూల్యమైన సలహాలతో, అవ్యాజమైన ప్రేమానురాగాలతో నన్ను ప్రోత్సహించిన మాన్యులు, మహామహోపాధ్యాయ 'శ్రీపుల్లెల శ్రీరామచంద్రుడు'. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమోవాకములర్పించుకుంటున్నాను.

అలాగే... ఇందులోని ప్రతి పద్యాన్ని తులనాత్మకంగా పరిశీలించి శుద్ధప్రతిని రూపొందించిన విద్వత్కవి శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులుగారికి నా ధన్యవాదాలు.

నా కవిత్వానికి మొట్టమొదటి సమీక్షకుడూ, విశ్లేషకుడూ, రెండూ తానే అయిన నా ఆత్మీయమిత్రుడు, కలలో కూడ నా శ్రేయస్సును ఆకాంక్షించే ఆప్తబంధువు, ప్రముఖ విద్యావేత్త, కవికిరీటి డా॥ ఉండేల మాల కొండారెడ్డి గారికి నేను ఆజన్మాంతం కృతజ్ఞుణ్ణి.

ముఖ చిత్రముద్రణకు ప్రతిఫలం ఆశించకుండా ఉచితంగా చేసియిచ్చిన మాన్యమిత్రులు శ్రీ పరుచూరి హనుమంతరావు (ప్రగతి ఆర్ట్ ప్రింటర్సు) గారి ఔదార్యాన్ని మనసారా అభినందిస్తున్నాను.

చివరగా ఒక్క మాట

మల్లెమాల రామాయణం చేతికివ్వగానే ప్రతి వారు ముందుగా ముఖచిత్రాన్ని కళ్ల కద్దుకుంటున్నారు. అందుకు తెలుగు సంస్కృతీవికాసమేశ్వాసగా, తెలుగు భాషాభ్యుదయమేధ్యాసగా జీవించే నా ఆత్మీయ మిత్రుడు శ్రీ ఎం. ఎ. సుభాన్ శ్రద్ధాసక్తులే కారణం.. ఆయనకు నా ప్రత్యేక శుభాభినందనలు.

ఏ కావ్యానికైనా న్యాయనిర్ణేతలు రసగ్రహణ పారీణులైన పాఠకులు కదా! ఆదరిస్తారని ఆశిస్తూ...

కవి పరమాణువు

మల్లెమాల

'మల్లెమాల'

# రామాయణం

## విషయసూచిక


1. మాతృసందేశం ---------------------------------------- 3

2. కైమోడ్పు ---------------------------------------- 11

3. బాలకాండము ---------------------------------------- 12

4. అయోధ్యాకాండము ---------------------------------------- 61

5. అరణ్యకాండము ---------------------------------------- 144

6. కిష్కింధాకాండము ---------------------------------------- 227

7. సుందరకాండము ---------------------------------------- 261

8. యుద్ధకాండము ---------------------------------------- 331

# మాతృ సందేశం

తే. వేల సంవత్సరాలుగా విశ్వమందు
వేదభూమిగ ఎనలేని పేరుగాంచి
భిన్న సంస్కృతులకు గొప్పవేదియగుచు
వరలుచున్నది సువిశాల భరతభూమి. 1

తే. హిందువులు ముస్లిములు సిక్కు లందరొక్క
తీవపూవులవలె మతాతీతమైన
భావ మూపిరిగా భాయి భాయి యనుచు
కలసి జీవించుచుండి రీగడ్డమీద. 2

తే కాలమునుబట్టి అన్ని మతాలవారు
వేరువేరుగ పండుగల్ వారి వారి
సంస్కృతిని గుర్తు జేయుచు జరుపుకొనుట
ఆనవాయితిగా నున్నదాదినుండి. 3

తే. కాని ప్రజలంద రొకటిగా కలసి మెలసి
అనుపమానంద సంభరితాత్ములౌచు
జయపతాకను చేబూని జరుపుకొనిన
పండుగాగస్టు పదునైదు ప్రథమముగను. 4

శా. ఆనా డంబరమంటు సంబరముతో ఆబాలవృద్ధమ్ము, తా
మేనాడున్ తలపోయనట్టి పగిదిన్ ఎంతో వినూత్నమ్ముగా
నానారీతుల వేడుకల్ జరుపుకొన్నారా వినోదమ్ములో
నేనున్ పాల్గొని ఆడిపాడితిని నా నేత్రాలు విప్పారగన్. 5

తే. మంచుమలనుండి కన్యాకుమారి వరకు
నాడు జరిగిన ఆనందనర్తనమ్ము
గడియగడియకు కన్నుల గట్టినట్లు
నిత్య మగుపించు నా మనోనేత్రమునకు. 6

ఆ. సకల జనులు దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్స
వములు జరుపుకొనిన వైన మరసి
నేను గతమునంత నెమరు వేసికొనుచు
**మేలి ఊహలందు దేలిపోతి.** 7

క. అప్పుడు నా స్మృతి పథమున
చప్పున గనుపించె నొక్క సాధ్వీమణి, ఆ
ఒప్పులకుప్ప మొగమ్మున
గప్పిన శోకమును గాంచి కలవరపడితిన్. 8

తే. అంతలో తేరుకొని నాలుగైదుసార్లు
తరచి చూచితి నా మది దగ్ధమాయె!
ఆమె వేరెవ్వరోగాదు అక్షరాల
పరమసౌభాగ్య సముపేత! భరతమాత! 9

క. చింతయె రూపము గొనినటు
చెంతన్ ప్రత్యక్షమైన స్త్రీరత్నముతో
గొంతుక తడబడి వణకగ
ఎంతయు తర్కించి చివర కేనిట్లంటిన్. 10

శా. అమ్మా! భారతమాత! ఏమిటిది? ఈ ఆగష్టు పర్వమ్మునన్
నెమ్మోమెందుకు కందిపోయినది? కన్నీరేటికో చెప్పు మో
యమ్మా! చెప్పక యున్న నాకెటుల నీ ఆంతర్య మర్థమ్మగున్
చెమ్మంగిల్లిన కన్నులం గనిన నా చిత్తమ్ము క్షోభించెడిన్. 11

తే. అనుచు భారతజనయిత్రి నడిగినాడ!
ఆమె నావంక తమిదీరునటుల జూచి
కారణము నీకు తెలియదా కవికుమార?
అయిన తెల్పెద వినుము నా ఆత్మ ఘోష. 12

తే. ఏగె నేబది యేడేండ్లు ఎఱ్ఱకోట
కొమ్ముపై జాతిబావుటా కొలువుదీరి;
కాని ఫలమేమి? నేటికీ కష్టజీవి
బ్రతుకు మిగిలెను మిగుల దుర్భరముగానె. 13

క పసితనమున పసివాడెడు
కసిగందుల దలచు కొనిన కనులు చెమర్చున్
కుసుమముల నలిపివేసిన
ప్రసవించునె? భూరుహములు ఫలసంతతులన్. 14

సీ. ఆస్తి పంపకమున కంగీకరింపని
సోదరు హతమార్చ జూచు నొకడు
ఆలి చెప్పడు మాట లాలించి క్రుద్ధుడై
అమ్మను దుర్భాషలాడు నొకడు

ధనము కోసము కన్నతండ్రిని సైతము
శత్రుభావమ్మున చంపు నొకడు
త్రాగుడు మాన్పింప దలచిన భార్యను
ఇంటిగుమ్మముదాట గెంటు నొకడు
తే. మేని సొగసుల ప్రియురాలిమెప్పకొరకు
అగ్నిసాక్షిగ కోరి పెండ్లాడినట్టి
భార్యనే వల్లకాటికి బంపు నొకడు
అంత మెపుడిట్టి ఘోరదురంతములకు 15

సీ. అవినీతినే నిత్య మాహారముగ మెక్కి
మదమెక్కి దున్నలై మసలువారు
స్వార్థమే సకలార్థ సాధనమ్మని యెంచి
చెలగి దుష్కృత్యముల్ సేయువారు
చట్టాలకనులకు పట్టుగంతలు కట్టి
పగలె దోపిడికి పాల్పడెడు వారు
దుడ్డు కమ్ముడుపోయి గొడ్డళ్లతో తలల్
నరికి నిర్భీతిగా తిరుగువారు
తే. కుటిల తంత్రాలతో వోట్లు కొల్లగొట్టి
అడ్డదారుల గద్దెల నాక్రమించి
నీతి సూత్రాలు వల్లించు నేతల గని
కడుపు రగులుచునున్నది కవికుమార! 16

సీ. పుట్టి పుట్టకముందె పొట్ట కూటికి బిడ్డ
నంగడిలో బెట్టి అమ్ము తల్లి
ఎండిపోయిన రొమ్ము నేడ్చెడు పసికూన
కందించి మదిలోన కుందుతల్లి
తలదాచుకొన నింత నెలవుకు నోచక
వీథిప్రక్కనె ప్రసవించు తల్లి
ఎంగిలాకుల మీది కెగబ్రాకు బిడ్డను
వారించి గొల్లున వగచు తల్లి
తే. ఎన్నో నోములు నోచి నే కన్న బిడ్డ
నెటుల బ్రతికించు కొందునం చేడ్చు తల్లి
మోములందున పొగవోలె ముసురుకొనిన
బాధ కర్థము నుడువంగ బ్రహ్మ తరమె? 17

తే. ప్రతిదినమ్మును ఆకలిబాధతోడ
క్రుంగి కృశియించి సహనమ్ము గోలుపోయి
కోరిచావును వరియించు వారు నేడు
అగణితమ్ముగ కన్పింతు రన్నిదెసల. 18

సీ. అన్నదాతలు రైతు లనుదిన మ్మాకలి
బాధతో మ్రగ్గుట పరువు చేటు!
పట్టుబట్టలు నేయు పనివారికే కట్టు
బట్టలు కరవౌట పరువుచేటు!
ఉస్సు రుస్సు రటంచు యువత నిరుద్యోగ
పర్వాన గుములుట పరువుచేటు!
కులమత ద్వేషాలు కొరవి దయ్యములట్లు
ప్రజల పీడించుట పరువు చేటు!

తే. కలికమునకైన గాంధిజీ కలలు గనిన
గ్రామస్వారాజ్యమే ఒక్క గ్రామమందు
కాగడాబట్టి వెదకిన కానరాదు
భరతజాతికి ఇది యెంత పరువుచేటు. 19

తే. నాడు నాబిడ్డ బాపుజీ నాయకత్వ
మందు జగమంత చకితమౌనటుల సాగి
నట్టి స్వాతంత్ర్య సంగ్రామ మాత్మలోన
దలచుకొనినంత యొడలెల్ల పులకరించు. 20

ఆ. ఊతకర్ర దప్ప చేత ఆయుధమేది
పట్టనంచు గాంధి ప్రతిన బూని
సమరశంఖమూద సకల ప్రపంచము
విస్మయమున నోరు వెళ్ళ బెట్టె. 21

సీ. అనుపమానమ్మైన ఆయుధ సంపత్తి
అంచన కందని అర్థబలము
యుక్తియుక్తమ్మైన యుద్ధ నైపుణ్యము
అవధులులేనట్టి అంగబలము
రవి అస్తమించని రాజ్యాధిపత్యము
అరివర్గమును గూల్చు అనుభవమ్ము.
సహజసిద్ధమ్మైన శాస్త్రవిజ్ఞానము
జగ మెరింగిన గూఢచారి గణము

తే. కలిగియున్నట్టి దొరలతో కదనమునకు
కాలుద్రవ్వెను అర్ధదిగంబరుండు
ఎంత సాహస మిదియని యెల్ల జగతి
కోటి గొంతులతో గుసగుసలు వోయె. 22

తే. అయిన కర్తవ్యదీక్షకు అంకితమయి
తాను ముందుండి సర్వసేనానియౌచు
ఉర్వి కంపింప సత్యాగ్రహోద్యమమును
నడపి విజయము సాధించినాడు గాంధి. 23

ఉ పొండిక దేశమున్ వదలి బుద్ధిగ వచ్చినదారివెంట, మీ
మొండి ఫిరంగి దాడు లిక ముందుకు దూకు జనప్రవాహమున్
చెండగ లేవు; మా బల మజేయ మటంచు మహాత్మగాంధి, తా
లండను దద్దరిల్లునటులన్ నినదించె దృఢస్వరమ్మునన్. 24

క. ఆ గర్జన వినినంతనె
లాగులు తడియాయె తెల్లప్రభువులకెల్లన్
జాగొనరించిన కలిగెడు
బాగోగుల తరచి చూచి పన్నిరి కుట్రన్. 25

క. రెట్టించిన సైన్యముతో
ముట్టడి యొనరించి ప్రజల మూర్ఖత్వమునన్
గొట్టించిరి నాయకులను
బెట్టించిరి జైళ్లలోన భీతి దలిర్పన్. 26

సీ. ఎందరో మహనీయు లేండ్ల పర్యంతము
మౌనమ్ముగా జైళ్ల మ్రగ్గినారు!
ఎందరో మహిళలు - ఇళ్ళు వాకిళ్లను
విడిచి భర్తలవెంట నడచినారు!
ఎందరో రచయిత లేకోన్ముఖమ్ముగా
దేశభక్తిని ప్రబోధించినారు!
ఎందరో విద్యార్థు లెగసి ఉద్యమమందు
దూకి దిక్కుల కెగబ్రాకినారు!

తే. ఒక్కరేమిటి? బహువిధోద్యోగి గణము
లన్ని వృత్తుల పనివార లడుగు కలిపి
కదనుద్రొక్కుచు సాగిన ఘటన నరసి
తెల్లదొరలకు గుండెలు ఝల్లు మనియె. 27

తే. దిక్కుదోచని దొరతన మొక్కసారి
ముందు వెనుకలు యోచించి మొండిపట్టు
కడకు సడలించి విధిలేక గాంధితోడ
ముమ్మరమ్ముగ రాయబారమ్ము నడపె. 28

చ. అదియును వ్యర్థమాయె! నపు డాంగ్లవిభుత్వము తొట్రుపాటుతో
చెదరిన గుండెకాయ నరచేతులలో బిగబట్టి బాపుజీ
మది నెటులైన మార్చగల మార్గము నారసి కొత్తయెత్తులన్
వెదకెను నక్కజిత్తులకు విజ్ఞులు లక్ష్యము మార్చుకొందురే? 29

తే. సత్యమే జయ మనినమ్మి సమరమునకు
కంకణము గట్టు కొనినట్టి కర్మయోగి
చవుకబారు ప్రలోభముల్ సరకుగొనక
జ్ఞానయోగిగ ప్రజల పక్షాన నిల్చె. 30

తే. ఆ మహాత్ముని దృఢ నిశ్చయమ్ము నరసి
మేటి నాయకు లంద రమేయమైన
భక్తి విశ్వాసములతోడ బాపునోటి
మాట వేదము మాకని చాటినారు. 31

తే. ఆ నినాదము మార్మోగె నన్నిదిశల
పల్లెలును పట్టణమ్ములు పదము గలిపి
ద్విగుణితోత్సాహ ముప్పొంగ దేశమాత
దాస్యశృంఖలములు ద్రెంచ తరలె నపుడు. 32

తే. ఆ మహోద్యమమం దసంఖ్యాకులైన
కన్నబిడ్డల గోల్పోతి కనులముందె!
వారి బలిదాన మెదనిండ వగపుకన్న
రాగరంజితమైన గర్వమును నింపె. 33

ఆ. కులమతములు మరచి కోట్లాది ప్రజలొక్క
త్రాటిపైన నిలిచి సాటిలేని
సరణి సలిపినట్టి శాంతి సంగ్రామము
తెల్లదొరల మదము కొల్లగొట్టె. 34

తే. ప్రళయభీకరమగు ప్రజాబలము ముందు
సాగ దికమీద భరతదేశమ్మునందు
ఇమ్ము దరిగిన మనపెత్తనమ్మటన్న
నిజము గుర్తించి ఆంగ్లేయనేతలెల్ల. 35

ఆ. ఓడలెక్కి వారు ఊరకపోలేదు
కుటిలతంత్రములను కుప్పవోసి
ఆరనట్టి జ్వాల లన్నదమ్ముల మధ్య
రేపి శాంతిరూపు మాపినారు. 36

శా. ఆ కల్లోలము నా శరీరమును బాహాటమ్ముగా రెండుగా
లోక మ్మచ్చెరువంద చీల్చినది; నాలో శోక ముప్పొంగె; నా
చీకాకున్ మదిలోనె దాచుకొని నా చింతన్ దిగమ్రింగి, నే
పాకిస్తానుకు సమ్మతించి అటులే బాపూజి నొప్పించితిన్. 37

తే. జవహరాదిగ తక్కిన శాంతి దళము
తలలు వంచిరి ముందుగా తల్లిచెరను
బాపి జయకేతనమ్మును లేపవలయు
హస్తినాపురి కోటపై యని దలంచి. 38

తే. ఇన్ని కష్టాలకోర్చి దక్కించుకొన్న
దివ్య స్వాతంత్ర్య మీనాడు దీననైన
నన్ను తిలకించి పకపక నవ్వుచుండె!
మానస మ్మగ్నికుండమై మండుచుండె. 39

ఆ. రామచరితమైన రామాయణమ్మును
తలచుకొనిన మేను పులకరించు
అందులోని పాత్ర లనుదినమ్మును నాకు
జ్ఞప్తివచ్చి మిగుల గర్వపడుదు. 40

తే. ఘనుడు శ్రీరామచంద్రుని కారణమున
యుగయుగమ్ములనుండి యీ యుగము వరకు
పయన మొనరించి నేటికి బ్రతికియున్న
మధుర మంజుల గాథ రామాయణమ్ము. 41

తే. దారిదప్పిన మనుజుల ధర్మమార్గ
మునకు మళ్ళించు రాముని ఘనచరిత్ర
నీవు నీదైన శైలిలో నేటి తరము
కొరకు చెప్పుము మిక్కిలి త్వరితగతిని. 42

ఉ. ఇంతకు ముందు రామకథ నెందరో పండిత సత్కవీంద్రు ల
త్యంత రసోత్కటమ్మగు విధమ్మున వ్రాసిరి, వారిముందు, నే
నెంతటివాడనంచు మదినెంచక పామరరంజకమ్ముగా
చింతనజేసి చెప్పుమని చెప్పెను భారతమాత ప్రేముడిన్. 43

తే. ఆ మహామాత ఆదేశ మనుసరించి
భారమంతయు రామునిపైన వైచి
తలకుమించిన బరువని తెలిసికూడ
తలను వంచితి నిది సుకృతమ్మటంచు. 44

ఆ. పరిమళమ్ము సెడక వాడక కలకాల
ముండు నను చు నమ్మి నిండు భక్తి
ప్రేమధామమైన రామాయణము ముందు
చిన్ని "మల్లెమాల" చేర్చినాడ. 45

ఆ. తప్పు లెన్నకుండ దయజూతురని నమ్మి
పండితులకు పెక్కు ప్రణతు లొసగి
చేతనైన వరకు శ్రీరామ చంద్రుని
కథను వ్రాసినాడ కావ్యముగను. 46

***

# కైమోడ్పు

శా. శ్రీకంఠోన్నత చాప మిక్షువు వలెన్ ఛేదించి మోదాన తా
నాకర్ణాయతలోచనన్ వరగుణాఢ్యన్ సుందరాకార, సీ
తాకల్యాణిని పత్నిగా గొనిన నిత్యానంద సంధాయి ఆ
లోకారాధ్యుడు రామభద్రునకు కేల్మోడ్పుల్ సమర్పించెదన్. 1

ఉ. అందెల గజ్జెలన్ ఝుణఝుణాంచిత శబ్దములెల్ల సత్వరా
నందమనోజ్ఞ మందగమన ధ్వనిలో లయమొందునట్లుగా
చిందులు ద్రొక్కి తల్లికి విశేషముదం బొనగూర్చు పార్వతీ
నందను నేకదంతు గణనాయకు నాత్మదలంచి మ్రొక్కెదన్. 2

చ. అరుణ సరోజకోమల నఖాంకుర ధూత విపంచికా లతల్
గురియు మరంద బిందుతతిగూడిన గానసుధాస్రవంతిలో
మురియుచు దేలు భర్త నరమోడ్పుకనుంగవ గాంచి వెండియున్
పరమరసార్ద్రగీతికల బాడు సరస్వతి కంజలించెదన్. 3

ఉ. తొమ్మిది మాసముల్ శ్రమల దోగియు గర్భము నందుమోసి బా
ల్యమ్మున స్తన్యమిచ్చి నను లాలన మీరగ బెంచి పెద్దగా
ఇమ్మహి జేసి నా సుఖము నెంచుచునే దివికేగినట్టి మా
అమ్మకు రంగమాంబ కిపు డంచితభక్తి నమస్కరించెదన్. 4

మ. సహజౌదార్యగుణావతంసు కరుణా సంశోభిత స్వాంతునిన్
మహనీయోజ్జ్వల ధైర్యసంభరితు రామస్వామి నామాంకితున్
అహిరాట్శాయి సమీపు మజ్జనకు నత్యాసక్తి గీర్తించి నే
రహి మీరన్ ఘటియింతు నశ్రుజలపూర్ణంబైన సాష్టాంగమున్. 5

తే. లోకమందున నావంటి ఏకలవ్య
శిష్యకోటికి హితబోధజేసి, జ్ఞాన
భిక్ష దయతోడ నొసగెడు విశ్వగురుని
పాదయుగ్మము నెదనెంచి ప్రణతు లిడుదు. 6

ఉ. తల్లియు దండ్రియున్ గురువు దైవము వాణియు విఘ్నరాజు వీ
రెల్లరు పూజనీయులని యెంతయు భక్తి నమస్కరించి, నా
యుల్లము పల్లవించు మధురోహలసారము రంగరించి నే
నల్లిగబిల్లిగా కవిత లల్లెద నా కలమాడునట్లుగన్. 7

# బాలకాండము

క. శ్రీ కల్యాణగుణాఢ్యుని
లోకత్రయవిభుని భక్తలోలుని విలసత్
కాకుత్స్థ వంశ తిలకుని
సాకేత ప్రభుని రామచంద్రుని గొల్తున్. 1

క. ధారుణి ముద్దుల తనయను
శ్రీరాముని కూర్మి సతిని సీతామాతన్
నోరారగ నుతియించెద
కారుణ్యము తోడ నన్ను గావు మటంచున్. 2

క. నవరసములు జాల్వారగ
అవిరళమగు శ్రద్ధతోడ అమరులవాణిన్
రవివంశజు రాముని కథ
వివరించిన ఆదికవిని వేడ్క భజింతున్. 3

తే. ముజ్జగమ్ములు తనవైన మునివరేణ్యు
నారదుని జూచి వాల్మీకి నతు లొనర్చి
తాపసోత్తమ! నాయందు దయ దలంచి
బదులు సెలవిమ్ము నా చిన్ని ప్రశ్న కనియె. 4

సీ. సత్యసంధుడు సదాచారసంపన్నుండు
సకలభూతహితుండు సద్గుణుండు
సర్వశాస్త్రజ్ఞుండు శాంత స్వభావుండు
ధర్మస్వరూపుండు తార్కికుండు
అచల సంకల్పుండు అసహాయశూరుండు
మోహనాకారుండు బుధనుతుండు
నీతికోవిదుడును నిర్మలహృదయుండు
మాననీయుండు విజ్ఞానయుతుడు

తే. అమరగణమును సైత మాహవమునందు
సులభముగ గెల్చువాడు క్ష్మాతలమునందు
నున్నచో వాని వివరమ్ములన్ని నాకు
మనసు రంజిల దెలుపుమా! మౌనివర్య! 5

తే. అనిన వాల్మీకి విజ్ఞప్తి నాలకించి
అడుగదగినట్టి ప్రశ్ననే యడిగినావు
కలడు నీవన్న సుగుణముల్ కలుగువాడు
క్షితి నొకండని దేవర్షి చెప్పె నిట్లు. 6

తే. వసుధ పేర్గన్న ఇక్ష్వాకువంశమందు
జననమందిన శ్రీరాము డనెడువాడు
కడు ప్రసిద్ధు డనుచురామ కథను దెలిపె
సంయమీంద్రుడు ముదమార సంగ్రహముగ. 7

తే. నారదమహర్షిమాట కానంద మొంది
మేలుమేలని మ్రొక్కి వల్మీకభవుడు
సకల మర్యాద లొనరించి సాగనంపి
చనెను తాను మధ్యందిన సవనమునకు. 8

తే. సజ్జనుని మది విధమున స్వచ్ఛమైన
నీరుగల తమసా నదీతీరమందు
శిష్యుడగు భరద్వాజుండు చెంతనుండ
స్నాన మాడదొడంగె నా మౌనివరుడు. 9

తే. అచటగల యొక వృక్షశాఖాగ్రమందు
క్రౌంచపక్షుల జంట క్రీడించుకొనుచు
పారవశ్యంబునంబాడు పాట యొకటి
మౌని వాల్మీకి చెవి సోకె మధురముగను. 10

తే. అంత వల్మీక సంభవుం డతిముదమున
క్రౌంచమిథునమువైపు వీక్షించుచుండ
నొక్కబోయడు బాణమ్ము నెక్కువెట్టి
ఘోరముగ పోతుపక్షిని కూలనేసె. 11

తే. పెనిమిటిని గోలుపోయిన పెంటిపక్షి
కటికబండలు సైతము కరగునటుల
బోరుమని యేడ్వసాగె, నాతీరునరసి
కరగిపారెను మౌనిపుంగవుని గుండె. 12

తే. ఓరి బోయడ! నీవింత దారుణముగ
కామమోహితమైయున్న క్రౌంచమిథున
మందు నొకదాని జంపి, యత్యంత పాప
కార్య మొనరించినాడ వకారణముగ. 13

తే. కనుక తోడును నీడయు గానరాక
బ్రతికినన్నాళ్ళు జీవచ్ఛవమ్మువోలె
బ్రదికి దుర్మరణమ్ము పొందెదవుగాక!
అనుచు శపియించె మౌనీంద్రు డాగ్రహమున. 14

తే. వ్యాకులితచిత్తమున నేను పలికినట్టి
పలుకు లన్నియు లయబద్ధ పంక్తు లాయె
గానయోగ్యత సైతము గాంచె కాన
నిక్కముగ శ్లోకమిద్ది సందియము లేదు. 15

తే. అనుచు మదినెంచి యా మాట నా మహర్షి
యనుగుశిష్యున కెరిగించె నంత నతడు
గురువు శోకము శ్లోకమై దొరలె ననుచు
అపరిమిత హర్షభరితుడై యాలపించె. 16

తే. కమ్మనైన భరద్వాజు కంఠమునకు
శోభ బెంచెను తన తొలి శ్లోకమన్న
సంతసము జెంది వాల్మీకి స్నానమాడి
మందగమనమ్ముతో నాశ్రమమ్ము జేరి. 17

ఆ. పర్ణశాలలోన పద్మాసనస్థుడై
ఏల బుట్టె శ్లోక మిందులోని
మర్మ మేమి టనుచు మననమ్ము జేయుచు
ధ్యానముద్ర దాల్చె మౌనివరుడు. 18

ఆ. అతని స్మృతిపథాన నజుడు ప్రత్యక్షమై
యతివరేణ్య! పక్షి ఆర్తి నరసి
బాధతోడనీవు పలికిన పలుకులు
సూరివరులు మెచ్చు శ్లోక మాయె. 19

ఆ. సరళసుందరమగు ఛందస్సు నొడగూర్చి
వాణి యొసగె గొప్ప వరము నీకు
కనుక దాని నూతగా గొని రాముని
కథ రచింపు మీవు కావ్యముగను. 20

క. ఆ కావ్య మాదికృతియై
లోకమ్మున ఖ్యాతిగనును రూఢిగ నిక నీ
వాకార్యసిద్ధి కొరకై
శ్రీకారము చుట్టు మిపుడె సిద్ధులు మెచ్చన్. 21

ఆ. అని విధాత దెల్పె నది మహాభాగ్యమ
టంచు నెంచి ఆ మహామునీంద్రు
డతిమనోహరముగ నాది కావ్యము వ్రాయ
పుణ్యదివసమందు పూనుకొనియె. 22

సీ. సరయూనదీతీర సౌభాగ్యలక్ష్మికి
ఇక్ష్వాకు వంశజు లిడిన తొడవు
మెరుగుటద్దాలను పరిహాస మొనరించ
గలిగిన రాజమార్గముల నెలవు
నీలి నీరదముల నిలువెల్ల ముద్దాడు
రమణీయసౌధరాజముల నెలవు
బహువిధఫల పుష్ప భరితమై విలసిల్లు
వరనందనోద్యాన వనుల నెలవు
తే. ధన కనక వస్తు వాహన గణము లెనయ
భోగముల కాలవాలమై పుడమిలోన
అతులితమ్మైన ప్రఖ్యాతి నందు కొనిన
ప్రముఖ నగరము సాకేతపట్టణమ్ము. 23

క. సురనగరికి సరిదూగెడు
సరణిని నిర్మింపబడిన సాకేతపుర
మ్మరిదుర్భేద్య మ్మగుపుర
వర మగుట నయోధ్యయన్న వాసి గడించెన్. 24

క. అట్టి అయోధ్యానగరము
చుట్టునుగల కోట మిగుల సుస్థిరమై యే
ముట్టడికైనను లొంగని
కట్టడమై యలరె సర్వకాలమునందున్. 25

సీ. అచటి విప్రుల పుత్రు లయిదేండ్ల వయసుకే
యెల్లవేదములు వల్లించుచుండ్రు
అచటి క్షత్రియ పుత్రు లడవి సింగములపై
చిరునవ్వుతో స్వారి జేయుచుండ్రు
అచటి వైశ్యుల పుత్రు లధిక లాభమ్ముల
నార్జించు మార్గము లరయుచుండ్రు
అచటి శూద్రులపుత్రు లన్ని వృత్తులయందు
మించునేరుపున రాణించుచుండ్రు
తే. ఒక్కరని చెప్పనేల అయోధ్యయందు
పుట్టు ప్రతిబిడ్డ తనముందు పుట్టినట్టి
బిడ్డ కన్నను మిగుల వివేకియౌట
సహజ లక్షణ మండ్రు లాక్షణికులెల్ల. 26

తే. అట్టి సాకేతపురి ముఖ్యపట్టణముగ
ఇలను కోసల రాజ్యము నేలుచుండె
సత్యసంధు డుదారుడు శౌర్యధనుడు
ధర్మనిరతు డజేయుడు దశరథుండు. 27

ఆ. సుప్రసిద్ధులైన సూరివరేణ్యుల
భువిని పేరుగనిన కవితిలకుల
గణుతి కెక్కినట్టి గాయకశ్రేష్ఠుల
నిత్య మాదరించు నేత యతడు. 28

ఆ. అప్సరసలవంటి అందాలనర్తకీ
మణు లయోధ్య నగరమునను గలరు
వాడవాడలందు వారి యందెలు కోడి
కూతకన్న ముందె కూయుచుండు. 29

క. తన రాజ్యముపై దండె
త్తిన రాజుల పీచ మణచి దిగ్విజయమ్మున్
గొని నగరమ్మును శూరుల
ఖనిగా దశరథుడు మలచె కడు దర్పమునన్. 30

తే. మహిత విఖ్యాతిగనిన సామ్రాజ్యమున్న
భవ్యచరితలు ముప్పురు భార్యలున్న
ఒక్క కొడుకైన వంశము నుద్ధరింప
పుట్టలేదను బెంగతో పుడమిరేడు. 31

తే. మంత్రిగణ ముఖ్యుడైన సుమంత్రుతోడ
శిష్ట కులగురువైన వసిష్ఠుతోడ
బాధ వివరించి పుత్ర సంప్రాప్తికొరకు
అశ్వమేధము జేసెద మని వచించె. 32

తే. మంచి నిర్ణయ మనుచు సుమంత్రు డొసగి
నట్టి హితవును పాటించి యంగరాజ్య
మునకు పరివారయుతముగా నినకులేశు
డరిగె తన యాప్తసఖుని సహాయ మడుగ. 33

ఆ. చాలకాలమునకు చనుదెంచె స్నేహితు
డనుచు రోమపాదు డతిముదమున
స్వాగతించి యతిథి సత్కారములు చేసె
దశరథుండు మిగుల దనియు నటుల. 34

ఉ. అంత నయోధ్యరాజు తన యాప్తవరేణ్యుని రోమపాదునిన్
సంతస మొప్పనట్లుగని సల్ప దలంచితి నొక్క యాగమున్
సంతును గోరి, ఆ క్రతువు జ్ఞానపయోనిధి, ఋష్యశృంగు డా
ద్యంతము నిర్వహింపదగునంచు మనమ్మున నెంచి వచ్చితిన్. 35

క. అని దశరథు డనినంతనె
తన అల్లుని ఋష్యశృంగతాపసవర్యున్
తనయను శాంతాదేవిని
అనిపెను హితు డంగరాజు హర్ష మ్మెనయన్. 36

తే. రోమపాదుడు తనకెంతో ప్రేమపంచి
కోరినంతనె అల్లుని కూర్మిసుతను
పంపె శుభసూచి యిది యన్న భావముననను
దశరథుడు శీఘ్రముగ రాజధాని జేరె. 37

తే. కోటవాకిట ఋష్యశృంగునకు ప్రజలు
ఘనతరమ్ముగ విరుల స్వాగతము నిడిరి;
అంత నాదంపతుల రాజహర్మ్య మందు
విడిది జేయించె స్వయముగా పుడమివిభుడు.

ఆ. అంత కొన్నినాళ్ళ కామని అరుదెంచె
అవని విభుడు గురుని యనుమతి గొని
మౌని ఋష్యశృంగు మనసార నుతియించి
భక్తిశ్రద్ధ లెనయ పలికె నిట్లు.

ఆ. మౌనికులవతంస ! మా రఘువంశాభి
వృద్ధి నభిలషించి వేగసమ్ము
తముగ నిర్వహింప దలచితి నే నశ్వ
మేధయాగ మంచు మీకు దెలియు. 40

తే. సకల ధర్మ స్వరూపు డాచార్య దేవు
డగు వసిష్ఠుని నేతృత్వమందు జరుగు
యాగ మారంభమును జేయ నానతిండ
టంచు సాకేత విభుడు ప్రార్థించె నంత. 41

తే. ఋష్యశృంగుడు దశరథునిచ్చ మెచ్చి
నీయభీష్టము సఫలమై నెగడుగాక!
అనుచు దీవించి ఆ మహాయజ్ఞమునకు
వేగ నేర్పాటులెల్ల గావింపు మనియె. 42

మంజరి. సాకేతవిభుడంత సంతస మ్మెనయ
మంత్రిసుమంత్రుని మరియు సద్గురుని
వేద పండితులగు విప్రోత్తములను
బిలిపించి వారికి వివరముల్ దెలిపి
యాగనిర్వహణాన కవసరమ్మైన
సకల సంభారాలు సమకూర్చు డనియె;
ప్రభునానమేరకు వారంద రపుడు
విధులు నిర్వర్తింప వేవేగ జనిరి
చైత్రపూర్ణిమనాడు సాంగ్రహణేష్టి
కర్మ నారంభించి క్రతుధర్మ మెసగ
సవనాశ్వరాజమున్ సైన్యమ్ముతోడ
అఖిలదేశములకు అవనీశు డంపె. 43

తే. సకల వసతులతో వేద సమ్మతముగ
నద్భుతావహ మగులీల యాగశాల
శాస్త్రవేత్తల పర్యవేక్షణమునందు
ప్రొద్దు కొకరీతి క్రొత్త రూపును ధరించె. 44

తే. వివిధ దేశాధినేతల కవనివిభుని
యానమేర సుమంత్రు డాహ్వానములను
పేరు పేరున పంపించె వారి వారి
అర్హతలు కొలమానమై యలరునటుల. 45

తే. సవన మారంభమగునట్టి సమయమునకు
ముందె రాజన్యు లందరు ముద మెలర్ప
నరుగుదెంచి రయోధ్యకు నతులితమగు
కానుకలతోడ భిన్నమార్గముల యందు 46

తే. వార లందరకును మంత్రి స్వాగతమ్ము
పలికి తగురీతి విడుదు లేర్పాటుజేసె
నంతలో పూర్తియైనది యాగశాల
ప్రభువు సైతము నాశ్చర్యపడెడు లీల. 47

క. అంత వసిష్ఠుడు దశరథు
నంతఃపురమందుగలసి యాగము కొరకై
యంతయు సిద్ధమ్మిక నీ
చింతలు దీరంగ శుభము చేకురు ననుచున్. 48

సీ. అశ్వమేధమ్మున కాహ్వాన మంపిన
వసుధేశు లందరు వచ్చినారు
వారంత తులలేని వైవిధ్య భరితమౌ
దివ్యబహూకృతుల్ దెచ్చినారు
ఇచ్చట మనపౌరు లిడిన స్వాగతమును
మిక్కుటమ్ముగ మదిన్ మెచ్చినారు
వసతి సౌధములందు పనిజేయు వారల
కిరుహస్తముల కానుక లిచ్చినారు

తే. సవన నిర్వాహకులు శాస్త్రసమ్మతముగ
యజ్ఞశాలకు మెరుగుల నద్దినారు
రాజ్యమంతట సవనకోలాహలమ్ము
తాండవించుచు నున్నది దశరథేంద్ర! 49

తే. యజ్ఞశాలకు నేడు నీ వరుగుదెంచి
అచటి యేర్పాట్ల నెల్ల నాద్యంత మరసి
తృప్తినందిన తదుపరి ఋష్యశృంగ
మునికి జూపించు టొప్పగు నని వచించె. 50

క. కులగురువు మాటమేరకు
తిలకించెను యాగశాల ద్విజముఖ్యులతో
గలసి నరేంద్రుడు ముదమున
పులకింతలు మానసమున పొంగులు వారన్. 51

తే. అంతలోపల భూతలమంత దిరిగి
దశరథుని ఖ్యాతి నాలుగుదిశల చాటి
విజయదర్పము మోమున వెల్లివిరియ
నటు లయోధ్యకు సవనాశ్వ మరుగుదెంచె. 52

తే. ఎట్టి ఆటంకములు లేక ఇలను చుట్టి
దిగ్విజయముగ నగరికి తిరిగివచ్చి
నట్టి తురగము మోమున బొట్టు పెట్టి
హారతులుబట్టి పూజించె! యాగశాల. 53

తే. పుణ్యసరయూనదీతీర భూములందు
పృథ్వి యచ్చెరువంద నిర్మించినట్టి
యజ్ఞవాటికయందు నత్యంత వైభ
వముగ కులగురుశ్రేష్ఠు నాధ్వర్యవమున. 54

తే. ఋష్యశృంగుడు బ్రహ్మగా నితర ఋషులు
నవ్యఋత్విగ్గణమ్ముగ భవ్యరీతి
లక్షలాది యతిథుల సమక్షమందు
రాణ యొప్పార యజ్ఞ మారంభమాయె. 55

తే. క్ష్మాతలేంద్రుని దివ్యసంకల్పబలము
మునిగణమ్ముల మేలి దీవెనల బలము
సవన మారంభమైనట్టి సమయబలము
మూడు జతగూడి కనువారి ముదము బెంచె. 56

ఆ. పంక్తిరథనృపాలు ప్రాభవ మ్మేపార
సకల వేదమంత్రసమ్మతముగ
క్రతువు మూడునాళ్ళు క్రమబద్ధముగ సాగి
అఖిలజగతి మెప్పు లందుకొనియె. 57

చ. సవనము సాగినన్ని దివసమ్ములు రాజులు బ్రాహ్మణోత్తముల్
కవులు కళావిశారదులు కార్మిక కర్షక గ్రామవాసులున్
చవు లెగజిమ్ము విందులను సారెకు సారెకు నారగించి యీ
భువి నిటువంటి సత్త్రభువు పుట్టునె యెన్ని యుగాల కేనియున్. 58

ఆ. అనుచు ముచ్చటించుకొను టబ్బురము కాదు
వచ్చినట్టి వారి కిచ్చినట్టి
వివిధ బహుమతులకు విలువ యింతని కట్ట
ధాతకైన గాని తరము గాదు. 59

ఆ. బాల బాలికలకు స్త్రీలకు స్వయముగా
రాణు లిడిరి మేలికానుకలను;
ప్రభువు దాన మొసగె బ్రాహ్మణోత్తములకు
ఆశదీర నగ్రహారములను. 60

ఆ. అశ్వమేధ యాగ మవని యంతయు మెచ్చు
నటుల నిర్వహించి నట్టి గురుని
ముని వసిష్ఠు నరసి జననాథు డతిభక్తి
గొలిచి ధన్యవాదములను దెలిపి. 61

ఆ. అంత యాగబ్రహ్మయగు ఋష్యశృంగుని
కలసి పదములంటి కరము మోడ్చి
సకలపాప రహిత సవనమ్ము నేటితో
ముగిసె శుభకరముగ మునివరేణ్య! 62

తే. ఇట్టి సంతోష వేళ నే నెరుగజేతు
మీకు నా విన్నపమ్మును లోకమాన్య!
పుత్రసంతాన లబ్ధి నేబొందునట్టి
క్రతువు జరిపించి పుణ్యము గట్టుకొమ్ము. 63

తే. పుత్రకామేష్టియను నట్టి పుణ్యక్రతువు
వలన నలుగురు కొమరులు గలుగ గలర
టంచు దీవించి మునివరుం డాదినమ్మె
యాగ మారంభమును జేసె నతిముదమున. 65

తే. వేద మంత్రాలతో హోమవిధు లొనర్చి
ఋష్యశృంగుడు క్రతువు జేయింపదొడగె
అంతకంటెను ముందర యజ్ఞభాగ
ములను గైకొనవచ్చిన మునులు సురలు. 66

తే. అచట వేంచేసి యున్నట్టి యజుని గలసి
ముక్త కంఠాన ప్రార్థించి మ్రొక్కు లొసగి
పద్మసంభవ ! మీచేత వరములంది
మరణ మంటదు తనకన్న మదముతోడ 67

తే. రాక్షసాధీశుడైనట్టి రావణుండు
పాపభీతిని నీతిని పారద్రోలి
సురగరుడ సిద్ధ యక్ష కిన్నర గణముల
బెట్టు బాధలు లోకాల పెచ్చు మీరె. 68

సీ. అమరేంద్రు పీఠమ్ము నాక్రమించు దురాశ
తో యుద్ధములు సేయు దుష్టు డతడు
భర్తల హతమార్చి భార్యల చెరబట్టి
శీలమ్ము దోచు దుశ్శీలు డతడు
మునులు సల్పెడు యాగములు ధ్వంస మొనరించి
చెలగి హింసించెడు చెనటి యతడు
కల్లోలముల రేపి ముల్లోకముల సిరి
కొల్లగొట్టెడు మహాక్రూరు డతడు

తే. సాగరుని సూర్యు ననిలుని సైత మేను
చలన మాపించగలనన్న స్వాతిశయము
నెత్తి పైకెక్కి సివమెత్తి నేలమీద
నిలువకున్నాడు వాడొక్క నిముసమైన. 69

తే. అట్టి త్రైలోక్యకంటకు హత మొనర్చు
మార్గమును మీరె సూచించి మమ్ము గావు
డనుచు మొరపెట్టుకొనిరంత వనజభవుడు
క్షణము యోచించి వారితో ననియె నిట్లు. 70

తే. సురగరుడ దైత్యయక్షకిన్నరుల వలన
మరణ మతనికి లేదు నా వరము వలన
మానవుడు తప్ప వానిని మరి యొకండు
చంప సాధ్యము కాదిది సత్య మనియె. 71

తే. అంతలోపల నచట ప్రత్యక్షమాయె
విమలతేజస్స్వరూపుడు విష్ణుమూర్తి
వారి దర్శనభాగ్యము వర మటంచు
నెంచి సురలంత కేల్మోడ్చి యిట్టు లనిరి. 72

తే. అచ్యుతా! మాదు ప్రార్థన నాలకించి
పుత్రసంతాన లబ్ధికై పుణ్యక్రతువు
సలుపుచున్నట్టి దశరథ సార్వభౌము
కొడుకుగా బుట్టి రావణు గూల్చవలయు. 73

క. అని వేడిన సురలను హరి
యనునయమున బార జూచి యటులే నేనీ
యినకులపతి తనయుడనై
జనియించెద దనుజపతిని జంపుట కొరకై. 74

ఆ. సకల బంధుమిత్రసంతానయుతముగా
రణమునందు రావణుని వధించి
లోకములకు శాంతి చేకూర్చి పెక్కేడు
లీ ధరాతలమ్ము నేల గలను. 75

ఆ. అనుచు నభయ మిచ్చి యందర దీవించి
మాయ మాయె నటులె మాధవుండు;
సురలు మునులు హరిని స్తుతియించి పూజించి
హర్ష పారవశ్య మంది రపుడు. 76

తే. అంతబ్రహ్మాదిదేవత లవనిపతికి
దీవన లొసంగి వేగ నదృశ్యులైరి;
అంతలో యజ్ఞకుండ మధ్యమ్మునుండి
పరమ తేజస్స్వరూపుడు పైకి లేచె. 77



ఆ. పసిడి పాత్రచేతబట్టి లేచిన దివ్య
పురుషు నరసినట్టి పుడమివిభుడు
మాట పెకలనట్టి మధురానుభూతితో
నప్రయత్నముగనె అంజలించె. 78

తే. అంత నామహాపూరుషు డతిముదమున
దశరథుని జేరి పాత్ర నాతని కొసంగి
ఇందులోనున్న పాయస మిపుడె నీవు
రాణులకు నిమ్ము! పుత్ర సంప్రాప్తి గలుగు. 79

ఆ. అనుచు శుభము దెలిపి యతని మన్నన లంది
యజ్ఞ పురుషు డటులె యరిగె దివికి
అంత ప్రభువు చేరె నా యజ్ఞవాటిక
యందునున్న యట్టి అంతిపురము. 80

ఆ. పాయసమున సగము పట్టపురాణి కౌ
సల్య కొసగి కడమ సగమునందు
సగము ప్రీతితోడ సతి సుమిత్ర కొసంగి
మిగులు సగములోన సగము దీసి. 81

తే. ప్రియసతీమణి కైకకు ప్రేమతోడ
నిచ్చి మిగిలిన సగము తా నిచ్చమెచ్చి
మరల నిచ్చె సుమిత్రకు ధరణివిభుడు
ముచ్వురును మేలు మేలని మురియు లీల. 82

ఆ. అంత కొన్నినాళ్ల కంతఃపురమ్మున
రాజు సంతసింప రాణులెల్ల
గర్భములను దాల్చి కలలు సాకారమౌ
దినము దగ్గరాయె ననుచుమురిసి. 83

ఆ. చెలుల కందరకును పలు కానుకల నిచ్చి
పేరటాండ్ర బిలిచి చీర లిచ్చి
పట్టణమ్ములోని ప్రతిదేవళమ్మున
అర్చనలను సలిపె రమితభక్తి. 84

తే. ధర్మపత్నులు గర్భము దాల్చిరన్న
సంబరమ్మున దశరథ చక్రవర్తి
స్వయముగా తానె వారల పవలు రేలు
పలు తెరంగుల నుల్లాసపరచుచుండె. 85

ఆ. అతిశయించినట్టి యానంద మెచ్చట
కొలువు దీరునట్టి నెలవునందు
గడచిపోవు నెలలు గడియలట్లని యంతి
పురము దెలియ జెప్పె పురజనులకు. 86

తే. అలుపెరుంగక పరువెత్తునట్టి కాల
మామనికి స్వాగతము బల్కె, నంతలోన
గర్భవతులైన రాణుల కలలు; పండి
నేల పులకింప వారికి నెలలు నిండె. 87

సీ. శుభకరమ్మగు చైత్రశుద్ధనవమి పున
ర్వసు నామనక్షత్ర రాజయుక్త
కటక లగ్నమ్మున కౌసల్య ప్రసవించె
మోహనరూపుడౌ ముద్దుకొమరు;
మరుసటి దినమునం దరుణోదయమునకు
ముందు పుష్యమితార మురియులీల
మీనలగ్నమ్మందు మానిని కైకేయి
చక్కనౌ సుతునకు జన్మనొసగె;

తే. ఆ దినమె సూర్యు డుదయించినట్టి పిదప
సతి సుమిత్ర ఆశ్లేష నక్షత్రయుక్త
కటకలగ్నాన సుందరాకారములకు
దర్పణము లైన సుతుల నిద్దరను గనియె. 88

ఆ. రాచనగరులోన రాకుమారులు నల్వు
రుదయ భాను లట్లు లుద్భవించి
రన్నవార్త నగర మాలించి పులకించి
వాడవాడలందు నాడి పాడె. 89

ఆ. పంక్తిరథుని హృదయ పద్మమ్ము వికసించె
పొంగి కడలి అలలు నింగి కెగసె
గుళ్ళు గోపురములు గొంతెత్తి నినదించె
విశ్వమంత ముదము వెల్లివిరిసె. 90

ఆ. వంశ ముద్ధరింప వరపుత్రు లుదయించి
రింతకన్న నా కికేమి వలయు
ననుచు దశరథేంద్రు డపనీసురుల బిల్చి
బహుముఖాల ధనము పంచిపెట్టె. 91

తే. పదునొకండవ దినమున ప్రభువరేణ్యు
డంతిపురమును స్వర్గతుల్యముగ మార్చి
శిశువులకు నామకరణమ్ము జేయు డనుచు
చేతులను మోడ్చి వేడె వసిష్ఠమునిని. 92

సీ. భాసురాకారుడౌ కౌసల్య తనయుని
ముని వసిష్ఠుడు రాము డని వచించె;
కనులపండువు సేయు కైకేయి ముద్దుల
తనయుని భరతాఖ్యు డని వచించె;
తరుణి సుమిత్ర సంతానమందున పెద్ద
తనయుని లక్ష్మణు డని వచించె;
కవలలోపలను రెండవవాని తనివార
గనుగొని శత్రుఘ్ను డని వచించె;

తే. కులగురువు నోట బలికిన తొలి పలుకులు
వేదమంత్రాక్షతలుగ భావించి తల్లు
లా మహామౌని దివ్యపాదారవింద
ములకు ప్రణమిల్లి రపుడు సమ్మోద మెసగ. 93

తే. అంత నలువురు పిల్లల నతిథు లెల్ల
కొసరి ముద్దాడి తమవంతు కూర్మి పంచి
దీవనలు జల్లి ప్రభువు సత్కృతుల నంది
చనిరి మధురానుభూతులు గొనుచు వెంట. 94

తే. అంత లోపల పసిడి ఊయలలు మూడు
చెలులు గొనితెచ్చి తల్లుల చెంతనిలిపి;
రంత కౌసల్య తన బిడ్డ నతిముదమున
నొక్కడోలికలోన తా నుంచి మురిసె. 95

తే. ఎదుట నున్నట్టి జంట ఊయెలను జూచి
కోరి చేయించె కవలల కొరకు ప్రభు వ
టంచు మది నెంచి యిద్దర నందులోనె
నిండు మదిని సుమిత్ర పరుండ బెట్టె. 96

క. మిగిలిన ఊయెలయందున
నగుమోమున కైక కూర్మినందను నుంచెన్
ముగురమ్మలు వెంటనె తి
న్నగ డోలల నూపు టరసి నాథుడు మురిసెన్. 97

తే. భరతుడును రాము డానంద పారవశత
అమ్మలను జూచి కేరింతలాడుచుండ
కవల లిద్దరు తల్లిని గాంచకుండ
ఒత్తిగిలి అన్నలనె చూచుచుండి రపుడు. 98

తే. సతి సుమిత్ర కుమారుల స్థితిని గాంచి
వారిచూపులలోని భావమ్ము నెరిగి
రాము సరసన లక్ష్మణనామధరుని
భరతు సరసన శత్రుఘ్ను బండబెట్టె. 99

తే. దగ్గరైనట్టి చిట్టి సోదరునిపైన
బుల్లిరామయ్య్య వెదజల్లె బోసినవ్వు;
అన్నరాముని మోము కన్నార్పకుండ
చూడ దొడగెను లక్ష్మణు డాడుకొనుచు. 100

తే. చిన్నితమ్ముడు తన ప్రక్క జేరెనన్న
ముదము భరతునిమోమున మొగ్గదొడిగె;
నటులె మన మిద్దరము జతయనిన లీల
నరయ దొడగెను శత్రుఘ్ను డన్నవంక. 101

ఆ. ఆ క్షణమ్మునుండి యా నల్వురును రెండు
జంటలైరి కనుల పంటలైరి;
ఆటపాటలందు అన్నపానములందు
పవలు రేలు జంట బాయరైరి. 102

సీ. అక్షరాభ్యాస శుభారంభ సమయాన
నలువు రొకే మాట పలికినారు;
సత్యసౌజన్యాది సచ్ఛీలములయందు
నలువు రొకే రీతి మెలగినారు;
లౌకిక వ్యవహార లక్ష్య సాధనమందు
నలువు రొకేబాట నడచినారు;
వేద శాస్త్రపురాణ విద్య లన్నిటియందు
నలువురు సమముగా నిలిచినారు;

తే. నలువురును ధనుర్వేదమునందు సైత
మతులితమ్మైన నైపుణ్య మందినారు;
కన్నతండ్రిని గురువు నొక్కటిగ నల్వు
రెపుడు సేవించి క్రమముగా నెదిగినారు. 103

తే. వేటకై రామభద్రుడు వెడలెనేని
లక్ష్మణుడు వెంట జను నంగరక్షకుడుగ
లక్ష్మణుడు తోడులేనిదే రామచంద్రు
డడుగు కదపడు రాజహర్మ్యమ్ముీడి. 104

తే. అటులె శత్రుఘ్నుడు భరతునంటియుండి
వలయు సేవలు నిరతమ్ము సలుపుచుండు;
భరతుడును చిన్న సోదరు నరనిముసము
బాసియుండగ నోప డా బంధమేమొ! 105

ఆ. కార్యదీక్షయందు క్రమవర్తనమునందు
నీతిసరణియందు నియమమందు
ధర్మనిరతియందు తనను మించిరి పుత్రు
లన్న ముదమునందె నవనివిభుడు. 106

ఆ. బాల్యమాది రామభద్రుని మోములో
తనను తాను జూచుకొనెను ప్రభువు;
పట్టణమ్ములోని ప్రజలును రామునే
దైవ మటుల మదిని దలచినారు 107

తే. లోకమందున సమముగా రాకుమారు
లందరును పేరు ప్రఖ్యాతి నందుకొనిన
తనయులందున ముప్పురు తల్లులకును
రామచంద్రుని మీదనే ప్రేమ మెండు. 108

తే. దైవకృపవల్ల పుత్రు లందరును నేడు
ప్రాప్త యౌవనులైనారు। బంధుమిత్ర
గణము మెచ్చగ వైవాహికములు జరిపి
తృప్తినిండార ముచ్చట దీర్చుకొందు. 109

తే. అని మనమ్మున దలపోసి యవనివిభుడు
కులగురువరేణ్యు నితర ముఖ్యులను బిలిచి
తన మనోభీష్టమును దెల్పి తగు విధమున
యత్న మొనరింపు డనిపల్కె నంతలోన. 110

తే. ద్వారపాలకు డరుదెంచి తలను వంచి
వందనముచేసి ముని గాధినందనుండు
పరమగంభీరముగ రాజభవనమునకు
వడిగ వేంచేయు చున్నారు ప్రభువరేణ్య! 111

ఆ. అనుచు విన్నవించె నంత భూపాలుడు
హితగణమ్ముతోడ నెదురువెడలి
అర్ఘ్యపాద్యవిధుల అతిభక్తి పూజించి
మౌని వరుని గొనుచు లోనికరిగి. 112

క. పిలువక పలికెడు దేవుని
వలె విశ్వామిత్రు నెంచి వసుధేశుడు ని
శ్చల భక్తితోడ హస్త
మ్ములు మోడిచి పలికె నిట్లు మునితిలకునితోన్. 113

తే. తాపసోత్తమ ! నాకొల్వు ధన్యమాయె
ఇపుడు మీరాక వలన, నేనేమిసేయ
వలయునో తెల్పి జన్మసాఫల్య మొందు
నట్టి భాగ్యము దయసేయు డనుచు వేడె. 114

తే. దశరథుని దివ్యభక్తి తత్పరత మెచ్చి
యా మహామౌని పులకించి యభినుతించి
ఇనకులేశ్వర! నీవు కోరిన విధమున
నాలకింపుము నే వచ్చినట్టి పనిని. 115

ఉ. నే నొక యాగమున్ సలుప నెంచితి దీక్షను స్వీకరించితిన్
కాని, మహాభయంకరులు, కల్మషబుద్ధులు, కామరూపులౌ
దానవు లిద్ద రాక్రతువు ధ్వంస మొనర్చుచు రక్తమాంసముల్
పూనిక నగ్నికుండమున బోయుచునుండిరి మాటి మాటికిన్. 116

క. ఆ మారీచ సుబాహుల
నామానసబాధ దీర నాశ మొనర్పన్
ఏమాత్ర మడ్డు జెప్పక
రాముని నాతోడ బంపు రాజవరేణ్యా ! 117

ఉ. ఆడినమాట తప్పవని యాత్మదలంచి మనోగతమ్ము నీ
తోడ వచించితిన్ కనుక దొడ్డ మనమ్మున రామచంద్రునిన్
తోడుగ యాగరక్షణకు తోడ్పడ బంపుము నేడె! దాన చే
కూడును నీకు సద్యశము కోరిక నాకును దీరు భూవరా! 118

తే. సత్యసంధుడు కారణజన్ముడైన
రాము డవలీల జంపు నా రాక్షసులను;
నే ప్రసాదింతువానికి నిఖిల లోక
విజయ మొనగూర్చు శక్తుల ప్రీతితోడ. 119

తే. రామచంద్రుని శౌర్యపరాక్రమములు
సిద్ధయోగీంద్రుడైన వసిష్ఠు డెరుగు
నే నెరుంగుదు కావున నిర్భయముగ
నతని బిలిపింపు మిప్పడే అవనినాథ! 120

క. అని గాధేయుడు పలికిన
నినకులపతి భీతిజెంది, యిదినేనూహిం
చని సంఘటన మ్మిపు డే
మని బదు లిచ్చెదను మౌని కని చింతించెన్. 121

తే. ప్రాణసముడైన రాముని దానవులను
జంపు పనిమీద అడవికి బంపలేక
ఆగ్రహావేశియగు ఋషి కడ్డుజెప్ప
ధైర్య మావంతయును లేక దశరథుండు. 122

తే. ఆసనము డిగ్గి బ్రహర్షి కంజలించి
తడబడెడు గొంతు పలుమార్లు తడవుకొనుచు
చివరి కెట్టులో మనమునుచిక్కబట్టి
వినయ మేపార నీరీతి విన్నవించె 123

తే. పట్టుమని పదునారేండ్ల ప్రాయమైన
రాని పసివాడు రాముడు। రాక్షసులను
జంపుటకు తాను చాలడు సంయమీంద్ర!
అరుగుదెంచెద నేనె సైన్యమ్ము తోడ 124

తే. తమరు నిశ్చింత నుండుడా దానవులను
నేను సంహార మొనరించి నిఖిలజగతి
మెచ్చ యాగము మీ యిచ్చవచ్చురీతి
పూర్తియగుదాక కాపుందు మోద మలర 125

ఆ. సంయమీంద్ర ! వయసు సడలిన పిమ్మట
దైవకృపను నాకు దక్కినట్టి
యాగఫలము రాము డన్నయథార్థము
మీకు దెలియు, నెల్లలోక మెరుగు. 126

తే. రాము డెదురుగ లేక నా ప్రాణ మొక్క
నిముస మేనియు బొందిలో నిలువబోదు;
కనుక దయయుంచి నారాక కనుమతిండ
టంచు బ్రార్థించె గాధేయు నవనివిభుడు. 127

తే. దశరథుని వేడికోలు నా తాపసేంద్రు
డనుమతింపక క్రుద్ధుడై యవనినాథ!
ఆడి తప్పని రఘువంశమందు బుట్టి
మాట దప్పిన నీతోడ మాటలేల ? 128

ఆ. హితవుగాని పల్కు లతివినయమ్మున
బలికినందువలన ఫలము లేదు;
పాద మిచట మోపి భంగపడితి నేను
సిద్ధయోగి వరు వసిష్ఠునెదుట. 129

తే. చాలు చేసిన మర్యాద చాలు చాలు
వలదు నీ సాయ మిసుమంత వలదు నాకు;
యతులతో నెప్ప డీరీతి నాడుకొనకు
ధర్మమును కాలరాయుట తగదు నీకు. 130

క అని కౌశిక మౌనీంద్రుం
డనినంత వసిష్ఠు డతని యాగ్రహసరణిన్
గనుగొని పృథ్వీశునితో
ననునయ వాక్యముల బలికె నందరు వినగన్. 131

తే. పంక్తిరథ! నీవు తొందరపాటు తోడ
విమలబుషివర్యు మనసు నొప్పించినావు;
ఆడిదప్పట పాడిగా దనెడు సూక్తి
ధరణినాథుడవై యుండి మరచినావు. 132

తే. గాధిసూతికి మూడులోకములయందు
సాధ్య మైనది లేదన్న సత్యమీవు
విస్మరించుట నారసి విస్మయమ్ము
జెందితిని గాన వినుము నే జెప్పమాట. 133

తే సవనమున కడ్డు తగులు నిశాచరులను
చిటికెలోపల భస్మము జేయజాలు
శక్తి గలిగియు బ్రహ్మర్షి సకలలోక
ములకు రాముని శౌర్యమ్ము దెలుప దలచి. 134

తే. స్వయముగా వచ్చి నీ సుతున్ పంపు మనియె
నది గ్రహింపక నట్టింటి కరుగుదెంచి
నట్టి వరమును త్రోసి రాజనుట తగునె?
అడ్డు జెప్పక మునివెంట నంపు మతని. 135

క. కులగురువు ముందుచూపున
బలికిన హితవచనములను పంక్తిరథుండున్
తలదాలిచి రాముని ముని
తిలకునితో బంప సమ్మతించెను ప్రీతిన్. 136

ఉ. అంత వసిష్ఠమౌని దరహాసము మోమున జాలువారగా
చెంతనె నిల్చియున్న ప్రియశిష్యుని గన్గొని నీవు వెంటనే
యంతిపురమ్ము జేరి క్షణమైనను జాగొనరించకుండ ధీ
మంతుల రామలక్ష్మణుల మాకడకున్ గొనితెమ్ము పొమ్మనెన్. 137

తే. కౌశికుం డంత శాంతించి క్ష్మాతలేంద్ర!
నీవు నిశ్చింత నుండుము నేను రామ
లక్ష్మణుల వెంట గొనిపోయి రాక్షసులను
నిలువునన్ గూల్చు శక్తుల నిడెద ననియె. 138

తే. అంతలోపల తల్లుల యాశిషమ్ము
లందుకొని రామలక్ష్మణు లరుగుదెంచి
తొలుత తండ్రికి ఆవల కులగురునకు
నవల బ్రహ్మర్షికిని మ్రొక్కి రమితభక్తి. 139

తే. ధరణిపతి కూర్మి తనయుని దాశరథిని
దగ్గరకు బిల్చి శిరము ముద్దాడియాడి
బ్రహ్మఋషివర్య ! మీయదే భారమింక !
ననుచు రాముని మునిచేతి కప్పగించె. 140

తే లక్ష్మణుడు వెంటనే యన్న ప్రక్క నిలిచె
మంచిదని వసిష్ఠుడు శుభమంచు బలికె
సదనమంతట పుష్పవర్షమ్ము గురిసె
తనువు పులకించి రాముని ధనువు మురిసె. 141

తే. కౌశికుని వెంట రామలక్ష్మణుల జంట
బయలుదేరెను కన్నుల పంటయగుచు
క్షితితలేంద్రుడు చనుచున్న సుతులపైన
మౌనముగ దీవెన కనులతోనె చల్లె. 142

ఆ. శివుని వెంట నగ్ని శిఖలట్లు మునివెంట
రాకుమారు లిద్ద రరిగి యరిగి
శ్రమ యొకింత గనక సరయూనదీతీర
మునకు జేరి రమితమోద మలర. 143

ఉ. అప్పడు గాధిసూతి ప్రియమారగ బల్కెను రామ! వాహినిన్
చప్పన నాచమించి జలజాప్తున కర్ఘ్యము సల్పి రమ్ము, నే
నిప్పడు రెండు మంత్రముల నీ కుపదేశము జేతు, అవ్వి ని
న్నెప్పడు గాచియుండు భువి నెల్ల శుభమ్ములు నీకు చేకురున్. 144

క. అని గురుదేవుడు తెలిపిన
వెనువెంటనె రాము డరిగి విధు లన్నింటిన్
దినకరు నాత్మ దలంచుచు
క్షణమున ముగియించి మౌనికడ కేతెంచెన్. 145

తే. బ్రహ్మఋషియంత బల, అతిబలయు ననెడు
దివ్యమంత్ర ద్వయము నుపదేశ మొసగి
వీని స్మరియింప, నీ కెల్లవేళలందు
నలసటయు క్షుత్పిపాసలు నంటకుండు 146

తే. అంతియేగాక శౌర్య ధైర్యమ్ములందు
భుజబలమునందు యుద్ధనైపుణ్యమందు
నిన్ను మించిన యోధు డీనిఖిల జగతి
యందు మరి యొకడుండ బోడని వచించె. 147

తే. అంత నాయన్నదమ్ములు సంతసమున
మునివరేణ్యున కుపచారములను సలిపి
గురునితో గూడి యా రాత్రి గరికసెజ్జ
పైన బవళించినా రిరు ప్రక్కలందు. 148

క. మరుసటి దినమున కౌశికు
డరుణోదయమునకు ముందె యలవాటుగ, ని
ద్దురలేచి రాకుమారుల
నరసి ముదిన్ మురిసి యిట్టు లనె మెలమెల్లన్. 149

తే. నాయనా! రామ! తొలిసందె నడచుచున్న
దడవి సైతము మేల్కొన్న దాహ్నికములు
స్నాన సంధ్యాది కృత్యముల్ సలుపవలయు
లెమ్ము! వేళాయె నని నిద్రలేపె మౌని 150

తే. అంత నా రామలక్ష్మణు లమిత శ్రద్ధ
నుదయకృత్యాలు ముగియించి యురికి వచ్చి
గురువు పాదమ్ములకు మ్రొక్కి పరమమౌని
వెనుక నడచిరి భక్తియు వినయ మెనయ. 151

తే. అటుల ముప్పురు చాల దవ్వరిగి యరిగి
గంగయును సరయూనది సంగమించు
నట్టి పుణ్యస్థలిని జేరి యచట రాత్రి
యతివతంసుల యాతిథ్య మందుకొనిరి. 152

తే. ప్రొద్దుపొడుపున లేచి ఆ పుణ్యనదిని
దాటి ముప్పురు బిరబిర దక్షిణముగ
నడచి యొకచోట ఘోరకాననములోన
నడుగుమోపిరి యిసుమంత అలుపులేక. 153

తే. ఆ మహారణ్యమును గని రామభద్రు
డబ్బురము నంది గురుదేవ! అతిభయంక
రముగ గన్పట్టుచున్నదీ ప్రాంతమంత
మానవుం డెవ్వడును చొరరాని పగిది. 154

తే. అనుచు వచియించె నంతలో ఆకసమ్ము
బ్రద్దలౌనంత భీకరారావ మొకటి
క్రూరమృగరాజముల పెనుగుండె లదుర
దిక్కు లన్నిటియందు ప్రతిధ్వనించె. 155

తే. ఆ యరుపు పూర్వ మెరిగిన దగుట వలన
మునివరేణ్యుడు రాముని మోము జూచి
కామరూపిణి తాటక నామధేయ
యైన యక్షిణి అరుపది యనుచు దెలిపె 156

తే కలదు దానికి నొకవేయి కరుల బలము
కొడుకు మారీచుతో గూడి అడవివెంట
జనెడు మనుజుల నవలీల జంపితినుట
నిత్యకృత్యము దాని కీ నెలవు నందు. 157

క. ఆ నరఘాతుకురాలిని
కానన మానంద మొంద కర్కశముగ నీ
వే నిర్జింపగ వలయును
మానిని యను భావమింత మది నిడకుండన్. 158

తే అనిన గురుదేవునకు రాము డంజలించి
జనకు నానతిమేర నిస్సంశయముగ
తమ మహాదేశమును నేను తలను దాల్చి
గ్రక్కున నొనర్తు నెట్టి తర్కమ్ములేక. 159

తే. తాపసోత్తమ! లోక హితమ్ముగోరి
దుష్ట యక్షిణి తాటకన్ ద్రుంతు నిపుడె
యనుచు మిక్కిలి గాంభీర్య మెనయ బలికి
అర్కకులభూషణుడు ధను వందుకొనియె. 160

తే. తొట్టతొలుదొల్త విల్లెక్కువెట్టినట్టి
దాశరథి యల్లె త్రాటిని తాపసేంద్రు
డలరునట్టుల దిగ్దంతు లడలు నటుల
గోట మీటెను వనము గగ్గోలు పడగ. 161

తే. ఆ భయంకర రవమున కాగ్రహించి
కడు వికృతరూప పర్వతాకారయైన
పాప తాటక రాముని పారజూచి
పెద్ద పెట్టున నరచి కుప్పించి దూకె. 162

తే. కాని రాముడు కాసంత కలతపడక
ఆపవే యింకచాలు నీ యాగడమ్ము
లనుచు యక్షిణి బాహుద్వయమ్ము నరికె
దివ్యశరములు రెండు సంధించి వదలి. 163

ఉ. అంతట రెచ్చిపోయి దనుజాంగన మాటికి హుంకరించుచున్
గంతులు వేయుచున్ చెలగి కన్నుల నగ్ని కణాలు రాల్చుచున్
పంతముతోడ రాఘవుని పై కొనజూచి, ఫలంబులేమిచే
చింతిలుచున్ స్వరూపమును శీఘ్రమె మార్చదలంచె నంతలోన్. 164

తే రాఘవా! సాంధ్యకాలాన రాక్షసులకు
బలము పెరుగును కాన నా భ్రష్ట నిపుడె
జాగుసేయక నిర్దయన్ సంహరింపు
మని వచించెను దృఢముగా మునివరుండు. 165

తే. గురుని యానతి తలదాల్చి త్వరితగతిని
కఠిన తరమైన దాని వక్షస్థలమ్ము
లక్ష్యముగ జేసి బాణ వర్షమ్ముతోడ
తాటకను రామభద్రుండు ధరణి గూల్చె. 166

తే. అంత మునికుంజరుడు కడు సంతసమున
రఘుకులోత్తము గొనియాడి రాత్రి కిచట
హాయిగా విశ్రమించి రే పరుగు టొప్ప
ననుచు దెలిపెను కానన మ్మలరునటుల. 167



క. మరునాడు వేగుజామున
పరమమునీంద్రుండు లేచి భాసురగుణశీ
లుర ప్రియతమ శిష్యుల, ని
ద్దుర లేపెను తల్లివోలె తూరుపు మురియన్. 168

తే. అంత ముగ్గురు స్నాన సంధ్యాదికములు
పూర్తి గావించి రాపైన మునివరుండు
రిపుల నవలీలగా సంహరించజాలు
నస్త్రముల రామచంద్రున కపుడు దెలిపె. 169

తే. రాము డంత నా దివ్యమంత్రముల జపము
సలిపె వెంటనె యస్త్రముల్ నిలిచె నెదుట
వాని గైకొని మీరు నా మానసమున
నెపుడు నివసించు డని తెల్పి యినకులుండు. 170

తే. వినయ మేపార మునికుంజరునకు మ్రొక్కి
స్వామి! దివ్యాస్త్రముల నుపసంహరించు
నట్టి మంత్రము గూడ నా కాదరమున
నిపుడె బోధింపు డంచు బ్రార్థించె నంత 171

ఆ భూరిగుణుడు రాము దూరదృష్టికి మెచ్చి
మౌనివర్యుడతని మాట దీర్చె;
అంత కొంత దూర మరిగి యా ముగ్గురు
నడుగు మోపి రొక్కయాశ్రమమున. 172

క. అదియే విశ్వామిత్రుని
సదన మ్మట నున్న సాధు జనులందరు, స
మ్ముదితాత్ములై యతీంద్రుని
పదముల కిడి రెన్నొ నతుల బహుమతు లెలమిన్. 173

తే గాధి తనయుడు రామలక్ష్మణుల నచటి
యతివరేణ్యులకు పరిచయమ్ము జేసి
యాగసంరక్షణార్థమై యరుగుదెంచి
నట్టి క్షత్రియపుత్రు లటంచు వెలిపె. 174

క. ఆ తాపసాశ్రమమ్మున
నాతిథ్యము స్వీకరించి యువనీంద్రసుతుల్
చేతోమోదము గని సం
ప్రీతిమెయిన్ పలికి రిట్లు ఋషితిలకునితోన్. 175

క. గురుదేవ! మేము సిద్ధము
త్వరగా వ్రతదీక్షగొనుడు దనుజాధములన్
పరిమార్చి యాగరక్షణ
నిరతిన్ గావింతు మనిరి నిర్ద్వంద్వముగాన్. 176

తే. శిష్యులా రీతి బలుక ఋషీశ్వరుండు
వెంటనే యజ్ఞ దీక్షను స్వీకరించె;
రామలక్ష్మణు లిద్దరా రాత్రియంత
జాగరూకత గడపిరి వేగు లట్లు. 177

తే. అంత మునులంత వారల నభినుతించి
ఆరు దినములు జరుగునీ యధ్వరమ్ము
అసుర కృత్యమ్ములకు నొకయదను లేదు
ఏ నిముస మేమి చేతురో యెరుగరాదు. 178

తే. కనుక మీ యిద్దరే యొక్క క్షణము గూడ
తెప్పవాల్చక బాణము లెక్కువెట్టి
అప్రమత్తతతో నుండు టవసరమ్మ
టనుచు దెలిపిరి రామలక్ష్మణులతోడ. 179

తే. అంత నా సోదరద్వయ మ్మయిదునాళ్ళు
నిద్రకన్నెరుగక యహర్నిశలు కాచి
రధ్వరమ్మును గురుదేవు డబ్బురపడ
భక్తి శ్రద్ధలతో యతీశ్వరులు మెచ్చ. 180

ఉ. ఆరవనాడు యజ్ఞవిధు లన్ని యథావిధి సాగుచుండగా
ఘోరభయంకరధ్వనులు కొండలు కోనలు దద్దరిల్లు, న
ట్లూరక మారుమ్రోగె; నపు డుద్ధత రీతిని వహ్నికీలికల్
బారులు దీరి క్రమ్ముకొనె భగ్గున మండె యతీంద్రచిత్తముల్. 181

ఉ. రాచకుమారు లిద్ద రది రాక్షసకృత్యముగా దలంచియున్
పూచికపుల్లయెత్తు భయ మొందక ధీరత నిల్చి రంతలో
వీచెను హోరుగాలి కురిపించిరి యాగమహాగ్ని యందు మా
రీచ సుబాహు లిద్దరును ప్రేళ్ళమిడి నెత్తురు కుండ పోతగన్. 182

తే. కాని రాముని కనుల తీక్ష్ణతకు వెరచి
యజ్ఞకుండాన వాలు ధైర్యమ్ములేక
నెత్తు రాచుట్టుప్రక్కలనేల రాలె
క్రూరదనుజుల మద మెల్ల కుప్పగూలె. 183

ఆ. ఆ విచిత్ర మరసి ఆ రాక్షస ద్వయ
మాకసమ్ము బెదర నార్భటించె।
నంత రామభద్రు డా దుష్టులను జూచి
కనలి మానవాస్త్రమును గ్రహించి. 184

ఆ. మారుమాట లేక మారీచు వక్షఃస్థ
లమ్ము దాకునట్లు లాగి వదలె
నా మహాస్త్రధాటి కాతడు శతయోజ
నములు దాటి జలధి నడుమ బడియె. 185

క. తత్క్షణ మాగ్నేయాస్త్ర
మ్మక్షీణబలుండు రాము డతిక్రుద్ధుండై
రాక్షసవీరు సుబాహువు
వక్షము లక్ష్యమ్ముజేసి వదలెను పెలుచన్. 186

క. వాడాదెబ్బకు రక్త
మ్మోడుచు పర్వతములీల నుర్విం గూలెన్
తోడుగ వచ్చిన రక్కసు
లేడిచి రిక మాకు దారి యేది యటంచున్. 187

తే. ఇనకులేశుడు హతశేషగణము నరసి
పాపకర్ముల నొక్కడు బ్రతికియున్న
శాంతి నశియించు నీయజ్ఞశాలయంద
టంచు నొక బాణమున వారి నవని గూల్చె. 188

తే. రామచంద్రుని శౌర్యధైర్యముల నరసి
సాధుపుంగవు లాశ్చర్య చకితులైరి
యెల్లదెసల ప్రశాంతత వెల్లివిరిసె
క్రమపథమ్మున మౌనీంద్రు క్రతువు ముగిసె 189

తే. కౌశికుడు మేరమీరిన కౌతుకమున
గాఢముగ రామచంద్రుని కౌగిలించి
ఇనకులోత్తమ! నిన్ను శిష్యునిగ బడసి
నే కృతార్థుడ నైతిని నిశ్చయముగ. 190

క. అని యన్న నభినుతించిన
మునిసింహునిపాదములకు ముందుగ మ్రొక్కెన్
అనుజుడు, పిమ్మట రాముడు
తన నతులను మూటగట్టి తాపసి కొసగెన్. 191

తే. అంత మునులంత స్తోత్రవాక్యాలవిరులు
సంతసమ్మున రామలక్ష్మణులపైన
జల్లి రా జల్లులో నిలువెల్లదడిసి
ముద్దలుగ నూరిపోయిరా యిద్ద రపుడు. 192

ఆ. అంతుపొంతులేని యానందమున రాత్రి
అన్నదమ్ము లిద్ద రాశ్రమమున
యతిగణమ్ము నడుమ హాయిగా నిదురించి
రారునాళ్ల శ్రమము తీరిపోవ. 193

ఆ. తెల్లవారిలేచి తీరుబడిగ స్నాన
సంధ్యలెల్ల శాస్త్రసమ్మతముగ
సలిపి గురునిజేరి సాష్టాంగవందన
మాచరించి నిలిచి రానకొరకు. 194

తే. కరములను మోడ్చి యెదుట కింకరుల వోలె
నిలిచియున్నట్టి రాకుమారులను గాంచి
గాధిరాట్పూతి యీనాడె కదలవలయు
మనము మిథిలానగరమున కని వచించి. 195

తే. జనకరాజేంద్రు డనుపమసవన మొండు
జరుపుచున్నాడు దానికే నరుగవలయు;
రండు మీరును వెంట విరాజమాన
మైన నూరేళ్ల శుభము మీకబ్బు నచట. 196

తే. అంతియే కాదు మిథిలయం దద్భుతమ్ము
దైవదత్తమునగు నొక్కధనువు కలదు।
దాని సంధింప నెంచి యుద్దండులైన
వీరు లెందరో పలుమార్లు విఫలులైరి. 197

తే. ఆ ధనుస్సును రామ! నీ వరయ వలయు
ననుచు వాకొని కౌశికు డాశ్రమమ్ము
వీడి శిష్యులతో గూడి వెడలె నపుడె।
యతులు కొందరు కడుభక్తి ననుసరింప. 198

తే. దారి పొడవున నతిథిసత్కారములను
స్వీకరించుచు శిష్యుల వీను లలర
స్థలమహత్త్వము లందందు దెలిపియటులె
చాల దవ్వేగె ముని అనుచరులతోడ. 199

తే. అంతలో మిథిలాపురి కనతిదూర
మందు కన్పించె సువిశాలమైన వనము
బ్రతికి చెడినట్టులున్నదీ ప్రాంతమెందు
కని కుతూహలమున రాము డడిగె గురుని. 200

తే. పరమ ముని యంత శిష్యుని వంక జూచి
దాశరథి! పూర్వమిద్ది గౌతముని వనము;
ఆత డిచ్చోట పత్ని యహల్యతోడ
ధర్మదీక్షను పెక్కేండ్లు తప మొనర్చె. 201

తే. అంత నొకనాడు గౌతము డాశ్రమమున
లేనితరి దేవనాథుడు మౌనివేష
మందువచ్చి అహల్య! నీ పొందు గోరి
వచ్చితి నటంచు బల్కెను వలపుమీర. 202

తే. అతడు తన భర్త కా డింద్రు డని యెరిగియు
బుద్ధి చలియించి వాని ప్రసిద్ధినెంచి
రమ్ము! సురసార్వభౌమ! నీ రాకవలన
మనసు గతిదప్పె నిక మారు మాటలేల? 203

తే. అనుచు చేసాచి మునిపత్ని యమరవిభుని
స్వాగతించెను వెంటనే వాసవుండు
తనివి దీరగ నామె సౌందర్య మెల్ల
కొల్లగొనె నహల్యయు మది నుల్లసిల్లె. 204

తే. కాని యా వెన్క తనతప్పు కనులముందు
నిలిచి ప్రశ్నింప నా కాంత కలవరమున
చేయరానట్టి తప్పు చేసితిమి మనము
కనుక నమరేంద్ర! దయయుంచి కదలు మిపుడె. 205

తే. ఆలసించిన నా భర్త అరుగుదెంచు
ననుచు బతిమాలి దేవేంద్రు నచటినుండి
పంపె నంతట నా శచీవల్లభుండు
వెనుకజూడక అటనుండి వెడలిపోయె. 206

తే. అడుగు తడబడ తలవంచి యరుగుచున్న
అమర విభునకు మార్గమధ్యమ్మునందు
తాన మొనరించి వచ్చు గౌతమమహర్షి
కమలసంభవ తేజుడై కంటబడియె. 207

తే. ఆ తపోబల సంపన్ను నరసినంత
దోషియగు వాసవుని గుండె దుర్బలమయి
పాపభీతిని గడగడ వణకదొడగె।
నతని దుశ్చేష్ట గోచర మ్మాయె మునికి. 208

ఉ. అంత మునీంద్రు డింద్రుగని యాగ్రహ మాకసమంట దుర్మతీ!
యెంతటి ఘోరకృత్యమున కీవు గడంగితి వోరి ద్రోహి ! నీ
యంతటి పాపి ముజ్జగములందున వేరొక డుండ బోడు నా
స్వాంతము బ్రద్దలాయె నపచారము సైపను నీచవర్తనా ! 209

ఉ. కండలుపెంచి కామమున కన్నులు గానక యాశ్రమాన నే
నుండని వేళ జూచి చని యొంటిగనున్న మదీయపత్నితో
దుండగముం బొనర్చి కడుద్రోహము నా కొనరించినట్టి నీ
యండము లూడి క్రిందబడునంచు శపించె యతీంద్రు డుగ్రుడై.

ఆ. అట్టి ఘోరశాప మమరేంద్రున కొసంగి
సంయమీంద్రు డింత శాంతి గనక
బుసలు కొట్టు కోపమును వెంటబెట్టుక
అరిగె నాశ్రమమున కతిరయమున. 211

ఆ. ఆశ్రమమ్ములోని కడుగిడినంతనే
ఓసిపాపి! యెక్క డుంటివీవు।
మునికులమ్ము పరువు మున్నీటముంచిన
నీ ముఖమ్ము చూడ నేర మగును. 212

ఆ. సలిపినట్టియఘము క్షమియింప రానిది
అందువలన జీవితాంత మీవు
ఎవరికంటబడక యిచ్చట గాలినే
యశన మటుల మెసవి మసలుకొనుము. 213

ఆ. అని శపించినట్టి యాత్మేశు వదనమ్ము
నరయుధైర్య మింతయైన లేక
పాదయుగ్మమంటి ప్రార్థించు సాహస
మైన జేయలేక యా యహల్య. 214

తే. దూరమున నిల్చి కన్నుల నీరునింపి
కరములను మోడ్చి శిలలైన కరగునటుల
పొగిలి యేడ్చుచు శాపవిమోచనమ్ము
నైన దెలుపుడు స్వామి యటంచు వేడె. 215

తే. ఆమె రోదన మాలించి యతివరేణ్యు
డాత్మలో కొంత చింతించి యాదరమున
పెక్కుసంవత్సరాల కీదిక్కువెంట
నడచు దశరథరాజేంద్రనందనుండు. 216

ఆ. అతని దివ్యదృష్టి ఆనాడు నీపైన
సోకు నపుడు నీవు శుచి వగుదువు;
పిదప నేను వచ్చి హృదయేశ్వరిగ నిన్ను
స్వీకరింతు నని వచించె మౌని. 217

తే. అటుల గౌతమ మౌనీంద్రు డామెపట్ల
నాదరము కొంత బ్రకటించి యాశ్రమమును
త్వరితగతి వీడి నిశ్చింత తపమొనర్ప
నరిగె తుహిన భూధరశిఖరాగ్రమునకు. 218

తే. అండములు తెగిపోయిన యమరనాథు
డాలసింపక వీతిహోత్రాదిసురల
జేరి త్రిదశులక్షేమమ్ము గోరి వెడలి
గౌతముని తపశ్శక్తి భగ్న మ్మొనర్చి. 219

తే. అతని శాపమ్మునకు గురియైతి నేను
కనుక మీరెల్ల నాపట్ల కనికరించి
వడిగ సఫలుని గావింప వలయు న న్న
టంచు నతిదీనముగ వేడె నంతవారు. 220

తే. అగ్నిదేవునితో గూడి యా క్షణమ్మె
పయనమ్మై యరిగి పితృదేవతల గలసి
అఖిలమును తెల్పి రంత మేషాండములను
వాసవున కమర్చిరి వారు గాసి దొలగ. 221

ఆ. నాటినుండి త్రిదశనాథుడు మేషాండు
డాయె నని వచించె యతివరేణ్యు
డంత పంక్తిరథుని యాత్మజుల్ ముద మొంది
గళము లొకటి జేసి పలికిరిట్లు. 222

చ. జనకుడు గుర్తురానటుల సత్కృపమీరగ మమ్ము జూచి, మా
కనుపమవిద్యలన్ గరపి యస్త్రము లెన్నొ యనుగ్రహించి, యీ
దినము మహర్షి గౌతముని దివ్యకథన్ వినిపించినట్టి యో
మునికులచంద్ర! గైకొనుము పుత్రు లొసంగు నమశ్శతమ్ములన్. 223

క. అని యాసోదరు లిరువురు
తనలో తమ తండ్రి నరసి తన్మయు లౌటన్
గని విశ్వామిత్రుడు తని
సిన మనమున బలికె నిట్లు శిష్యులతోడన్. 224

తే. పతి యొసంగిన తీవ్రశాపమ్ము వలన
సతి యహల్య యామరుసటి క్షణమునుండి
కఠిన నియమాల నెవరికిన్ గానరాక
తపము గావించుచున్నదీ స్థలమునందు. 225

ఆ. ఎపుడు రాము డిచటి కేతెంచు నెప్పడా
నళిననేత్రుదృష్టి నన్ను దాకు
ననుచు వేయికనుల నన్న పానీయాల
జోలిమాని చూచుచున్నదామె. 226

క అని గురుదేవుడు దెలిపిన
వెనువెంటనె రాముకనులు వెదుకదొడంగెన్
మునిపత్నినంత నొకచో
కనుపించిన దామె దివ్యకాంతులతోడన్. 227

ఆ. ఎన్నొయేండ్లనుండి యెంతవారికి గూడ
దుర్నిరీక్ష్యయైన దొడ్డవనిత
తనకు గానుపించె నని రఘురాముడు
మురిసి మరల మరల నరయ దొడగె. 228

తే. దశరథాత్మజు శుభదృష్టి దగులగానె
పాపము నశించి రూపవైభవము కలిగె
నంత రాముడు లక్ష్మణుం డామె నరసి
నతు లొసంగి రహల్య యానంద మొంది. 229

తే. అర్ఘ్యపాద్యము లర్పించి యతిథి పూజ
సలిపె నంతట గౌతమ సంయమీంద్రు
డచటి కేతెంచి యా విశుద్ధాంగి నరసి
చిత్త మలరార భార్యగా స్వీకరించె. 230

తే. పిదప నా మౌనిదంపతుల్ పేర్మిమీర
గాధినందనరామలక్ష్మణుల కెల్ల
సకల మర్యాద లొనరించి సాగనంపి
కలసి నడచిరి తొల్లింటి నిలయమునకు. 231



క. అంతట విశ్వామిత్రుం
డంతేవాసులను యతుల నందర గొని, య
త్యంతరయమ్మున జని చని
సంతసమున మిథిల జేరె జనకుం డలరన్. 232

ఆ. నగరమునకు గాధినందను డేతెంచె
ననిన వార్త దెలిసి జనకనృపతి
తనకులగురువగు శతానందుదోడ్కొని
స్వాగతింప నెదురు జనియె వడిగ. 233

క. తనయాగము దర్శింపగ
జనుదెంచిన కౌశికునకు సాదరముగ వం
దన పూర్వక సత్కారము
లను జనకు డొనర్చె మిగుల రాజస మొప్పన్. 234

క. పిమ్మట మిథిలాధీశుం
డమ్ముని పుంగవుని దశరథాత్మజులను, య
జ్ఞమ్మొనరించెడు తావున
కిమ్ముగ గొనిపోయె నచటి హితవరు లలరన్. 235

తే. అంత వారల కెల్ల సుఖాసనములు
జూపి యాసీనులను జేసి తాపసేంద్ర।
అశ్వినీ దేవతల వోలె యలరుచున్న
యీ కుమారుల వివరమ్ము లెరుగ జెపుడి! 236

చ. అని వినయమ్మునం బలికినట్టి ధరాధిపుగాంచి కౌశికుం
డినకులరత్న మాదశరథేశుని పుత్రులు వీరు, రాజ! నే
నొనరుచుచున్న సత్క్రతువు నుద్ధతి గాచి యహల్య శాపమో
చనమును జేసి గౌతముని సన్నుతులందిన రామలక్ష్మణుల్. 237

క. అని ముని శిష్యుల వివరము
లను జనకున కెరుగ జెప్పి రాజోత్తమ! శ
ర్వుని ధనువును దర్శింపగ
ననువగు నీ సమయ మనుచు నరుదెంచి రనెన్. 238

తే. ఆ మహామౌని పలుకు లహల్యతనయు
డగు శతానందయోగీంద్రు నలరజేసె;
నటులె యా రామలక్ష్మణుల్ హరునివిల్లు
నరయ వచ్చుట మిథిలేశు నలరజేసె. 239

తే. అంత జనకుడు బ్రహ్మర్షి కంజలించి
కౌశికమునీంద్ర! రామలక్ష్మణులు మీర
లరుగుదెంచుట వలన నా యాగమెంతొ
ధన్యతను గాంచె ననె ప్రమోదమ్ముతోడ. 240

క. జనకుని సచ్ఛీలమ్మును
వినయ విధేయతల నరసి విశ్వామిత్రుం
డెనలేని మోద మందెను
చనుదెంచెద మరల ననుచు జనపతి యరిగెన్. 241

తే. కౌశికుడు రాత్రి రామలక్ష్మణులతోడ
విడిది గృహమున హాయిగా విశ్రమించె
నంత మరునాడు మిథిలేశు డరుగుదెంచి
తాపసోత్తమునకు శుభోదయము పలికి. 242

తే. తరతరాలుగ తమయింట వరలుచున్న
హరధనువు పూర్వవృత్తాంతమంత దెలిపి
పురుటి నొప్పలు పడకుండ పుడమితల్లి
కని యొసంగిన వరపుత్రి కథయు దెలిపె. 243

క. మునివర నే నొక సవన
మ్మును సల్ప గడంగి వలయు భూమిని దున్నన్
మన మలరగ నాగటిచా
లున దొరకిన దొక్క శిశువు లోకము మెచ్చన్. 244

క. మునుపటి జన్మల ఫలముగ
ననుజేరిన చిట్టితల్లి నాగృహదీప
మ్మని 'సీత' యనెడు పేరును
జనగణ మలరంగ నిడితి శాస్త్రోక్తముగన్. 245

సీ. ఆనాటినుండి మే మల్లారు ముద్దులన్
ప్రియమార దినిపించి పెంచినాము
రాణివాసము పొంగ రత్న డోలిక నుంచి
ఉయ్యాల జంపాల లూపినాము
మాటి మాటికి ప్రేమ మాధుర్య మంతయు
ప్రతినిత్య మడుగక పంచినాము
వేద వేదాంగాదివిద్యలతో పాటు
పెక్కు శాస్త్రములు నేర్పించినాము

తే. వయసు వికసించి నిండు యౌవనమునందు
నడుగు మోపెను గాన మా యనుగు సుతను
వీర్యశుల్కము చెల్లించు వీరవరున
కిచ్చి కల్యాణ మొనరింప నెంచినాము. 246

ఆ. ఎవడు శివధనుస్సు నెక్కిడునో యట్టి
రాకుమారుకిత్తు నా కుమారి
ననుచు దెలిసి కొనిన యవనీశపుత్రు ల
నేకు లరుగుదెంచి రేక గతిని. 247

తే. కాని వారలలోన నొక్కండుగూడ
ఆ మహాచాప మెక్కిడుటట్టు లుంచి
అంగుళమ్మేని కదలింప నలవిగాక
తిరిగి చని రంద రవమానభరముతోడ. 248

తే. దశరథాత్మజు డాదివ్యధనువు నెక్కు
పెట్టినట్లైన సీతను ప్రీతితోడ
వసుమతియు మీరు మెచ్చంగ వాని కిచ్చి
పెండ్లి జరిపింతు నని పల్కె వినయ మెనయ. 249

తే. అంత బ్రహ్మర్షి ప్రియశిష్యునాననమ్ము
నొక్కపరి జూచి వెంటనే యుర్వినాథ!
వేగ ముక్కంటి ధనువు దెప్పింపు మిటకు
నవలిఘట్టము వీక్షింత మందరమును. 250

తే. అనిన మునియాన మేరకు యవనినాథు
డష్టచక్ర విభూషితమ్మైనపేటి
నరగడియ లోన దెప్పించి యజ్ఞశాల
మధ్యమున నుంచె రాముని మనసు మురియ. 251

ఉ. అప్పుడు గాధినందను డనంత ముదమ్మున రాము జూచి, నీ
కిప్పుడు పెట్టినాడు మిథిలేశ్వరు డొక్క పరీక్ష వేరె నే
జెప్పెడి దేమిలేదు; హరు జిత్తమునం దలపోసి వేగ నా
గొప్ప ధనుస్సు నెక్కిడుటకున్ గమకించు మటంచు వాకొనెన్. 252

తే. దాశరథియంత చేత నా ధనువు నొడిసి
పట్టుకొని యవలీలగా పైకి లేపి
అల్లెత్రాటిని బిగియించి యట్టె లాగె
అంతలో యజ్ఞవాటిక అబ్బురపడ. 253

తే. ఫెళఫెళార్భటు లెనయంగ విరిగె ధనువు
భళిభళీయని శుభమస్తు పలికె గురువు
ప్రీతిమెయి పులకించె భూమాత తనువు
తెలియకయె సీత మోమున మొలిచె నగవు. 254

తే. పర్వతము బ్రద్దలైనట్టి భంగి విల్లు
విరిగిపడి నట్టి ధ్వనిచేత పరమగురుడు
జనకభూపతి రామలక్ష్మణులు దక్క
తక్కు వారెల్ల మూర్ఛిల్లి ధరణి బడిరి. 255

తే. అంత మెరుగని ముదమున నవనినాథు
డంత కౌశిక మౌనికి అంజలించి
సంయమివరేణ్య! రాముని శౌర్యపటిమ
అతుల మాశ్చర్యజనక మత్యద్భుతమ్ము. 256


తే. ముగ్ధమోహన సౌందర్యమూర్తియైన
ధర్మనిరతుని వీరుని దాశరథిని
ధవునిగా బొందు వరము నా తనయ కబ్బె
గాధినందన! మీయనుగ్రహము వలన. 257

ఆ. చిన్ననాటి నుండి శ్రీలక్ష్మి నట్టింట
దిరిగినట్టి లీల బెరిగినట్టి
చిట్టితల్లి సీత శ్రీరాముపత్నియౌ
చున్న దింతకన్న శుభము కలదె? 258

తే. తడ వికేటికి నేడె నే దశరథునకు
మంత్రివర్యులచే వర్తమాన మంపి
సకలబంధుగణమ్ముతో సాగివచ్చు
నటుల జూచెద నని పల్కె నవని విభుడు. 259

తే. అంత బ్రహ్మర్షి మిక్కిలి సంతసమున
రాము డొనరించినట్టి కార్యముల నెల్ల
నొక్కటొకటిగ తెలుపగా నుర్వివిభుడు
హర్షపులకిత గాత్రుడై యంజలించె. 260

క. మునియానతి తలదాలిచి
జనకుం డతిశీఘ్రగతిని సచివోత్తములన్
పనిచె నయోధ్యకు దశరథు
గొని తెచ్చుట కొరకు రాచకొమరులు మెచ్చన్. 261



తే. జనకు డంపిన దూతలు సకలరాజ
లాంఛనమ్ములతో మిథిలానగరము
వీడి సాకేత పురి కతివేగ మరిగి
పంక్తిరథునకు తెలిపిరి ప్రతివిషయము. 262

తే. కౌశికుని వెంట జనినట్టి కన్నబిడ్డ
లినకులము కీర్తి దిక్కుల నినుచునట్టి
అద్భుతావహ విజయాల నాలకించి
కదను త్రొక్కెను దశరథు కడుపుతీపి. 263

తే. ధరణిపతి వెంటనే కులగురువు గలసి
మంతనము లాడి మంత్రి సుమంత్రు బిలిచి
ప్రియకుమారుడు రాముని పెండ్లికుదిరె
నందరము రేపు మిథిలకు నరుగవలయు. 264

తే. రాణులకు ముప్వురకు సకలమ్ము దెలిపి
బంధుమిత్రులగూడి వివాహమునకు
తరలి వెడలెడు నేర్పాటు త్వరితగతిని
జరుగునటు జూడుడని పల్కె ధరణి విభుడు. 265

క. అంత సుమంత్రుడు మిక్కిలి
సంతసమున రాత్రియంత సర్వము తానై
మంతురుల తక్కు ప్రముఖుల
చెంతను గూర్చుండబెట్టి చెప్పెను విధులన్. 266

సీ. రాణులు చీరెలు రత్నభూషణములు
పసుపుకుంకుమ సిద్ధ పరచినారు
మంత్రులు రథముల మదకుంజరమ్ముల
తురగాల నాయత్త పరచినారు
మౌనివరేణ్యులు మంగళ ద్రవ్యాలు
కొరతలేకుండ చేకూర్చినారు
బంధుమిత్రాదు లపారమౌ కానుక
లుచిత రీతిని దెచ్చి యుంచినారు

తే. పంక్తిరథుడంత నన్ని యేర్పాట్ల నరసి
పరమగురునకు వివరమ్ము లెరుక పరచి
మేర మీరిన ముదమున మిథిల కరుగ
బయలుదేరెను చతురంగబలముతోడ. 267

తే. దారిపొడవున పెద్ద ముత్తయిదు వటుల
పెండ్లిసందడి బృందము వెంటనడచి
అలసట యొకింతయును లేక అతిరయమున
చేర్చె నందర మిథిలకు చిరునగవున. 268

తే. వచ్చుచున్నది మగపెళ్లివా రటంచు
జనకరాజేంద్రు డెదురేగి స్వాగతించి
తోడికొనితెచ్చి మిగుల సంతోష మెనయ
నతిథి సత్కారముల నెల్ల నాచరించి. 269

తే. అపరిమిత గౌరవమున వియ్యంకు నరసి
ఇనకుల విభూషణా! పరమేశు కృపను
ప్రేమమయులైన మీతోడ వియ్యమందు
భాగ్య మొనగూడె నేడు మా వంశమునకు. 270

తే. యాగవిధు లన్నియు సమాప్త మగును రేపు
కనుక మీరును గురుదేవు లనుమతింప
రామునకు సీతకును శుభలగ్నమందు
వైభవమ్ముగ జేసెద పరిణయమ్ము. 271

తే. చిత్తగింపుడు నాదొక చిన్న కోర్కె
పెద్దలందరు శుభమన్న పిన్నతనయ
నూర్మిళను లక్ష్మణున కిచ్చి కూర్మి పెళ్లి
చేతు నని మిథిలేశుడు చెప్పె నంత. 272

తే. గాధిసూతి వసిష్ఠుని కలసి కొంత
యోచనము జేసి వెంటనే యుర్వినాథ!
చాల సంతోష మెంతొ ప్రశస్తమైన
మాట దెలిపితి వింత మోమోటపడక. 273

తే. కాని... మామాట సైతము కాదు కూడ
దనక వినవలె నీవు నీయనుజు డిపుడు
కోసల పతికి నలువురు కొమరులన్న
విషయమును మీర లిర్వురు వినియె యుంద్రు. 274

ఆ. శౌర్యపటిమయందు సత్త్వవర్తనమందు
వేదశాస్త్రబహుళ విద్యలందు
ధరణిమెప్ప గొన్న నిరుపమానులు నల్వు
రందు వలన వలదు సందియమ్ము. 275

తే. నాల్గు కల్యాణముల నొక్కనాడె జరుపు
టుచితమని మేము భావించుచున్నకతన
భరతశత్రుఘ్నులకు కుశధ్వజునితనయ
లిద్దరిని జేసికొన నెంచె నినకులపతి. 276

తే. పరమఋషినోట నామాట దొరలగానె
జనకుడును కుశధ్వజుడును క్షణము గూడ
నాలసింపక ముని శతానందుతోడ
సంప్రదించి తెల్పిరి తమ సమ్మతమును. 277

తే. దశరథుండంత మిగుల సంతసమునంది
జనకరాజేంద్ర! యీ శుభదినమునందు
శిష్టతరమైన మీ దూరదృష్టివలన
పావనము లాయె! మన యిరువంగడములు. 278

తే. దశరథుని పల్కులకు కుశధ్వజుడు మురిసి
హిత వచనభూష! మా కొమరిత లిరువురు
మీకు కోడండ్రగుట చేత మేరమీరి
నట్టి గౌరవ మబ్బె నాకని వచించె. 279

తే. పిదప సాకేతనాథుడు విడిది కేగి
కూర్మితనయుల మధ్యలో కొలువుదీరి
అవసరమ్మగు చర్చల నతిముదమున
జరిపి యా రాత్రి కొంత విశ్రాంతినంది. 280

తే. ఉదయమున లేచి శాస్త్రోక్త విధుల నెల్ల
పూర్తి గావించి, విప్రు లుప్పొంగునటుల
కుండహొదుగులు కలిగిన గోగణమ్ము
నవనిపతి దాన మిప్పించె నగణితముగ. 281

తే. నాల్గు పెండ్లిండ్ల కొరకునై నగరమంత
జనకరాజేంద్రు డెనలేని శ్రద్ధతోడ
నమరు లైనను గని యబ్బ మందులీల
నింపు సొంపారగ నలంకరింప జేసె. 282

సీ. పౌరు లందరు నాడు పట్టణమ్మంతయు
తమ యిల్లుగా మది దలచినారు
వృద్ధ దంపతులంత పెండ్లికుమారుల
దైవరూపములుగా దలచినారు

పేరటాం డ్రందరు పెండ్లి కొమార్తెల
తమ పుత్రికల మాడ్కి దలచినారు
బాలబాలిక లంత పరిణయోత్సవమును
తులలేని వేడ్కగా దలచినారు

తే. ఆ విధమ్మున నెనలేని అందములను
మేన గైసేసికొని మిథిలానగరము
వన్నెయును వాసిగల నవవధువు పోలె
శుభముహూర్తమున కెదురు జూచుచుండె. 283

తే. దశరథుండు వసిష్ఠు నాధ్వర్యవమున
రాఘువేంద్రునితో పాటు రాగమొప్ప
భరతలక్ష్మణ శత్రుఘ్నవరులనెల్ల
పెండ్లికొడుకుల జేయించె కనులు చెదర. 284

తే. అచట జనకుని రాజ హర్మ్యమ్మునందు
సీతతోపాటు మాండవిన్ చేరదీసి
నూర్మిళను శ్రుతకీర్తుల నొకటిజేసి
నలుగిడగ తోడి తెచ్చిరి చెలులు వేడ్క. 285

తే. వరుస నలువురు వధువుల స్వర్ణపీఠ
ములను గూర్చుండబెట్టి సమ్ముద మెలర్ప
మేలమాడుచు సంపెగ తైలమంటి
కురులసొబగును పెంచిరా కోమలులకు. 286

ఆ. అంత నలుగుపెట్టి - యభ్యంజనస్నాన
ముల నొనర్పజేసి చెలులు వారి
మేనులెల్ల మురియ మెరుగుల నద్దిరి
పుత్తడికి సుగంధ మత్తినటుల. 287

మంజరి. వెంటనే వారికి పీతాంబరములు
నవనవోన్మేషమౌనగలు నాణెములు
చెన్ను దలిర్పగా చెలికత్తెలంత
ధరియింపజేసి రత్యంతమోదమున
అంత వాల్జడలల్లి - అరవిచ్చినట్టి
సన్నజాజి సుమాలసరములన్ జుట్టి
కనులకాటుకదీర్చి కల్యాణ తిలక
మును మోములన్ దిద్ది మురిపెమ్ము లద్ది

చెక్కిళ్ళ కళబెంచు సిరిచుక్కబెట్టి
రప్పడా నలువురి యంతరంగములు
పులకించె నా శోభ బుగ్గలన్ జేరి
లజ్జగా రూపాంతరమ్ము జెందినది. 288

మత్త. రాచకన్నెల మోములందున లాస్యమాడెడు సిగ్గులన్
జూచి నెచ్చెలు లందరొక్కట సోగకన్నులు ద్రిప్పచున్
దాచుకొండవి శోభనానకు దర్పణమ్ములు కాన, మీ
రాచి తూచియు వాడుకోవలెనంచు బల్కిరి నవ్వుచున్. 289

ఆ. పెండ్లికొమరులైన ప్రియపుత్రులంగూడి
సకలబంధుమిత్రసహితు డగుచు
పంక్తిరథుడు యజ్ఞవాటిక కరుదెంచె
మునివరేణ్యు లెల్ల ముందునడువ. 290

ఆ. అంతలోన పేరటాండ్రు ముత్తయిదువల్
చెలులు వెంటనడువ తలలువంచి
మందగమన లగుచు మంటపమ్మును జేరి
రువిదలెల్ల మెచ్చ నవవధువులు. 291

తే. జనకు డంత వసిష్ఠుని సరస కరిగి
పరమమౌనీంద్ర! యుత్తరఫల్గుణియును
లగ్నమును జేరె కనుక కల్యాణములను
పెద్దలగు మీరు జరిపింప వేడుచుంటి. 292

క. అని మిథిలేశుడు పలికిన
వెనువెంట వసిష్ఠ మౌని విశ్వామిత్రున్
ఘనయశుని శతానందుని
గొని వేదిక కరిగె మిగుల కుతుక మ్మెనయన్. 293

తే. అంత, కళ్యాణవేదిపై అబ్బురముగ
మునివరేణ్యులు ముప్పురు కనకగర్భ
విష్ణు శివమూర్తు లొకచోట వెలసినటుల
కొలువుదీరిరి మంటప మ్మలరులీల. 294

ఉ. అంత వసిష్ఠమౌని ముదమారగ హోమముజేసి, వేగ సి
ద్ధాంత పరమ్ములైన విధు లన్నియు పూర్తి యొనర్చి, జాగు, ర
వ్వంతయు లేక, గౌరి సుతునర్చనయున్ ముగియించి, వేగ సీ
మంతినులార! పెండిలికుమారులనల్వుర దోడి తెండనెన్. 295

ద్వి. మునిమాటమేరకు - ముత్తైదువలును
వన్నెవాసి జెలంగ - వరుల నల్వురను
ముందుగా దోడ్తెచ్చి - ముని కప్పగించి
పెళ్ళికొమార్తెల పిదప గొనితెచ్చి
వేదికన్ గూర్చుండబెట్టినా రంత
సీతమ్మ క్రీగంట శ్రీరాము జూచి
తన యదృష్టమ్మును దలచి యుప్పొంగె!
ప్రక్క చూపులతోనె - తక్కుముప్పురును
వరుసగా కాబోవు వరుల వీక్షించి
కలలు పండెనటంచు కనిరి మోదమును. 296

తే. జనకు డంత శతానందుననుమతిగొని
వీతిహోత్ర సముజ్జ్వల వేదిమీద
పరిసరాలకు మిసమిసల్ పంచుచున్న
సీత కరమును రాముని చేతబెట్టి. 297

తే. రామ! నా వరపుత్రిని, రమణి సీత
నిపుడు నీ చేత బెట్టితి నింక మీద
అర్థమును వాక్కులీల మీ రనవరతము
జంటబాయక ఒక్కరై సాగవలయు. 298

తే. అనుచు శుభకామనలు దెల్పి జనకు డంత
నూర్మిళాలక్ష్మణుల చేతు లొకటిజేసి
భరతుకరమున మాండవి కరమును, శ్రుత
కీర్తికరమును శత్రుఘ్నుకేల నుంచె. 299

సీ. అంత నా మౌనిత్రయమ్ము మంగళవాద్య
నాదాల వేదమంత్రాలు గలిపి
నవవధూవరుల కనంత సౌఖ్యమ్ముల
ననుదిన మొదవున ట్లభిలషించి
ఫాలభాగములందు పసిడి బాసికముల
రాణ యొప్పార నలంకరించి
జిలకర బెల్లము గలిపిన మిశ్రమ
మును శుభమ్మని శిరములను నుంచి

తే. నభము మురియంగ దేవదుందుభులు మ్రోగు
చుండ నాలుగు మంగళసూత్రములను
వరులకరముల కందించి వధువుల గళ
సీమలను గట్టజేసి రాశీర్వదించి. 300



తే. సీతయును రాము డంతట చెలువ మొప్ప
నాణిముత్యాలు దోసిళులందు బట్టి
మరల రాదిట్టియవకాశ మనుచు దలచి
పెదవి దాటెడు నగవుల నదిమిపట్టి. 301

తే. వయసు పులకించునటు తలంబ్రాలు పోసి
కొన దొడంగిరి వానిలో కొన్ని కెంపు
లాయెను! మహేంద్ర నీలములాయె కొన్ని!
దిక్కుదోచక ముత్యాలు తెల్లవోయె. 302

ఉ. తక్కిన మూడు జంటలును తత్తరపా టిసుమంతలేక, బల్
చక్కగ పేరటాండ్రు సరసమ్ముల నాడుచు వేగిరింప, నే
యొక్కరు తీసిపోక పరమోత్సుకతన్ తలబ్రాలతంతు, వే
రెక్కడగాన రానియటు లింపు దలిర్ప ముగించి రంతటన్. 303

ఉ. అప్పటిదాక నాకసమునందు వివాహమనోజ్ఞ దృశ్యముల్
ఱెప్పలు కన్నులున్ మురియు రీతిని జూచుచునున్న దేవతల్
ముప్పిరిగొన్న మోదమున పువ్వులజల్లులు జల్లి దీవెనల్
కుప్పలుగా వధూవరులకున్ చదివించిరి పెండ్లి కాన్కగాన్ 304

తే. అంత నా నాల్గు జంటలు సంతసమున
నిమ్ముళమ్ముగ నగ్నికుండమ్ముచుట్టు
కేలుకే లందుకొని ప్రదక్షిణము జేసి
ప్రణతు లొసగిరి గురుపాదపద్మములకు. 305

తే. గాధినందను డంత నిక్ష్వాకువిభుడు
సుతులతో గూడి యొసగిన నతుల నంది
జనకరాజేశ్వరునకు దీవెనల నొసగి
తరలిచనె వెండికొండకు తప మొనర్ప. 306

తే. సుతులు నలువురు పుట్టిన శుభదినమున
నెంత సంతస మందెనో యినకులేశు
డంతకన్నను ముదమొందె నంతిపురికి
మురిపెమును బెంచు కోడండ్రు దొరికిరంచు. 307

తే. అత్తవారింట సకల భాగ్యమ్ములున్న
మగనిపై తన కెంతటి మమతయున్న
వధువు తొలిసారి పుట్టిల్లు వదలువేళ
నామెకన్నులు చెమరించు నన్న నిజము. 308

తే. అతిగమించగ తరమె? మా కనినరీతి
నీరు నిండిన కనులతో నిలిచియున్న
తనయలను నల్వురను జూచి జనక విభుని
కనులు సైత మొకించుక కలతజెందె. 309

తే. అయిన మిథిలేశు డలజడి నతిగమించి
అందరను పేరు పేరున ననునయించి
చీనిచీనాంబరములు, విశిష్టమైన
వజ్రవైడూర్య భూషణావళుల నొసగి. 310

తే. అరణముగ వేల గోవుల నశ్వములను
స్వర్ణరథముల నేన్నుల సైన్యములను
దాసదాసీజనమ్ములన్ దశరథేశు
డబ్బురమ్మును సంతోష మంద నొసగె. 311

తే. అంత జనకుని వీడ్కోలునంది పంక్తి
రథుడు నవ దంపతులతోడ రాజధాని
కరుగుచుండగ మార్గమధ్యమ్మునందు
దుర్నిమిత్తము లొక కొన్ని తోచె నపుడు. 312

తే. క్ష్మాతలేంద్రుడు మదిలోన భీతినంది
యేమిటీ వైపరీత్యము? స్వామి! తెలుపు
డని వసిష్ఠుని వేడె, నాయతివతంసు
డన్నిదెసలను పరికించి యనియె నిట్లు. 313

ఆ. వలదు భయము ధరణివల్లభ! కొంత బీ
భత్స మొదవు! కాని యుత్సుకతను
పెంచునట్టి శుభము వెంటనే సమకూరు
ననుచు దెలిపె మౌని యంతలోనె. 314

ఆ. గుండె లదరునట్లు - కొండ లూగిసలాడు
నట్లు చెట్లు నేల కంటునట్లు
హోరుగాలివీచె! కారు చీకటి గ్రమ్మె!
గగనమంతధూళి కప్పెనంత 315

సీ. శిరమున నిడుపుగా పెరిగిన జడలకు
దివ్యదీప్తులు ప్రసాదించువాడు!
మధ్యాహ్న మార్తాండ మాయూఖ తీక్ష్ణతన్
కన్నులలో నింపుకొన్నవాడు

కండలు బలిసిన గుండెధైర్యమ్మును
రిపులు భీతిల ప్రదర్శించువాడు
పదతాడన ప్రభావమ్మున పుడమిని
గడగడలాడించు నడకవాడు

తే. పరశువును దివ్యధనువును బాణములును
సహజదర్పము నెలుగెత్తిచాటుచుండ
త్రిపురఘోరాసురుల సంహరింపనరుగు
హరుని విధమున ప్రత్యక్ష మాయె నొకడు. 316

ఆ. వానిచేతనున్న పరశువుం గనుగొని
అతడు పరశురాము డనిగ్రహించి
యతివరేణ్యు లంత నర్ఘ్యపాద్యాదుల
పూజ సల్పి రా తపోధనునకు. 317

ఆ. అయిననతని కన్నులందున బుసకొట్టు
రౌద్ర మరసి మరల రాజవంశ
పతనమునకు చేతపట్టెనో పరశువ
టనుచు మదిని దలచుకొన దొడగిరి. 318

తే. భార్గవుం డంత శ్రీరామభద్రు నరసి
హరుని చాపము నవలీల విరిచినట్టి
ఘనత దక్కించుకొన్న యోకార్యశూర!
అందుకొను మిదె నాయభినందనలను. 319

తే. అనుచు రాముని యొక్కింత యభినుతించి
తనభుజమ్మున వ్రేలాడు ధనువు జూపి
శివధనుస్సమమైన వైష్ణవ ధనువిది
దీని సైతము నీవు సంధింపవలయు. 320

తే. నీబలపరాక్రమమ్ముల నేను గాంచి
తత్క్షణమె నీకు కల్పింతు ద్వంద్వ యుద్ధ
మునకు నరుదైన యవకాశ మని వచించె
నంత రాముడు భార్గవు పంత మెరిగి. 321

తే. జనకు డచ్చోటనున్న కారణముచేత
కోపమును కొంత దిగమ్రింగి తాపసేంద్ర!
పితృవచనపాలనమ్మున విధిగ నిన్నె
అనుసరించెద మనసార ననవరతము. 322

ఆ. కాని నీవు నన్ను కవ్వించినటు విష్ణు
ధనువు నిపుడె యందు కొనుచునుంటి
ననుచు పరశురాము హస్తమందలి చాప
మొడిసిలాగె రాము డుద్యమించి. 323

ఆ. విల్లునట్టివంచి అల్లెత్రాడు బిగించి
చక్కలాగి బాణ మెక్కువెట్టి
పరశురామ! నీవు బ్రాహ్మణుడవు గాన
సాహసించి నిన్ను చంపలేను. 324

ఆ. వేదవేత్తయైన గాధినందనునకు
బంధువగుట నీకు వరమె! కాని
యెక్కువెట్టి నట్టి యీ బాణమును వ్యర్థ
పరుపరాదు కాన పలుకు మిపుడు. 325

ఆ. పాదగమనశక్తిపరిమార్చుమందువో
ఘోరతప మొనర్చి కూర్చుకొనిన
పుణ్యఫలము నెల్ల బోకార్చు మందువో
యీవె తెలుపు మనుచు హెచ్చరించె. 326

ఆ. విష్ణుధనువు నెక్కువెట్టి దేదీప్యమా
నముగ వెలుగుచున్న సమరశూరు
రాము నరయుగోరి బ్రహ్మాదిదేవతల్
వచ్చి రచటి కంత భార్గవుండు. 327

ఆ. నీలమేఘరూప! నీ దివ్యతేజమ్ము
నరసి నాగరువము చెరగిపోయె
పాదగతినికాక ప్రాప్తపుణ్యమ్మును
త్రుంచి నన్ను కనికరించుమంత. 328

ఆ. పోయెదను మహేంద్రభూధరమ్మును జేర
ననుచు వేడె రాము డాక్షణమ్మె
పరశురాముపుణ్యపరిపాకమెల్ల నా
శరముతో హరించి శాంతినందె. 329

ఆ. పరశురాము డంత కరములు ముకుళించి
పలు విధముల రాము బ్రస్తుతించి
క్షణము నిలువకుండ చనె మహేంద్రాద్రికి
పంక్తిరథుని గుండె బరువుతరుగ. 330

ఆ. అంతదనుక తిమిర మావరించినదిక్కు
లెల్ల మురిసి తేట తెల్లమాయె;
సురలు రామభద్రు స్తోత్ర మొనర్చిరి
మునివరేణ్యులెల్ల ముదము గనిరి. 331

తే. పరశురాముని గర్వము భంగపరచి
నట్టి రాముడు తా జేత బట్టి యున్న
ధనువు శరమును వరుణదేవున కొసంగి
వినయ మేపారగా వసిష్ఠునకు మ్రొక్కి. 332

తే. జనకు నారసి, తండ్రి! మీ రనుమతింప,
రాజధానికి చనచతురంగబలము
సిద్ధముగ నున్నదనె నంత క్షితిపతి కడు
కౌతుకమ్మున శ్రీరాము కౌగిలించి. 333

తే. శిరము మూర్కొని మెలమెల్ల కురులు నిమిరి
నాయనా! రామచంద్ర! నా ఆయువందు
సగమునీకిత్తు నీ శుభ సమయమందు
కొనుము! పెక్కేండ్లు ధరనేలు కొనుము తండ్రి ! 334

క. అని దశరథు డనినంతనె
ముని లందరు మేలుమేలు మునుముందది నీ
తనయునకు గొప్ప వరమగు
నని పలికిరి సురలు మురియ నవనీశునితోన్. 335

తే. అంతహర్షాతిశయమున నంద రచటి
నుండి కదలిరి వడిగ నయోధ్యజేర
దూత లావార్త దెచ్చి సాకేతలక్ష్మి
చెవిని బడవైచి రత్యంత శీఘ్రగతిని 336

సీ. కొడుకుల కోడండ్ర గూడి రాజేంద్రుడు
వచ్చుచుండెనటన్న వార్త వినిన
నగరలక్ష్మిమొగమ్ము నందనవన మాయె
కన్నులు వెన్నెల దొన్నె లాయె
క్రొత్తసింగారాలు కోటపై కొలువాయె
ముంగిళ్ల నిండుగా ముగ్గు లాయె
వాడవాడలయందు వేడుకల్ మొదలాయె
సందుగొందులగూడ సందడాయె

తే. రాజసౌధములన్ని విరాజమాన
మైన బహు విధాలంకృతుల్ మేనదాల్చి
కొత్త జంటల కారతు లెత్తు కొరకు
బద్ధకంకణహస్తాల సిద్ధమాయె. 337

తే. పురముఖద్వారమున పౌర ముఖ్యు లెల్ల
వివిధ మంగళ వాద్యాలు వెల్లివిరియ
కొత్తకోడండ్ర హృదయాలు గునిసియాడ
స్వాగతము పల్కి రిక్ష్వాకు వంశజులకు. 338

తే. దశరథుం డంత రాజసౌధమ్ము జేరి
కూర్మికోడండ్ర రాణులకు పరిచయము
జేసి పెండ్లిండ్లనాటి విశేషములను
పొల్లుపోకుండ దెలిపె సంపుల్లమతిని. 339

తే. అంత నానల్వు రత్తల కందరకును
సవినయమ్ముగ పాదాంబుజముల నంటి
ప్రణతు లర్పించి రంతఃపురమ్ము మురియ
దశరథేశుని హృదయ పద్మమ్ము విరియ. 340

తే. ముప్పురత్తలు కోడళ్ల మోములరసి
ముందుగా రూపలావణ్యములకు మురిసి
నలువురను పేరుపేరున పలుకరించి
అమ్మలుగ మారిపోయి రాయత్త లపుడు. 341

తే. అంతనా ప్రాంగణములోని ఆలయముల
కందరను దోడు కొనిపోయి అర్చనలను
పూర్తి జేయించి తామును పూజజేసి
తోషితాంతరంగమ్ముల దోడి తెచ్చి. 342

తే. ప్రభువు ముందుగ క్రొత్త దంపతుల కొరకు
సిద్ధ మొనరించినట్టి విశిష్టమంది
రముల కంపిరి కొమరు లుల్లాస మొంద
పండువీనాడు మనకంచు పొన్పు లలర. 343

ఆ. నాటినుండి రాజనందనుల్ నల్వురు
హిత మెరింగి నడచు సతులతోడ
సకల రాజభోగ సౌఖ్యాల దేలుచు
గార్హపత్య ధర్మకలితులైరి. 344

ఆ. అటుల కొన్ని దినము లరిగిన తరువాత
భరతు నొక్కనాడు దరికి బిలిచి
దశరథుండు నీవు తత్ క్షణమే గిరి
వ్రజపురాన కరుగ వలయు ననియె. 345

శా. నీ మాతామహుడైన కేకయనృపుం డెన్నాళ్ళుగానో నినున్
ప్రేమన్ చూడగ గోరి పుత్రు ననిపెన్ పెండ్లిండ్లనా డంతటన్
నేమారాడక మాటయిచ్చితిని నిన్నీనాడు బంపింతు. నం
చీమధ్యాహ్నము నీవు మాతులునితో నేగంగ నొప్పౌననెన్. 346

తే. భరతు డంతట తల్లులందరను కలసి
ప్రణతు లర్పించి వారి దీవనల నంది
రామునకు వందనము జేసి, ప్రేమ మీర
లక్ష్మణుని కౌగిలించి యెల్లరను వీడి. 347

క. జనకుని యానతిమేరకు
మన మలరెడు లీల మేనమామ యుధాజి
త్తునితో తమ్ముడు శత్రు
ఘ్నునితో వేవేగ జనియె కుతుక మ్మెసగన్. 348

తే. భరత శత్రుఘ్ను లిద్దరు పురమునందు
లేని కొరత యించుక గానరాని రీతి
రామలక్ష్మణు లిర్వురు ప్రేమమీర
సలుపదొడగిరి తల్లిదండ్రులకు సేవ. 349

సీ. రాజ్యపాలనమందు రాముడు తండ్రికి
దొడ్డ చేదోడు వాదోడునాయె
ప్రజల బాగోగులు ప్రతినిత్య మారసి
రాజ్యమంతటికి నారాధ్యు డాయె
మంత్రాంగమందు సుమంత్రుని మెప్పించి
బహుముఖ నుతులకు పాత్రు డాయె
చతురంగ సైన్యాల శౌర్య పరాక్రమ
ములకు సైతము తానె ముకుర మాయె

తే. నన్నిటిని మించి గురువసిష్ఠాది మునుల
దీవెనలు మెండుగా దినదినమునంది
అనతికాలములోనె ఆ యినకులమణి
తండ్రి నన్నింట మించిన తనయు డాయె. 350

తే. అపరిమితమైన బాధ్యత లనవరతము
తనను వెన్నాడుచున్నను దాశరథికి
అంతరంగాన కొలువున్న యనుగుపత్ని
సీతపై ననురాగము చెదరదాయె. 351

తే. ఆమె సమ్మోహనాకార మామె గుణము
ఆమె నడవడి సౌజన్య మంతెకాక
తండ్రి మనసార మెచ్చిన తరుణి యగుట
రామచంద్రున కామెపై ప్రేమమెండు. 352

క. తనకెంతటియనురాగము
జనకాత్మజపైని గలదో? జనకాత్మజకున్
తనపై అంతకు మించిన
అనురాగముగల దటంచు నాత డెరుంగున్. 353

తే. అరమరలులేని ఆ జంటనరసి మురిసి
అమరగణమంత నబ్బురమందుచుండ్రి
అటులె కౌసల్య, దశరథుడంతులేని
కౌతుకమ్మున దినములు గడపుచుండ్రి. 354

ఆ. సీత చెంతనున్న శ్రీరాము హృదయము
వాణిచేతిలోని వీణయౌను
సీత చెంతలేక శ్రీరాము హృదయము
వీణ చేతలేని వాణి యౌను. 355

బాలకాండ సమాప్తము

***

# అయోధ్యాకాండము

ఆ. వరగుణాఢ్యులైన భరతశత్రుఘ్నులు
గణుతి గనిన తాతగారియింట
మాపు రేపు మేనమామ ప్రేమను జుర్రు
కొనుచు నుండి రెట్టి కొరతలేక. 1

తే. అచట నెనలేని సౌఖ్యములందుచున్న
మిత్రబృంద మయోధ్యను మించియున్న
తండ్రి నా యన్నదమ్ము లిద్దరును మదిని
గడియ గడియకు దలచుచు గడపుచుండ్రి. 2

తే. దగ్గరున్నను లేకున్న దశరథుండు
సుతుల నల్వుర సమముగా జూచుచుండు;
కాని... రాముడు జనకుని మానసమున
నర్ధభాగము నొక్కడే యాక్రమించె. 3

తే. అమరవిభునకు తల్లియౌనట్టి భాగ్య
మదితి కబ్బిన యటుల నా కబ్బె రామ
భద్రునకు తల్లియౌనట్టి భాగ్య మనుచు
స్వాంతమున నెంచుచుండు కౌసల్య యెపుడు. 4

సీ. తండ్రి సద్గుణములు తనవెంట పుడమికి
పుట్టుకతోడనే పట్టితెచ్చి
సకల విద్యలయందు సర్వోన్నతమ్మైన
ఘనతర నైపుణ్యమును గడించి
సుజనోత్తములకెల్ల శుశ్రూష యొనరించి
వారి యాచారాల తీరు నెరిగి
జ్ఞానయోగులనుండి గణనీయమగు వేద
విజ్ఞాన సంపత్తి స్వీకరించి

తే. రాచకొమరుడనన్న దర్పమ్ములేక
చెడును దరిదాపులకు గూడ చేరనీక
దయయు ధర్మము రెండు నేత్రమ్ము లట్లు
మదిని దలచుచు రాముడు మసలుచుండె. 5

తే. బుద్ధియందు బృహస్పతి కుద్ది యగుచు
శౌర్యమం దమరేంద్రుని సాటి యగుచు
కాంతియందున నుదయ భాస్కరుడె యగుచు
వరలు జ్యేష్ఠుని గనుగొని పంక్తిరథుడు. 6

తే. మురిసిపోవుట పెద్దయబ్బురము గాదు
కన్నులార్పక మేదినీకాంత గూడ
ఎదురుజూడ దొడంగె నా యినకులమణి
నాథు డగునట్టి మంచిదినమ్ము కొరకు. 7

తే. పంక్తిరథుడును ముదిమి పై బడె నటంచు
రాము డిప్పడు రాజ్యభారము వహింప
నన్ని విధముల నర్హత నందె ననుచు
సచివు లందర బిలిపించి సంప్రదించి. 8

తే. యతివరేణ్యుల హితుల సైన్యాధిపతుల
నాప్తమిత్రులపౌరుల నాదరమున
నొక్కచో జేర్చి సభదీర్చి యుర్వినాథు
డనియె నీరీతి దుందుభి స్వనము తోడ. 9

శా. మా పూర్వుల్ మును కన్న బిడ్డలటు సామాన్య ప్రజానీకమున్
రేపున్ మాపును జూచి రాజ్య మరిదుర్ధేద్యము గావించి నా
రా పుణ్యాత్ముల యున్నతాశయములే యాదర్శసూత్రాలుగా
దీపింపన్ ప్రజ లండగా నిలువ నీ దేశమ్ము పాలించితిన్. 10

ఆ. కాని ముదిమి రాజకార్యనిర్వహణకు
గడియ గూడ తోడు పడుట లేదు;
సడలినట్టి మేను సంపూర్ణ విశ్రాంతి
నభిలషించు చున్న దందువలన. 11

తే. అన్ని యోచించి మీరంద రనుమతింప
జ్యేష్ఠ పుత్రుని పట్టాభిషిక్తు జేసి
యన్ని బాధ్యత లాతని కప్పగించి
కొడుకులో నన్ను నే జూచుకొందు ననియె. 12

తే. ధరణిపతి యట్లు పలికిన మరుక్షణమ్మె
అమ్మహాసభ ముక్తకంఠమ్ముతోడ
యెంతశుభవార్త దెల్పితి రింతకన్న
కోరదగినది లేదేది? కోసలేంద్ర! 13

ఉ. రాముడు ధర్మవర్తనుడు, రాము డకుంఠిత ధైర్యశాలి, శ్రీ
రాముడు నీతికోవిదుడు, రాముడు సత్యపరాక్రముండు మా
రాముని వంటివాడు కనరాడు మరొక్కడు ముజ్జగాల నా
రాముని రాజు జేసి జనరంజక పాలన మిమ్ము మీవలెన్. 14

తే. అటుల సభ గొంతు వినినంత యవనివిభుడు
హర్ష పులకిత గాత్రుడై యాసనమ్ము
డిగ్గి కొంగ్రొత్త సందీప్తి యగ్గలింప
కులగురువు వసిష్ఠుని తోడ బలికె నిట్లు. 15

తే. ఉర్విపై నేను జీవించి యుండగానె
ప్రజలు రాముని ప్రభువుగా పరిగణించి
రింతకన్నను భాగ్యమింకేమి వలయు?
చాలు నీ జన్మకిది చాలు చాలు ననియె. 16

క. అంత వసిష్ఠుడు దశరథు
నాంతర్యము ప్రజలనాడి నారసి తానున్
సంతసమున రామున క
ర్పింతము సింహాసనమును వెంటనె యనియెన్. 17

ఆ. ఇనకులేశు డంత నిది చైత్రమాసము
ప్రకృతి మేనినిండ పచ్చదనము
వెల్లివిరియు కాల మెల్ల శుభమ్ముల
కమిత కుశల మైన దని తలంచి. 18

తే. రామపట్టాభిషేక కార్యమ్ము కొరకు
వలయు నేర్పాట్లు మిక్కిలి త్వరితగతిని
పూర్తియగునట్లు చూడుడు మునివరేణ్య!
యని వసిష్ఠున కెరిగించె నవనివిభుడు. 19

తే. వెంటనే మారుమ్రోగెను వేనవేల
హస్తనాదాలు సాకేత మలరులీల;
మరునిమేషమె మంత్రిసుమంత్రు బిలిచి
దశరథుడు తోడి తెమ్మనె దాశరథిని. 20

క. అంత సుమంత్రుడు రాముని
యంతిపురమ్మునకు పోయి యచ్చట నాథీ
మంతునకు సభను జరిగిన
దంతయు వివరించె మిగుల నానందముతోన్. 21

తే. జ్యేష్ఠుడును సర్వ సద్గుణ శ్రేష్ఠుడైన
దాశరథి వెనువెంటనే తండ్రికడకు
మారుమాటాడకుండ సుమంత్రు గూడి
బయలుదేరెను గుడి కేగు భక్తునివలె. 22

తే. ఉదయభానుడు దివివీడి యుర్వికి దిగి
నడచి తనుజేర వచ్చుచున్నటుల దోచు
కూర్మితనయుడు రాముడు కొల్వుకూట
మందు పదమూని నంతనే యవనివిభుడు. 23

తే. కనక సింహాసనము దిగి కౌగిలించె
రాము డంతట కరకమలములు మోడ్చి
తండ్రి పదపంకజమ్ముల దాకి మ్రొక్కి
వినయమున నిల్చె విశ్వాస మెనయునటుల. 24

తే. దశరథుండంత సుతుని హస్తములు పట్టి
యున్నతాసనమందు గూర్చుండ బెట్టి
ప్రజలు నిను రాజుగా జూడవలె నటంచు
నన్ను మాటికి గోరుచున్నారు తండ్రి! 25

ఆ. నా మనమ్ము కూడ రామరాజ్యమ్మును
కనులకరువు దీర గాంచవలయు
నన్న కాంక్షతోడ నున్నది కావున
నాలసింపదగ దటంచు తలచి. 26

తే. లోకహిత మెంచి పట్టాభిషేకమునకు
నెల్లి శుభలగ్నమును నిర్ణయించినాము;
తండ్రిగా కాక ఒక్కమిత్రమ్ము రీతి
తెలుపుచున్నాడ నాల్గు మాటలను వినుము. 27

సీ. ప్రభువు ముఖ్యమ్ముగా ప్రజల సంక్షేమమే
కలలోన సైతము దలపవలయు
కామక్రోధాదుల నేమాత్రమును జాలి
దలపక ఛీకొట్టి తరుమవలయు
సచివులతో సదా సంప్రదింపు లొనర్చి
వారితోడ్పాటును బడయ వలయు
సర్వకాలముల కోశాగారముల నెల్ల
నొక్కింత తరుగక నుంచవలయు

తే. అన్నిటిని మించి దండనాయకులతోడ
సఖ్యముగనుండి యిసుమంత శత్రుభయము
లేని విధమున జనుల బాలింపవలయు
నని హితవు దెల్పె పుత్రున కవనివిభుడు. 28

ఆ. జనకునోటివెంట జారిన ప్రతిమాట
అడుగకుండ దొరకినట్టి వరమ
టంచు మదిని దలచి యాశీలసంపన్ను
డాసనమ్ము డిగ్గి యనియె నిట్లు. 29

తే. "నిండు సభలోన ప్రభువు నా నెత్తిమీద
నమితభారము మోపె మీయండ చూచి;
వారి యానతి మీకోర్కె మీరలేక
నౌదలను దాల్చితిని భారమంత నేను." 30

తే. అనుచు శ్రీరాముడు వినయ మెనయ బలికి
మరల తండ్రికి భక్తి నమస్కరించి
జయ జయధ్వానముల మధ్య సభను వీడి
మాతృమందిరమును జేరె మరునిముసమె. 31

తే. అప్పటికె ఆమె సుతుని పట్టాభిషేక
వార్త లాలించి యానందబాష్పములను
పూజగది నింద చల్లి యా పూలతోనె
దీక్షగా జనార్దనుని ప్రార్థించుచుండె. 32

తే. ఆమె సరసన లక్ష్మణు డవనిజాత
సతి సుమిత్రయు కూర్చుండి శాంతిజపము
జేయుచుండెడునంతలో జేరె నటకు
నగు మొగమ్మున దశరథనందనుండు. 33

తే. వరకుమారునియడుగు సవ్వడులు వినిన
జనని కౌసల్య యెనలేని సంతసమున
లేచి చేతులు సాచి, "నే వేచియుంటి
నీ శుభంకర దినముకై యిన్నినాళ్ళు. 34

తే. కన్న కలలన్ని నేడు సాకార మాయె
రమ్ము శ్రీరామ! కోసల రాజ్యలక్ష్మి
కోరి వరియించె నిన్ను నా కోర్కెదీర"
ననుచు కౌసల్య ముద్దాడె ననుగుసుతుని. 35

తే. అంత రాముడు తల్లికి యంజలించి
తండ్రి పలుకుల నొక్కటి తప్పకుండ
ఆమె కెరిగించి మిగుల గారాము తోడ
పలికె నీరీతి పసిపిల్లవాని లీల. 36

తే. "అమ్మ! కులగురువు వసిష్ఠునానమేర
నేను నీకోడ లీరాత్రి నిద్రమాని
దీక్షలో నుండవలయును తెల్లవారు
వరకు కావున మాకు దీవనల నిమ్ము." 37

క. అని రాము డనిన వెంటనె
జనకజ తనయత్తగారి చరణయుగమ్మున్
వినయమున నంటి మ్రొక్కెను
కని, పూజామందిరమ్ము కడు ముద మొందన్. 38

తే. అంత కౌసల్య వైదేహి నట్టె లేపి
"నిన్ను యువరాజ్ఞిగా రేపు నేను జూతు
నమ్మ! నా బిడ్డచేయి నీ వందుకొనుట
వాస్తవమ్ముగ నా పాలివరము తల్లి!" 39

క. అని సీత నత్త పొగడుట
గని రాముడు మురిసి యోరగంట కులసతిన్
తనివార జూచె నామెయు
మునిపంటను పెదవి నొక్కి మోదము దెలిపెన్. 40

తే. అంత దంపతు లిద్ద రనంతమైన
భక్తితోడ సుమిత్రకు ప్రణతు లొసగి
సజలనయనాల నా మహాసాధ్వియిడిన
యాశిషములను భక్తితో నందుకొనిరి. 41

తే. ప్రక్కనే బంటు పగిదిని చక్కనిలిచి
అంజలి ఘటించి కనురెప్ప లార్పకుండ
తననె వీక్షించు చున్నట్టి తమ్ము నరసి
మురిసి శ్రీరాము డిట్లనె భుజము దట్టి. 42

తే. "లక్ష్మణా! నేటి యీ సంబరమ్మునందు
సగము నీయది - మిగిలిన సగమెనాది!
నాకు కోసల సింహాసనమ్ము కన్న
జోడు బాయక నడచు నీతోడు మిన్న." 43

క. అని కౌసల్యా తనయుం
డనినంత సుమిత్ర సూను"డన్నా! నీవ
ట్లని నన్ను వేరు సేయకు
కనుమా! నీ సేవకునిగ కలకాలమ్మున్." 44

తే. అనిన తనయుని పలుకులు విని సుమిత్ర
మోము వికసించె; రాముని ప్రేమ హెచ్చె
యొకరి కొకరుగ నున్న యిర్వురను చూచి
దేవి కౌసల్యమనము సంతృప్తి నందె. 45

తే. అంత రాముడు వైదేహి అచటినుండి
కదలి మరునాటి ముచ్చటల్ కలసి పంచు
కొనుచు నెదురైన ప్రతివారి ననునయమున
పలకరించుచు నరిగిరి భవనమునకు. 46

తే. అప్పటికె వసిష్ఠమునీంద్రు డచట వేచి
యుండె నుపవాస దీక్ష నిర్వర కొసంగ
రాముడును సీత వారికి ప్రణతు లొసగి
స్వీకరించిరి వ్రతదీక్ష చేత మలర. 47

తే. వార లారాత్రి పాటించ వలసినట్టి
విధులు వివరించి రేపటి వేడుకలకు
సిద్ధపడుడని తెల్పి వసిష్ఠమౌని
యరిగె దశరథ రాజేంద్రునంతిపురికి. 48

సీ. శ్రీరామపట్టాభిషేకము రేపన్న
వార్త అయోధ్యకు పండువాయె।
నగరవీధులు మొత్త మగరుధూపములకు
కమ్మకమ్మని నిలయమ్ములాయె!
కదనుత్రొక్కెడు కౌతుకమ్మున పౌరుల
వీడులు కల్యాణ వేదులాయె!
రామ సంకీర్తనారవము పట్టణమంత
పైరగాలి విధాన ప్రాకిపోయె!

తే. ఆకసమునంత జాబిలి కప్పగించి
మబ్బు లొక్కటి లేకుండ మాయమాయె!
ప్రజలకోలాహలము గాంచి భయము నంది
ఊరువిడనాడె నిద్దుర పారిపోయె. 49

ఉ. ఎప్పుడు తెల్లవారు నిక నెప్పుడు జూతము రామునంచు, రా
దెప్పుడు జీవితాన మన కింతటి భాగ్య మటంచు నిండ్లపై
కప్పల కెక్కి కూర్చొనిరి, కాలిడ వీధుల చోటులేని వా
రప్పుడు జూచె నొక్కదురితాత్మ అయోధ్య వినూత్న రూపమున్. 50

ఉ. పుట్టుకతోడనే భువికి పుట్టె డసూయయను వెంటదెచ్చుకొ
న్నట్టిది, ద్వేష భావమున కద్దము వంటిది, మంచి యన్న దె
ప్పట్టునగూడ గిట్టనిది, పాపభయ మ్మణుమాత్ర మేని లే
నట్టిది, మత్సరమ్ము విడనట్టిది గాంచె జ్వలద్భృగంతయై. 51

క. అది కైకదాసి మంథర
హృదయము చెదపుట్ట దానికెవ్వరి సుఖముల్
మదినొల్ల వెల్లవేళల
వెదకును జగడములు వేయి వీక్షణములతోన్. 52

తే. క్రిక్కిరిసినట్టి ప్రజలు నల్దిక్కు లలర
పెట్టు కేరింతలా దుష్ట విని సహింప
లేక వీనులు మూసి చిర్రెత్తినట్టి
కనుల నగరిని మరి మరి కలయ జూచె. 53

తే. నిండు పున్నమ నాటి వార్నిధి విధాన
పురజనతరంగములతోడ పొంగిపొరలు
నగరశోభను గని, ఈర్ష్య రగులుచుండ
కదలె నటనుండి కైకేయి సదనమునకు. 54

తే. దారి నడుమ కన్పించిన దాసి వలన
వివరముల నెల్ల గ్రహియించి విస్తుపోయి
పరుగుపరుగున గూనిని సరకుగొనక
అరిగి తన రాణి శయనమందిరము జేరి. 55

క. "అమ్మా! కైకా! లేలె
మ్మమ్మా! నిదురెట్టు లబ్బెనమ్మా! నీపై
నమ్మకము ప్రభువునకు లే
దమ్మా! నామాట నమ్ము మమ్మా కొమ్మా! 56

ఆ. మాటవరుసకైన మర్యాద కైనను
చిన్నమాట నీకు జెప్పకుండ
రాజు పెద్దసతిని రాజమాతను జేయ
బూనుకొనుట యెంత మోసమమ్మ! 57

తే. రామచంద్రుడు కోసల రాజ్యమునకు
సార్వభౌముడెయైన కౌసల్య కీవు
దాసివౌదువు నే నట్టి దారుణమును
గాంచి జీవించుటన్నది కల్ల తల్లి!" 58

ఆ. అనుచు తెచ్చిపెట్టుకొనిన కన్నీటితో
పొగిలి పొగిలి యేడ్చె వగలమారి
కాని దానియేడ్పుకన్న, అందలివార్త
కడుముదమ్మునింపె కైకమదిని. 59

తే. వెంటనే పాన్పు దిగి యోసి పిచ్చిదాన
అమిత శుభవార్త దెచ్చితి వందుకొను మ
టంచు నొకమణిహారమ్ము నట్టె విసరె
పాపమంథర కంఠాన బడు విధాన. 60

తే. కాని మంథర దానిని కాలనాగు
పగిది భావించి మెడనుండి పైకి లాగి
చెంతనే యున్న కైకేయి చేతనుంచి
కోపము నటించి మరల వాకొనియె నిట్లు. 61

ఆ. "నాకు కడుపు మండునట్టి వార్తలు నీకు
ముదముగూర్చునెడల బొట్టు విషము
నాల్క దురదదీర నానోటిలో వేసి
సత్వరమ్మె నన్ను చంపు మమ్మ! 62

ఆ. పుట్టినింటినుండి మెట్టినయింటికి
వదలలేక వెంట వచ్చినాను!
నాటినుండి నిన్నె నా దైవముగ నెంచి
చేతనైన సేవ చేసినాను. 63

ఆ. కాని నేడు నన్ను కానిదానిగ జూచి
నేను చెప్పినట్టి నిజములోని
మూల మరయలేక మురియుచుంటివి నీవు
దేవు డొకడె యింక దిక్కునీకు. 64

ఆ. బ్రతికియుండి నీవు పడు బాధలను జూడ
జాలనమ్మ!" యనుచు రాలు గరగు
రీతి నేడ్చుచున్న ప్రియదాసి దుఃఖము
కైక మదిని కొంత కలత నింపె. 65

తే. ప్రభువరేణ్యుని గారాల పత్నియంత
"మంథరా! యేడుపొక్కింత మానివైచి
నాకు రాముని పట్టాభిషేక మెట్లు
బాధలకు కారణమ్మొనో పలుకు" మనియె. 66

ఆ. “అడిగినావుగాన ఆ రహస్యమ్మెల్ల
వీసమంతయైన విడువకుండ
చెప్పచుంటి నిపుడు చెవియొగ్గి వినుమమ్మ!
కన్నకొడుకు బాగు గాంచుమమ్మ. 67

తే. రాజుగా రిన్ని యేండ్లుగా రాత్రి పవలు
పలుకు పలుకున నీ మీద నొలకబోసి
నట్టి ప్రేముడి బూటక మనుచుదేలె!
నిప్పటికినైన నీ కనుల్ విప్పమమ్మ! 68

తే. భరతు నటు తాత యింటికి బంపివైచి
వర్తమానము సైతము పంపకుండ
పట్టమును రామునకు కట్టబెట్టవలసి
నట్టి యవసర మేటికి యవనిపతికి? 69

తే. నీవె యోచించుకొనుమమ్మ! నీ కడుపున
పేగు ద్రెంచుక పుట్టిన బిడ్డకన్న
మిన్నయెట్లౌను ఆ రాము డెన్నటికిని”
అనుచు వచియించె మంథర ఆపకుండ. 70

ఆ. అనగ నగ రాగ మతిశయించినయట్లు
తినగ తినగ వేము తియ్యనైన
మాడ్కి మరల మరల మంథర మాటలు
వినగ వినగ కైక మనసు మారె. 71

ఆ. బుద్ధి భరతువైపు మొగ్గుజూపగ సాగె
కడుపుతీపి చుట్టు గ్రమ్ముకొనియె;
భర్తపట్ల ద్వేషభావమ్ము పొడసూపె
చేతనున్న గొలుసు చెలికి దక్కె. 72

తే. ఆ పయిని కైక పానుపు రూపుమారి
అలుక పాన్పాయె! నగలెల్ల నవనిరాలె
జడను దురిమిన విరులన్ని జారిపడియె
కురులు విచ్చిన ముఖమంత బరచుకొనియె. 73

తే. కైక దారిని బడెనన్న కౌతుకమ్ము
హెచ్చి మంథర హృదయము విచ్చుకొనియె;
జాగుజేసిన ఫలితము జారిపోవు
ననుభయమ్మున మెల్లగా నామె జేరి. 74



తే. "అమ్మ! యిటు జూడుమమ్మ! కైకమ్మతల్లి
మరచిపోయితి నతిముఖ్యమైన మాట
సత్వరమ్ముగ నీకోర్కె సఫలమగుట
కొక్కటేమార్గ"మని చెవి నూదె నేదొ. 75

తే. అంతలో నొక్క చెలికత్తె యరుగుదెంచి
"అమ్మ! అమ్మ! యేలిననా"రటంచు దెలిపె
నంత మంథర దొంగ యట్లడుగు లిడుచు
బైట కరుదెంచి ద్వారమ్ము ప్రక్క నక్కె. 76

తే. ధరణివిభుడంత శచివద్ద కరుగుదెంచు
వాసవువిధాన గంభీరవదను డగుచు
ప్రేమ తొనికిసలాడ దేవీ! యటంచు
వచ్చి చేరెను, ప్రియసతి పడకటిల్లు. 77

తే. అప్పటికె కైక నేలనే అలుక పాన్పు
జేసికొని మాసిపోయిన చీరతోడ
నొక్కనగయైన లేనట్టి యొడలితోడ
లోచన భయంకరముగ బరుండియుండె. 78

తే. మొదటిసారిగ తన రాణి పుడమిమీద
రెమ్మలాకులు లేనట్టి కొమ్మలీల
చలనరహితమ్ముగానున్న చంద మరసి
హాయి చేజారి నిశ్చేష్టు డాయె ప్రభువు. 79

తే. భర్తరాకను గమనించి పగను పెంచి
మోము నటుద్రిప్పి నాగమై బుసలు కొట్టి
మాటిమాటికి నా బ్రతు కేటి కనుచు
కైక సాకేతవిభుని యుత్కంఠ బెంచె. 80

తే. అనుగుసతికోపకారణ మరయలేక
రఘుకులేంద్రుడు కొంత ధైర్యమ్ము జేసి
"దేవి! నీకొక శుభవార్త దెచ్చినాడ!"
ననుచు మెలమెల్ల స్పృశియించె నామె మేను. 81

మత్త. కైక వెంటనె భర్తచేతిని కక్షతో తొలగించి, చీ
కాకునన్ వడిలేచి గద్గదకంఠయై "యిక చాలు నన్
తాకబోకుము నీ మనమ్మున దాచుకొమ్ము శుభమ్ములన్
నాకు చావె శరణ్య మిప్పుడు నన్ను వేచక పొ"మ్మనెన్. 82

ఉ. ఐన నయోధ్యభూపతి రవంతయు నాగ్రహ మొందకుండ, "ఏ
మైనది దేవి! నీకిపు డయారె? శుభమ్మని రాజ్యమంత, మో
దాన మునింగియుండ నిటుతల్లడమందగనేల"యంచు, ఆ
మానిని మానసవ్యథను మాన్పగనెంచి వచించె నిట్టులన్. 83

తే. "తరుణి నీవును నేను సంతసమునెట్లు
పంచుకొందుమొ అట్టులే బాధకూడ
పంచుకొనవలె నిద్దర మంచు దలచి
వేడుచున్నాడ! తెల్పుమా వివరములను. 84

తే. ఏను నీపట్ల కలనైన ఎగ్గుదలచి
యెరుగ నేనాడు మరియొక రెవ్వరైన
నీ మనసుగాయపరచిన నిర్దయముగ
దెలుపు మాపాపి ప్రాణముల్ తీతు నిపుడె. 85

తే. కారణము నీవు ప్రాణమ్ము కన్న మిన్న
నాకు! నీకన్న మిన్న యీ లోకమందు
రాము డొక్కడె" యనుమాట రాజునోట
జారగనె కైక హృదయము జ్వలిత మాయె. 86

ఆ. ధవునిమాట తనకు దావానలముకాగ,
దానినణచిపెట్టి దారిమార్చి
కనుగొలంకులందు కాపురమ్మున్నట్టి
బాష్పములను మీటి పలికె నిట్లు. 87

తే. "నాకు దెలియు మీకు నాపైన గల ప్రేమ
కాని లోకమునకు కన్నుగుట్టు
నట్టు చెప్పవలసినట్టి యగత్యము
నన్ను వెక్కిరించుచున్న"దనియె. 88

ఆ. అంత దశరథుండు కాంతకు తనపైన
కూర్మి తగ్గలేదు కొంచెమైన
యని దలంచి "చెప్పు మగ్నిసాక్షిగ నీదు
కోర్కె దీర్తు నిపుడె? కోమలి!"యనె. 89

ఆ. వీనులలరు మాట విభునినోట వినిన
కైక జాగు గొనక కౌతుకమున
"నగ్నిసాక్షియేల? అందాల రాముని
సాక్షి యనిన చాలు స్వామి"యనుచు. 90

ఆ. చేయిసాచి మగనిచేయి ముందుంచగా
కపట మెరుగలేక క్ష్మావిభుండు
"ప్రాణతుల్యుడైన రాముని సాక్షిగా
చేతు నేడె నీవు చెప్పినట్లు." 91

క. అని కైక హస్తమందున
తన హస్తమునుంచి మాట తప్పనటంచున్
జనపతి పలికిన వెంటనె
వనజదళనయన ముకుళిత వదనము విరిసెన్. 92

తే. వెంటనే కైక క్రీగంట విభుని జూచి
"నాథ! మరచితిరేమొ! ఆనాడు రెండు
వరముల నొసంగి నీకవి వలసినపుడు
కోరుకొమ్మని చెప్పియున్నారు మీరు. 93

తే. ఆ వరమ్ముల నిప్ప డే నడుగుచుంటి
రామునకు మారు భరతు నీ రాజ్యమునకు
పట్టభద్రుని గావింపవలయు స్వామి!
అదియె నేగోరుచున్నట్టి మొదటి వరము. 94

క. ఇక రెండవ వరమందుర
సకలాలంకృతుల వీడి సంయమివలె, తా
నొకపదునాల్గేండ్లు వనము
లకు బోవలె జ్యేష్ఠుడైన రాముం" డనియెన్. 95

తే. స్వప్నమందైన నూహింపజాలనట్టి
వరములను గోరి కైకేయి వసుమతీశు
వృద్ధ హృదయాన నిర్దయన్‌విషము జిలికి
క్షణములో మార్చె కల్లోల సాగరముగ. 96

క. అప్పటి వరకును మాటున
చప్పడు లేకుండ నిలచి జరిగెడు తంతున్
తిప్పలు వాల్చక యెప్పటి
కప్పడు గమనించి దాసి అతిముద మొందెన్. 97

తే. దశరథుని గుండె దడహెచ్చె తనువు వణకె!
కనులనిండుగ తిమిరమ్ము గ్రమ్ము కొనియె!
కైక యురిత్రాడుగా మారి కంఠమునకు
ఉచ్చు బిగియించె నని యెంచి రెచ్చిపోయి. 98

తే. పిచ్చిబట్టిన చందాన భీకరముగ
నంతిపురమంత గడగడ లాడునట్టు
లరచి "దుర్మతీ! యింత దురాశ యెట్లు
కలిగెనే నీకు నీ నాల్క కాలిపోను. 99

తే. ప్రజలచే తాను పూజింపబడుటెగాక
అన్నివేళల కౌసల్య కన్న నిన్ను
మిన్నగా జూచుకొను రాముడన్న నింత
కక్ష నీకేల చెప్పవే కఠిన హృదయ! 100

తే. తోయజాప్తుని గనకుండ తూర్పుకొండ
ఉండగలదేమొ గాని నేనుండగలనె
ప్రాణసముడైన రాముని బాసి క్షణము?
హింస విడనాడి కోరు మేదేని వరము 101

తే. రామపట్టాభిషేక కార్యమ్ములన్ని
పూర్తిజేసె వసిష్ఠు డా పూజనీయు
తోడ నిపుడేమి బల్కగలాడ నేను
సీత కేమని యీ వార్త చెప్పగలను?" 102

తే అనిన దశరథు ధోరణి గనిన కైక
మగడు రామునిపై గల మమతకొలది
ఆడి తప్పెడు మార్గము ననుసరించు
చుండె నని యెంచి వడి బల్కె మండిపడుచు. 103

శా "చాలుంజాలును కట్టిపెట్టుమిక వాచాలత్వమోరాజ! పో
గాల మ్మిప్పుడు దాపురించినది మీ కాకుత్థ్స వంశప్రతి
ష్ఠాలంకారవిభూషితమ్మయిన రాజ్యశ్రీకి నీవల్ల! నిం
కేలా మాటలు రాముపై నిడిన యొట్టేమాయెనో చెప్పమా!" 104

ఆ. అనుచు కైక, దెబ్బ దినిన చిరుతమాడ్కి
రెచ్చిపోయి కొట్టవచ్చినట్టు
లాడినట్టి మాట లాలించి యా వృద్ధ
నేత తూలిపడియె నేలమీద. 105

ఆ. అయిన మగని జూచి యావంతయైనను
కరుగలేదు మనసు కైక కపుడు;
కాని ప్రభువు స్థితిని గాంచి యంతఃపుర
మంతుపొంతులేని చింతనందె. 106



ఆ. వెన్ననొక్కవైపు వేరొకవైపున
రాతినుంచి చేసె ధాత నాతి
ననెడు సత్యసూక్తి కద్దమై నిలిచెను
పంక్తిరథుని కూర్మిపత్ని కైక. 107

తే. చేయునదిలేక ప్రభువంత చిన్నపిల్ల
వానికైవడి యేడ్చుచు భార్య పాద
యుగ్మమును రెండు చేతుల నొడిసిపట్టి
పలికె నీరీతి కంపిత స్వరముతోడ. 108

తే. "మాటయిచ్చితినను ఒక్కమాట కొరకు
జ్యేష్ఠ పుత్రునడవిపాలు జేయు మనుచు
పట్టు బట్టకు దేవి! కావలయునన్న
భరతునకె గట్ట బెట్టెద పట్టమేను." 109

మ. అని రాజేంద్రుడు దర్పమున్ విడిచి యట్లర్థించి వాపోయినన్
కినుకన్ వీడక కైక యాత్మవిభు కన్నీరైన లెక్కించ కో
జననాథాగ్రణి! పుత్రవత్సలుడవై సత్యమ్మునే చంపబూ
నిన నీ భార్యగ నింకనొక్క క్షణమేనిన్ నేను జీవింతునే?" 110

తే. అనుచు కైకేయి సివమెత్తి నట్టు లరచి
యంఘ్రియుగమున వ్రాలియున్నట్టి భర్త
తలను కోపాతిరేకాన దొలగ ద్రోసి
శూలముల వంటి చూపుల జూచె నతని. 111

క. ఆ చూపులు దశరథునకు
కాచిన గునపమ్ములాయె। కడుయత్నముతో
లేచి పదమ్మూన జాలక
"హా! చెనటీ"యంచు మరల నవనిం బడియెన్. 112

తే. అంతలో సుమంత్రు డచటి కరుగుదెంచి
క్షితిని బడియున్న భూపతి స్థితిని జూచి
దిగ్భ్రమము జెంది మిగుల నుద్వేగ మంది
"అమ్మ! కైకేయి! ప్రభువు కేమాయె తల్లి! 113

తే. అట వసిష్ఠుడు రామపట్టాభిషేక
మునకు వలసిన పనులన్ని పూర్తిజేసి
వేచియున్నాడు ప్రభునకు వివరములను
దెలిపి యావలి విధులను సలుపుకొరకు. 114

తే. ఇట్టి శుభవేళ నవనీశు డేలయిట్లు
నేల శయనించి కన్నులనీరు నింపి
మౌనముగ నుండె? హేతు వేదేనియున్న
తప్పగా మదినెంచక చెప్ప" మనియె. 115

తే. అంత కైకేయి "మీకింత చింతవలదు
సుతుని పట్టాభిషేకము శుభముహూర్త
మునకు జరుగునో? జరుగదో యనుచు నిటుల
పలవరించుచు నున్నారు ప్రభువువారు. 116

తే. కనుక వెంటనె శ్రీరాముకడకు నరిగి
అతని మీరిట కంపిన అప్పడన్ని
చక్కబడు" నని మిక్కిలి సవినయముగ
కైక బలికెను లోగుట్టు గప్పిపుచ్చి. 117

తే. ఆమె మాటల ఆంతర్య మరయలేక
మంచిదనితెల్పి వడిగ సుమంత్రు డచటి
నుండి చని రామభద్రుని యునికి జేరి
తెలిపె పినతల్లి దెలిపిన పలుకులెల్ల 118

తే. అంత రాముడు చెంతనున్నట్టి సీత
అనుమతింగొని వేగ లక్ష్మణునితోడ
తాను దైవముగా నెంచు తండ్రినరయ
నరిగె పినతల్లి కైక మందిరము కడకు. 119

తే. అపుడు దశరథు డొక యుచితాసనమున
దిగులుగా గూరుచొని యుండె దీనునట్లు
ప్రక్కనే నిల్చి కైకేయి భర్తనొక్క
కంట, ద్వారమునొక కంట గాంచుచుండె. 120

తే. అంత లోలోని కరుదెంచినట్టి రాము
డమిత భక్తిని తండ్రి పాదములనంటి
మ్రొక్కి పినతల్లి నరసి కైమోడ్పు నొసగి
మరల నిద్దర గనుగొనె! మార్చి మార్చి. 121

తే. వ్యాకులితచిత్తుడై యున్న అవని నాథు
డనుగు సుతుమోము కనులార నరయలేక
మౌనముగ నుండలేక రామా! యటంచు
పలికె తలవంచి గద్గద స్వరము తోడ. 122

ఆ. కాని మనసులోని కల్లోల మంతయు
కైక యెదుట వెడల గ్రక్కలేక
మరల మరల రాము నరసి "రామా! రామ!"
యనుచు మోము ద్రిప్పె నవలివైపు. 123

తే. తండ్రిస్థితి గాంచి రాముడు తల్లడిల్లి
"అమ్మ! సాకేతపురమెల్ల హర్షవార్ధి
దేలి యాడుచునుండ నేడేలతల్లి!
జనకు డీరీతి చింతలో మునిగియుండె. 124

తే. తండ్రి నీయొద్ద నేదియు దాచడమ్మ!
తల్లిగా నీకు నాకడ దాచవలసి
నట్టి దేముండునమ్మ! కాబట్టి నీవు
సంశయింపక చెప్పుము సత్య మిపుడు. 125

తే. ఇతరు లెరుగంగ రాదమ్మ! యింటిగుట్టు
చిక్కు లేవేని యెదురైన చెప్పుమమ్మ!
పరులచెవిదాక పోకుండ వానినెల్ల
పరిహరించెద తండ్రి తాపమ్ముబాయ." 126

క. అని రాము డనిన వెంటనె
అనువగు సమయమ్ము దొరకె నను భావమునన్
జననాథుని క్షణమాత్రము
గని రాముని తోడనిట్లు కైక వచించెన్. 127

క. "రామా! చింతింపంబని
యేమాత్రము లేదు మనకు నినకులపతి, నీ
సేమము నా సంతోషము
కామించుట చేత కొంత కలవరపడియెన్. 128

క. ఆ కలవరమును నీవే
పోకార్చగ వలయు! దాన బొందెద వీవున్
లోకమున నింతవరకే
రాకొమరుడు పొందనట్టి ప్రాశస్త్యమ్మున్. 129

ఆ. తండ్రి మించునట్టి దైవమ్ము లేడని
యాత్మదలచు తనయులందు నీవు
మొదటి వాడ వంచు ముజ్జగమ్ములు నిన్ను
బ్రస్తుతించు నింక ప్రతిదినమ్ము." 130

తే. అనిన పినతల్లి మాటల కర్థమేమి
టనుచు యోచించకుండ నాయినకులమణి
"లోక విఖ్యాతి కోసముగాక నేను
త్యాగ మెంతైన జేతు నా తండ్రికొరకు. 131

ఉ. కావున నేను చేయగల కార్యవిశేషము సత్వరమ్ముగా
నీ వె వచింపుమమ్మ! మదినింతయు సందియ మందకమ్మ! నీ
భావమునాకు దెల్పు మది భవ్యగుణుండగు తండ్రియానగా
భావనజేసి ఆ కమల బాంధవుసాక్షిగ నాచరించెదన్." 132

మ. అని శ్రీరాముడు నొక్కిపల్క మనమం దానంద ముప్పొంగ, నా
యినవంశోత్తము కూర్మిపత్ని "తనయా! యింకేలజాప్యమ్ము, నే
ననిలో పూర్వము ప్రాణనాథునకు సాహాయ్యమ్ము గావింప, నీ
జనకుం డప్డు డొసంగె రెండు వరముల్ సంతృప్తితో నా కటన్. 133

క. ఆ వరము లిపుడు గోరితి
భూవిభుడును వాని దీర్ప మోదము దెలిపెన్
నీ విపుడు తండ్రిమాటకు
జీవము నందించవలయు స్థిరచిత్తుడవై. 134

క. నీ తమ్ముడు గుణగణ్యుడు
నాతనయు డయోధ్యనేల నాకున్ నీకున్
చేతోమోదము గల్గును
క్ష్మాతలనాథునకు గూడ సంతస మొదవున్. 135

క ఇది మొదటి వరమురెండవ
దెదియన నీవీక్షణమ్మె యీ రాజ్యమ్మున్
వదలి జడదారి విధమున
కదలవలెన్ రామభద్ర! కాననములకున్! 136

తే. జీవితమ్మంత అడవుల నీవు గడుప
వలయు నని మది దలపగ వలదు రామ!
ఒక్క పదునాలుగేండ్లట నున్నజాలు
నవల నీయదె యీ రాజ్య" మని వచించె. 137

ఆ. తల్లిగాని తల్లి తనతోడ యుక్తి యు
క్తముగ దెలిపినట్టి కథను రాము
డప్రమత్తు డగుచు నాలించి జనకుని
బాధలోతు లెరిగి పలికె నిట్లు. 138

ఆ. "ఇంతమంచి వార్తనేల నా జనకుడు
చెప్ప సంశయించె జెప్పుమమ్మ!
భరతుకొరకు నేను ధరణి పాలనమును
గడ్డిపరకలీల గొంతునమ్మ!" 139

ఆ. అనుచు ధర్మనిరతుడైన శ్రీరాముడు
చింతసుంతగనక శిరసు వంచి
యెదుట నిలిచినంత, ముదముతో కైకేయి
పలికె నిట్లు రాము బ్రస్తుతించి. 140

తే. "అవని నిక్ష్వాకు వంశజుల్ త్యాగమునకు
నిలువుటద్దములను మాట నేడు నీవు
నాకు చెప్పకయే చెప్పినావు రామ!
ధన్యమైనది నీవల్ల తండ్రిప్రేమ." 141

తే. అనుచు సుతుతోడ మెరమెచ్చులాడుచున్న
కైక హృదయాన బుసకొట్టు కపట మెరిగి
ప్రాణమాత్రావశిష్టుడా పంక్తిరథుడు
రామ రామా యటంచు మూర్ఛను మునింగె. 142

ఉ. అప్పటిదాక కైక వగలన్ని సహించిన లక్ష్మణుండు, మై
నిప్పలు చల్లిచల్లి నవనీతము బూసిన మాడ్కి బల్కు, నా
తప్పల మారియెత్తులను ధ్వంస మొనర్పగ నెంచి క్రుద్ధుడై
చప్పన నన్నవంకగనె! శాంతగుణాఢ్యుడు రాము డంతటన్. 143

తే. "ఆగు! లక్ష్మణ! ఆవేశ మన్నియెడల
నక్కరకు రాదు; తండ్రి వాక్యమ్ము మనకు
సర్వదా శిరోధార్యము; సత్వరమ్మె
ఆచరించుట దప్ప యన్యమ్ము తగదు." 144

ఆ అనుచు కనులతోనె - అనుజన్ము వారించి
జనకునొద్ద కరిగి తనివితీర
నరసి పాదయుగ్మమందు శిరమ్ముంచి
మ్రొక్కి పిదప కైక ముందు నిలిచి. 145

తే. మస్తకము వంచి ముకుళితహస్తు డగుచు
"అమ్మ! కానల కిపుడె నే నరుగుచుంటి;
నాలసింపక భరతు కాహ్వాన మంపి
వేగ నభిషేకమును జరిపింపు మమ్మ! 146

తే. ప్రభువుగా రాజకార్యభారమ్మువలన
జనకుసేవలయెడ నలసత్వ మూన
కుండ కడు శ్రద్ధతో జూచుకొను మటంచు
ననుజునకు నేను దెల్పితి నసుము తల్లి!" 147

ఆ. అని వచించి రాము డంతఃపురము వీడె
రగులు గుండెతోడ లక్ష్మణుండు
మౌనముద్ర దాల్చి మందగమనమున
అన్నయడుగుజాడ లనుసరించె. 148

ఆ. పాదచారియౌచు పట్టణవీథుల
వెంట నడచుచున్న విమలగుణుని
రాము నరసి పౌరు లేమిటీ వైచిత్ర్య
మనుచు కలవరమ్ము నంది రపుడు 149

ఆ. రాము డటులె నడచి ప్రేమధామమ్మైన
జనని సౌధమునకు జనియె నంత
తల్లి యెదురువచ్చి "తనయ! నిన్ రాజుగా
నరయునట్టి గడియ దరిసె తండ్రి!" 150

తే. అనుచు నానంద బాష్పము లనుగు సుతుని
శిరముపై జల్లి ముద్దాడి చెలిని బిలిచి
"పరుగునంబోయి హారతి పళ్ళెరమును
దెమ్ము! దృష్టిదోషమ్మును దీయవలయు." 151

క. అని కౌసల్యాసతి దెలి
పిన మరునిముసమ్ములోనె ప్రియసఖి గొనితె
చ్చిన హారతి వెలుగులలో
తనయుని మో మరసి తల్లి తనివిం జెందెన్. 152

ఆ. అతిశయించినట్టి యానందమున నొక్క
మారు హారతిని కుమారుముందు
ద్రిప్పె! నంతలోనె దిగ్గున చేజారి
పడియె! నేల మీద పళ్ళెరమ్ము. 153

తే. భళ్ళుమని పళ్ళెరము క్రిందబడినతోనె
తల్లికౌసల్యగుండియల్ ఝల్లు మనియె;
నేమిటీయపశకున మం చెరుగలేక
అంతిపురమంత దిగ్భ్రాంతి నలము కొనియె. 154

తే. అంత సౌమిత్రి పెదతల్లి చింత నరసి
"పళ్ళెరముగాదు చేజారి పడిన దిపుడు
భవ్యగుణుడైన నాయన్న బ్రతుకుతల్లి"
యనుచు విలపించె నుద్వేగ మాపలేక. 155

తే. లక్ష్మణుని వేదనం గని రామజనని
కనులు దుఃఖార్ణవములాయె! కంఠము విడి
మాట బైటకు రాదాయె! మనమునందు
భీకరమ్ముగ నలజడి పెరిగిపోయె. 156

తే. అంత సౌమిత్రి యిక తప్ప దని తలంచి
చేదు నిజమును పెదతల్లి చెవిని వేసె:
నశనిపాతముకన్న భయంకరమగు
వార్త విన్నంతనే యామె వసుధబడియె. 157

తే. ఫెళ్ళుమని గాలివానకు వ్రేళ్ళతోడ
నేల కొరిగెడు తరువట్లు తూలిపడిన
అమ్మకరముల శ్రీరాము డట్టెబట్టి
లేపి కన్నీరు దుడిచి యీ రీతి బలికె. 158

తే. "జోలలో ధర్మబోధను మేళవించి
నీవు పాడినపాటలో నీతి కేను
కట్టుబడినాడనమ్మ! కైకమ్మ ముందు
వీరమాతగ నన్ను దీవింపుమమ్మ!" 159

తే. అనుచు నంజలి బద్ధుడై తననె జూచు
చున్న ముద్దుల తనయుని కన్నులందు
వెల్లువెత్తుచు నున్నట్టి వెలుగు నరసి
తల్లికౌసల్య యొక్కింత దర్పమందె. 160

ఆ. కాని యంతలోనె కడుపు తీపిని జంపు
కొనగ లేక మరల గొల్లు మనియె
అమ్మ నిప్పుడెట్టు లనునయించగలాడ
నన్న దిగులు రాము నలము కొనియె 161

తే. కాలహరణ మొనర్చిన కలుగునెన్నొ
ఇడుమలని యెంచి హృదయాన నెగసి పడెడు
బాధ దిగమ్రింగి తల్లిని బారజూచి
యనియె తమ్ముడు సౌమిత్రి వినెడు లీల. 162

తే. "కారణమ్మేదియైన నీకంటినీర
మేను బొడగను శిక్ష నాకిడకు మమ్మ!
పట్టమహిషిగ యీ దేశప్రజలకెల్ల
మాత వీవను సత్యము మరువకమ్మ! 163

తే. అట్టి యున్నత స్థానమందున్న నీవు
పుత్రవాత్సల్యమును సదా పురజనులకు
పంచి నను వారిలో జూచుకొంచు గడపు
మమ్మ! వేరొక వరము ని న్నడుగనమ్మ!" 164

తే. అనుచు ధర్మోపదేశమ్ము నమ్మ కిడిన
అన్నయౌన్నత్య మనుజుని ఆగ్రహమును
బాపి శాంతిని మది నింపె! పరమయోగి
సరణి గన్పట్టె రాముడా సమయమందు. 165

తే. కొడుకు తన నిర్ణయము మార్చుకొనడటన్న
నిర్ణయమునకు వచ్చి కన్నీరు మీటి
తల్లి కౌసల్య రామునితలను నిమిరి
"పోయిరా! తండ్రి! సుఖముగా పురముజేర. 166

ఆ. సప్తసాగరములు సకలలోకమ్ములు
శ్రుతులునాలు గన్ని ఋతువులందు
కాచిబ్రోచుగాక! కాననమ్ముల ని" న్న
టంచు దీవెనలను అందజేసె. 167

తే. దాశరథి యంత జనని సౌధమ్ము వీడి
సీతకీ వార్తనే రీతి జెప్పగల న
టన్న దిగులును బలిమిమై నణచుకొనుచు
త్వరితగతి నేగె సతియున్న భవనమునకు. 168

తే. అపుడు భూగర్భ సంజాత అతివ సీత
తా నయోధ్యకు పట్టపురాణి నౌదు
నన్న మధురోహలందేలి యాడుచుండె
వచ్చు ఉప్పెన నెరుగదా పిచ్చితల్లి. 169

తే. రాము డామెను కదుపు ధైర్యమ్ములేక
చేదు వార్తను తననోట జెప్పలేక
ప్రేమతో జానకీ యని పిలువలేక
రాయిగా మారె వేరు మార్గమ్ములేక. 170

తే. అద్దమందున్న సీతపై యవనిజాత
మొలకనవ్వులు కాసేపు చిలుకరించి
వెనుక నిల్చుండి యూరక తనను జూచు
పతిని ముకురాన గాంచి సంభ్రమమునంది. 171

తే. వడిగ వెన్కకు తిరిగి యవ్వలికి బొండ
టనుచు చెలికత్తెలకు వాలుగనులతోనె
దెలిపి నాథుని బొడగని కలత నంది
యనియె నీరీతి వడిగ నా యవనిజాత 172

తే. "స్వామి! యేమిటి? యీ శుభసమయమందు
కంట నీరేల? చింత ని న్నంటనేల?
త్వరితముగ కారణము దెల్పి వంతబాపు"
డనుచు నతిదీనముగ వేడుకొనియె నంత. 173

తే. తనను దైవమ్ముగా మదిం దలచి కొలుచు
యనుగుసతి కెంతొ యప్రియమైన వార్త
స్వయముగా తానె దెలుపంగ వలసి వచ్చి
నందు కా ధైర్యగుణు డెంతొ యార్తినంది. 174

ఆ. కన్ను లార్పకుండ కల్యాణి జానకి
నరయ దొడగె నామె యాత్మవిభుని
భావమందు మెదలు బాధను పసిగట్టి
యమితనిగ్రహమున ననియె నిట్లు. 175

ఆ. "ఇంతలోనె నాథ! యేమిటీ మారుపు
సంశయింపనేల? సతికి దెలుప
జాగుసేయకుండ సత్యము వచియింపు
మద్ది యెంత ఘోరమైన దైన. 176

తే ఓర్చుకొనగలశక్తి యీ యుర్వితనయ
సీతకున్నది యని వేరె చెప్పవలెనె?
మంచియైనను చెడుగైన మగనిమాట
వేదముగ నెంతు నే నెల్ల వేళలందు." 177

క. అని గంభీరముగా బలి
కిన కూరిమి సతిశిరమ్ము కేల నిమురుచున్
"జనకుని యానతి మేరకు
వనములకే నరుగవలసి వచ్చెను దేవీ! 178

తే. నాకు బదులుగ నొకపదునాలుగేండ్లు
రాజుగా నుండు భరతుడీ రాజ్యమునకు;
ధరణిజా! యిది నాపినతల్లికోర్కె
ఆమె మాటను కాదన నౌనె? మనము. 179

తే. అనిన రాముని సీత కన్నార్పకుండ
నరసిప్రాణేశ! నీవంటి త్యాగధనుని
భర్తగా బొందినట్టి నా భాగ్యమునకు
గర్వపడుచుంటి" నని తెల్పె కరము మోడ్చి. 180

తే. భార్య తన నిర్ణయమ్మును స్వాగతించి
నందు కాధర్మనిరతు డానంద మొంది
"కువలయతనూజ! యిపుడు నా గుండె బరువు
చిన్న పలుకున తొలగ జేసితివి నీవు. 181

తే **ఇంక నిశ్చింత నడవుల కేగువాడ!**
**నని మనోహరు డనగనే యడ్డుదగిలి**
**"అర్థమును వాక్కు వంటి వారాలుమగల**
**టన్న సత్యము మరువకు" డనియె సీత.** 182

ఆ. ఆమె మాటలోని యంతరార్థ మెరింగి
రాము డొక్కక్షణము ప్రానుపడియె;
మగనిమోములోని మార్పును గమనించి
మరల నామెయిట్లు మాటగలిపె. 183

ఆ. "తండ్రిమాట వెంట తనయుడు పయనించు
టొప్ప ననెడు సూక్తి నొప్పకొంటి;
నటులె భర్తబాట యర్ధాంగి కనుసర
ణీయ మనెడు నీతి బాయజాల." 184

తే. అనుచు దృఢముగ వచియించి యవనిజాత
కరము నాత్మేశు ముందుంచె! పరమగుణుడు
దాశరథియొక్క నిముస మర్ధాంగి నరసి
చిర్నగవుతోడ చేతిలో చేయివేసె. 185

తే. తనను వెంటదీసి కొనుపోవుటకు నాథు
డనుమతించె నన్న హర్ష మవని
తనయ మోమునందు తాండవ మాడెను
విభుని మోము గూడ వెల్లివిరిసె. 186

ఉ. అంతకుమున్నె వచ్చి వదినమ్మకు నన్నకుమధ్య, భవ్య భా
స్వంతు కులమ్ముగర్వపడసాగుచు నున్న ప్రధానభాషణా
లెంతయు శ్రద్ధతోడ గమనించిన లక్ష్మణు డిట్లు చెప్పె "ని
శ్చింతగ నేను గూడ వనసీమలకున్ జనుదెంతు నగ్రజా!" 187

తే. రామునకు వామనేత్రము రమణిసీత!
యటులె కుడికన్ను లక్ష్మణు డందువలన
వలదు మా వెంట నీవు రావల దటంచు
బలుక మన మిచ్చగించక పలికె నిట్లు. 188

తే. "అనుగు సోదర! నిన్ను తమ్మునిగ కాక
మనము నిండుగనున్న మిత్రునిగ నెంచి
చెడును మంచిని తర్కించి చిన్నమాట
చెప్పచున్నాడ వినుము నిశ్చింతతోడ. 189

తే. అడవులకు నీవు వచ్చుట యవనిజకును
నాకు సమ్మతమేకాని నగరమందు
ఇద్దరము లేక యున్నచో వృద్ధజనకు
సేవజేసెడి దెవరో? యోచింపు" మనియె. 190

తే. అంత సౌమిత్రి "అన్న! నా కవనిలోన
తల్లియును దండ్రి గురువును దైవ మీవె
అట్టి నీ సేవ కొరకె నేబుట్టినాడ
బాధ్యతను విస్మరించుట భావ్య మగునె? 191

తే. నేను నిను వీడి జీవించలేనటన్న
సత్య మెరిగిన అనుదిన సాక్షి వీవు
కనుక తుదితీర్పు నీయదే" యనుచు బలికి
యగ్రజుని గట్టి పైచె రామానుజుండు. 192

తే. మరది సంకల్ప మెరిగిన ధరణిజాత
యన్న కేనాడు నే మాత్ర మడ్డు జెప్ప
నట్టి తమ్ముని కోర్కె కాదగున యెడల
కలుగు ఫలితము నూహించిపలికె నిటుల. 193

తే. "వినుము లక్ష్మణ! నీవు రామునకు నాకు
పుత్రసముడవు! నోరార ముచ్చటపడి
వెంట వచ్చెద నన నిన్ను వీడి చనుట
కెట్లు మనసొప్పు? మాకు, నీకేల చింత?" 194

తే. వదిన పలుకులు సౌమిత్రి హృదయమంత
తడిసి ముద్దగునంత సంతసము నింపె;
సీతమోమున చిరునవ్వు చెంగలించె
దాశరథియును తలనూపె తమ్ము నరసి 195

శా. సీతారాములు పెద్దలందరి శుభాశీస్సంది సౌమిత్రితో
చేతోమోద మెలర్ప రాజు కడకున్ జేరంగ నచ్చోట, నెం
తో తాపమ్మున నిల్చియుండిన సుమంత్రుం డంతనుద్విగ్నుడై
"రా! తండ్రీ! రఘురామ! భూవిభుడు నీరాకన్ నిరీక్షించెడిన్." 196

ఆ అనుచు బలికి ముప్పురను వెంటగొనిపోయి
రాము బలవరించు ప్రభువునొద్ద
నిలిపి, తట్టి మేలుకొలిపి "మహారాజ!
యరుగుదెంచె రాము" డని వచించె. 197

ఆ మంత్రినోటి వెంట మంచిమాటను విన్న
అవనివిభుడు దిగ్గు రనుచు లేచి
కరములార రాము గౌగిలింపగ బోయి
కాలు నిలుపలేక తూలిపడియె. 198

తే రాముడును సీత వెంటనే ప్రభువు నొడిసి
పట్టి మెలమెల్లగా లేపి ప్రక్కనున్న
యుచిత పీఠమ్ము పైన గూర్చుండబెట్టి
రంత నిట్టూర్చి దశరథు డాత్మజు గని. 199

తే "రామ! యేనాడో నేనొక రాక్షసి కిడి
నట్టి మాట శిలాక్షర మనుచు నెంచి
యడవులకు బోవ సిద్ధమైనావ! తండ్రి!"
యనుచు రోదించె కంటినీ రలయునటుల. 200

క జనకుని యావేదనమును
కని రాముడు మదిని గుంది గంభీరముగా
"వనములకు నే నొకండనె
జనుటకు సమ్మతములేక సదయహృదయులై. 201

క మీ కోడలు, నా తమ్ముడు
నాకట తోడుండ దలచి నా వెనువెంటన్
మీకడకు వచ్చి రిప్పుడు
వ్యాకులతను వీడి వారి కనుమతి నిడుడీ!" 202

క. అని కూరిమి తనయుడు దెలి
పిన వెంటనె దశరథుండు విమలాత్మను, సీ
తను గని "తల్లీ! యిక రా
ముని భారము నీదె" యనుచు పొగిలి వచించెన్ 203

తే. మరల వెంటనె మంత్రి సుమంత్రు నరసి
"రాతి కన్నను కఠినాత్మురాలు కైక
మారదది! రాముడును దారి మార్చుకొనడు
కనుక తలవంచినాడ! నే కాలమునకు. 204

తే. కర్మవశమున నా బిడ్డ కాననముల
సంచరించెడు దుర్గతి సంభవించె;
నంతమాత్రాన కాకూడ దడవిపాలు
వాని సౌఖ్యము! కావున వలసినంత 205

తే. సంపదను సైన్యమును ననుచరుల నొసగి
రాజలాంఛనయుతముగా రథము మీద
ముప్పురను నీవె దోడ్కొని పోవలయు" న
టంచు పంక్తిరథుడు పల్కె నంతలోనె 206

తే. కైక రాక్షసి విధమున కన్ను లురిమి
"మోము నిటుద్రిప్పమయ్యు! ఓ ముసలిరాజ!
బొక్కసములోని ధనము నీ పుత్రు కొసగి
బిచ్చమిత్తువె? ధరను నా బిడ్డకీవు" 207

ఆ. అటుల కైకనోట నతికర్కశమ్మగు
మాట దొర్లగానె మండిపడుచు
"భ్రష్టురాల; నీవు ప్రాణాలతో నుండ
తగ" వటంచు లేచి దశరథుండు. 208

ఆ. సడలినట్టి మేని సత్తువనంతయు
కరమునందు నింపి కైకమీది
కురికి కొట్టబోవ పురుషోత్తముడు రాము
డాపి తండ్రి తోడ ననియె నిట్లు 209

తే. "జనక! నా పినతల్లి వాకొనిన మాట
లందు తప్పేమి? యడవుల కరుగు వారి
కేల సంపద? సైన్యమ్ము లేల? వల్క
లములె మునివృత్తి కనువైన లాంఛనములు." 210

శా. శ్రీరాముం డటు తండ్రితో ననగనే చిత్తమ్మునం బొంగి, యా
నారీ వ్యాఘ్రము కైక వేగజని లోనన్ ముందె సిద్ధమ్ముగా
వేరున్వేరుగ నున్న వల్కలములన్ జీరమ్ముతో దెచ్చి, చే
యూరన్ రాముని కిచ్చె మూడు జత లన్యంబేమి మాటాడకే. 211

తే. అంత రఘురాము డొక జత ననుగు సతికి
తమ్మునకు నొకజత నిచ్చి తక్కుజతను
తాను ధరియించె! సౌమిత్రి తాను గూడ
యన్న జూపిన మార్గము ననుసరించె. 212

తే. కాని పాపము సీతవల్కలము లెపుడు
కనులజూచి యెరుంగని కారణమున
కట్టుకొను రీతి దెలియక కాంతు జూచి
కనులతో దెల్పె! నా చేతగా దటంచు. 213

తే. సురుల కిరవైన యేకాంతమందిరమున
చీని చీనాంబరములను చెలులచేత
మనసు మెచ్చగ గట్టించుకొనెడు సీత
వల్కలము లెట్లు ధరియించు పదుగు రెదుట? 214

తే అనుచు వలవల విలపించె నంతిపురము
తప్పదని రామభద్రుడు తానె చుట్టి
బెట్టి నిల్లాలి యుడుపుల నట్టెయుంచి
సంయమి వసిష్ఠు డట్టి దృశ్యమ్ము నరసి. 215

తే. వ్యాకులత జెంది "శ్రీరామ! యవనిజాత,
మోసగత్తె కైకేయికి దాసిగాదు;
తాను విసరిన వలువలు మేనదాల్చ
రాజ్య మున్నను లేకున్న రాణి యామె." 216

తే. అనుచు దశరథ రాజేంద్రు డలర బలికి
వాడి చూపుల కైకేయి నంక జూచి
"పాతకీ! నార చీరలు సీత కొసగు
నట్టి యధికార మిడెనె? నీ కవనివిభుడు? 217

ఆ. సీత మగనివెంట చీనాంబరములతో
రత్న భూషణాల రాశితోడ
నరుగు కాననముల కట్లుగా దందువా!
నీకు దగిన శాస్తి నేనె చేతు. 218

తే. వివరముల నెల్ల నా నోట విన దలంతు
వేని దెల్పెద, నట్లుగాదేని యిపుడె
సీత యొడలిపై గల నార చీర లీవె
యొలిచి గుట్టుగ నీ యొద్ద నుంచుకొనుము." 219

తే. అని వసిష్ఠుడు తనది రాజాజ్ఞ యనిన
పగిది బలికిన కైక దిగ్భ్రాంతినంది
ఆగ్రహమ్మును దిగమ్రింగి "యమ్మ సీత!
కులగురువు మాట పాటించవలయు మనము." 220

తే. అనుచు తలదించుకొని పోయి అవనితనయ
మేనగల వల్కలములను తానె యొలిచి
చెంతనేయున్న చెలికత్తె చేతి కిచ్చి
రాముమోమైన గనక దూరముగ నరిగె 221

తే. ప్రభువుగా కాక, తానొక పౌరునివలె
దశరథుడు వసిష్ఠ మునికి ధన్యవాద
ములను దెలిపెను వికసితముఖముతోడ
కలకలమ్మున మునిగె కైకమ్మ మేడ 222

తే. అంతలోపల పట్టు పీతాంబరములు
రత్నభూషలుగల పళ్ళెరములతోడ
సతి సుమిత్రయు, రాణి కౌసల్య తక్కు
రాణు లరుదెంచి రచటికి రాజు మురియ 223

తే. తరుణి సీతమ్మ యిద్ద రత్తలను జూచి
మురిసి యెదురేగి భక్తితో మ్రొక్కు లిడియె;
వారు పీతాంబరములు దీవనలు నగలు
కోడలికి నిచ్చి రెనలేని కూర్మితోడ. 224

ఉ. అంత సుమిత్ర లక్ష్మణుని అక్కున జేరిచి "నాయనా! సదా
చెంతనె యుండి రామునకు సీతకు సేవ లొనర్చి, వారికే
చింతయు లేనియట్లు వనసీమలు సైతము మెచ్చునట్లు, నీ
స్వాంతము తప్పపట్టనటు సత్యపథమ్మున సాగగావలెన్. 225

ఉ. అన్నను తండ్రిలీల వదినమ్మను తల్లివిధాన గొల్చి, నీ
కన్నుల కప్రమత్తతను కాపుగ నుంచి అరణ్యవాసమం
దెన్నడు నిద్దురన్ దరికి నించుక యేనియు జేరనీక, ఆ
సన్నుత పుణ్యదంపతుల స్వాంతము టుల్లసిలంగ జేయుమా!" 226

క. వరపుత్రుని గుణగణముల
నెరిగియు తన ధర్మ మనుచు హితవచనము ల
ట్లెరిగించి దీవెనల నిడి
తరుణీరత్నము సుమిత్ర తనిసెను మదిలోన్. 227

ఆ. అంతలో సుమంత్రు డరుదెంచి శ్రీరాము
నరసి రథము సిద్ధ మని వచించె;
దాశరథియు సీత దవ్వున నిలుచుండి
తమ్ము జూచు కైక దరికి నరిగి. 228

తే. ఇరువు రొకమారె మ్రొక్కగా నింతి కైక
క్షేమముగ వెళ్లిరం డని చెప్పకుండ
మంచి దని క్లుప్తముగ నొకమాట మాత్ర
మనియె! లక్ష్మణు డదిగని మండిపడియె. 229

తే కాని శ్రీరాము డిసుమంత కలతపడక
అంతయును మంచికేయని యాత్మదలచి
తల్లివిధముగనే పినతల్లి నెంచి
హస్తములు మోడ్చి ఆమెతో ననియె నిట్లు. 230

సీ "ఆ సూర్యభగవాను డాదేశ మిచ్చినన్
తండ్రి యానతి జవదాటనమ్మ
చిన్నారి భరతుని సిద్ధ సంకల్పుని
సింహాసనాధీశు జేయు మమ్మ
నాకు నీవిడినట్టి నారచీరలె పట్టు
వలువలుగా మదిం దలతునమ్మ!
నీ యభీష్టము మేర నిశ్చింతగా పదు
నాలుగేం డ్లడవుల నడతునమ్మ

తే కన్ననాతల్లికే యీర్ష్య గలుగునటుల
ప్రతినిమేషము ప్రేమను పంచినట్టి
నీ ఋణమ్మును దీర్చెడు నియతికంటె
వేరె యాశింపనేది? దీవింపు మమ్మ!" 231

తే దశరథాత్మజు నెనలేని త్యాగనిరతి
నతని సచ్ఛీలతను కైక యంతరాత్మ
యామెయనుమతి లేకయే యభినుతించె
చేయునదిలేక విధిగ నాశీర్వదించె. 232

తే. అంత నా ముప్వు రటనుండి ఆయుధములు
కవచములతోడ ద్వారముకడనె యున్న
స్యందనము నొద్ద కరుదెంచి యందరికడ
సెలవుగైకొని పిదప నాసీను లైరి. 233

తే. రథము కదలె సుమంత్రు సారథ్యమందు;
కౌతుకము నిండె కైకేయి కనులయందు,
ఎగసె వేదన కౌసల్యహృదయమందు;
ముసిరె! చీకట్లు దశరథుమోమునందు 234

ఆ. జారిపోవుచుండె జాతిరత్నమ్మని
గుండెదిటవు నంత గోలుపోయి
పాప మవనినాథు డాపు సుమంత్రుడా!
యడవి కేనువత్తు ననుచు నరచె. 235

ఆ. తండ్రికేక విన్న దశరథరాముడు
మదిని కలతజెంది మంత్రితోడ
స్యందనమ్ము నాప, జనలేము ముందుకు
వేగ మింక కొంత బెంచు మనియె 236

ఆ. పంక్తిరథుడు తూలి పడుచు లేచుచు వెంట
పరుగువెట్టు టరసి పట్టమహిషి
భర్త నొడిసిపట్టి బలవంతముగ తన
భవనమునకు జేర్చె బాధతోడ 237

చం. జనక వచో నిబద్ధు డయి జానకిగూడి సుమిత్రసూతితో
ననుపమలీల ఘోరవిపినాంతర సీమల కేగు రాఘవున్
గని జనులెల్ల పట్టణము గ్రక్కునవీడి విషణ్ణచిత్తులై
చని రిక మాకు నీ యడుగుజాడలె దిక్కని రామువెంబడిన్ 238

తే. వారి ప్రేమానురాగముల్ వారి భక్తి
గాంచి రాముడు, పోవంగ కాళ్ళురాక
యొక్కచో నిల్చి బిడ్డల నూరడించు
తండ్రివలె బల్కె గొంతుక తడబడంగ. 239

క. "మీబాధనాకు దెలియును
నా బాధ్యత విస్మరించి నాయున యాజ్ఞన్
నేబాటింపకపోయిన
నే బిడ్డండైన తండ్రి కిచ్చునె విలువన్? 240

ఆ. ప్రభువు నడచు బాట ప్రజల కాదర్శమై
నిలిచినపుడె నీతినియమములును
బ్రతికిబట్టగట్టు; బహుజనాభ్యుదయము
సకల జగతిలోన జరిగితీరు. 241

తే. ఏను లేనను చింత మీకింత యేల?
అన్ని విధముల నాకన్న మిన్నయైన
తమ్ము డున్నాడు భరతు డాతండె నేత!
అతనిలో నన్ను గనుడని యనునయించె. 242

తే. కాని, వారంత ముక్త కంఠాన "రామ!
దుష్ట కైకేయి తనయుడు భరతు డెంత
నిర్మలుండైన అతనిలో నిన్ను గనుట
కిచ్చగింప దయోధ్యలో ఈగగూడ. 243

ఆ. నీవు లేని నగరు నీర మెండిన వార్ధి
కలను గూడ నచట కాలు మోప
మనసు రాదు మాకు; మామాట మన్నింపు
మడవులే శరణ్య మందరకును." 244

తే. అనుచు జనగణమంత స్యందనము వెంట
పరుగు పెట్టుట గని, మంత్రి పగ్గములను
లాగె వెంటనె రామయ్య రథము డిగ్గె
నంతలో కమలాప్తు డస్తాద్రి కరిగె 245

తే ప్రక్కనే తమసానది పారుచుండు
టరసి వేగ సుమంత్రుడు తురగములను
విప్పి నీరము ద్రావించి విశ్రమింప
జేసి, సాకేతపౌరుల చింతబాపె. 246

తే క్రమముగా నంత చీకటుల్ క్రమ్ముకొనియె
నిదె విడిదియని తృణశయ్య నేరుపరచె
నన్నకును వదినెకును రామానుజుండు
ప్రజలు పచ్చికబైళ్ల విశ్రాంతిగొనిరి. 247

తే. సీతయును రామభద్రుడా సెజ్జమీద
బవ్వళించిరి దానినే పట్టుపాన్పు
రీతి మదినెంచి మిక్కిలి ప్రీతితోడ
కాపుగా నుండె చెంత లక్ష్మణుడు నిలిచి. 248

తే. ఆలుబిడ్డల విడచి త న్ననుసరించి
వచ్చియున్నట్టి ప్రజలకు నచ్చజెప్పి
తిరిగి పంపుట యెటులన్న దిగులుతోడ
రామునకు నిద్రపట్టక రాత్రివేళ. 249

తే. లేచి, మంత్రినిజేరి "యే లీలనైన
నుదయ మగుటకు ముందె యీ నదిని దాట
వలయు నటుగానిచో వీరు వదల రింక
మనల రే" పని దెల్పె సుమంత్రు డంత 250

క. సడిసవ్వడి లేకుండగ
వడిగా స్యందనము సిద్ధపరచెను పిదపన్
ఎడలేక సీతయును, రా
ముడు లక్ష్మణు డెక్కగానె ముందుకు నడపెన్. 251

తే. రథము తీరము వెంట దూరముగ బోయి
అడ్డదారిని నది దాటి యవలి కరిగె;
నంత రాము "డమాత్య! మీరాప వలదు
పయన మాగకూడదు తెల్లవారు వరకు." 252

క. అని తెల్ప మంత్రి యటులే
యని పల్లెల ప్రక్కదారి నరదము దోలెన్.
దినకరు డుదయించెను వడి
తన వంశస్థులకు స్వాగతము బలుకంగన్. 253

ఆ. పౌరు లంత తెల్లవారి నిద్దురలేచి
రాముజాడ గనక రథము గనక
"పాడునిద్ర యెంతపని జేసె దేవుడా!
ఇప్పడింక దారియేది మనకు?" 254

ఆ అనుచు తలలు బాదుకొనుచు జేసెడిదేమి
గనక, నగరి కరుగ కాళ్ళురాక
కొంతతడవు వగచి చింతయే తోడుగా
తిరుగుదారిబట్టి యరుగునపుడు. 255

ఆ. కట్టుకున్నసతుల - కన్నబిడ్డల వీడి
ప్రేమధాముడైన రామువెంట
నింత దవ్వువచ్చి యెట్టి ఫలములేక
అరుగవలసివచ్చె ననుచు జనిరి. 256

ఆ. తిరిగివచ్చినట్టి పురజనుల్ రామయ్య
తిరిగిరాడు దీక్ష తీరువరకు
ననుచు మాటలాడు కొనుటను చెవియొగ్గి
వినిన కైక మురిసె మనమునందు. 257

సీ. సాకేత రాముని స్యందన మ్మతివేగ
ముగ నెన్నొ జనపదములను దాటి
ఆలమందల మేత కాలవాలమ్ముగా
పేర్గన్న పచ్చికబీళ్ళుదాటి
పరిగెపిట్టకు కూడ పట్టెడన్నముఁబెట్టు
మేలైన పంటపొలాలు దాటి
శిలల నెమ్మేనులు పులకించునట్లుగా
నెగసి దూకెడు సెలయేళ్ళు దాటి

తే దారి కిరువైపులను బార్లు దీరి నిలిచి
కొమ్మలే చేతులుగ స్వాగతమ్ము బలుకు
సరణి గన్నట్టు సంపెంగ తరులదాటి
చేరె! గంగాతరంగిణీ తీరమునకు 258

తే మెల్లమెల్లగ వీచెడు పిల్లగాలు
లానదీతరంగమ్ముల నల్ల నల్ల
మీటి వెలువడు నాదమున్ పాటగట్టి
ఆలపించుచు నుండె నాహ్లాద మెనయ 259

ఆ పాట స్యందనమును పరవశింపగ జేసె
నశ్వములును గమన మాపి నిలిచె
అంత సీత యెంత హాయిగా నున్నదీ
ప్రాంత మనుచు బలికె భర్తతోడ 260

తే. అనిన వెంటనె శ్రీరాము డనుగుపత్ని
మనసు గుర్తించి తాను స్యందనము డిగ్గి
చేత ముప్పొంగ సతికి చేయూతనిచ్చి
దింపె! అంత సౌమిత్రి మంత్రియును దిగిరి 261

తే. రామభద్రుడు జానకీరమణి తోడ
దీక్ష వహియించి జాహ్నవీతీరమునకు
వచ్చియున్నా డనెడు శుభవార్త దెలిసి
పరుగునన్ వచ్చె నా సీమప్రభువు గుహుడు 262

తే. స్యందనమునొద్దనుండి నిషాదరాజు
బృందమును గాంచి రాము డానంద మొంది
తమ్మునిం గూడి యెదురేగి "రమ్ము సఖుడ!
యెన్నినాళ్లాయె కనులార నిన్ను జూచి." 263

క. అని రాముడు వనరాజును
మన మారగ కౌగిలించి మధురోక్తుల నా
తని శిరమున వెదజల్లెను
కని యనుచర బృందమునకు కన్నులు మురియన్. 264

తే. అంత గుహుడు శ్రీరామున కంజలించి
"పూర్ణచంద్రున కొక నూలుపోగు పగిది
పేదగుహు డిచ్చు కానుకల్ స్వీకరింపు"
డనుచు తెచ్చిన యుడుగర లచట నుంచె. 265

తే. రాము డవియెల్ల నరసి చిర్నగవుతోడ
"వలదు మిత్రమా! నే వనవాసదీక్ష
నుంటి గావున బహుమతు లంటదగదు
చేతనైనంతలో విందుజేయు" మనియె. 266

ఆ. భాను డంతలోనె పశ్చిమాద్రిని జేరె।
గువ్వలన్ని సొంతగూళ్ళు జేరె
నిసికి వెలుగు బంచ శశి వియత్తలి జేరె
చెట్లుపుట్ట లెల్ల సేదదీరె. 267

ఆ. అంత శబరనాథు డడవితల్లికి గూడ
చవులుగొలుపునట్లు షడ్రుచులను
పిండి వండితెచ్చి వెన్నెల పందిట
విందొసంగె రాముబృందమునకు. 268

తే. గుహుని యనుచరు లంతలో కొండపూలు
గంపలం దెచ్చి పచ్చని గరికమీద
నొత్తుగా బేర్చి మిక్కిలి మెత్తనైన
శయ్య నేర్పాటు చేసిరి సంతసమున. 269

తే. సీతయును రాము డాపూల సెజ్జమీద
విశ్రమించిరి వనము సంప్రీతినంద;
లక్ష్మణుండును గుహు డొక రాతిమీద
గూరుచుండిరి నిద్దురన్ బారద్రోలి. 270

తే. రథములోనె సుమంత్రుడు రాత్రియంత
కునుకుదీసెను చెంతనే గుఱ్ఱములును
నోళ్ళు చాలను వరకు గుగ్గిళ్ళు మెసవి
చాల సంతృప్తి నొంది విశ్రాంతి నందె. 271

తే అలసి నిదురించు ప్రకృతిదేహమ్ముపైన
వెలుగులను జల్లి మేల్కొల్పె వేగుచుక్క;
కోయిలలు తామె వైతాళికులుగ మారి
దాశరథికి సీతకు శుభోదయము బాడె. 272

తే. అంతనాపుణ్యదంపతుల్ సుంతయేని
జాగుసేయక లేచి లక్ష్మణుని బిలిచి
పూజ్య భాగీరథిన్ ప్రొద్దుబొడుపువేళ
దాటుటెంతేని సంతోషదాయకమ్ము 273

తే అనుచు దెలిపిన సౌమిత్రి యాక్షణమ్మె
గుహున కెఱిగించె! నగ్రజుకోర్కెనంత
పరుగుపరుగున జని సిద్ధ పరచె నతడు
బహువిధాలంకృతులతోడ బరగునావ. 274

తే. రాముడును జానకీదేవి లక్ష్మణుండు
నూతనోత్సాహమున నటనుండి కదలి
విమల జాహ్నవీ తీరాన వేచియున్న
నావ జేరిరి మెల్లగా నడచుకొనుచు 275

తే సారథి సుమంత్రు డంత దాశరథి నరసి
"మహితగుణశీల! యిపుడు నా మార్గమేదొ
నీవె వచియింపు" మనిన నా నీలమేఘ
వర్ణు డానందమేపార బలికెనిట్లు. 276

తే "సచివసత్తమ! మాకీవె సారథి వయి
రథము నడిపించి, యింత దూరమ్ము శ్రమను
లెక్కసేయక వచ్చి నిర్నిద్రవృత్తి
సాయపడినావు! నీకు నే దోయిలింతు. 277

క. మే మిక వనసీమలలో
సామాన్యులరీతి పాదచారుల మగుచున్
నీమము వీడక పదునా
ల్గామనులను సంతసమున గడపెద" మనియెన్. 278

క. అని రామభద్రు డనగనె
మన మించుకచిక్కబట్టి మంత్రి సుమంత్రుం
"దినకులతిలకా! నిన్నీ
వనముల విడనాడి చనగ వగపాయె" ననెన్. 279

తే. రాము డంత సుమంత్రుకరములు బట్టి
"చాల ఋణపడియున్న దిక్ష్వాకువంశ
మిప్పటికె నీకు! నైనను దప్ప దిపుడు
రథమునన్ వేగ జేరుము రాజధాని. 280

తే నిన్ను మించిన హితులు నా కన్నతండ్రి
కెవ్వ రున్నారు? తిరిగి నే నేగుదెంచు
వరకు వారిని నీ వెడబాయకుండ
జూచుకొ"మ్మని పల్కి యశ్రువులు దుడిచె 281

తే. అంత శ్రీరామచంద్రుని యానమేర
క్షణములో మఱ్ఱిపాలను శబరవరులు
దొన్నెలం దెచ్చి యొక రాతితిన్నె మీద
బెట్టి వినయాన చేతులు కట్టుకొనిరి. 282

తే రామలక్ష్మణు లంత నుల్లాస మెసగ
కొద్దికొద్దిగ పాలను కురుల కలది
జడలు దాల్చిరి వారల జానకి గని
"మునికుమారులవలె నుంటి" రని వచించె 283

తే. అంత రాముడు లక్ష్మణు డవనిజాత
పడవ నెక్కి సుమంత్రుని బాగజూచి
హస్తముల నూపి వీడుకో లందజేసి
గుహునికడ గూడ సెలవు గైకొనిరి వడిగ 284

తే. నావ నదిమీద పూల స్యందనములీల
ఎత్తి కట్టిన తెరచాప లెగసియాడ
నుదయకిరణము, లలలతో నూసులాడ
నరిగె నా వలియొడ్డుకు త్వరితగతిని. 285

ఆ పడవనుండి రామభద్రుడు ముందుగా
దిగి యనుంగుసతిని దించుకొనియె;
లక్ష్మణుండు శబరరాజ బృంద మ్మెల్ల
నలర ధన్యవాదములను దెలిపి. 286

ఆ. నావడిగ్గి "వదిన! నడకలో నెప్పుడైన
ముందు నేను బోదు నెందు కనిన
యడవిదారివెంట నరిగెడు సమయాన
ముందుచూపు చాల ముఖ్య"మనియె. 287

మత్త. మువ్వు రంతట సంతసమ్మున ముందు కేగుచు మధ్యలో
పువ్వుదేనెలు, దోరగాయలు, మూలకందము లెల్లెడన్
నవ్వులన్ గలబోసి తృప్తిగ నారగించుచు సాగగా
దవ్వులన్ గనిపించె వారికి తాపసాశ్రమవాటికల్. 288

చ. అది మలిసందెవేళ యిను డాకసమున్ విడిపోవుచుండె; నా
యదనున హోమకుండములయందున వెల్వడు ధూమమేఘముల్
కదిసి సువాసనల్ పరచె రాముడు వానిని గాంచి "తమ్ముడా!
ఇది కడు మంగళాస్పద మదే! మన గమ్యము పోద" మంచనెన్. 289

తే. అంత నాముప్వురును తాపసాశ్రమముల
దరిసి యందున్న ముని భరద్వాజునరసి
ఆ మహాత్ముని దివ్యపాదారవింద
ములకు ప్రణతుల నర్పించి నిలిచి రంత. 290

తే. దాశరథి యొక్క క్షణమాగి తనను దాను
పరిచయము జేసికొని వనవాసమునకు
హేతువును దెల్పి స్వామి! యీ రాత్రి యిచట
గడపునరుదైన భాగ్యమ్ము గలిగె ననియె 291

తే. వెంటనే భరద్వాజుడు ప్రీతిమీర
"రఘుకులోత్తమ! నీవి ట్లరణ్యములకు
వత్తు వని నే నెరుంగుదు. వాసయోగ్య
మైనదీతావు మీకికపైన" ననియె. 292

తే. అంత రాముడు "మేము మీచెంతనున్న
ననుదినమ్మును దొరకు మీయాశిషములు
కాని... కోసల మిచటికి కడు సమీప
మన్న దొక్కటె మాకు రానున్న చిక్కు. 293

ఆ. జనపదమ్ము లిటకు చాల దగ్గర గాన
ప్రజలు పరుగు లిడుచు ప్రతిదినమ్ము
మిక్కుటముగ వచ్చి మీకు మాకును శాంతి
తొలగజేతు రందువలన మేము. 294

తే. శాంతిమయ జీవనము, దీక్ష సాగువరకు
గడపుటకు కొంతదూరాన కాననముల
ననువుగా నుండుచోటు నో యతివరేణ్య!
తెలుపు" డని రాఘవుండు ప్రార్థించె నంత 295

తే. మౌని వచియించె, "కొన్ని యామడల దూర
మందు ప్రకృతి సౌందర్యాన కాలవాల
మగుచు విలసిల్లు చిత్రకూటాద్రియున్న;
దదియె మీ రుండుటకు యోగ్యమైన చోటు 296

తే. అందు గలవెన్నొ మౌనుల ఆశ్రమములు
పరవశముగొల్పు నచ్చటి పరిసరములు
కనుక నీ రాత్రి నిచ్చట గడపి రేపు
తరలి చన వచ్చు" ననె భరద్వాజమౌని 297

ఆ. అంత మౌనిశిష్యు లతిభక్తి నిడినట్టి
యతిథి పూజ లెల్ల నందు కొనిన
పిదప కమ్మనైన విందారగించి శ్రీ
రామబృంద మచట రాత్రి గడపె. 298

క. మరునాడు భరద్వాజుని
చరణములకు మ్రొక్కి వారి సమ్మతితో నం
దర నభినుతించి యా ము
గ్గురు పయన మ్మైరి చిత్రకూటము జేరన్ 299

ఆ అటుల కొంతదూర మరిగి కాళిందిని
వెదురుగడల తెప్పవేసిదాటి
కాలినడకతోనె కనువిందు జేసెడు
చిత్రకూటమునకు జేరిరంత. 300

తే. వదిన కోరిక మేర కిం పాదవునటుల
త్వరితగతి లక్ష్మణుం డేరు పరచె నొక్క
ఆకుటి ల్లంత ముప్పురు నగ్నిపూజ
జేసి కడుమోదమున బ్రవేశించి రందు. 301

ఆ. శూన్యరథముతోడ సాక్కి సోలుచు సుమం
త్రుం డయోధ్య కేగి గుండెచెదరి
యున్న పురము నరసి కన్నీరు దిగమ్రింగి
ప్రభువరేణ్యుమందిరమున కరిగె. 302

తే. రాజభవనము శోకవారాశియందు
మునిగియుండుట గనుగొని మనమునందు
జరుగగూడని దేదైన జరిగెనేమొ
అన్న సందియు మందియు నంతలోనె. 303

తే. అట్టిదేదియు జరుగరా దవనివిభున
కనుచు దేవుని ప్రార్థించుకొనుచు నరిగి
పట్టెమంచాన జీవచ్ఛవమ్ము పగిది
నున్న నృపు పాదముల చేతు లుంచె మంత్రి. 304

చ. నరపతియంత పాదముల నంటిన స్పర్శకు లేచి, చెంతనే
కరములు మోడ్చియున్న గుణగణ్యు సుమంత్రుని బారజూచి, "నా
వరసుతుభీకరాటవుల పాలొనరించి, విషాదనార్త, నీ
శిరమున మోసితెచ్చితివె? చెప్పుము వేగ నమాత్యశేఖరా!" 305

ఆ. అనుచు పిచ్చిబట్టినట్లు సుమంత్రుని
కరము లొడిసి పట్టి క్ష్మాతలేంద్రు
డింక. "నా కుమారు నెపుడు గాంచెద నే"న
టనుచు గుండె లవియునట్లు లేడ్చె. 306

తే. అంత కౌసల్య, పెనిమిటియశ్రుజలము
పైటతో నద్ది "యిపు డెంత బాధపడిన
నది యరణ్యరోదన మగు నంతెగాని
ఫలిత మింతేని గల్గనే ప్రాణనాథ! 307

ఆ చేతులార మీరు జేసిన యపరాధ
మునకు శిక్ష నిప్ప డనుభవించు
చుంటి నేను గూడ సుతునకు దూరమై"
యనుచు గొల్లు మనియె నా పురంధ్రి. 308

తే. మంత్రి "రాజేంద్ర! సుంత నామాట వినుడు
రాముడును జానకీదేవి లక్ష్మణుండు
వననివాసము తమ పాలివర మటంచు
దెలుపు మనినారు తమకు సంతృప్తిమీర. 309

ఆ. తిరిగిచూచుసరికి పరుగెత్తి పోవును
పదియు నాలుగేండ్లు పట్టణమున
కరుగుదెంచు రాము డా మరుక్షణమె మి
మ్మరసి యాశిషమ్ము లందుకొనగ." 310

తే. అనిన సచివోత్తముని మాట కడ్డుదగిలి
యుర్వినాథుడు క్షణమాగి "యో సుమంత్ర!
లేదు! నాకంత భాగ్యము లేదు లేదు!
కాటువేయగ నున్నది గతము నన్ను. 311

మత్త. తొల్లి నేనొకనాడు వేటకు దూరమౌ వని కేగితిన్
కొల్లగా మృగసంచయమ్ముల గూల్చియున్ తనివందకే
మెల్లమెల్లగ ముందుకేగ సమీపమం దొక యేటిలో
పిల్లయేనుగు నీరు ద్రావెడు వింత శబ్దము విన్వడెన్. 312

తే. అంత నా సవ్వడికి మోదమంది నేను
శబ్దవేధిని గురిజూచి సత్వరమ్మె
వదలిపెట్టితి నదియొక బాలమునికి
దగిలె నా పాపభాండము పగిలినట్లు. 313

చ అత డొక అంధ దంపతుల యాత్మజు: డాతడె దిక్కు వారి కా
సుతుడటు నాశరమ్మున ప్రసూనము కైవడినేలరాల, నా
వెతను భరించలేక విలపించుచు నా తలిదండ్రులంత, "నో
క్షితివర! నీవు మావలెనె చెందుము పుత్రవియోగమృత్యువున్" 314

ఆ అనుచు శాపమిచ్చి యా వృద్ధ దంపతుల్
కుమిలి కుమిలి యేడ్చి కుప్పగూలి
తనయు దలచు కొనుచు తనువు చాలించి రా
పాప మిపుడు నన్ను పట్టి కుదిపె. 315

తే. అదిగో! అటు చూడు! కౌసల్య! ఆరిపోక
భగ్గుమని మండుచుండె దంపతుల చితులు
గుండెలకు బ్రాకె! నావేడి గొంతు నెవరో
నులుముచున్నారు నే నిక నిలువజాల." 316

తే. అనుచు తలబాదుకొనుచు "రామయ్య తండ్రి!
నేను జనుచుంటి నీనాడు నిన్ను వదలి
యాయు లేనైతి రాజ్య మీయాయువైన
నందుకొను మది నీకు దీర్ఘాయు వగును." 317

ఆ. అదియె చివరి మాట యంతలో మృత్యువు
స్వాగతించె నేమొ క్ష్మాతలేంద్రు
డంతిపురమునంత చింతాబ్ధిలో ముంచి
చివరి శ్వాస విడిచి చేరె దివికి 318

తే. ప్రభువు మరణించెనను వార్త పట్టణమున
క్షణము లోపల సుడిగాలి కరణి బ్రాకె;
కులగురువు వసిష్ఠుండు వ్యాకులత జెంది
వడివడిగ జేరె రాజేంద్రు భవనమునకు. 319

క. అంత వసిష్ఠ సుమంత్రులు
చింతను దిగమ్రింగి మిగుల శేముషి తోడన్
మంతనములాడి "వే బిలి
పింతము భరతుని నరాజభీతి దొలంగన్. 320

తే. అరగడియకాలమేని సింహాసనమ్ము
రాజరహితముగా నుండరాదు గాన
తత్క్షణమె వాయువేగాన తరలి చనెడు
నాశ్వికుల గిరివ్రజపురి కంపవలయు." 321

క. అని నిశ్చయించి వెంటనె
అనువగు దూతలను బిలిచి అన్ని వివరముల్
వినిపించి, "రామభద్రుని
వనవాసము ప్రభువు మృతియు బలుకవలదటన్." 322

ఆ. అనుచు హెచ్చరించి రంత వసిష్ఠుడు
భరతుతోడ నేను బంపితి నని
పలికి ముఖ్యమైన పనియున్నదని యన్న
దమ్ముల గొనిరండు త్వరితగతిని. 323

తే. అనిన కులగురుశ్రేష్ఠున కంజలించి
దూత లావెంటనే సుమంత్రునకు మ్రొక్కి
రమ్యమగు కాన్క లచటివారలకు నొసగ
వెంటగొని యయోధ్యాపురి వీడి చనిరి. 324

తే. ప్రభువు మృతదేహమును రాజభవన మందె
తైలపేటికలో నుంచి తగు విధమున
భద్రపరచి రమాత్యులు భరతు డటకు
వచ్చులోపల శిథిలమై విచ్చకుండ. 325

ఆ. అయిదురేపు మాపు లతివేగముగ దూత
లరిగి భరతుడున్న పురము జేరి
వెంటదెచ్చినట్టి విలువైన బహుమతు
లందజేసి నిలిచి రమిత భక్తి. 326

మ. భరతుం డంతట "సేమమే ప్రభునకున్, భద్రాత్ముడౌ అన్నకున్
పరమోదార గుణుండు లక్ష్మణునకున్, కల్యాణి సీతమ్మకున్
కరుణామూర్తులు పెద్ద తల్లులకు నన్‌గన్నట్టి మాయమ్మకున్
గురుదేవాదులకెల్ల? తెల్పు" డనియెన్ కొండంతయాత్రమ్మునన్ 327

మత్త. అంతదూత "లయోధ్య యందున నందరున్ కుశలమ్మె, మీ
చెంత కిప్పడు మమ్ము బంపె వసిష్ఠ సద్గురువర్య డ
త్యంత ముఖ్య విశేష మేదియొ, యచ్చటన్ గలదంచు, మి
మ్మెంత మాత్రము జాగుసేయక యీ దినమ్మున రమ్మనెన్" 328

తే. దూత లారీతిగా తన చేత మలర
బలికి నంత తమ్ముని తోడ భరతు డరిగి
తాతకును మేనమామకు జోత లొసగి
బయలు దేరెను రథమెక్కి త్వరితగతిని. 329

తే. స్యందనము వెంట కొంత సైన్యమ్ము గూడ
రక్షణగ వచ్చె! వారట్లు రాత్రిపవళు
లేడునాళ్ళు ప్రయాణించి యెనిమిదవ ది
నమున జేరిరి సాకేత నగరమునకు. 330

తే. తేరు తోరణద్వారము జేరుసరికి
కొన్ని యపశకునమ్ములు గోచరించె:
కాంతి హీనమ్ముగా పురి కానుపించి
కైక కొమరుని హృదయాన కలత పెంచె 331

తే. భరతు డంతట "శత్రుఘ్న! పురమునందు
దుఃఖసంకేతములు పెక్కుతోచుచుండె
కనుక ముందుగ మన మమ్మ కడకు నరిగి
యేమిజరిగెనొ? తత్క్షణ మెరుగవలయు." 332

తే అనుచు తమ్మునితో బల్కి యరదముననె
రాణ దరిగిన ముఖ్యమార్గములు దాటి
వడివడిగ నేగి కైక భవనము జేరి
స్యందనము డిగ్గి లోనికి జనిన యంత 333

తే. కొడుకు రాకను గమనించి కుమతి కైక
సంతసమ్మున నెదురేగి స్వాగతించి
"ఇన్నినాళ్ళకు నాకల లన్ని పండు
నట్టి శుభలగ్న మాసన్న మాయె తనయ!" 334

ఆ. అనిన తల్లిమాట లావల బోద్రోచి
"జనకు డేడి" యనుచు శయనగృహము
లోని కరిగి యందు గానక భరతుండు
తల్లడమున తిరిగి తల్లిజేరి. 335

ఆ. "అమ్మ! నగరమంత యలముకొనె విషాద
మెందువలన? తండ్రి యెచటి కేగె?
వాస్తవమ్ము దెలిపి వంతబాపుము వేగ"
ననుచు బట్టి కుదిపి యడిగె నంత. 336

క. తనయుని యా వేదనమును
గని కేకయ రాజపుత్రి కలవర మందెన్
జనపతి మరణము నే విధ
మున దెలుపగ వలయు కూర్మి పుత్రున కనుచున్. 337

తే. కాని... తప్పదు గాన నా కఠిన హృదయ
కొమరునకు చేదు వార్తను కొంతతీపి
నలది చెప్పటయే మంచి దని "కుమార!
జరుగకూడని దేదియు జరుగలేదు 338

క. పుట్టిన ప్రతి మనుజుండును
గిట్టుట సహజమ్ము, భువిని కేవల మటులే
చెట్టంత మనుజనాథుడు
చిట్టచివరి శ్వాస విడిచి చేరెను దివికిన్." 339

ఆ. తల్లినోటి వెంట నుల్లము భగ్గున
మండు వార్త వినిన మహితగుణుడు
భరతు డంత "రామభద్రు డేమాయె? భూ
మీశు మరణమునకు హేతు వేమి?" 340

తే. అనుచు నావేశ మడరంగ నడిగినట్టి
కొమరునకు మెల్లగా తాను గోరినట్టి
వరములను దెల్పి, "రాముడు వనుల కేగె
సీతతో లక్ష్మణుని తోడ చేతమలర. 341

తే. జనకునానతి తలదాల్చి చనియె జ్యేష్ఠు
డడవులకు; నీవు మీయమ్మ యానమేర
కిపుడు పితృకర్మలను జేసి నృపపదమ్ము
స్వీకరింపుము గురుని యాశీస్సు లంది." 342

తర. అటుల కేకయరాజపుత్రిక యన్న వెంటనె "దుష్ట! నీ
కెటుల నాలుక వచ్చె చెప్పమ? యింత దుర్భరవార్తలన్
కటకటంబడకుండ దెల్పగ, కానలోపలనగ్రజుం
డటమటించుచునుండ రాజ్యము హాయిగా నెటు లేలుదున్? 343

మత్త. ఇంత దుర్మతి వన్న సత్యము నించుకేని యెరుంగకే
సంతసమ్మున బెండ్లియాడెను సార్వభౌముడు నిన్ను, నీ
వెంత హింసలపాలు జేసితొ? యీ నరమ్ములు పొంద, నే
కాంతమందున నా మహాత్ముని కర్కశస్వరడాకినీ!" 344

ఆ. అనుచు నీసడించి యాగ్రహమ్మును బెంచి
భరతు డంత కైక నరసి "నిన్ను
హత మొనర్ప చేతు లాడుటలేదు నా
కన్నతల్లివైన కారణమున 345

సీ. నవమాసములు మోసినట్టి తల్లిని మించి
ప్రియమార నిన్ను సేవించినాడు
కన్నతండ్రిని మించి న న్నెల్లవేళల
గారాల సుతునిగా గాంచినాడు
పట్టణపౌరుల ప్రాణమిత్రులరీతి
జూచి వారల మదిన్ దోచినాడు
ధర్మరక్షణమందు తండ్రిని మించిన
తనయు డన్న ప్రశస్తి దాల్చినాడు

తే. పరమగురునొద్ద "కాబోవు ప్రభువు రాము"
డనిన శుభకామనల నందుకొనిన ఘనుని
యడవులకు పదునాలుగేండ్లంపు మనుచు
మగని గోరగ నీకెట్లు మనసు వచ్చె? 346

తే. భర్తృఘాతుకీ! యిక్ష్వాకువంశమునకు
ప్రళయమును దెచ్చి పెట్టిన పాపమునకు
తగిన దండనగా నిన్ను తల్లి యనుచు
బలుక నిక మీద నాయన్నపదములాన! 347

తే. రామలక్ష్మణు లిద్దరీ రాజ్యమునకు
రెండు నేత్రాలు; వారు లేకుండ నెట్లు
గద్దె నెక్కెద నని కలల్ గంటి వీవు
చూడ! నీ మోము జన్మలో చూడ నెపుడు. 348

తే. జనకునంత్యక్రియలనెల్ల సత్వరమ్మె
పూర్తి గావించి యడవికి బోయి నేను
జ్యేష్ఠు నొప్పించి కొనితెచ్చి సింహపీఠి
నధివసింపంగ జేసెద" నని వచించి. 349

తే. భరతు డటనుండి కౌసల్య భవనమునకు
తమ్మునిం దోడుకొని యేగి తండ్రిదేహ
మరసి గొల్లున విలపించి యచటనున్న
తల్లు లిరువురకును బ్రణమిల్లి పలికె. 350

తే. "తండ్రియేగా దిపుడు నేను తల్లిగూడ
లేని దీనుడ నా తప్పలేదు సుంత
కాని పాపమ్ములో పాలు కలదు కొంత
నాకు, కైకేయి బిడ్డనైనందువలన. 351

తే. కనుక దయయుంచి నన్ను మీ కన్నబిడ్డ
లందు నొకనిగ భావించు" డనుచు యేడ్చి
యశ్రుజలమున కౌసల్య అంఘ్రియుగము
కడిగె నాతల్లిహృదయము కరగునటుల. 352

చం భరతుని వేదనం గని చివాలున వానిని లేవనెత్తి, యా
దరమున కౌగిలించి కనుదమ్ముల కొంగున నద్ది, "నాయనా!
దురితము నీదిగాదు; మన దుఃస్థితి కెవ్వరు బాధ్యులైన, నం
దరకును చింతయే మిగిలె; నైనను చేసెడిదేమి లేదికన్." 353

తే. అనుచు కౌసల్య పసిబిడ్డ ననునయించి
నట్లు భరతుని నోదార్చె నంతలోనె
ముని వసిష్ఠుడు చనుదెంచి "జనకున కిపు
డుత్తరక్రియ లీవె శాస్త్రోక్తరీతి. 354

తే. జరుపవలయును కనుక నో భరత! గతము
దలచి వగవక ర"మ్మని పలికె నంత
దశరథుని దేహమున్నట్టి తైలద్రోణి
కడకు నా యన్నదమ్ములు వెడలి రపుడు. 355

తే. ప్రభువు పార్థివ దేహమున్ రాజలాంఛ
నములతో దీసికొని శ్మశానమున కేగి
చితిని గంధపుచెక్కలు జేర్చిపేర్చి
దానిపై నుంచి వేదమంత్రాల మధ్య. 356

తే. ధర్మసమ్మతమగు రీతి దహనవిధులు
పూర్తి గావించి; రంతట ముని వసిష్ఠు
డవనివిభు పాలనను గొనియాడి, రాజ
పుత్రులను గొని సాకేతపురికి నరిగె. 357

తే. భరతశత్రుఘ్ను లిరువురు పది దినమ్ము
లశ్రుజలములు తోడుగా నవని శయ్య
పవ్వళించిరి ఆచార భంగి నటుల
నిర్వహించిరి కర్మల నిష్ఠతోడ 358

ఆ. భరతు డంత తండ్రి ద్వాదశదినకర్మ
బుధగణమ్ము మెచ్చ పూర్తిజేసి
భూసురోత్తములకు భూదాన గోదాన
ముల నొసంగె వార లలరునటుల. 359

తే. అంతలో మేని నిండుగ వింతవింత
స్వర్ణ భూషలు ధరియించి సంబరమ్ము
దర్ప మెనయంగ కైకేయి దాసియైన
దుష్టమంథర లోనికి తొంగిచూచె. 360

తే. ముసలికోతికి జలతారు వసనములను
కట్టి బంగారు గొలుసులు జుట్టినట్లు
దోచు మంథర నపుడు శత్రుఘ్ను డరసి
"భ్రష్టి! నిను జంపెద" నటంచు పైకి దుమికె. 361

సీ "నీ మూలమున గదా! ఇట్లు మా జనకుడు
విలపించి ప్రాణముల్ వీడవలసె
నీ మూలమున కదా! ఇట్లు మా వంశాబ్ధి
చంద్రుడు వనముల సాగవలసె
నీ మూలమున కదా! ఇట్లు మా వదినమ్మ
కందమూలములతో గడుపవలసె
నీ మూలమున కదా! ఇట్లు మా పెదతల్లి
సుతునకు దూరమై బ్రతుక వలసె.

తే. ఇన్ని దారుణ క్రియలకు హేతువైన
నీవు జీవించియున్న ననేకమైన
ఆపదలు దెచ్చి పెట్టెద వంతిపురి"క
టంచు పిడికిలి పైకెత్తె హత మొనర్ప. 362

తే. అపుడు మంథర శత్రుఘ్ను నాగ్రహమ్ము
నరసి తప్పదు చావిక నని గ్రహించి
వెంటనే వంగి పాదములంటి మ్రొక్కి
వగవ దొడగెను నను జంప వలదటంచు. 363

తే. కాని శత్రుఘ్ను డిసుమంత కరుణ గనక
జుట్టుబట్టుక లేపి ఛీకొట్టి "దుష్ట!
వగలు చాలింపు; మిపుడు నిన్ వదలిపెట్ట"
ననుచు గర్జించె దశదిశ లదరునటుల. 364

తే. అంత భరతుడు "తమ్ముడా! అతివ లెంత
పాప మొనరించినను చంప పాడిగాదు;
మెచ్చ డిటువంటి పనుల నమేయగుణుడు
రాము; డటుగాన తీయకు ప్రాణములను. 365

ఉ. కైకను జంపకుండుటకు కారణ మద్దియె? లేక యున్నచో
పీకను నుల్మి యంతిపురి భీతిల నామెను గూ ల్చకుందునే?
లోకము మెచ్చనట్టిపని రుద్రుడు సైత మొనర్పడందుచే
ఆ కుమతిన్ క్షమింపు; మది అన్నకు నాకును గూర్చు మోదమున్. "366

తే. అనిన భరతుని మాటల అర్థ మెరిగి
ఆగ్రహము వీడి శత్రుఘ్ను డట్టె నెట్టె;
ముసలిమంథర కైకేయి ముందు బడియె
గడచె గండము లెమ్మని కైక యనియె. 367

క. మరునా డుదయ మమాత్యులు
గురువు వసిష్ఠుండు మరియు కొందరు ముఖ్యుల్
భరతుని సాన్నిధ్యమ్మున
కరిగి పరామర్శ జేసి రాదర మొప్పన్. 368

ఉ. అంత వసిష్ఠమౌని ప్రియ మారగ నిట్లు వచించె "రాజ్యమం
దంతట రాజులేని కతనన్ పొడసూపె నరాజకత్వ; మిం
కింతయు జాప్య మూనదగ; దీదిన మెల్ల జనాళి మెచ్చ, ని
శ్చింతగ రాజ్యపాలనము చేకొనుమో! యినవంశభూషణా." 369

క. అని కులగురువు వచించిన
వెనువెంటనె భరతు డోవివేకివతంసా!
ఇనవంశమందు జ్యేష్ఠుడె
ఘనమగు నీ రాజ్యమేలగా వలె నెపుడున్. 370

తే. ఈ నిజము మీకు దెలియదే మౌనివర్య!
అగ్రజుడు రాము డుండ సింహాసనమ్ము
నధివసించుట గాదు నే నంటుకొనుట
గూడ పాపము! వినుడు నా వేడికోలు. 371

తే. సకలమగు రాజలాంఛనచయముతోడ
ప్రబలమై యొప్ప చతురంగబలముతోడ
రాము డడవుల నున్నట్టి ప్రాంతమునకు
జనెద మందర మాపైన వినయ మెనయ. 372

తే. అన్న నర్థించి యొప్పించి అడవులందె
రామ పట్టాభిషేకము రంగ రంగ
వైభవమ్ముగ జరిపించి పట్నమునకు
దోడితెచ్చెద మెంతొ సంతోషమెనయ. 373

తే. అప్పటికిగాని నా హృదయమ్మునందు
రగులుచున్నట్టి బాధ చల్లారబోద"
టనుచు భరతుడు కులగురువునకు దెలిపె
మేలుమేలని అందరు మెచ్చునటుల. 374

క. అంత సుమంత్రుడు మిక్కిలి
సంతసమున పయనమునకు సర్వము సిద్ధ
మ్మెంతయు త్వరితముగా జన
మంతయు మెచ్చంగజేసె నతులితరీతిన్. 375

ఉ. రామునిదర్శనమ్ము మరలన్ లభియించునటంచు కొందరున్
రాముని పొత్తులేని నగరమ్ముననుండ మటంచు కొందరున్
రాముని నెట్టులైన కొని రావలె పోయి యటంచు కొందరున్
రాముడు రానిచో యడవులందె నివాస మటంచు కొందరున్. 376

క. అంద రయోధ్యను వీడిరి
సందడి మిన్నంటునటుల సాగెను రథముల్
ముందుగ జను సచివాగ్రణి
స్యందనమున భరతు డెక్కె! సర్వము తానై. 377

తే. తా నొనర్చిన ఘోరమౌ తప్పిదమును
దిద్ది రాముని తిరిగి తోడ్తెచ్చుకొరకు
కాననములకు జనుచున్న కన్న కొడుకు
విజ్ఞతను కైక మదిలోనె వినుతి జేసె. 378

తే. అతనితో మాటలాడు ధైర్యమ్ములేక
తాను కౌసల్య కడకేగి తలను వంచి
"అక్క! నా తప్ప మన్నింపు" మనుచు వేడి
అడవి కేనును వచ్చెద ననుచు పలికె. 379

తే. అంత కౌసల్య కైకేయి ననునయించి
"బాధపడకుము చెల్లెలా! బ్రహ్మవ్రాత
తలగ ద్రోయగ నెవ్వరి తరముగాదు!
కలసి చనియెద మడవికి గతము మరచి." 380

క. అని కౌసల్య వచించిన
మనమున ముదమంది కైక మరు నిముసమె, తా
నును తేరు నధివసించెను
కని నగర మ్మంతులేని కౌతుక మందెన్. 381

తే. దండు సాకేతపురి వీడి త్వరితగతిని
అడవిదారుల జని సూర్యు డస్తమించు
సరికి జాహ్నవీతీరము దరికి జేరె
నెల్లవారల హృదయము లుల్లసిల్ల. 382

ఆ. రాత్రి విడిది కదియె రమణీయ మగుచోట
టంచు నెంచి సైన్య మందరకును
యెట్టి కొరతలేని యేర్పాట్లు గావించె
లలితభక్తి భరతు డలరునటుల. 383

తే. కైక తనయుడు భరతుడు కాననముల
కగణితమ్మగు సైన్యము నందివచ్చి
విమల జాహ్నవీ తీరాన విడిదిజేసె
నని గ్రహించిన గుహుడు తా నతిరయమున. 384

తే. అర్హమగు కానుకలతోడ నతని గలసి
వినయమును భక్తి జాల్వార తనను తాను
పరిచయముజేసికొని మీకు వలసినట్టి
పనులు సెలవిండు నేజేతు నని వచించె. 385

తే. అంత భరతుడు గుహుని సమాదరించి
"ఆప్తమిత్రుడ వీవు మా యన్నగారి
కతడు పూజ్యుడు నాకు నే నడవినుండి
వాని గొనిపోవు పనిమీద వచ్చినాడ. 386

తే. పిలువకయె పల్కినట్టి యో ప్రేమమూర్తి!
అరుగవలె భరద్వాజుని యాశ్రమమున
కందరము రేపు నీ వెటులైన మమ్ము
గంగ దాటించి పుణ్యము గట్టుకొమ్ము." 387

క. అని భరతు డనిన వెంటనె
వినయమ్మున గుహుడు పలికె "వినుతగుణాఢ్యా!
జనహిత మగు పనులను నా
పనులుగ భావించు టానవాయితి నాకున్. 388

తే. కనుక నీరాత్రి మీరంత కలతమాని
విశ్రమింపుడు హాయిగా వేగుచుక్క
బొడుచువేళకు నేవచ్చి మోద మలర
మరల దర్శింతు నని చెప్పి తిరిగి చనియె. 389

తే. భరతశత్రుఘ్ను లంతట వారివిడిది
కరిగి శయనించి రైనను వరగుణుండు
భరతునకు నిద్ర కంటిపై వాలదాయె
నగ్రజుని చింత తనను వెంటాడుకతన. 390

తే. కుటిలబుద్ధిని కైకేయి కోరినట్టి
వరములకు వృద్ధ భూపతి శిరసు వంచి
చేయరానట్టి దుష్కృతి జేసినాడు
కాన రఘువంశ ఘనకీర్తి గంగ గలిసె. 391

సీ. ప్రభువుగా ధర నేలవలసిన నాయన్న
అడవిదారుల దిరుగాడవలసె!
శిల్పసుందరమైన తల్పమ్మునకు మారు
తృణశయ్యపై బవ్వళింపవలసె!
షడ్రసోపేతమౌ సరసాన్నమును వీడి
అడవిదుంపలతోనె గడుపవలసె!
సచివసత్తములతో సభ నిర్వహించుట
మాని మృగాలలో మసలవలసె!

తే. అన్నిటిని మించి నీరెండనైన నెన్న
డరసి యెరుగని వైదేహి ఆత్మవిభుని
విడిచి సాకేతపురిని జీవించలేక
కొండకోనల తలదాచుకొనగ వలసె. 392

ఆ. ఇంతకన్న ఘోర మేమున్న దిలలోన
అనుచు తెల్లవారు లలమటించి
కాస్త కునుకుదీయ గడగె నా లోపల
గునుగు పరుగుతోడ గుహుడు వచ్చి. 393

తే. ధర్మబద్ధముగా శుభోదయము పలికి
"అయిదువందల నావలాయత్తపరచి
నాడ! రామానుజా! మీరు నదినిదాట"
ననుచు వచియించె సౌహార్ద మెనయునటుల. 394

తే. అంత నాయన్నదమ్ము లనంత మైన
ఆదరమ్మున గుహుని స్నేహాతిశయము
నభినుతించుచు పరివార మనుసరింప
రేవు దరి కేగి రమిత సంప్రీతితోడ. 395

ఆ. అలలపైన దేలియాడు మహారాజ
సౌధమటుల దోచుచక్కనైన
పెద్ద నావలోన నొద్దిక నాయన్న
దమ్ము లెక్కిరంత దానిలోనె. 396

తే. రాజమాతలతో పాటు పూజనీయ
గురువరేణ్యులు మంత్రులు, ధరణిసురులు
మొదలుగా గల ముఖ్యుల నధివసింప
జేసె స్వయముగ గుహుడు జేజేల నడుమ. 397

క. తక్కిన పరివారమ్మును
మిక్కుటమగు సంతసమున మేల్మే లనుచున్
ఎక్కెను నావలనిండుగ
నక్కజమున అరుణకిరణు డాహా! యనగన్. 398

తే. కొన్ని నావల నశ్వాలు కొలువుదీరె
అరదములు కొన్ని నావల నాక్రమించె
కాల్బలము కొన్ని నావల కాలుమోపె
కదలె నొకసారె యోడలు కలకలముగ. 399

సీ. మావటీండ్రెక్కిన మత్తేభ సందోహ
మేటికడ్డమ్ముగా నీదసాగె!
మల్లయోధుల బృంద ముల్లాసమున చేతు
లూతగా ముందున కురుకసాగె!

కుర్రకారెక్కిన కర్రతెప్పలబారు
వడిగ కేరింతల నడుమసాగె!
కుండలే అండగా కొందరి జలయాన
ముయ్యాల జంపాల లూగిసాగె!

తే. ఆ మనోహరయానదృశ్యముల నరసి
పుణ్య భాగీరథీనది పులకరించి
చలిత లలిత తరంగ హస్తములతోడ
శీకరమ్ముల రూపాన సేసజల్లె. 400

ఆ. అంతలోనె బృంద మంత మెరుంగని
కౌతుకమున నవలిగట్టుజేరె;
వారి రాక నరసి కూరిమి బ్రకటించి
చెప్పె స్వాగతమ్ము చిగురుటెండ. 401

తే. భరతు డందర నచ్చటే వదలిపెట్టి
అస్త్రశస్త్రాలు విడిచి శ్వేతాంబరములు
దాల్చి కులగురువును గూడి త్వరితగతిని
ముని భరద్వాజునాశ్రమమునకు జనియె. 402

తే. వర వసిష్ఠుని గని భరద్వాజమౌని
అతిథి సత్కార మొనరించి "యతివరేణ్య!
యెదురుజూడని శుభము నాయెదుట నిలిచె
నటుల దలపోయుచుంటి నిన్నరసినేడు." 403

తే. అనుచు ప్రియమార వచియించి అంతవరకు
కరములను మోడ్చి నిలుచున్న భరతు నరసి
"కైక ముద్దుల తనయ! యే కార్య మభిల
షించి వచ్చితి విటకు వసిష్ఠుతోడ." 404

తే. అనిన ముని పల్కులందలి యంతరార్థ
మెరిగి భరతుడు ఖిన్నుడై "వరగుణాఢ్య!
కైక తనయుడుగా నేను కాననముల
నడుగు నిడలేదు మీ పాదమాన! వినుడు. 405

తే. పూజ్యు డిక్ష్వాకువంశ విభూషణుండు
రాము నెటులైన యొప్పించి రాజ్యమునకు
తోడుకొనిపోయి వేదశాస్త్రోక్తవిధుల
పట్టముం గట్టు పనిమీద వచ్చినాడ. 406

తే. తల్లిజేసిన తప్పకు తనయుడ నని
నాకు శిక్ష విధించక లోకమాన్య!
అడవులందున రాము డున్నట్టి నెలవు
దెలిపి మనసార ఆశీర్వదింపు" డనియె. 407

తే. భరతు పలుకులదాగిన భావ మెరిగి
దార్శనిక వర్యుడా భరద్వాజమౌని
మొలకనవ్వుల నతనిపై చిలుకరించి
ముని వసిష్ఠుడు మురియంగ ననియె నిట్లు. 408

తే. "బాధనందకు మిక్ష్వాకు వంశతిలక!
నే నెరుంగుదు నీ త్యాగనిరతి; కాని
విన దలంచితి నీనోట వివర మెల్ల
నీ మహోన్నత లక్ష్యమే నీకు రక్ష!" 409

తే. అనుచు భరతుని దీవించి ఆ క్షణమ్మె
సంయమీంద్రుడు తన తపశ్శక్తిచేత
సకల వసతులు గల సువిశాలమైన
స్నిగ్ధ సుందర భవనమున్ సృష్టిజేసె. 410

తే. అందులోగల రాజసింహాసనమ్ము
నరసి భరతుడు శ్రీరామునాత్మ దలచి
ప్రణతు లర్పించి మునిపాదపద్మయుగళి
నతుల భక్తిని కన్నుల కద్దుకొనియె. 411

తే. అంత నా మౌని పుంగవు డాదరమున
భరతు బృందము వారినందరను బిలిచి
వేరువేరుగ షడ్రసోపేతమైన
విం దొసంగెను మిక్కిలి వేడ్కతోడ. 412

తే. ఏనుగులు గుఱ్ఱములు గూడ నింతమంచి
తిండి దొరకదు మనకని తృప్తిదీర
వలయు భక్ష్యములను గొంతువరకు మెక్కి
అంద రబ్బురపడులీల చిందు లిడియె. 413

తే. అంద రారాత్రి హాయిగా నచట గడపి
రంత భరతుండు తొలిజామునందె లేచి
ఉదయవిధులను ముగియించి ముద మెలర్ప
చనె భరద్వాజమౌని దర్శనము కొరకు. 414

తే. అప్పటికె మౌనిపుంగవు డాశ్రమమున
అగ్నిహోత్రాదికృత్యము లాచరించి
సరసిజాప్తుని మించుతేజస్సుతోడ
శిష్యబృందము మధ్య వేంచేసియుండె. 415

తే. భరతు డామహనీయుని పాదపద్మ
ములకు ప్రణమిల్లి "మౌనీంద్ర! పూజనీయు
డైన మాయన్న నివసించు నట్టి చోటి
కరుగు మార్గము సెలవిం" డటంచు వేడె. 416

తే. మునివరేణ్యుడు భరతుని వినయశీల
మునకు హర్షించి "ఇనవంశభూష! నీకు
కలుగు మీయన్న దగ్గర కార్యసిద్ధి"
అనుచు నాశీస్సు లందించి అనియె నిట్లు. 417

ఉ. రాముడు చిత్రకూటమున లక్ష్మణుసేవలు నిత్యమందుచున్
భూమిజతోడ మౌనిజనముఖ్యులు మెచ్చగ నున్నవాడు. నీ
వా మహనీయవర్తనున కన్నిట దీటగు వాడ వందుచే
యేమియు సందియమ్ము వల దేగుము నీకట మేలుచేకురున్. 418

తే. మౌనియాశీస్సులను వేదమంత్రములుగ
దలచి భరతుని బృందము తత్క్షణమ్మె
పయన మాయెను రాముని వాసమైన
చిత్రకూటాద్రిజేర నిశ్చింతతోడ. 419

ఆ. కొంతదూర మటుల కోలాహలమ్ముగా
యాత్రసాగిపోయె నంతలోనె
వెంటనున్న గుహుడు వ్రేలెత్తి చూపుచు
"నదియె చిత్రకూట" మని వచించె. 420

తే. భరతు డాప్రాంత సౌందర్య గరిమ నరసి
సంతసమునాపుకొనలేక చెంతనున్న
ముని వసిష్ఠునితో "సాధుజనవతంస!
అద్భుతావహ మిచ్చటి అడవిశోభ. 421

సీ. ఒకవంక బొడగన్న నకలంక జలముతో
నెగసిదూకెడు సెలయేళ్ల సొబగు
ఒకవంక బొడగన్న నుద్యానవనముల
జ్ఞప్తిజేసెడు నికుంజముల సొబగు

ఒకవంక బొడగన్న శుకములతో నిండి
కనువిందుసేయు వృక్షముల సొబగు
ఒకవంక బొడగన్న సకల సౌభాగ్యముల్
ప్రతిఫలించెడు భూధరముల సొబగు

తే. అరసి ఆనంద నర్తన మాడుచున్న
దంతరంగము మాటల కందనటుల
నెంత పున్నెము జేసెనో యిచట దిరుగు
జంతుజాలము తొల్లింటి జన్మమందు. 422

తే. అగ్రజుం డిచ్చటే తన యాశ్రమమ్ము
నేల నిర్మించుకొనెనో నాకిప్ప డర్థ
మాయె గురుదేవ! బృంద మంతటిని యిచటె
యుంచి మన మిద్దరమె బోవు టొప్ప" ననియె. 423

తే ఆ సమయమందు శ్రీరాము డాశ్రమమున
గాక మందాకినీ నదిగట్టుమీద
నునుగు సతితోడ గూర్చుండి అలలు పంచు
అనుపమానందమున దేలియాడుచుండె. 424

తే వారి కల్లంత దూరాన భూరిగుణుడు
లక్ష్మణుం డొక భూరుహరాజ మెక్కి
అన్న వదినల సేమమ్ము నాత్మ దలచి
అప్రమత్తత నల్దిక్కు లరయుచుండె. 425

తే అచట భరతుని సైన్యమా యడవి సోయ
గమున కచ్చెరు వందుచు కాంచనుంటి
మార్తజనబంధు నన్న హర్షాతిరేక
మున నరువసాగె! నింగి మార్మ్రోగునటుల. 426

క ఆ కేకలు లక్ష్మణు చెవి
సోకగనే కలతజెంది శుభసమయమునం
దీకలకల మేమిటియని
చేకొని చాపమ్ము చెట్టు చివరకు జేరెన్. 427

ఆ. అచటినుండి చూచి అది కైక తనయుని
సైన్య మనుచు దలచి సత్వరమ్మె
కొదమసింహ మటుల కుప్పించి చెట్టుపై
నుండి దూకె! పుడమి గుండె లదుర. 428

తే. అతని యాగ్రహావేశాన కాఙ్క్ష మటుల
మరల కేకలు విరివిగా మారుమ్రోగె;
నంత సౌమిత్రి నిస్సంశయముగ భరతు
డగ్రజుని పైకి దండెత్తె నని భ్రమించి. 429

ఆ. విల్లు చేతబట్టి వేగ నారి బిగించి
బాణ మెక్కువెట్టి పర్వు బెట్టె;
నన్నకడకు; రాము డది జూచి "తమ్ముడా!
యేమి జరిగె? బాణ మెందు" కనియె. 430

తే. అంత లక్ష్మణు "డన్న! నిన్ హతు నొనర్ప
దలచి దుష్టుడు భరతుడు దండుతోడ
వచ్చుచున్నాడు వెంటనే వాని కెదురు
బోయి తీక్ష్ణ బాణాలతో పుడమిగూల్తు. 431

తే. వానినే గాదు గ్రుడ్డిగా వానివెంట
నరుగుదెంచిన సైన్య మంతటిని జంపి
నెత్రుటేరులు పారించి నీ ఋణమ్ము
దీర్చుకొనియెద నాశీర్వదింపు" మనియె. 432

తే. అనుగు తమ్ముని యాగ్రహమునకు హేతు
వాతనికి తనపట్ల నున్నట్టి భక్తి
యని గ్రహించిన శ్రీరాము డాత్మలోన
భరతునైజము దలపోసి పలికె నిట్లు. 433

తే. "లక్ష్మణా! నాకు భరతుడు ప్రాణసముడు
చెడును కలనైన దలపని స్నేహశీలి
పగర సైతము ప్రేమించు భవ్యగుణుడు
తప్పగా వాని నెంచుట తగదు మనకు. 434

ఆ. కైక కొమరుడన్న కారణమాత్రాన
సాధుచరితు భరతు జంప బూను
కొనుట మానవత్వమును హత్యజేయుటే
యని యెరుంగవలయు ననుజ నీవు! 435

ఆ. అగ్రజుండు తమ్ము లందర తనయుల
ట్లరయవలయు నట్టు లరయడేని
వానికన్న పాపి వసుధలో నుండడీ
నిజ మెరుంగ వలయు నీవు కూడ. 436

ఆ. వాస్తవముగ వచ్చువాడు భరతు డైన
వాని సంహరించి వసుధ నేలు
కొను తలంపు నీకు మనమున గలదేని
తెలుపు మిపుడు తేటతెల్లముగను. 437

తే. భరతునకు నేను నీ కోర్కె నెరుగజేసి
హింసయన్నది లేకుండ యీ దినమ్మె
రాజ్య మిప్పింతు నీ" కని రాము డనియె!
తత్క్షణమె లక్ష్మణుని యమ్ము ధరణి బడియె. 438

ఆ. అన్న నోటివెంట నంతటి కఠినమౌ
మాట నెపుడు వినని మహితగుణుడు
కంటనీరువెట్టి కరములు ముకుళించి
అనియె నిట్లు మిగుల ఆర్తితోడ. 439

క. "అన్నా! పొరబడితిని నే
నన్నా! నా తప్పు దెలిసె నన్నా! యిక నే
నెన్నడు నొప్పించను, ని
న్నన్నా! నను కరుణజూడు మన్నా!" యనియెన్. 440

తే. అంత శ్రీరాము డనుజుని నాదరమున
దగ్గరకు దీసి కన్నుల తడిని తుడిచి
"మనసు నొప్పించినానని గనకు వగపు;
ధర్మమే గెల్చితీరు నీ ధరణి తుదకు." 441

తే. అనుచు తమ్ముని నోదార్చి యనుగుపత్ని
వంక బొడగని రాముడు "వనరుహాక్షి!
లక్ష్మణుని యాగ్రహమును జల్లార్చుకొరకు
కటువుగా బల్కితిని వేరుగా దలపకు." 442

తే. అనిన వెంటనె జానకి "ఆర్యపుత్ర!
అన్నదమ్ముల మధ్య ప్రేమానురాగ
ములకు శాశ్వత సంకేతములుగ మీరు
నిలిచిపోయెద రవనిలో నిశ్చయముగ." 443

క. అని ధరణిజాత వచియిం
చిన లక్ష్మణు డామె నరసి చేతులు మోడ్చెన్
అనుజుని ప్రియసతి నొకపరి
గని రాముం డా శ్రమమున కరిగెద మనియెన్. 444

తే. కులగురువు తోడ నగ్రజుకొరకు నాల్గు
దెసల నరయుచు జనుదెంచు దివ్యగుణుడు
భరతు డొక సాలవృక్షముపైకి నెక్కి
కనియె రాముని కన్నుల కరవుదీర. 445

తే. వెంటనే చెట్టుదిగి తన వెంటనున్న
మునివరేణ్యు వసిష్ఠుని గని "మహాత్మ!
అదిగో! కన్పించునదియె రామాశ్రమమ్ము
ముందు నేబోయి అన్నకు మ్రొక్కు లిడెద. 446

తే. అంతలో మీరు మనవార లందరకును
పరమ కృపతోడ నీ శుభవార్త దెలిపి
వెంటబెట్టుక రం"డని వినయ మెనయ
బలికి భరతుడు తురగమై పరుగుపెట్టె. 447

తే. ఆశ్రమము ముందు కూర్చుండి యాకసమున
మెల్ల మెల్లగ పయనించు మేఘములను
సతికి జూపుచు రాముడు "సరసిజాక్షి!
చాల ఇష్టము నీలిమేఘాలు నాకు." 448

తే. అనిన భర్తను గని దరహాస మెనయ
"అవును మీమేని వర్ణము నదియెగాన
నేను సైతము పులకింతు నీలిమబ్బు
నరసి"యని పల్కె వైదేహి మరది మురియ. 449

తే. అంతలో "అగ్రజా! రామ!" యనెడు పిలుపు
దిక్కు లన్నిటి యందు ప్రతిధ్వనించె;
రాము డా కంఠరవము భరతుని దంచు
దలచి వెంటనె లేచి యుత్సాహ మొప్ప. 450

తే. హస్తములు సాచి తమ్ముడా! యనుచు బిలిచి
అడుగుముందుకు వేసెడునంతలోనె
బాణమటు దూసుకొని వచ్చి భరతుడన్న
అంఘ్రియుగ్మము ముందు సాష్టాంగపడియె. 451

సీ. అంతలో సాకేత మడవిజేరినయట్టు
లగుపించునట్టి సైన్యమ్ము తోడ
రాజధర్మమ్మును పూజనీయమ్ముగా
దలచెడు సచివసత్తముల తోడ

నాలుగు వేదాల నౌపాసనము బట్టి
నట్టి భూసుర సమూహమ్ముతోడ
గణన కందని లీల గన్పట్టుచున్నట్టి
సకల వృత్తుల పౌరజనము తోడ

తే. ఆర్తితో దూగు రాజ్ఞీత్రయమ్ముతోడ
ఋషి వసిష్ఠుని తోడ శత్రుఘ్నుతోడ
భరతుబృంద మహో రామభద్ర యనుచు
వచ్చి నిలిచెను యాశ్రమవాటిచుట్టు. 452

తే. పరమభక్తుడు దేవుని పదములంటి
శిరము సోకంగ మ్రొక్కిన సరణి ధరణి
పైన బడియున్న భరతుని పట్టిలేపి
అటులె ముద్దాడి శ్రీరాముడనియె నిట్లు. 453

తే. "తమ్ముడా! యేమిటి? యకాలదర్శనమ్ము
నాయన మరెట్టు లున్నారు నగరమందు
రాజ్యపాలన కార్యభారమ్ము వలన
వారిసేవను విస్మరింపంగ దగదు. 454

ఆ. నేను లేని కొరత నీవు శత్రుఘ్నుడు
తీర్చవలయు నట్లు తీర్చకున్న
నందు కొంత పాపమంటు నాకును కాన
జనకు ప్రేమ జూడు" డని వచించి. 455

తే శ్వేత వస్త్రాల మాటున చింతదాచి
తన్మయత్వములో మున్గి తన్నుజూచు
తల్లులను గాంచి రాముడు తండ్రి నాక
మునకు జనె నని దుఃఖాన మునిగిపోయె. 456

తే "తండ్రి దివికేగు సమయాన దగ్గరుండి
వలయు పరిచర్యలను జేయు భాగ్యమునకు
నోచుకొననైతి మారునే? నుదుటి వ్రాత
అకట! యెంతటి నిర్దయు డా విధాత." 457

తే. అనుచు భోరున విలపించు ననుగు సుతుని
తల్లి కౌసల్య యోదార్చి గొల్లు మనియె,
అంత శ్రీరామచంద్రుడు అమ్మకంట
జాలువారెడు నీటిని కేల దుడిచె. 458

ఆ. ఒకరి నొక్క రట్టు లోదార్చుకొనుచున్న
తీరు నరసి కైక "దీనికంత
కారణమ్ము నేను గావున మన్నించు"
మంచు రాము కరములంటి యేడ్చె. 459

తే. అపుడు రామయ్య కైకమ్మ ఆర్తి నరసి
"ఇందు నీ తప్ప రవ్వంతయేని లేదు;
అమ్మ! దయయుంచి నా మాట నమ్ముమమ్మ!
జరుగవలసిన దేదైన జరిగితీరు. 460

తే. అడవులకు నన్ను బంపించినందువలన
తాపసుల మధ్య జీవన తత్త్వ మెరిగి
నడచుకొనునట్టి భాగ్యము నాకు దక్కె
లోక కల్యాణ ఫలితమ్ము నీకు దక్కె." 461

తే. అట్లు రాముడు తన తల్లి ననునయించు
వైన మారసి భరతుని మానసమ్ము
సంబరమ్మున నుప్పొంగు సంద్రమాయె
మాత కైకేయి వేదన మాయమాయె. 462

తే. అంత దాశరథి వసిష్ఠుననుమతిగొని
దివ్య భాగీరథీనదీ తీరమందు
తండ్రిగారికి పిండ ప్రదాన విధులు
నియమనిష్ఠాగరిష్ఠుడై నిర్వహించె. 463

క. ఆపైన నంద రొకచో
కోపము తాపమ్ము మరచి కూర్చొని యుండన్
తాపసియైన వసిష్ఠుడు
చూపరులను తేరిపార జూచి వచించెన్. 464

తే. "నాయనా! రామభద్ర! మీనాన్నగారి
ఆత్మ సంతృప్తి గనురీతి నంత్యకర్మ
జ్యేష్ఠ పుత్రుడ వైన నీ చేతితోడ
జరుపుటను గాంచి నా మది సంతసించె. 465

తే. తాను సైతము నారవస్త్రాలు దాల్చి
భరతు డీరీతి సాకేతపురిని వీడి
నేడు బంధుగులందరి తోడవచ్చి
నిన్ను అర్థించుచున్నాడు చిన్న వరము. 466

క. అని కులగురువు వచించిన
వెనువెంటనె రాము డనియె! "ప్రియసోదర! నీ
కనుమాన మేల నాకడ
మనమున గల వాంఛితమును మానక చెపుమా!" 467

తే. భరతు డామాట మీద దాశరథి నరసి
"అగ్రజా! నీవు రాజుగా అధివసింప
దగిన సింహాసనమ్ము నే దాకుటకును
అర్హుడను గాను మన్నించు" మనుచు మ్రొక్కె. 468

తే. "నే నయోధ్యానగరమున లేనివేళ
జరుగరానట్టి ఘోరము జరిగిపోయె;
దీనబాంధవ! ఆ తప్పు దిద్దుకొనెడు
వరము దయసేయు మని వేడ వచ్చినాడ! 469

తే. జ్యేష్ఠుడవె గాక పూరుష సింహ మీవు
సార్వభౌమాధికారము సాహసమును
సత్యశీలము గలిగిన సజ్జనులకె
దక్కవలె కాన నగరికి తరలిరమ్ము. 470

క. అన్నా! ఇది నా ఒక్కని
విన్నపమే గాదు వేద విదులును మంత్రుల్
పిన్నలు పెద్దలు తల్లులు
నిన్నాహ్వానింప వచ్చి నిలిచిరి కనుమా!" 471

ఆ. ఔను రామచంద్ర! అందర మొక్కటై
నిన్ను వేడుకొనుట కన్నవేరు
మార్గమేది మాకు మదిలోన మెదలదు
అనియె! వేలగొంతు లాక్షణమ్మె. 472

తే. అంత శ్రీరామచంద్రు డేమనునో యనుచు
చిత్రకూటమ్మునంగల చిరుతపులులు,
పక్షులును, లేళ్ళు, కుందేళ్ళు, పన్నగములు
మించుతమితోడ చెవులు రిక్కించి నిలిచె. 473

తే. ప్రేమధాముడైన రాముని కాద్యశ్య
మంతరంగమందు అలజడులను
రేపె; కొంతసేపు లోపల చింతించి
చివర కిట్టు లనియె చిరునగవున. 474

క. “మీ కోరిక కాదనుటకు
నాకు మనం బొప్పదైన నాయనయాజ్ఞన్
చేకొని పాటించక, నే
నీ కాననసీమ వీడి యె ట్లరుదెంతున్? 475

తే. తమ్ముడా! విను మన అన్నదమ్ములందు
సత్త్వవర్తనమందు సంస్కారమందు
ధర్మ సంరక్షణమునందు తాల్మియందు
హెచ్చు తగ్గుల భేద మింతేని లేదు. 476

సీ. ఎన్ని చిక్కు సమస్య లెదురైన మనుజుండు
అడ్డదారులవెంట నరుగరాదు
ఎన్ని ప్రలోభమ్ము లెదుట గవ్వించిన
ధర్మమార్గమ్మును దప్పరాదు
ఎన్ని ఆలోచన లెదను రాపాడిన
నిశ్చలత్వము జారనీయరాదు!
ఎన్ని భీకర శక్తు లేకమై దూకిన
యెదురొడ్డవలెగాని బెదరరాదు

తే. కష్టములు చుట్టుముట్టిన కాలమందు
సైత మాదర్శ జీవన సరణి దప్పి
వక్రమార్గాన పయనించు వాని నెపుడు
జగతి హర్షించ దని గదా! సత్యసూక్తి. 477

తే. తులసి వనమందు గంజాయి మొలవనటుల
మాన్యరఘువంశమందసమర్థులైన
రాజు లుదయించ రన్న పురాతనోక్తి
మరల నే దెల్పవలయునా? భరత నీకు! 478

తే. బిడ్డలకు తండ్రియానతి వేదవాక్య
మగును గావున నద్దాని కందరమును
కట్టుబడవలె! కాన నీ పట్టువీడి
వెడలి రాజ్యాధికారము బడయుమయ్య!” 479

తే. అనిన... వెంటనె జాబాలి అడ్డు తగిలి
మరణ మొందిన జనకుని మాట కొరకు
రాజధర్మము విడనాడి రమణితోడ
అడవులను సంచరించుట న్యాయ మగునె? 480

తే. తల్లియును, తండ్రి, ఇల్లాలు, తనయు లనెడి
అన్ని బంధాలు ప్రాణమున్నంతవరకె
పండినేలను రాలిన ఫలము కొరకు
చెట్టు దుఃఖించ దంతియే జీవికూడ. 481

తే. పతిని గోల్పోయి విలపించు పడతివోలె
దిక్కుమొక్కును లేనట్టి దీనలీల
రాజసింహాసనమ్ము నీ రాక కొరకు
ఎదురుజూచుచు నున్నది యేలుకొనుము." 482

తే. అటుల జాబాలి పలికిన నాలకించి
దశరథాత్మజు డిట్లనె! "తాపసేంద్ర!
పరమనాస్తికుడైనట్టి వానినోట
వెలువడెడు మాట నీనోట పలుక తగునె?" 483

క. అనినంతనే వసిష్ఠుడు
"జననాథా! రామభద్ర! జాబాలి నినున్
కొనిపోవలె నగరమ్మున
కను సంకల్పమ్ము తోడ నా విధి నుడివెన్. 484

తే. అంతియే కాని నాస్తికు డతడుగాడు
రఘుకుల క్షేమమే గోరు రాత్రిపవలు
కాన నా జ్ఞానవృద్ధుని మానసమును
చిన్నబుచ్చక యోచన జేయు" మనియె. 485

తే. "గురువరా! మీరు నామేలు గోరి చెప్ప
బోధనలు విని డెందము పులకరించె;
అంతమాత్రాన జనకుని యాజ్ఞమీరి
రాజ్య మేలంగ రా" నని రాము డనియె. 486

క. వెనువెంటనె కేకయసుత
తనయుండు సుమంత్రు బిలిచి దర్భాసనమున్
ఒనగూర్చు "మో అమాత్యా!"
అని యాదేశించె రాము డచ్చెరు వందన్. 487

తే. "అన్న సాకేతపురమున కరుగుదెంచు
వరకు ప్రాయోపవేశమే ప్రాపునాకు!
లక్ష్యసాధన కొరకు సర్వమును మరచి
నేను గూర్చుందు నిచ్చట మౌని వోలె." 488



క. అని భరతు డనిన వెంటనె
మనమున వ్యాకులత నంది మాన్యచరిత్రున్
అనుజుని గని శ్రీరాముం
డనె పలువురు మెచ్చునట్లు లనురాగమునన్. 489

మ. "భరతా! నీవిటుపల్క పాడియగునా? పట్టాభిషిక్తుండవై
ధరపాలింపగ నన్నియర్హతల నా దైవమ్ము నీకిచ్చె! నీ
వరుదౌ నీ మహితావకాశమును, నీకా జన్మ భాగ్యమ్ముగా
స్థిరచిత్తమ్మున స్వీకరింపు" మనియెన్ ధీరత్వ మేపారగన్. 490

క. అంతట జన సముదాయము
"పంతము విడనాడి రామభద్రుని యానన్
సంతసమున పాటింపుమి
అంతయు శుభ మగును భరత!" యని వాకొనియెన్. 491

తే. "ఆర్య లందరి యుద్దేశ మదియె యైన
ఉభయ తారకమౌ నటు లొక్క మనవి;
చేసికొనియెద నగ్రజా! చిత్తగింపు"
మనుచు కరములు ముకుళించి యనియె మరల. 492

తే. "పరమ పూజ్యుడ! ఇమ్ము నీ పాదుకలను
వాని నగ్రాసనమ్మున పాదుకొల్పి
కోరి భగవంతు గొల్చు పూజారి లీల
నీకు మారుగ విధులు నే నిర్వహింతు." 493

చ. వరగుణుడైన లక్ష్మణుడు వాస్తవ మారసి భాతృభక్తిలో
భరతుడు తన్ను మించెనని బందుగు లందరు మెచ్చ బల్కె తాన్
పరమ కృపాల వాలుడగు పావనమూర్తిని రాము జూచి, "నీ
వరమర వీడి పాదుకల నగ్రజ! తమ్మున కిచ్చు టొప్పగున్." 494

క. అని లక్ష్మణు డనినంతనె
మునివరులును పౌరగణము ముప్వురు తల్లుల్
కొనియాడి రన్నదమ్ముల
అనుపమ హృదయానురాగ మతులిత మనుచున్. 495

తే. రమ్యగుణధాముడైన శ్రీరాము డంత
మారు మాట వచింపగ నోరురాక
పరమపద సౌఖ్య మొనగూర్చు పాదుకలను
వనము పులకింప అనుగు తమ్మున కొసంగె. 496

క. ఇహపర సుఖముల నొసగెడు
సహజన్ముని పావుకోళ్ల జంటను తలపై
బహుభక్తి భరతు డిడుకొని
మిహిరాన్వయమునకు విలువ మిక్కిలి పెంచెన్. 497

తే. యుగయుగమ్ముల నుండి యీ జగమునందు
కాంచి యెరుగను నేనిట్టి ఘటన మనుచు
నింగి పులకించి భరతుని నెత్తిపైన
చినుకులను మంత్రజలముగా జిలుకరించె. 498

సీ. పాలపిట్టలు రామభద్రుండు సాకేత
పురికి చోడిక నని పొంగిపోయె
నెమలి కన్నెల గుంపు నీలమేఘశ్యాము
దరిజేరి లలితనర్తనము సలిపె
పరువాల జింకలు పరుగెత్తుకొని వచ్చి
సీతామహాసాధ్వి చెంత జేరె
అడవి జంతువులన్ని గుడిలోని భక్తుల
పగిది సౌమిత్రికి ప్రణతు లిడియె

తే. అంత నా వింతలను కనులార గాంచి
పూలబాలలు తీవల పొత్తువీడి
అనిలవీచుల దేలుచు అరుగుదెంచి
వ్రాలె వనవాస రాముని పదములందు. 499

సీ. ఆ సన్నివేశము నాగి వీక్షించిన
నదులహో యని పాడి నాట్యమాడె!
ఆ సన్నివేశము నరసి బళీ యని
తరు లొక్కసారిగా తలల నూపె!
ఆ సన్నివేశము అత్యద్భుతమ్మని
పొంగి పర్వతపంక్తి తొంగిచూచె
ఆ సన్నివేశము అపురూప మనియెంచి
లేత పచ్చికబీళ్ళు పూతబూచె

తే. అదియె తమభాగ్య మని యెంచి వెదురు పొదలు
ఈలపాటలు కమ్మగా నాలపించె;
ఒక్కటేమిటి? దిక్కులు పిక్కటిల్ల
రాము గీర్తించె సకలచరాచరములు. 500

తే. "కాల మెన్ని విషమపరీక్షలను మనకు
పెట్టి ముట్టడి జేసిన పట్టుబట్టి
కథ సుఖాంత మొనర్చిన ఘనత నీది"
అనుచు రాముడు భరతుని యభినుతించె. 501

తే. అటుల నగ్రజునాశీస్సు లందుకొనిన
తమ్ము డిట్లనె "నేడు నాతలకు మించి
నట్టి భారము శిరమున బెట్టినావు
రామ! తెల్పుము రాజధర్మములు కొన్ని. 502

ఆ. తల్లిచాటుబిడ్డ తండ్రిని బతిమాలు
కొనిన రీతి వేడుకొనిన నను
నాదరమున జూచి ఆలింగనము జేసి
రాము డిటుల దెలిపె! రాజనీతి. 503

తే. "ప్రజల సుఖశాంతులే రాజ్యపాలనమున
ప్రథమ కర్తవ్యమను సూక్తి ప్రభు వెరింగి
అహరహమ్మును నా యాశయమ్ము దెసగ
పయన మొనరించి సత్కీర్తి బడయవలయు. 504

తే. ధరణి పతియెంత పాలనదక్షు డైన
విబుధులగు రాజనీతి కోవిదులతోడ
కలసి చర్చింప కేరాచకార్య మైన
ఏకపక్షముగా నిర్ణయింప దగదు. 505

తే. అన్యకాంతల నాశించునట్టి పతిని
భార్య యేరీతి ద్వేషభావమున జూచు
నటులె ఆచార విభ్రష్టు డైన ప్రభుని
ప్రజలు దుర్నీతి పరునిగా పరిగణింత్రు. 506

తే. విశ్వమందున రాజ్యము వీరభోజ్య
మనెడు సూక్తిని మన్నీడు అప్రమత్తు
డగుచు పాటించి శత్రు సంహారమునకు
వలయు సైనికశక్తితో నిలువవలయు. 507

చ. భుజబలమున్న యోధులను బుద్ధిబలమ్ముగలట్టి మంత్రులన్
కుజనులు పన్ను వ్యూహముల గుట్టునెరింగెడు గూఢచారులన్
స్వజనులుగా దలంచి జనపాలుడు వారల సంప్రదించుచున్
విజయపథమ్ము నారసి వివేకముతో ధర నేలగావలెన్." 508

తే. ప్రభుత సక్రమముగ సాగవలయునన్న
పన్నువేయక తప్పదు ప్రజలపైన
కాని ఆ పన్ను మితిలేని దైన యెడల
ఎదురు దిరిగెద రందరు - అదను జూచి. 509

ఆ. హస్తకళలపట్ల అధికాదరము జూపి
హితవుగోరి ప్రోత్సహింపవలయు
కళలు పేదవైన కాంతి నశించును
దేశ సంస్కృతియును నాశ మగును. 510

తే. ప్రజకు మానసికానంద పరిమళమును
పంచిపెట్టెడు వైవిధ్యభరితమైన
నృత్యగాంధర్వ సరససాహిత్యములకు
ప్రభువు నీరాజనమ్ములు పట్ట వలయు. 511

తే. ప్రొద్దువాలిన వృద్ధు లే ప్రొద్దుగూడ
ముద్దుముచ్చటలను గోలుపోవరాదు
కాన తగురీతి వసతులు గలుగజేసి
వారి దీవన లందుకోవలయు రాజు. 512

ఆ. భావిపౌరులైన బాలబాలికలను
బుద్ధి గరపి తీర్చిదిద్దునట్టి
గురుకులములు పెట్టి పరమోన్నతములైన
నీతినియమములను నేర్పవలయు. 513

తే. జనుల ఆరోగ్యమే దేశమునకు బలము
ప్రజలు బలహీను లైనచో బక్కచిక్కు
దేశమటుగాన వారికి దివ్యమైన
వైద్య మాహార మందించవలయు విభుడు. 514

తే. తప్పుజేసినవానికి దండనయును
మంచిజేసిన వానికి మన్ననయును
జరిగి తీరగవలెనన్న ధర్మ మెరిగి
పాలనము సేయవలయును ప్రభువు సతము. 515

తే. ప్రజల బాధల నేలిక ప్రతిదినమ్ము
అమలదరహాసవదనుడై ఆలకించి
మంత్రివరులను బిలిచి సమస్యలన్ని
దెలిపి తత్క్షణమే వాని దీర్పవలయు." 516

చం. అని యిటు రాజధర్మముల నందరు మెచ్చగ దెల్పి "తమ్ముడా!
వనమును వీడి నేడె పరివారముతోడ నయోధ్యకేగి నీ
వనుపమలీల తండ్రి మహితాశయ మూతగ కోసలావనిన్
ఘనముగ నేలి సద్యశము గాంచు" మనెన్ రఘురాము డంతటన్. 517

తే. "అన్న! వినుమన్న! వనవాస మైన పిదప
వదినయును నీవు వేగ రావలయునన్న
తడవుసేసిన దక్కడీ తమ్ము" డనుచు
వినయమేపార భరతుడు వేడుకొనియె. 518

తే. అంత రాముడు భరతున కభయ మొసగి
మాతృమూర్తుల కడకేగి మౌనముగనె
కన్ను లరమోడ్చి మ్రొక్కి గద్గదిక యెసగ
సెలవు నాకని పలికి యా చెంతనున్న. 519

తే. గురువరేణ్యుల మంత్రుల పురజనముల
నరసి కరములు ముకుళించి "భరతు మీకు
నప్పగించితి నిక నేను తప్పకొందు"
ననుచు నరిగెను శ్రీరాము డచటినుండి. 520

తే. భరతు డంతట శ్రీరామపాదుకలను
భక్తి నర్చించుటను గని భద్రగజము
ముందు కరుదెంచి తలవంచి మోకరిల్లె
చిత్రకూటము కన్నులు చెమ్మగిల్ల. 521

ఆ. పావుకోళ్ళు మోయు భాగ్యము నా కిడు
మనిన రీతి కన్ను లార్పకుండ
జూచుచున్న కరిని చోద్యమ్ముగా జూచి
భరతు డన్ని మరచి పరవశించి. 522

తే. భక్తిలో నన్ను మించెను భద్రగజము
అనుచు ముమ్మారు తా ప్రదక్షిణము సలిపి
పాదుకల జంట నంబారి పైన నిలిపి
సపరివారముగ నతండు సాగిపోయె. 523

తే. భరతు డారీతి మందిమార్బలముతోడ
బయలుదేరిన మంగళవార్త దెలిసి
దారిపొడవున జయజయధ్వానములను
సలిపి సంబరపడినవి జనపదములు. 524

ఉ. ముందు వసిష్ఠమౌని, బుధముఖ్యులు, మంత్రులు, ముప్పురమ్మలున్
స్యందన బృందమెక్కి చన సైన్య సమూహము, వెంటరాగ, వా
రందరి మధ్య నా యినకులాంబుధి సోముడు పావుకోళ్లతో
సుందరమందహాసరుచి శోభితుడై చనుచుండ నంతలో. 525

ఆ. ముందు గానుపించె ముని భరద్వాజుని
అతులశాంతి నిలయ మాశ్రమమ్ము;
అంద రచటి కేగి ఆతిథ్యమును గొని
అవధిలేని తృప్తి నందినారు. 526

క. అంత వసిష్ఠుడు జరిగిన
దంతయు వివరముగ దెలిపె నది విని మునియున్
సంతసము జెంది భరతుని
పంతమ్మును భ్రాతృభక్తి ప్రస్తుతి జేసెన్. 527

క. మునిచంద్రుండటు మెచ్చిన
వెనువెంటనె నాకజాతివెలదుల క్రీడా
వనకన్యావళి రాఘవు
ఘనతను రసవత్తరముగ గానముజేసెన్. 528

చ. శిలలు ద్రవించి పారునటు చిత్తరువుల్ వలె మంత్రముగ్ధులై
పలువురు బాగు బాగు సెహబాసని మెచ్చెడు రీతి తేనియల్
జిలికిన మాడ్కి సాగిన విశిష్ట సుధామధురైకగానమన్
జలనిధి నోలలాడె రఘుసత్తము డెంతొ ప్రమోదచిత్తుడై. 529

తే. అంతలో నొక్క పసికపియరుగుదెంచి
అచ్చముగ రాము పోలిక నలరుచున్న
ముగ్ధమోహన సుందరు ముందు నిలిచి
ముసిముసిగ నవ్వి ఒక చిన్ని పువ్వునిచ్చె. 530

ఆ. బుల్లిపిల్లకోతి బుడిబుడి నడకతో
వచ్చి కైక తనయు నిచ్చమెచ్చి
పూవునిడిన ఘటన పులకింపజేసెను
అపరనాకమైన యాశ్రమమును. 531

తే. భరతు డాపూలబాలను వానరమును
మౌనివరులను తల్లుల మార్చి మార్చి
చూచి యోచించి మిక్కిలి సునిశితముగ
భక్తిభావము జాల్వార పలికెనిట్లు. 532

ఉ. వానర వత్స "నన్ను రఘువంశ సుధాంబుధి చంద్రు రాముగా
మానసమందు నెంచె నిది మాటలకందని ప్రేమ; కాని, ఈ
కానుక కే ననర్హుడను; కావున నిశ్చలభక్తి నగ్రజున్
ధ్యానముజేసి పాదుకల కర్పణ జేసెద నీ ప్రసూనమున్." 533

ఆ. **అనుచు పైకి లేచి అతి వినమ్రతతోడ**
అన్న పావుకోళ్ల కంజలించి
పూవు నచటబెట్టి పూజించె సుమదాయి
చిన్ని కనులు మురిసి చెమ్మగిల్ల. 534

క. అది జూచి భరద్వాజుడు
ముదమున ప్రేమానురాగములు జాల్వారన్
సదసద్వివేకవంతుడు
విదితయశుండైన భరతు విజ్ఞత నెంచెన్. 535

ఉ. "చూచితివా! వసిష్ఠ! కడు చోద్యముగా నొక కోతి యప్పడే
పూచిన పుష్పబాలికను పూజ్యపదుం డని బుద్ధినెంచి, యీ
రాచకుమారుడైన రఘురాముని తమ్మున కిచ్చె, గాని, తా
నాచిరుకానుకన్ భరతు డగ్రజు పూజ కొసంగె భక్తితో. 536

ఆ. ముందు ముందు జనము లందించుకానుక
లన్న పాదుకలకె అర్పణమ్ము
జేతు ననుచు మనకు చెప్పక చెప్పిన
భరతు గనిన కైక భవ్యచరిత." 537

క. అనిన మునీంద్రుని పలుకులు
విని యానందమ్ము మదిని వెల్లివిరియగా
చని కైక వందన మ్మిడి
తనయుని దీవింపు డనియె తాపసవరుతో. 538

ఆ. తల్లి ననుసరించి తాను భరద్వాజు
పదములంటి మ్రొక్కి భరతు డపుడు
నన్ను కనికరించి నా బాధ్యతలు దెల్పు
డనుచు వేడుకొనియె నా యతీంద్రు. 539

తే. మునివతంసుడు భరతుని మోమునరసి
"చూడు రామానుజా! నీవు సూర్యవంశ
మందు బుట్టిన పుణ్యుడ వందువలన
మానవత నీకు పుట్టుకతోనె యబ్బె. 540

చ. వయసున పిన్నవయ్యు ననవద్యగుణమ్ముల మిన్నవీవు, నీ
నియమ నిబద్ధభక్తి గణనీయము రామునిపట్ల, నీకదే
జయ మొనగూర్చుగాననిక జా గొనరింప కయోధ్యకేగి, ని
ర్భయముగ ధర్మబద్ధముగ పాలన సేయుము కోసలావనిన్. 541

క. ఉన్నది పదునాల్గేడులె
యన్నది గుర్తుంచుకొనుచు, నా సమయము, నీ
కన్న యొసంగిన వరమని
పున్నెము పండించుకొనుము భూమీశుడుగా." 542

క. అనిన మునీంద్రుని పలుకులు
తనకు శిరోధార్యములుగ తలపోయుచు, పా
వన చరితుడు భరతుం డపు
డనుచరులను గూడి పయన మాయెను పురికిన్. 543

క. భరతుని పరివార మ్మటు
లరిగెడు కోలాహలమ్ము లాకస మంటెన్
సురలోకమంతటా ధ్వని
పరిమళమ్మై వ్యాప్తి జెందె బహుముఖములుగా. 544

తే. స్వర్గలోకమునందున్న పంక్తిరథుడు
కర్ణపేయమ్ముగా దోచు కలకలమును
పరిచితమ్మైన రవళిగా పరిగణించి
తొందరించెడు మనసుతో తొంగిచూచి. 545

తే. "స్వీయ ధర్మము మరచి నే జేసినట్టి
తప్పు సరిదిద్ది నాయాత్మ తాప మణచి
నట్టి సుతులార! మీకు దీర్ఘాయురస్తు!"
అనుచు మనసార దీవన లందజేసె. 546

ఆ. సాగిపోవుచున్న సాకేతపురి బృంద
మడ్డుదగిలినట్టి యమున దరిని
కొంతసేదదీరి క్రొత్త ఉత్సాహము
నిర్మలోదకమున నింపుకొనియె. 547

ఉ. అచ్చటనున్న చెంచు ప్రజలందరు వారల జూచి మెచ్చి, మా
ముచ్చటదీర్ప వచ్చితిరి, మ్రొక్కులు గైకొను డయ్యలార! యం
చిచ్చిరి కందమూలముల నింతకు మించి మరేమి మీకు, మే
మిచ్చుకొనంగ జాలమని యెల్లరు సంతస మందునట్లుగా. 548

ఆ. ప్రేమతోడనిచ్చు పేలాలు సైతము
అమృతరస సమాన మనితలంచి
అందరారగించి రాకందమూలాలు
చిందు లాడిరపుడు చెంచుప్రజలు. 549

ఆ. అంతలోనె నావ లన్ని సిద్ధ మటంచు
పలికె గుహుడు భక్తిభావ మెనయ
భరతు డతని మెచ్చి పలుమార్లు కొనియాడి
పాదుకలను దాల్చి పయన మాయె. 550

క. అంతట వారందరు గుహు
నెంతయు నుతియించి పడవ లెక్కిరి బెస్తల్
సంతసమున హైలెస్సా
యెంతటి భాగ్యమ్ము కలిగె నీదిన మనుచున్. 551

తే. అటుల నావికు లందరు ఆడిపాడి
రంగురంగుల జెండా లలంకరించి
యున్న నావల గూర్చున్న యోధతతికి
కరములను మోడ్చి కదలిరి గట్టువిడిచి. 552

క. సాగెడు పడవల బారును
మూగగ దిలకించి మురిసి పోయిన మీనా
లూగెడు అలలం దేలుచు
స్వాగత సత్కారములకు సందడి బెంచెన్. 553

ఆ. వందలాది పడవ లందాల యమునపై
బారుదీరిపోవు తీరు నరసి
చెంతనున్న పొన్నచెట్లు శిరము లూపి
అలలమీద జల్లె నలరుగములు. 554

ఆ. పూలు నీటిపైన దేలియాడుచు వచ్చి
అతిథివరుల నెల్ల నలర జేసె
పెక్కుమాటలేల నిక్క మా యానంద
మనుభవైక వేద్య మనుట లెస్స. 555

తే. అటుల జరిగిన పడవల యాత్ర ముగిసి
అంద రాయొడ్డు జేరినా రంత గుహుడు
"రండి దొరలార! మీరంత రాత్రి విడిది
శృంగి బేరపురమ్మున జేతు" రనియె. 556

ఆ. అంద రచటి కేగి ఆ రాత్రి గుహుడిచ్చి
నట్టి విందు తృప్తి నారగించి
పయనమైరి మరల ప్రత్యూష సమయాన
శీఘ్రముగ నయోధ్య జేరదలచి. 557

ఆ. సకల బంధుగణము శకటాలు గుఱ్ఱాలు
మదగజములు భటులు మంత్రివరులు
మునులు, బుధులు, హితులు, ముప్పురు తల్లులు
చనిరి భరతువెంట సంతసమున. 558

తే. వాసవుడు సైత మబ్బురపడు విధాన
అఖిల జనరంజకమ్మౌచు నలరులీల
చెకచెకన్ సాగి రాముపాదుకలయాత్ర
చేరె సాకేతపురి పొలిమేర దరికి. 559

తే. భరతు డంతట నగరికి పరుగువెట్టి
తోరణద్వారముంజేరి పారజూచి
చిత్త విభ్రమ మంది నిశ్చేష్టు డాయె
అతని సంతోష మంతయు నావిరాయె. 560

సీ. బాలభానుడు లేని ప్రాగ్దిశ చందాన
సలిల బిందువులేని కొలను పగిది
విచ్ఛిన్నతంత్రియౌ వీణవిధమ్మున
నుదుట కుంకుమలేని ముదిత కరణి
మోడు వారిన జాజిపూదోట పోలిక
నేలకొరిగిన రసాలమటుల
దేవుడు లేనట్టి దేవాలయములీల
అగ్ని కాహుతియైన అడవివోలె

తే. శీతకిరణుడు లేని నిశీథిని వలె
పెన్నిధిని గోలుపోయిన పేదభంగి
కానుపించెడి ఆ రాజధాని నగరి
కైక కొమరుని కన్నీటి కడలి ముంచె. 561

తే. కొంత తడవట్లు చింతించి అంతలోనె
తేరుకొని తల్లులను జేరి వారినెల్ల
అంతిపురమున దిగబెట్టి అంతరంగ
మందు యోచించి యొక నిర్ణయమ్ము నంది. 562

క. కులగురువైన వసిష్ఠుని
పలు విధముల బ్రస్తుతించి "పావన చరితా!
తెలిపెద నొక విన్నపమును
అలుగక కరుణింపు" డంచు నభ్యర్థించెన్. 563

ఆ. "ప్రేమ మీర గన్న ప్రియజనకుండును
కన్నతండ్రి వంటి అన్నలేని
ఈ అయోధ్యయందు ఏ నొక్కక్షణమైన
గుండె దిటవుతోడ నుండజాల. 564

సీ. నందనోద్యానాల పందె మందున గెల్చు
పూదోట లన్నియు బోసిపోయె
నృత్యగానాదుల నిలయమై విలసిల్లు
నర్తనశాలలు నాశమాయె
దేదీప్యమానమౌ దివ్యకాంతులు జిమ్ము
ఘనసౌధములను చీకటులు ముసిరె
ముత్తైదువలు దీర్చు ముత్యాలముగ్గుల
ముంగిళ్ళ మసిబారి రంగువెలసె

తే. నిరతమును వేద ఘోషల పరవశించు
గురుకులమ్ముల నొకచదువరియు లేక
బోధనాచార్యులును లేక మూగవోయి
శిథిల దేవాలయమ్ములై వ్యధ మిగిల్చె. 565

తే. కాన శ్రీరామచంద్రుడు కాననమును
వదలి సీతమ్మతో కూడి వచ్చువరకు
పాదుకలు నందిగ్రామాన పాదుకొల్పి
నిత్య మటనుండి పాలన నిర్వహింతు. 566

ఆ. అడవులందునున్న అన్న పరుండెడు
నేలపరుపె నాకు పూలపాన్పు
వారివలెనె నేను వాన ప్రస్థాశ్రమ
ధర్మ మనుసరింతు తపసివోలె." 567

క. "భరతా! నీ సంకల్పము
పరమ ముదావహము సూర్యవంశము నీచే
తరియించె" నని వసిష్ఠుడు
పరివారము మెచ్చు నటుల ప్రస్తుతి జేసెన్. 568

తే. భరతు డంతట రథమెక్కి పాదుకలను
శిరమునం జేర్చి ప్రజల జేజేల నడుమ
కదలె నుత్సాహమున నంది గ్రామమునకు
గణన కెక్కిన అనుచరగణముతోడ. 569

తే. నంది గ్రామము భరతుని బృందమునకు
కనులు మిరుమిట్లు గొలుపు స్వాగత మొసంగె;
అస్తు - శ్రీరస్తు - లోకకల్యాణమస్తు!
అను నినాదము లంబరమంట మ్రోగె. 570

గీతి. అదిగదిగో మొదలైన దానందహేల!
అమరేంద్రుడే యీర్ష్యనందెడిలీల!
రథము దిగినాడదే రాజు భరతుండు!
రాగరంజితమాయె! నారాముదండు!
గుడిగంట శుభమస్తు పలికి దీవించె!
కోటిగొంతుల తోడ ఊరు నినదించె!
వివిధ మంగళవాద్యములు మారుమ్రోగె!
విజయదుందుభులతో ఉత్సవము సాగె!
ఇరువైపులను బారుదీరి జవరాండ్రు!
మురిసి విసిరిన విరులు ద్రొక్కె పరవళ్ళు!
రామానుజుం డపుడు వేయు ప్రతి అడుగు!
రాజశాసనములకు ముత్యాల గొడుగు!
మున్నెన్నడెరుగనీ ఆ మహోత్సవము!
కన్నులార్పక చూచె రాజమందిరము
స్వాగతము శ్రీరాము పదముద్రికలకు
స్వాగతము ప్రభువు చిన్నారి భరతునకు
అని యాడిపాడినా రంతిపురి జనులు
అదిజూచి ప్రతివార లైనారు మునులు
కులగురువు ననుమతిని గొని కైక సుతుడు
కోదండరాముని పాదుకల నపుడు
నవరత్న ఖచితమౌ సింహాసనమున
సవినయముగా నుంచి తన మానసమున
భక్తి శ్రద్ధలతోడ నన్న నర్చించి
భార మంతయు నీదె యనుచు ప్రార్థించె
బళిబళీయని మెచ్చి బ్రాహ్మణోత్తములు
పఠియించి నారంత పురుష సూక్తమును. 571

ఆ. వేదఘోషనడుమ పాదుకాపట్టాభి
షేక మపుడు జరిగె! నాకలోక
వాసులెల్ల మెచ్చి సేసలు పైజల్లి
బహుముఖముల శుభము పలికి రపుడు. 572

శ్రీరామ పాదుకా పట్టాభిషేకం!
రామాయణానికే తలమానికం! 573

ఆ. పాదుకలకు తాను ప్రతినిధిగా నిల్చి
భరతు డచట రాజ్యపాలనమ్ము
నెరపసాగె నన్న తిరిగి వచ్చెడి రోజు
పట్టువిడక లెక్కబెట్టుకొనుచు. 574

క. తనయాశయమ్ము మేరకు
ఘనుడగు భరతుండు నంది గ్రామమునందున్
జనహితముగ పరిపాలన
మొనరించుట నెరిగి రాము డూరట చెందెన్. 575

క. మునిజనవంద్యుడు రాముం
డనుగుంజెలితోడ మరియు ననుజన్మునితో
వనవాసపుటనుభూతుల
ననునిమిష మ్మారగించి అలరుచునుండెన్. 576

క. ఇచ్చట మన ముండినచో
వచ్చెద రెల్లపు డయోధ్యవాసులుచూడన్
మచ్చిక వారలు నుడివెడు
ముచ్చటలను వినిన దీక్ష మొదలంట చెడున్. 577

ఆ. మరల మీ రయోధ్య కరుదెంచ వలెనని
వారలెల్ల మనల గోరవచ్చు;
కాన నిప్ప డత్రి మౌనివతంసుని
ఆశ్రమమ్ముజేర నరుగుటొప్ప. 578

క. అని శ్రీరఘురాముడు తెలి
పిన సీతయు లక్ష్మణుండు వినయమ్మెనయన్
చనియెద మందర మటులే
యని కదలిరి రామువెంట ఆనందముతో. 579

ఆ. అటుల ముఫ్వు రరిగి అత్రిమహాముని
ఆశ్రమమ్ముజేరి ఆ మహాత్ము
పాద పద్మములకు ప్రణమిల్లి రది జూచి
ఆశ్రమమ్ము పొందె నతులముదము. 580

తే. అంత కోదండరాముడు సంతసమున
తాపసోత్తమ! "మీ దివ్య దర్శనమున
వాసి పెరిగెను మా వనవాసమునకు
అందజేయుడు దయయుంచి ఆశిషములు." 581

క. అని కరము మోడ్చి వేడిన
ముని తిలకుడు రాము శిరము ముద్దాడి "ఘనా
ఘనసుందర! జనవందిత!
నిను గను భాగ్యమ్ము నాకు నేటికి గలిగెన్. 582

క. మీ ముప్పురి మూలమ్మున
ఈ మహి దుర్మార్గములకు నిక తెరవాలున్
సేమము గలుగును మునులకు
కామిత ఫలసిద్ధి లెల్ల కలుగును ప్రజకున్." 583

క. అని పలికి జానకీసతి
కనసూయనుజూపి యనియె నా తాపసి, "దీ
వనలందు కొనుము తల్లీ!
మునుముందవి నీకు మిగుల మోదము గూర్చున్." 584

ఆ. కన్నతండ్రిలీల కడుప్రేమతో తన్ను
ఆదరించి పలికినట్టి మౌని
పలుకు మేర కపుడె పతి యనుమతి గొని
ఆమె కడకు జనియె నవనిజాత. 585

సీ. బ్రహ్మ విష్ణు శివుల బాలుర గావించి
ఉయ్యాల లూపిన యువిదమిన్న!
ముప్పురమ్మల నెత్తి మొట్టి గర్వ మడంచి
ప్రణతులు గైకొన్న వర గుణాఢ్య!
ముని నారదుని కోర్కె నినుప గుగ్గిళ్లను
వండి వడ్డించిన పరమసాధ్వి!
ఘనతపశ్శక్తితో గంగను పొంగించి
కరువును బాపిన కల్పవల్లి!

తే. పండువెన్నెల కెరటాల పిండువోలె
పండి యెండిన కురులతో పరిఢవిల్లు
భవ్యచారిత్ర! అనసూయ వదన మరసి
పాదముల ప్రోల సాష్టాంగపడియె సీత. 586

తే. ఆ మహాదేవి జానకి ననునయించి
"ముగ్ధమోహనమైన నీ మోమునందు
కొలువుదీరినదమ్మ! వైకుంఠ మనియె!"
హృదయ ముప్పొంగి వైదేహి యిట్టు లనియె. 587

ఆ. "అమ్మ లేనిదాన అడవికి స్వామితో
జేరి వచ్చినట్టి చిన్నదాన
ఇచట సంభవించు నిడుమల నవలీల
నెదురు కొనెడు వరము నీయుమమ్మ!" 588

తే. అనిన భూజాత నారసి అత్రిమౌని
కూర్మి అర్ధాంగి అనసూయ పేర్మిమీర
"అమ్మలే దనుమాట నీవనకు మమ్మ!
అమ్మలకు అమ్మ ధరణి మీ అమ్మగాదె. 589

తే. కష్టముల నీడనైనను కాంచి యెరుగ
నట్టిదానవు! మిథిలేశు అనుగు సుతవు!
భోగభాగ్యాలు విడనాడి యోగిని వలె
అడవులకు భర్త వెంబడి నడచినావు. 590

క. పతి తోడిదె లోకమ్మని
జతబాయక సేవజేయు సంకల్పముతో
వ్రతదీక్షను గొనిన పతి
వ్రతగా నిను విశ్వమంత ప్రస్తుతి జేయున్." 591

తే. అనిన వెంటనె సీత "అట్లనకు మమ్మ!
తాళిద్రెంచిన కాలుని తరిమిపట్టి
పసుపుకుంకుమ వరముగా బడసినట్టి
సాధ్వి సావిత్రిలేదె? యీ జగమునందు. 592

తే. అంతవర కెందుకమ్మ! యీ అవనిలోన
వరసతీత్వమునందు నీ ప్రక్క నిలువ
గలుగు నిల్లాలి నెవరిని గాంచమమ్మ!
అమ్మ! నీముందు నేనొక అణువునమ్మ!" 593

తే. అనిన శ్రీరామునిల్లాలి వినయమునకు
ఆమె యౌన్నత్యమునకు తా నబ్బురపడి
ఆ తపస్విని గోముగా అడిగె నిటుల
"ధరణిజా! తెల్పునీ స్వయంవరము గాథ. 594

క. ఆనాటి వింతకథలను
ఈనాటికి జెప్పచుందు రెల్లరు, కానీ
నీనోట విన దలంచితి
ఈనాచిరుకోర్కె దీర్పు మెంతయు ప్రీతిన్." 595

ఆ. అనుచు బుజ్జగించి అడిగినంతనె సీత
మోమునందు సిగ్గు మొగ్గదొడిగె;
అయిన నాటి తీపి అనుభూతులను గుర్తు
జేసి కొనుచు నిట్లు చెప్పదొడగె. 596

ఆ. "మరచిపోదమన్న మరపురాదమ్మ! నా
వ్రాతమార్చి నేను రామభద్రు
పాణినందు కొనెడు భాగ్య మొసంగిన
నాటి మురిపె మెన్నినాళ్లకైన. 597

తే. ఎవరు ముక్కంటి చాపమ్ము నెక్కుపెట్టి
నిలిచి గెలుతురొ? వానినే నీరజాక్షి
సీత వరియించు నని తండ్రి చెప్పినట్టి
మాట జ్ఞప్తికి వచ్చి నా మనసు చెదిరె. 598

తే. అంత చేతులు జోడించి హరిహరాది
దేవతల నెల్ల వేడితి దీనవోలె;
ధర్మనిరతుడె శ్రీకంఠుధనువు వంచు
వరము దయచేసి నన్ను కాపాడు డనుచు. 599

తే. వెంటనే నేటి నా స్వామి పెళ్ళు మనుచు
పరమశివుచాప మవలీల విరిచె నన్న
శ్రవణహితమైన వార్తను సఖి యొకర్తె
మోసికొని వచ్చి ప్రేమతో ముందునిలిపె. 600

సీ. జనకు డచ్చెరువంద ధనువు ఛేదించిన
రాకుమారుని పేరు రాము డనుచు
అతని నేత్రద్వయ మ్మప్పుడే విరిసిన
రమ్యరాజీవ పత్రమ్ము లనుచు
ఆతని ముద్దుమో మన్ని వేళలయందు
వెలుగు లీనెడు చంద్రబింబ మనుచు
అతని వక్షః స్థల మ్మతిలోక సౌందర్య
మునకు కాణాచియై దనరు ననుచు

ఆ. ఆచితూచి యాత డాడెడు మాటలు
కండచక్కెర వలె కమ్మ ననుచు
చెప్పి చెప్పి నన్ను చెలికత్తె మధురోహ
లందు దేలియాడు నటు లొనర్చె. 601

సీ. పున్నమ జాబిల్లి పుడమికి దిగివచ్చి
పులకింత లెదపైన చిలికినట్లు
శక్రకోదండము సారెసారెకు వంగి
చెవిలోన గుసగుసల్ చెప్పినట్లు
తెలిమబ్బు కన్నియల్ తేరులో అరుదెంచి
తుంపురుల్ నిలువెల్ల తురిమినట్లు
మండువేసవిలోన మంచి గంధపు వాన
కుండపోతగ పైన కురిసినట్లు

తే. మానసమునందు అవ్యక్తమధురమైన
ప్రణయ భావతరంగముల్ పర్వు లెత్తె
ఆగలేనని వరమాల వేగిరముగ
రామభద్రుని కంఠ మలంకరించె. 602

తే. అంత రఘుకుల తిలకు డావంత యేని
తడవుసేయక సభ కంటపడని లీల
కథలు సుధలొల్కునటు జెప్పకనులతోనె
యెరుగ జేసెను తనకు నే నిష్ట మనుచు. 603

ఆ. అపుడు నేను స్వర్గ మడుగకయే వచ్చి
ముందువాలినట్లు మురిసిపోతి;
గాధిసూతికూడ కల్యాణమస్తని
దీవెనలను మాకు దెలియజేసె." 604

ఆ. తన్ను తాను మరచి తన్మయత్వమ్ముతో
సీత గతమునంత జెప్పచున్న
సరణి నరసి అత్రిసతి సంతస మ్మంది
నర్మగర్భితముగ నవ్వుకొనియె. 605

క. అది గమనించిన జానకి
"ముద మతిశయమంది నాటి ముచ్చట లెల్లన్
వదరితి నతిగా మాతా!
మదిలో నీ సుతగ నెంచి మన్నింపు" మనెన్. 606

తే. "లేదు జానకి! నీ తప్పు లేశమైన
అపుకోలేక, నీవు నే నడుగగానె
క్రొత్త సంగతు లెన్నియో కుప్పపోసి
ముసలిమనసుకు మధురిమ బూసినావు. 607

ఆ. నీకు పెండ్లికాన్క నే నిపు డిచ్చెద"
ననుచు మౌని పత్ని ఆదరమున
పట్టుచీర కొన్ని పసిడి ఆభరణాలు
మేలి లేపనములు పూలు నొసగి. 608

ఆ. "పరిమళమ్ము సెడవు వాడవీ సుమములు
చీర నలిగిపోదు చిరిగిపోదు
కాంతి తరుగ వెపుడు కనకభూషణములు
లేపనములు క్రొత్త రూపు నొసగు. 609

ఆ. ముందు పట్టుచీర ముచ్చటగా గట్టి
కురులు దువ్వి సిగను విరులు దురిమి
అన్ని నగలు మేని కందమ్ముగా దాల్చి
నీవు కనులముందు నిలువు మమ్మ." 610

తే. అనియె మునిపత్ని, సీత మహాప్రసాద
మనుచు వెంటనె ఆమె వాకొనిన రీతి
మొత్తముగ నన్ని ధరియించి మురిపె మొలుక
ముగ్ధమోహనరూపాన ముందు నిలిచె. 611

తే. అంత మునిపత్ని కనురెప్ప లార్పకుండ
అవనిజను జూచి నుదురు ముద్దాడియాడి
"చూడు జానకి! యిపుడు నీ సోయగమును
పతికి జూపింపు మాతడు పరవశించు." 612

తే. అనుచు అనసూయ దెలిపిన అవనితనయ
ఆమె పాదములకు మ్రొక్కి అనుమతిగొని
ముసిముసిగ నవ్వుకొనుచు తా ముద మెలర్ప
అరిగె వేవేగ తన మనోహరుని కడకు. 613

క. విరబూసిన అందముతో
అరమరలకు తావులేని ఆనందముతో
పురివిప్పిన పరువము వలె
అరుదెంచిన సీత రాము నబ్బురపరచెన్. 614

తే. క్రొత్తకళ ఉట్టిపడుచున్న కూర్మిసతిని
గాంచి వనవాసరాముడా క్షణమునందు
రాగరంజిత కల్యాణ రాము డాయె
సీత నునుసిగ్గుతో పెండ్లికూతు రాయె. 615

క. ఆ రాతి రొకరి కొకరుగ
వారిద్దరు గడపి తెల్లవారిన పిదపన్
భూరితపోధను లిద్దరి
కూరిమి దీవెనల నందుకొని రతి భక్తిన్. 616

తే. అంత ఆశ్రమ వాసుల అండవీడి
రామభద్రుడు సీతయు లక్ష్మణుడును
గణ్యమైనట్టి దండకారణ్యమునకు
సాగిపోయిరి మిక్కిలి సంతసమున. 617

**అయోధ్యాకాండము సమాప్తము**

***

సీ. కొండనెత్తమ్ములనుండి క్రిందికి దూకి
పరువెత్తు సెలయేళ్ల భంగిమలను
చివురు జొంపములతో చిన్ని పుష్పాలతో
రాజిల్లు పొదరిండ్ల రాజసమును
ఫల వృక్షముల మీద కిలకిలారవములు
జేయు పక్షుల గమి సోయగమును
పలు వర్ణముల పింఛములు విప్పి హొయలుగా
నర్తించు నెమళుల నాట్యములను
తే. చెవుల పిల్లుల బుడి బుడి చెలువములను
కాంచి భూలోక నాకమీ కాననమ్ము
అనుచు ముచ్వరు ముచ్చటలాడుకొనుచు
అలస టెరుగక పయనించి రతిముదమున. 1

ఆ. అటుల కొంత దూర మరిగిన పిమ్మట
వారి రాక నెరిగి చేరవచ్చి
మునులు కొంతమంది మునివేషధారియౌ
రాము నరసి యిట్టు లనిరి భక్తి. 2

క. "అవిగో! ఆ కనుపించెడు
ప్రవిమల ఋష్యాశ్రమములు పలు దినములుగా
భవదీయ దర్శనార్థము
అవనీశా! వేచియున్న వత్యుత్సుకతన్. 3

ఆ. ఓ మహానుభావ! ఒకసారి మీ ముచ్వ
రరుగుదెంచి తాపసాశ్రమముల
పావనమ్ము చేయ ప్రార్థించుచున్నాము
దండి మనసుతోడ రండు! రండు." 4

క. అని వారు రాజపుత్రుని
కొనియాడుచు వేడుకొనిన కూరిమితోడన్
చనె, రామభద్రు డవనిజ
అనుజన్ముడు వెంబడింప ఆశ్రమములకున్. 5

సీ. అలికి ముగ్గులువెట్టి అపురూపముగ తీర్చి
దిద్దిన ముంగిళ్ళ తీరు నరసి
ఆవునేయిని గ్రోలి అగ్నికుండమ్ములు
ఎగజిమ్ము పొగల సోయగము నరసి
పలుచోట్ల కంచెలపై ఆరవేసిన
కావిబట్టల మేలిగరిమ నరసి
ఆగమవేత్తలు ఆపక పఠియించు
వేదనాదమ్ముల విభవ మరసి

తే. మునుల ఆచార - వ్యవహారములకు మురిసి
కనియు వినియును ఎరుగమీ కర్మకాండ
లనుచు తమలోన చర్చించుకొనుచు నడచి
మువ్వు రాశ్రమ సముదాయములకు జనిరి. 6

తే. వారి రాకను ఆశ్రమవాసు లెల్ల
జయజయధ్వానములతోడ స్వాగతించి
అర్ఘ్యపాద్యాది విధులెల్ల నాచరించి
ముక్త కంఠాన బలికిరి మ్రొక్కు లిడుచు. 7

తే. "లలిత లావణ్య యౌవన కలితులార!
మీర లీనాడు మునివేషధారులయ్యు
సంభ్రమము గొల్పు దివ్యతేజస్సుతోడ
వెలుగుచున్నారు మా పాలివేల్పులటుల. 8

తే. కందమూలమ్ములే మాకు కాననముల
పొట్ట నింపెడు మృష్టాన్న భోజనములు;
అవియె మీరును తృప్తిగా ఆరగించి
మమ్ము ధన్యుల జేయుడో మాన్యులార!" 9

తే. అనుచు మునులును మునిపత్ను లాదరమున
పలికి బహువిధ పరిపక్వ ఫలచయమ్ము
పెక్కు చిరుతిండ్లు సమకూర్చి ప్రియమెలర్ప
కొసరి వడ్డించి ఆతిథ్య మొసగినారు. 10

ఆ. ఋషుల హృదయములును రుచులను జతగూడి
అతిథివరుల మతుల నలరజేసె
అంత ఇనకులేశు డాశ్రమ వాసుల
నభినుతించి కదలె నంతలోనె. 11

సీ. గగనవీథుల స్వేచ్ఛగా విహరించెడు
పక్కి గుంపులు గూళ్ల నక్కసాగె
గర్జించు సింహముల్ గడగడ వణకుచు
గుహలందు తలదాచుకొనగసాగె
అడవి యేనుగులన్ని అడుగుల వడి బెంచి
భీతితో దెసల బర్వెత్తసాగె
పడగెత్తి బుసకొట్టు పాములు సైతము
వెరగంది పుట్టలు వెదుకసాగె

తే. అంతియేగాదు భీకరారణ్య మెల్ల
ముంచుకొనివచ్చు ప్రళయమ్ము ముందుగానె
తెలిసిపోయిన చందాన దీనయాయె
చింతలో మున్గి పగలె పెంజీకటాయె. 12

ఆ. ఎందు కిట్టులాయె? యేమిటీ విపరీత
మనుచు సీత బెదరి ఆత్మ విభుని
యెడదపైన వాలె! ఇనకులేశుం డామె
ననునయించి ధైర్య మందజేసె. 13

క. అది గమనించిన లక్ష్మణు
డిది యేదో దనుజ మాయ యిపుడే వానిన్
తుద ముట్టించెద గనుడని
వదినెకు అన్నకును దెలిపి బాణము గొనియెన్. 14

ఆ. అందుకొనిన బాణ మదిరి నివ్వెరపోయి
కేలనుండిజారి క్రిందపడియె;
లాఘవమును మరచి లక్ష్మణుం డాకాశ
మార్గ మరసి యటులె మ్రానుపడియె. 15

సీ. మానవరక్తమున్ మంచి గంధమ్ముగా
కోరి మేన పులుముకొనినవాడు
తరుణ సింహమ్ముల తలలు దండగ గూర్చి
గుండెపై ధరియించు కొనినవాడు
కొలిమిలో మండు బొగ్గుల వంటి గ్రుడ్లతో
క్రూరత్వమును చాటుకొనెడువాడు
పరమ వికృతముగా పెరిగి భీతిని గొల్పు
బారెడు కోరల నోరువాడు

తే. మాటిమాటికి దిక్కులు మారుమ్రోగు
లీల గర్జించి మత్తుగా దూలువాడు
కానుపించెను భీకరాకారు డొకడు
రూపుదాలిచి విహరించు పాపమటుల. 16

ఆ. అతడు కాలరుద్రు డాకాననమునకు
తన్ని మిత్తినైన తరుమ గలడు;
లేరు వానికెదురు పేరు విరాధుడు
వాని కనులు సీతపైన వాలె. 17

ఉ. వాలినచూపు వెంటబడి వాడటు క్రూరముగా ధరాత్మజన్
కేలను బట్టి లేపి పరికించి యెగాదిగ జూచి, ధీరతన్
"ఏలర? యింత అందమగు యింతి మునీశుని వంటినీకు, ఈ
బేలను నాకొసంగి యిక వెళ్ళుము వచ్చిన దారి వెంబడిన్." 18

క. అనిన విరాధుని పలుకులు
వినినంతనె భయము జెంది విహ్వలమతియై
జనకాత్మజ శ్రీరాముని
కనుగొని విలపించె నన్ను గావు మటంచున్. 19

ఆ. అవనిజాత భీతి నారసి వెంటనే
అసురు జూచి మిగుల ఆగ్రహమున
రాము డనియె! "నోరి రాక్షసాధమ! నీకు
చెల్లె కాల" మనుచు విల్లునంది. 20

తే. "జానకీ! నేడు వానికి చావు మూడె!
ఒక్క బాణమ్ముతో కంఠ ముత్తరించి
నిన్ను రక్షించుకొనియెద నన్ను నమ్ము"
మనుచు బల్కెను గాంభీర్య మెనయునటుల. 21

గీతి. శ్రీరాము శపథమ్ము చెవిని బడగానె
ఆ దానవాధముం డరచి గర్జించి
"వినరోరి! నరుడ! నీ ఘనత దగ్గించి
ఈ విరాధుని జంప నెవ్వాని తరము?
ఆ బ్రహ్మదేవునికె అది అసంభవము!
ఆతడే నా తపసు కచ్చెరువునంది
నాల్గు నాల్కలతోడ నన్ను దీవించి
ఏ ఆయుధములు నన్నేమి జెయకుండ

నిలువున నరికినా నే జావకుండ
నాకు వరమిచ్చెరా! ఓ కుర్రకుంక!
ప్రేలడమ్ములు నీవు చాలింపు మింక"
అనగానె శ్రీరాము డనుజున్నుజూచి
"విన్నావుగా! వాని వికృతగర్జనలు
నా బహిఃప్రాణము నా కళ్లయెదుట
అన్యపురుష స్పర్శ కగ్గమౌచుండ
ఇంకనే జీవించు టెందు"కని వగచె;
రాజ సింహాసనము చేజారినపుడు
కంటనీరిడనట్టి కర్మసిద్ధాంతి
అమ్మ దూరమ్మైన అర్భకునివోలె
శోకించుటను కనుల జూచి లక్ష్మణుడు
"అగ్రజా! యేమిటా అశ్రునయనాలు
నేను బ్రతికుండగా నీకేల చింత
చిటికెలో వాని తల చేరునీ చెంత!"
అనుచు కోపాగ్నినే అస్త్రముగ మలచి
సంధించి వదలె నిశాచరునిపైకి
అది ప్రళయభీకరమ్మై ముందుకురికి
బురుజువలె గల వాని భుజము తెగనరికె
ఆ వెంటనే దనుజు డవని కరుదెంచి
చెలరేగి శూల మొకచేతనే విసరె!
దాశరథి ఉగ్రుడై దాని ఖండించి
సప్త బాణము లొకేసారి సంధించి
"ఈ రామ బాణముల్ క్రూరాత్మ! నిన్ను
వధియించి తీరు"నని వదలె కసితోడ;
ఆ బాణముల ధాటి కసురాధముండు
ఒడలి గాయాలతో పుడమిపై వాలి
"శ్రీరామ నీ పేరు చెవి నెపుడు బడెనో
అపుడె జ్ఞానోదయ మ్మాయె"నని మ్రొక్కి
"తొలి జన్మమున నేను తుంబురుడ రామ!
అలకుబేరుని శాప మంది యిటులైతి;
శ్రీహరీ! నీ వలన చెడు దొలగిపోయె
నా పూర్వరూపమ్ము నాకు వశమాయె;
అమ్మ! సీతామాత! అసురరూపమున
ఏ నొనర్చిన పాప మింతంతగాదు!

మన్నింపు మని వేడ మనసురాదమ్మ!
పాటతో అర్పించు ప్రణతులను గొమ్మా!"
అనుచు కన్నీటితో ఆమె పాదములు
అభిషేక మొనరించి ఆడె తుంబురుడు
అవని సుత వెంటనే అతని దయజూచి
"చిరకాల శాపమున చేసితివి తప్ప
పూర్వపుణ్యము వలన పొందితివి మెప్ప!"
అనగానె తుంబురుడు "అమ్మ! నీ మనసు
అప్పడెత్తిన వెన్న అని నాకు తెలుసు
మీమేలు జన్మలో నే మరువలేను"
అని రామలక్ష్మణుల కంజలి ఘటించి
"ఎంతమాత్రము మీకు ఈ కాననమ్ము
వాసయోగ్యము కాదు వర్ధిష్ణులార!
బహుసమీపమున శరభంగు నాశ్రమము
కలదు అది భూలోక కైలాస సమము!
ఉదయార్క బింబ మా యోగినెమ్మోము
పొందు మీ రచ్చటికి పండు మీ నోము"
అని పలికి రఘురాము నడుగులకు మ్రొక్కి
తుంబురుం డెనలేని సంబరముతోడ
అంబరమ్మున కెగసి అరిగె స్వస్థలికి. 22

ఆ. అడవులందు తమకు అనుదిన మెదురగు
అంతులేని వింత అనుభవముల
ముచ్చటించుకొనుచు ముప్వరు శరభంగు
నాశ్రమమ్ము దెసకు నరుగుచుండ. 23

ఆ. ఆకసమ్మునుండి అమరేంద్రుని రథమ్ము
దివిజగణముతోడ భువికి దిగెడు
వైన మరసి జానకీ నాథు డంతట
అనుగు తమ్ముతోడ ననియె నిట్లు. 24

తే. లక్ష్మణా! అటుచూడుమా రథము మీద
దివ్యతేజో విలాసుడు దివిజవిభుడు
అవని కేతెంచి శరభంగు నాశ్రమమున
కరుగుచున్నాడు కారణ మరయ లేము. 25

ఆ. అని వచించె నపుడె ఆశ్రమమ్మును జేరె
భాసమానుడైన వాసవుండు!
దనుజవైరి రాక తన కుటీరమునకు
వర మటంచు దలచె పరమమౌని. 26

తే. అంత శరభంగు నమరేంద్రు డభినుతించి
"సాధుపుంగవ! నిను బ్రహ్మ సదనమునకు
తోడుకొనిపోవ నేతెంచినాడ నేను
సిద్ధముగ నున్న దదిగో! నీచెంత రథము." 27

మ. అని దేవేంద్రుడు విన్నవించగనె "నీ యాహ్వానమున్ ద్రోసి రా
జనలే నట్లని వెంటనే రథము నేనారోహముంజేయ లే
నసఘా! కారణ మేనె దెల్పెదను శుద్ధాత్ముండు శ్రీరాముడే
నను జూడన్ చనుదెంచుచుండె నడుగో! నా పూర్వపుణ్యమ్మునన్.28

ఆ. నీవు సైత మిచట నిలుకడగా నుండి
వారితోడ గలసి స్వాదుఫలము
లారగింప వలయు" నని తాపసేంద్రుడు
దేవవిభునితోడ దెలిపె నంత. 29

ఆ. అంతకన్ననాకు ఆనంద మేమున్న?
దయిన రాము నిప్ప డరయ దగదు।
దుష్టశిక్షణమ్ము శిష్టరక్షణమును
జరుప పుట్టినట్టి హరి యతండు. 30

ఆ. వేయికనులతోడ విశ్వమంతయు నేడు
సకల జీవకోటి సౌఖ్యమునకు
రాచబాటయైన రఘురాము వనవాస
సవనదర్శనమ్ము సలుపుచుండె. 31

తే. ఆ మహాయజ్ఞమే రీతి రామభద్రు
డాచరించునో? చివర కెట్లంత మగునో?
అరయ గలవాడ కనులార ననుదినమ్ము
అమర పురమున నుండియే యతివరేణ్య।" 32

తే. అనుచు వచియించి శరభంగుననుమతి గొని
అమరనాథుడు రథమెక్కి యరిగె నంత
రాము డనుజుడు వెంటరా రమణితోడ
తరలివచ్చెను మునిసన్నిధానమునకు. 33

తే. ముందు ముగ్గురు శరభంగ మునికి మ్రొక్కి
ఆ మహాయోగి ఆశీస్సు లందుకొనిరి;
అంత నా బ్రహ్మతేజుడు అమరవిభుని
రాక నెరిగించి మధురఫలమ్ము లొసగె. 34

తే. "ఎంతపున్నెమొ? వాసవునంతవాని
పిలుపు కాదని మామీది ప్రేమతోడ
నిలిచియుంటిరి - ఈ వేదనిలయమందు
చోద్య మిదిగాదె? బ్రహ్మతేజోనిధాన! 35

ఆ. సిద్ధులైన మిమ్ము సేవించి మీ చేతి
ఫలము లారగించు భాగ్యమబ్బె;
మౌనికులవతంస! మా జీవితమునందు
ఎంత మధుర సుదిన మీ దినమ్ము." 36

తే. రఘుకులాంబుధిచంద్రుడు రాము డటుల
పలికినంతనె జానకి భర్తవంక
బ్రహ్మఋషివంక జూచి అపారమైన
భక్తిభావము జాల్వార పలికె నిట్లు. 37

తే. "సన్నుతానందమయరూప! నన్ను విడిచి
నిలువజాలడు నా స్వామి నిముసమైన
నేను నంతియె! కాని ఈ కాననముల
ఎప్ప డే ముప్ప గలుగునో ఎరుగజాల." 38

తే. అనుచు కన్నుల నీరిడె నవనిజాత
పరమముని ఆమె చుబుకమ్ము పట్టిలేపి
"ఇడుమలను ముందె ఊహింపనేల తల్లి?
భయము జెందకు మీకు శుభమ్ము గలుగు. 39

తే. రామునకు నీవు గారాల రమణి వౌట
కాకతాళీయమైనట్టి ఘటన గాదు;
పెద్ద బాధ్యత గలదు మీ పెళ్ళిపైన
నాయికవు నీవె! ఆ మహానాటకమున." 40

ఉ. అనుచు తాపసేంద్రు డతి సత్యగర్భిత
మైన ఆశిషముల నంద జేసి
సీత నూరడించి స్థితప్రజ్ఞు డైనట్టి
ఇనకులేశుతోడ ఇట్లు లనియె. 41

తే. "కాననములందు మీకు లక్ష్మణుని తోడు
కోటి కన్నుల నడయాడు కోటగాన
నీవు జానకి వ్రతదీక్ష నిర్భయముగ
పూర్తిగావించి ఘనకీర్తి బొందు డిలను. 42

తే. ఏను ఈ వృద్ధ దేహమ్ము నీక్షణమ్మే
ప్రజ్వలించెడు అగ్నిలో బారవైచి
నిత్య యౌవన రూపాన సత్యమైన
బ్రహ్మలోకమ్ము జేరెద భ్రాంతి వీడి." 43

తే. మౌనివరు డట్లు వచియించి మండుచున్న
అగ్ని కుండమ్మునం జొచ్చె నా క్షణమ్మే;
మాడి మసియాయె శరభంగ మౌని తనువు
విస్మయ మ్మందె సీత ఆ విధము జూచి. 44

ఆ. కాలినట్టి మేను కమ్మని వాసనల్
ముమ్వురకును పంచె ముమ్మరముగ;
ఆ పరిమళంపుటలల మధ్యము నుండి
బ్రహ్మతేజ మొకటి పైకి లేచె. 45

క. ఆ తేజము నవయౌవన
చైతన్యము వెల్లివిరియు శరభంగుడుగా
నూతన రూపము గైకొని
చేతోమోదమ్ము తోడ చేరెను దివికిన్. 46

ఆ. అంత రాముకడకు ఆ మహారణ్యము
నందు వాసమున్న వందలాది
మునులు చేరవచ్చి "ఇనకులాధీశ! మా
మొరను విను" మటంచు మ్రొక్కు లొసగి. 47

"ఈ యరణ్య మందు ఎన్నాళ్లనుండియో
ఇహసుఖముల నెల్ల ఈసడించి
ముక్తి నభిలషించి మునివృత్తిలోనున్న
తప్పవాయె మాకు తిప్ప లెపుడు. 48

సీ. ఎప్పడే రక్కసుం డే మౌని ప్రాణముల్
బలిగొనునో యన్న భయముతోడ
ఎప్పడే రాక్షసుం డే మునిపత్నిని
చెరబట్టునో యన్న చింతతోడ

ఎప్పుడే దానవుం డే మునిపల్లెను
వేధించునో యన్న వెరపుతోడ
ఎప్పుడే దితిసుతుం డే యాగశాలను
తగులబెట్టునో యన్న దిగులుతోడ

తే. గుండె లరచేత నిడుకొని గ్రుడ్లగూబ
అరుపులను విని గూటిలో అమ్మ ఒడిని
తల్లడిల్లెడు పిచ్చుక పిల్ల లటుల
గడుపు చున్నాము దినదినగండములను. 49

ఆ. రూకయైన పన్ను మీకు చెల్లించని
వార మనుచు దలప వలదు మమ్ము;
మానవేంద్ర! మేము మా తపోధనమందు
కొంత భాగ మిచ్చుకొందు మయ్య! 50

ఆ. తాపసుల మటన్న దయలేక రక్కసుల్
కాననముల మిగుల కర్కశముగ
పెట్టు నరకమునకు తట్టుకోజాలక
వచ్చి మిమ్ము శరణు జొచ్చినాము. 51

తే. కాన తత్క్షణమే మమ్ము కనికరించి
పాపులైనట్టి దనుజులరూపు మాపి
అవని ముని జన రక్షకుం డనెడు కీర్తి
నందుకొనుమయ్య! ధర్మమార్గానువర్తి!" 52

ఆ. మునిగణమ్ము బాధలను విన్న ఆ రఘు
వీరవరుని గుండె నీర మాయె;
దుష్టదానవాళి దురితమ్ము లన్నియు
కనుల ముందు మెదలి యనియె నిట్లు; 53

శా. "వందే తాపసవీరులార వినుడీ వారంద రేకమ్ముగా
ముందే నా శపథమ్ము గుర్తెరిగి యా ముక్కంటి నర్థించినన్
సందేహించక దుష్ట దానవతతిన్ సంహారమున్ చేసి మీ
కందింతున్ స్థిరశాంతి సౌఖ్యములు బ్రహ్మానంద మేపారగన్." 54

క. అని రామభద్రు డభయము
మునివర్యుల కొసగె; వారు ముదితహృదయులై
"ఇనకుల తిలకా! మే మిక
చనెద" మటం చరిగి రపుడు స్వస్థలములకున్. 55

క. వా రటు లరిగిన వెంటనె
ధారుణిసుత పతిని జూచి "తపసుల కొరకై
వైరముగొని దానవులను
క్రూరముగా జంపబూనుకొన దగునె ప్రభూ! 56

తే. అత్త కైకమ్మ పుణ్యాన అడుగకుండ
పిన్న వయసున తానుగా వెంటబడిన
శాంతిమయ జీవనమ్మును జారవిడిచి
పగను గొనితెచ్చుకొననేల? పంతమేల? 57

తే. తప్పుబట్టకు స్వామి! నే చెప్పదగిన
దాననా? మీకు! కాని నామానసమున
వెరపు రగులంగ జేసిన వేదనలను
దాచుకొనలేక తెలిపితి ధర్మతేజ! 58

తే. ఆలుగా కాక స్నేహితురాలి లీల
నెల్లవేళల నన్ను మీ యుల్లమందు
నిలుపుకొని ప్రేమ పంచెడు చెలిమికాడ!
ధర్మబోధగ దీనిని దలప వలదు." 59

ఆ. భర్త హితవుగోరి పరమపావని సీత
ఆచి తూచి వేచి అనిన మాట
లాలకించి రాము డాత్మలో యోచించి
అవల బలికె నిటుల ఆమెతోడ. 60

తే. "మగువ మగనికి కరణేషు మంత్రి యనెడు
దివ్యసూక్తిని జ్ఞప్తికి దెచ్చినావు;
అఖిలధర్మ పరాయణుం డైన జనకు
పట్టి వను పేరు సార్థకపరచినావు; 61

తే. కూర్మిసతి! నేడు నీవు వాకొనిన యట్లు
నేను విడనాడినది నాడు నిశ్చయముగ
రాజ్యపాలనమేగాని రాజధర్మ
మెంతమాత్రము కాదని యెరుగు మీవు. 62

ఆ. కాననములనున్న కడుపేదగా నున్న
ఏను క్షత్రియుండ నిది నిజమ్ము!
విస్మరింప జాల విధివిధానమ్మును
చేయవలయు దుష్టశిక్షణమ్ము. 63

తే. అవసరమ్మని తలచిన నవని గలుగు
అన్ని బంధాల నవలీల నవలద్రోసి
అనుజునిన్ నిన్ను వీడెద నంతెగాని
క్షాత్రధర్మము వీడ నిస్సంశయముగ." 64

క. అని రాముడు దృఢ నిశ్చయ
మున బలికిన లక్ష్మణుండు "మునిజనవంద్యా!
వనితారత్నము వదినెను
నను వేరుగ దలప నీకు న్యాయ మ్మగునే? 65

ఉ. నీవొక నిర్ణయమ్ముగొని, నిశ్చలతత్త్వముతోడనేగ మే
మేవిధి నన్యమార్గమున నేగగలారము నిన్నువీడి. నీ
సేవయె దైవదత్తమగు జీవన భాగ్యవిశేషమంచు మా
భావమునం దలంచి నిను ప్రాణ సమమ్ముగ గొల్తు మగ్రజా!" 66

క. అని లక్ష్మణు డని నంతనె
అనునయమున రామభద్రు డవనిజను గనెన్
వనజాక్షి జానకీసతి
కనుగొలకుల నీరు గ్రమ్మగా నిట్లనియెన్ 67

ఆ. "పలుక వలదు స్వామి పరిహాసమునకైన
నోట నన్ను వీడు మాట మరల
ఎన్ని యిడుములైన యేనోర్చెదను గాని
నిన్ను విడిచి క్షణము నిలువ గలనె?" 68

ఆ. సీతకంటినీరు స్థిరచిత్తుడైనట్టి
రామభద్రు నంతరంగమందు
కలతరేపె నంత జలజాయతాక్షిని
బుగ్గ నిమిరి యిటుల బుజ్జగించె. 69

క. "నీ కనులు చెమ్మగిల్లిన
నా కన్నులు చూడగలవె? నళినదళాక్షీ!
చీకాకునొంది నే నటు
వాకొంటిని గాని నిన్ను వదలం గలనే?" 70

క. అని రాముడు ముద్దుల సతి
ననుజుని నోదార్చి తన్ను అర్థించిన యా
మునులను మనమున దలచుచు
చనియె సుతీక్ష్ణాశ్రమమ్ము సన్నిధికి వడిన్. 71

తే. అట్టు లామౌనివరుని దివ్యాశ్రమమును
చేరినంతనె వారిని చేరదీసి
పూజజేసి సుతీక్ష్ణు డవ్యాజమైన
ప్రేమ వర్షించి కమ్మని విందొనర్చె. 72

క. ఆ రాతి రచట గడపిన
శ్రీరాముడు లక్ష్మణుండు సీతయు మరునా
డారమ్యగుణు యతీంద్రుని
కారుణ్యపు దీవెనలను గైకొని రంతన్. 73

తే. దాశరథి కడుభక్తితో "తాపసేంద్ర!
మమ్ము మీ బిడ్డలట్టుల మది దలంచి
వనములను మాకు మిక్కిలి వాసయోగ్య
మైన నెలవును సెలవిం డటంచు వేడె. 74

తే. అంతనా సుతీక్ష్ణు డానంద మేపార
"ఈ వెరుంగ వేమొ యినకులేశ!
ఈ యరణ్యమందు హాయిగా మీరుండ
దగిన నెలవు గలదు దాపులోనె. 75

తే. కలదు ఈ వనమందె అగస్త్యమౌని
ఆశ్రమమ్మది మిక్కిలి అందమైన
చోటు మాత్రమె కాదు యశోవిశాల!
పారవశ్యము గొల్పు నా పరిసరములు. 76

సీ. నిర్మలోదకములు నిండిన కొలకులం
దలవోకగా నాడు అంబుజములు
అలరులే అపరంజి ఆభరణాలుగా
రంజిల్లు మేలి నికుంజతతులు
భువనమోహనమైన భూధరాగ్రములను
నిలువెల్ల ముద్దాడు నీరదములు
నయన మోహనమైన నడకతో అడవికి
చెలువమ్ము పెంచెడు చిన్న నదులు

తే. పిల్లగాలి తరంగాల ప్రేరణమున
వేదనాదము లొలికించు వెదురుపొదలు
అరసి తరియింప వలెగాని ఆదిశేషు
డైన చాలడు వర్ణింప అవనినాథ! 77

ఆ. త్వరితగతిని మీరు బయలుదేరితిరేని
అసుర సంధ్య వేళ కచట జేరి
ఆ మహాతపస్వి అతిథిమర్యాదలు
స్వీకరించి విడిది జేయవచ్చు. 78

క. తూరుపు తెలవారగనే
వారే మీ మన సెరింగి వసియించుటకై
ఏ రామసీమ అనువగు
నారమణీయ ప్రదేశ మపుడే దెలుపున్." 79

తే. అని సుతీక్ష్ణుడు దెలిపిన అన్నదమ్ము
లిరువురును సీత మిక్కిలిమురిసి నతుల
శతము లర్పించి భజియించి యతివరేణ్యు
అనుమతింగొని కదలిరి యచటినుండి. 80

తే. జానకీనాథు దివ్యతేజస్సు వలన
క్రూరమృగములు తమ నైజ గుణము లెల్ల
వీడి ప్రేమానురాగముల్ వెల్లివిరియ
ఆ మహాత్ముని అడుగుల ననుసరించె. 81

క. అది జూచిన సీతమ్మకు
హృదయము ద్రవియించి జీవితేశ్వరుతోడన్
ముదమాపు కొనం జాలక
మృదుమధురములైన నుడుల మెల్లగ ననియెన్. 82

తే. "స్వామి మీవెంట నేను లక్ష్మణుడె గాదు
అదిగో! అటుచూడు డీవిపినాంతరమున
సంచరించెడు వనసత్త్వజాల మెల్ల
వైరములు మాని బుద్ధిగా వచ్చుచుండె. 83

సీ. కొదమసింగమ్ములు మదపుటేనుగులపై
కూర్మితో లీవిగా కొలువుదీరె!
చిరుతపులుల మీద చిన్నారిజింకలు
కుతుక మింపెసలార కూరుచుండె।
తోడేళ్ళు మేకలు తోబుట్టువులలీల
జంటబాయక వెంట సాగుచుండె
పక్షిరాజమ్ముల పసిడిరెక్కలమీద
కోడెనాగులు నాట్యమాడుచుండె!

తే. అంతమాత్రమెకాదు భయంకరమగు
క్రూరమృగములు నడిచెడు దారిలోనె
వందలకొలంది మునులును వచ్చుచుండి
రింతకన్నను వింత మరేమి గలదు?" 84

తే అనిన జానకి గని రాము డతిముదమున
"అవనిజా! నీ తలంపు నా కర్థమాయె;
వన్యమృగములు తమ తమ వైరములను
మరచుటకు కారణమ్ము నా మహిమగాదు. 85

తే ప్రియసఖీ! చూడు మాకనుపించునదియె
పర్వతములందు మిన్నయై పరగునట్టి
విన్ధ్యపర్వత మద్దాని వింతగాథ
శ్రవణపేయము మిగుల ఆసక్తికరము. 86

ఆ నింగినేల గలియు భంగి విజృంభించి
ఇనుని కడ్డ మగుచు నెదుగుచున్న
ఆ మహానగమ్ము నణగద్రొక్కె నగస్త్యు
డదను జూచి దాని మదమడంగ. 87

తే మేటి ఋషికుల తిలకుడా నాటినుండి
స్థిర నివాసము నిచట నేర్పరచుకొనియె;
ఆ మహాత్ముని దివ్య మహత్తు వలన
మృగము లన్నియు చెలిమితో మెలగుచుండె. 88

ఆ అందువలన వారి ఆశ్రమప్రాంతము
నందు దానవాళి అడుగుమోప
సాహసించలేదు - సాధుపుంగవులును
భయము సుంతలేక బ్రతుకుచుండ్రు. 89

క మన మింక ఆ మహాముని
దినచర్యలనెల్ల తనివిదీరెడు రీతిన్
గనవచ్చు వారి బోధలు
వినవచ్చును కొన్ని నాళ్ళు వేడుక మీరన్. 90

తే తమ్ముడా! నీవు ముందుగా తరలివెళ్ళి
జానకియు నేను వారి దర్శనము గోరి
వచ్చి యిచ్చోట నున్నట్టి వార్త దెలిపి
అనుమతింగొని వేగ రమ్మనుచు బలికె. 91

తే. అన్న ఆదేశమును మౌళియందు దాల్చి
లక్ష్మణు డగస్త్యముని కుటీరమ్ము చేరి
స్వామి! మీ దర్శనార్థము రామభద్రు
డవనిజయు వచ్చి నను బంపి రనుమతిగొన. 92

ఆ. ఆ మహానుభావుననుగుతమ్ముడ నేను
పేరు లక్ష్మణుండు ప్రేమతోడ
వారి సేవ జేయ వచ్చితి నడవికి"
అనుచు బలికి భక్తి నంజలించె. 93

క. అంత నగస్త్యుడు లక్ష్మణు
సంతసమున జేరదీసి "సౌమిత్రీ! నీ
వింతగ నుడువం బనిలే
దంతయు నా కవగతమ్మె" యని దీవించెన్. 94

ఉ. కారణజన్ములీ పగిది కష్టము లించుక లెక్కసేయకీ
దారుణమైన కానన పథమ్ముల వెంబడి సంచరించినన్
జేరగవచ్చు టెంతయు విశేషముగా దలపోయు చుంటి నో
కూరిమి శిష్యులార! చని కోసలనాథుని తోడితెం డికన్." 95

క. అని ప్రియశిష్యులతో ముని
అనినంతనె వారు మిగుల ఆనందముతో
చని, ఇనకులేశు సీతను
గని పదముల నంటి మ్రొక్కి కారుణ్యనిధీ! 96

తే. పరమగురు డగస్త్యుడు మమ్ము పంపె నిటకు
తల్లి సీతమ్మయును మీరు తత్క్షణమ్మె
ఆశ్రమమునకు దయతోడ నరుగుదెంచి
వారి సత్కారమందుకోవలయు ననిరి. 97

తే. లక్ష్మణార్యుని తన కుటీరమ్మునందె
నిలుపుకొన్నాడు మా గురు డలఘుచరిత!
అనిన వెంటనె శ్రీరాము డటులె యనుచు
వెడలె సీతాసమేతుడై వేగిరమున . 98

తే. సాధుతిలకు డగస్త్యు డాశ్రమము వదలి
కదలి యెదురేగి మునిజనగణము తోడ
స్వాగతము బల్కి శ్రీరామచంద్రమూర్తి
నవనిజను తోడుకొనివచ్చె నంతలోన. 99

ఆ. పూల వాన గురిసె పుణ్యదంపతులపై
మౌనివరుని దివ్యమహిమ వలన
ఎంతమంచి శకున మిదియని సీతమ్మ
పరవశించి కూర్మిపతిని జూచె. 100

తే. రాము కంటికి ముద్దుల రమణి సీత
అతిమనోహర సుమశిల్ప మటుల దోచె
అంతరంగపుటనుభూతి ననుగుసతికి
పరమపూజ్యుడు క్రీగంట నెరుగజేసె. 101

ఆ. కథలు జెప్పనట్టి కనులతో నాయిద్ద
రటుల ముచ్చటించుటరసి మురిసి
ఆశ్రమమ్ము సలిపె నానందలాస్యము
మువ్వలాయె! నడవి గువ్వలన్ని. 102

క. అది గమనించి అగస్త్యుడు
సుదతీమణి సీతతోడ "చూడుము తల్లీ!
ఇది నీ పుట్టిల్లనుకొని
కుదురుగ నీవుండవచ్చు కొన్నాళ్ళిచటన్." 103

తే. అని మౌనికులవతంసుం
డనినంతనె సీత మురిసి ఆత్మేశునితో
"అనుకొనకయె లభియించెను
వనమున మీకొక్క అత్తవారి"ల్లనియెన్. 104

తే. అంత అర్ధాంగి మాటల అర్ధమెరిగి
రామభద్రుడు "సీత! నీ ప్రేమవలన
అత్తయే లేని నాకొక అత్తవారి
ఇల్లు దొరికిన దడవిలో యుల్ల మలర." 105

తే. అనిన రాముని యుచితోక్తి నాలకించి
పొంగిపోయిన ఆ మునిపుంగవుండు
"లోకమాన్యుడ! నేడు మీ రాకవలన
అపర వైకుంఠ మాయె! నా ఆశ్రమమ్ము. 106

తే. అలసియున్నార లించుక అదమరచి
సేదదేరుడు ఇంతలో చెట్లనుండి
అపుడె రాలిన పండ్లు మా అనుగు శిష్యు
లేరికొని తెచ్చి మీకిత్తు రారగింప. 107

తే. వార లరుదెంచు లోపల పరమపురుష!
నేను పూజాదికములను నిర్వహించి
వచ్చెద" నటంచు బల్కి ఆ సచ్చరిత్రు
డేగె లోనికి తలవంచి వేగిరముగ. 108

ఆ. నడచివచ్చినట్టి బడలిక పూర్తిగా
మౌని నీడ సోకి మాయ మాయె;
కాన లోన జరుగు కార్యాల దిలకింప
మనసు గలిగె ననియె! మగువ సీత. 109

తే. అనుగు దేవేరి కోరిక కపుడు రాము
డడ్డుజెప్పక తలయూచె నంతలోనె
వేదమంత్రాలు వినిపించె వీను లలర
వెంటనే ముప్పురేగి రావిధము జూడ. 110

తే. వారులోనికి వచ్చిన వైన మరసి
అజ్యమిడకయె జ్వలియించె ననలు డపుడు
మునివరుం డది గమనించి కనులు దెరచె
రామదేవుడు కన్పించె హోమశిఖల. 111

క. శ్రీతులసీ దళదాముడు
ప్రాత స్స్మరణీయుడైన పరమాత్ముడుగా
ఆ తపసికి దర్శన మిడె
చేతము పరవశత జెంది చేతులు మోడ్చెన్. 112

తే. తన్ను తాను మరచి కన్నుల నరమోడ్చి
ఏకధాటి మౌని లోకవంద్యు
నగ్ని శిఖల నడుమ నవలోకనముచేసి
జన్మధన్యమైన సరణి మురిసె. 113

ఆ. అతిథులెపుడు చెంత కరుదెంచిరన్నది
యతివరేణ్యుడెరుగ డింతగూడ
అటులె అగ్నిలోన అతడేమి గాంచెనో
ఎరుగరైరి ముప్పు రింతయేని. 114

అంత కొంతవడికి అగ్నిపూజ ముగించి
పైకిలేచి మౌని పారజూచి
వేళ మించె లెండు విందారగింతము
అనుచు ప్రీతి బలికె నంతలోనె. 115

ఆ. శిష్యు లరుగుదెంచి చేతులు జోడించి
తెచ్చినాము చాల తీయనైన
కందమూలములను కమ్మని పండ్లను
అనుచు విన్నవించి రపుడు మౌని. 116

తే. అన్నియును తానె స్వయముగా అందజేసి
మునుల వలెనున్న దేవతామూర్తులార!
తినుడు దయచేసి మీకు ఆతిథ్య మొసగు
భాగ్య మొనగూడె! నిది నాకు బ్రహ్మవరము. 117

ఆ. అనిన మునివతంసు నాత్మీయతను మెచ్చి
వారి తోడ విందు నారగించి
రంత సీతలేచి ఆ యతీంద్రుని పాద
పద్మములకు మ్రొక్కి పలికె నిట్లు. 118

ఆ. "కన్నతండ్రి కన్న మిన్నగా నను జూచి
ప్రేమ పంచినట్టి ఓ మహాత్మ!
నేను కాననముల నిత్య సుమంగళి
నయి చరించు వరము నా కొసగుము" 119

ఆ. అనుచు వేడుకొనిన అవనిజ శిరమును
మెల్లమెల్ల నిమిరి "తల్లి! వినుము
భయము వలదు నీవు పసుపు కుంకుమలతో
నిండు జీవితమును నెరప గలవు." 120

ఆ. అనిన మౌనివాక్కు నపరవేదమ్ముగా
దలచి సీతమనసు తన్మయత్వ
మందె రామమూర్తి అది గాంచి మదిలోనె
సుదతి నభినుతించి శుభము పలికె. 121

క. తదనంతర మ్మగస్త్యుడు
ముదమున శ్రీరాము శిరము మూర్కొని "రామా!
ఇది బ్రహ్మ నా కొసంగిన
పదిలమ్మగు వజ్రఖచిత వర"మని యనుచున్. 122

ఆ. అమితశక్తిమంతమైన ఆ ధనువును
ప్రీతిమీర రాముచేత నుంచి
అనుపమానమైన అక్షయతూణీర
ములను గూడ కానుకలుగ నొసగె. 123

ఆ. అవియెగాక మరల అపరంజి ఒరలోన
కాంతు లీనుచున్న ఖడ్గరాజ
మొండు దెచ్చి యిచ్చి "యుర్వినాథా! దీని
నింద్రు డిచ్చె నాకు నిదియు నీదె. 124

తే. అద్వితీయములైన ఈ ఆయుధములు
యోధవర్యుడ! నీ వద్ద నుండెనేని
అన్ని వేళల జయము నిన్నంటియుండు
కదనమందున చచ్చు రాకాసిదండు." 125

క. అని మౌనీంద్రు డొసంగిన
ఘనతర శస్త్రాస్త్రములను గైకొని భక్తిన్
ఇనకుల వననిధి సోముం
"డనఘా! మీ ఋణము దీర్ప నగునే" యనియెన్. 126

తే. దశరథాత్మజు పలుకులు తాపసేంద్రు
నతులితానంద వారాశియందు దేల్చె
ఎదురుగా నున్న జానకి వదన మరసి
ఏమిదోచెనో? రాముతో నిట్టు లనియె. 127

సీ. "పురుటినొప్పలు లేక భూదేవి కన్నట్టి
చిన్నారి పొన్నారి చిట్టితల్లి
అపరంజి ఊయెల కందాలు గూర్చుచు
జోలపాటలు విన్న బాల లక్ష్మి
తల్లియు దండ్రియు తానోచు జనకుండు
ముదమార బెంచిన ముద్దుపాప
కాలుకందని లీల పూలతోటలలోన
చెలులతో ఆడిన చిగురుబోడి

తే. నిన్ను పెండ్లాడి రఘువంశనేతయైన
కోసలాధీశు కోడలై వాసికెక్కి
ఇపుడు నీవెంట విపినాల కేగుదెంచె
పూవు నెడబాసి యెరుగని తావిపోలె. 128

ఉ. బాలరసాల సాల నవపల్లవ కోమలయైన బిడ్డ పా
దాలకు కర్కశాటవి పథమ్ములు చేసెడు నెత్తురోడు గా
యాలను గాంచి గుండె లవియన్, విలపించెడు నేల తల్లినే
లీలను ఊరడించెదవొ? లేశ మెరుంగగ జాల రెవ్వరున్. 129

తే. సహజముగ స్త్రీలు తమభర్త నహరహమ్ము
పట్టుబట్టలు దెమ్మని పసిడినగలు
కొని యొసంగు మటంచును కోరుచుంద్రు
అట్టి వెపుడైన కోరెనే అవనిజాత. 130

సీ. విమల సౌధములను వీడి నీతో గూడి
పర్ణశాలలనుంట భాగ్య మనుచు
పన్నీటి జలకాల వదలి నీతో గూడి
సెలయేళ్ల మునుగుటే శ్రేష్ఠ మనుచు
పంచభక్ష్యాదుల వదలి నీతో గూడి
తిను కందమూలాలె తీయ ననుచు
వెలలేని పాన్పుల వీడి నీతో గూడి
శయనించు భూశయ్య నయ మటంచు
తే. మేలి భోగాల నెల్లను కాలదన్ని
సతికి పతిసేవ ఉత్తమ వ్రత మటంచు
ఛాయ విధమున నిన్నెడ బాయకుండ
కలసి నడచెడు సీతకు కలరె? సాటి. 131

తే. సత్య శీలమునందు సంస్కారమందు
శాంతి సౌజన్యములయందు సహనమందు
వినయ గుణమందు సాధువర్తనమునందు
ఆ యరుంధతి వంటిదీ అవనిజాత. 132

ఆ. ఆమె కెట్టి కష్ట మంటకుండగ నీవు
కూర్మితోడ జూచుకొనగ వలయు;
ధర్మబద్ధమైన దాంపత్యమునకు మీ
జంట లక్ష్య మౌచు సాగవలయు. 133

ఆ. సిద్ధులైన వారు చిరుదివ్వె వెలిగింప
వెలుగు లోకమంత విస్తరించు?
కాన మీరొనర్చు కార్య మెంతటిదైన
ఫలము విశ్వమంత పరిమళించు." 134

ఆ. అనుచు ధర్మసూక్తి నా యతీంద్రుడు తెల్పె
నంత రామచంద్రు డడిగె మునిని
సాధు జీవనమ్ము సలుపుట కనువగు
చోటు మీరె మాకు చూపు డనుచు. 135

ఆ. "వనములందు మీకు వాసయోగ్యమ్మైన
ప్రాంత మేదియనిన పంచవటియె!
అచటి కేగి నేడె అందమ్ముగా నొక్క
పర్ణశాల నేరుపరచుకొనుడు. 136

క. అచ్చట గోదావరి కడు
ముచ్చటగా బారుచుండు మోదుగుపూలున్
విచ్చకయె పరిమళించును
పచ్చదనము పల్లవించు ప్రతిఋతువందున్." 137

క. అని ప్రియమార వచించిన
మునివరునకు ధన్యవాదములు దెల్పి వడిన్
చని రచటినుండి కమ్మని
అనుభూతులు వెంటనడువ నా పుణ్యాత్ముల్. 138

క. శ్రీరాముని బృందమ్మా
ఘోరారణ్యమున జనుచు కొండొకచోటన్
బారెడు రెక్కలుగల మగ
ధీరుని ఖగనాథు నరసి దిగ్భ్రమ జెందెన్. 139

తే. వార లాశ్చర్యముగ తనవంక జూచు
తీరు నారసి ఆతడే చేరవచ్చి
"నారచీరల కెనలేని నాణె మలదు
చున్న మిము గాంచి మరచితి నన్ను నేను. 140

తే. భువన మోహనులైన మీ రెవరు స్వామి?
ఇట్టు లడవుల చరియింప హేతు వేమి?"
అనుచు కన్నులె కరములై యలరునటుల
మ్రొక్కులిడి వేడె శ్రీరామమూర్తి నతడు. 141

తే. రాము డంతట నా పక్షిరాజు నరసి
సలలితమ్ముగ వివరముల్ దెలియజేసె;
అంత ఖగపతి రెక్కల నట్టెలేపి
తనువు పులకింపగా ప్రదక్షిణము జేసె. 142

ఆ. "పూత చరిత! నేను మీ తండ్రి చెలికాడ!
నను జటాయువందు రనుదినమ్ము
దలచుచుందు మదిని దశరథరాజేంద్రు
నతని రూపమునకు అద్ద మీవు. 143

తే. పంచవటియందు మీకు కావలసినట్టి
సకలసౌకర్యములు నేను సంతరించి
పెట్టు భాగ్యము నాకిడ వేడుచుంటి
రమ్యగుణసాంద్ర! జానకీరామచంద్ర! 144

తే. అయిదు వటవృక్ష రాజము లచట గలవు
ప్రకృతి సైతము కడు సుందరముగ నుండు;
రామభూపతి! నేనును లక్ష్మణుడును
కలసి నిర్మింతు మాకుల కట్టడమును. 145

ఆ. అందులోన మీరు అందాల మా లక్ష్మి
సీత కలసి చీకు చింతలేక
అండబాయనట్టి అడవి గువ్వలలీల
గడుపవచ్చు దినము క్షణమువోలె. 146

ఆ. ఎచట మీరు పాద మిడుదురో అచ్చట
మండుటెండ గూడ పండువెన్నె
లౌనటంచు మౌను లనుకొనుచుండగా
వీను లలర నేను వింటినయ్య! 147

ఆ అవనినాథ! మీర లనుమతించెదరేని
పరమశోభ లీను పంచవటికి
నింగి మార్గమందు నే ముందుగా పోయి
స్వాగతించెద సహచరులతోడ." 148

ఆ అనుచు విన్నవించి చనె వాయువేగాన
భవ్య చరితుడైన పక్షిరాజు
అతని భక్తి శ్రద్ధ లవనిజ కన్నుల
తన్మయతనుబెంచి తడిని నింపె. 149

క. తదనంతర మా ముప్పురు
ముదమే చెలికాని వోలె ముందు నడువగా
పదపదమని వడివడిగా
కదలిరి అటనుండి తీపికబురులు చెలగన్. 150

ఆ. కబురు లన్ని కడకు కమ్మని కథలాయె
చెప్పనట్టి ఘనత సీతదాయె;
ఆలకించువంతు అన్నదమ్ముల దాయె
అరసి మురియు భాగ్య మడవిదాయె. 151

తే. సరససల్లాపములతోడ సాగినట్టి
వారి ఉల్లాసయానము పంచవటికి
జనెడు వేళకు సూర్యు డస్తాద్రి జేరి
సందెవెలుగులు వెదజల్లి స్వాగతించె. 152

ఆ. పక్కిరాజు తాను ముక్కుతో అల్లిన
ముచ్చటైన గడ్డిపూలమాల
లటులె దెచ్చి భక్తి నా ముప్పురకు వేసి
శిరమువంచి మ్రొక్కి చెప్పె నిట్లు. 153

ఆ. "అడవి మల్లెమొగ్గ లందమ్ముగా పేర్చి
నడుమ నందివర్ధనాలు పొదిగి
చాల మెత్తనైన శయ్య మీకోసము
పరమపురుష! సిద్ధపరచినాను. 154

తే. దశరథాత్మజ! మీరు సీతమ్మతోడ
కడు ముదమ్మున నా పూల పడుకమీద
విశ్రమింపుడు భయమును బిడియ ముడిగి
రాత్రి కాపుందు మేనును లక్ష్మణుండు." 155

తే. అనిన వెంటనె ఆ జంట ఆరుబయట
పండువెన్నెల పందిట పరచియున్న
పూలపానుపుపై వాలి మేలుకొనియె
కన దొడంగిరి కమ్మని కలల నెన్నో. 156

సీ. అందులో నొక కల అలనాటి తొలిరేయి
ముచ్చటల్ విరివిగా ముందుబోసె!
అందులో నొకకల అవ్యక్తమధురమౌ
అనుభూతు లెదపైన ఆరబోసె
అందులో నొకకల ఆలింగనాలకు
గుసగుసల్ జతచేసి కూర్మిపెంచె!
అందులో నొకకల ఆనంద జలకేళి
గుట్టును కుదిలించి కుప్పపోసె

తే. కాని ఆ కల లన్నియు కలసి కనిరో!
వేరువేరుగ కనిరో యెవ్వారి కెరుక?
ఒకటి మాత్రము నిజము వా రొకరి నొకరు
మరచిపోయిరి పూసెజ్జ మహిమ వలన. 157

తే. అంతలో పక్షి రాజేంద్రు డరుగు దెంచి
దోరమాగిన ఫలముల నేరి కోరి
తెచ్చితిని తల్లి అనగానె తెప్పరిల్లి
ఉలికిపడి లేచిరా యిద్ద రొక్కమారె. 158

తే. లక్ష్మణుడు గూడ కందమూలములు దెచ్చె
అపుడు నల్వురు కలసి విందారగించి
పలువిధము లైన ముచ్చటల్ పంచుకొనిరి
అంత జానకి హాయని ఆవులించె. 159

క. అది గమనించిన లక్ష్మణు
డిది నిద్దురవేళ యనుచు నెరిగించకయే
వదినమ్మ తెలియ జెప్పెను
పద పోద మటంచు బలికె! పక్షీంద్రునితో. 160

తే. అంత నాయిద్దరటనుండి కొంతదూర
మరిగి నిద్రను పూర్తిగా తరిమికొట్టి
అలసి పవళించి యున్న ఆ ఆలుమగల
కొరకు కాపుండి రెనలేని కూర్మితోడ. 161

ఆ. నలిగి చెదరినట్టి అలరుల పాన్పుపై
తావు మరచి నిదురబోవుచున్న
ప్రేమజంట నరసి బెబ్బులి యొక్కటి
పరవశించి అచటె పక్క బరచె. 162

ఆ. పక్కబరచెగాని ఒక్క క్షణమ్మైన
కునుకు దీయలేదు క్రూరమృగము
ఇతర దుష్ట మృగము లేవైన యరుదెంచి
వారి కెగ్గుసేయ వచ్చు ననుచు. 163

తే. అటులె వేకువ వరకు కన్నార్పకుండ
కాపుగా నుండి పక్షుల కలకలములు
చెవిని బడగానె వ్యాఘ్రము శీఘ్రగతిని
వెడలె నెనలేని తృప్తితో అడవిదరికి. 164

తే. తడవ తడవకు పక్షి సంతాన మటుల
కలకలారావములతోడ కమ్మదనము
జాలువారెడు మేల్కొల్పు లాలపించె
నిదుర ఆ దంపతుల వీడి నిష్క్రమించె. 165

తే. అపుడు కన్నులు తెరచిరా ఆలుమగలు
ముందు సీతమ్మ రాముని మోము జూచె!
అటులె రామయ్య సీతముఖారవింద
మరసె తొలుదొల్త చిరునగవంకురింప. 166

ఆ. అంత లక్ష్మణుండు అన్నయు వదినెయు
కోరి యెన్నుకొన్న కొండపైన
అడవి కనులు చెదరునట్లు నిర్మించెను
లోకమెల్ల మెచ్చు ఆకుటిల్లు. 167

ఆ. పర్ణశాల గట్టుపనిలోన తొలినుండి
పక్షిగణము మిగుల భక్తితోడ
సాయమంద జేసె సకల విధాలుగా
శ్రమను విస్మరించి లక్ష్మణునకు. 168

సీ. మట్టిముద్దలు పేర్చి కట్టిన గోడలు
తడియారకయె వింత తళుకు లీనె
వెదురు బొంగులపైన కుదురుగా కొలువైన
పైకప్పు రెల్లుకు వాసి పెంచె
కడు మనోహరమైన గంధపు వాకిళ్ళు
మలయ మారుతముల మనసు దోచె
కలపతో చుట్టూర గట్టిన ప్రాకార
మడవి మృగమ్ముల నడల జేసె

తే. పర్ణశాలకు ముందు ఏర్పరచినట్టి
రెండు అరుగులు మౌనుల రండు రండ
టంచు నాహ్వానమును బల్కినట్టులుండె
ఎపుడు నేర్చెనో లక్ష్మణు డిన్ని కళలు. 169

తే. అన్న వదినెల కారీతి అందమైన
ఘనకుటీరము భక్తితో నొనర జేసి
తనకు వేరుగ సౌమిత్రి దాపునందె
కట్టుకొనె నొక్క చక్కని చుట్టు గుడిసె. 170

తే. అంత శ్రీరాముడును సీత అరుగుదెంచి
పర్ణశాలను కనులార పారజూచి
లక్ష్మణుని కార్యదీక్షకు లలితమైన
శిల్ప నైపుణ్యమునకు నిశ్చేష్టు లైరి 171

తే. సంతసము నాపుకొనలేక చెంతనున్న
మరది నారసి సీతమ్మ "మాకు నీవు
దైవ మొసగిన బిడ్డవు ధర్మచరిత!
దానికీ పర్ణశాలయే దర్పణమ్ము." 172

తే. అనిన వదినమ్మ మాటల కతడు మురిసి
"అంత పున్నెము మరుజన్మకైన నాకు
అబ్బవలె నని ప్రార్థింతు నన్న నెపుడు
అటులె యగు నని దీవింపు మమ్మ! నన్ను." 173

క. అని వచియించిన లక్ష్మణు
వినయమునకు మురిసి సీత "విమలాత్ముడ! నీ
వనినది జరుగగ వలెనని
అనుదినమును వేడుకొందు నా పరమాత్మున్." 174

తే. అంతలోనె యేదో ఆవు అంబాయన్న
చిన్నశబ్ద మొకటి చెవిని బడియె;
తిరిగి చూచుసరికి పరిసరా లన్నియు
జనగణమ్ముతోడ మునిగియుండె. 175

సీ. ఒకవంక మునిపత్ను లకలంకమగు నర్చ
నాద్రవ్యముల గొని నడచుచుండ!
ఒకవంక మునులంత ఓంకార నాదముల్
సంబరమ్మున వెదజల్లుచుండ
ఒకవంక జనపదు లుల్లాస మూతగా
పండ్లకావిళ్ళతో వచ్చుచుండ
ఒకవంక భిల్లు లత్యుత్సాహ భరితులై
తినుబండములు గొని తెచ్చుచుండ

తే. ఆకసమ్మున రెక్క లల్లార్చుకొనుచు
పక్షిరాజు జటాయువు పర్ణశాల
దరికి ఏతెంచి రాము పాదాలమ్రోల
వ్రాలి నిలువున పులకించి పలికె నిట్లు. 176

తే. తల్లి సీతమ్మ కిష్టమై తనరునట్లు
రూపు దాల్చిన కొత్తింటిలోన మీరు
పదము మోపెడు శుభవేళ పాలుపంచు
కొను తలంపున వచ్చె నీ జనగణమ్ము. 177

క. అనినంత నందరొకటై
ఘనముగ శాస్త్రోక్త విధులు గావించి, గృహ
మ్మున దంపతులను జేర్చిరి
అనయము గుర్తుండు నట్టు లపురూపముగా. 178

ఆ. అంత లక్ష్మణుండు అందరికిని సహ
పంక్తి భోజనమ్ము భక్తితోడ
నొనరజేసె! సీత ఉత్సాహభరితయై
వడ్డన మ్మొనర్చె వైభవముగ. 179

తే. అపుడు రాముని, లక్ష్మణు, నవనిసుతను
అతిథు లందరు దీవించి అభినుతించి
సెలవుగైకొని తమ తమ నెలవులకును
తరలిపోయిరి తన్మయత్వమ్ముతోడ. 180

తే. పర్ణశాల నా పుణ్యదంపతుల జేర్చి
దేనికిని లోటులేని సంతృప్తి గూర్చి
వారి యనుమతి గొని వెళ్ళి వత్తు ననుచు
చేరె లక్ష్మణు డతని కుటీరమునకు. 181

క. మరునా డరుణోదయమున
ధరణీసుత స్వచ్ఛమైన ధవళాంబరముల్
ధరియించి ప్రాంగణమ్మున
తిరుగుచు నానంద జలధి దేలుచునుండెన్. 182

ఆ. పర్ణశాల యెదుట పనస వృక్షము మీద
కొలువుదీరియున్న ఎలుగుబంటి
అవనిజాత నరసి ఆ ప్రక్కనేయున్న
పక్వమైన యొక్క పండు ద్రుంచె. 183

ఆ. ఎలుగుబంటి చేత లెరుగని సీతమ్మ
తీరుబడిగ భర్త దెలియజేయు
ఊసు లన్ని వినుచు ఒక్కచో నిలబడి
భయము నందె నెలుగుబంటి నరసి. 184

తే. ఆమె యెంతగ భీతిల్లె నంతవడిగ
పరుగు పరుగున గెంతుచు పనస ఫలము
చంక నిడుకొని మిక్కిలి సంతసమున
వచ్చు ఎలుగును గని సీత వణక దొడగె. 185

ఆ. అంతలోన అచటి కరుదెంచి 'ఋక్షము'
వణకుచున్న సీతవంక జూచి
"భయము వలదు తల్లి! పండుదెచ్చితి" నని
సైగతోనె దెలిపి సాగిలపడి. 186

ఆ. పనస ఫలము రాము పాదాల ముందుంచి
మ్రొక్కె నుదుటితోనె మూడుమార్లు;
సీత భయము వీడి చిరునవ్వు జాల్వార
ఎలుగుబంటి భక్తి నెదను మెచ్చి. 187

ఆ. ఇంటిలోని కేగి జుంటి తేనెను దెచ్చి
మట్టి మూకు డచట బెట్టి పోసి
తానె తల్లియౌచు త్రావించె నెలుగుకు
పతియు పర్ణశాల పరవశింప. 188

ఆ. ఎలుగుబంటి మురిసి ఎగిరిగంతులు వేసి
సీత పాదములకు ప్రీతితోడ
మ్రొక్కు లందజేసి చక్కనయ్యను జూచి
మనసు నచటె వదలి మరలి చనియె. 189

తే. అపుడు సౌమిత్రి వెదురు బియ్యమును పండ్లు
ఆకుకూరలు దుంపలు, అనుము లెల్ల
పప్పుదినుసులు దొరకిన వరకు దెచ్చి
వదిన కిచ్చెను స్వయముగా వంటజేయ. 190

ఆ. సీత వంట నాకు చేతగాదే యన
అన్న నీకు సాయ మందజేయు;
కలసి మెలసి మీరు గావించు వంటలు
క్రొత్తరుచులకేత మెత్తు వదిన! 191

తే. అనిన సౌమిత్రి ఊహాల అర్థ మెరిగి
"వింటివా? సీత! తమ్ముని వింతకోర్కె
వంట యింటను సైతము జంటగానె
మనము వర్తిల వలెనని మనసుపడియె." 192

క. శ్రీరాముం డా రీతిని
నోరారగ బలుకగానె నూత్నోత్సాహ
మ్మారూఢిగ జానకిలో
మారాకులు దొడిగె మనసు మరిమరి మురియన్. 193



తే. మొలక నవ్వులు రాముని మోముపైన
చిందులాడెను. వెంటనే సీత తోడ
మేను పులకింప వంటింటి లోనికేగె
లక్ష్మణుడు వేగ తన కుటీరమ్ము జేరె. 194

తే. అచట కామధేను వట్లున్న ఒక గోవు
పల్లు మొలవనట్టి బుల్లిదూడ
భయము సుంత లేక పవళించి యుండుట
జూచి లక్ష్మణుండు చోద్య మందె. 195

ఆ. అప్పుడొక్క గొల్ల దక్కడి కేతెంచి
ప్రేమ మీర తల్లిబిడ్డ నరసి
లక్ష్మణునకు మ్రొక్కి "రామయ్య తమ్ముడా!
ఆవు నాది సామి!" యని వచించి. 196

ఆ. మందలోన నిన్న సందకా డీనింది
దూడతోడ నపుడె తోలకెళ్ళి
పిండిముద్ద బెట్టి పెరటిలో కట్టేసి
మొలక పచ్చిగడ్డి ముందరేస్తి. 197

గీతి. అంతలో మా ముసలి దక్కడికి వచ్చి
ఆవు ఈనిన వైన మంత నన్నడిగి
తెలుసుకొని, యేవయ్యొ! తెలుసునా నీకు
సీతమ్మ, లచ్చన్న సీరాములయ్య
యెక్కడెక్కడొ దిరిగి యేకంగ వొచ్చి
మంచిగా వుంటదని పంచవటి జేరి
కోరిపెట్టినరంట కొత్త కాపరము
పొద్దుటే యెల్లి చూసొద్దాము మనము
ఒకసారి ఆ ముగ్గురికి దండ మిడితె
పాపాలు మన నొదిలి పరుగుబెడతాయంట
అని యింటి దనగానె అందుకొని నేను
వట్టి చేతులతోడ యెట్ట బోతామె
జున్ను పాల్దీసుకొని తిన్నగా యెల్లి
ఆ దేవతల కిచ్చి ఆళ్ళ దీవెనల
నందుకొని తిరిగి సాయంత్ర మొద్దాము
అనగానె బాగుంది అన్నట్టు తలను
యీ యావు వూపింది యిది నిజము సామి!

అంత మే మిద్దరము ఆవు ముచ్చట్లె
కూడుగా మెక్కేసి కునుకు దీశాము!
యేగుసుక్కకు ముందె యిల్లాలు లేసి
తల్లిని బిడ్డనూ తడిమి ముద్దాడి
తవుడు గలిపిన కుడితి తనివి దీరంగ
తాపించి దూడనూ దగ్గరకు జేర్చి
పాలుసేపంగానె పసిదాన్ని దరిమి
పొదుగులో సెయిబెట్ట నదిరిపడి తన్ని
పలుపు దెంచూకోని పారిపోతుంటె
దానియెంటే దూడ దౌడు దీసిందని
యివరంగ జరిగింది యిల్లాలు జెప్పె!
యెందు కిట్టాయెనని మందకడ కొస్తి
అక్కడా కనపడక అటునిటూ జూస్తి;
ఆవు-దూడా రెండు ఆగమేగాల
పంచవటి దిక్కుగా పరిగెత్తుచుండె!
దిక్కు దోసని నేను తిరిగి పోలేక
వాటితోపాటు నే పరిగెత్తలేక
కుంటినడకాతోనె యెంట బడినాను
కాని యివి సిటికెలో కన్ను మరుగాయె!
అయిన పట్టిడక నేనడివంత యెతికి
సివరగా యిక్కడికి జేరి సూసితిని
అయ్యా! మీ సేవకే అయి బుట్టినట్టు
పరణశాలాముందు పడుకోనియుండె
యింతకన్నా బాగ్గె మే ముంది మాకు
యీ రెండు మీ బిడ్డలీ నాటినుండి
కాదనక దయసేసి కనికరించండి!
అని చెప్పి లక్ష్మణున కావు దూడలను
అప్పజెప్పేసి నా డపుడు యాదవుడు
వివరముగ గోవు కథ విన్న లక్ష్మణుని
సంబరము లివ్వమని అంబరము దాకె
ధేను వాపసి కూన మేనెల్ల నాకె. 198

ఆ. అవు వింతగాథ అన్నకు వదినెకు
పూస గ్రుచ్చినట్లు వీసమైన
వదలకుండ జెప్ప వారు లక్ష్మణునితో
గూడి వచ్చి రావు దూడ జూడ. 199

ఆ. అంత యాదవుండు ఆ దంపతుల గాంచి
దైవ దర్శనమ్ము తనకు గల్గి
నట్టు పొంగిపోయి చుట్టు చక్కరగొట్టి
వచ్చి పదములందు వాలిపోయె. 200

ఆ. ఆవుదూడ గూడ ఆతని వెంబడి
మూడుసార్లు తిరిగి ముందుజేరి
చిందు లాడసాగె సీతమ్మ అది జూచి
మురిసి దూడనెత్తి ముద్దులాడె. 201

తే. తన్మయత్వము తోడ పాదముల ప్రోల
వాలియున్నట్టి గొల్లను పైకి లేపి
నేడు నీనుండి నేనెంతొ నేర్చుకుంటి
ననుచు శ్రీరాము డాతని హత్తుకొనియె. 202

ఆ. ఆ మహాత్మునోట ఆ మాట వినగానె
ముసలి గొల్లవాని మూతి మీది
తెల్ల మీసములకు ఒళ్లంతపులకించి
నిక్కిచూచె స్వామి నొక్కసారి. 203

ఆ. అంత గొల్లతాత ఆవు నక్కడ గట్టి
చిన్నదుత్త సీత చేతి కిచ్చి
అమ్మగోరు! ఇంక ఆవు నీదే తల్లి
యెల్లి పాలు పితికి యేలుకొనుము. 204

క. అని నంతనె అవనీసుత
తన మనమును చిక్కబట్టి తడబడు నడకన్
చని పొదుగులోన చేయిడ
గనె సంబరమంది గోవు కన్నులు మెరసెన్. 205

తే. గోవు కన్నులు మెరయుట గొప్పగాదు
ధరణిసుత చేయి పొదుగును తాకగానె
కుండపోతగ చన్నులు గ్రుమ్మరించె
క్షీరమా దుత్త నిండ విచిత్రముగను. 206

తే. సీత ముసిముసి నవ్వుతో చేతిలోని
పాలదుత్తను మరది హస్తాల బెట్టె
వెంటనే లక్ష్మణుడు వంట యింటి కరిగి
మరగ గాచిన జున్నుతో తిరిగి వచ్చె. 207

క. నులివెచ్చని సెగలెగయుచు
పలురుచులకు నిలయ మౌచు పర్వెడుజున్నున్
బళి బళియని కొనియాడుచు
నలుగురు ప్రియమార దినిరి నాల్కలు దనియన్. 208

ఆ. అంత గొల్లతాత అప్ప డప్పడు వచ్చి
మిమ్ము సూసి పోత నమ్మ గోరు!
అనిన సీత మంచి దట్టులే ఈసారి
అవ్వతోడ రమ్మటంచు పలికె 209

గీతి. ఎంత సల్లనిమాట యినిపించినవు తల్లి
మా... ఆడదానికీ మాటొక్కటే చాలు
యెల్లి సెప్పంగానె యెగిరి గంతేస్తాది
రేపె యెలదామంటు యేపుకొని తింటాది!
కాదు కూడాదంటె కటిక పొస్తుంటాది
అంచాత రేపె తమరన్నట్టు వస్తాము!
నల్లపూసల పేరు మెళ్ళోకి తెస్తాము!
అపుడు మీరొద్దంటె అది బాదపడతాది!
కట్టుకుంటే మెడకు కళ పెరిగి పోతాది!
రామయ్య తండ్రి! మీరాజ్ఞాన దొరకనివి
మాసేలో బండినయి ఊసబియ్యము దెస్త!
యిప్పటికె జాగైంది యెల్లి మల్లీవస్త. 210

తే అనుచు వచియించి ముసలయ్య ఆవు కడకు
జేరి నువ్వెంత పున్నెము సేసినావొ?
అమ్మ సీతమ్మ తల్లికి అయినదాని
వైతి వని దువ్వి అటనుండి అరిగె వడిగ. 211

తే. కల్ల కపటము లేని ఆ పల్లె గొల్ల
మనసులో దాగి యున్నట్టి మంచితనము
వాని మాటల తీరును వర్తనమ్ము
ముప్పురికి మేరునగ మంత ముదము గూర్చె. 212

ఆ. మధురమైన స్మృతులు మాటిమాటికి సీత
మనసు నలరజేయ మగని జూచి
మన మయోధ్య వదలి వనములం దున్నట్టి
మాట సైత మేను మరచిపోతి. 213



తే. అనిన అర్ధాంగి మాటల కడ్డు దగిలి
రామవిభు డిట్టు లనియెను రమణితోడ
నేను ముద్దుల తమ్ముని నిన్ను దప్ప
మరచిపోతిని సర్వమీ తరుణమందు. 214

క. అని కడు చతురత బలికిన
జనకజ మృదు భాషణములు స్వరసప్తకమై
నినదించెను శ్రీరాముని
మనమున మధురానుభూతి మార్మోగంగన్. 215

ఆ. అన్న గడుసుదనము అందాలవదినమ్మ
మాటకారితనము మనసులోనె
నెమరువేసికొనుచు నిలువెల్ల మురియుచు
చేరె లక్ష్మణుడు కుటీరమునకు. 216

ఆ. పర్ణశాలలోన ప్రత్యక్ష దైవ మౌ
భర్తతోడ గలసి పరమసాధ్వి
అవని జాత సీత అవ్యక్త మధురమౌ
క్రొత్త రుచులు జుర్రుకొన దొడంగె. 217

తే. లలిత గుణసాంద్రుడైనట్టి లక్ష్మణుండు
పవలు రేయను భేదభావమ్ము లేక
అన్న వదినల సేవయే ఆశయముగ
గడుపసాగెను దిన మొక్కగడియలీల. 218

ఆ. అంత నొక్కరాత్రి ఆమని వెన్నెల
మరులు గొలుపు మలయమారుతమ్ము
మనసు నలరజేయ మగత నిద్దుర లక్ష్మ
ణుని విశాలమైన కనులవాలె. 219

తే. అపుడు సౌమిత్రి మానసమదుపు దప్పి
ఒక్క నిముసములోనె అయోధ్యజేరి
నిదురలో నున్న ఊర్మిళ నేత్రములను
అతులితానందమున ముద్దులాడ దొడగె. 220

తే. పాప మాతల్లి కనురెప్పపాటులోనె
తనువు కంపింపగా లేచి కనులు దెరచి
ఇంత దుర్బుద్ధి నీ మది నెపుడు దూరె!
దిద్దుకొననౌనె? ఈ తప్పు నిద్దరమును. 221

క. అని కనుల నీరు నింపిన
తన సతి ఔన్నత్యమునకు తల్లడపడి ల
క్ష్మణు డన్నా! తప్పాయెను
అని గట్టిగ మాటి మాటి కరువ దొడంగెన్. 222

క. ఆ కేకలు విని రాముం
డీకడకున్ తరలివచ్చి ఇంతటిలోనే
నీకేమైనది తమ్ముడ!
వాకొనుమని కదిపె; నదరిపడి లక్ష్మణుడున్. 223

క. కనరాని కలనుకంటిని
వినగూడని మాటలెన్నొ వింటిని. సతిచే
నను మన్నింపుము అగ్రజ!
అని కరములు మోడ్చి పలికి అంతట మరియున్. 224

ఉ. ఎందుకొగాని యీ దినమునెన్నడు లేని మనోవికారమున్
జెందితినన్న! నే తెలిసి చేసిన తప్పిదిగాకపోయినన్
కుందుచునుండె నెమ్మనము, కొట్టిన, తిట్టిన, నీదె భారమో
సుందర మందహాస రుచిశోభిత! నన్ కరుణింపుమా యనెన్. 225

ఆ. "అంత మాట నీవు అనరాదు, నే విన
రాదు, జరిగినట్టి దేదియైన
నీవు కలతజెంద నేను భరించలే"
ననుచు తమ్ము నన్న అనునయించె. 226

ఆ. అంత వేగు వరకు నా యన్నదమ్ములు
ఆరుబయట నటులె గూరుచుండి
ఉల్ల మలర జేయు ఊసులు మెక్కుచు
గడపు తీరునరసి అడవి మురిసె. 227

ఉ. అంత సుమిత్ర సూతి వదినమ్మకు అన్నకు అంజలించి "నే
చెంతనె యున్న కాననము జేరి ఫలమ్ములు కందమూలముల్
సంతసమొప్ప గూర్చుకొని చయ్యనవత్తు" నటంచు దెల్పి, ఒ
ళ్ళంతయు కాళ్ళు జేసికొని అంగలు వేయుచు సాగె ముందుకున్.228

తే అపుడు శ్రీరాముడును సీత అచటి నుండి
కదలి పుణ్య గోదావరీ నదిని జేరి
స్నానసంధ్యలు ముగియించి జలజబాంధ
వున కొసంగిరి యర్ఘ్యము ఘనతరముగ. 229

తే. ఉదయభానుని కిరణము లెదను కదుప
మురిసి విరిసిన తామరపూలపైన
వాలి మధువాను ఎలతేంట్ల వాలకమును
వింతగా జూచుచున్న దేవేరి వంక
జూచి రాముడు మిక్కిలి చోద్యమందె
ఏలయన తేటి యొకటామె వాలుకనుల
చుట్టు ఝుంకార నాదముల్ పెట్టుకతన. 230

తే. ఓర్వ గోల్పోయి శ్రీరాము డురిమి చూచె
తేటి భయపడి పొదరింటి మాటు కేగె
తడిపొడిగనున్న సీతనేత్రాల నిట్లు
వర్ణనము జేసె నావనవాసయోగి. 231

చ. అరుణమయూఖ మాలికల నల్లన విచ్చిన కన్నె తామరల్
గరువపు వానజల్లులకు గంతులు వేయుచు నాడుబేడిసల్
మురిపెము లొల్కుచున్ భువన మోహనకాంతులు గ్రుమ్మరించు నీ
స్ఫురిత విశాల నీల నవసుందర బంధుర దివ్య నేత్రముల్. 232

సీ. చిగురెండ ఒడిలోన సిరిమల్లె నవ్విన
కనుపించు వెలుగులో కలవు నీవు
చిరుగాలి కెరటాలు వరివెన్ను నూపిన
మొలకెత్తు కులుకులో కలవు నీవు
నీలిమబ్బును గాంచి నెమలి నర్తించిన
కదలాడు హొయలులో కలవు నీవు
నెలవంక స్పర్శతో సెలయేరు పొంగిన
చెలరేగు నురుగులో కలవు నీవు

తే. ఇచ్చ టచ్చట అననేల నీ విశాల
విశ్వమందున చైతన్య విలసితమ్ము
లైన ప్రత్యంశమందు ప్రత్యణువునందు
కంటి కగుపించు కమ్మని కలవు నీవు. 233

క. అని తనను నిండు మనమున
కొనియాడిన ప్రాణనాథు కూరిమి పలుకుల్
విని జనకజ "స్వామీ! మీ
మనసే నా వాసయోగ్య మందిర" మనియెన్. 234

తే. అటుల నాయిద్ద రొకరుగా అనుదినమ్ము
తీర మెరుగని ఆనందపారవశ్య
మందు దేలుచు అడవికే అందమౌచు
వరుస గడపిరి పదుమూడు వత్సరములు. 235

ఆ. భక్తు డెటుల దినము భగవంతు గొల్చునో
అటులె లక్ష్మణుండు అన్నినాళ్ళు
అలుపు లేని సేవ లన్నకు, వదినెకు
చిత్తశుద్ధితోడ జేసెనౌర! 236

మ. అది హేమంతము నీలిమేఘములు పూర్వాచారమున్ వీడి బూ
డిదరంగున్ మెయి నిండబూసికొని ఈడే తోడుగా నాడుచున్
సదసద్వేగముతోడ సాగు విధ మే సన్యాసి వీక్షించినన్
మదిలో వెంటనె వింతకోర్కె లొదవున్ నానా విధానమ్ములన్. 237

సీ. మధ్యాహ్న సూర్యుడు మబ్బులు నేసిన
దుప్పటి నొంటిపై గప్పుకొనియె!
అగ్నిదేవుడు తన్ను ఆవహించిన చలిన్
ముదమార గుండెల కదుముకొనియె!
చెంగు చెంగున గెంతు జింకలు పొదరిండ్ల
దూరి పొద్దుస్తులు దొడుగుకొనియె
కొదమ సింగమ్ములు గుహల కౌగిళులందు
మదన తాపమ్ముతో ఒదిగిపోయె!

తే పచ్చపచ్చని పచ్చిక బయళులన్ని
మంచు మైదానముల రీతి మారిపోయి
పడుచుగాలులు పొరలాడు పాన్పులాయె!
అతులితమ్మౌర? హేమంత ఋతువు మహిమ. 238

తే. అట్టి ఋతువున నొక్కనా డరుగుమీద
లక్ష్మణుని తోడ గూర్చుండి రామవిభుడు
ప్రభల జిమ్మెడు హేమంత వైభవమ్ము
నరసి మురియుచు చదరంగ మాడుచుండె. 239

తే అంతలో సీత వెదురుతో అల్లినట్టి
పళ్లెరమునిండ తెచ్చిన పనస తొనలు
అన్నదమ్ముల మధ్యలో అరుగు మీద
బెట్టె ప్రేమానురాగము లుట్టిపడగ. 240

ఆ. సీతవంక జూచి చిరునవ్వు వెదజల్లి
ఇనకులేశు డంత ఇంపెలర్ప
"నీవు ప్రక్కనున్న నే నోడిపోవుదు
తప్పకుండ గెలుచు తమ్ము" డనియె. 241

ఆ. "అట్టులైన నేను అటునిటు గదలను
మరదిగెలుచువరకు మరలిపోను"
అని వచించి సీత అక్కడే కూర్చుండి
ఆట జూడసాగె నాతురతను. 242

ఆ. ఆట మధ్య మధ్య అపరంజి రుచులీను
పనస తొనలు దినుచు ప్రక్కనున్న
ముద్దుల సతిమోము హద్దుమీరక జూడ
సాగె! రాఘవుండు సంబరమున. 243

క. ఆ మహితాత్ముని దయతో
సౌమిత్రియె విజయమందె! జనకజ యంతన్
రాముని, తన ప్రియనాథుని
మోమారసి పైన జల్లె! ముసిముసినగవుల్. 244

క. ఆ నవ్వుల వెలుగులలో
మే నెల్లను మెరయు నీలమేఘశ్యామున్
దానవకాంత యొకర్తుక
తానాయెడ గాంచె! కాకతాళీయముగన్. 245

సీ. అపురూపమై యొప్ప ఆ జగన్మోహను
అందాలనెమ్మోము చంద మరసి
మునివేషధారణ కెనలేని తేజస్సు
నలదెడు నయనాల చెలువ మరసి
సువిశాలమే గాక సుమశోభ్జముగ నున్న
వక్షఃస్థలమ్ము వైభవము నరసి
ఆకార రమ్యమై మోకాళ్ళు దాటిన
దీర్ఘబాహువుల సందీప్తి నరసి

తే. చూచినంతనె నిలువెల్ల చొక్కి సోలి
వాలి ముద్దాడ నుసి గొల్పు పదము లరసి
మతిచలించిన దానవి మరల మరల
చూడ దొడగెను శ్రీరాము సోయగమును. 246

ఆ. అటుల జూచి చూచి అంతరంగమునందు
కదను ద్రొక్కుచున్న మదన తాప
మణచుకొనగ లేక నా కామరూపిణి
అంతులేని ఊహలందు మునిగె. 247

ఉ. "ఎక్కడివాడొ? ఈయడవి కెందుకు వచ్చెనొ? కాని యేమిటా
చక్కదనమ్ము? యిట్టి బలశాలిని, వీరుని నేను గాంచలే
దెక్కడ? నీ మహాపురుషు నెట్టుల నే వశుజేసికొందు? నా
ప్రక్కన యున్న జాణ నెడబాసి యతండు ననున్ గ్రహించునే? 248

ఆ. కాని యెటుల వదలుకొనెద కందర్పుని
మించు సోయగాల మేనివాని
సామదానభేద సర్వశక్తుల నొడ్డి
దోచుకొందునతని దొడ్డ వలపు." 249

తే. అనుచు నొకసారి జానకి అందచంద
ములను దిలకించి తన ముక్కు మొగము తీరు
పంటి వరుసల తీరును కంటితీరు
నరసి నైరాశ్యమును జెందె నసుర వనిత. 250

తే. "ఆపెతో బోల్చ నేను, నా అందమెంత?
నడుముసొబగెంత? కన్దోయి నాణె మెంత?
కనుక నే నిట్టులే వాని కంటబడిన
ఏవగించును గాని నన్నేలు కొనునె? 251

ఆ. కాన నిపుడె నేను మౌనుల కవ్వించి
వారి తపము భంగ పరచునట్టి
అప్సరసల మించు అందగత్తెగ మారి
మనసు పడిన వాని మదిని గెల్తు;" 252

చ. అని తన క్రొత్త రూపు నసురాంగన మాటికి జూచుకొంచు, "నా
మనసును దోచుకొన్న నవమన్మథు డిప్పడు నన్ను గాంచినన్
పనిగొని వచ్చి నా యెడద పక్షుల బింకము కొల్లగొట్టి, ప్ర
త్యణువును రెచ్చగొట్టి సురతమ్మున దేల్చక మిన్నకుండునే?" 253

ఆ. అనుచు దనుజ వనిత అప్పటి కప్పుడు
కట్టుకొనెను గొప్ప గాలిమేడ!
అట్టిమేడ ఎంత అందముగా నున్న
వాసయోగ్యమౌనె? వీసమెత్తు! 254

ఆ. కైపు కనుల కెక్కి కామపీడితయైన
దుష్టదనుజ కంత దూరదృష్టి
యెట్టు లొదవు? కాన నేమేమొ దలపోసె
నంతెగాని రాము డాపె గనునె.? 255

ఆ. అంత కొంత వడికి ఆ క్రొత్త రాకాసి
తెచ్చుపెట్టుకొనిన తెలివితోడ
హంసగమనవోలె అభినయించుచు వెళ్ళి
ఇనకులావతంసు నెదుట నిలిచె. 256

ఆ. కాని అతడు తన్ను కన్నెత్తి చూడక
యున్న పైన మరసి ఓరు పుడిగి
వెకిలినవ్వు నవ్వి ఒక చిన్ని పువ్వు నా
పడతి రామవిభునిపైన విసిరె. 257

తే. కుమతి తనపైన విసిరిన సుమము సోకి
ఒడలు కంపర మెత్తిన పుడమిరేడు
తత్క్షణమె మోము పైకెత్తి తన్నె జూచు
వాలుచూపుల వగలాడి వదన మరసె. 258

తే. దాని నవకాశముగ గొని దనుజకాంత
"మదనతేజము విరజిమ్ము మానవేంద్ర!
లంక నేలెడు రావణబ్రహ్మకేను
అనుగు చెల్లెల నన్ను శూర్పణఖ యండ్రు. 259

తే. వన విహారము గోరి ఈ వైపు వచ్చి
నీరద శ్యామ సుందరా! నిన్ను జూచి
అదుపు దప్పిన మనసు నీ యెదను వాలి
తిరిగి రాకుండె నిక నాకు దిక్కు నీవె. 260

తే. రూపమందున ఈరేడు లోకములను
నన్ను గెలువంగ జాలెడు కన్నె మిన్న
పుట్ట లే దింతవర కిక పుట్టబోదు!
కాన జాగేల? రమ్ము! నీ కౌగిలిమ్ము." 261

ఆ. అనుచు ముందు కురుకు అసురాంగనను జూచి
భీతి జెందలేదు సీత సుంత!
నిప్ప వంటి స్వామి తప్ప జేయడటన్న
గాఢమైన నమ్మకమ్మె వలన. 262

తే. జానకీనాథు డది జూచి సంతసించి
చిన్ని చిరునవ్వు నామెపై జిలుకరించి
కొంటెచూపులు తనపైన గ్రుమ్మరించు
చున్న వగలాడితో నను సున్నితముగ. 263

తే. "శూర్పణఖ! నీవు రావణు సోదరి నని
తెలిపినంతనె నీ కథ తెలిసిపోయె;
ఇంత అందము బ్రహ్మ నీకీయకున్న
నీవె సమకూర్చుకొంటివి నేర్పుతోడ." 264

తే. ఆ మహాత్ముని మాటల అంతరార్థ
మావగింజంత యెరుగని అసురవనిత
అదియు రాముని మెచ్చుకోలనితలంచి
పులుకు పులుకున దిలకించి పొంగిపోయె. 265

తే. అంత రాముడు తననె కన్నార్పకుండ
చూచువగలాడి నరసి "యోసుదతి! వినుము
నేను కోసల రాజ్యాధినేతయైన
పంక్తిరథసార్వభౌముని వరసుతుండ. 266

తే. ప్రేమతో నన్ను జనులు శ్రీరాము డంచు
పిలుచుకొనుటానవాయితి కలికిమిన్న
అగ్నిసాక్షిగ కోరి పెండ్లాడినట్టి
ప్రియసతియె గాక నా శ్వాస, పేరుసీత. 267

తే. వీడు నా తమ్ము డెపుడు నన్ విడువకుండ
రాత్రి పవలును సేవించు లక్ష్మణుండు;
ముప్పరము కాననములందు మునులువోలె
గడుపుచున్నాము వ్రతదీక్ష కారణమున. 268

తే. వయసులో నున్న అందాల వనిత నీవు
నిన్ను జూచిన రతిరాజె కన్నుగీటు
నట్టి తరి వట్టి జడదారినైన నన్ను
ఏల మోహించినావో? నే నెరుగ బేల! 269

తే. అదియునుంగాక నాకొక ఆలు గలదు
ఆమె రేయింబవళ్ళు నన్నంటి యుండు;
తన్ను కాదని నీకు నే దగ్గరైన
క్షణము క్షణమును తప్పదు సవతిపోరు. 270

తే. కొంటె చూపుల కోమలీ! కోపపడక
మారు మాటాడబోక నా మాట వినుము;
అనుగుతమ్ముడు నాకన్న అందగాడు
భార్య దగ్గర లేనట్టి పడుచు వాడు. 271

ఆ. అతడె నీకు మిగుల అనువైన జతకాడు
వెన్న వంటి హృదయమున్నవాడు
కనుక నిపుడె వాని కడ కేగు" మని చెప్పి
దాని నంపె నపుడె తమ్ము కడకు. 272

క. అదియును తన మంచికె యని
ముదమున లక్ష్మణుని జేరి "ముద్దుల మగడా!
సదయుడు మీ అన్నయె నను
వదలక పెండ్లాడుమనుచు వధువుగ బంపెన్." 273

క. అని రక్కసి యనినంతనె
కనుసైగను లక్ష్మణుండు కర్తవ్యమ్మున్
తన అన్న నడిగె; నతడును
కనుసైగనె చేయదగిన కార్యము దెలిపెన్. 274

తే. అంత లక్ష్మణు డనియె నా అతివతోడ
"అన్న యాదేశమును మీర నెన్నడైన
వారి కోరిక యిపుడె యీడేర గలదు
దరికి రమ్మని నవ్వుచు దాని బిలిచె. 275

క. ఆ పిలుపే తన పాలిటి
శాపమ్మని యెరుగనట్టి చపలాక్షి వడిన్
తాపము దీరెడు సమయము
నా పున్నెము కొలది నేడు నా కొనగూడెన్. 276

మ. అని ఆత్రమ్ముగ లక్ష్మణున్ గదిసి మోహావేశ ముప్పొంగగా
దనుజాధీశుని చెల్లి పెళ్ళి భ్రమతో "తాత్సారమింకేల ఓ
మనుజాధీశ! బిరాన నాదుమెడలో మాంగల్యమున్ గట్టి, నన్
దనియం జేయు" మటంచు పై బడియె నుత్సాహమ్ము రెట్టింపగన్.

తే. ఆలసించినచో నది హద్దు మీరు
నని తలంచిన సౌమిత్రి అదను జూచి
ఒక్క ఉదుటున రక్కసి ముక్కు చెవులు
పట్టి తెగగోసె, నరచి గీపెట్టు నటుల. 277

క. ఊహించని ఆ ఘటనకు
దేహము కంపింప నసుర దిక్తటు లదరన్
హాహాకారము సల్పుచు
"ద్రోహీ! నీ చెయిద మెంతొ దురితము సుమ్మీ. 278

ఆ. వలచి వచ్చినట్టి వనితను హింసించి
కర్కశముగ మనసు గాయపరచి
చక్కదనము నెల్ల చెక్కి ముక్కలు జేసి
నట్టి నిన్ను వదలి పెట్ట" ననుచు. 279

ఆ. అసలు రూప మెత్తి ఆ ముప్పురను జూచి
మీరు జేసినట్టి నేరమునకు
తగిన శిక్ష పడెడు దాక నే నిద్రింప"
ననుచు పలికి మాయమాయె నసుర. 280

ఆ. జరిగె తగిన శాస్తి దురితదానవకాంత
కనుచు మురిసిపోయె నవనిజాత;
పీడ వదలె ననియె వేదవేద్యుడు రాము
డనుగు తమ్ముతోడ నతిముదమున. 281

ఆ. ఆడుత్రాచువంటి ఆ యసురాంగన
పుడమి దద్దరిల్ల బుసలుకొట్టి
అడవి వణకునట్టు లరచి రోదించుచు
పరుగులెత్తి పడియె! ఖరుని ముందు. 282

ఆ. పిడుగు వోలె పడిన ప్రియసోదరిని జూచి
తెగిన ముక్కు చెవుల తీరు నరసి
రగులు అగ్ని వంటి రక్తపు రేఖలు
కనుల ప్రజ్వలింప ఖరుడు పలికె. 283

సీ. "కాలపాశమ్మును కంఠమ్మునకు జుట్టు
కొని చావుకొని తెచ్చుకొనిన దెవడు?
కాలకూట విషమ్ము గ్రక్కెడు కరినాగు
పడగను పిడికిట బట్టె నెవడు?
కనలి మండుచునున్న కార్చిచ్చు నెదపైన
నదుముకో జూచిన అధము డెవడు?
ఆకొన్న సింగమ్ము నరచేతితో మోది
త్రుంచ యత్నించిన దుష్టు డెవడు?

తే. దేవగణములసైతము ధిక్కరించి
నిలిచి గెలిచిన దానవనేత చెల్లి
పైన నీకిట్టు లెనలేని హానిజేసి
పెద్దపులి నోట తలకాయ బెట్టె నెవడు? 284

తే. అరి భయంకరుడైన యీ ఖరుని ఖడ్గ
మునకు నెత్తురె ఆహార మనెడు నిజము
నీ వెఱింగియు నిటుల కన్నీరు గార్చ
తగదు; జరిగిన విషయ మంతయును దెలుపు. 285

శా. అక్కా! నీకిటు లెగ్గొనర్చినది యా ఆదిత్యుడా! కాలుడా!
చుక్కల్ సొక్కెడు చంద్రుడా! గరుడుడా! సుత్రాముడా! చెప్వ నీ
ముక్కున్ గోసిన ద్రోహి యెవ్వ డతడా ముక్కంటి నర్థించినన్
లెక్కన్ జేయక సంహరించెదను లే, లెమ్మింక నిశ్చింతగా." 286

క. "కోతలు గాదుర సోదర
చేతలుగా వలయు నాకు చెప్పెద విను మా
నేతలు దశరథు పుత్రులు
క్ష్మాతలమున పేరుగనిన క్షత్రియ తిలకుల్. 287

తే. కాని మునివేషధారులై కాననమున
పంచవటి యందునొక చిన్న పర్ణశాల
గట్టుకొని రాక్షసుల నెల్ల మట్టుబెట్టు
పనియె ప్రతిదిన చర్యగా బ్రతుకు చుంద్రు. 288

తే. అగ్రజుడు రాము డట! వాని ఆలిపేరు
సీతయట! వాని యనుజుడు చిన్నవాడు
లక్ష్మణుండట మిగుల నిర్లక్ష్య బుద్ధి
నాతడే చేసినా డీ కిరాతకమ్ము. 289

తే. చేసినది వాడె యైన నీ చెయిద మందు
వాని అన్నకు, వదినెకు పాలు గలదు;
అందుచే నీవు ముప్వురన్ హతుల జేసి
వేడి నెత్తురు నాకు ద్రావింపవలయు." 290

తే. అని మహోగ్రమ్ముగా బల్కినట్టి అక్క
పలుకులను విన్న ఖరుడు తా భగ్గు మనక
మిగుల వెటకారముగ నవ్వె పగులబడుచు
అంత నా దుష్టదానవి యనియె నిట్లు. 291

తే. ఆడబడుచైన సోదరి గోడు నీకు
నవ్వులాటగ నుండె; నీ నాల్కగోసి
అదియె లక్ష్మణుకుత్తుక యని దలంతు
ననుచు చుర చుర జూచె! శూర్పణఖ ఖరుని. 292

తే. శూర్పణఖ తన్ను జూచిన చూపు కదిరి
"అక్క! నే జెప్పనది విను మొక్క క్షణము;
జింక పిల్లల వంటి ఆ కుంకలేడ?
చిరుతపులి వంటి నీవేడ? సిగ్గులేదె? 293

చం. పిడికిట గ్రుద్ది యిద్దరిని పీచమడంచక దీన వోలె ని
ట్లడవులు నిన్ను జూచి పరిహాసము జేసెడు రీతి భీతితో
గడగడలాడుచున్ తనువు కంపరమెత్తగ వచ్చినందుకేన్
చిడిముడి జెంది నవ్వితిని; చేవ నశించెనె నీకు సోదరీ! 294

తే. చేటు మూడిన మానవ కీటకముల
చంపి తినుటకు నా అనుచరులు చాలు;
నేను రానేల? వారితో నీవు వెడలి
పగర జూపింపు మక్కడే తెగును తలలు." 295

క. అని పదునల్వురు వీరుల
ఘనతర పటు బాహు బలుల కర్కశమతులన్
వెనువెంటనె చని విజయము
గొని తెండని పంపె నక్క క్రోధ ముడుగగన్. 296

గీతి. యమకింకరుల బోలు ఆ యసురవరులు
కాల నాగుల వంటి ఖడ్గ రాజములు
చేబూని ఝళిపించి చెవులు తెగినట్టి
శూర్పణఖ కుపితయై చూపు మార్గాన
కరిమబ్బులే నేల పరుగెత్తినట్లు
వడివడిగ జని పంచవటి సమీపించి
బిగ్గరగ గర్జించి గగ్గోలు వెట్టి
"రామ లక్ష్మణులార! రండిరా! రండి!
ఈనాడు మీ చావు నెవ డాపలేడు"
అనగానె శ్రీరాము డాగ్రహము నంది
పదునాల్గు బాణముల్ గుదిగుచ్చి వదలె
వాటి ధాటికి తెగిన వారి తల లెగిరి
ఖర దూషణుల నల్లకాళ్లపై బడియె
అది జూచి నాల్గు కాళ్లదరి తడబడియె. 297

తే. ఖరుడు, దూషణుడును కాళ్ళ నదిమిత్రొక్కి
కళ్ళ నెర్రజేసి పళ్ళు గొరికి
ఎదుట జూచుసరికి ఎపుడు వచ్చెనొ గాని
కనలుచున్న అక్క కంటబడియె. 298

తే. అంత ఖరు డిట్లులనె "అక్క! అర్థమాయె!
రాము డెంతటి ఘోర పరాక్రముండో?
వాని శస్త్రాస్త్రగణముల వాడియెంతో
నాకు జెప్పినవీ పదునాల్గు తలలు. 299

తే. అతడు జీవించి యుండిన అసురతతికి
కలుగు కీడెంతో యిపుడు నా కనులముందు
కొట్టవచ్చిన యట్లు గన్పట్టి నన్ను
రెచ్చగొట్టుచునున్నది హెచ్చరికగ." 300

ఆ. అనుచు సెగలు గ్రక్కి అక్క బుగ్గలు నొక్కి
దెబ్బజూడు మంచు జబ్బ చరచి
తొడలు రెండు దట్టి పిడికిలి బిగబట్టి
చెట్టు పుట్ట లదర నిట్టు లనియె. 301

క. "అక్కా! ఈ ఖరు నెప్పడు
తక్కువగా దలచబోకు! తత్‌క్షణమే నే
నొక్కడనె సర్వ సైన్యము
ప్రక్కల నడువంగ వెడలి పగతుర నడతున్. 302

తే. నీవు అదరక బెదరక నిలిచియుండు
మిక్కడే! రేపు యీపాటి కొక్కసారె
మూడు తలలును నీ కాళ్ళ ముందు బడును
నెత్తురును పుర్రెలో దెచ్చియిత్తు నీకు." 303

తే. అనుచు దూషణు జూచి, సైన్యమును సిద్ధ
పరచుమని చెప్పె! నంతలో పంచవన్నె
గుర్రముల తేరు నడయాడు గుడి విధమున
వచ్చి జేగంట మ్రోగించి ప్రక్క నిలిచె. 304

మ. ఖరు డాస్యందన మెక్కి నిర్దయత దోర్గర్వమ్ము సంధిల్ల భీ
కర బాణమ్ములు, ఈటెలున్ ధనువులున్, ఖడ్గమ్ములున్, బాకుల
య్యరదమ్మందున బేర్చి యుంటగని తానత్యంత దర్పమ్మునన్
ధర కంపింపగ నేగె రాము నెదురన్ దైత్యాళి జే కొట్టగన్. 305

తే. త్రిశిరుడును, దూషణుండును తీవ్ర దీప్తు
లీను వేర్వేరు రథముల నెక్కి, నిక్కి
ముందు నడచెడు సైన్య ముప్పొంగునటుల
యుద్ధ శంఖాలు పూరించి రుద్ధతముగ. 306

క. ఆ నిమేషమందె ఆనాద మాశ్రమ
ప్రాంతమంత భీకరముగ బ్రాకె;
వినిన రామభద్రు డనుజుని బొడగని
అదురు బెదురు గనక అనియె నిట్లు. 307

తే. లక్ష్మణా! ఖర దూషణుల్ రణముగోరి
వచ్చుచున్నారు సైన్య సంపత్తి తోడ
అతిమదోన్మత్తులైన ఆ అసురయుగము
నాశ్రమము దాక రాకుండ అడ్డవలయు. 308

తే. వదినె నా ప్రక్క గుహలోన వదలిపెట్టి
నీవు కాపుండు మిప్పుడే నే నొకండ
దుష్ట రాక్షస వర్గమున్ దునిమి వైచి
మునులకును సీతకును నీకు ముదము గూర్తు." 309

మ. అని శ్రీరాముడు జేసినట్టి శపథ మ్మాకాశ మందంతటన్
నినదించెన్, అది విన్న నిర్జరతతుల్ నేడెంత పర్వమ్మహో!
అనిలో దుష్ట నిశాచరాధముల, నెట్లంతమ్ము గావించునో
కని తీరన్ వలె నంచు వచ్చిరి వడిన్ కౌతూహల మ్మొప్పగన్. 310

ఆ. దివిజు లెక్కియున్న దివ్య విమానముల్
గగన సీమయందు గ్రద్దలట్లు
తిరుగు టరసి యడవి దిరుగాడు జంతువు
లెంత వింత యనుచు నెగుర దొడగె. 311

ఆ. అంతలోనె యుద్ధ మారంభ మాయెను
ఉగ్రమూర్తి రాము డొక్క ప్రక్క
ఖరుడు దూషణాది ఖల దైత్య లొక ప్రక్క
మోహరింప మురిసె మునిగణమ్ము. 312

సీ. కుపితమ్మై బుసకొట్టు కోదండమును చేత
బట్టి నిల్చిన రామభద్రు నరసి
పరమ ప్రసన్నమౌ పురుషోత్తముని మోము
ప్రళయాగ్ని గోళమ్మై రగులు టరసి

కరుణ కావాలమ్మై బరగెడు చూడ్కులు
తీక్ష్ణమ్ములైయున్న తీరు నరసి
అక్షయ తూణీరమందున్న శరములు
ఉరుములై గర్జించు కరణి నరసి

తే. మదము తలకెక్కి రాక్షసుల్ మౌనివరుల
పట్టి నిత్యము హతమార్చు పాప మెల్ల
నేటితో పండె నని పొంగి నేలతల్లి
చిర్నగవుతోడ అల్లు నాశీర్వదించె. 313

తే. అపుడు రఘుకులతిలకు డా యసురగణము
నరసి "దుశ్చేష్టులార! మీయఘము పండె!
చచ్చుటకు సిద్ధపడి వచ్చి జాలమేల?
తొలుత నెవ్వరు చత్తురో తెలుపు" డనియె. 314

తే. రఘువరేణ్యుని వ్యంగ్యోక్తి రక్కసులకు
వేయి ములుకులు ఒకసారె వీనులందు
దూరినట్లాయె; వెంటనే దూషణుండు
కనుల నిప్పులు గురియంగ అనియె నిట్లు. 315

తే. "ఓరి మానవ! నీ వెటకారమాపు!
దేశద్రిమ్మరి వీవని తెలియు మాకు!
కుమతి చందాన మము రెచ్చకొట్టబోకు!
వినుము తెల్విద చావు మూడినది నీకు." 316

క. అని భీకరముగ దూషణు
డని నంతనె దనుజ సైన్య మాకస మదురన్
నినదించి ముందు కురికెను
కని, రాముడు నవ్వె అరులు కలవరపడగన్. 317

తే. దాశరథి నవ్వు పెనకున్న దర్ప మరసి
దనుజవీరుల గుండెలు దద్దరిల్లె;
ఖరుడు, దూషణుడును కొంత కలవరపడి
తిరిగి మరు నిముసమ్మున తేరుకొనిరి. 318

తే. ఖరుడు మిడిగ్రుడ్లు బలసిన కనుల నిండ
రౌద్రమును నింపుకొని రఘురాము జూచి
"ఆరుటకు ముందు దీపము మేర మీరి
వెలుగు నని నేడు మరల నీవలన దెలిసె." 319

క. అని దోర్గర్వముతో ఖరు
డని నంతనె రాము కన్నులరుణము లాయెన్;
వెనువెంటనె ఆ యరుణిమ
వనమంతట బ్రాకె దానవాళి వడంకన్. 320

ఆ. కోప మెరుగనట్టి కోదండరాముడు
కినిసెనేని కలుగు కీడదెంతొ
అర్థమైన ఖరుడు అరుణ వార్నిధి మధ్య
వరలుచున్న నీలవర్ణు పైకి. 321

క. తరిమెను దూషణు నాతడు
శరములు వడి రువ్వె రామచంద్రునిపైనన్
నరవరు డవలీలగ, నా
శరముల తనకాళ్లముందు శరణన జేసెన్. 322

తే. అంతటను తృప్తి జెందక అసురవైరి
వలయముగ విల్లు లాగుచు వాడి వేడి
బాణముల నొక్కసారిగ వైరి మూక
గుండె లదురగ వేసె నుద్దండలీల. 323

సీ. ఆ బాణములు కొన్ని అసురుల తలలతో
అలవోకగా బంతులాట లాడె!
ఆ బాణములు కొన్ని అసురుల నోళ్లలో
దూరి నాల్కలపైన త్రుళ్లియాడె!
ఆ బాణములు కొన్ని అసురుల గుండెలు
చీల్చి నెత్తుటిలోన చిందులాడె
ఆ బాణములు కొన్ని అసురుల ప్రేవులు
మొత్తమ్ముగా ద్రెంచి మురిసియాడె

తే. చివర కన్నియు గలసి విచిత్రగతుల
దనుజవీరుల వెంటాడి తరిమి తరిమి
నరికి చంపుచు ననిలోన నటన మాడు
సరణి నారసి మునుల ఆశ్రమము లాడె. 324

తే. అటుల సాగిన అమ్ముల ఆటలోన
వేల సైన్యము జచ్చుట వింతగాదు
దుర్నిరీక్షులు త్రిశిరుడు దూషణుడును
ధరణి కొరగిరి ఖరుని నిబ్బరము చెదర. 325

క. చావక మిగిలిన యసురులు
చేవను గోల్పోయి ఖరుని చెంతకు జని, ఆ
భూవిభు నెదిర్చి పోరగ
మావశమా యనిరి వగచి మరణ భయమునన్. 326

చ. "ఒకనికి కన్నుపోయె; మరియొక్కడు కాలును గోలుపోయె వే
రొకనికి చేయి బోయె దొర! ఒంటికి గాయము లేనివాడు నే
యొకడును లేడు; నెత్తు రిటులోడెడు మేనుల తోడ నేడు; మే
మొక క్షణమైన బాధలకు నోర్చుచు యుద్ధము జేయలే మికన్." 327

తే. అనుచు మొరపెట్టుకొనుచున్న ఆగలేదు
కాలపాశాల వంటి బాణాల జాలు
అంతలో నొక్కబాణ మయ్యసుర వరుని
ఖరుని కోటీరమున్ ధర కొరగజేసె. 328

తే. తన కిరీటము నేలను దాకగానె
ఖరుడు పరువు సమస్తము ధరణిగూలి
నట్లు భావించి గర్జించి ఆర్భటించి
శరము సంధించె శ్రీరామునురము పైకి. 329

తే. శరము బట్టిన ఖరుడు వైతరణి ముందు
కాలపాశము చేబూని కసలుచున్న
చండ మార్తాండుపుత్రు డా దండధరుని
కరణి గన్పించె ప్రతివారి కంటి కపుడు. 330

తే. కాని రణరంగరాముని కంటి కతడు
పెను తుఫానుకు కూకటివ్రేళ్ళు గదలి
శాఖ లొక్కొక్కటే తెగి చావు మూడి
ఆకు లెండిన వటవృక్ష మటుల దోచె. 331

తే. ధరను బడిన యసంఖ్యాక దనుజ వరుల
కంధరమ్ములు చిమ్ము రక్తమ్ము నరసి
కొండవలె నున్న దూషణుమొండె మరసి
ఒడల దడబుట్టి ఖరుడు మహోగ్రు డాయె. 332

తే. అంత దివ్యాస్త్రములకు శౌర్యమ్ము బెంచి
రథము నురికించు మంచు సారథిని గదిపి
వేలమందిని జంపిన వీరుడ నని
విరవీగకు మోరి! నీ పీచ మణతు. 333

ఆ. అనుచు దానవేంద్రు డసురాంతకునిపైన
శోణితమును ద్రావు బాణములను
కుండపోతగాగ గురిపించె నవియెల్ల
రాము బాణతతికి రాలె నేల. 334

తే. అసలె రౌద్రమ్ముగా నున్న అసురనేత
వీరరాఘవు ధాటికి బీర ముడిగి
పుడమినంటిన తన శస్త్రములను రోసి
మరల నొక నిశితాస్త్రమ్ము ఖరుడు గురిగవిసరె. 335

మ. అది కడు భీకరార్భటుల నారఘు రాము నురమ్ముదాకి, ఆ
సదమల దివ్యతేజు కవచమ్మును బ్రద్దలు జేసె నంతటన్
బెద రిసుమంత లేక యరిభీకరుడై దనుజారి యుగ్రుడై
వదలె నగస్త్య నస్త్రమును వైరి భుజమ్ములు నేల గూలగన్. 336

తే. రెండు భుజములు దెగినట్టి దుండగీడు
రక్తసిక్తార్ణవమ్మైన రథము నుండి
పుడమిపై దూకి తడబడి బోర్లబడియె
అతని దోర్గర్వ మంతయు అణగిపోయె. 337

ఆ. పైకిలేవబోయి పట్టు లభింపక
ఖరుడు మరల బడియె ధరణిపైన
వాని బాధ రామబాణము తిలకించి
జాలినంది పంపె స్వర్గమునకు. 338

ఆ. పాపభీతి లేక రేపు మాపని లేక
ఘోరకృత్యములను మేర మీరి
చేయువాని నెట్టి శిక్ష వరించునో
ఖరుని మరణ మవని కెరుగ జేసె. 339

ఆ. గగన సీమ నుండి ఖరుని నికృష్టపు
చావు నరసి నట్టి దేవగణము
బహువిధముల రాము ప్రావీణ్యమును మెచ్చి
పూలుపైన జల్లి పొగడి రెంతొ . 340

తే. జయ జయ ధ్వానముల మధ్య చక్కనిలిచి
అభయముద్రగ దక్షిణ హస్తముంచి
మౌనగంభీరముగ నున్న మగని గాంచి
పరుగు లిడి వచ్చి యురముపై వాలె సీత. 341

తే. అనుగుసతి తనుస్పర్శతో జనవిభుండు
సంగరము నందు గలిగిన శ్రమను మరచి
సీత చుబుకమ్ము నంటి ముంజేతనెత్తి
మొలకనవ్వులు వెదజల్లి పలికె నిట్లు. 342

తే. "జానకీ! నీకు దప్పెను సవతిపోరు
ఘనులు మునులకు దప్పె రాక్షసుల పోరు
లక్ష్మణునకును దప్పె శూర్పణఖపోరు
నాకు సంతృప్తి నొసగె నీనాటి పోరు." 343

తే. అటుల దనుజ వైరి అనిన వెన్వెంటనే
మునులు దోయి లొగ్గి మోద మలర
పగర మట్టుబెట్టి ప్రళయమ్ము దప్పించి
మమ్ము గాచినావు మాన్యచరిత! 344

తే. అనుచు రాముని గీర్తించి అంద రపుడు
ఆశ్రమమ్ముల కేగిరి అవనిజాత
కేల భర్తను గొని పర్ణశాల కేగె
లక్ష్మణుండును తన కుటీరమ్ము జేరె. 345

తే. ఇంతలో "స్వామి! శ్రీరామ! ఇనకులేశ!
నన్ను చంపక వదలిన కన్నతండ్రి!"
అనుచు బరువెత్తి ఖరుని స్యందనము దోలు
తరుణదనుజుండు రాముపాదమ్ము లంటె. 346

ఉ. రాముడు వానిలేపి, "వినరా రథ సారథి! నేడు నిన్ను, నే
ప్రేమను గాదు చంపనిది భీకర యుద్ధము తీరుతెన్ను లా
కామిని దుష్టశూర్పణఖ కర్ణములన్ బడవేతు వంచు ని
న్నోమితి, గాన సత్వరమె ఓపికతో జని తెల్పు మంతయున్." 347

తే. రాము నానతి మేరకా రక్కసుండు
ఖరుని శిరమును గైకొని కడురయమున
శూర్పణఖ కూరుచున్నట్టి చోటి కరిగె
దుఃఖ ముప్పొంగ బెట్టె నా దుష్ట ముందు. 348

ఆ. పగర తలల కొరకు పాశవికమ్ముగా
ఎదురు చూచుచున్న ముదిత ఖరుని
శిరము నరసి బెదరి సివమెత్తి కంపించి
మరు నిమేషమందె మాయమాయె. 349

మ. అది లంకేశుని కొల్వుకూట మడుగో! అగ్రాసనాసీనుడై
గదపై దక్షిణ హస్తముంచి సురలున్, గంధర్వులున్, కిన్నరుల్
బెదరన్ తమ్ములు, మంత్రులున్, బుధవరుల్ వేష్టింప ముక్కంటియే
సదనమ్మందున నిల్చి చర్చలను తా సాగించున ట్లొప్పెడిన్. 350

సీ. కను లెర్రజేసెనా? కాలచక్ర మ్మాగి
తలవంచి జోహారు సలిపి తీరు!
గదను పైకెత్తెనా? గడగడ వణకుచు
మరణదేవత జంకి శరణు గోరు
పంచాక్షరీ మంత్ర పఠనమ్ము జేసెనా?
కైలాస శిఖరమే కదలియాడు
సకల శాస్త్ర పురాణ చర్చసాగించెనా?
వేదముల్ చెవియొగ్గి విన దొడంగు

తే. ఇన్ని యోగ్యత లర్హత లున్న వీరు
డెవ్వ డీరేడులోకాల నెరుగ జెప్ప
మనుచు నే రాయి నడిగిన ఆ క్షణమ్మె
అసుర విభుడైన రావణుం డని వచించు. 351

ఆ. అట్టి దనుజ విభుడు అనుచరగణముతో
సభను దీర్చియున్న సమయమందు
ఉరుము లేక పిడుగు శిరముపై బడినట్లు
ఖరుని శిరము బడియె కనుల ముందు. 352

ఆ. అనుజు శిరము గాంచి అసురేంద్రు డుగ్రుడై
ఇట్టి ఘోరకృత్య మెవడు సల్పె?
నేడె వాని చావు మూడిన దని లేచి
కాలయముని వోలె గదను బట్టె. 353

తే. అంతలో "సోదరా! కొంచె మాగు" మంచు
ముక్కు చెవులును దెగియున్న ముద్దుచెల్లి
శూర్పణఖ లోని కరుదెంచి చురచుర మని
అగ్రజుని జూచి కనలుచు అనియె నిట్లు. 354

తే. "అక్కరకు రాదు దోర్గర్వ మన్నియెడల
ఎదిరి బలము నెరుంగక యెగసి పడకు;
పొరిగొనె నొకండె ఖరుని త్రిశిరుని దూష
ణాది దైత్యుల నెల్లర నాహవమున. 355

ఆ. **అతని పేరు రాము డాతని తమ్ముడు**
**లక్ష్మణుండు వాడె రక్కసి నని**
**కోసె ముక్కు చెవులు క్రూరత్వమున నిట్టు;**
**లింక నేను బ్రతికి యేమి ఫలము?** 356

తే. పేరునకు మానవులె గాని, వీర్యమందు
పౌరుషమునందు పోరాడు పటిమయందు
వారి కెనయైన వీరు లెవ్వరును లేరు
సంగరము నందు దివిజులే సాటిరారు. 357

తే. వారిలో రాము డసహాయ శూరు డతని
అనుగుసతి సీత వర్ణింప నలవిగాని
నవనవోన్మేషయైన సౌందర్యరాశి
విడిగ గన్పింప దెప్పుడు విభుని బాసి. 358

సీ. చంద్రబింబమ్ముతో సరిదూగుటే కాక
చిరునవ్వు నిరతమ్ము చిందుమోము
నిద్దురలో గూడ ముద్దాడ వలెనన్న
కాంక్ష రేకెత్తించు కన్నుదోయి
పైటలో కొలువైన పసిడి బొంగరముల
సరణి గన్పట్టెడు చన్నుదోయి
చీకటింటను గూడ లోకమోహనమైన
స్థిరకాంతులను విరజిమ్ము మేను

తే. అంతియేగాదు దాని ప్రత్యంగమందు
చిదిమి మధు వాన నుసిగొల్పు సిరులు కలవు
ఎక్కువగ జెప్పనేల? నా యింతి తలపె
ప్రథమ సోపాన మానంద పరవశతకు. 359

తే. అట్టి అందాల ఖనిని నీ కప్పజెప్పి
స్వర్గసుఖముల నెల్ల నీశయ్యపైన
పూలుగా జల్లి నీ వందు బొందునట్టి
పారవశ్యము గననెంచి భంగపడితి. 360

ఉ. ఈ యవమాన భారమిక నేను సహింపగ జాల నగ్రజా!
పోయిన కర్ణనాస లెటుబోయెను వానిని గూర్చి చింతిలన్;
ఆయమ నీకు దక్కవలె నంతముగావలె రామలక్ష్మణుల్
చేయుము చెచ్చెరన్ ప్రతిన సీతను దెచ్చెద నంచు నిప్పుడే. 361

ఆ. సీత ప్రాణనాథు చెంత నున్నప్పుడు
చెరను బట్ట లేడు శివుడు కూడ
అందువలన వాని నటనుండి తప్పించి
అపహరింప వలయు నతని సతిని." 362

తే. అనుచు చెల్లెలు సీతాపహరణమునకు
ప్రోత్సహింప లంకేశుడు భూమిసుతను
పతిని విడగొట్టి మాయ చేపట్టి తెచ్చి
నటుల మధురోహలం దోలలాడ సాగె. 363

సీ. చిదిమిన సుధలూరు చిన్నారి కెమ్మోవి
మృదువుగా కొనగోట మీటినట్లు
స్నిగ్ధ సుందరమైన చెక్కుటద్దములందు
తన బింబమును జూచుకొనినయట్లు
కమనీయమై యొప్ప కౌను బాహువులలో
చిక్కించుకొని నాభి నొక్కినట్లు
మంచులో తడిసిన మందార కుసుమాల
మించు పాదాల చుంబించినట్లు

తే. సీత తోడిదె లోకమై చేరవచ్చి
నట్టి పట్ట మహిషిని ఛీకొట్టినట్లు
పాప పంకిల మైనట్టి భ్రమల నడుమ
మునిగి తేలుచునుండె నా మూర్ఖు డపుడు. 364

తే. చెల్లె లాతని ఊహల చెదరగొట్టి
"ఏమి నిర్ణయ మొనరించి తీవు చెపుమ"
అనుచు కదిపిన దనుజేశు డామెతోడ
అరిగెదను నేడె సీతాపహరణమునకు. 365

ఉ. చుక్కలు నేలరాలినను సూర్యుడుచంద్రుడు త్రోవదప్పినన్
దిక్కులు ఒక్కటొక్కటిగ దీనత చేతులు మోడ్చి వేడినన్
లెక్కగొనన్ యథేచ్ఛ నవలీలగ జానకి బట్టి తెత్తు, నీ
విక్కడె యుండి స్వాగతము నిమ్ము స్వయమ్ముగ సోదరీ!" యనెన్.

తే. అంతలో శుక్రు డాతని కడ్డు తగిలి
"పాప చింతన నీ వంశపతనమునకు
హేతువగు గాన రావణా! నీతిమాలి
ధరణిజాతను చెరబట్ట తగదు నీకు." 367

ఆ. అనుచు హితవు గోరి ఆచార్యవరు డన్న
పలుకు లతని చెవికి ములుకులాయె!
తీపి పిత్తరోగి తిన నొల్లడను సూక్తి
నిర్జరారి పట్ల నిక్కమాయె. 368

తే. కరములను రావణుడు మోడ్చి గురుని జూచి
"నీతి వాక్యాలు నేడు నా నిర్ణయమును
మార్చజాలవు దేవరా! మమత పంచి
మించు కృపతోడ నన్ను దీవించు" డనియె. 369

ఆ. అటుల రావణుండు అసురదేశికునకు
సవినయముగ దెలిపి సభ ముగించి
పతనహేతువైన పాపకార్య మొనర్ప
భయము సుంతలేక పయన మాయె. 370

తే. తాను పన్నిన వ్యూహ మత్యంత విజయ
వంత మైనటులెంచి శూర్పణఖ మురిసె;
అదియు మన మంచికే యని త్రిదశులందు
విలువ కందని మోదము వెల్లివిరిసె. 371

మ. అది మారీచుని యాశ్రమ మ్మతడు తానత్యంత దీక్షారతిన్
మది నే భ్రాంతియు లేక యోగి పగిదిన్ మౌనమ్ము పాటించుచున్
కుదురౌ ధ్యానములోన నున్నతరి దిక్కుల్ పిక్కటిల్లంగ ని
ర్వది హస్తమ్ములతోడ వచ్చె నటకున్ లంకేశ్వరుం డుద్ధతిన్. 372

ఆ. ఎదుట నిలిచి దానవేంద్రుడు "మారీచ!
నేడు నాకు వలయు నీ సహాయ
మిది యవశ్య" మనుచు పదిగొంతుకలతోడ
పలికె నాశ్రమమ్ము వణకునటుల. 373

ఆ. మౌనముద్ర చెదరి మారీచు డసురేంద్రు
గాంచి పైకి లేచి గారవించి
అతిథి పూజ జేసి "ఆలస్యమేల నే
జేయదగిన దేదొ చెప్పు" మనియె. 374

తే. "నీకు దెలియదె? మారీచ! నిన్న మొన్న
పంచవటిలోన చెల్లి శూర్పణఖ కెంత
అవమతిఘటిల్లెనో దూషణాది దనుజ
వీరు లెందరు చచ్చిరో క్రూరగతుల. 375

తే. అట్టి దుష్కార్యముల కెల్ల ఆద్యులైన
గుణవిహీనులు రామలక్ష్మణుల కిపుడె
తగిన దండన మొనరింప దలచినాడ!
నీవు నా వాడవని వచ్చి నిలిచినాడ. 376

క. చెల్లెలి హృదయావేదన
చల్లారగ మృతుల ఆత్మ శాంతించగ తాన్
గొల్లుమని యేడ్వ రాముని
ఇల్లాలిని బట్టి తెచ్చి యే నేల వలెన్." 377

ఉ. "నీచము నుచ్చమున్ మరచి, నీ విటు పల్కుట పాడియౌనె? పై
శాచికమైన దుష్కృతి నిశాచర వంశ వినాశహేతువౌ?
యోచన జేయుమో అసురయోధుడ! తొందర గూడ" దంచు మా
రీచుడు పల్క రావణు "డరే ! యిక వాగుడు నాపరా" యనెన్. 378

ఆ. "నన్ను బెదరగొట్టి నా నోరు మూయించ
గలవు గాని రాము గెలువ లేవు;
అతి పవిత్రసీత ఆమె జోలికి పోయి
కోరి కోరి తెచ్చుకొనకు చావు. 379

ఉ. రాము డవక్ర విక్రముడు రాక్షస సంహరణ మ్మొనర్ప నీ
భూమిని బుట్టినట్టి సురపూజితు డచ్యుతుడాదిలక్ష్మియే
భూమిజ, యింక లక్ష్మణుడు భూధర మూనిన ఆదిశేషు డీ
వేమనుకొంటి వేమొ? సరి యెవ్వరు? వారికి ముజ్జగమ్ములన్? 380

ఆ. రామ బాణహతిని నే మును పెన్నడో
చచ్చుదనుక మరవ సాధ్యపడని
రీతి భంగపడితి భీతిల్లి మునివృత్తి
స్వీకరించి యిచట జేరియుంటి". 381

ఆ. అనుచు నసురవిభుని కంజలి ఘటియించి
తాను పొందినట్టి స్వానుభవము
తేటతెల్లముగను దెలిపె మారీచుడు
కాని మంచిమాట ఖలుడు వినునె? 382

ఆ. "మాట లాపి వినుము మారీచ! నేను నా
పట్టు విడువ నెట్టి పట్టునైన;
మారు జెప్పకుండ మాయలేడిగ మారి
ఇపుడె పంచవటికి ఏగవలయు. 383

ఆ. పసిడి జింకవోలె మిసమిసలాడుచు
ధరణిజాత ముందు దిరిగెదేని
ఆమె జూచి మురిసి అది నాకు గావలె
ననుచు పట్టుబట్టు నాత్మవిభుని. 384

ఆ. చిన్న కోర్కె భార్య తన్ను కోరిన దని
వేగ నతడు నిన్ను వెంబడించు
అంత చిక్కి చిక్కనటుల దూరమ్ముగా
అరుగు మీవు రాము డరయు నటుల. 385

తే. అట్టి అదనున నేబోయి ఆమెనొడిసి
పట్టి లంకకు గొనిపోదు ప్రతిన దీర;
అడ్డు జెప్పిన నీ శిర మవని బడును
కాన కాంచన మృగమవై కదలు మిపుడె." 386

క. అని దనుజేశుడు పలికిన
మనమున తలపోసి నిటుల మారీచుం డీ
ఘనకలుషాత్మునిచే నే
జనిపోవుట యేల? రాముశరమున జత్తున్. 387

ఆ. కాన వీని మాట కాదన రాదని
ఎంచి మదిని నిర్ణయించుకొన్న
మాయ లెరిగినట్టి మారీచు డటులనే
ననుసరింతు తావకాజ్ఞ నిపుడె. 388

క. అని మారీచుండనగనె
తన పంతము నెగ్గె నంచు దానవనాథుం
డెనలేని తృప్తినందెను
కనవలె సీతాపహరణ కథ యేమగునో? 389

తే. అది శుభోదయవేళ నా ఆకుటిల్లు
పంచవటి కందచందాలు పంచుచుండె!
వెలుగు దుస్తుల దినమణి వేయికనుల
ఆ మనోహర శోభనే అరయుచుండె. 390

తే. అపుడె అభ్యంజన స్నాన మాచరించి
అల్లనల్లన నెఱి కురు లార్చుకొనుచు
వన మహాలక్ష్మివోలె గన్పట్టు చున్న
సీత అరుదెంచె లోనుండి చెలువ మొప్ప. 391

తే. కొంతదూరాన పందిరి గుంజ నొడిసి
పట్టి కౌగిట బంధించినట్టులున్న
నాగమల్లియతీవ విన్నాణ మరసి
సీత మెలమెల్లగా దాని చెంతకేగి. 392

తే. విరిసి విరియని చిన్నారి విరులు ద్రుంచి
పైటనే సెజ్జగా జేసి పదిలపరచి
బల్లపరుపైన యొక నునుబండపైన
కూరుచుండి మాలగ నల్లుకొనుచునుండె. 393

తే. ఆమె కోయగ మిగిలిన అలరులన్ని
సీత జనయిత్రి సిగలోన జేరు భాగ్య
మీ దినమ్మున మన కిక లేదటన్న
చింత మదిలోన నెలకొని చిన్నవోయె. 394

ఆ. అచట పూలసరము నందమ్ముగా కట్టి
ఆరినట్టి కురుల నట్టె ముడిచి
సరము తురుముకొనెడు సమయాన నొక చేయి
లాగివైచె! మిగుల లాఘవమున. 395

ఆ. లాగినట్టి చేయి రామునిదే యని
తిరిగి చూడకుండ తెలిసికొనిన
సీతపైకి లేచి చిరునవ్వు చిందుచు
పతిని జూచె! మిగుల పరవశతను. 396

ఆ. చేతిలోని సరము సీత సిగను జుట్టి
విరుల ముద్దులాడి పరిమళమును
తనివితీర గ్రోలి తరుణిప్రక్కను రాము
డూరువులను నొక్కి కూరుచుండె. 397

తే. అపుడు నాథుని ఒడిలోన అవనిజాత!
శిరము వాలిచి చిరునవ్వు చెంగలింప
కన్ను లరమోడ్చి శ్రీవారి కన్నులందు
తన మనోహర రూపము గ్గనుచు నుండె. 398

ఉ. రాముడు సర్వమున్ మరచి ప్రాణసఖిన్ కనులార గాంచుచున్
"భామిని! నిన్ను నా అనుగు పత్నిగ పొందెడు భాగ్యమబ్బె నీ
భూమి సమస్తమేలుకొను భోగము కన్నను మిన్నయైన నీ
ప్రేమను చూరగొంటి; నిను వీడి క్షణమ్ము మనంగలే" ననెన్. 399

ఆ. "ఎంతమాట స్వామి! ఈ జన్మకే గాదు
జన్మజన్మలకును చాయవోలె
అనుసరింతుగాని అరనిమేషమ్మైన
బ్రతుకగలనె? నిన్ను బాసి నేను." 400

ఆ. అనిన సీత మాట లప్పుడే అరుదెంచి
వినిన లక్ష్మణుండు వెఱపు జెంది
వదిన! బ్రహ్మకైన వాగర్థముల విడ
దీయతరము గాదు తెలిసికొనుము. 401

గీతి. అనుచు రామానుజుండనిన మాటలకు
ఆ ఆలుమగ లెంతో ఆనందపడిరి
అటుల నా దంపతు లాప్యాయతలను
పంచుకొనుచుండ నొక బంగారులేడి
చెంగుచెంగున వచ్చి చెంగటను చేరి
సుదతి సీతమ్మనే చూడసాగినది!
అపురూపముగ నున్న ఆ జింక నరసి
ఒడలు బంగరు చాయ పొడలు తెలిచాయ
కను లింద్రనీలాలు మణులు శృంగాలు
ఈ పసిడి లేడి మన ఇంటి ముందున్న
అన్నమూ నీళ్ళు నా కవసరములేదు.
అని దాని బట్టుకొన నరిగె సీతమ్మ
అంతలో చెంగుమని అపరంజి జింక
పర్ణశాలను వీడి పరుగెత్తి నిలిచి
మరల సీతమ్మనే మరిమరీ చూచె!
అది తనకు దక్కదని మది నెంచి సీత!
ప్రాణనాథునితోడ బలికె నీరీతి.
కోపగించకు స్వామి కోరనే దెపుడు
తప్పైన ఒప్పైన తప్ప లేదిపుడు
చూడ ముచ్చటగొల్పుచున్న ఆ లేడి
నెటులైన తెచ్చి నాకిమ్ము ప్రాణేశ!
అనగానె లక్ష్మణుం డందుకొని వదిన!
కనక మృగ మెపుడైన కాంచితిమె మనము
దనుజ మాయగ దీని దలచె నా మనము!
మారీచుడను వాడు మనకు పగవాడు!
వా డన్నకుం దెలియు బహుమాయగాడు!

వాడె ఈ రూపాన వచ్చి నాడేమొ?
అనిన వెంటనె రాము డనుజున్ను జూచి
తమ్ముడా! నీ మాట తథ్యమేయైన
వాని నీనాడె దునుమాడెదను నేను!
అటుగాక ఆ జింక అపరంజిదైన
ప్రాణాలతో దాని పట్టికొని తెచ్చి
మురిపాల మీ వదినె ముద్దు జెల్లింతు
అంతదాకను నీవు ఆశ్రమము విడక
ఆమె కండగ నుండు మని యానతిచ్చి
కోదండమును బూని కోమలిని జూచి
ముసినవ్వు లామెపై విసరి నే వత్తు
నని తెల్పి ఆ లేడి ననుసరించాడు!
అన్న ఆనతి మేర కచట లక్ష్మణుడు
ఉలుకు పలుకును లేక ఉండిపోయాడు! 402

ఉ. చిక్కియు చిక్కన ట్లరిగి చెంతకు రాముడు చేరినంతనే
బిక్క మొగమ్ము వేసికొని బిత్తర వోయిన రీతి జూచి నల్
దిక్కుల బర్వులెత్తుచు యథేచ్ఛగ మాటికి ఆగిచూచుచున్
తక్కులమారి జింక కడుదవ్వులకున్ గొనిపోయె రాఘవున్. 403

సీ. తనకు తానుగ లేడి దగ్గర కరుదెంచి
శ్రీరామునే కన్నులార జూచు
చూచి రాముడు చేయిసాచి పట్టగ బోవ
అంతలోననె చెంగు మనుచు దూకు
దూకి పూపొదరింట దూరి రాముని కంట
బడకుండ నక్కి లోపలనె దాగు!
దాగి రాముడు తన దరికి జేరక ముందె
మాయమై దూరాన మరల బొడము

తే. పొడమి కడు చాకచక్యాన పుడమిరేని
తావు మార్చుచు వేగ గొంపోవసాగె
నప్పు డది మాయలేడియే యని గ్రహించి
ఓర్పు విడనాడి భూవిభు డుగ్రు డాయె. 404

తే. "నీచ మారీచ! ఇపుడె నీ పీచ మడతు
మరచిపోతివె నాటి నా శరము ధాటి
నేడు తప్పించుకొనలేవు నీ" వటంచు
ఏచి రాముడు కోదండ మెక్కువెట్టె. 405

ఉ. "హీనుడ! యింత పాపమున కెందుకు నీవొడిగట్టినాడ; వా
దానవకాంత శూర్పణఖ తాపము బాపగ వచ్చినావొ? నా
బాణపు వేటునన్ తనువు బాసిన దుష్టులు దూషణాదులన్
కానగ నెంచి వచ్చితివొ? కారణ మెయ్యది యైన చంపెదన్." 406

తే. అనుచు నారిని చెవిదాక అట్టె లాగి
మారు యోచన లేక నా మాయలేడి
గుండియకు గురిపెట్టి సక్రోధు డగుచు
వదలె రాము డమోఘమౌ వాడిశరము. 407

తే. శరము మాయామృగమ్మును తరిమి చంప
శవము మారీచుడుగ మారి స్వరము మార్చి
సీత చెవిలోన మార్మ్రోగు రీతి నరచి
తూలి "హా లక్ష్మణా"యని నేలకొరగె. 408

ఆ. అతి భయంకరముగ అసురాధముడు తన
గొంతు ననుకరించి కూసినట్టి
కూత సీత నెంత క్షోభిల్ల జేయునో
యని తలంచి రాము డార్తి జెందె. 409

ఆ. ఆకుటింట సీత హా లక్ష్మణా యన్న
అరుపు వినినతోనె అడలిపోయి
కనుల నీరు నింపి గద్గద స్వరముతో
నెదుటి మరది నరసి యిట్టు లనియె. 410

తే. "లక్ష్మణా! అది మీ యన్న రామభద్రు
నార్తనాదమె వినియును అరుగవేల?
వారి కేమైనదో యని వగచుచుంటి
వెడలి శుభవార్త గొనితెమ్ము వేగముగను." 411

క. అని జానకి కలవరమున
అనినంతనె లక్ష్మణుండు "ఆపద లన్నన్
కనుగొని నంతనె గడగడ
వణకుచు పాదాల మ్రోల వ్రాలును వదినా! 412

ఉ. అన్న కొకింత కీడొదవ ఆకస మల్లల నాడునమ్మ! అ
త్యున్నతమైన శీతనగ ముర్విపడంకగ గ్రుంగునమ్మ ఆ
పన్నుల గాచి దుష్టులను బట్టి వధింపగ విష్ణుమూర్తి నా
యన్నగ బుట్టెనమ్మ! యిది అక్షర సత్యము నమ్ము మమ్మరో! 413

ఆ. మనము వినిన కేక మారీచునిదె కాని
అన్న దనుచు నమ్మ నేను నమ్మ!
కాన నీవు భయము కాసంతయును లేక
గుండె దిటవు తోడ నుండుమమ్మ!" 414

క. సౌమిత్రి యెన్ని చెప్పిన
భూమిజ సహనమ్ము వీడి పొగ లెగయు వగన్
నీమదిగల చెడు తలపును
నామది గ్రహియించె! లక్ష్మణా! యిది వినుమా! 415

తే. క్రూరముగ నీవు ఊహించుకొనినయట్లు
లట్టి దుర్గతి సంభవమైన యెడల
అగ్నిలో దూకి చచ్చెద నంతెగాని
నీకు వశమౌదు నమమాట నీటిమూట." 416

తే. అనిన జనకజ మాట లక్ష్మణుని చెవుల
శూలమై దూరి మదిని కల్లోల పరచె;
కనుల దుఃఖాశ్రువులు నిండె; కాళ్ళు వణకె;
అయిన బాధను దిగమ్రింగి అనియె నిట్లు. 417

తే. "హరి హరీ! యెంతమాట నీ వంటివమ్మ!
తల్లిగా నీదు పాద పద్మములయందు
ధ్యానమే తప్ప, వేరొక్క తల పెరుంగ
నట్టి నన్నిట్టి దుర్భాష లాడకమ్మ! 418

తే. నిజముగా నాకు నీవన్న నీచబుద్ధి
కలను సైతము నిసుమంత గలిగెనేని
నిట్టనిలువున బూదియై నీయెదుటనె
నేలరాలక నేనెట్లు నిలుతునమ్మ? 419

తే. అయిన నీయాజ్ఞ తలదాల్చి అరుగుచుంటి
నమ్మ విను మమ్మ! తిరిగి నాయన్నతోడ
వచ్చి నీ కంటబడునంతవరకు నీవు
మాట మన్నించి వాకిలి దాటకమ్మ!" 420

ఆ. అనుచు బాధతోనె ఆ తల్లి నడవికి
అప్పగించి అన్న ఆజ్ఞ మీరి
లక్ష్మణుండు చనియె రాము డేగిన వైపు
భారమంత విధికి వదలివేసి. 421

తే. లక్ష్మణుం డటు వెడల నిలాతనూజ
అశ్రుకణముల పైటతో నద్దుకొనుచు
మందగమనాన ఆశ్రమమందు జేరి
మించు భక్తిని గౌరి నర్చించదొడగె. 422

తే. "కరుణ నను జూడు మమ్మలగన్నయమ్మ!
వెలది మోమున కందము తిలకమమ్మ!
అమ్మ! నా బొట్టు చెడకుండ అరయు మమ్మ!
అనుచు మొర వెట్టుకొనుచుండె! నంతలోనె. 423

క. "భవతీ దదాతు భిక్షాం"
అవనిజ! నీ భిక్షగోరి అరుదెంచితి, నీ
భువిలో ఇంతకు మునుపే
నెవరిని అర్థించి బ్రతుకు టెరుగను దేవీ." 424

క. ఆ పిలుపు వినిన జానకి
పాప మ్మత డెవరో? నాకె బాధ కలిగెడున్
తాపసుడో? లేకాకలి
బాపుకొనన్ వచ్చినట్టి బడుగో యనుచున్. 425

తే. వెంటనే బైట కరుదెంచి ఇంటిముందు
చేరియున్నట్టి మునివేషధారి నరసి
అతడు నిజమైన తాపసు డనుచు బ్రమసి
రండు లోనికి అని మ్రొక్కె నిండు భక్తి. 426

తే. అంత నామాయ యోగి మర్యాద వలదు
"భామినీ మణి! వేగ బోవలయు నేను;
వేరు దలపక తోచిన భిక్షబెట్టు
మదియె, అతులిత సుఖము నీ కందజేయు." 427

తే. అనిన సన్యాసి గని సీత "మునివరేణ్య!
భర్త సన్నిధియే నాకు వలయు సుఖము
లన్ని యొనగూర్చె! నింక యే యాశలేదు
నా మనోహరు సౌఖ్యమే నా సుఖమ్ము. 428

తే. బైటకేగిన నా స్వామి బాగుగోరి
రెండు చేతులు మోడ్చి ప్రార్థించుచుంటి;
నా అభీష్టము నెరవేరునట్టి వరము
వేగ దయచేసి నన్ను దీవింపు" మనియె. 429

ఆ. అటుల కొంగుసాచి అర్థించి నిలిచిన
అవనిజాత నరసి ఆ దురాత్మ
"డలరుబోడి! నిన్ను వలచి వచ్చితి నేను
అసుర విభుడ గాని యతిని గాను." 430

క. అని రాము డెపుడు వచ్చునో?
యను భయమును సీత మీది వ్యామోహమ్మున్
పెనగొని తొందరపెట్టగ
దనుజేశుడు దాల్చె నపుడు తనరూపమ్మున్. 431

తే. ఆ దురాత్ము భయదరూప మరసి సీత
వ్యక్త మొనరింపలేని దిగ్భ్రాంతి నంది
పడగనెత్తిన యెలనాగు పగిది జూచి
పలికె బుసకొట్టి యిటుల నా పాపితోడ.  432

శా. "ఔరా! యెంతటి మోసగాడవుర నీ యాకారమున్ దాచి, ఛీ
వేరే వాంఛలు లేని యోగి పగిదిన్ విచ్చేసి దుర్బుద్ధితో
కారుణ్యాకరు రామభద్రు సతినే కామింప యత్నింతువే?
మేరన్ మీరక పారిపొమ్ము! తులువా! మిత్తిన్ మదిన్ వేడుచున్."

ఆ. అటుల భద్రకాళి అవతార మెత్తిన
సీత మోము నరసి భీతి గొనక
పక్కు మనుచు నవ్వి "పంకజ లోచనా!
వినుము మృత్యువునకు వెరువ నేను. 434

ఆ. పది శిరస్సు లొగ్గి ఫాలనేత్రుని గూర్చి
ధరణి దద్దరిల్ల తప మొనర్చి
మేటి వరములంది మృత్యువునే గెల్చి
లంక నేలుచున్న రావణుడను. 435

క. తరుణీమణి! నే నురిమిన
సురవిభుడే బెదరి దాగు సూర్యుని వెనుకన్;
ధర క్రుంగు మిన్ను వంగును
గిరిధరుడును శిరము వంచి గిర గిర దిరుగున్. 436

తే. అట్టి యీ రావణుని గెల్వ నాహవమున
రాజ్యమును గోలుపోయి బైరాగివోలె
ఆకు లలములు మేయుచు అడవులందు
సంచరించెడు నరునకు శక్య మగునె? 437



తే. రతిని మించిన సౌందర్యవతివి నీవు!
మన్మథుని మించు రసిక సమ్రాట్టు నేను!
నీవు, నేనును జతగూడ నిఖిల లోక
సుఖము లన్నియు మనకు దాసోహ మనును. 438

తే. కాన జాగేలరమ్ము! లంకాపురమ్ము
కాచియున్నది నీకు స్వాగతము వలుక
గగన మార్గాన గొనిపోయి కాంక్ష దీర
రాణిగా జేతు! నీ శుభలగ్నమందె. 439

తే. అనుచు ముందు కురికి అవనిజాతను కేల
నొడిసి పట్టి లాగి పుడమితల్లి
గొల్లు మనెడు రీతి గొంపోయి రథములో
నట్టె విసరివేసె నసురమృగము. 440

తే. చేయునది లేక సీతమ్మ మోయలేని
దుఃఖ భారము గుండెను తొలచివేయ
పంజరములోన చిక్కిన పక్షివోలె!
బావురని యేడ్చి శిరమును బాదుకొనుచు. 441

తే. రాక్షసాధమ! యెంత కిరాతకుడవు
మగడు దరిలేని సమయాన మాయతోడ
అబల నైనట్టి నన్నిటు లపహరించి
విర్రవీగకు మిది గొప్ప విజయ మనుచు. 442

తే. కాల సర్పము పూదండ కరణి నెంచి
మెడను దాల్చగ బూనిన వెడగు వీవు!
పడుకపై ప్రళయాగ్నిని పరచుకొనగ
సాహసించిన దశకంఠ! శలభ మీవు. 443

తే. ఉచ్చనీచమ్ము లెంచక యుల్లమందు
కామపీడిత మతివయి క్రాలుచున్న
నీవు నా భర్త నెదిరించి నిలువలేవు
కుటిలుడా! కోరికొని తెచ్చుకొనకు చావు. 444

ఆ. శిలలు కరుగునట్లు సీతామహాసాధ్వి
అరచి మొత్తుకొనిన సరకుగొనక
రథము పైకి లేపె! రావణు డాకాశ
మెంత ఘోర మనుచు నేడ్వసాగె. 445

ఆ. అంత అవనిజాత అయ్యో నా నాథున
కెవరు దెలియజేతు రీ విషయము
నిలిచి చూతు రేల? నీలిమేఘములార!
దీననైన నాకు దిక్కు మీరె. 446

సీ. విను వీథి మిము జూచి వేడుక పడు లీల
సాగిపోయెడు పక్షి జంటలార!
ప్రతిఫల మ్మడుగక ప్రాణుల నోదార్చి
యెపుడు పారెడు సెలయేరులార!
సకల లోకాలకు శ్వాస నందించుచు
మేలొసంగెడు పిల్లగాలులార!
చల్లని నీడను స్వాదుఫలాలను
తల్లుల వలె బంచు తరువులార!

తే. మరది సౌమిత్రి హితవును సరకుగొనక
చెనటి రావణు చేతిలో జిక్కుకొంటి;
నా మొరాలించి ఈ వార్త నా విభునకు
కరుణ నెరిగించి పున్నెము గట్టుకొనుడు. 447

తే. ఆ మహామాత రోదన మాలకించి
కటిక బండల గుండెలు కరగె గాని
కరుగ లేదింత రావణాసురుని మనసు
మృగము వేదన వ్యాధునికేమి తెలియు? 448

చ. క్షితిసుత ఆర్తనాదమును చెట్టు పయిన్ గల పక్షిరాజు తా
నతి ధృతి నాలకించి నిజ మయ్యది సీతగళ స్వరమ్మె! యే
వెతలు ఘటిల్లెనో యనుచు వేగిరమే రథమడ్డగించి దు
ర్మతియగు రావణాసురుని మార్కొని ఆగర ద్రోహి యంచనెన్. 449

చం. అన విని నా కిరాతకుడు ఆగ్రహమున్ వెలిగ్రక్కి "ధూర్తుడా!
నను నెవరంచు నెంచితివి నాకపురాధిపు గెల్చినట్టి నే
దనుజ విభుండ! రావణుడ! దారికి అడ్డుదొలంగు మోరి! కా
దని యెదురొడ్డినావొ? నిను నంత మొనర్చెద నిప్పడే" యనెన్. 450

తే. వెంటనే జటాయువు సుంత భీతి లేక
"కలుషచిత్తుడ! తెలియు నీ ఘనత నాకు
అమర విభుగెల్చినానని అదరిపడకు
ఆత డేనాడొ దాసోహ మనెను మాకు. 451

ఆ. ముందు రథము దింపి పుడమి తల్లికి సీత
నప్పగించి కోరు మామె శరణు
లేని యెడల నిపుడె నేనె నిన్ పరిమార్చి
రామభద్రుకడకు రమణి జేర్తు." 452

క. అనిన జటాయువు పలుకులు
విని జనకజ దుఃఖ ముడిగి "వేగిరముగ, నీ
దనుజాధము హత మారిచి
తనువున ప్రాణమ్ము నిలుపు తాతా" యనియెన్. 453

చ. "భయపడకమ్మ! నే నిపుడు ప్రాణములన్ బలివెట్టియైన నీ
పయనము నాపి స్యందనము బ్రద్దలు చేసి నఖాంకురాళిచే
రయమున వాని గర్భమును రక్తము జిమ్మగ రక్కి రక్కి వి
స్మయమున దేవతల్ గనగ మాలగనే ధరియింతు ప్రేవులన్." 454

మ. అని పక్షీంద్రుడు జేసినట్టి శపథమ్మా రాక్షసాధీశు నె
మ్మనమున్ వ్రయ్యలు జేసె; నంత "బడుగా! మమ్మే నిరోధింతువే?
నిను నా ఖడ్గము సైపదింక నిపుడే నీ రెక్కలన్ ద్రుంచెదన్
నను వెంటాడగ లేక చత్తు విచటే నా వార లుప్పొంగగన్." 455

తే. అనుచు లంకేశు డెనలేని ఆగ్రహమున
కాచుకొమ్మని వరుస ఖడ్గములు విసరె
పాపమవి యెల్ల రెక్కల పర్వతమును
దాకి ముక్కలు ముక్కలై ధరణి గూలె. 456

ఆ. అపుడు దెలిసి వచ్చె నసుర వల్లభునకు
పక్షిరాజు రెక్క బలము విలువ
అంత రెచ్చిపోయి అతడు విభీషణా
స్త్రమును వదలె ధరణి దద్దరిల్ల. 457

క. ఆ నిశితాస్త్రము ఖగపతి
మేనెల్లను గాయపరచె; మిడినాగువలెన్
మానిని జానకి అదిగని
తా నెంతయు వగచి మిగుల తల్లడ మందెన్. 458

తే. గాయముల లెక్క గొనక జటాయు వపుడు
జన్మ ఫలముగ దక్కిన శక్తినంత
పణముగా నొడ్డి దుష్ట రావణుని తోడ
పోరు సాగించె నత్యంత పౌరుషమున. 459

తే. అసురనాథుని కడ మారణాయుధములు
నిరుపమానములైన వెన్నేని కలవు;
ముదిమి సర్వాంగముల మీద ముసురుకొనిన
ఖగపతికి రెక్కలును గోళ్లె కత్తు లాయె. 460

క. ఐనను అదరక బెదరక
దానవపతి మీది కురికి ధరణిజ మురియన్
మేనెల్ల గోళ్ల రక్కుచు
మానక యెదురొడ్డి పోరె! మగటిమి వెలయన్. 461

తే. అటుల బోరాడి పక్షిరా జసురనాథు
స్వర్ణమకుటము నేలపై బడగద్రోసె;
కనలి రావణు డతని రెక్కలను నరికి
సీత నట్టులె గొంపోయె నీతిమాలి. +62

క. పరమోద్ధతముగ జరిగిన
అరుదగు యుద్ధమున పక్షి అడ్డుదొలగగా
అరదము వేగము పెరిగెను
ధరణీసుత నిండుగుండె దడయును పెరిగెన్. 463

ఆ. కాని తాను చేయ గలిగిన దేమియు
లేక దుఃఖ మాపలేక సీత
దాశరథిని మదిని దలపోసి అటునిటు
గాంచ చిన్ని ఆశ కంట బడియె. 464

ఆ. కొండమీద కొన్ని కోతులాడుట జూచి
యొడలిపైన నున్న తొడవు లొలిచి
పైటకొంగు చింపి పదిలమ్ముగా గట్టి
వానరముల నడుమ పదలివేసె. 465

ఆ. తనను వెదకికొనుచు చనుదెంచు విభునకు
అవియె ఆనవాలు లగు నటంచు;
ఆమె దలచినటులె ఆ మూట వానర
ప్రభువు ముందు బడియె భద్రముగను. 466

క. దినమణి తనయుడు దానిని
వెనువెంటనె విప్పిచూచి విస్మయమున పా
వని చేతి కొసగె దాచగ
మనమున పలు సందియములు మల్లడిగొనగన్. 467

ఆ. అసుర విభుని యరద మాకాశ మార్గాన
వాయు వటుల పరుగు దీయుచుండె;
అప్పు డవనిజాత నారసి రావణుం
"డతివ! లంక దగ్గరాయె" ననియె. 468

తే. అనిన వెంటనె జానకి అగ్గిమీది
గుగ్గిలమ్ముగ మారి తా భగ్గు మనుచు
"రావణా! దగ్గరైనది లంకగాదు
మదము తలకెక్కినట్టి నీ మరణ" మనియె. 469

క. అవనిజ అటు లనినను దా
నవవిభు డాగ్రహము గనక నయగారమునన్
"యువతీ లలామ! న న్నిటు
లవమానింపంగ నీకు న్యాయమె?" యనియెన్. 470

ఆ. వనిత అంద మనెడు వలలోన జిక్కిన
కామపీడితుండు కలనుగూడ
ఎగ్గు సిగ్గు దరికి నేగబో డనుసూక్తి
నీచరావణుండు నిజ మొనర్చె. 471

ఆ. "రమణి యిపుడు నీవు రాముపత్నివి గావు
అసురచక్రవర్తి అనుగు సఖివి;
అదిగొ! కానుపించునదె మన ఉద్యాన
వని యచటనె నీ నివాస మింక. 472

తే. శోకమును బాపునట్టి అశోకవనము
నందు నీవున్న నేను నిత్యమ్ము వచ్చి
కాలచక్రము నాపి సౌఖ్యముల దేల్చి
వేగ నిర్మింతు నీకొక విరులమేడ." 473

క. అని లంకేశుడు సీతను
వనమున దిగబెట్టి ఆమె పరిచర్యలకై
మనసెరిగి సేవ జేసెడు
వనితల నియమించి రాజభవనము జేరెన్. 474

ఆ. విధి బలీయ మన్న విమల సత్యమునకు
సీత బాధతోనె శిరసు వంచి
భారమంత రామభద్రునిపై వైచి
అశ్రువులను పైట కప్పగించె. 475

ఆ. జరిగినట్టి ఘోర మెరుగని రామయ్య
సీత దలచుకొనుచు శీఘ్రగతిని
పంచవటిని జేర పరుగిడుచుండగా
ఎడమనేత్ర మదరె యెడద బెదరె. 476

క. "ఏమిటి? యీ దుశ్శకున
మ్మేమిటి నా గుండె వేగ మింతగ హెచ్చెన్
ఏమైనదొ? నా సీతకు
ఆమెను విడనాడి బ్రతుక నలవియె నాకున్." 477

క. అని మనమున దలపోయుచు
ఇనవంశజు డేగుచుండె నిత్తరినన్నా!
నను మన్నించు మనుచు ల
క్ష్మణు డెదురుగ వచ్చి రాము కౌగిట వాలెన్. 478

క. శ్రీరాముడు తమ్ముని మో
మారసి యుద్వేగ భరితమౌ హృదయమునన్
"ఏరా? నీవిటు లానతి
మీరెద వని యెరుగ" ననుచు మిక్కిలి వగచెన్. 479

తే. అన్న వేదన గని తమ్ము డడలిపోయె!
అతని గొంతుకలో తడియారిపోయె!
సత్యము వచింప ధైర్యము చాలదాయె!
అనిలు డది జూచి క్షణకాల మాగిపోయె! 480

తే. తుదకు సౌమిత్రి విధిలేక పెదవి విప్పి
"అన్న! నీ యాజ్ఞ నిదివర కెన్నడైన
దాటియుంటినె? నేడు నా ధర్మనిరతి
ఆవిరైనది కారణ మడుగకన్న!" 481

ఆ. అని సుమిత్రసూతి అన్న పాదాలను
పొంగి పొరలు అశ్రువులను కడిగి
సీత అనినదేది చెప్ప నోరాడక
తప్పు తనదె యనుచు ఒప్పుకొనియె. 482

తే. సత్య మెరిగిన పుడమి, లక్ష్మణుని గొప్ప
తనము కనులారగని తన తనయ తప్పు
బైట పెట్టక శ్రీరామభద్రువద్ద
పరువు గాపాడినందుకు బ్రస్తుతించె. 483

తే. లక్ష్మణుని ఆర్తి అన్న శ్రీరామభద్రు
నంతరంగపుటావేశ మణచివైచె;
తమ్ముడా! తప్ప ఒప్పను తర్కమేల?
శీఘ్రముగ నేను పడవలె సీత కంట. 484

సీ. ఆమె ఆవేదన నడవి తల్లికి జెప్ప
కొను ఓపికయు లేక కుములు చుండు
తలవాకిటం జేరి నిలువెల్ల కనులుగా
నిట్టూర్పు లండగా నిలిచియుండు
ఎదురు చూపులు తన నెంత నొప్పించిన
విసుగు వేసట లేక వేచియుండు
దనుజ మాయల మూలమున సంభవించెడు
కీడెంచి మిగుల దుఃఖించు చుండు

తే. ఎప్ప డేవేళ కే ముప్ప ఎగసిపడునో?
అనుచు నను గూర్చి తను గూర్చి ఆగకుండ
మదిని చెలరేగు నూహల మధ్యజిక్కి
ఎటుల విలపించు చున్నదో యింతి సీత." 485

తే. అనుచు అర్ధాంగి మీదనే మనసు నిలిపి-
లక్ష్మణుడు వెంటరాగ - శ్రీరాము డపుడు
తడబడుచునున్న అడుగుల వడిని పెంచి
పంచవటి జేరె నెనలేని భయము గదుర. 486

తే. అన్నదమ్ముల కంటికా ఆకుటిల్లు
బావురని యేడ్చు పసిపాప పగిది దోచె!
సీత గనుపించదే యన్న చింతహెచ్చి
వారి గుండెల పిడుగుల వాన గురిసె! 487

తే. ఒక్కసారిగ భూకంప మొదవినట్లు
బ్రద్దలై నింగి తమపైన బడినయట్లు
తలచి భీతిల్లి నాల్గువైపులను వెదకి
యిరువురును ముంగిలిని గాంచి వెరగుపడిరి. 488

తే. ప్రొద్దుటను లేచి వాకిలి సుద్దిజేసి
సీత దీర్చిన ముగ్గులు చెదరియుండె!
మట్టి మరకలు బడిన కమండలువును
జింక చర్మము దండ మావంకనుండె. 489

తే. ఆ భయంకర దృశ్యమ్ము నరసి రాము
డెవడొ జడదారి వేషాన నేగుదెంచి
అపహరించెను నా ప్రాణ మనుచు వగచి
కుప్పకూలెను సౌమిత్రి గుండె లదుర. 490

తే. అన్న నోదార్చు ధైర్య మింతైన లేక
మౌనముద్రను దాల్చంగ మనసు రాక
తుదకు కంపించుచున్న చేతులను మోడ్చి
అగ్రజా! యని యేడ్చె రామానుజుండు. 491

తే. అప్ప డాయన్న దమ్ముల ఆత్మఘోష
దిక్కులన్నిటి యందు ప్రతిధ్వనించె;
ఎండ కన్నీరు గార్చి కోదండరాము
బాధ జల్లార్వ యత్నించి భంగపడియె. 492

తే. మొదలు నరికిన తరువట్లు పుడమిపైన
వాలియున్నట్టి జానకీవల్లభుండు
తడబడుచులేచి ముందున కడుగువేసి
వగను బిగబట్టి వినువీథి వంకజూచె. 493

తే. ఆకసమ్మున రెక్క లల్లార్చు కొనుచు
అప్ప డప్పడు గుసగుసలాడు కొనుచు
సాగిపోయెడు గువ్వలజంట యొకటి
జంటబాసిన రాముని కంటబడియె. 494

తే. ఎంత భగవంతుడైన తా నెత్తినట్టి
జన్మ సిసలైన మానవజన్మగాన
సుఖము, దుఃఖము సమమన్న సూక్తి మరచి
రాము డల్లాడె నా పావురముల జూచి. 495

ఆ. "పులుగు జంట యెంత పున్నె మొనర్చెనో
అంతులేని హాయి సొంతమాయె!
అనుగుసతికి దూరమైన నేనెంతటి
అఘ మొనర్చినానొ! అర్థమాయె." 496

క. అని రాముడు సాధారణ
మనుజుని వలె మదిని వగచి మౌనము విడి యా
వినువీథి కనుల పంటను
గని కంఠస్వరము నొవ్వగా ని ట్లరచెన్. 497

తే. "ఓ శకుంతములార! నాదొక్క మనవి
దిక్కు దోచని కడగండ్ల జిక్కుకొన్న
నన్ను దయజూచి క్షణమాగి మిన్నువీడి
వినుడు నాగోడు మీకు వేవేలనతులు. 498

ఉ. ఏనొక దీన మానవుడ! ఇట్టి కతమ్మున నామనోహరిన్
కానల కష్టగించితిని కాని యొకింతయు జాలిలేక నా
కాననసీమకన్నులను గప్పి దురాత్ము డెవండొ? మాయచే
ఆ నవనీత మానసను అట్టులె దోచుకపోయె నక్కటా! 499

తే. కాని ఆ వెన్నముద్ద నా కర్కశుండు
ఎచట దాచెనొ? మ్రింగెనొ యెరుగనైతి;
ఆకసమ్మున విహరించు నట్టి మీరు
ఆమె ఉనికిని దెలిపి న న్నాదుకొనుడు. 500

సీ. సహజ సుందరమైన చంద్రబింబమ్మును
అపహాస్య మొనరించు నామె మోము
మిన్నేటి తీరాన మెలమెల్ల విహరించు
హంసల తలదన్ను నామె నడక!
విమల గాంధర్వమున్ వీణా నినాదమున్
అతకరింపగజాలు నామెగళము
అప్పడే విరిసిన అరవింద దళముల
కనుగు తోబుట్టువు లామె కనులు!
తే. పేరు సీతమ్మ! మేను బంగారు రెమ్మ!
రామ శబ్దము కలనైన నామె వినిన
కప్పరము వోలె నిలువున కరగిపోవు!
ఆ సువాసిని కివ్వియే ఆనవాళ్ళు. 501

ఆ. ఆనవాళ్ళు దెలిపి అర్థించుచున్న యీ
ఒంటికంటి వాని కంటి పాప
నెవడు దొంగిలించె నిపు డెక్క డున్నది
వెదకి దెలుప మిమ్ము వేడుచుంటి." 502

ఆ. అటుల వేడుకొనుచు అచటనే నిలుచున్న
రాము నరసి పావురముల జంట
కంటనీరు వెట్టి వెంటనే దిగివచ్చి
మేను నిమిరి మరల మింటి కెగసె. 503

ఆ. పక్షి జంట అన్నపైని జూపించిన
సానుభూతి మంచి శకున మనుచు
తలచి లక్ష్మణుండు కలతను దిగమ్రింగి
ఇనకులేశు తోడ నిట్టు లనియె. 504

క. "అన్నా! ఇది శుభశకున
మ్మన్నా! ధైర్యముగ నుండు మన్నా! వదినన్
కన్నారగాంచు భాగ్యము
అన్నా! త్వరలోనె గలుగు నన్నా!" యనియెన్. 505

క. సొమ్మసిలియున్న రాముని
నెమ్మనమున గ్రమ్మినట్టి నిర్వేదము నా
తమ్ముని వాక్కులు చల్లని
తెమ్మెరలై బాపి గుండెదిటవును గూర్చెన్. 506

తే. అంత నా సోదరద్వయ మచటినుండి
కొత్త ఆశలు తోడుగా కొంతదూర
మరుగ నొక చోట వాడిన విరులసరము
కానుపించెను రాముని కాళ్ళముందు. 507

తే. రాముడా పూలసరమును లక్ష్మణునకు
చూపి "తమ్ముడా! యిది నేను సుదతి సీత
సిగను దురిమిన అలరుల చిన్నిసరము
ఆమె నీ దారినే గొనియరిగె నెవడొ? 508

తే. ఎవ్వడా దుష్టు డన్నది యెటుల దెలియు?
ఎచట దాచెనో? అది సైత మెటుల దెలియు?
నా మనోహరి బ్రతికి యున్నదియొ లేదొ?
అదియు దెలియదు ఎటు దక్కునామె నాకు. 509

తే శివధనుర్భంగమును మెచ్చి శిరసు నిమిరి
జనకభూపతి యెందరో జనులమధ్య
పెండ్లి పేరున నాచేత బెట్టినట్టి
జాతిరత్నము చెయినుండి జారిపోయె. 510

తే. కాననమ్ములు నీవు నా కన్నబిడ్డ
నేమి జేసితి వనిన నేనేమి చెపుదు?
అమ్మ నా కోడ లెక్కడ యనిన నామె
కేమి బదులిత్తు నిపుడు నాకేది దారి?" 511



తే. అనుచు విలపించు రాముని ఆర్తి నరసి
మనసు కరగిన జింకల మందయొకటి
పాపి మారీచు డొక జింక రూపమెత్తి
ఆలుమగలను విడగొట్టె నని తలంచి. 512

తే. వచ్చి శ్రీరామచంద్రుని వద్ద నిలిచి
కంట నీరిడి "స్వామి! మా వెంటరండు"
అనుచు చూపులతో దెల్పి అచటినుండి
జింక లన్నియు కదలె దక్షిణపు దిశగ. 513

తే. వాని చూపులలోన జాల్వారునట్టి
భక్తి విశ్వాసముల వెంట ప్రభువు కదలె;
రామభద్రుని వెంబడి లక్ష్మణుడును
కదలె నిదియేదొ దైవసంకల్ప మనుచు. 514

ఉ. జింకలలోన నే యొకటి చెంగున దూకదు, మోము నెప్పడే
వంకకు ద్రిప్ప దార్తజనబాంధవు వీడదు సింహగర్జకున్
జంక దొకించుకేనియును సవ్వడిసేయదు ఎంత గొప్పదీ
జింకల భక్తియంచు వనసీమ సమస్తము విస్మయం పడెన్. 515

తే. దండు ఆ యన్నదమ్ముల రండు సామి!
కొద్దిసేపటిలో దీరు కొంత దిగులు
అనిన రీతిని మెలమెల్ల నడవి దారి
నటుల గొనిపోయి యొకచోట నాగిపోయె. 516

సీ. అచ్చోట గనుపించె నాయుధ శకలముల్
ఆహవమ్మునకు చిహ్నమ్ము లటుల
ప్రక్కనే గనుపించె పక్షి రెక్కల జంట
అన్నదమ్ముల జంట అడలునటుల
ఒక చోట గనుపించె నొక్క ఆభరణము
కలికి జానకి మేని కాంతియటుల
అటువైపు గనుపించె నపరంజి మకుటము
బ్రద్దలై పోయిన పాప మటుల

తే. అంతలో రామ! శ్రీరామ! అసువు లింక
నెత్తురోడిన దేహాన నిలువ వయ్యొ!
అయ్యొ! రామయ్యొ! అనుచున్న ఆర్తరవము
చింతలో నున్న రాముని చెవిని బడియె. 517

తే. అది సుపరిచితమైన గొంతని తలంచి
రాము డావంక కేగి దిగ్భ్రాంతినందె!
చావుబ్రతుకుల నడుమ నా స్వామి కొరకె
వేచియున్న జటాయువు వెక్కి యేడ్చె. 518

తే. "వచ్చితివ తండ్రి! నీమది భగ్న మనెడు
వార్త నీపూట నానోట బలుకవలసె
చెప్పి తీరక తప్పదీ చేదు నిజము
వేద వేద్యుడ! చింతను వీడి వినుము. 519

తే. లంక నేలెడు దశకంఠరావణుండు
తల్లి సీతమ్మ నెత్తుక తరలు చుండ
ఆ మహాసాధ్వి రోదన నాలకించి
పోరు సల్పితి నా శక్తిమేర కాని. 520

తే. వాడు నా ఱెక్కలను ద్రుంచి వసుధసుతను
బలిమి గొంపోయె; నే నిట్లు ప్రాణములను
పిడికిటం బట్టి తుది శ్వాస విడువకుండ
తన్నుకొనుచుంటి నిది మీకు విన్నవింప." 521

ఆ. అనుచు నటులె బ్రాకి ఇనకులేశుని జేరి
వారి పాదములకు ప్రణతు లొసగి
మోము వాల్చి కన్ను మూసె జటాయువు
తెగిన ఱెక్క లడలి వగచునటుల. 522

ఆ. "విగతజీవుడైన ఖగకులోత్తమునకు
అపరకర్మ జరిపి అవనివిభుడు
జరుపలేకపోతి జనకున కానాడు
ఆ యఘమ్ము యిప్ప డంతరించె." 523

ఆ. అనుచు దలచి రాము డచటి జింకల జూచి
అడుగకుండ సాయ మందజేసి
ఆదుకొనిన మీకు ఆనంద ముప్పొంగ
అడుగనట్టి వరము నందజేతు. 524

ఆ. "అడవి తల్లి కిలను ఆయువుండెడుదాక
ఉదధులందు నీరముండు దాక
మేను వీడి గూడ మీ దివ్య చర్మముల్
యతుల కాసనమ్ము లగును గాక!" 525

ఆ. అనుచు నుడివి రాము డనుజన్ముతో గూడి
పరుగు వంటి నడక నరుగుచుండ
మార్గమధ్యమందు మహి దద్దరిలునట్టి
అరుపు వారి చెవుల నాక్రమించె. 526

తే. ఆ భయంకర శబ్దమా అడవిలోని
తరుణ సింహాల దిశలకు దరిమె గాని
రాజసింహాలు శ్రీరామలక్ష్మణులను
లేశమైనను కదలించ లేకపోయె. 527

తే. అంత సౌమిత్రి "అగ్రజా! అసురు డెవడొ?
అదిగో! ఆ పొదనుండియే అరచుచుండె?
తత్క్షణమె వెళ్ళి నే వాని తలను నరికి
అరుగు దెంచెద నిప్పుడే" యనియె నంత. 528

తే. "ఓరి మానవ! నీ చేత బారెడంత
కత్తి యున్నను తలలేదు కత్తిరింప
తాళవృక్షాలనే తలదన్నునట్టి
బాహువులు చాలురా! మిము బట్టి చంప." 529

తే. **అనిన పొలికేకతో పాటు నా క్షణమ్మె
ఒక్కసారిగ దీర్ఘబాహువులు రెండు
వెలుపలికి వచ్చి యిర్వుర బలిమి బట్టి
లగువుగా పొదలోనికి లాగుకొనియె.** 530

తే. అవి కబంధుని బాహువు లట్టె వాడు
చిన్న గుహవోలె పొట్టపై నున్న నోట
నిర్వురిని గ్రుక్కుకొన జొచ్చె నింతలోన
దాశరథి ద్రుంచె వాని హస్తములు రెండు. 531

ఆ. అంత నిస్సహాయు డైన కబంధుడు
"రామభద్ర! నేను రాక్షసుడను
కాను పెక్కు దుష్ట కర్మము లొనరించి
శాప మంది యిటు కురూపినైతి. 532

తే. అపుడు దేవేంద్రు నర్థింప నాత డరసి
జానకీవల్లభుడు నిను జంపినపుడె
పూర్వవైభవమును నీవు పొందగల వ
టంచు వచియించె కాననో అవనినాథ! 533

ఆ. నీవు నన్ను జంపి నీచేతి మీదుగా
కాల్చి బూది జేయ గలుగు నాకు
దివ్యరూప" మనుచు దీనమ్ముగా వేడ
వాని కోర్కె దీర్చె వసుధవిభుడు. 534

తే. అపుడు చితిమంటలందుండి అనుపమాన
దివ్యతేజస్సు వెలువడి దివినిదాకె;
అందులోనుండి గంధర్వు డవతరించి
విన్నవించెను శ్రీరామవిభున కిట్లు. 535

క. "రామా! శ్రీతులసీదళ
దామా! నీవలన జన్మ ధన్య మ్మాయెన్
నా మునుపటి రూపబ్బెను
నీ మేలును మరువజాల నే నెన్నటికిన్. 536

తే. ఇంత జేసిన, నీకేమి ఈయగలను
తెలిసికొంటిని మీ ఆపదలను నేను
కాన మీరిప్డు ఋష్యమూకమ్ము జేరి
నెయ్య మందుడు వానరనేతతోడ. 537

తే. అతడు సైతము నీవలె నాలి బాసి
కుందుచున్నాడు రఘుపతీ! అందువలన
మంచిచెడ్డల నిరువురు పంచుకొనిన
మూటగట్టుక మేలు మీ ముందు వాలు." 538

గీతి. అని తెలిపి గంధర్వు డటులె దివికేగె
విని రామలక్ష్మణుల వీను లలరారె
వెంటనే అటనుండి జంటగా వారు
కడువడిగ ఋష్యమూకమ్ము గమ్యముగ
వెనుదిరిగి కనకుండ జనుచుండిరంత
పంపాసరోవర ప్రాంతమ్మునందు
అందమే తానైన ఆకు టిల్లొకటి
గళమెత్తి భక్తితో పలికె స్వాగతము!
రావయ్య! శ్రీరామ! రమ్య గుణధామ!
పదివేల దోసిళ్ల పంచు నీ ప్రేమ
అని కర్ణపేయముగ వినిపించినట్టి
పిలుపు రాముని గుండె తలుపు దట్టినది
పాదముల నాశ్రమము వైపు ద్రిప్పినది!

అది రామవిభుని దివ్యార్చనం బెపుడు
శ్వాసగా జీవించు శబరి ఆశ్రమము. 539

తే. శబరి స్వయముగ మేలి వాసనలు జిమ్ము
మంచి గంధపు కర్రతో మలచుకొనిన
రామభద్రుని దివ్య విగ్రహము ముందు
కాపురము సేయుచుండును రేపు మాపు. 540

ఆ. సన్నజాజి పూలు స్వామి కోమల పాద
యుగళి నిండ నొవ్వకుండ పేర్చి
పలువిధమ్ములైన ఫలములు నైవేద్య
ములుగ శబరి పూజ సలుపుచుండె. 541

తే. "భవ్యగుణధామ! రామ! నావంటి వారి
పాపముల బాపి వైకుంఠ పదము నొసగ
నీవు జనియించినావన్న నిజ మెరింగి
నిన్ను నామది నానాడె నిలుపుకొంటి. 542

ఆ. చాల యేండ్ల నుండి చర్మచక్షువులతో
నిన్ను గాంచవలయునన్న ఆశ
పండుటాకు మేన ప్రాణాలు నిలిపెను
ఎపుడు కనికరింతు వీవు తండ్రి!" 543

ఆ. అనుచు తననె వేడుకొను చున్న ముదివగ్గు
పలుకు లాలకించి పరవశించి
శబరి నేను వచ్చి చాలసేపైనది
అనియె రాము డామె అలరునటుల. 544

క. ఆ పిలుపు మేలుకొలుపై
దాపున వేంచేసియున్న దశరథరామ
క్ష్మాపతి గని యా యోగిని
నా పున్నెము నడచి వచ్చినది యని తలచెన్. 545

తే. పండి యొరిగిన వరి వెన్నుపగిది శబరి
స్వామి పద పద్మములపైన వ్రాలిపోయె;
పరమ పావను డామెను పట్టి లేపి
ఆశ్రమము మోము వికసింప ననియె నిట్లు. 546

తే. "అమ్మ! స్మరణీయము భవత్సమాగమమ్ము
నీ మనోవాంఛితము లెల్ల నేడె తీరు;
అడవి దారుల వెంబడి నడచి నడచి
ఆకలిగ నున్నదని రాము డనియె నంత. 547

తే. భక్త వత్సలుడగు రామభద్రు డనిన
మాట శబరికి వరహాల మూట యాయె!
అనుదినమ్మును తాగోరుకొనెడు వరము
అడుగకయె స్వామి దయచేసె ననుచు మురిసి . 548

ఆ. ఆమె కన్ను లప్పు డానంద నిధు లాయె!
వర్ష ధార లాయె బాష్పజలము!
నోరు మూగవోయె! నొసలు పున్నమయాయె!
ఒడలు మరచి చేష్ట లుడిగిపోయె. 549

ఆ. అపుడు రామభద్రు డామె నిశ్చేష్టత
నరసి మరల శబరి యనుచు బిలిచె!
అంత తెలివి వచ్చి "అయ్యో! నా మతిమండ
మరచిపోతి స్వామి! పరవశతను." 550

క. అని తడబడు నడుగులతో
జని ప్రక్కనె యున్న వెదురు చాపను గొని కూ
ర్చొనుడని యా సోదరులకు
వినయమ్మున దెలిపి మిగుల వేగిరపడుచున్. 551

ఆ. పండి రాలినట్టి బదరీఫలమ్ముల
బుట్టదెచ్చి వారి ముందుబెట్టి
"అమలచరిత! ఇవ్వి ఆశ్రమమ్మందున
పుట్టి పెరిగి నట్టి చెట్టు పండ్లు." 552

ఆ. అని వచించి యెంగిలను మాట పూర్తిగా
మరచి ముందు తాను కొరికి చూచి
స్వామి కందజేసె! శబరి యొక్కొక్కటే!
హర్ష మొదవ రాము డారగించె . 553

ఆ. భక్తజనుల పట్ల భగవంతునకు గల
ప్రేమ కడలికన్న పెద్ద దనుచు
నెరుగ చెప్పె శబరి యెంగిలి జగతికి
అని సుమిత్ర సూతి ఆత్మ దలచె. 554

ఆ. శబరి ఆతిథ్యమున కిక్షు సాగరమ్ము
కరణి బొంగిన శ్రీరామధరణివిభుడు
"ఇష్టకామ్యార్థ సిద్ధి నీ కిపుడె కలుగు"
ననియె నది విని స్వామిపై యామె యొరిగె. 555

ఆ. అప్ప డినకులేశు డా యోగినీ మణిన్
పట్టి లేపి కదిపి ప్రాణములను
వీడె నని తలంచి వెంటనే స్వయముగా
అంత్యక్రియలు జరిపె నమిత కరుణ. 556

ఆ. అమ్మవోలె తమను అన్ని తానై పెంచి
నట్టి తల్లి మరణ మందెనన్న
బాధకన్న నామె భగవంతు సన్నిధిన్
మూసె కన్ను లనుచు మురిసె లతలు. 557

ఉ. అంతట సోదర ద్వితయ మాశ్రమమున్ విడనాడి పర్వత
ప్రాంతములందు నాడుకొను పక్షుల దుప్పల బల్కరించుచున్
దంతి సమూహముల్ తమకు తాముగ పర్విడి వచ్చి తొండముల్
వింతగ సాచి మ్రొక్కు లిడు వేడుక గాంచుచు నేగుచుండగన్. 558

సీ. అలసిన ప్రాణుల నలల వీవనలతో
జోకొట్టి లాలించు సుందరాంగి!
సకల జీవులకును స్వాదు జలమ్ముల
నొసగి ఆకలి దీర్చు నువిదమిన్న!
చల్లని మనసుతో జలచరమ్ముల నెల్ల
తన బిడ్డలుగ చూచు తలిరుబోడి!
తెల్లతామరలను నల్లకలువలను
పెంచి పోషించెడు ప్రేమమూర్తి!

తే. చెంత జేరిన వడగాడ్పు సేదదీర్చి
వీడుకోలిచ్చి పంపెడు విమల చరిత!
జీవ కరుణాబ్ధి పంపాసరోవరమును
కనులు పులకింప రామలక్ష్మణులు గనిరి. 559

క. కని బిర బిర నచ్చోటికి
జని యిర్వురు కొంత తడవు సర్వము తామై
పనిగొని జలకము లాడిరి
తను వలసెడురీతి కొలను తాండవమాడన్. 560

ఆ. సంకటములు మరచి స్నాన పానాదులు
పూర్తి జేసి రాజపుత్రు లపుడు
మరల పయన మైరి సరసిజాప్తుననుంగు
తనయు చెలిమి మదిని దలచుకొనుచు. 561

## అరణ్యకాండము సమాప్తము

***

# కిష్కింధాకాండము

తే. మార్గమధ్యమునందు బ్రాహ్మణు డొకండు
వేద విజ్ఞాననిధిగ గన్పించువాడు
కాంతి కిరణాలు జాల్వారు కనులవాడు
ఎదురుపడియెను డెబ్బది యేండ్లవాడు. 1

క. ఆతని జూచిన వెంటనె
సీతాపతిలోన ఆశ చివురులు దొడిగెన్
కోతుల నేతను గలయుట
కీతడు తోడ్పడు నటంచు నెంచెను మదిలోన్. 2

తే. అపుడు ముదుసలి బాపడో అయ్యలార!
ధనువు బట్టిన మునివేషధారులార!
మిమ్ము జూచిన రాజవంశమ్మునందు
అవతరించిన పుణ్యాత్ము లనుచు దోచు. 3

తే. ఏమి పనిమీద అడవుల కేగుదెంచి
ఇటుల దిరుగాడుచుంటిరో యెరుగ జేసి
చేతనైనంత సాయము జేయునట్టి
భాగ్య మొనగూర్చు డని వేడె! బాపనయ్య. 4

ఆ. అపుడు రాఘవేంద్రు డా విప్రవర్యుని
మాటతీరు నరసి మదిని మెచ్చి
ఆదినుండి జరిగినట్టి సంఘటనలు
శిలలు గరుగు లీల దెలియజేసె. 5

తే. ఆ మహాత్ముని జన్మ రహస్య మెరిగి
వారి కెదురైన కడగండ్ల వైన మెరిగి
భూసురుని పాదముల క్రింది భూమి వణకె!
చేతులను మోడ్చి ఆత డీరీతి బలికె. 6

ఆ. పుణ్యచరిత! నేను భూసురుడను కాను
వాయునందనుడను వానరుడను
సుజనవర్యుడైన సుగ్రీవు మంత్రిని
హనుమ యనుచు బిలుచు నఖిల జగము. 7

క. అని వెనువెంటనె విప్రుడు
హనుమంతుండాయె! నతని యాకారమ్మున్
గని నిరుపమ వాగ్ధోరణి
విని, జానకివల్లభుండు విస్మయపడుచున్. 8

క. "హనుమా! యిప్పడు మాకా
ఇనతనయుని చెలిమి వలయు నెందుల కనినన్
జనకజ జాడను గనుగొని
అనువగు సాయమ్ము నాత డందీయవలెన్." 9

తే. అనిన రాముని కతిభక్తి నంజలించి
"అంతకన్నను భాగ్యమా! అవనినాథ!
సాయమను మాట మీనోట జారరాదు!
చేసెదము శక్తిమేర మీ సేవ మేము. 10

ఆ. వానరాధిపతులు వాలి సుగ్రీవులు
ఏకగర్భ జనితు లింతయేని
బాహ్యరూప మందు బలశౌర్యములయందు
ఆర్యవినుత! భేద మరయ లేము. 11

గీతి. ఇతరవివరమ్ము లాఇనతనూజుడుదెల్పు
నచటకేగిన పిదపనని తెల్పిహనుమ
అడవి దారుల బోవ నాలస్య మగును
కడు వేగమున నేను గగన మార్గమున
కొనిపోదు నిర్వురన్ కొలువుదీరండి
ఘనమైన నా భుజస్కంధాలపైన
అని చేతులనుమోడ్చి అర్థించెనంత
వెనువెంటనే రామవిభుడు లక్ష్మణుడు
హనుమంతు భుజములం దాసీనులైరి
క్షణములో కపిరాజు సన్నిధిన్ జేర్చి
ఆ మహాత్ములగాథ నాద్యంతమతడు
వినయ మేపారగా వివరించినాడు.
వినిన సుగ్రీవుండు వి[illegible] నిందించి
తన బాధ దిగమ్రింగి తల్లడ మ్మంది
అతిథి సత్కారమ్ము లందించి మ్రొక్కి
అతిజాగరూకత న్నట దాచియున్న
పసిడిసొమ్ముల మూట ప్రభువు ముందుంచి

"అసమాన తేజుడా! అభ్రమ్మునుండి
చుక్కరాలిన లీల నక్కజ మ్మొదవ
ప్రక్కనే వరమట్లు పడిన దీమూట!"
అని తెల్పి సుగ్రీవు డా మూట విప్పి
ఒనరంగ నగలొక్క టొకటె చూపించె
శ్రీరాము డా నగల్ సీతవే యనుచు
నీరు కన్నుల నింపి నిట్టూర్పు విడిచె
అదిచూచి సుగ్రీవు డాత్మలో గుంది
తుదకు గద్గదముగా తొడరి యిట్లనియె. 12

తే. స్వామి! చింతింపకుడు మీ విషాధగాథ
వానరుల నెల్ల మిక్కిలి వగను ముంచె;
తడవు సేయక సీతమ్మ తల్లి జాడ
నరయు బాధ్యత నాది! ధైర్యమ్ము గనుడు. 13

క. అని వనచర నాయకమణి
అని నంతనె ఇనకులేశు డతిమోదమ్మున్
గని "సుగ్రీవా! యిపుడీ
వును నావలె సతిని బాసి పొగులుట గంటిన్. 14

ఆ. అందువలన నేను ముందు నీ బాధల
దీర్పదలచినాడ తెలుపు మిపుడె!
వైర మెందు కబ్బె వాలికి నీకును
సతి వియోగ మెట్లు సంభవించె?" 15

క. అని రాము డడిగి నంతనె
"జననాథా! వినుము నా విషాదమ్మెల్లన్
నను తమ్ముడని దలంపక
పనిగొని వధియింప వాలి పంతము బట్టెన్. 16

తే. వివరముల నెల్ల మీకునే విన్నవింతు
అన్న పేరోలగమ్మున నున్నవేళ
నిక్కి మాయావి యను నొక్క రక్కసుండు
తోరణద్వారముం జేరి తొడను దట్టె. 17

తే. అరిభయంకరు డైన మాయన్న యపుడు
ఎవడవుర నీవు? మదమెక్కి బవరమునకు
కాలుద్రవ్వుచు నుంటి వీక్షణము నందె
ముష్టిఘాతమ్ముతో నిన్ను పుడమి గూల్తు. 18

ఆ. అనుచు వాలి బైట కరుదెంచి వానిని
పరమభీకరముగ తరుమసాగె!
గుండె చెదరి వాడు కొండగుహను దూరె
అన్న నన్ను అప్ప డచట నుంచి. 19

తే. తమ్ముడా! నేను నా బాహుదర్పమునను
వాని హతమార్చి బైటకు వచ్చు వరకు
దండధారివై ఈ బిలద్వారమందె
నిలువు మని తెల్పి తాను లోపలికి నేగె. 20

తే. అన్న ఆదేశమును శిరమందు దాల్చి
రాత్రి పగలును ద్వారపాలకుని లీల
తరచు వినిపించు రణగొణ ధ్వనులమధ్య
బిల ముఖద్వారమందు నే నిలిచియుంటి. 21

తే. అటులె కొన్నాళ్ళు గడిచిన దంతలోనె
నలుదెసలు భయపడనొక నాటి రాత్రి
హతవిధీ! నేడు నిండె నా ఆయువన్న
కేక వినిపించె నతిలోక భీకరముగ. 22

తే. ఆ భయంకర స్వరము మాయన్నదన్న
భ్రాంతిలో బడి నేనతి భయముతోడ
వణుకు చుండగ నెత్తుటి వాగుదడిపె
వగపు రెట్టింప నా పాదయుగళి నపుడు. 23

తే. అన్న మరణించె నిజముగా నని తలంచి
రక్కసుడు బైటబడిన నా ప్రాణములకు
ముప్పు వాటిల్లు ననుభీతి ముమ్మరింప
కొండ కెనయగు బండతో గుహను మూసి. 24

తే. పరుగు పరుగున నే రాజభవనమునకు
జేరి అన్న మరణవార్త జెప్పినంత
సచివు లందరు రాజ్యరక్షణము గోరి
నాకు పట్టమ్ము గట్టిరి లోకవంద్య! 25

తే. అంత లోపల క్షతగాత్రుడైన వాలి
ఉగ్రుడై వచ్చి గద్దెపై ఉన్న నన్ను
జుట్టు పట్టుక లాగి ఛీకొట్టి తిట్టి
తన్ని రాజ్యము సరిహద్దు దాట తరిమె. 26

తే. అప్పటికి కోప మాగక నాత డపుడె
నాసతిని గూడ చెరబట్టి న న్ననంత
మైన వ్యథలకు గురిజేసి తా నొకండె
ఎదురులేకుండ రాజ్యమ్ము నేలుచుండె. 27

ఆ. నాటినుండి నేను నా అనుచరులతో
ఇచటె గడుపుచుంటి నిపుడు నీవు
మా వెతలను బాప మా పాలి దైవమై
అరుగుదెంచి నావటంచు దలచి. 28

తే. వెళ్ళగ్రక్కితి నా బాధ వివరముగను
భక్తవత్సల! నీయదే భారమింక"
అని వచించిన సుగ్రీవు నార్తి బాప
దలచి శ్రీరాము డీరీతి బలికె నపుడు. 29

తే. "నగచరోత్తమ! నీకును నాకు నడుమ
కడు బలీయమౌ మైత్రి యేర్పడినదిపుడు
కాన ఇరువురి కష్టసుఖాలనెల్ల
పంచుకొనెదము జంటగా ప్రతి నిముసము. 30

తే. వాలి మరణించునందాక వనచరులకు
నీకు న్యాయము జరుగదు నిశ్చయముగ
అందుచే ముందు వాని సంహారమునకు
సిద్ధపడవలె మన మతిశీఘ్రగతిని. 31

ఆ. వ్యూహరచన నీది యుద్ధభారము నాది!
తెలియజెప్ప మిపుడు సులభమైన
మార్గ మేదొ వాలి మరణయజ్ఞమునకు"
అనిన రాము మాట నాలకించి. 32

తే. "దశరథాత్మజ! నీ శౌర్య ధైర్యములను
నేను తక్కువగా నెంచగాని వాలి
అసురవిభుడైన లంకేశు నాటబొమ్మ
జేసి అంగదు నుయ్యాల జేర్చినట్టి. 33

తే. శక్తిమంతుడె కా దతిసాహసికుడు
మేరువును బంతివలె పైకి మీటగలడు
చూపుతో వాయుగమనమ్ము నాపగలడు
అతని గెలుచుట సులభసాధ్యమ్ము గాదు. 34

తే. అందువలననె జరిగినదంత మరచి
కాలమీరీతి ఋష్యమూకమ్ముపైన
గడపుచున్నాడ నొకభంగి కనులు గలిగి
చూపునకు నోచుకొననట్టి క్షుద్రు పగిది." 35

తే. "అర్థమైనది నీభయ మర్కతనయ!
రామబాణమ్మునకు సాటి రాగలట్టి
ఆయుధమ్మేది లోకమ్మునందు లేద"
టంచు సౌమిత్రి వచియించె నంతలోనె. 36

తే. **"తమ్ముడా! పొగడ్తల కిది తగని వేళ**
**ఎదిరి బలమును కొలదిగా నెంచదగదు;**
**కాన నిపు డొక్కసారి నా బాణపటిమ**
**నంచితమ్ముగనే పరీక్షించుకొందు."** 37

ఆ. అని వచించి రాము డమ్మును సంధించి
వింటినారి కర్ణమంటలాగి
వదలె! నంత శరము వడివడిగా సప్త
తాళ వృక్షములను నేలగూల్చె. 38

ఆ. ఏడు తాడి చెట్ల నేక ధాటిగ నేల
గూల్చి వేయుటంత గొప్పగాదు!
శరము తిరిగివచ్చి ధరణీశునకు మ్రొక్కి
పూర్వమటుల మరల పొదిని జేరె. 39

చ. అదిగని వాయునందనుడు నర్కతనూజుడు తక్కు వానరుల్
ముదమును చోద్యమున్ గదుర మ్రొక్కిరి అందరు నొక్కసారిగా
సదయుడు నిర్వికార గుణ సాగరుడా రఘురామమూర్తికిన్
నదములును పర్వతాలు విపినమ్ములు మెచ్చి శిరమ్ము లూపగన్. 40

తే. అంత సుగ్రీవు డానంద మతిశయింప
భక్తితో రామదేవుని పజ్జజేరి
"దివ్యతరమైన మీ శక్తి దెలిసికొనక
మేర మీరితి నన్ను క్షమింపవలయు. 41

తే. నా యపోహల నెల్ల వెన్నంటి తరిమి
జ్ఞానభిక్ష నొసంగిన మాననీయ!
నాకు నీ వోన నేడు త్రిలోకనాథు
డగపడుచునుండె! కైమోడ్పు లందుకొనుము. 42

తే. సహజ గంభీరమైన నీశక్తి ముందు
వాలి బలమెంత? వాని నిర్వహణ మెంత?
మునిజనారాధ్య! నీ మూలముననె నాకు
అఖిల శుభములు చేకూరు నని తలంతు." 43

మ. అని సుగ్రీవుడు విన్నవించగనె తా నానంద మేపారగా
అనుజన్మున్ గని రాము డిట్లనియె "నీవాదిక్కునందున్న పూ
వనమున్ జొచ్చి సువాసనల్ జిలుకు పుష్పాలన్ వడిన్ గోసి చ
క్కని హారమ్మును గట్టి తె" మ్మనియె నే కార్యార్థమో? చెప్పకే. 44

తే. అడుగలే దెందు కనుచు రామానుజుండు
కారణ మ్మన్న మది పసిగట్టి నేమొ?
వారి ఆజ్ఞానుసారమే వనికి నేగి
మరునిమేషమె మాలతో తిరిగి వచ్చె. 45

తే. అన్న కనుసన్నతో దండ నర్కసుతుని
కంఠమున కంద మొదవ లక్ష్మణుడు వేసె;
ఎందుకీ పురస్కారమన్ సందియమున
వనచరాగ్రణి రాముని వైపు జూచె. 46

తే. "అచ్చునంబోసి తీసిన యట్టులున్న
అన్నదమ్ములు ఢీకొని అని యొనర్ప
ఎవ్వ రెవ రన్న నిజము నా కెట్లు దెలియు"
నందుకే దండ నీ గళమందు వెలసె. 47

తే. అనిన రాముని ముందుచూపునకు మురిసి
"ఊహ కందవు నీ లీల లో మహాత్మ!
నాకు దట్టని భావమ్ము నీకు దట్టె
గెలుపు ముందుగ నామది తలుపు దట్టె. 48

ఆ. ఇంక వాలి మరణ మెంతో దవ్వున లేదు
ఇపుడె నేను కోట కేగుదెంచి
కదనమునకు వాని కవ్వింతు నావల
భారమంత నీదె! పరమపురుష!" 49

క. అని సుగ్రీవుండనగా
ఇనకులవారాశిసోము డెంతయు మురిసెన్
అనుజన్ముడు లక్ష్మణుడును
వెనువెంటనె బాగు బాగు వెడలుదమనియెన్. 50

తే. అంత దినమణి తనయుడు సంతసమును
సాహసమ్మును బెనవైచి జబ్బ జరచి
"వాలి! నీ తోడ దలపడ వచ్చుచుంటి!
సిద్ధముగ నుండరా ద్వంద్వయుద్ధమునకు." 51

తే. అని భయంకర విధమున నార్భటించి
ఒడలు బలిసిన పిడికిలి నొడిసిపట్టి
కడు వినమ్రత రామలక్ష్మణుల జూచి
వెడలె కిష్కింధ దెసగ కుప్పించి దూకి. 52

ఆ. కదన కౌతుకమ్ము పదపద మనుచుండ
రామమూర్తి హనుమ లక్ష్మణుండు
నలుడు నీలుడాది పలువురు వానరుల్
ఇనతనూజు వెంట నేగి రపుడు. 53

ఆ. అంద రటుల వడిగ నరిగిరి కిష్కింధ
కంత రామచంద్రు "డర్కతనయ!
కయ్యమునకు నీవు కవ్వింపు మాతని
వాని పీచమిపుడె నే నడంతు." 54

తే. రాము డారీతి నుడువగా రవిసుతుండు
కోటగుమ్మము జేరి ఆక్రోశ మెనయ
భీకరమ్ముగ నరచి పేర్వెట్టి పిలిచి
దర్పముగ నిల్చి సింహనాదమ్ము జేసె. 55

క ఆ గర్జన తమ్మునిదని
వేగమె గ్రహియించి వాలి విస్మయపడుచున్
కాగల కార్యము దీర్చెద
ఆగర తులువా! యటంచు నరచుచు లేచెన్. 56

తే. ఆ యరుపు విన్న వాలి అర్ధాంగి తార
అదరిపడి లేచి కుపిత సింహమ్ము రీతి
పృథ్వి మార్మోగ చెలగి గర్జించుచున్న
ప్రాణనాథుని గాంచి దిగ్భ్రాంతి జెందె. 57

తే. అంతలోననె సుగ్రీవు నరపు మరల
కోట బురుజుల నెల్లను కుదిపి వేసె;
వెంటనే వాలి తనప్రక్క నంటి యున్న
అనుగు సతి తార నారసి అనియె నిట్లు. 5౮

తే. "అర్థమైనదా తార! ఆ యరు పెవరిదొ?
దుష్ట సుగ్రీవు డనికి కాల్దువ్వు చుండె?
ఇంత ధైర్య మా భీరున కెట్టు లబ్బె?
ఏది యేమైన బలిగొందు నిపుడె వాని." 59

ఆ. అనుచు ముందు కురుకు ఆత్మేశు కరమును
బట్టి ఆపి తార "ప్రాణనాథ!
నేడు నా మనమ్ము కీడు శంకించుచు
నున్నదందు వలన నోర్మి వలయు. 60

తే. కోపగించక నా మాట కొంత వినుడు
అదరుచున్నది కుడికన్ను బెదరుచున్న
దంతరంగము కనుక మీ రరుగ వలదు
అనువుగానట్టి సమయాన అనియు దగదు. 61

ఆ. నాడు పారిపోయి నేడు సుగ్రీవుడు
మరల తిరిగివచ్చి దుర మొనర్ప
జబ్బ జరుచునంత సాహస మెటు లబ్బె?
నన్న ప్రశ్న వేసికొన్న యెడల. 62

తే. అవగతమ్మగు నతని ధైర్యమ్ము వెనుక
ఉద్ధతుల ప్రోద్బల మ్మేదొ యున్న దనుచు
లోకమున పేరు మోసిన రాకుమారు
లెవరొ సుగ్రీవు నకభయ మిచ్చిరంట. 63

తే. నిన్న అంగదుడీ మాట విన్నవించి
నపుడె నే కొంత కలవర మందినాను
దాని ఫలితము నిపుడు ప్రత్యక్షముగనె
కన్నులారగ ప్రాణేశ! గాంచినాను. 64

తే. జరుగరానిది యేదైన జరిగెనేని
అవల నాగతి యేమగు? నంగదుడును
నాయనయు అమ్మ లేని అనాథు డగును
వద్దు! పోవద్దు! ఈనాడు బవరమునకు. 65

తే. తప్ప సుగ్రీవునిదె యైన దయ దలంచి
అన్న తమ్ముని బిడ్డగా నరయ వలయు
నన్న ధర్మము మదినెంచి ఆగ్రహమును
వీడి యాతని మన్నింప వేడుచుంటి." 66

తే. అటుల ప్రాధేయపడుచున్న ఆలి నరసి
"దేవి! నీవేల నీవేళ దీనలీల
ఇట్లు వెరపొందు చుంటివో యెరుగ నేను
ఇపు డనికి కాలు ద్రవ్విన దేను గాదు. 67

ఆ. ఊరుపేరులేని వైరి కవ్వించిన
సమయమందు నేను సమరమునకు
జంకి మిన్నకున్న సకల జగతి నన్ను
పిరికిపంద యనుచు పరిహసించు. 68

ఆ. భీరు వన్నమాట వీరుని చెవిసోక
వెరచు నన్న సత్య మెరుగుమీవు!
అనికి జంకి నేనె వెనుకంజ వేసిన
గుండె పగిలి చచ్చు భండనమ్ము. 69

ఆ. వీరుడొక్కమాటె వీడును ప్రాణముల్
పిరికివాడు దినము ధరణి జచ్చు!
ఇంత బ్రతుకు బ్రతికి యెత్తిన పిడికిలి
దించి దాని పరువు దీయలేను." 70

ఆ. అనుచు వాలి తార అభ్యర్థనను త్రోసి
పుచ్చి దెబ్బతిన్న పులి విధమున
కదన మదరి బెదర గాండ్రించి "సుగ్రీవ!
బ్రతుక దలచుకొన్న పారిపొమ్ము. 71

ఆ. చావ దలచుకొనిన సంసిద్ధముగ నుండు
మొక్క దెబ్బతోనె నిక్కి నీల్గ
వరము నీ కొసంగ నరుదెంచు చున్నాడ"
ననుచు వేగ దుమికె నసురుపైకి. 72

తే. కాని సుగ్రీవు డణువంత కలతపడక
అండగా రామభగవాను డుండు కతన
అతిశయించిన ధైర్యమే ఆయుధముగ
తలపడెను వాలిపై తుది కలహమునకు. 73

సీ. పర్వతమ్ములు రెండు ప్రాణాలు పణ మిడి
కువలయ మ్మదర డీకొనిన యట్లు
వటవృక్షములు రెండు పరిపంథులై నిల్చి
కొమ్మలతో మోదుకొనిన యట్లు



మత్తేభములు రెండు నెత్తు రొండొంటిపై
విరజిమ్ముకొని పోరు నెరపినట్లు
కాలనాగులు రెండు గరుడ పక్షులుగూడ
బెదరి పొరెడు లీల పెనగి నట్లు

తే. వాలి సుగ్రీవు లాజన్మవైరు లట్లు
ముష్టిఘాతమ్ము లరుపులు ముమ్మరింప
సలుపు సంగ్రామ మిరువురి బలపరీక్ష
కతులితమ్మైన వేదిక యౌచు నిలిచె. 74

ఆ. గడియ గడచు కొలది పిడికిటి దెబ్బలు
పాదతాడనములు ప్రబలమాయె
వజ్రసమములైన వారి దేహమ్ములు
చెన్ను దరిగి రక్త సిక్తమాయె. 75

తే. ఒడలి నెత్తురు కడగంట దుడిచి వైచి
వాలి తొడదట్టి బుసకొట్టి పట్టిలాగి
కొట్టెనొకదెబ్బ సుగ్రీవు గుండెమీద
అరయు వారలగుండె లల్లాడు నటుల. 76

ఆ. సమయ మొక్క క్షణము జాగైన చెయిజారి
పోవు లక్ష్య మనుచు భూవిభుండు
వాలి వక్షమునకు బాణమ్ముగురివెట్టి
చెట్టుచాటునుండి యట్టె వదలె. 77

తే. ఆ మహాస్త్రము సువిశాలమ్మైన వాలి
భద్రవక్షఃస్థలమ్మును బాకువోలె
నాటె నా ధాటి కాతడు పోటడంగి
మొదలు నరకిన తరువట్లు పుడమి కొరగె. 78

తే. మండి ఆరిన అగ్గిగుండమ్ములీల
పృథ్విరాలిన మార్తాండ బింబ మట్లు
వసుధబడి తల్లడిలుచున్న వాలికడకు
రాము డరుదెంచి చూచి నిర్ఘాంతపోయె. 79

ఆ. మరణశయ్య మీద పొరలాడు చున్నను
ఉరమునందు రుధిర ముబుకుచున్న
కన్నులందు చింత కలికమ్మునకు లేని
వీరు డంచు మదిని వినుతిజేసె. 80

తే. మౌనముగ నిల్చి తనవంక మరల మరల
చూచుచున్నట్టి దశరథసూను నరసి
"రాచపుట్టుక పుట్టి కిరాతకుడుగ
మారి చేసితి వెందుకీ దారుణమ్ము. 81

ఆ. ధర్మనిరతుడైన దశరథ రాజేంద్రు
యజ్ఞఫలము నీవటంచు వింటి!
కటిక బోయకన్న కఠినాత్ముడవు నీవ
టన్న నిజము కన్నులార గంటి. 82

తే. ఇంత పగ నీకు నా మీద నేలగలిగె?
నేను నీయెడ చేసిన నేర మేమి?
క్షాత్ర ధర్మము విడనాడి చాటునుండి
శరము సంధింప మన సెట్లు సమ్మతించె. 83

ఆ. ఊరు వదలిపెట్టి దూరతీరములందు
బ్రతుకుచున్న పిరికిపంద - వాడు
జేయగలిగినంత సాయమ్ము పాటిది
నేను జేయలేనె నీవడిగిన? 84

ఆ. మనసులోని బాధ నణచుకో జాలక
కడుపుమండి వెళ్ళగ్రక్కినాడ;
కనుక రామభద్ర! కినుక వహింపక
ఇప్ప డైన తప్ప నొప్పకొనుము." 85

తే. బాధతో వాలి పలికిన పలుకు లెల్ల
మౌనముగ విన్న రాముడు "వానరేంద్ర!
ధర్మ మిక్ష్వాకు నృపుల కుద్యానవనము
మొలవ దచ్చట గంజాయి మొలక వినుము. 86

తే. జాతు లేవైన లోకాన నీతి యొకటె!
కొన్ని నియమాలు వర్తించు కోతులకును
నీవు పాటించ లేదట్టి నియమములను
కనుకనే నేను చెయిజేసికొనగ వలసె. 87

తే. పామరుడు దారిదప్పిన వానియెడల
కరుణ జూపించుటొప్పును గాని, ప్రభువె
నీతి దప్పిన ఎటుల మన్నింపనగును
కపికులాధీశ! యోచించి కనుము నిజము. 88

తే. తథ్యముగ నాకు మీయన్నదమ్ములందు
తన పెర యటన్న భేద మింతయును లేదు
ధర్మరక్షణ నాకు కర్తవ్య మగుట
ఇట్లు వర్తించినాడ గ్రహింపు మిద్ది. 89

ఆ. కన్నతండ్రి వంటి అన్న తమ్ముని పట్ల
పగను పెంచుకొనుట భావ్య మగునె?
అంతకన్న ద్రోహ మాతని కులసతిన్
సిగ్గువిడిచి నాలి జేసికొనుట. 90

తే. భర్త జీవించి యుండగా వాని సతిని
బలిమి చెరబట్టి నట్టి పాపమ్ము పండి
కాలమే రామబాణమై కాటువేసె
లేదు నీ మీద పగ నాకు లేశమైన. 91

ఆ. చాటునుండి శరము సంధించుటేలన?
మృగము రీతి నీవు మెలగు కతన
వేటగాని లీల చాటున నేనుండి
వాలి! నిన్ను చంపవలసి వచ్చె. 92

తే. ప్రేమమయమైన సువిశాల విశ్వమందు
అఘము పతనమ్మునకు హేతు వన్న నిజము
దేహమున ప్రాణ ముండగా దెలిసికొనిన
కపికులాధీశ! సద్గతి గలుగు నీకు." 93

తే. అనిన రాముని హితబోధ వనచరేశు
మనమునం దంటి యున్నట్టి మలిన మెల్ల
కడిగి శుభ్రము జేసి నిష్కల్మషునిగ
మార్చివేసెను త్రుటిలోనె మంత్ర మటుల. 94

ఆ. అంత వానరేంద్రు డతిఖిన్నుడై కేలు
మోడ్చి రామవిభుని మోము జూచి
"సాధుచరిత! నిన్ను సామాన్యునిగ నెంచి
హద్దు మీరి తూలనాడి నాడ. 95

ఆ. వేద సారమెల్ల వెదజల్లి నాపైన
నను పవిత్రు జేసినావు తండ్రి!
రామబాణమునకు ప్రాణ మర్పించెడు
భాగ్య మబ్బె! నదియె వరము నాకు. 96

తే. కాని నాదొక్క మనవి ఇక్ష్వాకు తిలక!
నీవు సుగ్రీవు నంగదు నేటి నుండి
సొంత తమ్ముల పగదిని జూచుకొనుచు
నిరతమును వారి కండగా నిలువ వలయు. 97

తే. నా సతీమణి తారను నీ సహోద
రిగనె మదినెంచి సోదర ప్రేమ పంచి
శేష జీవిత మామె నిశ్చింత గడుపు
నటుల దయ జూడు మదియె నా కాత్మశాంతి." 98

తే. అనుచు దీనమ్ముగా వేడుకొనుచునున్న
వానరాధీశు గని దీన బాంధవునకు
కన్నులు చెమర్చె గళము గద్గదిక మాయె!
గుండె కరుణామృతమ్ముతో నిండిపోయె. 99

తే. అన్న పరితాపమును కన్నులార గాంచి
వనజమిత్రుని తనయుడు వైర మెల్ల
మరచి మాటలు పెగలక మౌనముగనె
కరములను మోడ్చి తన బాధ నెరుగ జేసె. 100

తే. అన్నదమ్ముల మధ్య విచ్ఛిన్నమైన
ప్రేమపాశపు తునుక లీరీతి మరల
కూర్మి నొండొంటి పెనవేసికొనుట నరసి
రామబాణము మోము దర్పమున మెఱసె. 101

తే. రామభూవిభు డాపరిణామ మెల్ల
జూచి ముద మంది అమరేంద్రు సూనుతోడ
"వానరాధీశ! నీ తుది వాంఛితమ్ము
లన్నియును దీరు తప్పక"యని వచించె. 102

ఉ. అంత సురేంద్ర నందను డనంత ముదమ్మును జెంది తమ్మునిన్
చెంతకు బిల్చి "యిర్వురము చేసిన తప్పలు భాతృప్రేమనే
అంతము జేసెనయ్య! ఇక నంగదు భారము నీదె అయ్య, నే
నింతకు మించి చెప్పగల దేదియు లే" దని కంట నీరిడెన్. 103

ఆ. వాలి కంటినుండి జాలువారిన నీరు
క్షణములోనె దుఃఖ సాగరముగ
మారి కోట నెల్ల ముంచివేసెను
ఇనతనయుని వగపు నెన్న తరమె? 104

తే. అంతలో వాలి దేవేరియైన తార
అంగదుడు వెంటరా, అట కరుగుదెంచి
భర్త దుఃస్థితి తిలకించి బావు రనుచు
వగచి వక్షస్థలముపై వాలిపోయె. 105

తే. ఆమె కన్నీటి వేడికి అతని గుండె
భగ్గుమని మండె! ఆ బాధ బ్రహ్మ కెరుక!
అయిన తన బాధ దిగమ్రింగి ఆలికంటి
నీరు వానరవిభుడు కన్నీట దుడిచె. 106

తే. "ప్రాణసఖి! పుట్టినట్టి యే ప్రాణికైన
చావు తప్పదు జగతిలో సత్యమిద్ది;
వీరపత్నివి, నీవె కన్నీరు నింప
ఎటుల భరియించు కిష్కింధ ఈ విపత్తు." 107

తే. అనుచు సహధర్మచారిణి ననునయించి
అంగదుని మోము ముద్దాడి పొంగివచ్చు
దుఃఖ మెల్లను దిగమ్రింగి "దొడ్డ కొడుక!
నీకు సుగ్రీవుడే తండ్రి నేటి నుండి. 108

తే. అతడె కిష్కింధకును నేత! అందువలన
నీవు సైతము రాజ్యాంగ నియమములను
క్రమము తప్పక పాటించి కన్నతండ్రి
పేరు నిలబెట్టి నీ పేరు పెంచుకొనుము." 109

ఆ. అనిన తండ్రి హితవు నాసక్తితో విన్న
అంగదుండు దుఃఖ మాపలేక
కరము లడ్డుపెట్టి కన్నీటి నాపంగ
దలచి ఆపలేక కలత జెందె. 110

తే. వాలి తన వక్ష మందున్న వజ్రఖచిత
హారమును సోదరుని కంఠమందు వేసి
"తమ్ముడా! యిది దేవేంద్ర దత్తమైన
గొప్ప మణిమాల దీనిని గూర్చి వినుము. 111

క. ఇది నీ యురమున నుండిన
పదుగురు లంకేశులైన బవరమ్మున ని
న్నెదిరించి నిలువ లే" రని
పెదవులు తడబడగ బలికి వెండియు ననియెన్. 112

చ. "తరణికులైక భూషణుడు ధర్మనిబద్ధుడు రామభద్రు డే
తరుణము నందు నిన్ను తన దగ్గర జేర్చెనో, నాటి నుండియే
పరుగిడిపోయె నీ వెతలు, బాధలు కావున వారి సాయమున్
మరచెద వేని నిన్ను పరిమార్చును రాముశరమ్ము నిర్దయన్. 113

ఆ. కాన రామవిభుని కార్యమ్ము నీదిగా
దలచి సీత నెచట దాచియున్న
ఆమె జాడ నరసి అసురాధముని పీచ
మణచి కార్యసిద్ధి నందవలయు. 114

తే. అందుకోసము నీవును అంగదుడును
నలుడు, నీలుడు అంజనానందనుండు
ఇతర వానర పుంగవులెల్లవారు
దీక్ష గైకొని జయము సాధించవలయు." 115

ఆ. అనుచు దెలిపి వాలి అందరి నొకసారి
కలయ జూచి మదిని కలత వీడి
సెలవు నా కటంచు చేతులు జోడించి
అటులె కనులు మూసి అరిగె దివికి. 116

తే స్వప్నమున నైన తన్నెడ బాయనట్టి
తోడు మరణించె నను బాధ తొంగలింప
తార గొల్లున విలపించి దాశరథిని
అరసి గద్గద స్వరమున ననియె నిట్లు. 117

ఆ "భర్తలేని బ్రతుకు భరియించలే నొక్క
క్షణము గూడ కాన సాధుచరిత!
నేడె దయదలంచి నీ బాణమున గూల్చి
పతిని జేర నన్ను బంపు" మనుచు. 118

తే. నాథు వక్షఃస్థలమ్మున నాటియున్న
బాణమును తానె కరమున బట్టి లాగి
చింత విడనాడి రాముని చేతి కొసగి
"దేవ! జాగేల? నాకోర్కె దీర్చు" మనియె. 119

తే. తార దృఢ నిర్ణయమున కా ధరణివిభుడు
విస్మయము జెంది బాణము విసరికొట్టి
మెల్లమెల్లగ నామె సమీపమునకు
జేరి యిట్లనె కరుణ జాల్వారునటుల. 120

ఆ. "తార! నీకు నేను ధర్మబోధ యొనర్ప
సాహసింప గాని సత్య మెరుగ
జేయ వలయు గాన చెప్పెద నొకమాట
కినుక గొనక నాలకింపుమమ్మ! 121

తే. రామ బాణము తగిన కారణము లేక
చంప దెవరిని? నీవంటి సత్యవతిని
నిరపరాధిని అసలు దండింపదమ్మ!
నేను జెప్పిన వినదమ్మ! నిజము తల్లి! 122

తే. అంగదుని నిన్ను వాలి నా కప్పగించి
కన్ను మూసెను కాన నీక్షణము నుండి
రామబాణమె సర్వదా రక్ష మీకు!
అమ్మ! దయయుంచి నామాట నమ్ముమమ్మ!" 123

క. తారక రాముని పలుకులు
తారను శాంతింప జేసె! తక్కిన వారున్
ఊరట జెందిరి అంగదు
డోరిమి వహియించె నగర మూపిరి పీల్చెన్. 124

తే. అంత అమరేంద్రతనయున కపరకర్మ
వనచరుల సంప్రదాయమ్ము పగిది జరిపి
లక్ష్మణునిచేత నొక శుభలగ్నమందు
చెలగి సుగ్రీవు పట్టాభిషిక్తుజేసె. 125

తే. తార మోమున చిరునవ్వు తాండవింప
అంగదుని జేసె యువరాజు నాక్షణమ్మె!
కథ సుఖాంతము జేసె నిక్ష్వాకుతిలకు
డనుచు గంతులు వనచరగణము వేసె. 126

ఆ. అంతలోన వచ్చె నానవాయితి మేర
వరుస తప్పకుండ వర్ష ఋతువు
వానకాలమందు జానకిన్ వెదుకంగ
సాధ్యపడ దటంచు సంశయించి. 127

ఆ. పవనసుతుడు మాల్యవంతమ్మునందొక
గుహను జూచి అందు కొంత మేర
అన్ని వసతులున్న అతిథిగృహమ్ముగా
తీర్చిదిద్దె నొక్క దినములోన. 128

ఉ. అంతట రామలక్ష్మణుల నర్కతనూజుడు తోడితెచ్చి "యే
వంతయు లేక మీరిట నివాసము జేయుడు మాన్యులార! మీ
చెంతనె రేయియుంబవలు సేవ లొనర్పగ కొంద రుందు రే
నంతయు చూచుకొందు నపు డప్పడు వచ్చియటంచు వాకొనెన్.129

ఆ. మంచు బాధలేదు మచ్చునకైనను
చలియులోన దూర సాహసింప
దందువలన నిచట హాయిగా నుండుడు
వర్షఋతువు ముగియువర" కటంచు. 130

తే. సవినయమ్ముగ నినకుల సార్వభౌము
లిద్దరికి దెల్పి వారల వద్దనుండి
సెలవు గైకొని వేగ కిష్కింధ కేగి
ధరను పాలింప దొడగె నా తరణి సుతుడు. 131

ఆ. కాలమునకు మరియు కర్మఫలానకు
తలను వంచ వలయు దాతయైన
అని తలంచి రాము డనుగు సోదరునితో
గూడి గడుప దొడగె! కొండగుహను. 132

సీ. ఉత్తుంగ శిఖరాలనుండి జారెడు జల
ధారలు ముత్యాల దండలాయె!
నిండార పండిన నేరేడు పండులు
కదలికల్లేని భృంగమ్ము లాయె!
జలభారమున గిరి తలలపై వాలిన
కరి మబ్బు లున్మత్త గజములాయె!
గొంతెండి పోయిన గురుసైకతమ్ములు
పొంగిన చన్నీటి బుగ్గలాయె!

తే. మెల్లమెల్లగ సాగెడు పిల్లకాల్వ
లెల్ల హోరెత్తి పరువెత్తు నేరులాయె!
రాత్రి పవలును మొగలి సౌరభము గ్రోలి
వర్షఋతువంత పరిమళ భరిత మాయె. 133

ఆ కాల చక్ర మెవరి కష్టసుఖాలను
సరకు గొనక వేగ సాగిపోవు
ననెడు సత్యసూక్తి కద్దమై భాసిల్లి
వడిగ వెడలి పోయె! వర్షఋతువు. 134

సీ. భార్యా వియోగపు బాధతో రాముడు
గడియనే దినముగా గడపె నిచట!
కలికిపర్యంకమే గద్దెగా కపిరాజు
ఋతువొక్క గడియగా బ్రతికె నచట
నిద్రకన్నెరుగక నిరతమ్ము రాముడు
కాంత దిగులుతోనె గడపె నిచట!
నిద్రలో సైతమా భద్ర వానరనేత
కమ్మని కలలతో గడపె నచట!

తే. గతము మరువలేక మతిలేని వాడుగా
పుడమివల్లభుండు గడపెనిచట
గతము విస్మరించి కనుపించునదె స్వర్గ
మనుచు గడపె భాను తనయు డచట. 135

ఆ. అవనిలోన గలుగు ఆనంద మంతయు
సూర్యనందనునకు సొంతమాయె!
ముందుచూపులేక ముల్లోకముల గల
శోకమంత రాము సొంత మాయె. 136

ఆ. తెలివి దూరమాయె తేనెలు చేదాయె
ధ్యాస తిండి మీద తగ్గిపోయె
మనసు నందు శాంతి మటుమాయమై పోయె
అడుగులొక్క చోట ఆనవాయె. 137

ఆ. ఉన్నచోటునుండి ఉలికిపడ్డటు లేచి
తల్లిజాడ కొరకు తల్లడిల్లు
పిల్లవాని లీల గొల్లున విలపించు
అన్న నరసి తమ్ము డడలిపోయి. 138

ఆ. వర్ష ఋతువు ముగిసి వారము దాటెను
కాని యింతవరకు కానరాడు
అర్కతనయు డంచు ఆగ్రహోదగ్రుడై
ధనువు నందుకొనిన తమ్ము నరసి. 139

తే. "లక్ష్మణా! నీవు వెంటనే రాచనగరి
కేగి సుగ్రీవు నమ్ముతో హెచ్చరించి
అవసరము కొద్ది మన కిచ్చినట్టి మాట
తప్పినట్లైన తన చావు తప్ప దనుము. 140

ఉ. వాలిని నిర్దయన్ దునిమి వానరరాజ్యము కట్టబెట్టితిన్
మేలును విస్మరించడని మిక్కిలి నమ్మితి మోసపోయితిన్
చాలును వాని నెయ్యమిక సత్వరమా కుటిలాత్మకన్నులన్
వాలిన దుర్మదాంధత నవశ్యము బాపవలెన్ సహోదరా! 141

తే. అన్న! వాలిని దివి కంపినట్టి శరము
కన్ను లురుమక ముందె మైకమ్ము వీడి
తప్పు సరిదిద్దుకొనకున్న తత్క్షణమ్మె
అగ్రజుని జేర బంపెద నని దెలుపుము." 142

తే. అనిన రాముని మాటల అంతరార్థ
మెరిగి లక్ష్మణు "డన్న! ఆ తరణిసుతుని
పొగరు దెగద్రుంచి వెంటనే భూమిసుతను
నరయుటకు వాని నాయత్త పరతు" ననియె. 143

తే. అంత రాముడు సాయుధుడౌచు నరుగు
తమ్మునిం గని యేమని తలచినాడొ?
కాని ఆ స్వామి మదిలోని కరుణ పొంగి
మరల సౌమిత్రితో నిట్లు మాటగలిపె. 144

తే. "ఎంత కాదనుకున్న నా ఇనసుతుండు
మనకు నీడ నొసంగిన మంచి వాడు;
అదియు మదిలోన నెంచి నీవతని తోడ
వ్యవహరింపుము తొందరపడకు" మనియె. 145

తే. సజ్జనుని ఆగ్రహ మ్మొక్క క్షణమునందె
మాయమ్మై పోవు తాటాకు మంటకరణి;
కరుణ కెరటాల సడిలేని కడలి లీల
అతని హృదయమ్మునం దెప్పు డమరియుండు. 146

తే. అనెడు ఆర్యోక్తి రాముని కన్వయించు
కొనుచు కోదండపాణియై కోటవద్ద
కరిగి యెదురైన అంగదు నురిమి చూచి
రౌద్రమున నిట్లు వచియించె లక్ష్మణుండు. 147

తే. "అంగదా? యెక్కడా ద్రోహి అర్కజుండు?
మదము తలకెక్కి గతమెల్ల మరచిపోయె
వాని కన్నులు తెరిపింప వచ్చినాడ
దివ్య కోదండమును వెంట దెచ్చినాడ. 148

క. నా మాటల సారము నా
వానరపతి కెరుగజేసి ప్రత్యుత్తరమున్
ఈనిముస మందె తెల్పుము
నే నిచ్చట వేచియుందు నీ కొర" కనియెన్. 149

తే. లక్ష్మణుని మోము నరయు ధైర్యమ్ములేక
మానహీనుని కడకేగ మనసురాక!
అంగదుడు మంత్రియైనట్టి ఆంజనేయు
జేరి రానున్న ముప్పను చెవినివేసె. 150

తే. లక్ష్మణుని ధాటి నెరిగిన రామభక్తు
డనిలసుతు డంతిపురి కేగి అర్కతనయు
గలసి సౌమిత్రి కోపాగ్ని కణము లవిగొ
ఒక్కటొకటిగ కోటపై కురుకుచుండె. 151

ఆ. కోటకాలి కాలి కుప్పగూలక ముందె
ప్రేమమూర్తులైన రామలక్ష్మ
ణులను గలసి తప్ప దెలిపి మన్నింపును
కోరు టుచిత మనుచు కూర్మి బలికె. 152

తే. అంతరంగికు డైనట్టి హనుమ పల్కు
లర్కనందను గుండియ నడలజేసె;
అలసించిన కలిగెడు హాని యతని
కనులముందర మెదలాడి కలత పెంచె. 153

తే. వెంటనే లేచి మధుపాత్ర విసరికొట్టి
ముసిరియున్నట్టి ముదితల కసరి నెట్టి
చెదరి వణకెడు గుండెను చిక్కపట్టి
కదలె మన్నింపు వేడ లక్ష్మణుని కడకు. 154

తే. కాని అప్పటి దనుక రామానుజుండు
కోటలో నుండ నోపక కొంతమేర
నడచి సుగ్రీవు నెలవున అడుగుమోపి
పడియె నివ్వెర కుడ్యశిల్పముల జూచి. 155

సీ. ఒక కుడ్యశిల్పము ఓరచూపులతోడ
కమ్మని రసవృష్టి గ్రుమ్మరించె!
ఒక కుడ్య శిల్పము ఒకనాటి కిష్కింధ
కళల నైపుణ్యమున్ కనుల నింపె!

ఒక కుడ్య శిల్పము మకర ధ్వజుని సతిన్
ముమ్మూర్తులం దెచ్చి ముందు నిలిపె!
ఒక కుడ్య శిల్పము ముకుళిత హస్తయై
రాగ రంజితలీల స్వాగతించె!

తే. కాని సుగ్రీవుపై నున్న కసి కొలంది
లక్ష్మణుని దృష్టి వానిపై లగ్నమౌట
కిచ్చగింపక మరికొంత రెచ్చగొట్టి!
వెంటనే పట్టి మ్రోగించె వింటినారి. 156

తే. ఆ భయంకర రవమున కదరి బెదరి
కుడ్య శిల్పమ్ము లన్నియు గూలె నేల
అంత లోపల అచ్చటి కరుగుదెంచి
నట్టి సుగ్రీవు కంపము నడుగ నేల? 157

ఆ. ఎదుట నిలిచియున్న ఇనతనూజుని జూచి
శరముతోనె అతని శిరముపైన
మూడుమార్లు తట్టి "మూర్ఖుడా! మీ అన్న
అరిగినట్టి దారి అటులెయుండె. 158

తే. నీవు ఆ దారినే యేగ నిశ్చయించు
కొనినచోదెల్పు మిపుడె నీకోర్కె దీర్తు"
ననిన సౌమిత్రి పదములనంటి మ్రొక్కి
అర్కతనయుడు వణకుచు ననియె నిట్లు. 159

ఆ. "మీరు జేసినట్టి మేలును దలపక
చేయరాని తప్పజేసినాడ!
అడలి పారిపోయె నధికారమదము నీ
వింటి నారిమ్రోత వినినయంత. 160

ఆ. బుద్ధి వచ్చె నింక పొరపాటు జరుగదు
అన్న కడకు బోద మా మహాత్ము
శరణు గోరి నన్ను కరుణింప వేడెద"
ననిన లక్ష్మణుండు అటులె అనియె. 161

ఆ. రామభద్రు డచట లక్ష్మణురాకకై
చూపు లలయునటుల జూచుచుండె
అంతలోనె తార అంగదు డరుదెంచి
జోత లిడిరి నాల్గు చేతు లెత్తి 162

ఆ. రాణి వాసమునకు రత్నభూషణమైన
తార కోటదాటి తనయుతోడ
కాలినడక నిట్టు లేల వచ్చినదన్న
తలపు రఘువరునకు కలుగలేదు. 163

ఆ. ఆమె రాకలోని ఆంతర్యము గ్రహించి
స్వామి మనసు కొంత శాంతపడియె!
అంతలోనె తార చింతను కన్నీట
రంగరించి వెళ్లగ్రక్కె నిటుల. 164

తే. "నేను సుగ్రీవు పనుపున నిన్ను కలసి
మన్ననయు కోర రాలేదు మాన్యచరిత!
రాణ కెక్కిన కిష్కింధ రాజ్యరమకు
విమలశాంతిని చేకూర్చ వేడుచుంటి. 165

తే. కరుణ ఇక్ష్వాకువంశజుల్ కన్నబిడ్డ
ఆమె అండయె మాకు శ్రీరామ రక్ష!
కాదనకు స్వామి! వేరు మార్గమ్ము గాన"
మనుచు మొరపెట్టు కొనుచుండె నంతలోనె. 166

తే. లక్ష్మణుడు తోడుకొని వచ్చె రాము కడకు
సగము చచ్చిన వానర సార్వభౌము;
నతడు తలవంచి మ్రొక్కి ఓ అవనినాథ!
నీవె కిష్కింధ నేతవు నేటి నుండి. 167

తే. గర్వభంగము తొలిమెట్టు జ్ఞానమునకు
అందుచే నేను హనుమయు అంగదుండు
అఖిల వానర గణము మీయాజ్ఞమేర
నడతు మికమీద నా మాట నమ్ము మనియె. 168

తే. ఇనసుతుని పల్కులా స్వామి యెదను కదిపె
"కపికులోత్తమ! నాచుట్టు గ్రమ్ముకొనిన
కారుచీకట్ల నెల్లను పారద్రోలి
హృదయమున క్రొత్త ఆశలుపొదిగినావు." 169

తే. అనుచు అర్కతనయు నాలింగనము జేసి
కొనిన రామవిభుని కూర్మినెంచి
తార మనసులోనె ధన్యవాదమ్ములు
దెలిపె నంగదుడును కలత వీడె. 170

ఆ. ఇనకులేశునకును ఇనతనూభవునకు
మరల కలసినట్టి మైత్రి దెలిసి
సకల వానరాళి సంబరమ్మున పొంగి
చిందులాడ సాగె చెట్లనెక్కి. 171

తే. అంతలో అంజనాపుత్రు డరుగు దెంచి
రామలక్ష్మణ సుగ్రీవులకు శిరస్సు
వంచి కేల్మోడ్చి సీతమ్మ పైన మరయ
సిద్ధముగ నుండె వానరసేన యనియె. 172

ఆ. తిరిగి చూచుసరికి ధరణి ఈనిన రీతి
నెల్ల దెసలు దద్దరిల్లు నటుల
కోట్ల కొలది దండు కోలాహలమ్ముగా
గంతు లిడుచు వచ్చి చెంత మూగె. 173

ఆ. దండులోన నున్న భండన భీముల
బలసమృద్ధులైన బాహుబలుల
ఒక్కచోట చేర్చి ఉత్సాహ ముప్పొంగ
అర్కతనయు డిట్టు లానతిచ్చె. 174

ఉ. "ముందుగ చావ సిద్ధపడి మూర్ఖుడు దానవనేత మాయచే
ఇందునిభాస్య రాముసతి నెత్తుకపోయె నటన్న వార్త మీ
యంద రెరింగి నట్టిదియె ఆయమ నెచ్చట దాచియుంచినన్
సందియ మింతలేక చని జాడ గనుంగొని రండు వేగమే." 175

ఆ అనుచు తెలిపి సైన్య మంతటి నెనిమిది
కూటములుగ చేసి మేటి కపుల
ధైర్య సాహసముల దనరారు వీరుల
నెలమి నిర్ణయించె దళపతులుగ . 176

తే. దక్షిణా పథమేగెడు దళముపైన
ఎక్కువగ దృష్టి సారించి ఇనసుతుండు
అప్పగించెను నేతృత్వ మంగదునకు
అతడు తనయంత వాడని ఆత్మనెంచి. 177

ఆ. హనుమ, జాంబవంతు డాదిగా గల వీరు
లంద రాదళమ్ము నందె గలరు;
వారి నెల్ల నొక్కసారి పారగ జూచి
ధరణివిభుని మోము విరిసెనంత. 178



తే. రఘునందను నాశ్రిత వత్సలునకు
అంజలి ఘటించి సెలవు మాకని వచించె;
ఉర్వినాథుడు తన వ్రేలి ఉంగరమును
తీసి హనుమంతున కొసంగి తెలిపె నిట్లు. 179

ఆ. "కార్యదీక్షయందు శౌర్యపటిమయందు
ధర్మనిరతియందు ధైర్యమందు
స్వామిభక్తి యందు సకల జగత్తులో
నీకు నీవెసాటి నిక్కువముగ. 180

ఆ. అందువలన నిన్ను ఆత్మీయునిగ నెంచి
ఆశలన్ని చుట్టు అల్లుకొంటి!
కాన నెట్టులైన కల్యాణి జానకి
ఉనికి నరసి నిలుపు మూపిరులను. 181

తే. రావణుని తోడ జరిపెడు రణముకన్న
అవనిజాత సౌఖ్యమ్మె ముఖ్యమ్ము మనకు
పోరు బాటను జనకుండ నేరుపుమెయి
ఆమె జాడను ముందుగా అరయ వలయు. 182

తే. అరసి ముద్రిక నా సాధ్వి కందజేసి
ధైర్యముగ నుండు మని చెప్పి త్వరగ రమ్ము!
వెంటనే మ్రోగు నిచ్చట విజయభేరి!
ముదిత జానకి చెవుల మార్మోగునటుల." 183

ఉ. ధీరత రామభద్రు డటు దెల్పిన మీదట ఆంజనేయు డో
ధారుణినాథ! మీ పలుకు ధైర్యము పెంచెను నాదు నెమ్మదిన్
భారమునే వహించి కడు భక్తి నొనర్చెద స్వామి కార్యమున్
వారక లంక నుండి శుభవార్తను దెచ్చెద వేగిరమ్ముగన్. 184

తే. అనుచు గంభీరముగ పల్కి అంగదాది
వానరుల తోడ సుగ్రీవు నానతిగొని
రామసంకీర్తనము చేసి లక్ష్మణునకు
ప్రణతు లర్పించి చనియె నా వాయుసుతుడు. 185

తే. తక్కు దళపతు లందరు నొక్కసారి
కదలి రటనుండి అనుచర గణము తోడ
అర్కజుడు తార రాముని అభినుతించి
అనుమతిం గొని కిష్కింధ కరిగె రంత. 186

క. తమ్ముడు భక్తి నొనర్చెడు
ఇమ్మగు సేవలను గొనుచు ఇనకుల పతి క
న్దమ్ములు మూయక జానకి
కమ్మని రూపమును గనుచు గడపెను ప్రొద్దుల్. 187

తే. అట్టులొక నెల గడచిన దంతలోనె
దక్షిణమ్మున కేగిన దండు దప్ప
కడమ వారంత నిస్పృహన్ కట్టగట్టి
తెచ్చి రాముని కిడి, తలల్ దించుకొనిరి. 188

క. హనుమంతుని బృంద మ్మట
వనసీమలు, పర్వతములు, వాగులు, వంకల్
పనిగొని గాలించియు సీ
తను కనుగొను ఆశలుడిగి తల్లడ పడియున్. 189

సీ. కొందరు యోధులు కొండగుహల నెల్ల
పొంచి కన్గొనుచు గాలించినారు
కొందరు వీరులు ఘోరాటవులకేగి
దృఢ దీక్షతోడ శోధించినారు
కొందరు శూరులు అందందు నివసించు
వివిధ జాతుల యిండ్ల వెదకినారు
కొందరు ధీరులు గుట్టలపై కెక్కి
పేరెత్తి సీతను పిలిచినారు

తే. కాని సుంతయు ఫలితమ్ము కానరాక
మరలి వెడలంగ నెవరికి మనసురాక
అంద రొకచోట గూడి నిరాశ జెంది
మంతనము లాడుచుండిరి అంతలోనె. 190

తే. అంగదుడు వాయునందను నరసి "హనుమ!
అర్కతనయుడు మన కిచ్చినట్టి గడువు
అంత మయ్యెను మన యత్న మింత వరకు
స్వల్పముగ నైన ముందుకు సాగలేదు. 191

తే. రిక్తహస్తాల తోడ సుగ్రీవు జేరి
అతని కోపమ్మునకు బలియౌటకన్న
వీడెదను శ్వాస ప్రాయోపవేశమునను"
అనుచు ప్రకటించి అందర నడలజేసె. 192

ఆ. ఉరుములేని పిడుగు యువరాజు నిర్ణయ
మని దలంచినట్టి ఆంజనేయు
డకట స్వామికార్య మర్ధాంతరమ్ముగా
ఆగిపోవు నేమొ యనుచు వెరచి. 193

తే. "వినుము యువరాజ! నా చిన్ని విన్నపమ్ము
నిద్రలో కూడ నిస్పృహ నీకు తగదు;
వీరుడగు వానిదే తుది విజయ మనెడు
వాక్కు మరువంగ రాదు నీవంటి వాడు. 194

తే. రావణుడు సీతనెత్తుక పోవువేళ
ఆమె దీనారవమ్ముల నాలకించి
పక్షిరాజు జటాయువు వానితోడ
బవర మొనరించి ప్రాణముల్ వదలలేదె? 195

ఆ. అతడు వయసు మీరెనన్న నిస్పృహతోడ
దనుజనేత నడ్డు కొనకయున్న?
పూతచరిత ధరణిజాత యేమైనది
ఇనకులాధిపతికి నెటుల దెలియు. 196

ఆ. ఎన్ని అపజయమ్ము లెదురైన జంకక
ఎట్టి పట్టునైన పట్టు విడక
ఎంచుకొన్న దారి నేగెడు ధీరుడే
గమ్యమునకు చేరగలడు తుదకు." 197

ఆ. అటుల సాగినట్టి హనుమ సందేశము
పక్క కొండమీద రెక్కలు తెగి
కదలలేక యున్న ముదుసలి పక్షీంద్రు
డాలకించి మిగుల ఆర్తినొందె. 198

తే. అతడు సంపాతి! ఆతని అనుగుతమ్ము
డగు జటాయువు ఇక లే డటన్న వార్త
గుండె లవియంగ విని తట్టుకొనగలేక
లోకభీకరముగ పెద్ద కేకవేసె. 199

ఆ. హనుమ వాలిసూతి అఖిల వానరగణ
మాతురతను నచటి కరిగి వాని
స్థితిని గాంచి మిగుల చింతించి యెందుల
కరచినా వటంచు అడిగి రంత. 200

తే. పక్షములు రెండు లేని యా పక్షిరాజు
"వింటి మీ మాటలను కపివీరులార!
స్వామి కార్యార్థమై పోరి చచ్చినట్టి
ఆ జటాయువు నా తమ్ము డతడు నేను. 201

ఆ. యుక్తవయసునందు ఉత్సాహ ముప్పొంగ
ఎవర మెంత యెత్తు కెగుర గలమొ?
అరయు కోర్కె అంచు అర్కగోళము దాక
ఇద్దరమును జతగ నెగసి నాము. 202

తే. అపుడు నా తమ్ముడా వేడి కాగలేక
తల్లడిల సాగె అది గాంచి తాళలేక
అడ్డుపెట్టితి నారెక్క లాక్షణమ్మె
భగ్గుమని మండి బ్రతుకిట్లు భగ్నమాయె." 203

ఆ. అతి విషాద భరిత మైన పతంగేశు
గాధ తెలిసికొనిన కపిగణమ్ము
కనుల నీరు నింపి ఇనకులపతి సతి
నపహరించె మూర్ఖు డసురవిభుడు. 204

ఆ. ఆమె జాడ గనక అడవుల వెంబడి
తిరుగు చుంటి మనుచు తెలిపిరంత
సంశయ మ్మడంగ సంపాతి "వానర
వీరులార! బెంగ విడువు డింక. 205

ఆ. ముదిమి గదిరి ఒడలు ముడతలు పడిపోయె!
ఎగుర గలుగు రెక్క లెపుడొ పోయె;
కాని ఇంతవరకు కనుచూపులో జిగి
లేశమైన తగ్గలేదు నాకు. 206

ఆ. పాపి రావణుండు పదునాల్గు లోకాల
ధరణిజాత నెచట దాచియున్న
ఇపుడె వెదకి పట్టి ఈడేర్తు మీకోర్కె"
అనుచు విన్నవించి ఆర్భటించి. 207

తే. దృష్టి సారించె దక్షిణ దిక్కువైపు
చోద్య మేమన అతడేమి చూచినాడొ?
కాని ఆనంద ముప్పొంగి కనులు రెండు
నిండు పున్నమ వెన్నెల నెలవు లాయె. 208

తే. అంతలో తేరుకొని "విను మాంజనేయ!
కలికి సీతమ్మ దుష్ట రాక్షసుల మధ్య
చింతలో మున్గి బోనులో జింకవోలె
లంకలో నున్న దింక మీ శంకదీరె." 209

తే. అని వచించిన మరుసటి క్షణము నందె
అక్కజముగాగ సంపాతి రెక్కల మరె!
అంతియే కాదు వార్ధక్య మంతరించి
అంకురించెను పరిపూర్ణ యౌవనమ్ము. 210

తే. రెప్ప వాల్చక కన్నుల నప్పళించి
తననె వింతగ గనుచున్న వనచరులను
చూచి సంపాతి "దశరథు సూనుడైన
రాముకార్యము మీరు దీర్వంగ దలచి. 211

తే. కాననమ్ముల దిరుగాడు కాలమందు
శక్తిమేరకు మీకు నాసాయమంద
జేసినట్లైన మరల నా చిన్ననాటి
పరువమును రెక్క లమరునన్ వరము కలదు. 212

తే. దాని ఫలితము నేటికి దక్కెనాకు
ఈ దినము నుండి యెదురేది లేదు మీకు;"
అనుచు తరుణుడు సంపాతి అంగదాది
కపుల కెరిగించి యెగసెను గగనమునకు. 213

ఆ. అంత కపుల దండు గంతులు వేయుచు
అడవులన్ని దాటి అబ్ధి దరికి
చేరి దొరకినంత నోరారకబళించి
రంతలోనె భాను డస్తమించె. 214

ఆ. అలసియున్నకతన అంద రా రాతిరి
చెట్టు మొదళులందు గుట్టలందు
పవ్వళించి అవియె పట్టుపానుపులుగా
ఒడలు మరచి నిద్రనొందినారు. 215

తే. అరుణ కిరణుడు మరునాడు త్వరితగతిని
తూర్పు కొండెక్కి నల్దెసల్ తొంగిచూసి
నిదుర వీడని ప్రతి వాని యెదను కదిపి
మేలు దలపెట్టి అందర మేలు కొలిపె. 216

తే. తరణి సైతము పక్షపాతమ్ముతోడ
ఇనకులేశుని పని తన పనిగ నెంచి
అతిపురాతన సంప్రదాయమును మరచి
సమయపాలన కానాడు స్వస్తి జెప్పె. 217

తే. నూరు యోజనముల మేర విస్తీర్ణము
కలిగి వరలుచున్న జలధికడకు
అరిగినట్టి కపులు ఆ మహోదధి గాంచి
ఒక్కసారి అంద రులికిపడిరి. 218

సీ. గగనసీమంతిని నగుమోము ముద్దాడ
కెరలి పై కెగబ్రాకు కెరటములను
అసహాయశూరత నలలతో ఢీకొని
చెలరేగి దుమికెడు జలచరముల
కడలి మధ్యమ్మున కడుభయంకరముగా
ఘూర్ణిల్లు పెను సుడిగుండములను
తీరమే భీతిల్లు తీరున అందందు
మత్తుగా పడియున్న మకరములను

తే. తేరిపారజూచి ధీరత్వ ముడిగిన
కపివరేణ్యు లెల్ల కలవరమున
ఈ మహాబ్ధి దాట నెవరికి శక్యమౌ
నంచు మిన్నకుండి రంతలోన. 219

తే. అంగదుడు వారి నైరాశ్య మంతరింప
జేయ సమకట్టి అందర జేర పిలిచి
"పేరుమోసిన వానరవీరులార!
తరగి పోయెనె? మీలోని ధైర్యగుణము. 220

ఆ. ధైర్యవంతు గనిన తలవంచి తీరును
మారు పలుకకుండ మంచుకొండ!
పిరికిపంద గనిన గరికపోచయు గూడ
నిశ్చయముగ మెడను నిక్కబెట్టు. 221

ఆ. నిన్న మీరె నాకు నీతులు బోధించి
ఇపుడు కడలి నరసి ఈసు రనుచు
కూరుచుంట యెంత మేరకు న్యాయమో?
సత్య మరసి లెండు సత్వరముగ. 222

ఆ. నేను దాటగలను నిలువున లంఘించి
ఒక్కమారె నూరు యోజనములు;
కాని తిరిగి మరల కడలిని దాటి, మి
మ్మరయ గలనొ? లేనొ? యెరుగ జాల." 223

తే. అనిన యువరాజు పలుకుల నాలకించి
జాంబవంతుడు పలికె నీ చందమునను
"కడలి లంఘించి మరల రాగలవు కాని
నిన్ను పంపుట తగదు మా నేత వౌట. 224

తే. దండులో కల రెందరో దండిమగలు
అందు వనధిని లంఘించి అసురవిభుని
పురమునం జొచ్చి జానకి నరయ గలుగు
వీరు డొక్కడు లేడను వెరపు తగదు." 225

తే. అనుచు వచియించి ముదుసలితనము మరచి
లోకభీకరుడైన భల్లూకరాజు
వనచరుల నెల్ల ఉత్సాహపరచ దలచి
పట్టువీడక మరల తా నిట్టు లనియె. 226

ఆ. "వయసుమీరె నైన వననిధి లంఘించ
గలను ఏకధాటి గట్టు వరకు;
కాని అంగుళీయకము నేల రాముడు
హనుమ కొసగె నన్న దరయ వలయు. 227

క. మనదళము నందు హనుమయె
ఘనతర సామర్థ్యమున్న కపివీరుడుగా
ఇనకులపతి భావించెను
కనుక నతని జేతునిపుడె కార్యోన్ముఖుగా." 228

చ. అని వచియించి దూరముగ అర్ధనిమీలిత నేత్రుడై మహా
మునివలె గూరుచున్న కపిముఖ్యుని వాయుతనూజు జేరి "నా
యన హనుమంత! యేమిటిది? అర్కకులాన్వయవార్ధి చంద్రు డా
దినమున ఉంగర మ్మిడుచు తెల్పిన పల్కులు విస్మరించితే." 229

క. అని మరియు జాంబవంతుం
"డినతనయుని చూపు కూడ యెప్పడు నీ మీ
దనె కల దిది మరువక తత్
క్షణమే తొడ చరచు మీవు కరువలితనయా! 230

క. తన యెత్తు హిమనగమ్మున
కణుమాత్రము గూడ తెలియ దటులే నీకున్
నిను గూర్చి తెలియ దించుక
విను మే నెరిగింతు నిపుడె వివరము లెల్లన్. 231

తే. అప్సరసలందు మిక్కిలి అందమైన
అంజనాదేవి శాపమాహాత్మ్యమునను
కుంజరుని కూతురుగ బుట్టి కొండమీద
తిరుగుచుండెను తొలకరి మెరుపువోలె. 232

తే. అనిలు డామెను తిలకించి అంతరంగ
మందు కలిగిన అలజడి నాపలేక
పట్టి కౌగిట బంధించె! పాప మామె
భంగపడె శీల మని కడు బాధనందె. 233

ఆ. ఆమె కలవరమ్ము నరసి సమీరుడు
తరుణి బాధపడకు తప్పనాది;
శీలహరణ మన్న చింత నీ కిసుమంత
వలదు నా మనస్సు వలచె నిన్ను. 234

తే. ఎట్టి యత్నము లేకుండ ఇట్టి ఘటన
మేల జతచేసెనో దైవ మేనెరుంగ;
నేటి ఆలింగనము వల్ల నీకు గలుగు
అతిపరాక్రమశాలియైనట్టి సుతుడు. 235

ఆ. అతడు బుద్ధిబలము నందు తేజమునందు
శౌర్యధైర్య సాహసములయందు
లాఘవమ్మునందు లంఘన క్రియయందు
నన్ను మించి తీరు నమ్ము మిద్ది." 236

తే. అనుచు కరువలి మీ తల్లి కందజేసె
నట్టి వరమున జన్మించినట్టి నీవు
ఉర్విపై బడ్డ వెంటనే ఉదయభాను
బింబమును పండుగా నెంచి బిట్టు లేచి. 237

తే. మూడువందల యోజనములకు నెగిరి
సూర్యబింబము నందుకో జూచుచున్న
నిన్ను గని సురవిభునకు కన్నుగుట్టి
విసరె నీపైకి కులిశమ్ము విడచి కరుణ. 238

క. అది నీ హనువుకు తగిలిన
దది గని ఆగ్రహమునంది అనిలుం డిక నే
కదల నని ప్రతిన గైకొని
పదునాలుగు భువనములను భయమున ముంచెన్. 239

ఆ. అఖిల జీవకోటి కాపద మూడిన
వైన మెరిగి బెదరి వాసవాది
సకల దేవగణము చనుదెంచి గాడుపు
కెరగె నంత నతడు కరుణ దలచె. 240

తే. సకల లోకమ్ములందు పుట్టుకకు ముందు
ఇంత వైశిష్ట్యమున్న వాడెవడు గలడు?
దీనబంధుని కార్యమ్ము దీర్చుకొరకు
జనన మందిన కారణజన్ము డీవు. 241

సీ. నీవు దలచుకొన్న నింగిచెంపలుముట్టి
అలవోకగా గంద మలద గలవు!
నీవు దలచుకొన్న భూవలయమ్మును
విరిబంతికైవడి విసరగలవు!
నీవు దలచుకొన్న రావణాసురులంక
పెకలించి తెచ్చి చూపెట్ట గలవు!
నీవు దలచుకొన్న నీరధు లన్నిటిన్
క్షణకాలమున నెండగట్ట గలవు!

తే. అట్టి నీకు దక్షిణాబ్ధి దాటుట యెంత?
ఏటివాగు నెగిరి దాటినంత!
సీత నరయుటెంత? చింతచెట్టు చిటారు
కొమ్మనెక్కి కాయగోసినంత." 242

ఉ. అప్పటిదాక మౌనముగ నన్నియు విన్న సమీరసూతి తా
చప్పన లేచి "నే నిపుడె సంద్రము దాటెద లంకజొచ్చి ఆ
కప్పర గంధి జానకిని గాంచెద నచ్చట యెవ్వ రడ్డినన్
తప్పక వాని దండధరుదగ్గర కంపెద తత్క్షణమ్మునన్." 243

క. అని పలికి జాంబవంతుని
మన మలరగ ప్రతిన జేసి మారుతతనయుం
డనుచరుల నెల్ల నొకపరి
కనుగొని అంగదుని యాజ్ఞ గైకొని పిదపన్ 244

సీ. ప్రక్కనున్న మహేంద్ర పర్వత శిఖరము
నెక్కి నాలుగుదెసల్ నిక్కిచూచి
కనులు పెద్దవి జేసి కడలిని వీక్షించి
ఎగసెడు కెరటాల నీసడించి
తన పితృదేవుని అనిలుని ప్రార్థించి
ఖగనాథు నెదనెంచి కరము మోడ్చి
తల్లి సీతమ్మను నుల్లమందు దలంచి
అష్టదిక్పాలుర కంజలించి

తే. వాలమును ద్రిప్పి పదముల బలము పెంచి
అచలమే క్రుంగులాగున ఆర్భటించి
పరగ గర్జించి జై రామభద్ర యనుచు
వడిగ వినువీధి కెగసె నా వాయుసుతుడు. 245

ఆ. పవనసుతుని వడికి పాదపమ్ములు పైకి
వ్రేళ్లతోడలేచి వీరహనుమ!
నేడు దెలిసివచ్చె నీ పరాక్రమ ధాటి
జగతి కనుచు పలికి సాగనంపె. 246

**కిష్కింధా కాండము సమాప్తము**

***



# సుందరకాండము

సీ. వినువీథి గడగడ వణకు రీతిగ సాగు
వీరాంజనేయుని వేగమునకు
కడలి తరంగమ్ము లడలి లోతున కేగి
నాచు పర్వతముల నడుమనక్కె!
ఆ దృశ్యమును గాంచి అదరి బెంబేలెత్తి
జలచరమ్ములు దాగె నలల వెనుక
జలచరమ్ముల తీరు తిలకించి మిక్కిలి
భయమంది రతనాలు పరుగుదీసె!

తే. ఎవ్వరేనాడు కనివిని యెరుగనట్టి
ఇన్ని వింతలు వెలయించి నన్ను మించె
ననుగు సుతుడన్న సంతోష మినుమడించి
అనిలు డుప్పొంగి ఆశీస్సు లందజేసె. 1

తే. ఆకసమునుండి దేవతల్ హనుమ నరసి
సుందరాకార! ఇక నుండి సూత్రధారి
వీవె శ్రీరామకథ కని వినుతిజేసి
పూలు చల్లిరి సంద్ర ముప్పొంగునటుల. 2

తే. సాగరుడు కూడ తన వంతు సాయ మొసగి
తోడు పడవలె శ్రీరామదూత కనుచు
మునుపు ఇక్ష్వాకువంశజుల్ తన కొనర్చి
నట్టి మేలును పలుమారు లాత్మదలచి. 3

తే చతురు డిక్ష్వాకు వంశభూషణుడు సగరు
డడుగకయె నాకు తన సాయ మందజేసె;
అట్టి సగరుని వంశస్థుడైన రామ
భద్రుదూతకు బడలిక బాపవలయు. 4

క. అని సాగరుడు ముదమ్మున
తనలోపల దాగియున్న ధరణీధరమున్
పనిగొని బైటకు రప్పిం
చెను దానిని జూచి హనుమ చీకాకు పడెన్. 5

క. తన దారి కడ్డు నిలిచిన
దని తలచిన పవన తనయు డతి కోపముతో
ఘనవజ్రకఠిన వక్షము
నను ఢీకొన దాల్చె కొండ నరరూపమ్మున్. 6

ఆ. "ఎవడ వీవు? చెప్ప మేల నా దారికి
అడ్డు నిలిచి తిటుల అచల మటుల"
అనుచు కన్ను లురిమె ననిలతనూభవు
డంత అతడు బెదరి అనియె నిట్లు. 7

తే. "మారుతాత్మజ! వినుము నా మాట సుంత
నేను మైనాకుడను! సేద నీకు దీర్చి
చక్క నాతిథ్య మిచ్చి నిన్ సాగనంప
దలచి నీ కడ్డుగా వచ్చి నిలిచినాడ. 8

క. హనుమంతుండా వింతను
గని మాయగ నెంచి కొంత కళవళ మందెన్
వెనువెంటనె పలుమారులు
కను లలసెడు రీతి జూచి కడ కిట్లనియెన్. 9

తే. తొల్లి గిరులెల్ల రెక్కలతోడ గగన
మందు స్వేచ్ఛగ విహరించు చంద మరసి
వాసవుం డల్గి పర్వత పక్షములను
తరిమి నరికెను వజ్రాయుధమ్ముతోడ. 10

తే. అట్టి ఆపదవేళ న న్ననిలదేవు
డంబుధిం జేర్చి అనురక్తి నాదుకొనియె;
కాన నేటికి నేను రెక్కలను కలిగి
అలరుచున్నాడ మీ తండ్రి చలువ వలన. 11

తే. అందుచే నేడు నీకు నే నతిథిపూజ
శక్తి మేరకు జరిపి మీ జనకు ఋణము
అలతిగా నైన తీర్చుకో దలచినాడ!
కనుక దయచేసి మారుమా టనకు హనుమ!" 12

క. అని మైనాకుం డాదర
మున పలికిన తీరు నరసి ముదితహృదయుడై
హనుమంతుడు "గిరిరాజా!
నను మన్నన జేసి వినుము నా విన్నపమున్ 13

ఆ. అనుచు కనులనుండి ఆగకపొంగెడు
సంబరంపు తడిని చప్పరించి
మార్గమధ్యమందు మైనాక! నేనాగ
రాదు గాన వేరుగా దలపకు." 14

ఆ. అనుచు నచ్చజెప్పి ఆతని స్పృశియించి
మేలటంచు హనుమ మింటి కెగసె;
ఆకసమ్మునుండి అమరేంద్రు డది గాంచి
భళి! భళీ యటంచు బ్రస్తుతించె. 15

తే. మారుతాత్మజు డాకాశ మార్గమందు
మండితోద్దండ చండమార్తాండునట్లు
వాయువేగాన సాగెడు వైన మరసి
సంభ్రమస్వాంతుడై పొంగె సాగరుండు. 16

ఉ. నీడను జూచి సత్వరమె నింగిని సాగెడు నెల్ల ప్రాణులన్
వీడక పట్టి లాగి కడు భీతి దలిర్పగ మ్రింగి, ఆకలిన్
వేడుక మీర దీర్చుకొను వింత నిశాచరి పెద్ద కొండ ప్రే
లాడెడు రీతి పోవు పవనాత్మజు జూచెను విస్మయమ్మునన్. 17

తే. ఆ భయంకర రాక్షసి అతి కురూపి
పేరు 'సింహిక' సంద్రమే ఊరు ఉనికి
వాయువేగాన భూరి పర్వతము వోలె
ఆకసమ్మున జనుచున్న హనుమ నరసి. 18

ఆ. దొరకె నాకు నేడు దొడ్డ జంతు వటంచు
దలచి నీడ వెంట దౌడు తీసి
గుంజ దొడగె నద్ది గుర్తించి యోచించి
హనుమ మేను పెంచె నమితముగను. 19

తే. అంత 'సింహిక' తన నోటి నంతమేర
తెరచి కబళించ యత్నించె! వెరపుగొనక
ఎలుక పిల్లంతయై మహాబిలము వంటి
దాని నోటను దూరె! సత్వరమె హనుమ. 20

ఉ. ఆయువు పట్టులన్ వెదకి అక్కడ మిక్కిలి కర్కశమ్ముగా
పాయక గోళ్లతోడ బహుభంగుల చీలిచి గర్భమంతటిన్
గాయము లెన్నియో సలిపి గ్రక్కున వెల్పలి కేగుదేరగా
హోయని కేకవైచి అసురాంగన కూలె మహాబ్ధిలోపలన్. 21

తే. అన్ని అడ్డంకులను వేగ నధిగమించి
ఇనుమడించిన శక్తితో నేకధాటి
గగన తలమందు సాగెడు కపివరునకు
అపుడు కనిపించె సంద్రంపు టవలియొడ్డు. 22

తే. దగ్గ రాయెను లంకయన్ తలపు మదిని
మెదలినంతనె హనుమంతు వదనమందు
వెల్లివిరిసిన ఆనందవిభవమునకు
అంతరిక్షపు టంచులే హద్దు లాయె. 23

సీ. కాయలే చన్నీటి కడవల పగిదిని
గల నారికేళ వృక్షముల నరసి
పచ్చతివాచీలు పరచిన చందాన
ప్రభలీను పచ్చికబైళ్ల నరసి
అలరు భూషణములు నిలువెల్ల ధరియించి
ఇంపారు పూబోదరిండ్ల నరసి
సారస ప్రముఖముల్ జలపక్షు లలవోక
సలుపు క్రీడావిలాసముల నరసి

తే. కన్నులోక వేయియైన ఈ కడలియొడ్డు
సహజ సౌందర్య మరయంగ జాల వనుచు
ఆకసమునుండి పలుమారు లట్టె చూచి
అలసటంతయు మరచె నా అనిలసుతుడు. 24

ఆ. అంత కొంతవడికి ఆ ప్రక్కనే వింత
రంగు లీనుచున్న లంబ పర్వ
తమును గాంచి మిగుల తన్మయత్వము జెంది
దాని మీద దిగెను తత్క్షణమ్మె. 25

ఉ. అచ్చట నుండి కాంచె పవనాత్మజు డద్భుత దృశ్య మొండు ము
న్నెచ్చట నెన్నడున్ కనని దించుక జూచిన సృష్టికర్తనే
అచ్చెరువందు ముంచగల యట్టిది వర్ణన కందనట్టి దౌ
పచ్చల కొండవంటి యొక పత్తనమున్ ననిమేషదృక్కులన్. 26

క. అదియే లంకానగర
మ్మదియే పౌలస్త్య విభుని కఖిలజగతిలో
విదితయశమ్మును గూర్చిన
సదమల సౌభాగ్యభరిత సదన మ్మదియే. 27

సీ. అలసురేంద్రుని సైత మబ్బురమ్మున దేల్చు
సుందరోజ్జ్వల రాజమందిరములు
మణి కుట్టి మమ్ములౌ మహితసోపానాల
రుచిరమ్ములైన సరోవరాలు

హృద్యమ్ములైన నవోద్యానముల నున్న
మౌక్తికోద్దీపిత మండపములు
మెరుగుటద్దములను పరిహసించెడు లీల
రూపుదాలిచిన ఘంటాపథములు

తే. కలిగి అమరావతిని మించు ఘనతకెక్కి
వేదముఖునాజ్ఞ మేరకు విశ్వకర్మ
తీర్చిదిద్దిన సుందర దివ్యనగర
శిల్పశోభల నెన్నంగ శేషుతరమె? 28

ఆ. కడలి నగరమునకు కందకమ్ము విధాన
అష్టదిక్కులందు అమరియుండె;
అతిబలిష్ఠులైన అసహాయశూరుల
వలయమందు లంక వరలుచుండె. 29

తే. భీకరమ్మును శత్రుదుర్భేద్యమైన
కోటచుట్టు వేలకొలంది క్రూరులైన
దండధరుకింకరుల వంటి దనుజవరులు
కాపుగా నున్న వైనమ్ము గాంచె హనుమ. 30

ఆ. అంత లంకనంత ఆసక్తితో జూచి
క్షణముసే పతండు చకితు డాయె;
పంక్తికంఠుసైన్యపాటవమ్మును గాంచి
ఉల్లమందు జెందె తల్లడమ్ము. 31

సీ. నిద్రకన్నెరుగని భద్రతావలయమున్
ఛేదించి లంకను చేరుటెట్లు?
చేరితినే పొమ్ము సీతామహాసాధ్వి
ఉనికి గోప్యముగ కన్గొనుట యెట్లు?
కనుగొంటినే పొమ్ము కావలివారల
ఏమరించియు నుంగ్ర మిచ్చుటెట్లు?
ఇచ్చితినే పొమ్ము అచ్చటినుండి నే
కడు భద్రముగ రాము గలియు టెట్లు?

తే. కలసి వారికి శుభవార్త దెలియజేసి
నంతమాత్రాన కపి సైన్య మడ్డులేక
అమిత విస్తీర్ణమైన యీ అబ్ధిదాటి
వైరి వర్గము దునుమాడ వచ్చుటెట్లు? 32

తే. అటుల శంకించుచున్నట్టి హనుమ మనసు
నతని వాలము గుర్తించి అలుకబూని
దుర్గగా మారి వేగ ముందునకు ఉరికి
కనులు కెంపులుగా మార్చి అనియె నిట్లు. 33

క. "కొరమాలిన శంకలతో
పరమార్థము మరచి బేల పగిదిని నీవీ
తరుణమున జాగుచేసిన
కరుణామయుడైన రాము కార్యము చెడదే. 34

ఆ. చింతలందు మునిగి సీత యేమైనదో
యన్న బెంగతోడ అచట రామ
నృపతి నిన్నె కలవరించుచు నున్నాడు
కాన సంశయముల కట్టిపెట్టి. 35

శా. నీ కర్తవ్యము నీ వొనర్చి అవలన్ నిశ్చింతగా నుండు; మా
కాకుత్థాన్వయ రత్న భూషణుడు లోకస్తుత్యుడౌ రాముడే
నాకాధీశుడు మెచ్చగా కడలిపైనన్ వచ్చి లంకేశ్వరున్
చీకాకుంగలిగించి చంపి సతికిన్ చేకూర్చు సంతోషమున్." 36

ఆ. అనుచు హితవు బలికి అట్టి మాయంబైన
దేవి యానమేర దీక్షబూని
విధిని మదిని దలచి వీరాంజనేయుడు
జై భళీయటంచు జబ్బచరిచె. 37

ఆ. కాని ముందు వెనుక కనకుండ తొందర
పడిన యెడల కార్యభంగ మగును
అందువలన సూర్యు డస్తమించెడుదాక
ఆగి లంకలోని కేగవలయు. 38

క. అని నిర్ణయమును గైకొని
హనుమంతుడు చూపులన్ని అస్తాద్రిపయిన్
ఉనిచెను ఇను డది కనుగొని
మనమున తెగ మురిసి కొండమాటున కరిగెన్. 39

క. చీకటిలో లంకాపురి
ఆకారము మారిపోయె ననిలాత్మజుడున్
నాకిదె తగు సమయమ్మని
వ్యాకులతను వీడి బుల్లి వానర మాయెన్. 40

తే. లక్ష్యసిద్ధిని మది నెంచి రామదూత
తీసికొను నిర్ణయమ్ములతీరు నరసి
తన కుమారుని యుచితజ్ఞతకును మురిసి
అనిలు డాశీర్వచస్సుల నందజేసె. 41

తే. అంత హనుమంతు డతిభక్తి నాత్మలోన
రామనామము జపియించి లంక కుత్త
రమున అమరేంద్రుడైన విభ్రమము జెందు
కరణి భాసిల్లు కోట దగ్గరకు జనియె. 42

తే. ఆ ముఖద్వారమున లోని కరుగనుండ
"ఆగు మాగుమురా" యను అర పొకండు
వీనులం బడె నవని కంపించునటుల
కాని భయపడ కించుక కపివరుండు. 43

ఆ. తిరిగి చూచుసరికి పరమవికృతమైన
ఒడలితోడ నెత్తు రుడుకుచున్న
కనుల తోడ నెదుట కనుపించె చీకటి
కొండవంటి దొకతె గుండె లదుర. 44

తే. దాని ఆకారమును గాంచి దీనితోడ
రగడ హెచ్చిన స్వామికార్యమ్ము చెడును
కాన కడు యుక్తియుక్తమౌ కరణి నిపుడు
మెలగ వలెనని మదిలోన దలచె హనుమ. 45

ఆ. ఇంతలోనె దనుజకాంత "నీ వెవడవు
వేలె డంతలేవు వెర్రివాడ!
నన్ను కన్నుగప్ప నెన్ని గుండెలు నీకు
చంపి తినెద నిన్ను సత్వరమ్మె." 46

తే. అనిన రక్కసి ఆగ్రహ మరసి హనుమ
"వలదు కోపము వినుము నే వానరుడను!
లంక వైభవ మలకాపురమ్ముకన్న
మిన్నగా నుండు నని యెంచి కన్నులార. 47

తే. కాంచి తరియించ వలెనన్న కాంక్షతోడ
అరుగుదెంచితి శ్రమకోర్చి అతివమిన్న!
అడ్డగించక నను లోని కరుగ నిమ్ము
తలచుకొందును జీవితాంతమ్ము నిన్ను." 48

తే. అనుటతోడనె రాకాసి హనుమ వంక
కొరకొరం జూచి "అపరా కుర్రకుంక!
మాయమాటల నను నీవు మార్చలేవు
నేడు మూడెను నాచేత నీకు చావు." 49

తే. అనుచు వాకొని చేయెత్తి హనుమ రొమ్ము
మీద నతికర్కశమ్ముగా మోదె దనుజ
రెచ్చిపోయిన హనుమ గర్జించి మించి
ముష్టిఘాతమ్మునం దాని పొగ రడంచె. 50

తే. పుడమిపై బడ్డ దానవి పొరలి పొరలి
యేడ్చి హనుమంతునకు చేతులెత్తి మ్రొక్కి
"వనచరోత్తమ! నను లంక యని పిలుతురు
నన్ను చంపకయే గెల్చినావు నీవు. 51

క. నను ఈ వాకిట గెలిచిన
వనచరు మూలమున లంక వైభవ మడగున్
అని బ్రహ్మ మున్ను దెలిపెను
చనుమిక నీ కడ్డులేదు సాహసవీరా! 52

తే. రావణుడు దుష్టబుద్ధి నిలాతనూజ
నెపుడు చెరపట్టి తెచ్చెనో అపుడె వాని
పతన మారంభ మైనది వనచర! యిక
ఆగదీ యుద్ధ మని సాగనంపె నసుర॥ 53

తే. లంకయే రక్కసిగ మారి శంకలన్ని
బాపి దీవించె తన్నని పవనసుతుడు
దలచి తొలుదొల్త నెడమ పాదమును మోపె
సిరుల కిరవైన నగరము శిరముపైన. 54

సీ. కడునేర్పుతో పాలు కాజేయ వంటింట
మెల్లగా తారాడు పిల్లివోలె!
కటిక చీకటివేళ కలవారి గృహములో
దూరి యన్వేషించు దొంగవోలె!
బొక్కలోపల గూడ నెక్క డేమున్నదో
నక్కి గాలించెడు నక్కవోలె!
అతినిగూఢ మ్మైన ఆత్మతత్త్వమ్మును
తనలోన వెదకెడు తపసివోలె!

తే. కపివరేణ్యుడు తన పరాక్రమము మరచి
రాముదేవేరి సేమ ముల్లమున దలచి
ఎవరికంటను పడకుండ నవిరతముగ
పొంచి సాగుచు లంక గాలించ దొడగె. 55

ఉ. పూనిక రాజమార్గములు భూరిసరస్సులు, మండపమ్ము, లు
ద్యానవనమ్ము లున్నత వితర్దిక, లుజ్జ్వల రత్నమందిరా
లేనుగుశాల, లర్కరుచు లీనెడు సాంబశివాలయమ్ములున్
గాన వినోద వేదికలు గాంచెను గాడుపుపట్టి చెచ్చెరన్. 56

తే. అంతలోపల నగరమధ్యమ్మునందు
రత్నమయ కుడ్యశిల్ప విరాజితముగ
వరలు చున్నట్టి అద్భుత భవన పంక్తి
మేను పులకింప హనుమకు కానుపించె. 57

తే. ఆకసమ్మును తాకున ట్లమరియున్న
భవన సముదాయమున కన్నివైపులందు
శత్రుభీకరులైన లక్షల కొలంది
ప్రహరణాయుధపాణుల పటలియుండె. 58

తే. అదియె రావణు ప్రాసాద మందులోన
చాల రమణీయ సౌధరాజములు గలవు;
అట్టి అంతర్నగరమందు నధికయుక్తి
హనుమ దూరెను సైన్యము కనులు గప్పి. 59

సీ. అందులో మదనుడే ఆశ్చర్య మందెడు
లీల భాసిల్లు కేళీగృహాలు!
సృష్టికి ప్రతిసృష్టి జేసిన ట్లగుపించు
పచ్చని కృత్రిమ పర్వతాలు!
మారుతికే యందు ఊరేగ వలెనన్న
భావమ్ము కలిగించు పల్లకీలు!
పాకశాసనుకైన బాపురే యనిపించు
అందాల నర్తన మందిరాలు!

తే. ఒక్కటేమిటి? జగతిలో చక్కదనము
నంత గొనితెచ్చి, తన ఊహలందు జొనిపి
వేలరాసులుగా పోసె విశ్వకర్మ
అని తలంచెను పలుమారు లనిలసుతుడు. 60

తే. ఆ మహాసముదాయమ్మునందె యున్న
అసురవీరుల భవనమ్ము లన్ని వెదకి
ఒక్కచో నిల్చి వాలము నొడిసిపట్టి
చుంబనము జేసి శిరమెత్తి చూసె మరల. 61

తే. కానుపించిన దంతలో కనకరత్న
భూషితమ్మైన సుందర పుష్పకమ్ము
ఆ విమానపు నిర్మాణ మద్భుతమ్ము
కాన మెచ్చట ఆ కళాకౌశలమ్ము. 62

ఆ. అమరలోక విభవ మంత విమానము
నందు కొలువుదీరి నట్టులున్న
చంద మరసి హనుమ చకితుడై తను దాను
మరచి సీత మాట మరచిపోయె. 63

తే. చిత్తరువుపోలె నిలబడి చేష్ట లుడిగి
నాణెముల రాశియగు విమానమ్ము వంక
ఱెప్పలార్పక చూచెడు లీల నరసి
బుల్లి హనుమంతు వాలము తెల్లపోయి. 64

తే. అతిరయమ్మున బాల పార్వతిగ మారి
వ్రేలు చెక్కిలిపైజేర్చి వాలుకనుల
వాయునందను చోద్యమేపారజూచి
ఊదె కన్నులముందు తా నుష్షటంచు. 65

తే. హనుమ ఆ సవ్వడిని విని కనులు తెరచి
అచ్చటనెయున్న చిన్నారి అంబనరసి
తడబడుచు దెల్పె నొకచిన్న తప్పు జరిగె
నమ్మ! మన్నింపు మమ్మ! న న్ననుచు వేడె. 66

తే. అంత నాదేవి "తప్పు నీ దనను హనుమ!
నీవు జూచిన దృశ్యము నేను గనిన
మైకమున మున్గి నన్ను నే మరచిపోదు
నంతియే కాదు మరచెద హరుని గూడ. 67

తే. ఆ విమానము నతి శ్రద్ధ నజుని కొరకు
వింతలకు వింతయౌనటు విశ్వకర్మ
దిద్దితీర్చెను ధనపతి దీక్షబూని
అతికఠోరమ్ముగా తప మాచరించి. 68

తే. బ్రహ్మ మది గెల్చి వరముగా బడసె దాని
రక్కసులరేడు తన పరాక్రమముతోడ
సమరమున వైశ్రవణుగెల్చి సాహసమున
వశము గావించు కొనియె నా వైభవమును. 69

తే. చిన్న మనుమని కమ్మమ్మ చెప్పినట్లు
మంచి శిష్యుని కొజ్జ బోధించినట్లు
వివరముగ నచ్చటంగల వింతలెల్ల
దేవి చిన్నారి హనుమకు తెలియజేసె. 70

ఆ. అంతబుల్లి హనుమ ఆనందమున పొంగి
మరల స్వామి పనిని మదిని దలచి
అంబ నొక్కసారి అతిభక్తితో జూచి
అమె పదములంటి అనియె నిట్లు. 71

శా. "అమ్మా! శాంభవి లంకలో కడు సునాయాసమ్ముగా జానకిన్
సమ్మోదమ్మున గాంచి రామవిభు సత్సందేశమున్ దెల్పి, చే
తమ్ముప్పొంగగ వాయువేగమున సంద్ర మ్మేను లంఘించు న
ట్లిమ్మా! నీదు శుభాశిషమ్ములను నే నీడేర్తు కర్తవ్యమున్." 72

ఆ. అటుల వేడుకొనిన అంజనాసుతు గాంచి
చిన్న నవ్వు నవ్వి శిరసు నిమిరి
"రామకథకు నీవు ప్రాణసముండవు
కాన కలుగు నీకు కార్యసిద్ధి. 73

ఆ. ఎపుడు నీకు చిన్న యిక్కట్టు కలిగిన
మనమునందు దలచుకొనుము నన్ను
అపుడె తొలగజేతు నన్ని ఆపదల నే"
నని వచించి మాయ మాయె నంబ. 74

తే. ద్విగుణితోత్సాహమున కపితిలకు డంత
పుష్పక విమాన శిఖరాగ్రమునకు చేరి
నిక్కి నాలుగు దెసల తా నొక్కసారి
చూచె నటునిటు నంతలో చోద్యముగను. 75

తే. గుప్పు మని మద్యమాంసాల గొప్పతనము
నెరుగజెప్పెడు వాసనల్ కరువలిసుతు
నలుగడల మూగి ఇచ్చట కలదు రమ్ము
రావణాసురు అంతిపుర మ్మటంచు. 76

తే. ముక్కుపట్టుక లాగి కొంపోయి చూపె
ఆంజనేయున కత డెంతొ అబ్బురపడ
దనుజ నాథుని మణిగణస్థగితమైన
రాజభవనమ్ము సౌభాగ్యరంజితమ్ము. 77

సీ. ప్రత్యంగుళము నేత్రపర్వమ్ము గావించు
స్వర్ణసోపానాల సౌరు నరసి
బహువర్ణములతోడ భాసిల్లి రతనాల
ప్రభలు చిమ్మెడు ముఖద్వార మరసి
నిలువెల్ల సత్కళానిపుణత్వ మేపారు
మణిమయ స్తంభాల మహిమ నరసి
పాద మూనక ముందె పారవశ్యమ్మును
పంచెడు రత్నకంబళము లరసి
తే. ఇంచుకేనియు కపివరుం డీసుగొనక
రావణుని భోగభాగ్య విలాసములను
తడవ తడవకు మదిలోన తలచుకొనుచు
లోన మెలమెల్ల దూరె కల్లోల ముడిగి. 78

ఆ. సద్దు మణగియున్న అద్దమరేయిలో
మధువుగ్రోలి మదన మత్తలైన
వేనవేలు దనుజమానినీ మణులను
శుద్ధ బ్రహ్మచారి చూచె నపుడు. 79

సీ. త్రాగిన మైకమ్ము తలకెక్కి యొకతన్వి
లోగుట్టు మరచి పరుండియుండె!
మదనతాపమ్ముతో మరియొక భామ, వే
రొక లేమ కౌగిట నొదిగియుండె!
ఇంకొక్క యువిద పయ్యెదలేని యెద గుబా
ళించెడు లీల నిద్రించుచుండె!
వేరొక మీనాక్షి విరులనే వలువల
ట్లొడలి పై గప్పి నిట్టూర్చుచుండె!
తే. ఒక్క ప్రౌఢాంగనామణి మిక్కుటముగ
చిక్కువడినట్టి జుట్టుతో చెదరినట్టి
బొట్టుతో నర్ధనగ్నపు కట్టుతోడ
నేల పులకించునటు శయనించియుండె. 80

ఆ. కలను కూడ తాను కాంచి యెరుంగని
వింత పోకడలను కొంతమేర
నరసి రోతపుట్టి అట కాలు నిలువక
త్వరితగతిని ముందు కురికె హనుమ. 81

తే. ఆ మహామందిరము మధ్య నద్భుత మగు
పసిడి శిల్పాల కాళ్ళతో మిసమిసలను
పంచుచున్నట్టి చాందినీ మంచమందు
చొక్కి నిదురించు రావణాసురుని జూచె. 82

సీ. హేమాద్రినే ప్రేమధామమ్ముగా నెంచి
మురిసి నిద్రించు జీమూతమట్లు
పండిన పచ్చికబయలు మధ్యమ్మున
కునికెడు చీకటికొండ పగిది
పల్లె మహాలక్ష్మి పంటకళ్ళమునందు
పోసిన మినుముల రాశివోలె
వెన్నెల వెలుగులో కన్నులు ముకుళించి
హాయి నాస్వాదించు యముని లీల

తే. చొక్కి నిదురించు రావణాసురుని చుట్టు
రత్నకంబళ్ళ మీద విలాస మొదవ
గరుడ గంధర్వ కిన్నరాంగనలు నూర్ల
కొలదిగా నుండ కనె కపికుంజరుండు. 83

తే. వారిలో కొంద రతివల బలిమి దెచ్చి
భార్యలుగ జేసికొనియె నా బలయుతుండు;
కొంద రాతని బొందెడు కోర్కెతోడ
వలచి వచ్చిరి తమతమ నెలవు విడిచి. 84

తే. అయిన వారంద రొకతీవ అలరు లట్లు
తాము సవతుల మన్న సత్యమును మరచి
అసురవిభు ముద్దు మురిపాల నందుకొనుచు
అతని నలరించు చుండెద రహరహమ్ము. 85

ఆ. అంతమంది సతుల నవలీల మెప్పించు
రసికత యెటు లబ్బె రావణునకు? క
టంచు బద్ధవైరి అమరనాథుడు కూడ
అబ్బురమ్మునందు నప్ప డపుడు. 86

చ. అది యటులుండనిమ్ము! పవనాత్మజు డచ్చటి వింత దృశ్యముల్
ముదమున గాక రావణుని భోగ విలాస వినోద కేళులన్
తుదివర కారయం దలచి, నోరు మెదల్పక, కన్నులార్పకే
బెదరక అట్టులే నిలిచి, వెండియు చూడ దొడంగె సర్వమున్. 87

సీ. లాస్యాభినయమున రావణు నలరించి
చొక్కి నిద్దురపోవు చుండె నొకతె!
వీణనే కౌగిట విభుని కైవడి జేర్చి
యొదవు మత్తున మున్గియుండె నొకతె!
మద్దెలే తనపాలి మన్మథునిగ నెంచి
గుండెపై హత్తుకయుండె నొకతె!
అందాల మురళిని అధరాన కర్పించి
చూడముచ్చట గొల్పుచుండె నొకతె!

తే. వీరు నల్వురె యననేల? వేలకొలది
చేడె లచ్చటి వాద్య విశేషములనె
తమకమును బాపు ప్రియులుగా దలచినట్లు
మదిని భావించె నా పవమానసుతుడు. 88

ఆ. కాముకత్వమునకు కళలను జతచేసి
రావణవిభుముందు రాశిపోసి
వారిమెప్ప వడసి వలసిన సౌఖ్యమ్ము
లందు కొందు రచటి అతివ లనుచు. 89

ఆ. మారుతాత్మజుండు మదిలోన దలపోసి
ఇచట సీత నరయు టుచితమౌనె?
కాదు కాని యిపుడు కర్తవ్యమేమి? ట
టంచు చింతనందె నంతలోనె. 90

తే. ఎదుటనే కానుపించె ప్రత్యేకమైన
స్వర్ణశయనాసనమ్మున వసుధలోని
అంద మంతయు తానెయైనట్టులున్న
లలితలావణ్యరాశి అస్ఖలిత కపికి. 91

తే. నిద్రలోకూడ నాదేవి నేత్రయుగళి
దివ్యకాంతులు విరజిమ్ము తీరు నరసి
అతులిత మ్మైన ఆమె ముఖారవింద
మరసి తను దాను మరచె నా అనిలసుతుడు. 92

సీ. సిద్ధ హస్తుండైన శిల్పి పుత్తడితోడ
చెక్కిన అపురూపశిల్ప మటుల
మెరుపుతీవెల రాశి మేదినిపై వాలి
స్త్రీమూర్తిగా మార్పు చెందినటుల
బాలభానుని సానబట్టగా రాలిన
పొడితోడ మలచిన బొమ్మయటుల
పున్నమ రోజున మిన్నేరు ప్రసవించు
ఇసుకతో తీర్చిన యేణియటుల

తే. చాందినీ మంచమున కందచందములను
దిద్దుచున్నట్టు లొదిగి నిద్రించుచున్న
ఆ వరారోహ సౌందర్య మరసి హనుమ
ఆమెయే సీతయైయుండు నని భ్రమించె. 93

ఆ. భ్రమను వాస్తవముగ భావించి జానకి
జాడ దెలిసెనన్న సంబరమున
తొడరి జబ్బ చరచి తోకను ముద్దాడి
ఒడలు మరచి గంతు లిడియె హనుమ. 94

ఆ. కాని అంతలోనె కనువిప్ప కలిగి నే
నెంత వెర్రినైతి నిట్టి యూహ
కలను గూడ నాకు కలుగరా దని గొడ్డు
పట్టి చెంప లదరగొట్టు కొనియె. 95

ఆ. లోకవినుతిగన్న సాకేతపురి నున్న
సకల భోగములకు స్వస్తిజెప్పి
భర్త వెంట నడచి వనముల కరుదెంచి
నట్టి సాధుచరిత అవనిజాత. 96

తే. ఆ మహాసాధ్వి ఈ రీతి నసురవిభుని
మ్రోల జలతారు వస్త్రముల్ మేలినగలు
దాల్చి సుఖనిద్ర నందునే తప్ప తప్ప!
కాదు ముమ్మాటికిని యీమె కాదు సీత. 97

తే. అని మనమ్మున దలపోసి ఆమెనుదుటి
బొట్టులో రావణాసురు బొమ్మ నరసి
చకితుడై యీమె దానవసార్వభౌము
పట్టమహిషిగ గుర్తించి పవనసుతుడు. 98

తే. భాగ్యవశమున నిట్టి సౌభాగ్యవతిని
ధర్మపత్నిగ బడసియు దనుజవిభుడు
చావు మూడుట చేతనే సాహసించి
అవనిజాతను బలిమిమై అపహరించె. 99

తే. అనుచు మదినెంచి సీతమ్మ నరయువరకు
తగదు తొందరపాటని నగచరుండు
కరములను మోడ్చి రామలక్ష్మణుల దలచి
అసురవిభు మేడ పైకెక్కి అరయ దొడగె. 100

తే. అంతలో కొంతదూరాన నాకసమ్ము
నంటు తరుపుంజములతోడ నలరుగముల
తోడ మణిమండపమ్ములతోడ నలరు
శ్రీకరమ్మైన మేలి అశోకవనము. 101

తే. జ్ఞానధనుడైన హనుమకు కానుపించె!
నపుడు సంపాతి సెలవిచ్చి నట్టి మాట
మదిని మెదలాడె తప్పక మాత సీత
అచ్చటనె యుండు నను మోద మతని ముసిరె. 102

ఆ. "ఇపుడె అచటి కేగి ఇసుమంత సవ్వడి
జేయకుండ పట్టు బాయకుండ
వైరు లరయకుండ వనమంత గాలించి
దేవి సీత యునికి దెలిసికొందు. 103

తే. ఆ మహాసాధ్వి సీతమ్మ అచట గూడ
కానుపించని యెడల తత్క్షణమె మరల
రావణాసురునంతిపురమ్ము కరిగి
నెత్తురోడెడు నటుదన్ని నిద్రలేపి. 104

తే. దానవాధమ! చెప్ప నా తల్లి నెచట
దాచితివొ చెప్ప! చెప్పక దాచినావొ
చావు తప్పదు నీ కని చావకుండ
పిడికిటం గుద్ది నేనె చెప్పింతు నిజము. 105

ఉ. అప్పడు కూడ, వాస్తవము నా మదమత్తుడు తెల్పకున్నచో
కొప్పరమైన క్రోధమున కూకటి వ్రేళ్ళ బెకల్చి లంకనే
చప్పరమట్లు నెత్తుకొని చయ్యన రాముని జేరి, స్వామి! యీ
తప్పడు దొంగకున్ తగిన దండనవేయు మటంచు పల్కెదన్." 106

తే. అనుచు పరిపరివిధముల అదుపు దప్పి
మదిని బుసకొట్టు కోపమున్ మట్టుబెట్టి
కలుగు నీవేళ తప్పక కార్యసిద్ధి
యని యశోకవనమ్మునం దడుగు మోపె. 107

ఆ. అది వసంతకాల మగుటచే తరులతా
మండలములకెల్ల పండువాయె;
ఆకులన్ని మురిసి అలరులుగా మారి
పరిమళమును వనికి పంచుచుండె. 108

సీ. తరుల మొదళ్ళలో తళతళ మెరసెడు
వెండి వితర్దికల్ వెలసియుండె
పొదరిండ్ల ముంగిట పుత్తడి వేదిక
లతిమనోహరముగా నమరియుండె
వనమధ్యమున నున్న పర్వతాగ్రమునుండి
జలజల సెలయేళ్ళు జారుచుండె
నేత్రపర్వమ్మైన కృత్రిమారణ్యాన
లేళ్ళు నిశ్చింత నిద్రించుచుండె

తే. ఐన శ్రీరామ దూత యా యబ్బురముల
నించు కేనియు తాను పట్టించుకొనక
దేవి జానకి మీదనే దృష్టి నిలిపి
వేయి కన్నుల నామెను వెదుక దొడగె. 109

తే. కుసుమముల రాసు లటులున్న కొమ్మలందు
లలిత లావణ్య రుచు లీను రంగు రంగు
పక్కి జంటలు కర్ణపర్వమ్ములైన
కలకలారావములు లెస్స సలుపుచుండె. 110

తే. అపుడు వనమంత తానెయై యనిలసుతుడు
చెట్టుపైనుండి వేరొకచెట్టుపైకి
కొమ్మపై నుండి వేరొక కొమ్మపైకి
సరగ లంఘించు చున్నట్టి సరణి నరసి. 111

తే. పక్కి గుంపులు బెదరి అంబరమునంట
నొక్కసారిగ నెగిరె నా యూపువలన
కుసుమములు పైనబడి గాడ్పుకొడుకుగూడ
సంబర మ్మంది అపరవసంతు డాయె. 112

తే. పూలతో గప్పబడినట్టి బుల్లి హనుమ
మించు ధృతితోడ తోక నాడించు కొనుచు
వేగ నటగల శింశుపావృక్షమెక్కి
కొమ్మ కదలని రీతిని కూరుచుండె. 113

తే. అప్పు డా వృక్షమూలమ్ము నాశ్రయించి
నివురు నిలువెల్ల కప్పిన నిప్పవోలె
పంక మంటిన నెలవంక పగిది నున్న
ఒక్క స్త్రీమూర్తి కనుపించె నక్కజముగ. 114

తే. అతిభయంకరాకార లైనట్టి దనుజ
భామినుల మధ్యలో నున్న భాగ్యహీన
కాననమ్మున వేటకుక్కలకు నడుమ
చిక్కిన హరిణివలె కడు స్రుక్కియుండె. 115

సీ. తలవ్రాత సరిలేక విలవిల విలపించి
క్షీణించినట్టి సత్కీర్తి వోలె
విబుధు లందరు మెచ్చ వికసించు శుభవేళ
పుడమి పాలైనట్టి బుద్ధివోలె
ఆటంకములు దాటి అంది అందకముందె
ఆవిరైపోయిన ఆశవోలె
అన్ని యోగ్యత లుండి అభ్యాసమును బాపి
విభవమ్ము తరిగిన విద్యవోలె
తే. తైల మడుగంట కొడిగట్టి తల్లడిల్లు
దీపకళిక విధమ్మున రూపు మాసి
బ్రతికియున్నట్టి ఆమె దుఃస్థితిని గాంచి
కనులు చెమరించె పవమానతనయు కపుడు. 116

తే. నాడు మైథిలి తనమేని నగల నొలిచి
చింతలో ముంచి ఏ చీరచెరగునందు
కట్టి మూటగ ఋష్యమూకమ్మునందు
విడిచె నా చీరయే యామె ఒడలినంటి. 117

తే. ఉండుటను గాంచి హనుమంతు డొక్కసారి
ఉలికిపడి వెంటనే క్రింది కురుకబోయి
అంతలో తేరుకొని "అమ్మ! అవనిజాత!
ఎట్టి కష్టాలు నిను చుట్టుముట్టె తల్లి! 118

తే. పరమపావని నేను నా స్వామి కరుణ
దెలిసికొంటిని నీజాడ సులభముగనె
కాని నిన్నిట్టి దుస్థితిలోన జూడ
వలసె నను బాధ నా మదిన్ కలచె నమ్మ!" 119

తే. అనుచు లోలోన దుఃఖించి అంజలించి
ప్రాణసముడైన పతి నెడబాసి నీవు
ఎటుల విలపించు చుంటివో యటులె యచట
కుములుచున్నాడు తల్లి! నీ కూర్మి ధవుడు. 120

తే. ఒకరి కొకరుగ జీవించుచున్న మిమ్ము
అడవి కన్నుల పంటగా నలరు మిమ్ము
హృదయమే లేని కాల మీరీతి నిటుల
ఎందు కెడ బాపెనో సుంత యెరుగనమ్మ! 121

తే. రావణాసురు డర్ధాంతరముగ చావ
సిద్ధపడి నిన్ను చెరపట్టి చేతు లన్ని
కాల్చుకొనెనమ్మ! ఆ మంట కర్కశముగ
శిరములను కూడ భస్మము జేయునమ్మ! 122

ఆ. కాని... అంతవరకు కష్టాలు
ధరణిజాత! నీకు తప్పవమ్మ!
అనుచు మదిని దలచుకొనుచు గాఢుపుపట్టి
ఆమె దివ్యరూప మరయుచుండె. 123

తే. అంతలో వేదపండితు లసురవిభుని
గాఢనిద్రకు భరతవాక్యమ్ము పలుక
దలచి పాడెడు సుప్రభాతంపు నాద
మప్రయత్నమ్ముగా దూరె! హనుమ చెవిని. 124

తే. లంకలో కూడ వేదాల రాటుదేలి
నట్టి విజ్ఞానధను లుండు టబ్బురముగ
నెంచి పవమానసూను డాలించదొడగె!
జోలపాటకు తలనూపు బాలు పగిది. 125

ఆ. అపుడు దనుజవిభుని అంతఃపురమునందు
శ్రవణ సుభగముగను సాగుచున్న
వేదఘోష నగర వీథు లన్నింటిని
మేను కదపకుండ మేలు కొలిపె. 126

తే. ముగ్ధమోహన లావణ్యమూర్తులైన
సుందరీమణు లెందరు చుట్టునున్న
కలను సైతము సీతనే తలచుకొనుచు
రాతి రంతయు గడపెను రావణుండు. 127

ఆ. మధుర మంజులముగ మానక సాగెడు
వేదనాద మసురవిభుని చెవుల
నలర జేసె నంత నతడు సీతా యంచు
పలవరించి లేచి కలయ జూచి. 128

ఆ. ఒదిగి యెదుట నిలిచియున్న భామినులతో
ఇపుడె సీత నరయ నేగవలయు
కాన వేగ స్నాన పానాదులు ముగించు
నటుల జూడు డంచు నానతిచ్చె. 129

తే. అంత పరిచారికాగణ మసురనేత
మాట మేరకు వాని పన్నీటితోడ
జలక మాడించి జవ్వాది నలది మేన
కట్టబెట్టిరి జలతారు పుట్టములను. 130

తే. పిదప బహువిధ రత్నముల్ పొదిగినట్టి
మేలి భూషణముల నెల్ల మేనినిండ
రావణుడు మెచ్చునట్టు లలంకరించి
నిలువుటద్దము ముందర నిలిపి రంత. 131

తే. దర్పణములోన తన్ను తా దనుజనేత
చూచుకొని తృప్తి బ్రకటించి వేచియున్న
మదవతుల దోసిళుల బహుమతులు విసరి
శోభ ప్రసరింప కదలె నశోకవనికి. 132

సీ. కరకంకణమ్ములు మెరయుచు ట్లపురో
రమణులు వింజామరమ్ము లిడగ
ఇరుపార్శ్వముల యక్షతరుణీలలామ ల
త్యంత శోభలతోడ ననుసరింప
పరిమళోదక పానపాత్రలు చంకల
నిడుకొని నాగమానినులు నడువ
విద్యాధర స్త్రీలు హృద్యమ్ముగా ముక్త
కంఠాన జయగీతికలను పాడ...

తే. మెరపు తీవెల మధ్యలో మేఘు డట్టు
అన్నిదిక్కులు తనవైపె నరయు నట్టు
అమిత దర్పమ్ము తోడ నా యసురనేత
సరగనేతెం చిధరణిజ సరసనిలిచె 133

ఆ. సీతకన్నముందు చివురుల మధ్యలో
నణగి యొదిగియున్న అనిలసూను
డలరుటమ్ము లేని అంగజు విధమున
వెలుగుచున్న దనుజవిభుని జూచి. 134

తే. అతని తేజోవిలాసాన కబ్బురపడి
అరయవలె నేమి జరుగునో యని తలంచి
సడియు సవ్వడి రవ్వంత సలుపకుండ
కొంత క్రిందికి దిగి నక్కి కూరుచుండె. 135

తే. కామ పీడితుడైన రాక్షసవిభుండు
ఆకలెత్తిన బెబ్బులి వీక నెదుట
నిలిచి తన మీదనే దృష్టి నిలిపి చూచు
తీరు నారసి నిలువెల్ల దిగులుచెంది. 136

తే. నేలకొమరిత వేడి కన్నీటి బొట్టు
లమ్మ యెద మీద రాల్చుచు నామె వైపె
చూచి విలపించు చుండుట చూచికూడ
తమకమును వీడ డాయె నా దనుజవిభుడు. 137

ఆ. లేశమైన జాలి లేని కసాయికి
మేకగోడు చెవిని సోకనటుల
కరడుగట్టినట్టి కామాంధునకు సీత
కంటినీర మెటుల కానుపించు? 138

ఆ. వలచివచ్చినట్టి వనిత నక్కున జేర్చు
టొప్పగాని చింతనిప్పవంటి
నా కొమార్తె బ్రతుకు నాశన మొనరింప
కుటిలమతిని పూనుకొంటి వీవు. 139

తే. దానవాధమ! నా బిడ్డ తనువుపైన
చేయివేయు ప్రయత్నము చేసినావొ?
భస్మ మొనరింతు నిన్ను నీ పట్టణమ్ము
ననిన రీతిని గర్జించె నవని కినిసి. 140

తే. ఆ మహోగ్ర కదలిన యసురనేత
స్వర్ణమకుటము గడగడ వణకి బెదరి
తనకు తానయి తలను నిర్దయను వీడి
పుడమి పైబడి నటునిటు పొరలసాగె. 141

క. దానిని దుశ్శకునముగా
మానసమున దలచి యచటి మానిను లెల్లన్
దానవనాథు డెరుంగని
బాణిన్ గుసగుసలు వోయి భయపడి రంతన్. 142

క. ముదమున సరసము నెరపెడి
యదనున నేడేల శిరమునందలి మకుట
మ్మదరిపడె పుడమి పైనని
మదమత్తుడు రావణుండు మదిలో దలచెన్. 143

ఆ. మంట లెగయునట్టి మదనతాపము తోడ
తల్లడిల్లుచున్న దనుజనాథు
నెదుట తలను వంచి హృదయవిదారక
సరణి నున్న ధరణిజాత నరసి. 144

తే. "కలికి జానకి! నీవు శోకమున గూడ
శోభ చేకూర్చుచుంటి 'వశోక' వనికి;
అందమన నీదె! నే నిక నాగలేను
రమ్ము! నా రాణివై యేలుకొమ్ము లంక. 145

శా. ఆ కర్ణాయతలోచనా! కనుము నిన్నర్థించుచున్నాడ; నీ
రాకాచంద్రుని బోలునెమ్ముగమునేలా? భీతిమై దాచెదో
నీకై వేచితి నిన్నినాళ్ళు దయతో నీడెందమర్పించినన్;
నాకమ్మున్ బెకలించి తెచ్చియిడెదన్, నా ప్రేమ చిహ్నమ్ముగన్. 146

తే. ఘనయశమునందు అష్టభోగమ్ములందు
బలపరాక్రమమందు సంపదలయందు
చతురగుణమందు దివ్యతేజస్సునందు
రాముడేపాటి నాముందు కోమలాంగి! 147

తే. పెక్కుజన్మల పుణ్యాన దక్కినట్టి
భువనమోహన సౌందర్య మవని పాలు
చేయు టుచితమ్ము కాదు నీ చేయిసాచి
అరమరలు వీడి నా చేయి నందు కొనుము. 148

తే. నిర్జరుల నని గెల్చిన దుర్జయుండ
అష్టదిక్పాలకుల సేవలను దినమ్ము
నందుకొనుచున్న నతిలోకసుందరుండ
నన్ను కాదను టుచితమా? సన్నుతాంగి! 149

తే. ఆకు లలములు మేయుచు నడవులందు
దేశద్రిమ్మరి చందాన దిరుగుచున్న
మగడు దుర్భేద్యమైన నా నగరు సొచ్చి
పోరి నను గెల్చి నిన్ను గొంపోవ గలడె? 150

ఆ. గాలిమేడ లెన్ని ఘనముగా గట్టిన
ఒక్కటైన వాసయోగ్య మగునె?
పగటికలలు నిత్య మగణితముగ గన్న
ఫలము సుంతయైన బడయ నగునె?" 151

ఆ. అంతవరకు దనుజు వింతవాగుడు నెల్ల
విధికి శిరసువంచి వినిన సీత
ఇక సహించలేక యేహ్యాభావమ్మున
ప్రక్కమోమువెట్టి పలికె నిట్లు. 152

ఆ. "ఊరకున్న కొలది మేరమీరుట నీకు
పాడిగాదు గాలిమేడ లీవె
కట్టుకొనుచు పగటి కలలను గనుచుంటి
వినకులేశు మహిమ నెరుగలేక. 153

ఆ. ఎంత శౌర్యమున్న నెన్ని యర్హత లున్న
అంతులేని భాగ్య మమరియున్న
పశుప్రవృత్తితోడ పరదారలను గోరు
వాని కన్న లేడు పాపి భువిని. 154

క. కాపురుషుని నీచోక్తుల
నాపక చెవియొగ్గి వినిన నఘ మొదవును, నే
భూపుత్రిక నని మరువకు
నా పతితో సమమె? నీవు నయవంచకుడా! 155

తే. కోప మెరుగని నా భర్త కుపితుడైన
యుద్ధ మక్కరలేదు నీ యుసు రడంప
నేడు వారాశు లేకమై యెగసి దుమికి
అలలతో మోది నిను జంపు నాక్షణమ్మే. 156

సీ. భాసమానుండైన కోసలాధీశుని
సవనఫలమ్ముగా జననమంది
మూతిపై మీసము మొలచి మొల్వకముందె
యొక బాణముననె తాటకను జంపి
శ్రీకంఠు చాపమున్ చెరకు కైవడి ద్రుంచి
జీవితేశ్వరిగ నన్ స్వీకరించి
తండ్రియానతి మేర తమ్ముని కోసమై
ముదమున సామ్రాజ్యమును త్యజించి
తే. తాపసుల సేవ జేయంగ దలచి నడచి
కాననమ్ముల కరుదెంచి కపటబుద్ధి
నీవు మృగముగ బంపిన నీచు దునిమి
నట్టి నా స్వామి నిను మట్టుబెట్టుటెంత? 157

తే. ఆకు లలములు దినునట్టి అడవిరాము
డేగదా? మొన్న నిర్భీతి నేకధాటి
వీరవరులైన పదునాల్గువేలమంది
రక్కసుల గూల్చినది ఘోరరణమునందు? 158

తే. మూర్ఖుడా! నీవు నా నాథు మోసపుచ్చి
గుట్టుచప్పుడు లేక నన్ బట్టి తెచ్చి
నీచబుద్ధిని లంకలో దాచినట్టి
తెర గెరింగిన చాలు నా మరునిముసమె. 159

ఆ. సురగణమ్ము మెచ్చ శరముతో నీ మృత్యు
శాసనమ్ము వ్రాసి సమరభేరి
పుడమి దద్దరిల్ల మ్రోగించు నా స్వామి
కనులు దెరచి నిజము గాంచు మిపుడె. 160

సీ. రణభీకరమ్మైన రామబాణము నిన్ను
దురమున వెంటాడి తరుమునాడు
అతిగర్వదృప్తమ్ములైన నీ పదితలల్
నేల నొక్కొక్కటే గూలునాడు
తెగిన నీ కుత్తుక లెగజిమ్ము రుధిరమ్ము
జడివానయై మేను దడుపునాడు
కరకంకణమ్ములు కన్నీరు గార్చు న
ట్టిరువది హస్తాలదరుగునాడు



తే. పాపపుణ్యమ్ము లెంచక ప్రతిదినమ్ము
నాచరించిన ఘోరకృత్యముల ఫలము
ననుభవించుచు నుంటి నే నని తలంచి
యెంత యేడ్చిన నీ మొర నెవడు వినడు. 161

తే. ఎంత భండనయోధుడో అంతకన్న
అసదృశుండైన పరమ దయామయుండు:
ఇనకులేశుడు గావున నిప్ప డైన
నన్ను నాపతి కర్పించి నిన్ను నీవు
చేటు మూడక ముందె రక్షించుకొనుము. 162

తే. చివరగా నొక్కమాట నే చెప్పచుంటి
వినుము! నీ దుష్టబుద్ధితో విమలచరిత
రాణి మందోదరీదేవి త్రాడుద్రెంచి
ఆమె నెమ్మోము వెలుగుల నార్పబోకు. 163

తే. మేరు నగధీరు డసహాయ శూరుడైన
రామునిల్లాలి శీలము, రగులుచున్న
అగ్నివంటిది కాన నీ ఆశవీడి
వెతల పాల్గాక సుఖముగా బ్రతుకు మీవు. 164

తే. ఏకపత్నీవ్రతుడు సర్వలోకహితుడు
ప్రేమధాముడు సుగుణాభిరాముడైన
దాశరథి కంకితమ్మైన తనువు, మనసు
దోచుకొన నీకు సాధ్యమా? దుష్టచరిత! 165

తే. తలప జగములలో సతీత్వమును మించు
దివ్యశక్తి మరొక్కటేదియును లేదు;
బ్రహ్మవిష్ణు మహేశుల బాలకులుగ
మార్చివేసిన దనసూయ, మరువబోకు. 166

తే. పతిని దైవమ్ముగా కొల్చు సతిని నేను
సతియె సర్వస్వ మని నమ్ము స్వామి తాను
మమ్ము విడగొట్టినట్టి పాపమ్ము నిన్ను
యముని పాశమువోలె వెంటాడి తీరు. 167

శా. నీ మూలమ్మున సోదరుల్, తనయులు న్నీబంధువుల్, మిత్రులున్
నీమేలే తమ మేలుగా దలచి నిన్నే నిత్యమున్ కొల్చు నీ
భామల్, మంత్రులు, సైనికాధిపతులున్, పౌరుల్, మహాపండితుల్
సామాన్యుల్ కడగండ్ల పాలగుట మేలా నీవె యోచింపుమీ." 168

ఉ. అప్పటిదాక నోపికగ నంతయు విన్న సురారి "చాలు నీ
గొప్పలనాపు మో పుడమి కూతుర! దానవచక్రవర్తి కే
చెప్పకు నీతిసూత్రము లిసీ యని నవ్వు నశోకపాద పా
లిప్పటికైన నీ వదన మెత్తి ననున్ కృప జూడుమా" యనెన్. 169

తే. అంత జానకి "మూర్ఖుడా! యింతసేపు
నీ హితవుగోరి చెప్పిన నీతు లెల్ల
పెడచెవిని బెట్టి సిగ్గును విడిచిపెట్టి
పాడుచుంటివి మరల నీ పాతపాట. 170

తే. పరసతుల ప్రేమ బలవంత పరచియైన
ప్రియవచస్సులు జల్లి ప్రార్థించియైన
పొంద జూచుట నాకాశ పుష్పరాజ
మెగిరి గైకొన దలచుటే! యెరుగు మీవు. 171

తే. ఇంతకంటెను నుడువుట కేమి లేదు
కనుక బుద్ధిగ నిటనుండి కదలిపొమ్ము
టంచు నొక గడ్డిపరక నా యవనితనయ
పెరికి రావణుముఖమున విసరివైచె. 172

ఆ. అంత నసురనాథు డాగ్రహావిష్టుడై
"ఉవిద! నిను క్షమించు టొప్పగాదు;
రెండు నెలలు నీకు నిండుగా గడు విత్తు
మనసు మార్చుకొందు వని తలంచి. 173

తే. గడువు లోపల తానొడ బడకయున్న
నడుగ బనిలేదు నన్ను మీ రాక్షణమ్మె
ఖండఖండాలుగా దీని కాయమెల్ల
నరికి భక్షించి ఆ వార్తనాకు చెపుడి." 174

ఆ. అనుచు దనుజనేత అచట కావలియున్న
అసుర భామినులకు ఆనతిచ్చి
తరుణి సీత వైపు దర్పమ్మునం జూచి
వడిగ చనె నశోకవనము విడచి. 175

తే. ధరణిజాతను తాను లోబరచుకొనుట
కసురనాథుడు చేతనైనంతవరకు
పట్టువీడక యత్నించి భంగపడియు
దుష్టబుద్ధిని మానక తుట్టతుదకు. 176

తే. సరసి నెడబాసి కమలిన సరసిజమ్ము
పగిది సడలిన యొడలితో బడలియున్న
క్షితితనూజను నరికి భక్షింపుడన్న
దనుజపతిమాట కుగ్రుడై యనిలసుతుడు. 177

తే. అప్పుడే వానిపై దూకి హాత మొనర్ప
దలచి యొకవేళ కాలము కలసిరాక
"నేను మరణించినట్లైన నేలకూతు
రిచట నున్నట్లు రాముని కెట్లు తెలియు? 178

ఆ. అనిలతనయు జాడ నర్ధాంగి జాడయు
బడయ నైతి నింక బ్రతుకనేల?
యను తలంపు రాము మనమున మొలకెత్త
వచ్చు గాన నట్టి పథము తప్ప." 179

క. అని మనమున దలపోయుచు
హనుమంతుడు మిన్నకుండె నంతట దనుజాం
గన లవనిజ కడ మూగిరి
పెనుచీకటి కొండలటుల భీతి దలిర్పన్. 180

తే. అటుల మూగిన స్త్రీలు దయ్యముల పగిది
చుట్టు గూర్చుండి వికృతపు చూపుగముల
నుర్వితనయను జూచుచు నొక్క రొకరె
వదరసాగిరి ఆ తల్లి బెదరునటుల. 181

గీతి. ఇన్నావుగా! అయ్యయేమి సెప్పిండో?
యెన్నాళ్ళు నువ్విట్ట యేడస్తవమ్మ!
ఇక్కడికి నీ మొగుడెట్ట వస్తాడు?
చెక్కిటా చెయిదీసి చెవ్వొగ్గి యినుము!
ఇప్పడే మేము నిన్నేమి సెయబోము!
తప్పడాలోచనలు తలదూరనీక...
గొప్పలకు బోక నువ్వొప్పకో దొరను!
యెప్పటికి నువె లంక కేలి కవుతావు!
అపుడు రాణమ్మలే ఆరతులు బట్టి
అపరదేవతగ నీ అడుగులొత్తెదరు!
అని ముక్తకంఠాన నసురభామినులు
తనను వేధించుటకు కినిసి సీతమ్మ
ఆపండి మీ సుద్దు లీపూట చాలు!
ఊపిరుంటే మరల రేపు వింటాను. 182

తే. అనుచు బిగ్గరగా వన మదరునట్టు
లరచి జానకి కన్నీటి నదుపుజేయు
నోపికయు లేక శోకము రూపుగొన్న
సరణి భోరున విలపింప సాగె నపుడు. 183

తే. అయిన రక్కసి చేడియ లామె పట్ల
జాలి దలపక తమ జాతిసహజమైన
కర్కశత్వము రెట్టింప కన్ను లురిమి
మొత్తి చంపెద మిపుడె జాగ్రత్త యనిరి. 184

తే. చెట్టుపై నుండి సీత దుస్థితిని జూచి
ఓర్వ నశియించి హనుమంతు డొక్కసారి
పిడుగు పడినట్లు గర్జించె! నొడలు మరచి
దనుజకాంత లాభీకరధ్వనికి బెదరి. 185

తే. పిడుగు నిజముగ ప్రక్కనే బడె నటంచు
దలచి తబ్బిబ్బు పడుచు సీతమను వదలి
దిక్కు లదరంగ నడచుచు నొక్క రొకరె
పరుగు దీసిరి వేగ నిబ్బరము వీడి. 186

తే. ఇంతలోపల నచట నిద్రించుచున్న
త్రిజట యను దైత్యకాంత భీతిల్లి లేచి
దూరముగ తలల్ బట్టుక కూరుచుండి
కలతపడుచున్న రాక్షసాంగనల జేరి. 187

తే. "ఇపుడు నేనొక కలగంటి నింతులార!
అందు మన రావణుని కన్న అందగాడు
నీలిమేఘపు చాయతో నెగడువాడు
అచ్చెరువు గొల్ప నాకు ప్రత్యక్ష మాయె. 188

తే. వాని ప్రక్కన అపరంజి వన్నెవాడు
శేషఫణి కాంతికనుల భాసిల్లువాడు
ఉగ్రనరసింహు నట్టుల నొప్పువాడు
కోడె వయసున దనరారువాడు కలడు. 189

తే. ఇరువు రగణితసైన్యవాహినులతోడ
ముమ్మరమ్ముగ లంకను ముట్టడించి
బవర మొనరించి రావణప్రభుని జంపి
చనిరి సీతమ్మతోడ పుష్పకము నెక్కి. 190

క. కేవల మిది స్వప్నముగా
భావించుట తగదు మనకు పరమేశ్వరుడే
రావణునకు వాటిల్లెడు
భావియుపద్రవము నిట్లు బాహిర పరచెన్. 191

క. కావున మన మందరమును
కావలి వారముగ కాక కడు వినయమునన్
సేవ లొనరించి ఆయమ
దీవెనలను బొంద నవియె దిక్కగు మనకున్." 192

ఆ. అనుచు త్రిజట దెలిపి అందర దోఁత్కొని
సీతయొద్దకేగి చేతు లెత్తి
మ్రొక్కి "చూడు తల్లి! చిక్కు లొక్కొక్కటే
తొలగి నీకు శుభము గలుగు నింక. 193

ఆ. నేడో... రేపో యొక్క నీలిమేఘము వచ్చి
కంటినీరు దుడిచి కరుణ పంచి
పుష్పకమున నిన్ను పురము జేర్చెడు భార్య
మబ్బునమ్మ! వివర మడుగకమ్మ! 194

చ. అని కడు నర్మగర్భముగ నాదర మొప్ప వచించి వేగ నా
వనితలు కొంతదవ్వరిగి స్వప్నమునందలి మంచిసెబ్బరల్
మననము జేసిచేసి యనుమాన మొకించుక లేదు రావణుం
డని మరణించి తీరు నని హాయిగ నిద్దురవోయి రందరున్. 195

తే. "త్రిజట దయనీయమైన నా స్థితిని గాంచి
కొంత జాలిని చూపిన దంతెగాని
నీతిమాలిన దానవనేత నన్ను
వదలు దయతోడ ననునాశ పగటికలయె. 196

ఆ. కాన రెండు నెలల గడువు ముగియుదాక
బ్రతికినందువలన ఫలిత మేమి?
అపుడు చిత్రహింస లంది చచ్చుట కన్న
ఇపుడె తనువు వీడు టెంతొ మేలు." 197

క. అని రాముని కూరిమిసతి
మనమున దలపోసి యన్యమార్గముగనకే
తనుదాను జంపుకొనవలె
నను నిర్ణయమునకు వచ్చి యటునిటు చూచెన్. 198

ఆ. అంతవరకు గుబురుటాకుల మాటున
నక్కియున్న వాయునందనుండు
ఇంతకన్న సీత నేకాంతమున బల్క
రించు భాగ్య మొదవ దంచు నెంచి. 199

తే. మదిని పలుమార్లు రామనామము స్మరించి
రామ! రఘురామ! లోక కల్యాణ ధామ!
ఆహవోద్దామ! దివ్యగుణాభిరామ!
అనుచు లయబద్ధముగ గాన మాలపించె. 200

తే. లంకలో తొలిసారి శ్రీరామభజన
నాలకించిన సీత కల్లోల ముడిగి
ఏమిటీవింత? నే నెప్ప డెరుగనైతి
ననుచు పైకెత్తె తల చిగురాశ తోడ. 201

తే. పాదపమునందు సూక్ష్మరూపమున నున్న
హనుమ వెంటనె నిజరూప మంది దుమికె
ధరణిజాత్మజ ముందు సంబరము గదుర
భళిభళీయని సకలదేవతలు పొగడ. 202

తే. వెంటనే సీత పాదాల నంటి మ్రొక్కి
"దేవి! నీకొక శుభవార్త దెలియజేయ
వచ్చి లంకను గల వాడవాడ వెదకి
చిట్టచివరకు కంటి నీ చెట్టుక్రింద. 203

క. ఉన్నాడు తల్లి రాఘవు
డున్నా డనుజన్ముతోడ ఒప్పగ నెపుడున్
నిన్నే మదిలో దలచుచు
నున్నా డిక చింత మాను ముత్తమ సాధ్వీ! 204

క. అని తా నెంతగ దెలిపిన
వినియును మౌనమును సీత వీడక యుంటన్
గని వాయునందనుం డిటు
లనియెను యా దేవి సంశయము బాపుటకై. 205

చ. ఇది కలకాదు దేవి! విను మేను రఘూత్తము నాన మేరకే
యుదధిని దాటి వచ్చితిని; ఉంగర మా ప్రభునానవాలుగా
ముదమున దెచ్చినా నిదిగో! ముందుగ ముద్రిక స్వీకరించి నీ
మదిగల సంశయమ్ములను మాన్పుకొనందగునమ్మ! భూమిజా! 206

క. అని యంగుళీయకమ్మును
హనుమంతుడు సీత కొసగె నాయమ దానిన్
గొని యందు ప్రతిఫలించిన
తన పతిరూపమ్ము నరసి తన్మయత గనెన్. 207

ఆ. ఆమె కనుల నుండి ఆనందబాష్పముల్
వర్ష మటుల గురిసె! ప్రాణనాథు
డెదుటి కేగుదెంచి హృదయవీణను గోట
మీటినట్లు దలచి మిగుల మురిసె. 208

ఆ. అవనిజాత మోము నందు మొదటిసారి
క్రొత్త వెలుగు నరసి కొమ్మ మీది
చిలుక యొకటి ముద్దు లొలుకంగ బలికెను
శుభము శుభ మటంచు చోద్యముగను. 209

తే. అదియు శుభ సూచకమ్ముగా నాత్మ దలచి
కనుగవన్ విచ్చి సీతమ్మ హనుమ నరసి
నేడు నా ప్రాణములు మేన నిలిపినావు
వనచరోత్తమ! వేయేండ్లు బ్రతుకు మీవు." 210

క. ఆ మాట కాంజనేయుడు
"నామాటకు నేమి యపరనారాయణుడౌ
స్వామియు నీవును రాజ్యము
నీ మహి పదివేల యేడు లేలగ వలయున్." 211

క. అని పవమానతనూజుం
డని నంతనె యవనిజాత "యడవుల యందున్
జననాథుడు నను దలచుచు
ననుజునితో నెచటనుండె నది దెల్పు" మనెన్. 212

చ. "అడుగక ముందె నా వివర మంతయు నీకు వచింప నెంచియున్
నుడువగ నైతి నేల యన? నొప్పగ రాముని క్షేమవార్త, నే
కడువడి దెల్పి నీ చెవికి కమ్మని విందొనగూర్ప నెంచుటన్
తడవయిపోయెనమ్మ! నను తప్పగ జూడకుమమ్మ! జానకీ!. 213

క. శ్రీరాముడు నిను వెదకుచు
ఘోరాటవులందు ననుజు గూడి తిరుగుచున్
మారాజగు సుగ్రీవుని
జేరి యతని వెతలు బాపి స్నేహము వడసెన్. 214

తే. సీత యేమైనదోయన్న చింత నీకు
వలదు రఘురామ! నేను నా వారినంపి
ఆ మహాసాధ్వి నెచట నా యసురవిభుడు
దాచియుంచిన కనుగొని తత్క్షణమ్మె. 215

తే. అగణితమ్మైన నా సైన్య మంత నీకు
వశము గావించి అనిలోన వాని తలలు
వరుసగా నీవు ధరగూల్చు వరకు నేను
పోను నిదురని మా నేత పూనె ప్రతిన. 216

తే. దానిలో భాగముగనె ఉద్దండులైన
ధీరవానరవరుల నల్దెసల కంపె
నందు దక్షిణ వారాశి ననిలదేవు
కరుణచే దాటివచ్చి ని న్గంటినమ్మ! 217

తే. కొంత శ్రమయైన నీ జాడ నింత త్వరగ
నరయ గల్గితి నన్న సంబరము కన్న
ప్రాణసముడైన నాథుని బాసి నీవు
పడెడు కడగండ్ల గని గుండె భగ్గు మనియె. 218

తే. దనుజ రాజేంద్రు డనుచర గణముతోడ
ప్రొద్దుపొడువక ముందె నీ యొద్దజేరి
వాని ఘనతలు వరుసగా వల్లెవేసి
నిన్ను హింసించు టరసితి కన్నులార. 219

సీ. అతిలోక సుందరి వని నిన్ను వర్ణించి
పలుమార్లు ప్రాధేయపడిన యపుడు
నా ప్రేమకాన్కగా నాకమ్మునే నీకు
తెచ్చి యిచ్చెద నంచు తెలిపినపుడు
అడవులందున ఆకు లలములు మేయు వా
డని రామునే తూలనాడినపుడు
కడసారిగా నన్ను కాదన్నచో నీకు
మృతి తప్పదని హెచ్చరించినపుడు

తే. అలలవలె బొంగు దుఃఖమ్మునణచు కొనుచు
కొంచె మేనియు ధైర్యమ్ము గోలుపోక
పదితలలవాని కొక గడ్డి పరకతోడ
బుద్ధిచెప్పిన సరణి యపూర్వ మమ్మ! 220

ఆ. నిప్పుకణికవంటి నీదు సతీత్వమే
లంకలోన రామరక్ష నీకు!
విమలచరిత! నీ పవిత్ర సందర్శన
భాగ్యఫలమె ముక్తి పథము నాకు. 221

తే. వాయుదేవుని మేలి దీవనల వలన
అంజనాదేవి గర్భమం దవతరించి
మాన్యసుగ్రీవు కొలువులో మంత్రి నౌట
నెంతొ ఘనతగ నెంచితి నిన్నినాళ్ళు. 222

ఆ. కాని నేడు నిన్ను గలసి నీ సేమము
స్వామి కెరుగజేసి సత్వరముగ
నిద్ద రొక్క టగుట కేను సాధన మౌట
అంతకన్న పున్నె మని తలంతు. 223

తే. దినకరుని జూచి నా చిన్నతనమునందు
పండుగా నెంచి యెగసి నే పట్టబోయి
కాల్చుకొంటిని దవడ లాకారణమున
అందరును నన్ను హనుమంతు డందురమ్మ! 224

ఆ. ఇనతనూజునొద్ద నను మించు యోధులు
ధర్మనిరతు లగణితముగ గలరు;
వారు కన్ను లురుమ వారాశి కెరటాలు
తలలు వంచి స్వాగతమ్ము పలుకు. 225

తే. అందుచే నీవు కడగండ్ల నన్ని మరచి
కొన్ని దివసమ్ము లోర్మి గైకొనుము తల్లి!
మనుజనాథుడు కపివీర గణముతోడ
వచ్చి లంకేశు చంపి నీ వగపు దీర్చు. 226

ఆ. అంత దనుక నిచ్చ టాగలేనని నీవు
దలతువేని లెమ్ము! తత్క్షణమ్మె
గగనమార్గమున సుఖమ్ముగా గొంపోయి
నిన్ను స్వామి చెంత నిలుపగలను." 227

తే. పవనతనయుని భక్తి భావమును మెచ్చి
ఆత్మలో వాని పలుమారు లభినుతించి
తరుణి సీతమ్మ పుత్రవాత్సల్య మెసగ
పలికె నీరీతి తేనియ లొలుకు నటుల. 228

తే. "నీవు సుఖముగ నన్ను గొంపోవగలవు
స్వామి కర్పించి నా చింత బాపగలవు
కాని... మా జీవితము నరకమ్ము జేసి
మిడిసిపడువాని జంపక విడువ దగునె? 229

తే. అట్టి యూహను గూడ నాయాత్మవిభుడు
సమ్మతింపడు కావున సంగరమున
పగతు దెగటార్చి నన్ను చేపట్టు మనుచు
విన్నవింపుము స్వామికి విబుధవినుత! 230

తే క్షాత్ర మేపార దుష్టశిక్షణ మొనర్చి
విజయలక్ష్మీసమేతుడై వేగ వచ్చి
స్వామి నను జూచి రెండు హస్తములు సాచి
పిలుచు లగ్నమ్ము వరకు నే వేచియుందు. 231

తే. అందముగ నున్న దన్న పేరాసతోడ
పసిడి జింకను దెచ్చి నా కొసగు మనుచు
పట్టుబట్టి నే కోరుట వలన గాదె
స్వామి కెనలేని కష్టాలు సంభవించె. 232

ఆ. తల్లి పగిది నన్ను తండ్రిగా రాముని
దలచి భక్తి గొలుచు ధర్మ చరితు
నోట బలుక రాని మాటల దూషించి
చేయరాని తప్ప చేసినాను. 233

ఆ అగ్రజునిది కాదు ఆ ఆర్తనాదమం
చనుచు మరది మొత్తుకొనిన వినక
కోరి మూటగట్టుకొనిన పాపమ్ము నే
ననుభవించు చుంటి ననుదినమ్ము." 234

తే. ఉర్విసుత యట్లు కనుల నీ రొలుకునట్లు
గద్గదధ్వని బల్కిన కరణి నరసి
పవనతనయుని కనుల నశ్రువులు పొంగె
నంత నా తల్లి నాత డిట్లనునయించె. 235

తే "భర్త కేమాయెనో యన్న భయముతోడ
నాడు నీ వన్నమాట లానాడె మరచి
అగ్రజుని సేవకే నిత్య మంకిత మయి
రణమునకు సిద్ధ మగుచుండె! లక్ష్మణుండు. 236

తే. అందుచే నీవు జరిగిన దంత మరచి
అన్నిటికి రాము డున్నా డటంచు దలచి
భయము విడి నన్ను దీవించి పంపు మమ్మ!
కోటిశుభములు నీ కొనగూడు నమ్ము!" 237

తే. అనుచు ముకుళితహస్తుడై హనుమ పల్కి
నట్టి కమ్మని మాటల నాలకించి
మానినీమణి తన శిరోమణిని దీసి
చిర్నగవు తోడ నాతని చేతి కిచ్చె. 238

తే. హనుమ ఆ దివ్యమణిని మహాప్రసాద
మనుచు చేకొని సీతమ్మ కంజలించి
అడుగకయె యిచ్చితివి తల్లి ఆనవాలు
స్వామి నలరింప నీ విభూషణమె చాలు. 239

క. అని యాంజనేయు డామెకు
వినయమ్మున దెలియజేసి, విదుషీమణి! నే
జనియెద నీ సేమము రా
మున కెరిగింపంగ ననుచు ముదమున వెడలెన్. 240

ఆ. పవనసుతుడు తన్ను పలుకరించిన తీరు
రామునెడల నతని స్వామి భక్తి
దలచుకొనుచు సీత తన కూర్మినాథుని
ముద్దుటూహలందు మునిగిపోయె. 241

తే. కరువలిసుతుండు వనమంత కలయ దిరిగి
ఒక్కచో నిల్చి ప్రభువు నా కొప్పజెప్పి
నట్టి పని పూర్తి జేసితి నైన తిరిగి
వెళ్ళుటకు ముందు రాక్షసవీరవరుల. 242

తే. ఘనత యేపాటిదో కనుగొనుట మేలు
వైరిబల మెంతొ? దెలిసికో వలయునన్న
వేగ వారిని నేను కవ్వించవలయు!
నందు కొక్కటె మార్గ మటంచు దలచి. 243

సీ. పచ్చపచ్చని చెట్లు పొదులతో కూడ
పెరిగి అంబుధిలోన విసరివేసి
వనికి అందము బెంచు స్వర్ణ మండపముల
కాలితో నవలీల గూలదన్ని

పూల పర్వతముల బోలు నికుంజము
లిమ్ముగా నేలమట్టమ్ము జేసి
మణిగణ స్థగితమౌ మదనాలయమ్ముల
పిడికిళ్లతో మోది పుడమి గూల్చి

తే. రావణాసురుకేళీ విలాసములకు
నాట పట్టగు మేలి జలాశయమ్ము
లాదిగా నేత్రపర్వమ్ము లౌచు వెలయు
సకల సౌందర్యములను ధ్వంసమ్ము జేసె. 244

తే. హనుమ బీభత్స కృత్యమ్ము లడ్డగింప
యత్న మొనరించినట్టి సాహసుల నెల్ల
హతము గావించి యెలుగెత్తి ఆర్భటించి
పలికె తొలియుద్ధమునకు మేల్కొలుపు నతడు. 245

ఆ. చింతలోన మునిగి చెట్టునీడను నున్న
కలికి సీత బెదరి కనులు దెరచి
తాను గూరుచున్న తరువును దర్శించి
వనము నెల్ల గూల్చె హనుమ యనుచు. 246

ఆ. దీనివలన నేమి హాని వాటిల్లునో
యన్న బెంగతోడ నున్న సీత
నరసి పవనసుతుడు బిరబిర మకరతో
రణము డిగ్గి వచ్చి ప్రణతు లొసగి. 247

ఆ. నీకు జెప్పకుండ నే జేసినట్టి సా
హసము వలన మేలె యబ్బు మనకు
నింక మీద కదన మే రీతి నడచునో
కలత మాని నీవు కనుము తల్లి! 248

ఆ. అనుచు నవనిసుతకు హనుమ ధైర్యము జెప్పి
మూడుమార్లు తోక ముద్దులాడి
మరునిమేషమందె మకరతోరణముపై
కురికి రామనామ ముచ్చరించె. 249

క. అంతట కావలి కాంతలు
చింతయు భీతియును గదుర శీఘ్రమ్ముగ దే
వాంతకు లంకానాథుని
చెంతకు జని తలలు వంచి చెప్పిరి యిటులన్. 250

ఆ. చెప్పదగని వార్త చెప్పక తప్పని
వార్త! దేవ! పెద్ద వానరుండు
సద్దు సేయకుండ చప్పన నరుదెంచి
జానకమ్మ తోడ చాలసేపు. 251

గీతి. సెవిలోన గుసగుసలు సెప్పిండు సామి!
యివరాలు మే మెల్లి యింద మనుకుంటె...
శాంతాడు తోకతో సావమోదిండు!
అంతటితొ ఆగలే దా కొండముచ్చు
ఆడు సేసిన గోర మంతింత గాదు
యేడు పాస్తోంది మీ కినిపిద్దమంటె
యింతకన్నా మేము యివరించలేము!
యెంత పని జరిగిందొ యెల్లి సూడండి!
అని సాగిలంబడిరి అసురవిభు ముందు
దనుజకాంతల గుండె దడకేది మందు. 252

తే. చేడె లాలీల చెప్పక చెప్పినట్టి
మాట లొక్కొక్కటే విని మనసు చెదరి
అసురనాథుడు కుపితసింహమ్ము రీతి
భీకరమ్ముగ గర్జించి పైకి లేచె. 253

తే. ఇంతలో నొక్క క్షతగాత్రు డేగుదెంచి
కాదు! వాడు మామూలు మర్కటుడు గాడు
దనుజ వీరుల పాలిటి దండధరుడు
నిజము దేవర! నన్ను మన్నింపవలయు. 254

తే. సీత కూర్చున్న ఆ ఒక్క చెట్టు తప్ప
మిగల లేదొక్క చెట్టు మీమీద ఒట్టు
వల్లకాడుగ మన వనమెల్ల మార్చి
వెళ్ళి చెప్పర! వేగ మీ విభునకనియె. 255

తే. అనుచు గడగడ వణకుచు నతడు చెప్పి
తనువు వీడెను నోట రక్తమును గ్రక్కి;
పంక్తికంధరు డది గని పండ్లు గొరికి
ఆజ్య మెదపైన బడినట్టి అనలు డాయె. 256

తే. లంక పరువెల్ల నొక్క మర్కటునివలన
కడలి పాలౌట నవమానకర మటంచు
వీరవరులైన నెనుబది వేలమంది
సైనికుల బంపె వానరు జంపుకొరకు. 257

తే. వనము నాశనమైనట్టి వార్త దెలిసి
కూడ రావణు బలగము జాడలేదు!
అసురరక్తము చవిజూచినట్టి తోక
కాలు ద్రవ్వుచు నున్నది కదనమునకు. 258

ఆ. కాన నింక నేను కాలయాపన సేయ
దగ దటంచు పవనతనయు డెంచి
చెలగి భీకరముగ సింహనాదము జేసె
దానవేంద్రు నగరదర్ప మడల. 259

ఆ. సమరమునకు సర్వసన్నద్ధులై తోట
జేరవచ్చినట్టి వీరవరుల
చేతి ఆయుధములు సింహనాదము విని
వణక దొడగె ప్రాణభయము తోడ. 260

ఆ. మకర తోరణమ్మె మహితాసనమ్ముగా
గొప్ప దర్పమునను కొలువుదీరి
తోక ద్రిప్పచున్న భీకరాకారుని
గాంచి దనుజ వీర గణము బెదరి. 261

తే. అడుగు ముందుకు వేయు ధైర్యమ్ములేక
ఉన్న చోటనె నిలబడి "యోరి కోతి!
తోరణ ద్వారమును దిగిరార! వేగ
పీక కన్నను ముందుగా తోక దునిమి. 262

తే. దానినే మేము నీకురి త్రాడు జేసి
సీత కూర్చుండి యున్నట్టి చెట్టు వద్ద
కంఠమున కింత నొప్పియు గలుగకుండ
కాలు సదనమ్మునకు పంపగలము నిన్ను." 263

తే. దనుజగణముల యపహాస్యమును గ్రహించి
అనిలనందను "డోరోరి! అధములార!
రామభద్రుని దూత వాలమును దాకి
భగ్గుమని మండిపోకుండ బ్రతుకతరమె? 264

తే. రండు మీ పీచ మడచి సంద్రమును దాటి
నేను బోవలె స్వామి సన్నిధికి వేగ"
ననుచు వాలము బెంచి రాముని దలంచి
తివిరి గర్జించె హనుమ నల్దిక్కు లడల. 265

ఉ. వెంటనె రెచ్చిపోయి యరివీర గణ మ్మతిభీకరమ్ముగా
మంటలు గ్రక్కు శస్త్రముల మారుతిపై గురిపెట్టి వేయుచున్
"తుంటరి వానరా! విరులతోటను ధ్వంస మొనర్చి ప్రేలు నీ
వంటి దురాత్మకుండు మన వచ్చునె? చత్తువు కాచుకొమ్మికన్." 266

ఆ. అనుచు హెచ్చరించి ఆకొని గాండ్రించు
పులుల వోలె పవనపుత్రుపైకి
దుమికి యేకధాటి దోర్గర్వ మేపార
నని యొనర్పసాగె నసురగణము. 267

తే. వేల రాక్షస వరులు గుప్పించినట్టి
అస్త్రశస్త్రమ్ము లన్నియు నద్రివంటి
హనుమదేహము తాకిడి కాగలేక
సోలి పాదాల ముందు దాసోహ మనియె. 268

క. అంతట హనుమంతుడు తన
పంతము నెరవేరునటుల పగతుర నపుడే
అంతము గావించుటకై
అంతము లేకుండ బెంచె నాతని తనువున్. 269

సీ. వాయుతనూజుండు వాలమ్ముతో మోది
కొందరు యోధుల గూల్చెనేల
పదతాడనమ్ముల నెదలపై గుప్పించి
కొందరు వీరుల గూల్చెనేల
తొడ దట్టి లంఘించి పిడికిళ్లతో గ్రుద్ది
కొందరు శూరుల గూల్చెనేల
గిరులు తల్లడమంద శిరముతో ఢీకొట్టి
కొందరు ధీరుల గూల్చెనేల

తే. కీళ్లు విరిగిన రథముల కేలనెత్తి
అవియె గదలుగ విసరుచు నసురవరుల
తరిమి వెంటాడి వేటాడి ధరను గూల్చి
రణమున కొసంగె కొంత విశ్రాంతి హనుమ. 270

ఆ. ఇంతజేసిగూడ ఇసుమంత అలయక
మకర తోరణమును మరల జేరి
సీత మురియు లీల సింహనాద మొనర్చి
గోళ్ళు గిల్లుకొనుచు గూరుచుండె. 271

ఆ. పోరు గెలిచినట్టి మారుతి హుంకార
రవము చెవిని బడియె రావణునకు
వినిన తోనె వాని వీరము పడగెత్తి
పుడమి దద్దరిల్ల బుసలు కొట్టె. 272

తే. ఎప్పు డపజయ మనునది యెరుగనట్టి
వేల రాక్షస యోధులనేల గూల్చె!
నొక్కవానరు డేమిటీ యుప్పెన యని
కలవరము జెందె లంకేశునిలయ మెల్ల. 273

ఆ. అంత దానవేంద్రు డతి బలశాలియు
అంతరంగికుండునైన జంబు
మాలి జేర బిలిచి మర్కటాధము బట్టి
మట్టుబెట్టకుండ కట్టి తెమ్ము. 274

ఆ. అనుచు నానతిచ్చె నాతడు చతురంగ
బలసమేతు డగుచు బవరమునకు
గణుతి కెక్కినట్టి ఖరముల బూన్చిన
అరద మెక్కి చనియె హనుమ కడకు. 275

తే. వాని ఆర్భాటమును గాంచి వనచరునకు
సంబరముగల్గె చేతికి చాలినంత
మేత లభియించె నని వేగ మేను బెంచి
వీరవరులార! మీరు నా విందునేడు. 276

క. అని పవమానతనూజుం
డని నంతనె జంబుమాలి ఆగ్రహపరుడై
వనచర! ప్రేలకు మతిగా
నిను జంపక పట్టి కట్టినే గొంపోదున్. 277

ఆ. అనుచు నసురయోధు డర్ధచంద్రాకార
బాణ మెక్కుపెట్టి పవనసుతుని
ముద్దు లొలుకు నట్టి మోముకు గురిపెట్టి
వదలె భీషణముగ వసుధబెదర. 278

తే. దనుజ వీరుని శరవర్ష ధాటివలన
హనుమ నెమ్మోము కంది రక్తాంబుజమ్ము
పగిది భాసిల్లెనే గాని పగుల లేదు
చకితుడైపోయె నది గాంచి జంబుమాలి. 279

సీ. ఆంజనేయుడు దాని నవకాశముగ గొని
వికసించి నట్టి కౌతుకము తోడ
ఇరు జబ్బలను దట్టి యురుగతి లంఘించి
పెను బండలన్నూడ బెరికి విసరి
రథగజ తురగాదులను కుప్పగూలిచి
అంతట తా నౌచు నార్భటించి
బాణ వర్షము తనపై గురిపించెడు
వేల సైనికులను నేల గూల్చి

తే. మంట లెగజిమ్ము శస్త్రముల్ మార్చి మార్చి
సరగ సంధించు చున్నట్టి జంబుమాలి
రథముపై దూకి వాని దోర్గర్వ మణగ
బలిమి మైబట్టి కుత్తుక నులిమి చంపె. 280

తే. అతి భయంకర దుర్వార్త నాలకించి
దనుజనాథుని పదితలల్ తల్లడిల్లె!
అడుగులొకచోట నిలువక ఆర్భటించి
మంత్రి తనయుల నేడ్గుర మరల బంపె. 281

తే. ఏడు రథముల నేడుగు రెక్కినిక్కి
కలసి కదలిరి మందిమార్బలముతోడ
కాని వారందరిని గూడ కపివరుండు
జంబుమాలికి తోడుగా సాగనంపె. 282

తే. అటుల రావణు డంపెడు యసురవరుల
నొక్కరుని గూడ వదలక మొక్క కోతి
వరుసగా మట్టుబెట్టెడు పైన మెరిగి
కోరకయె వచ్చె నక్షకుమారు డపుడు. 283

తే. యుద్ధ సన్నద్ధుడై వచ్చి యురుకుచున్న
సుతుని గనుగొని రావణాసురుడు మురిసి
పొమ్ము! తత్క్షణ మాకోతి పొగ రడంచి
కట్టి తెమ్మని తెలిపెను కనులతోనే. 284

ఆ. తండ్రి క్రోధమెల్ల తన అస్త్రశస్త్రాల
కలది చిత్రగతుల నమరియున్న
అరద మధివసించి అక్షకుమారుడు
కదలె హనుమతోడి కయ్యమునకు. 285

తే. తోక నాడించు కొనుచు నశోకవాటి
వాకిటంగల తోరణద్వారమందు
కూరుచుండిన మారుతి పోరు గోరి
దరికి వచ్చెడు నసుర బృందమును గనియె. 286

తే. కోటి దీపమ్ము లొకచోట కొల్వుదీరి
నట్లు కాంచనరథ మందు నలరుచున్న
రావణుని కూర్మి తనయు విరాజమాన
రూప మంజనాసుతుని కల్లోలపరచె. 287

తే. దూరమందుండి ధీరగంభీరమైన
పవన తనయుని మోమున ప్రజ్వరిల్లు
దివ్యతేజస్సు నారసి దిగ్భ్రమమ్ము
జెంది దనుజేశుసుతుడు నిశ్చేష్టు డాయె. 288

ఆ. సైన్య మెంతయున్న సమరానుభవమున్న
గొప్ప ఆయుధముల గుట్టలున్న
వేనవేల దనుజవీరుల బలిగొన్న
సాహసికుని గెల్వ సాధ్య మగునె? 289

సీ. ఎదుటి వాని బలమ్ము నెరిగి పోరకయున్న
అపజయ మ్మొదవునటన్న భయము
యుద్ధతంత్రమ్మును వ్యూహమ్ము లేకుండ
నరివీరు గెల్వ లేమన్న భయము
నడయాడు కొండపై తొడ దట్టి లంఘించు
టతిహానికరమౌ నటన్న భయము
బలపరాక్రమములే బవరాన విజయమ్ము
నందించజాల వటన్న భయము

తే. మారుతికి అక్షునకు నొక్కమారె గలిగి
యొక్క నిముసము కన్నార్ప కొకరి నొకరు
జూచుకొని యంతలో కడు చోద్య మెసగ
మేలుమేలని సిద్ధమై రాలమునకు. 290

తే. అనిల తనయుని పటు భీకరాకృతిగని
అక్షు డిక జాగు చేయరా దని తలంచి
స్యందనము తోడ తానాకసమున కెగసి
అస్త్రవర్షము కురియించె హనుమ పైన. 291

తే. పవన తనయుని మేరు పర్వతము వంటి
మేన గురిసిన అక్షుని బాణవృష్టి
తప్తలోహమ్ముపై బడి తల్లడిల్లు
చినుకులైపోయె! మిగుల విచిత్రముగను. 292

తే. అయిన జంకక దెబ్బదిన్నట్టి చిరుత
పగిది చెలరేగి మరల రావణుని తనయు
డాంజనేయునిపైకి దివ్యాస్త్రములను
వడిగ గుప్పించి నొప్పించె నొడలినెల్ల. 293

తే. మొదటిసారిగ రక్తపు బొట్లు మేన
జాలువారుట బొడగని గాలి కొమరు
డిక నుపేక్షించ దగదని యెగసి తన్ని
రథమునకు గట్టియున్న గుర్రముల గూల్చె. 294

తే. పిదప పిడికిట సారథి పీచ మడచి
రథము ముక్కలు గావించి లాఘవమున
దనుజనాథుని ముద్దుల తనయు కాళ్ళ
నొక్కసారిగ కుడిచేత నొడిసిపట్టి. 295

తే. గరుడు డొక మహాసర్పమున్ గాలిలోన
త్రిప్పినట్లుగ గిర గిర త్రిప్పి త్రిప్పి
పవనతనయుడు జై రామభద్ర యనుచు
వేగ అక్షుని పుడమిపై విసరి కొట్టె. 296

ఆ. నింగియంచునుండి నేలపై బడుటచే
ఉదయభాను సముని యొడలు చితికి
మిత్తి చేతిలోని నెత్తురు ముద్దాయె
అరయువారి గుండె లవిసి పోయె. 297

ఆ. తండ్రి పాపమునకు తనయుడు బలియాయె
ననుచు చెమ్మగిల్లె హనుమ కనులు
అకట! బాల భాను డస్తమించె నటన్న
చింతతోడ లంక చెన్నుదరిగె. 298

ఆ. సుతుని ఘోరమరణ మతిలోక భీకరు
డైన దనుజ విభున కంతులేని
శోక మెదను నింపె కాకులే లోకులై
అయ్యొ పాప మనుచు నరువదొడగె. 299

ఉ. తమ్ముని చావు వార్త విని తల్లడ మందిన ఇంద్రజిత్తు తా
నమ్ముల కొండయై యురికి యక్షకుమారుని మాటిమాటికిన్
నెమ్మదిలో దలంచుకొని నెత్తినిబాదుక దివ్యరాజ సౌ
ధమ్మున దీనుడై కుములు తండ్రిని జూచె విషాదతప్తుడై. 300

తే. దుర్నిరీక్ష్యుని కనులలో దుఃఖజలము
నరయు దుర్గతి లంకకే దుష్టువలన
దాపురించెనో వానిని రూపు మాప
వెడలుచున్నాడ తండ్రి దీవింపు! మనియె. 301

తే. అంత దానవనేత విప్పారినట్టి
కనుల పుత్రుని గనుగొని కౌగిలించి
నుదురు ముద్దాడి "నేడు నిన్ కదనమునకు
భారమైనట్టి మనసుతో బంపుచుంటి. 302

తే. అమరనాథుని గెల్చిన అస్త్రబలము
బ్రహ్మవరముగ నిడిన దివ్యాస్త్రబలము
ఆ మహావానరము తోడి యాహవమున
నీకు విజయమ్ము చేకూర్చు నిశ్చయముగ." 303

తే. అనుచు దీవించి రావణు డగ్రసుతుని
సాగనంపెను వేగ నా శౌర్యధనుడు
భూరి భీకర సింహముల్ బూన్చినట్టి
అరద మధిరోహణము జేసి యరిగె ననికి. 304

సీ. అరి భయంకరమైన వరవీరగణముతో
రాజిల్లు తులలేని రథబలమ్ము!
ముల్లోకముల సైత మల్లకల్లోలమ్ము
గావించ గల మేటి గజబలమ్ము!
వాయువేగమ్మున వైరి వర్గముపైకి
లంఘించునట్టి తురంగబలము!
శత్రుసంహారమే శ్వాసగా జీవించు
కండలు బలిసిన కాల్బలమ్ము!

తే. వెంట నడువగ జగమెల్ల వెరగుపడగ
భేరి కాహళనాదముల్ మారుమ్రోగ
మేఘనాదుడు కదలె నమేయమైన
కసిని మీసాల కలది మర్కటుని పైకి. 305

ఉ. అప్పటి దాక వాయుసుతు డమ్మను జూచిన మేలివార్త నే
నెప్పడు ఋష్యమూకమున కేగి సరాసరి రాముజేరి నీ
యొప్పలకుప్ప సేమముగ నున్నది రావణు లెక్కసేయకం
చెప్పడు దెల్పి స్వామి శ్రవణేంద్రియముల్ ముదమంద జేతునో! 306

తే. అన్న యాలోచనల దేలియాడు హనుమ
కడలి ఘోషను దలపించు కరణి వడిగ
దనుజసైన్యము సలిపెడు రణనినాద
ములను నాలించి కనులెత్తి ముందు జూచె. 307

తే. ఇంద్రు నవలీల గెల్చిన 'ఇంద్రజిత్తు'
సర్వసైన్య సమేతుడై సమరమునకు
వచ్చుచున్నాడు తనపైకి హెచ్చినట్టి
రోషమున నని యెంచి మారుత సుతుండు. 308

తే. వీని హతమార్చినట్లైన దానవేంద్రు
శక్తిసామర్థ్య సంపత్తి సగము చచ్చు
పిదప సీతమ్మ చెర విడిపించు కొరకు
బవర మనివార్యమైనను భయము లేదు. 309

తే. మంచి అవకాశ మిదియని మరునిముసమె
భీషణ నినాదమును జేసి భీకరముగ
వాల మల్లన నల్లార్చి వాయుసుతుడు
దేహమును బెంచి గర్జించె! దిక్కు లదర. 310

తే హనుమ గర్జన విననంత ఆకసమ్ము
సురవరేణ్యులతోడ క్రిక్కిరిసిపోయె;
బిడ్డ చెర యిక త్వరలోనె వీడునంచు
పుడమితల్లియు పులకించి పొంగిపోయె. 311

తే. మేఘనాదుడు నిర్జర మేఘములను
ఆకసమ్మున దిలకించి యబ్బురపడి
అగ్నికీలల వంటి దివ్యాస్త్రములను
అవిరళమ్ముగ గుప్పించె హనుమపైన. 312

ఆ. పవనసుతుడు తండ్రివలె తాను సైతము
నింగినొక్కచోట నిలువకుండ
ఇంద్రజిత్తు బాణ మేదియు తన్నంట
కుండ దిరిగి తప్పకొన దొడంగె. 313

తే. అస్త్రములు వైరి చాకచక్యమ్ము వలన
లక్ష్యమందకయే నేల రాలు టరసి
మొదటిసారిగ బవరాన బోయె పరువు
ఎత్తుగడ మార్చ దగు నని యింద్రజిత్తు. 314

తే. కొంత యోచింప దొడగె నా తంతు జూచి
ఇదియె సరియైన తరియని మదిని దలచి
పవనతనయుడు రెండు బాహువులు సాచి
యింద్రజిత్తును బట్టంగనెంచె గాని. 315

తే. అతడు సామాన్యదనుజుడా? హనుమ యుక్తి
తా నపుడె పసికట్టి పితామహుండు
తన కొసంగిన బ్రహ్మాస్త్రమును గ్రహించి
భక్తి నర్చించి మంత్రించి వదలిపెట్టె. 316

తే. తనను కాలసర్పమువలె దరుముచున్న
అ మ్మహాస్త్రము బ్రహ్మాస్త్ర మని గ్రహించి
వనజసంభవు డొసగిన వరము నెంచి
కట్టువడె తానె దానికి గౌడ్డుపట్టి. 317

తే. అదియు తన మంచికేయని యసురనాథు
తనయు డెద నెంచె నేలన? తండ్రిచేత
మరణదండన పాలయి మడియు నితడు
దానితో పీడ విరుగడయౌ నటంచు. 318

తే. అనిలసుతుడును నిదియె మే లనుచు దలచె
నేలయన రావణాసురు మ్రోలనిల్చి
వాదమున వాని నేను గెల్వంగ వచ్చు
అతని ధీశక్తి యెట్టిదో అరయవచ్చు. 319

ఆ. చంపలేకపోతి శత్రువునను బాధ
యింద్రజిత్తు మదిని నెంతయున్న
అర్ధవిజయమైన యబ్బిన దది చాలు
ననుచు తృప్తిపడియె నంతవాడు. 320

తే. హనుమయును నట్లె దలచె నీ ఘనుని తోడి
కయ్యమున మేను గోల్పోక కట్టువడితి
నర్థవిజయము నాకబ్బె నంతె చాలు
నని సమాధానపడియె చేయునది లేక. 321

తే. గర్జనలతోనె రాక్షస గణము నెల్ల
అడలగొట్టుటెగాక సహస్రయోధ
వరుల బలిగొన్న దుష్టవానర మృగమ్ము
బందిగా జిక్కెనన్న సంబరముతోడ. 322

తే. కాలపాశమునకు తానె కట్టువడిన
వీరమర్కట యోధుని వీథివీథి
ద్రిప్పి చూపుచు చూడు మా దెబ్బ యనిన
చందమున విర్రవీగెను సైన్యమెల్ల. 323

సీ. తలను రోకళ్లతో దంచి పచ్చడిజేసి
మెక్కెద మను కేక లొక్కప్రక్క...
వీని ప్రేగులు ద్రెంచి నూనెలో వేయించి
మెక్కెద మనుకేక లొక్కప్రక్క...
కత్తితో మెడగోసి నెత్తురే కూడుగా
మెక్కెద మను కేక లొక్కప్రక్క...
నిప్పలలో వీని నిలువెల్ల గాలిచి
మెక్కెద మను కేక లొక్కప్రక్క...

తే. చెవుల మార్మోగు చున్నను చింతపడక
మౌన గంభీర వదనుడై మారుతాత్మ
జుండు కన్నెత్తి యటునిటు జూడకుండ
నగర వీథుల వెంబడి నడువ దొడగె. 324

సీ. వీడు నామెడలోని తాడు దెంచె నటంచు
పెటపెటమెటికలు విరిచె నొకతె
వీడు నా కోడలిన్ విధవనుగావించె
నని యేడ్చి తలబాదుకొనియె నొకతె!
వీడు నా బిడ్డకు పాడె గట్టించిన
అంతకుం డని తూలనాడె నొకతె!
వీడు సామాన్యుడు గాడని కసికొద్ది
గొడ్డు కారము పైన గొట్టె నొకతె!

ఆ. ఇటుల దనుజ కాంత లెంతగా తన్నాడి
పోసికొనుచునున్న వీసమెత్తు
కినుక గొనక వినుచు తన కవి దీవెన
లనుచు మురిసిపోయె ననిలసుతుడు. 325

సీ. బలవంతుచేతిలో బందిగ జిక్కితి
ననుబాధ యిసుమంత యైన లేదు!
పురవీథులన్ని క్రిక్కిరిసి కండ్లురిమిన
తన కండ్ల మెరుపింత తగ్గలేదు!
దనుజేశుడే శిక్ష తనకు విధించునో
యనుచింత ఆవగింజంత లేదు!
కాయ మెల్లను శరాఘాతాల మయ మైన
నడకలో దర్పమ్ము సడలలేదు!
తే. చూడలేదిట్టి వీరు నేనాడు లంక
దనుజనగరికి పెనుముప్పు తప్ప దింక
ననుచు కొందరు గుసగుసలాడుకొనుచు
మంచి చెడ్డల కలసి తర్కించుకొనిరి. 326

ఆ. ఎంద రెన్నియున్న కొందరే మనుకొన్న
వాని సరకు గొనక వాయుసుతుడు
పందెమునకు నురుకు నందీశ్వరునివోలె
వేగనడచె దనుజవిభుని కడకు. 327

ఆ. పవన సుతుని తోక బట్టుక పరువెత్తు
నసురు లపుడు కొంద రలసి సొలసి
తోక వదలి నేల దొరలాడుటను గాంచి
పొట్టపగుల నవ్వె పుడమితల్లి 328

ఆ. కుంటుకొనుచు లేచి యింటికి బరుగిడు
భటుల నరసి వారి భార్య లెల్ల
చీపురెత్తికొట్టి చీవాట్లు దినిపించి
దీన లట్లు తలలు దించుకొనిరి. 329

తే. పిరికిపందను పెండ్లాడి పృథ్విలోన
నేండ్లు పూండ్లును జీవించ నేమి ఫలము?
ఇట్టి మగవాని కాలుగా నేడునాళ్ల
బ్రతుకు చాలని తలచిరా పడతు లెల్ల. 330

ఆ. ఎడద యుద్ధభూమి యొడలంత మగసిరి
కనులు మేలి నీలమణుల ఖనులు
ఇట్టి వాని జాతి యేదైన నేమాయె
నెంత మంచి విందు ఇతని పొందు. 331

ఆ. అనుచు కొంద రసుర వనిత లా తేజస్వి
లలిత లక్షణముల దలచుకొనుచు
కమ్మనైన పగటి కలలందు దేలుచు
మరచిపోయి రెల్ల పరిసరములు. 332

ఆ. ఇంద్రజిత్తు సైన్య మినకులేశ్వరుదూత
నటులె కట్లతోడ నసురవిభుని
కొలువు కూటమునకు బలవంతముగ జేర్చి
ప్రభువు ముందు నిలిపి ప్రణతు లిడియె. 333

తే. రత్న సింహాసనమున విరాజమాన
ధీర గంభీర వదనుడై గూరుచున్న
కన్న తండ్రికి వీర మర్కటుని జూపి
యిటుల వచియించె శిరమెత్తి యింద్రజిత్తు. 334

క. "జనకా! యీ మర్కటుడే
వనమెల్లను పాడుచేసి భయ రహితుండై
యనుజుని పెక్కురు దైత్యుల
దునుమాడిన పొగరుబోతు దుష్టుడు కనుమా! 335

తే. కదనమున వీని జంపక కట్టి తెచ్చి
యెదుట నిలబెట్టినాడ నీ యిచ్చవచ్చి
నట్టి శిక్షను విధియించి యసురమాత్య
గర్భ శోకము వేగ బోకార్చు తండ్రి!" 336

క. అని చెవి కింపుగ బలికిన
తనయుని పలుకులకు మురిసి దనుజేంద్రుడు తా
ననిల సుతు కన్నులార్పక
గనుగొని లోలోన కొంత కలవర మందెన్. 337

సీ. నిర్మల ద్యుతులీను నెమ్మోము వేద సం
స్మృతికాలవాలమై చెలగుచుండె!
సువిశాల నేత్రాల రవితేజమును మించు
ఉజ్జ్వలకాంతి పెల్లుబుకుచుండె!

ఉరము నందీశ్వరు స్థిరనివాసమ్మైన
కైలాస పర్వత కరణినుండె!
ఊరువుల్ మయశిల్పి యుక్కున జెక్కిన
ఆలయ స్తంభము లటులనుండె!

తే. ఇన్ని శుభలక్షణమ్ముల నెసగు చున్న
నీతడొక మర్కటుం డని యెంచుటెట్లు?
వానరాకృతి నింద్రుడు బంపినట్టి
దేవతామూర్తి యనెడు సందియము గలుగు. 338

ఉ. ఎంత విచిత్రమీ ఘటన! మెన్నడునిట్టి మనోవికార మా
వంతయు నంది యే నెరుగ! వానరు నొక్కని జూచి నేడు నా
స్వాంతము దిగ్భ్రమమ్ముగనె! చాల వినాశము దెచ్చి పెట్టె నీ
ఘాతుకు డంచు దేవగణ ఘాతుకు డెంచెను భీతచిత్తుడై. 339

తే. మొదటి సారిగ రావణుమోమునందు
ప్రజ్వలించెడు వీర విక్రమము లరసి
వర్ణనాతీత దివ్యరూపమ్ము నరసి
మారుతాత్మజు డిటు లెంచె మనమునందు. 340

సీ. దినకరుం డాకాశదేశమ్ము విడి లంక
సింహాసన మ్మధిష్ఠించినటుల
కడగంటి చూపుతో కైలాసగిరినైన
గడగడ వణకింప గలిగినటుల
చూపుడు వ్రేలితో సురనాథు నెద నగ్ని
కీలలు సృజియింప జాలినటుల
కదన భీకరమైన ఖడ్గ రాజమునకు
తానె భూషణమౌచు దనరు నటుల

తే. సచివసామంత హిత జన జలధి నడుమ
మేరు పర్వత మటు కొల్వుదీరి యున్న
మహితధీశాలి కీయధర్మ ప్రవృత్తి
లేక యుండిన నేలు ముల్లోకములను. 341

క. అని లోలోన దలంచుచు
మునివినుతుడు హనుమ మౌన ముద్రాంకితుడై
తనునరయు చుండుటం గని
దనుజేంద్రుం డిట్టు లనియె దర్ప మెలర్పన్. 342

ఉ. ఎక్కడనుండి రాక? గతమెయ్యది వీనికి? వార్ధి దాటి తా
నిక్కడికెట్లు వచ్చె? అస లెందుకు వచ్చె? నశోక వాటిలో
దిక్కును మొక్కు లేక కడు దీనత గుందుచునున్న, సీతపై
మక్కువ వీని కేల? యని మా హృదయమ్మి దెరుంగ గోరెడిన్. 343

ఆ. ఇంత సాహసమ్ము నీత డెందుకు జేసె?
నేల అనికి బిల్చి యిన్నివేల
దనుజవరుల జంపె నను ప్రశ్నలకు సమా
ధాన మరయ వలయు తత్క్షణమ్మె. 344

తే. అనుచు సభ్యుల కుత్కంఠ యతిశయించు
నటుల వచియించి మంత్రి ప్రహస్తు జూచి
అన్ని వివరాలు రాబట్టు డతని నుండి
యవల దెల్పెద తీర్పని యానతిచ్చె. 345

తే. అటుల లంకాపురాధీశు డనినయంత
మంత్రివర్యుడు మారుతాత్మజుని జూచి
"వానరాకృతి నున్న నిన్ వనచరునిగ
నెంచ జాలము నిజము నీ వెరుగ జెపుమ; 346

తే. వివరముల నెల్ల నిర్భీతి విశదపరచి
అసురనాథుని మన్నన లందుకొనుము
ఎవరు పంపగ వచ్చితి విటకు నీవు
వాని యునికిని దెలుపుము త్వరితముగను. 347

సీ. అలకాపురాధీశుడైన కుబేరుని
పనుపున దూతగా వచ్చినావొ?
అమరేంద్రునానతి నసురేంద్రు లోగుట్టు
దెలిసికొనంగ నేతెంచినావొ?
లక్ష్మీధవుడు బంప లంకాపురమ్మందు
చిచ్చు రగుల్ప విచ్చేసినావొ?
దండధరుడె నిన్ను తన గూఢచారిగా
దివిరి పంపగ నేగుదెంచినావొ?

తే. నిర్భయమ్ముగ సభ మెచ్చ నిజము దెల్పి
ప్రభువు మన్నన లంది నీ ప్రాణములను
నిలుపుకొను" మని సచివుండు దెలియజేసె
నగచరుడు విని కనుబొమ లెగురవేసె. 348

తే. "సచివసత్తమ! నేడు మీ సందియముల
బాపి వాస్తవ మెరిగింప వలసినట్టి
బాధ్యతను నేను తలదాల్చి పలుకుచుంటి
కొలువుకూటము నుత్కంఠ దొలగు లీల. 349

ఆ. గొంతు మీది కాని, కోరిక ప్రభువుదే
కనుక దెలియ జేతు దనుజవిభున
కేను వివర మెల్ల వీనుల విందుగా"
నని వచించి హనుమ యనియె నిట్లు. 350

తే. "రాక్షసాధీశ! వినుము నా లంక రాక
వెనుక నింద్రుడు, యముడు, కుబేరు డితర
ప్రముఖు లెవ్వరు లేరు! నే వానరుడను!
వచ్చితిని ఒక్కపని మీద వార్ధిదాటి. 351

తే. కోసలాధీశు ముద్దుల కొమరుడైన
రాఘవేంద్రుని దూతగా లంక జొచ్చి
నీవు చెరబట్టి వనమున నిలిపినట్టి
సీత నారసి ఆ తల్లి చింతబాపి. 352

తే. నిన్ను స్వయముగ దర్శించి నీ వొనర్చి
నట్టి దుష్కృతి వివరించి యఘము దెలిపి
దిద్దుకొన దగు హితవు బోధింప నెంచి
వనము నిర్భీతి బెకలించి వైచినాడ. 353

క. నను జంపగ నీవంపిన
ఘనులను బంపించినాడ కాలుని పురికిన్
వనజభవు నస్త్రమున కే
ననువుగ జిక్కితిని ఇచటి కరుదెంచుటకై. 354

తే. నాల్గు వేదాల నౌపాసన మ్మొనర్చి
బ్రహ్మతత్త్వ మెరింగిన ప్రాజ్ఞమతివి!
యెల్ల లోకాల శాసించి యేల గలుగు
బలపరాక్రమశౌర్య సంపన్నుడవును 355

తే. ఇన్ని యోగ్యత లుండియు నించుకంత
ధర్మచింతన లేక కోదండరాము
సతిని దుర్బుద్ధి చెరబట్టి సాహసించి
తెచ్చి లంకను దాచిన తీరు దెలిసి. 356

తే. కనలి రాముడు ఋశ్యమూకమ్ము జేరి
చేయి సుగ్రీవు కందించి చెలిమిజేసి
వాలి దునుమాడి మిత్రుని వానరాధి
పతిని గావించె కిష్కింధ ప్రస్తుతింప. 357

తే. ఇపుడు సుగ్రీవు సైన్యమా యినకులేశు
నాజ్ఞ మేరకు సీతాపహారి పీచ
మణచ కత్తులు నూరుచు ననికి సిద్ధ
పడుచు నున్నది బుసకొట్టి పడగ లెత్తి. 358

తే. సాహసమె శ్వాసయౌ కపి సైన్యమందు
యుద్ధముల నారితేరిన యోధవరులు
నన్ను మించిన శౌర్య విజ్ఞాన ధనులు
దానవేశ్వర! ఉన్నారు వేనవేలు. 359

తే. అరిభయంకరుడైన రామానుజుండు
పెక్కు బాణమ్ము లొకసారె యెక్కుపెట్టి
పవలు రాతిరి నిద్రను బారద్రోలి
రౌద్రముగ జూచు చున్నాడు లంక వంక. 360

తే. నలుదెసలనుండి పాపాగ్ని వలయ మొక్క
సారి వ్యాపించి లంక నాశన మొనర్చి
నిన్ను వెంటాడుటకు ముందె కన్ను దెరచి
యుచితరీతిని యోచించు టుత్తమమ్ము. 361

తే. జయము ధర్మమ్మునకె యన్న సత్య మెరిగి
నడచుకొనువాడె సుఖమందు పుడమి యందు;
ఇంద్రుడైనను రాముని కెదురు నిలిచి
బ్రతుక గలనని తలచుట పగటి కలయె. 362

సీ. పాపులగుండెలు పరిశుద్ధ మొనరింప
ప్రతినిత్య ముదయించు భాస్కరుండు
తనను నమ్మిన దీన జనకోటి కన్నీటి
నరచేత దుడుచు దయామయుండు
పాదముద్రలచేత వన పర్వతశ్రేణి
పరవశింపగ జేయు పావనుండు
సందేశమాత్రాన సకల భూభ్రమణమ్ము
నాపగలిగిన మహామహుండు

తే. వీరవైరుల చూపుడు వ్రేలితోడ
నదుపుజేసెడు సామర్థ్య మమరువాడు
వినయమే భూషణమ్ముగ విశ్వమంత
ప్రజ్వలించెడు వాడు శ్రీరామవిభుడు." 363

ఆ. అనుచు నప్రియమ్ము లాడెడు హనుమపై
కినిసి కన్ను లురిమి దనుజనాథు
"డాపు మింకచాలు! నధిక ప్రసంగ మీ
వనియె నైన సవినయముగ మరల." 364

ఆ. అనిలతనయు డిట్టు లనియెను "దనుజేంద్ర!
హితవు నప్రియముగ నెంచ దగదు
చివరి మాటకూడ చెవియొగ్గి యాలింపు
మంతవరకు కోప మణచుకొనుము. 365

తే. నారి జానకి నీపాలి నల్లత్రాచు
ఆమె శీలము మండుచున్నట్టి నిప్పు
ఆ సతీమణి హృత్పీఠి నలరునట్టి
పుణ్యపురుషుడు ముల్లోకములకు రేడు. 366

సీ. ధర్మసంస్థాపనార్థమ్ము శ్రీరాముడై
అవతార మెత్తిన హరియతండు
పటుసారమహితమ్ము నిటలాక్షు చాపమ్ము
నవలీల ద్రుంచిన అనఘు డతడు
నిన్ను తోకను జుట్టి నీటముంచిన వాలి
నిలను గూల్చిన మహాబలు డతండు
నిన్నొక్క బాణాన నిహతుజేయం గల
రణభయంకర పరాక్రము డతండు
తే. రామ! రఘురామ! శ్రీరామ! రామరామ!
పాహి మాం పాహి యని వేడ పగతునైన
కరుణతో బ్రోచు నా స్వామి కాన నేడు
రామ తారక మంత్రమే రక్ష నీకు." 367

తే. నిండు సభలోన బందిగా నిలిచియున్న
మర్కటుం డట్లు తన నతికర్కశముగ
హెచ్చరించుట గాంచి సహించలేక
నదియు మరియొక అపరాధ మని తలంచి. 368

తే. దనుజనాథుని కనులగ్ని కణము లాయె
సభ సమస్తము వెరపంది చకితమాయె
నైన నసమాన ధీశాలియైన హనుమ
సహజగాంభీర్య మావంత సడలదాయె. 369

చ. అదిగని తప్ప దింకనని, ఆహవభీముడు రావణాసురుం
డెదుట నొకింత భీతియును, నేమరుపాటును లేక నిల్చి, నీ
కిది తగదన్న చందమున నిచ్చమెయిన్ కనురెప్పలార్చ కే
బెదరక తన్ను జూచు కపివీరుని దర్పము నోర్వలేమిచే 370

చ. పదితల లెత్తి దిగ్గున సభాస్థలి కంపిల నార్భటించి, "మా
హృదయము శాంతినందు నటులీ దురితాత్ము వధించి రక్తమున్
పదుగురు మేలు మే లనగ పట్టణవీథులయందు జల్లి యా
ముదితకు సీత కీ విషయమున్ వెనువెంట నెరుంగ జేయుడీ." 371

తే. అనుచు రాక్షసవీరుల కానతిచ్చి
"కావరమ్మున సల్పిన కలుషఫలము
ననుభవింపుము దుష్టుడా!" యనిన రీతి
ననిలతనయుని జూచె నా యసురనేత. 372

ఆ. రాక్షసాధినేత రాజధర్మమ్మును
మరచి దూత కిడిన మరణశిక్ష
సకలజగతి మెచ్చు చర్య గాదని విభీ
షణుడు మదిని దలచి యనియె నిట్లు. 373

క. "అన్నా! తొందరపడవ
ద్దన్నా! యిత డసురవరుల హత మార్చుట త
ప్పన్నా! దోషిని ఊరక
యెన్నండును వదలు మనుచు నేనన నన్నా! 374

తే. కాని దూతగ వచ్చిన కపివరేణ్యు
జంపినందున శత్రువు చావబోడు;
అదియునుం గాక యే శిక్షయైన ధర్మ
సమ్మతమ్ముగ నుండుట సముచితమ్ము. 375

క. శత్రువు పంపిన దూతను
శత్రువుగా నెంచి వాని జంపినయెడలన్
శత్రుత్వము నశియించునె?
శత్రుని దునుమాడు టొప్ప సమరము లోనన్. 376

తే. నేరముల తత్త్వ మెరిగి యెవ్వారికైన
శిక్ష విధియింప దగుగాని కక్షతోడ
దోషి పూర్వాపరమ్ముల తుది మొదళ్ళు
తెలిసి కొనకుండ శిక్ష విధింప దగదు. 377

సీ. హద్దుమీరిన దూత నపరాధిగా నెంచి
పట్టి వాతలు మేన బెట్టవచ్చు
అణువంత దయలేక నంగవైకల్యమ్ము
వివిధ రూపముల గావింప వచ్చు
తప్పెరింగెడి లీల తలమీది వెండ్రుకల్
గొరిగించి అవమాన పరచవచ్చు
సత్కార మనుపేర స్తంభమ్మునకు గట్టి
కొరడాల దెబ్బలు గొట్టవచ్చు
తే. కనుక నీతని జంపక దనుజనాథ!
ఇతరమగు శిక్ష యేదైన నిపుడె దెలుపు"
మని విభీషణు డనె వినయమ్ము మీర
విని ప్రహస్తుడు బాగుబా గనెడు లీల. 378

క. అనుజుని పలుకులు శ్రద్ధగ
విని దానవచక్రవర్తి వెనువెంటనె మం
త్రిని గని "యీ దురితాత్ముని
ఘనవాలము నగ్నితోడ కాల్చుం" డనియెన్. 379

తే. అనిన వెంటనె దనుజు లనంతమైన
సంబరమ్మున జీర్ణవస్త్రాలు దెచ్చి
దొరకె పగదీర్చుకొనదగు తరుణ మనుచు
చుట్టసాగిరి తోకకు చుట్టుముట్టి. 380

తే. పట్టణమ్మున గల పాతబట్ట లన్ని
క్షణములోపల గుట్టలై సభను జేరె;
అందు కనువైన విధముగా ననిలసుతుడు
పెంచె లాంగూలమును లంక బెదరు నటుల. 381

తే. గుట్టలందున నొకచిన్న బట్ట గూడ
మిగులకుండగ జుట్టిన మిగిలియున్న
తోక నారసి రావణు దుర్నిరీక్ష
లోచనమ్ములు విభ్రాంతిలోన మునిగె. 382

తే. అంత లంకాధినాథు డొక్కింత కినిసి
భటుల దిలకించి "చుట్టిన బట్ట లింక
చాలు! వీనిని బైటకు దోలి యచట
చిచ్చు రగిలింపు డిపు" డని హెచ్చరించె. 383

ఆ. ప్రభువు మది నెరింగి భటు లాంజనేయుని
త్రాళ్ళతోడగట్టి రథము లాగు
సరణి కేక లిడుచు సభవెల్వలికి నీడ్చి
నూనె, నెయ్యి తోకపైన జల్లి. 384

తే. దండధరుకింకరుల లీల దనుజభటులు
కొరవికట్టెలతోడ లాంగూల మెల్ల
నొక్కసారిగ రగిలించి దిక్కు లదుర
కలకలము రేపి రదె గొప్ప గెలు పటంచు. 385

తే. వనమునందున్న సీత కా వార్త దెలిసి
భోరు మని యేడ్చి కన్నుల నీరు నింపి
అగ్నిదేవున కతిభక్తి నంజలించి
దీన విధమున నిటుల బ్రార్థింప దొడగె. 386

తే. "సీత నీబిడ్డ యనియెంచి వీతిహోత్ర!
నేను నా బిడ్డగా మది నెంచునట్టి
నీ హితుని బిడ్డ, మా ఆంజనేయుపట్ల
శీతలుడ వౌచు కరుణ రక్షింపు" మనియె. 387

ఆ. ఆగకుండ వాలమం దగ్నికీలలు
రగులుచున్న వేడి దగులకుండ
చల్లబడుటె గాక చందన మ్మలదిన
సరణి నుండు చంద మరసి హనుమ. 388

తే. తల్లి సీత మహాసతీత్వమ్ము మహిమ
తన్ను కాపాడినదియని దలచి మదిని
యినుమడించిన భక్తి నామెను స్మరించి
అరచి గర్జించి ఆకస మంటనెగసె. 389

తే. వానితోపాటు మోకులు బట్టియున్న
దనుజభటులంత విలవిల దన్ను కొనుచు
పైకి లేచిరి వారల బారజూచి
తోక జాడించె మారుతి భీకరముగ. 390

సీ. వాలమ్ము నవలీల పవమాన తనయుండు
జాడించగనె పట్టు జారిపోయి
సుడిగాలి దెబ్బకు తొడిమలు దెగి చెట్టు
క్రిందరాలెడు ముష్టి పిందెలట్లు
వేనవేల్ రాక్షసవీరు లల్లాడుచు
మూకలై పెద పెద్ద కేక లిడుచు
నింగియంచుల నుండి నేలపై బడి యట్లె
చచ్చిరి యట్టులే చాలమంది

తే. చావు దప్పించుకొన్నను సగము మంది
కాళ్ళు, చేతులు, నడుములు, కన్నులాది
అంగములు గోలుపోయి దుఃఖార్తులైరి
స్త్రీజనమ్ములు వ్యాకులచిత్త లైరి 391

తే. నాకవిభు జయించిన ఖగనాథు పగిది
తేజరిల్లెడు మారుతి దేహమునకు
గట్టియున్నట్టి మోకులు కాలి కాలి
ధరణి బడియెను చచ్చిన త్రాచులట్లు. 392

ఆ. అంత ఆంజనేయు డతిశయించిన సంబ
రమున కొంత డిగ్గి లంకలోని
భూరిసౌధములను బూడిద పాల్జేయ
బూనుకొనియె సురలు మురియు నటుల. 393

సీ. చెలరేగి తొలుదొల్త కొలువు కూటమ్మును
పగదీరు నందాక దగులబెట్టి
ఆపైన నతిముఖ్యులగు మంత్రి వర్యుల
మందిరమ్ముల నెల్ల మాడ్చివేసి
పిదప లంకేశుని ప్రియబంధుమిత్రుల
నిలయమ్ములకు నెల్ల నిప్పవెట్టి
తదుపరి పలువురు దండనాథుల సద
నమ్ముల వెదకి దగ్ధ మ్మొనర్చి

తే. చిట్టచివరను రత్నభూషితమె గాక
యఖిల లోకాల విఖ్యాతమైనయట్టి
దనుజ నాథుని దివ్య సౌధమును సైత
మగ్ని కాహుతి గావించె ననిలసుతుడు. 394

తే. అవల నా మంట లనిలు సహాయమునను
వాడవాడల వ్యాపించి మేడ మిద్దె
లాదిగా రాజధానియం దలరు నన్ని
కట్టడములను బూడిదగా నొనర్చె. 395

తే. క్రతువు లేమియు లేక ఆకట కృశించు
వీతిహోత్రున కవి గొప్ప విందు లాయె!
అగ్నికీలలలో జిక్కి యశ్వములును
మదగజమ్ములు నిలువున మాడిపోయె. 396

సీ. మంటలం దొడలెల్ల మాడి రోదించుచు
వీథులవెంట బర్వెత్తు వారు
కన్నబిడ్డలు తమ కనుల ముందగ్ని కా
హోర మౌట గని యల్లాడువారు
శాపమై వచ్చె నీ పాపిష్ఠి మర్కటుం
డని మారుతిని దూలనాడు వారు
కాలిపోయిన దిల్లుగాదు మా బ్రతుకని
యెలుగెత్తి భోరున నేడ్చువారు

తే. ఈత డనిల, దినేంద్ర, మహేంద్ర, రుద్ర
వీతిహోత్ర, ధనాధిప వీరులందు
నొక్కడై యుండు నట్లు గాకున్న యెడల
నింత బీభత్స మెటుల సృష్టించగలడు? 397

ఆ. అనుచు చావుదప్పి యంగవైకల్యమ్ము
నంది గోడు గోడు మనెడు రాక్ష
సాంగనలను గాంచి యనిల తనూజుడు
స్వాంతమందు సుంత జాలినందె. 398

ఆ. క్షణములోన లంక సర్వనాశన మౌట
కనులు పులకరింప గనిన హనుమ
సంబరమున తోక సంద్రమందున ముంచి
యొడలు మరచి గంతు లిడ దొడంగె. 399

ఆ. అంతలోన వనము నందున్న జానకి
మారుతాత్మజునకు మదిని మెదల
ఆమెగూడ మంటలందు జిక్కిన దేమొ
యన్న సంశయమున నాతడడలె. 400

ఆ. కర్మగాలి యట్టి ఘటన సంభవమైన
నవల బ్రతుకగలనె? యరనిముసము
ఇనకులేశు శ్వాస నిక్కడ మసిజేసి
తిరిగి వెడలి వాని నరయ గలనె? 401

తే. దీనికంతకు మూలము నేను గాన
ఇక్కడనె మేను వీడెద నీక్షణమ్మె!"
ననుచు మది నెంచె మారుతి యంతలోనె
కొన్ని శుభశకునమ్ములు గోచరించె. 402

తే. దూత నగునన్ను గాల్చని వీతిహోత్రు
డవనిజాతను రామునిల్లాలి గాల్చు
నని తలంచుట తప్పని యనిలసుతుడు
తోక ద్రిప్పచు చనియె నశోకవనికి. 403

తే. దూరముననుండి హనుమ యా ధీరచరిత
మోము బొడగని యా తల్లి సేమ మెరిగి
ధైర్యమున సమీపించి పాదముల నంటి
మ్రొక్కి యీ రీతి వచియించె ముద మెలర్ప. 404

తే. తల్లి! రావణులంక దగ్ధమ్ము జేసి
యెంత బీభత్స మొదవిన నింతనిప్ప
కణిక నీమీద బడకుండ కాచినట్టి
అగ్నిదేవున కతిభక్తి నంజలించి. 405

తే. స్వామి కడ కేను నీ సేమ వార్త తోడ
నరుగుచున్నాడ! నిప్పడే యబ్ధిదాటి
దగ్గరాయెను మాత! యా దానవేంద్రు
ఘోరమరణము! గాన నీ పూరడిలుము. 406

ఆ. అనుచు పట్టరాని యానందమున దెల్పి
ధరణిజాతకనుల తనను తాను
జూచుకొనుచు కలుగు శుభముల లెక్కించు
కొనుచు నుండె ననిలు కూర్మి కొడుకు. 407

ఆ. హనుమ పారవశ్య మాతల్లి గమనించి
ప్రేమతోడ పేరు బెట్టి పిలిచి
"యింక నొక్క నిముస మిట జాగుసేయుట
తగదు గాన లెమ్ము! తత్క్షణమ్మె. 408

ఆ. స్వామి వద్దకేగి సకల సైన్యముతోడ
లంక ముట్టడించి రావణునకు
రామబాణమహిమ రణరంగమున దెల్పి
నను పరిగ్రహింపు మనుము! హనుమ!" 409

ఆ. అనుచు నిబ్బరముగ నాతల్లి వచియించి
వెళ్ళి రమ్మటంచు ప్రేమ మీర
దెలియజేసి పెక్కు దీవెన లందించి
ననిలసుతుని సాగనంపె సీత. 410

ఆ. అంత పవనతనయు డా సమీపమ్మున
దనరుచున్న పర్వతమ్ము నరసి
ఉరికి దానిమీది కుత్తరతీరమ్ము
నుండి కడలి నరసె నుత్సుకతను. 411

ఆ. కనుల యెదుట మిగుల గంభీరముగ నున్న
జలధి నొక్కసారి కలయజూచి
తనువు బెంచి రాము మనమున స్మరియించి
నిర్జరాళి బొగడ నింగి కెగసె. 412

తే. అనిల తనయు డాకాశ మహార్ణవమున
లోకభీకరముగ సాగు నౌకవోలె
చుక్కలను బల్కరించుచు దిక్కులన్ని
కన్నులార్పక కనుగొను కరణి సాగె. 413

ఆ. మార్గమధ్యమందు మైనాకు నొకసారి
వాలమున స్పృశించి మేలు దెలిపి
వేగ పోయి పోయి వినువీధి నుండి మ
హేంద్ర పర్వతమ్ము నెదుట గాంచి. 414

ఆ. తల్లి సీత సేమ మెల్ల వారికి దెల్పు
సమయ మబ్బె నన్న సంబరమున
భూనభోంతరాళములు మారుమ్రోగెడు
సరణి సింహగర్జ సలిపె హనుమ. 415

చ. అదివిని వానర ప్రముఖు లందరు వాలము లెత్తి దూకుచున్
ముదమును నుత్సుకత్వమును ముప్పిరిగొన్నటులాడిపాడుచు
న్నదిగదిగో! వియత్స్థలికి నందము గూర్చుచు వాయుసూను డీ
యదనున మేలివార్త మన కందరకున్ వినిపింప వచ్చెడిన్. 416

ఆ. అనుచు కపివరేణ్యు లందరు వేవేగ
చెట్లమీది కెక్కి చేతు లెత్తి
గాలిలోన నూపి గాడ్పునందనునకు
జయము దెల్పి రెంతొ సంబరమున. 417

ఆ. అంతలోన నంద రాశ్చర్యపడు లీల
పవనసుతుడు డిగ్గె పర్వతమున
క్షణములోన నచటి కపివరు లెల్లరు
మూగి రతనిచుట్టు మోద మొప్ప. 418

సీ. ముందు ఋక్షేశుడు ముద్దాడి హనుమను
పలుమారు లెలుగెత్తి ప్రస్తుతించె!
అంగదుండును ప్రీతి నాలింగనము జేసి
యానందబాష్పాల నభినుతించె!
నలుడు సాహసవీర! నతుల కందనివి నీ
శక్తియుక్తు లటంచు సన్నుతించె!
కష్టసాధ్యమ్మైన కార్యమ్ము నీకు లే
దని సుషేణుడు మెచ్చి వినుతి సల్పె

తే. నంత తక్కిన వానరు లందరొక్క
సారి యెగబడి తమ తమ సంతసమును
వివిధ రూపాల దెల్పుచు నవిరళముగ
చిందులను వేసి కనువిందు చేసి రపుడు. 419

తే. జాంబవంతుడు మితిలేని సంబరమున
హనుమ నారసి "నాయనా! ఆంజనేయ!
నీవు శుభవార్త గొనితెచ్చి నా వటంచు
చెప్పకయె చెప్పె నీకనుల్ చెంగలించి. 420

ఆ. కాన నీవు మొన్న కడలిని లంఘించి
శీఘ్రగతిని లంకజేరుటాది
తిరిగి వచ్చువరకు జరిగిన అరుదైన
అనుభవముల దెలుపు" మని వచించె. 421

ఆ. అంత పవనతనయు డంగదునకు మ్రొక్కి
జాంబవంతు భక్తి సన్నుతించి
విజయయాత్రలోని వింతలలో కొన్ని
సవినయముగ జెప్ప సాగెనిట్లు. 422

సీ. "కంటిని శ్రీరాము కనుపాప జానకిన్
వ్యాకులచిత్త నశోకవనిని
స్వామి సందేశమ్ము నామెకు వినిపించి
యొసగితి నతిభక్తి నుంగరమును
నారాక లంకేశునకు దెల్ప కోర్కెతో
ధ్వంసమ్ము జేసి తుద్యానవనిని
నను జంపవచ్చిన దనుజవీరుల నెల్ల
సరగ బంపించితి నరకమునకు

తే. చివర బ్రహ్మాస్త్రమునకు నే జిక్కివెడలి
ఇచ్చకొలదిని రావణు రెచ్చగొట్టి
తగుల బెట్టిన తోకతో పగ దొలంగ
చిటికెలో లంక దగ్ధమ్ము జేసినాడ. 423

తే. మాత జానకి తన శిరోమణి నొసంగి
దీన విధమున విభునకు దెలుపు మనిన
వాక్యరత్నాల హృదయాన పదిలపరచి
భద్రముగ దెచ్చినాడ! నే భక్తితోడ." 424

తే. అనుచు సంక్షిప్తముగ తనయాత్రలోని
ముఖ్యఘటనలు కుదియించి ముందుబోసి
కపివరేణ్యుడు హనుమ అంగదుని జూచి
యవల భారము మీయదే యని వచించె. 425

ఆ. అంత వాలి తనయు డాంజనేయుని రెండు
కరము లొడిసిపట్టి "వరగుణాఢ్య!
నేడు నీయశస్సు నింగినంటిన" దని
నేల పులకరించు లీల దెలిపి. 426

క. "పవనసుత! నీ వొకండవె
యవలీలగ పెక్కుమంది అసురాగ్రణులన్
బవరమున జంపి వారికి
చవి జూపించితివి కపుల సామర్థ్యమ్మున్. 427

ఆ. కనుక రాముడేల దనుజేశు వధియింప
జాంబవంతు డేను చాలమయ్య!
సత్వరముగ నీ భుజమ్ములపై మమ్ము
అబ్ధి కవల జేర్చు మాక్షణమ్మె. 428

తే. ముష్పురము వేగ లంకను ముట్టడించి
బవర మొనరించి దుష్టరావణు వధించి
జానకీదేవి చెర బాపి సంతసమున
మనమె రాముని కర్పింత" మని వచించె. 429

ఉ. "ఆ పని నేనె సల్పవలెనంచు దలంచియు, రామబాణ మా
పాపిని జంపు టొప్పు నను భావముతో నిట కేగుదెంచితిన్;
ఆపగ లేడు పద్మభవు డైనను రావణు చావు నింక, స
ల్లాపము లాపి యందరము రాముని వెంటనె గాంచగా వలెన్." 430

ఆ. అట్టు లనిలతనయు డనిన వెన్వెంటనే
జాంబవంతు "డదియె సముచితమ్ము
కాన ముందు రాము కడకేగి శుభవార్త
వారి చెవిని వేయ వలయు" ననియె. 431

తే. అంత నటనుండి కపివరు లంత గదలి
తప్ప దిక యుద్ధ మనునట్టి తలపుతోడ
చెంగు చెంగున దుముకుచు శీఘ్రగతిని
యరుగుచుండగ మార్గమధ్యమ్మునందు. 432

తే. వానరేంద్రున కతిప్రీతిపాత్రమైన
దధిముఖుని కాపునందున్న మధువనమ్ము
తారసిల్లెను వనచరుల్ దాని జూచి
అడుగుసాగక పెదవులు తడుపుకొనిరి. 433

తే. అంత యువరాజు నంగదు నరసి వారు
వనములోనికి జని మధువును భుజించు
భాగ్య మిడు మని కేల్మోడ్చి బహువిధముల
పాడి యాడుచు పలుమారు వేడుకొనిరి. 434

తే. అంగదుడు జాంబవంతుని యనుమతి గొని
దధిముఖుని బిల్చి "యించుక దయ దలంచి
వారి కోరిక మేరకు వనములోని
కనుమతించుము నే" డని యానతిచ్చె. 435

తే. అదియె సుగ్రీవు నాదేశ మటుల దలచి
తన కసమ్మత మైనను దధిముఖుండు
మౌనముగ నుండె; నది సరియైన సమయ
మనుచు వనమున దూరె నా వనచరాళి. 436

ఉ. అందరు వెంటనే మధువు నాకలిదీరెడుదాక గ్రోలి, యా
నందము నింగినంటు నటు నాట్యము సల్పుచు, నేలదొర్లుచున్
పందెము లొడ్డి చెట్ల కెగబ్రాకుచు నచ్చటి నుండి దూకుచున్
చిందులు వేయుచున్ వెకిలి చేష్టలు జేయ దొడంగి రెల్లరున్. 437

సీ. అర్థమించుకలేని వ్యర్థప్రలాపముల్
పకపకనవ్వుచు బలికె నొకడు!
నవ్వెడు వానిని నాబుజ్జి! యేడ్వకు
మంచు నేడ్చుచు బుజ్జగించె నొకడు!
నవ్వు కన్నను నేడ్పె నయమంచు రాగాలు
దీయుచు వన మెల్ల దిరిగె నొకడు!
రేపు యుద్ధములోన చూపెద నా ప్రతా
పమ్మని సహచరున్ బాదె నొకడు!

తే. మత్తు తలకెక్కి కొందరు మాకు లెక్కి
పండ్లు, కాయలు, పిందెలు పట్టి త్రుంచి
కొరికి నమలకయే నేలగొట్టు టరసి
యోర్చు కొనలేక దధిముఖు డుగ్రు డాయె. 438

తే. వానికోపము గమనించి పవనసుతుడు
"దధిముఖా! వారికీ వద్దు దగిలె దేని
నేను వారల పక్షాన నిలువగలను
పైన నీ యిష్ట" మని దృఢత్వమున బలికె. 439

తే. హనుమ యావేశమును గని అంగదుండు
దధిముఖుని జూచి పవమాన తనయు వలన
విశ్వ మంతట మన వాసి వెలసె గాన
వాని మాటను పాటించవలయు ననియె. 440

క. అంతట వానరు లంద ర
నంతమ్మగు సంతసమున నాలుగు దెసలన్
గంతులు వేయుచు మధువన
మంతయు చెరుపంగ దొడగి రానందముతో. 441

సీ. మధువుదొన్నెలనింపి మరిమరి సేవించి
దిసమొల తోడనే తిరుగువారు!
మోతాదు హెచ్చగా చేతులే కాళ్ళుగా
నడచుచు తడబడి పడెడువారు!

అశ్లీలమగు పల్కులాడుచు వనరక్ష
కుల నపహాస్యమ్ము సలుపువారు!
వనపాల కాధ్యక్షు డను గౌరవములేక
దధిముఖున్ వెన్నంటి తరుమువారు!

తే. ఎవ్వరెవరన్న దెరుగక యిచ్చకొలది
అంగదుని జేరి చెవిలోన నరచువార
లిట్టు లందరు చెలరేగి యించుకంత
భయములేకుండ చెరచిరి వనము నెల్ల. 442

ఆ. ఇంత జరుగుచున్న నిపుడు నా కోపము
నీటిలోన బడ్డ నిప్పురవ్వ
యౌ నటంచు దలచి మౌనవ్రతమ్మూనె
ధర్మవిదుడు వృద్ధ దధిముఖుండు. 443

తే. కొంద ఱచ్చటి వనపాలకులను బట్టి
కనికర మ్మింతలేక తోకలకు గట్టి
యీడ్చి నలువైపులం ద్రిప్పి యేడిపించి
విడిచి పెట్టిరి వెకిలిగా వెక్కిరించి. 444

తే. చేయునదిలేక వారంత శీఘ్రగతిని
పరుగు పరుగున సుగ్రీవుదరికి జేరి
"ఏలికా! మీరు శ్వాసగా నెంచునట్టి
మధువనపు శోభ నేటితో మాసిపోయె." 445

తే. అనిరి వెంటనె దధిముఖు డనియె నిటుల
"అంగదుడు జాంబవంతుడు హనుమ ముగురు
వేడ్కమీరంగ నెంచి వనమును వేలమంది
వనచరుల కప్పగించిరి వానరేంద్ర! 446

ఆ. వారియండ జూచి వానరబృందము
మంచినీళ్ల రీతి మధువు గ్రోలి
మాట కందనంత మత్తులో తూలుచు
చేయరాని పనులు చేసినారు. 447

సీ. పోటీలుపడి వేలపూదేనె కుండలు
చెట్లెక్కి బ్రద్దలు జేసినారు!
విరుగగాచిన ఫలవృక్షమ్ము లన్నిటిన్
కూకటి వ్రేళ్లతో గూల్చినారు!

వనపాలకుల గొట్టి విన సహించగ రాని
కూతలు బూతులు కూసినారు!
త్రాగినంత మధువు త్రాగి తక్కినదంత
చెలరేగి నేలపాల్జేసినారు!

తే. వారుచేసిన దుష్క్రియల్ వరుస బెట్టి
విన్నపముజేసి మిమ్ము నొప్పింపజాల!
శిథిలమైపోయె నేటితో మధువనమ్ము
నరకబాధామయ మ్మాయె! నా మనమ్ము. 448

ఆ. తరతరాలనుండి హరిహరాదుల కేని
అడుగు లోన మోప నలవికాని
కమ్ర మధువనమ్ము కంచె యించుక లేని
చేనువోలె మిగుల చిన్నవోయె. 449

ఆ. దాని రక్షకుడుగ నేను గర్వించితి
నిన్నినాళ్ళు కాని యీ దినమ్ము!
నళిన బంధుతనయ! నాకంటి ముందగల
వనము చెడె నటంచు వగచు చుంటి. 450

క. అని తన వేదన దధిముఖు
డినతనయున కెరుగజేసె నెంతయు భీతిన్
వనచరనాథుడు వెంటనె
"అనఘా! నీ రాజభక్తి యతులిత మైనన్. 451

తే. తప్పొనర్చిన వానికి తగిన శిక్ష
వేయవలె నన్న అది నీకె వేయవలయు!
అంగదుడు ఋక్షనాయకుం డాజ్ఞయిడుట
వలననే గద వారటు సలిపినారు. 452

తే. అందుచే నేరమును వారికంటగట్టు
టనుచితమ్మగు గాన తత్క్షణమె నీవు!
వనమునకు జేరి వారి మన్ననయు గోరి
అందరిని వేగ నిచ్చటి కంపు" మనియె. 453

ఆ. తప్పదెలిసి కొనిన దధిముఖుం డంతట
వాయువేగమునను వనముజేరి
"చిన్నరాజ! తప్పుజేసిన దేనని
ప్రభువు తీర్పు జెప్పి పంపె నన్ను. 454

తే. కాన మీరంద రిప్పుడే కడురయమున
రామలక్ష్మణ సుగ్రీవరాజవరుల
జేరి సీతామహాదేవి క్షేమవార్త
దెలుపు" డని వేడుకొనె నతిదీనముగను. 455

ఉ. పావనిరాక కోస నుటప్రస్రవణమ్మున వేచియున్న సు
గ్రీవుడు రామలక్ష్మణులు రెప్పలు వాల్చక సాధ్విజానకీ
దేవి సువార్త కై యెదురు తెన్నులు జూచుచునుండి రంతలో
భూవిభు మ్రోల దూకె నొకబుల్లి ప్లవంగము దిగ్భ్రమమ్ముగన్. 456

ఆ. బుల్లికోతిలోని యుల్లాసమును గాంచి
అతడె పవనతనయు డనిగ్రహించి
"ఆంజనేయ! వేగ అవనిజ సేమము
నాకు దెలుపు మనియె" నవనివిభుడు. 457

తే. స్వామి హృదయార్తి గుర్తించి వాయుసుతుడు
మొనసి వెంటనె నిజరూపమును ధరించి
"చూచితిని జానకిని నే నశోకవనిని
నిన్నె నిరతమ్ము ధ్యానించుచున్న సతిని." 458

ఆ. హనుమ నోటిమాట అమృతోపమానమై
అవనిజాత విభుని ఆర్తిబాపె!
మోయ నలవిగాని తీయనిబాధతో
అమ్మహాత్ముకన్ను లలరెనపుడు. 459

ఆ. అంతలోన వచ్చి రంగదజాంబవ
దాది ముఖ్యులెల్ల మోద మలర
మొదట వాలిసుతుడు ముకుళిత హస్తుడై
ఇనకులేశు తోడ నిట్టు లనియె. 460

తే. "దశరథాత్మజ! నా పినతండ్రి నాడు
మీకొసంగిన మాట సమీరసుతుడు
భక్తియుక్తుల నెరవేర్చి బవరమునకు
నిఖిలవానర సైన్యమున్ నిద్రలేపె. 461

ఆ. కాన మీకు చింతకాసంత వలదింక
రామబాణ హతికి రావణుండు
అవనితనయ మెచ్చ హతు డౌట తథ్యము
అనుచు దెలిపి యనిలతనయు జూచి. 462

తే. "దివిజ సన్నుత! సీతసందేశ మెల్ల
చెవులు రిక్కించి నిలుచున్న చెట్టుచేమ
మురిసి యాడెడు రీతిని త్వరితగతిని
విన్నవింపుము రామభూవిభున కిపుడు." 463

తే. అనినతోడనె కడు భక్తి ననిలసుతుడు
సీత తన ఆనవాలుగా చేతి కిడిన
దివ్యచూడామణిన్ జూపి "దేవదేవ!
తీసికొనుమయ్య! ఇది మీకు తీపిగుర్తు." 464

తే. అని శిరోభూషణ మ్మిచ్చి యనిలసుతుడు
తాను వార్నిధి లంఘించి దనుజనాథు
పురము జేరిన దాదిగా తిరిగివచ్చు
వరకు జరిగిన సంగతు లెరుగ జేసి. 465

తే. క్రూరమృగములనడుమ నిరుద్ధమైన
హరిణి విధమున జానకి యనుభవించు
కష్టముల నొక్క టొకటి ఏకరువుబెట్టి
మాటపెకలక రోదించె మౌనముగను. 466

సీ. కాంతాలలామ! నన్ కరుణించి యేలుకొ
మ్మని రావణుడు వేడుకొనిన యపుడు
నన్ను వరించిన నిన్నె పట్టపురాణి
జేసెద నని యెరవేసి నపుడు
వలచి ముంగిటిలోన వ్రాలిన స్వర్గమున్
స్వాగతించు మటంచు వాగినపుడు
నీవు నన్ కాదన్న చావు తప్పదు నీక
టంచు భీతిల హెచ్చరించినపుడు

తే. అదురు బెదురును రవ్వంత యైన లేక
ఆ మహాసాధ్వి జూపిన యట్టి తెగువ
నేను కనులార గాంచితి నీరజాక్ష!
నీతలంపులె ఆమెకు నిత్యరక్ష! 467

ఆ. అయిన తిరిగి వచ్చు నప్పు డా తల్లిని
మరల నేను గలసి మాత! వినుము
దనుజవిభుని చావు దగ్గర బడినది
అజుడుగూడ దాని నాపలేడు. 468

ఆ. నేను వార్ధిదాటినీ మనోహరుజేరి
తలను వంచి శుభముపలుకగానె...
యుద్ధభేరి మ్రోగు నుర్వి తల్లడ మంద
నందువలన దిగులు జెందకమ్మ! 469

ఆ. గడువు కన్నముందెకడతేరు నీచెర
మరుదిన మ్మయోధ్య పురము జేరి
ప్రభువుతోడ గలసిపట్టాభిషిక్తవై
ఘనయశస్సు నందగలవు తల్లి! 470

తే. అని దృఢమ్ముగ నేను వాకొనిన యంత
నా మహాదేవి సంబర మంబరమును
దాకె! తక్కిన భార మంతయును నీదె!
దీనజన రక్షకా!" యని తెలిపె హనుమ. 471

# సుందరకాండము సమాప్తము

ఘనుడా రాముని పంపునన్ వెడలి, లంకాపట్టణమ్మందు, సీ
తను కన్నారగగాంచిమ్రొక్కులిడి, మాతా నేను శ్రీరామ దూ
తను నీకింక శుభమ్ముకల్గునని యేధన్యుండు ఓదార్చె, నా
హనుమంతున్ కడుభక్తితో గొలిచి నేనర్పింతు కైమోడ్పులన్

- మల్లెమాల

***

# యుద్ధకాండము

తే. తన మనోహరి జానకి దనుజపురిని
సేమముగ నున్న దనువార్త చెవిని వేసి
ప్రాణములు నిల్పినట్టి మహానుభావు
ననిలసుతు జూచి శ్రీరాము డనియె నిట్లు. 1

ఆ. "రేపు గాంచలేని ఆపదలోనున్న
సమయమందు మేలు సలిపినట్టి
నిన్ను మేన ప్రాణ మున్నంతవరకు నే
మరచిపోనటన్న మాట దప్ప. 2

ఆ. ఇతర మేది ఇప్పు డీయ నశక్తుడ
నాది యన్న దిచ్చ టేదిలేదు;
వట్టి చేతులున్న వనవాసి రాముడ
కాన తనివిదీర కౌగిలింతు. 3

తే. రమ్ము హనుమయ్య! యనుచు శ్రీరామవిభుడు
కరములను సాచి బిగియార కౌగిలించి
గుండియకు హత్తుకొని తన కూర్మిదూత
నతులితానంద వారాశియందు దేల్చె. 4

ఆ. స్వామినోటివెంట జాలువారిన మాట
అంతరార్థ మెరిగి యనిలసుతుడు
పదములంటి మ్రొక్కి "సదమలగుణసాంద్ర!
యింతకన్న నా కికేమి వలదు." 5

క. అని హనుమంతుడు పల్కగ
ఇనకులవంశాబ్ధి సోము డినతనయునితో
"వనచరనాథా! సంగర
మనివార్య మ్మసురవిభుని హత మార్చుటకై. 6

ఆ. కాని సైన్యమంత కడలి దాటుట యెట్లు?
శీఘ్రగతిని లంక జేరుటెట్లు?
అన్న దిగులు నన్ను వెన్నాడుచున్నది"
యనిన యంత వానరాధినేత. 7

ఆ. రామభద్ర! దిగులు ప్రాజ్ఞుల దరిజేర
వెరచునన్న సూక్తి నెరిగి కూడ
భీరు వట్లు నీవు భీతి నందగనేల?
సంశయమ్ము విడుము జయము మనదె. 8

తే. లెమ్ము శ్రీరామ! యిపుడె గైకొమ్ము! చాప
మంగదుడు నేను జాంబవదాదియుద్ధ
వీరగణమంత లక్ష్మణువెంట నడతు
మగణితమ్మైన కపిసైన్య మనుసరింప. 9

తే. అదిగో! అటుచూడు మప్పుడే యనిలసుతుడు
నలుడు, నీలుడు, శరభు డనంతమైన
ప్రముఖ మర్కట భల్లూక సమరవీర
గణము సంసిద్ధముగ నున్న" దని వచించె. 10

తే. అంత రాముడు సకలసైన్యమును జూచి
"విజయయాత్రకు నేడు దిగ్విజయమైన
లగ్నము లభించె! తొలగె నారాట మెల్ల
కదలు డిక జాగుసేయక కడలి దరికి." 11

తే. మానవేంద్రుని నోట నామాట వినిన
వానరేంద్రుడు "ధన్యోస్మి; భార మింక
మాకు వదలుము దయయుంచి లోకమాన్య!
నీవె చూతువు కపుల నిర్నిద్రశక్తి." 12

తే. అనుచు చేయెత్తి జేకొట్టె నంతలోనె
సురలు దివినుండి విరివిగా విరులుజల్లి
జయము బలికిరి; వెంటనే సాగె దండు
ద్విగుణితోత్సాహమున దశదిశలు మురియ. 13

ఆ. కడలిఘోషకన్న కడు భయంకరమైన
హోరు నింగినంటి మారుమ్రోగు
సరణి ముందు కురుకు సైన్యమున్ దిలకించి
రాజసమున వెలిగె రాఘవుండు. 14

ఆ. సంబరమున హనుమ సహజగంభీరమౌ
పలుకు లుట్టి పడగ పలువిధముల
దనుజసార్వభౌము గుణవిశేషములను
నడక నాపకుండ నుడువ దొడగె. 15

ఆ. లంకగుట్టుమట్టు రావణసైనిక
పాటవమ్ము, వానిబంధుమిత్ర
సచివపుత్రసమితి శక్తియుక్తుల నెల్ల
నేది వదలకుండ నెరుగ జెప్పె. 16

ఉ. అంతట దండులోని యసహాయ పరాక్రమ శూరులంద రో
క్కింతయు భీతిజెంద కసురేశ్వరు పీచ మడంచి జానకిన్
సంతస మొప్ప రాఘవుని సన్నిధి జేర్చెడుదాక నిద్దురన్
చెంతకు జేరనీయ మని చేసిరి భీషణమౌ ప్రతిజ్ఞలన్. 17

తే. అటుల కోలాహలమ్ముతో నడవిదారు
లందుసాగిన దండు అందందు దొరకు
పండ్లు, దుంపలు, తేనెలే భక్ష్యములుగ
నారగించుచు చేరిన దబ్ధి దరికి. 18

ఉ. అక్కడ రావణుండు తన ఆప్తులతో సభదీర్చి వానరుం
డొక్కడు లంకజొచ్చి మన యున్కికి ముప్పు ఘటిల్ల జేసినా;
డెక్కువ మాటలేల? యిపు డెయ్యది మార్గము రాము గెల్వ నం
చొక్కొక వీరునిన్ గదిపె నుద్ధతి నందరు పొంద నివ్వెరన్. 19

సీ. ముందు ప్రహస్తుడు మునివేషధారియౌ
యినవంశజుని జంపు టెంత యనియె!
అంతట దుర్ముఖుం డనిలోన విజయమ్ము
సాధించుటకు నేనె జాలు ననియె!
నే నిప్పుడే పోయి వానరేంద్రుని తల
దరిగెద నని వజ్రదంష్ట్రు డనియె!
మీరంద రేటికి వారందరిని నేనె
గూల్చెద నంచు నికుంభు డనియె!

తే. ఇట్లు లెవరికి వారుగా ఇచ్ఛవచ్చి
నట్లు పలుకు ప్రగల్భము లసురనేత
వినుచు మురియుట నరసి విభీషణుండు
వినయ మేపార రాక్షసవిభుని జూచి. 20

క. "అన్నా! నా మనవిని విను
మన్నా! వీరెవరి మాట లాలింపగ వ
ద్దన్నా! రాము డజేయుం
డన్నా! ఆవేశ ముడుగు మన్నా!" అనియెన్. 21

క. తమ్ముని ప్రియవచనమ్ముల
నెమ్మనమున నీసడించి నిశితమ్మగు కో
పమ్మున ననె దనుజేశుం
"డిమ్మహి నను గెల్వతరమె? యీశున కైనన్. 22

క. పగవానిని బట్టువలెన్
బొగడెడు దుర్బుద్ధి నీకు పుట్టుకతోనే
తగుల బడె నని తలంచెద
మగటిమి నీకున్న నిట్లు మాటాడెదవే? 23

సీ. నిను తమ్ముడని చెప్పుకొనుట సైతము నాకు
పదుగురి లోపల పరువు చేటు!
నాకాధిపుని గెల్చినట్టి నన్ చులకన
జేసిమాటాడుట సిగ్గుచేటు!
బవరమ్మునకు ముందె భయపడు నీవంటి
పిరికి నా లంకకు బరువుచేటు
ఇంకొక్కమాట నీ విక్కడ జారిన
మూడును నీప్రాణమునకు చేటు!

తే. అందుచే నిప్పటికినైన అసురవిభుని
ఘనయశస్సుకు భంగము గలుగనట్టి
మార్గ మెరిగించి వైరుల మట్టుబెట్టి
వాసి బెంచుము పౌలస్త్యవంశమునకు. 24

ఆ. అనుచు నయము భయము పెనవేసి యగ్రజు
డాడినట్టి మాట లాలకించి
కినుక గొనక మిగుల వినయమ్ముతో విభీ
షణుడు శిరము వంచి అనియె నిట్లు. 25

ఉ. "అన్న! క్షమింపుమన్న! నను అన్యునిగా దలపోయకన్న! నీ
కన్నను నాకు కావలసినట్టి స్వకీయులు లంకలోన లే
రన్న! వివేకవంత మగునట్టి పథమ్మున బోదమన్న నా
విన్నప మాలకించి రఘువీరునిపై పగ మానుకొమ్మికన్. 26

ఉ. చేసిన తప్పు దిద్దుకొన జేయగరాదు మరొక్కతప్పు! అ
భ్యాసములేని విద్యయును ఆత్మవిమర్శనలేని జ్ఞానమున్
వాసిని బెంచవన్న! జనవంద్యుడు రాముడు కాన వేగ నా
కోసలనాథు మన్ననను గోరుట లె"స్సని పల్కె నంతటన్. 27

ఆ. కోప మాపలేక కుంభకర్ణుని జూచి
"వీడ! బుద్ధిగరపువాడు నాకు!
నీళ్ళు నమలకుండ నీ యభిప్రాయము
దెలుపు" మనియె! దనుజకులవిభుండు. 28

ఆ. అంత కుంభకర్ణు డన్నను దిలకించి
మంచి చెడ్డలన్న మాట మరచి
చేయరానితప్పు జేసి నాయుద్దేశ
మిప్పు డడిగినంత నేమి ఫలము? 29

తే. విమల విజ్ఞాన శాస్త్రకోవిదుడ వయ్యు
పార మెరుగని మదనతాపమ్ము తోడ
చేటు దలపక యఘ మొనర్చితివి యైన
తోడబుట్టిన నేను నీ వాడ నన్న! 30

తే. అందుచే నేను పాపపుణ్యమ్ము లనక
అనవరతమును నిన్ను వెన్నంటియుండి
ఆహవమ్మున విజయమ్ము నందజేసి
చింత బాపెద నీ"కని చేసె ప్రతిన. 31

ఆ. అంత కుంభకర్ణు నాలింగనముజేసి
అక్షరాల తమ్ము డనిన నీవె!
అనుచు ప్రస్తుతించి అవనిజపొందు నా
కబ్బి తీరు నింక ననుచు మురిసె. 32

తే. వెంటనే మహాపార్శ్వుడు బంటువోలె
లేచి నిలబడి లంకేశు జూచి పలికె:
"ఒంటరిగ నున్న జానకి నొడిసిపట్టి
అనుభవించిన నెవ డడ్డుకొనును మిమ్ము." 33

ఆ. అనుచు రెచ్చగొట్టి దనుజేశుమన్నన
లందుకొనెడు యత్న మతడు చేసె!
కాని రావణుండు కడగంట నా మహా
బలుని బారజూచి పలికె నిటుల. 34

ఆ. "అంతసాహసమ్ము నాచరింపగ లేక
మరులు సీతపైన మానలేక
రేయిపవలు నేను హాయిని గోల్పోయి
కుందుచుంటి నిట్టు లెందు కనిన. 35

తే. పుంజికస్థల యను నొక పూవుబోడి
పద్మభవు జేర నాకాశ పథమునందు
అరుగుచుండగ నే నామె అంద మరసి
మోహపీడిత మతితోడ ముందుకురికి. 36

తే. బలిమిమైపట్టి వలువల నొలిచి వైచి
యిచ్చవచ్చిన రీతి భోగించినాడ!
అంతట విధాత జరిగిన దంత దెలిసి
నీవు పరకాంత నిక మీద నీతిదప్పి. 37

తే. చెరచితివ యేని వెంటనే శిరసు నూరు
వ్రక్కలగు నని శపియించె భగ్గు మనుచు
ఆ భయము చేత నిన్నాళ్ళు అవనితనయ
పొందునకు దూరమైపోయి పొగులుచుంటి. 38

తే. భర్త మరణించినప్పుడే పడతి సీత
విధికి తలయొగ్గి తాను నావెంట బడును
కాన రాముని కడతేర్చు కార్యమునకు
జనుడి యీ దినమే యనె దనుజవిభుడు. 39

ఆ. అంతదనుక నెల్ల రావేశమున బల్కు
భాషణముల విని విభీషణుండు
అదుపుదప్పుచున్న దన్న ధోరణి యని
మనమునందు దలచి అనియె నిట్లు. 40

తే. "అగ్రజా! కోపతాపమ్ము లవలద్రోసి
చివరిసారిగ నీకు నే జెప్పుచున్న
హితవు నాలించి నీవె యోచింతువేని
అన్ని బాగోగు లెరిగించు నంతరాత్మ. 41

తే. ఇనకులేశుడు సామాన్యు డని తలంచి
తప్పు నొప్పును మరచి నీ మెప్పుకొరకు
వెలువరించిన వీరి మాటలను నమ్మి
కోరి ముందుగ కొనితెచ్చుకొనకు చావు. 42

తే. గడియలోపల మున్న లంకాపురమ్ము
కాలి బూడిదయగుటకు కారణమ్ము
తీక్ష్ణమైనట్టి సీత సతీత్వవహ్ని
కాని యీ కోతివాలమ్ము కాదు కాదు. 43

ఆ. అట్టి సాధ్వి నెట్టులైన బొందెద నను
భ్రమకు స్వస్తిజెప్పి రామభద్రు
శరణు గోరు మతడు కరుణాసముద్రుడు
కాన తప్పకుండ కనికరించు. 44

ఆ. అనువుగానివేళ నాపద పసిగట్టి
దారిమార్చుకొనుట తప్పుగాదు;
భుజబలమ్ముకన్న బుద్ధిబలము మిన్న
యన్న సత్యసూక్తి నరయు మన్న! 45

తే. దురమునం జొచ్చి నిరపరాధులను జంపి
జయము సాధింప దలచుట చాల తప్పు;
బింకమును వీడి నైతిక విజయమునకు
మార్గదర్శివి కమ్ము! నా మాట వినుము. 46

ఆ. అట్లు చేతువేని అఖిల జగత్తు ని
న్నభినుతించి తీరు హాయి మీరు
ఎట్టి వెరపులేక యిరుపక్షములవారు
నీకు శుభము పలికి నెగడ గలరు. 47

తే. అంత పినతండ్రి కింద్రజి త్తడ్డు తగిలి
"ధర్మసూత్రాలు నీకు నాతండ్రికన్న
నెక్కువ దెలియునని మెడ నిక్కబెట్టి
పనికిమాలిన మాటలు పలుక నేల? 48

తే. నీకు దెలియదె? నేను త్రిలోకనాథు
డైన అమరేంద్రు గెల్చితి నాహవమున
అట్టి నాముందు సభలోన నాపకుండ
పగర పనిగట్టుకొని యిట్లు పొగడ దగునె?" 49

తే. అనుచు మితిమీరి యింద్రజి త్తనెడు నుడులు
విని సహింపగ లేక విభీషణుండు
"నాయనా మేఘనాద! మీ నాయనకును
పుత్రరూప విరోధివై పుట్టినావు. 50

తే. కాకయున్న కర్మ గాలి దానవనేత
సలిపినట్టి తప్పుచక్కదిద్ది
దగ్గరైన ముప్పు దప్పింప యత్నించు
చిన్నతండ్రి కడ్డు జెప్ప గలవె?? 51

ఆ. బాలకుడవు నీవు భవితవ్య మూహించు
నేర్పు సుంతయేని నీకులేదు;
కాన మిన్నకుండు మేను నీ తండ్రికే
విన్నవింతు జరుగ నున్న నిజము." 52

ఆ. అని వచించె నంత నసురాధిపుడు భగ్గు
మనుచు మండిపడుచు ననుజు జూచి
"విన్నవన్ని చాలు విశ్వాసఘాతుకా!
కట్టిపెట్టు మింక కబురులన్ని. 53

సీ. పడగెత్తి బుసకొట్టు పాముల మధ్యలో
మించు నేర్పున నివసించవచ్చు!
కుప్పించి దూకెడు కుపిత సింహమ్ముతో
తలపడి యవలీల గెలువవచ్చు!
కడుభయంకరమైన కాలాగ్నికీలల
జిక్కియు మరల గట్టెక్కవచ్చు!
నింగి నడలజేయు నీరధియలలపై
జేరి హాయిగ స్వారి జేయవచ్చు!

తే. పేగు బంధము సైతము విస్మరించి
కోరి యాగర్భశత్రువు కొమ్ముగాయ
బూనుకొనినట్టి నీ వంటి హీనగుణుని
పట్టి మెడబట్టి నెట్టక బ్రతుకతరమె? 54

ఆ. అందువలన నిపుడె అరులకు మిత్రుడ
వైన నిన్ను నరికి హత మొనర్ప
దలచి వదలినాడ! తల్లికి గర్భశో
కమ్ముగూర్ప తగవుగా దటంచు. 55

తే. కనుక మాటలు చాలించి దనుజపురిని
వీడి నీవు దైవముగ భావించునట్టి
రాము కడకేగి యాతని ప్రాపుగోరి
వానితో పాటు చావుము బవరమందు." 56

తే. అట్లు దానవనేత త న్ననిన పరుష
భాషణములకు పగచి విభీషణుండు
మారు పల్కక ఆకాశ మార్గమందు
చనియె మంత్రులతోడ దాశరథి కడకు. 57

క. తన నలువురు సచివులతో
నసువుగ వినువీథి లోన నరుదెంచు విభీ
షణుని గని వానరేంద్రుం
డినకుల భూషణునితోడ నిట్లని పలికెన్. 58

తే. "కంటివే రామ! గగన మార్గమ్మునందు
కడలికావల నుండి రాక్షసులు కొంద
రదిగో! యేతెంచు చున్నారు మదముతోడ
మనల నేమార్చి యిచటనే మట్టుబెట్ట. 59

ఉ. కావున వారు భూమిపయి కాలిడి దగ్గర గాకపూర్వమే
పావని నంపి యాకసము పైననె వాలముతోడ మోది, ని
ర్జీవుల జేయు టొప్పు" నని చెప్పెను; వెంటనె లక్ష్మణుండు, "మా
యావులు దైత్యు లింక క్షణమైనను జాగొనరింప రా"దనెన్. 60

తే. అంతలో "రాఘవేంద్ర! నీ యండగోరి
వచ్చుచున్నాడ దుష్టరావణుని వీడి
లోకబాంధవ! నాకింక లోకమందు
తల్లిదండ్రియు గురువును దైవ మీవె." 61

తే. అన్న ప్రార్థన మార్మ్రోగె నాకసమున
వెంటనే యది మున్ను తా వినిన గొంతు
గా గ్రహించిన హనుమ యక్కజముతోడ
ఇనతనూజుని బొడగని యనియె నిట్లు. 62

ఉ. "సందియ మింతలే దది విషణ్ణ విభీషణు కంఠ నాదమే
కొందల మందగా దగ దకుంఠిత ధర్మము వాని సొత్తు నా
డందరి ముందు ధైర్యముగ నన్నను ఢీకొని దూతప్రాణముల్
గొందనుటెంతొ తప్పనిన కోవిదు డాతడు వానరాధిపా! 63

ఆ. వైరితమ్ముడన్న భావ మావంతయు
పరమసాధు వతని పట్లదగదు;
శిష్టరక్షకుండు శ్రీరాము డని సదా
విశ్వసించు ధర్మవేత్త యతడు." 64

క. అని హనుమంతుండనగా
ఇనవంశ విభూషణుండు నినతనయుండున్
వినవలె నెవ్వరు జెప్పిన
కని నిజ మెరుగంగ వలయు ఘను లెల్లపుడున్. 65

ఆ. కానవచ్చుచున్న దానవులను గూర్చి
చర్చయేల? నింక క్షణములోనె
వచ్చి ముందు వ్రాలు వారి బృంద మటంచు
నిర్వురెంచుచుండి రింతలోనె. 66

తే. "పాహి శ్రీరామచంద్ర! మాం పాహి పాహి"
యనుచు ననుచరగణముతో నవనికి దిగి
దూరమందున రెండు చేతులను మోడ్చి
వినయ మేపార నిల్చె విభీషణుండు. 67

తే. దశర థాత్మజు డదిగని దగ్గరున్న
అనుగుమిత్రుని సుగ్రీవు ననుపమాన
ధైర్యవంతుని జూచి కర్తవ్య మేమి
టిపుడు మన కని ప్రశ్నించె నెల్లరు విన. 68

క. అంతట నినతనయుం "డత
డెంతటి గుణగణ్యుడైన నింతటిలోనే
పంతము విడి కడుగ్రుడ్డిగ
చెంతకు రానీయ దగదు శ్రీరఘురామా!" 69

క. అని యా వానరనాథుం
డని నంతనె రామభద్రు డాలోచనలో
మునుగక నందర గనుగొని
తన సంకల్పమ్మునిట్లు తడయక తెల్పెన్. 70

సీ. వైరిపక్షము నుండి వచ్చిన వాడైన
ఘోరాపరాధియౌ వైరియైన
పలు పాపకృత్యముల్ సలిపిన వాడైన
దోర్గర్వ మేపారు ధూర్తుడైన
పచ్చి నెత్తురుదాగి బ్రతికెడు వాడైన
గుంటనక్కను మించు కుటిలుడైన
అవినీతి కానవాలైనట్టి వాడైన
హింస వృత్తిగ నెంచు హీనుడైన
తే. ఎవ్వరేకాని చెయిసాచి యెదుట నిలిచి
శరణువేడిన వానిపై కరుణ జూపి
అక్కునం జేర్చి యాతని ఆర్తిబాపి
మమత పంచుట నాదు ధర్మమ్ము సుమ్ము. 71

ఆ. ధర్మచింతవీడి తన సతి న్నిలువున
పొట్టబెట్టుకొన్న బోయవాడు
ఆకలి యనివచ్చి యర్థించగా మేని
పలల మిడియె నొక్క పావురమ్ము. 72

ఆ. అట్టి నీతికథల కాలవాలమ్మైన
పుణ్యభూమిలోన బుట్టినట్టి
మనము వేరుమార్గ మనుసరించుట పాడి
గాదు; దానివలన లేదు సుఖము. 73

తే. అంజలి ఘటించి అర్థించినట్టివాడు
రావణుని తమ్ముడే గాదు రావణుండె
యైన సత్వర మాతని కభయ మిచ్చి
కేలు నందించి కాచి రక్షింతు నేను. 74

తే. రామ భద్రుని మాట దూరముననుండి
వినిన సౌజన్యధనుడు విభీషణుండు
పరుగు పరుగున తన యనుచరుల తోడ
వచ్చి యర్పించె సాష్టాంగ వందనమ్ము. 75

ఉ. వెంటనె జానకీ పతి విభీషణు హస్తములంటి లేపి "నిన్
బంటుగ గాక నాప్తుడుగ బంధువుగా మదినెంచి సర్వదా
కంటికి రెప్ప చందమున గాచెడు బాధ్యతనాది కాన ని
ష్కంటకలీల దెల్పుమిక కాగల కార్యము లెల్ల నీ"వనెన్. 76

తే. స్వామి యనునయ వాక్యాల సరణి నరసి
అ మ్మహాత్ముని యౌన్నత్య మాత్మ దలచి
కరిగిపోయిన గుండెను కాన్కజేసి
భీతి విడనాడి పలికె విభీషణుండు. 77

తే. "అఖిలభూతశరణ్య! నీచాతినీచ
మైన దుర్బుద్ధితో సీత నపహరించి
నీమనమ్మున శోకాగ్ని నింపినట్టి
మూర్ఖ దానవనాథు తమ్ముడను నేను. 78

తే. పిలుతు రందరు నన్ను విభీషణు డని
నామ మేదైన లంక ననామకునిగ
బ్రతికి నాయన్న సలుపు దుర్మార్గములకు
వంత బాడగ లేకిటు వచ్చినాడ. 79

తే. శత్రుశిబిరమువాడన్న శంకలేక
ఆదరించిన నీ మేలు నసువు లున్న
వరకు మరువను చావైన బ్రతుకె యైన
నాకు నీతోడిదే స్వామి లోక మింక. 80

తే. సాధుజనరక్షకా! నీకు శత్రువైన
కలుషమానసు డాలోక కంటకుండు
నాకు సైతము శత్రు వీనాటినుండి
కాన జాగేల నింక సంగ్రామమునకు. 81

సీ. అమరేంద్రు ననిలోన నవలీల గెల్చిన
రాక్షసాధీశుండు రావణుండు!
కదనమ్ము నొక క్రీడగా నెంచి పోరాడు
గొప్పసాహసికుడు కుంభకర్ణు
డా హవమ్మున వైరి నంతుజిక్కని రీతి
హింసించగల యోధు డింద్రజిత్తు!
శత్రుభీకరులైన సైన్యాధిపతులయం
దగ్రయాయి ప్రహస్తు డనెడువాడు

తే. ప్రముఖ దానవ వీరులు పవలురేయి
యుద్ధ సన్నద్ధులై మున్గియున్నకతన
మనమె ముందుగ దుర్గమవనధి దాటి
దనుజపురి ముట్టడింపంగ దగును దేవ!" 82

ఆ. అనుచు మనసులోని యాలోచనలనెల్ల
ముందుచూపుతోడ నందజేసి
నట్టి యాప్తమిత్రు నభినందనము జేసి
లక్ష్మణునకు దెలిపె రాము డిట్లు. 83

తే. "తమ్ముడా! తోడబుట్టిన దనుజనాథు
విడిచి మనపంచజేరె! విభీషణుండు;
కనుక వానిని సంగ్రామమునకు ముందె
రాజు గావింతు రాక్షసరాజ్యమునకు. 84

తే. ఇదియె శుభలగ్న మనుకొని యుదధి జలము
దెచ్చి యభిషేక మొనరించి దేవగణము
శిరము లూపంగ రాజ్యాభిషిక్తుజేయు"
మనిన వెంటనె సౌమిత్రి యటు లొనర్చె. 85

ఉ. అంత విభీషణుం డినకులాంబుధి చంద్రునిజేరి మ్రొక్కి నా
చింతను బాపి దగ్గరకు జేర్చుటెగాక మహానుభావ! న
న్నెంతో ఋణస్థుజేసితివి యేలిక పట్టము గట్టిబెట్టి ర
వ్వంతయు నప్పుదీర్చగల వాడనె? ప్రాణముబోవు లోపలన్." 86

ఆ. అనుచు కనుల నింపె నానందబాష్పము
లంజనాకుమారు డదిగ్రహించి
దాశరథికి నీవు దగ్గరైనప్పుడే
అప్పుదీరిపోయె! అసురనాథ! 87

తే. కనుక ఇకమీద మనమొక్క క్షణము గూడ
జాగుసేయక ఉమ్మడి శత్రువైన
రావణుని గెల్చు వ్యూహము నీవె దెల్పి
శరధిదాటెడు మార్గము నరయు" మనియె. 88

తే. వెంటనే విభీషణుడు వివేక మెనయ
దశరథాత్మజు జూచి యో ధర్మవీర!
కడురయమ్మున వారధి గట్టకుండ
సంద్రమును దాట జాలదు సైన్య మిపుడు. 89

తే. కనుక సాగరు మొదట ప్రసన్ను జేసి
కొనుట మంచిది యా పైన వనధిపైన
కడు సులభముగ సేతువు గట్టవచ్చు"
నని విభీషణు డెరిగించె నాక్షణమ్మె. 90

ఆ. ధర్మతత్పరుండు దశరథరాముండు
దర్భశయ్యమీద తనువు జేర్చి
మూడు రేపవళ్ళు వేడినన్ సాగరు
దర్శనమ్ముగాక తల్లడిల్లి. 91

తే. దశరథాత్మజు డుగ్రుడై దండముననె
తత్క్షణమె జేతు వీనికి తగిన శాస్తి
అనుచు ప్రకటించి కోదండమును గ్రహించి
వరుస బాణాలు గుప్పించె వనధిపైన. 92

తే. రామబాణాగ్ని ధాటికి రగులుచున్న
అగ్నికుండమ్ముగా మారె నబ్ధియెల్ల
జలచరమ్ములు నూనెలో సలసలమని
కాగి మాడిన వడియాలకరణి నాయె. 93

తే. ఆకసమ్మంత పెనుసెగ లావరించె
మిడిసిపడు నీరమును నిప్పు మ్రింగివేసె!
నింక తడపైన తనగర్వ మెండిపోవు
నను తలంపున సాగరు డడలిపోయి. 94

తే. తనువు కంపింప మునుపటి దర్ప ముడిగి
నలమటించుచు యుదధిమధ్యమ్మునుండి
లేచి కేల్మోడ్చి రఘురాము జూచి పలికె
"ప్రేమసాగర! నను కృప నోము తండ్రి! 95

తే. నీవు కన్నెర్ర జేసిన నిఖిలజగతి
మనుగడకు ముప్పు వాటిల్లు మాన్యచరిత!
కనుక శాంతము వహియించి నను క్షమించి
సేతువును గట్టు యత్నమ్ము జేయు మిపుడె. 96

తే. అందు కనువగు సాయ మేనందజేతు
కనుక జాగేల నావిశ్వకర్మసుతుడు
నలుడు వానరసేనలో గల డతండు
కడుసమర్థుడు నిర్మాణకౌశలమున. 97

తే. వారధిని గట్టుభారము వానిపైన
బెట్టు మాతడు వానరవీరవరులు
గలసి లంకకు రహదారి కడురయమున
సురలు విస్మయమంద నేర్పరచ గలరు. 98

ఆ. అనుచు దెలిపి రాము ననుమతి గైకొని
సంద్రమందు జొచ్చె సాగరుండు!
అంత నలుడు తండ్రి నాత్మలో దలపోసి
సేతుబంధనమ్ము జేయ దొడగె. 99

తే. అగణితమ్ముగ నున్న సైన్యమ్ము నరసి
మీరు నలుదిక్కులకు వెళ్ళి భూరివృక్ష
ములను పెనుబండలను శైలములను బెరికి
వేగగొని తెండు శ్రీరామవిభుడు మెచ్చ." 100

క. అని నలుడు దెలిపినంతనె
క్షణ మాలస్యమ్ములేక కపిసైన్యము కా
ననములకు జట్లుజట్లుగ
జని చెప్పిన వెల్ల దెచ్చె సరభసలీలన్. 101

సీ. కొన్ని కోతులు చెట్లు కూకటివ్రేళ్ళతో
బెరికి భుజమ్ముల బెట్టితెచ్చె!
కొన్ని భల్లూకముల్ కొండలనే పెళ్ళ
గించి బంతులుగ దొర్లించి తెచ్చె!
కొన్ని వానరములు గున్నమామిడిచెట్లు
గూల్చి కొమ్మల నెల్ల జీల్చితెచ్చె!
కొన్ని ఋక్షమ్ములు నున్నని బండరా
ళ్ళను ముట్టియలనెట్టు కొనుచు దెచ్చె!
తే. నట్టు లెడ మింతలేకుండ నబ్ధిమీద
వచ్చి పడుచున్న తరువుల పర్వతముల
నలలు తలవంచుకొను రీతి మలచుకొనుచు
నొనర సేతువు నిర్మించుచుండె నలుడు. 102

తే. అలు పెరుంగక కపిసైన్య మందజేయు
చున్న నిర్మాణసామగ్రి నొడిసిపట్టి
రణవిజయహేతువైన వారధిని నలుడు
కట్టు నైపుణ్య మరసి యిక్ష్వాకు విభుడు. 103

తే. సేతు నిర్మాణ మత్యంత శీఘ్రగతిని
సాగుటకు కారణమ్మైన సైన్యతతిని
సకల నిర్మాణ కార్య కౌశలుని నలుని
యభినుతించెను పలుమారు లాత్మలోన. 104

ఆ. అట్లు సాగిసాగి యైదు దినాలలో
సేతుబంధనము విశిష్టరీతి
రూపు దిద్దుకొనియె చూపరు లచ్చెరు
వందు నటుల రాము డలరునటుల. 105

ఆ. విశ్వకర్మసుతుడు విశ్వవిఖ్యాతుడు
నలుడు విలువకందనట్టి లీల
నూరుయోజనములవారాశిపై గట్టె
నద్భుతముగ సేతు వనెడు వార్త. 106

తే. ఒక్కసారిగ వ్యాపించె దిక్కులెల్ల
దేవ గంధర్వసిద్ధులు దివిని మూగి
కడలిపాపిటి రేఖగా గానుపించు
నట్టిదను గాంచి దిగ్భ్రమనంది మురిసి. 107

ఆ. క్రొత్తబాటపైన కోకొల్లలుగ పూలు
వెల్లువెత్తునటుల జల్లిచల్లి
అలసి మిన్నకుండి రంతలో రాముడు
కరము లెత్తి నలుని కౌగిలించి. 108

ఆ. "తండ్రిపేరు నిలిపి ధరణిలో నీ పేరు
నీరు జలధులందు నిలుచు దనుక
మాసిపోని రీతి మహిత నిర్మాణము
జేసి నాకు మేలు జేసినావు. 109

ఆ. కాని నీకు నేను కౌగిలి దప్ప వే
రేది యొసగ జాలనిపు"డటంచు
మరల కౌగిలించి శిరమును ముద్దాడె
రాగహృదయుడైన రాఘవుండు. 110

ఆ. సురలు జల్లినట్టి విరులతో నిలువెల్ల
పరిమళించుచున్న శరధిమార్గ
మంటి మ్రొక్కి రాము డడుగు ముందుగ మోపె
కడలి పులకరించి యొడలు మరచె. 111

తే. భండన పరాక్రముండు కోదండపాణి
అగ్రభాగాన నడిచె! నా యనఘు వెంట
నంగదుడు లక్ష్మణుండు ఋక్షాధిపుండు
నడువ దొడగిరి యుద్ధ సన్నద్ధు లగుచు. 112

తే. వారికిరువైపులను కరువలి సుతుండు
కపికులాధీశుడును భద్రగజము లట్లు
ధీరగంభీరముగ సాగుతీరు నరసి
వారధినిజేరె! అగణిత వానరాళి. 113

ఆ. భూరి రామసేన పొంగిన సంద్రమై
సింహనాదములను జేసికొనుచు
నడచి నడచి తుదకు కడలి యావలితీర
మునకు జేరె మిగుల మోద మలర. 114

తే. అచట ఫలమూలములు రుచియైన నీరు
విరివిగా లభ్యమగు చోటు వెదకి వెదకి
విడిది యేర్పాటు జేసె విభీషణుండు
సహచరుల సాయమున కడు సంబరమున. 115

తే. అంత రాముడు లక్ష్మణు చెంత కరిగి
"తమ్ముడా! యెట్లొ వారాశి దాటినాము
కాని మున్ముందు జరుగు సంగ్రామమందు
యెన్ని ప్రాణాలు బలియౌనొ? యెరుగలేము. 116

తే. పృథ్వి నిష్కారణముగ కంపించుచుండె
నాకసమ్మున మేఘము లరచుచుండె
పక్కి సంతతి పొదలలో నక్కుచుండె
దుశ్శకునములుగా నివి దోచు నాకు. 117

తే. కనుక వెంటనె హనుమంతు నినతనయుని
అంగదుని వెంటబెట్టుక యరిగి మనము
శత్రుదుర్భేధ్య మని సర్వజగతి బొగడు
లంక నరయుట యుచితము శంక దొలగ." 118

తే. అనుచు వచియించి కోదండమును ధరించి
లంక కభిముఖముగ సాగె రాఘవుండు;
వెంబడించెను వాని విభీషణుండు
పరుగు లిడె నెంట గొప్ప వానరుల దండు. 119

ఆ. వనధిమీద సేతువును గట్టి రాముడు
వనచరాళితోడ వైభవముగ
వచ్చి లంక కవల బసజేసి యున్నట్టి
వార్త దెలిసి దనుజవల్లభుండు. 120

తే. అతి రయమ్మున తనకెంతొ యాప్తులైన
సచివ సత్తములను శుకసారణులను
పిలిచి రానున్న ముప్పు వారలకు దెలిపి
"వెంటనే మీరు వానర వేషములను. 121

తే. తాల్చి దశరథ సూనుల దరికి నరిగి
వారు వారధి నేలీల వార్ధిమీద
గట్టగలిగిరొ! వారల కదనతంత్ర
మేమిటో జూచి రం డని హెచ్చరించె. 122

తే. ప్రభువు మాట వేద వాక్యమ్ముగా నెంచి
తడవు సేయకుండ దనుజులంత
వానిముందె ఱెప్పపాటులో వానర
రూపు లైరి తోక లూపుకొనుచు. 123

తే. ఇనకులేశుని సైన్యము దనుజపురిని
జేరుటకు ముందె కపివేషధారులైన
సారణుడు శుకు డతి చాకచక్య మెసగ
వచ్చి మెలమెల్ల దూరిరి వారి నడుమ. 124

తే. కడలి వక్ష స్థ్సలమ్మునే కాలిబాట
జేసికొని సింహనాదాలు జేసికొనుచు
తీరమును జేరి నడయాడు నీరధివలె
ముందు కురికెడు కపిసైన్యమును బొడగని. 125

ఆ. అదరినట్టి గుండె లరచేత బిగబట్టి
అడలుచున్న కాళ్ల నదిమిపట్టి
బిక్కు బిక్కు మనుచు దిక్కులు జూచుచు
తిరుగుచున్న వారి తీరు నరసి. 126

ఆ. అమిత ధీవిశాలుడైన విభీషణు
డట్టె వారిగుట్టు మట్టెరింగి
"మీకు సాధ్య మగునె? నా కన్ను గప్పంగ"
ననుచు పట్టి రాము కప్పగించి. 127

తే. "వీరు రావణు డంపగా మారువేష
ములను వచ్చిన శుకసారణులు మహాత్మ!
మంత్రులుగ గాక మనల నేమరచి యిచటి
వార్తలను మోసికొనిపోవ వచ్చినారు." 128

తే. అనిన వెంటనె వారలో "యినకులేశ!
నేత యాజ్ఞకు తలయొగ్గి నీతి దప్పి
మిమ్ము వంచింప వచ్చిన మమ్ము బ్రోవు"
మనుచు వేడిరి నిజరూపమును ధరించి. 129

ఆ. ప్రభువు జెప్పినట్టి పనిజేయుటే వారి
ధర్మమందువలన తప్పబట్ట
తగదు వీరి నంచు దశరథరాముడు
దెలిపి యసుర వరుల కలతబాపి. 130

తే. అనుగు నెచ్చెలి యగు విభీషణుని జూచి
"యిపుడె వీరికి మన సైన్యమెల్ల జూపి
ప్రముఖు లందరి ఘన పరాక్రమము దెలిపి
వడిగ గొనిరమ్ము మరల నావద్ద కనియె. 131

క. వెనువెంటనే విభీషణు
డినకులపతి యాజ్ఞమేర కెల్ల విషయముల్
దనుజామాత్యులు శుక సా
రణులకు నెరిగించె నంత రాముడు వారిన్. 132

తే. చేరగా బిల్చి "మీరు జూచినవి వినిన
వెల్ల మీ యేలికకు దెల్పి యే నొనర్చు
ధర్మయుద్ధాన చావ సిద్ధముగ నుండు
మనుచు నా మాటగా దెల్పు డని వచించె. 133

తే. అంత శుకసారణులు రాము నభినుతించి
దారి పొడవున వానినే దలచుకొనుచు
వేగ లంకకు జేరి వివేకహీను
డైన రావణు సన్నిధి నడుగుమోపి 134

తే. "నిష్ఠురమ్మైన తప్పక నిజము మీకు
విన్నవించుట మా విధియన్న దెరిగి
ఆగ్రహించక వినుము దైత్యాధినేత!
అడలిపోతిమి శత్రుసైన్యమును జూచి. 135

ఉ. భండనభీములైన కపి వర్యుల ధాటికి రాముచేతికో
దండము ధాటికిన్ జడిసి దారి నొసంగె సముద్రు డంతటన్
బండలు గుండ్లు కొండలును పాదపముల్ బెకలించి వానినే
మెండుగ బేర్చి దేవతలు మెచ్చగ గట్టిరి సేతు వబ్ధిపై. 136

తే. ఎపుడు మిన్నంటురీతిని యెగసిపడెడు
అలలు తలవంచి జేజేలు పలుకుచుండ
వారధికి వన్నె బెంచుచు వార్ధిదాటి
రాము పరివార మెల్ల తీరమును జేరె. 137

తే. పర్వతాకారు లసమాన బాహుబలులు
కదన నిష్ణాతు లన్న పేర్గన్న యోధు
లబ్ధి పొడవున కనుచూపు కందనంత
మేరనున్నారు లెక్కకు మిక్కుటముగ. 138

సీ. అఖిల సైన్యాధ్యక్షుడైన నీలునకు సూ
చన లొసంగుచు నుండె నినసుతుండు
కడలిపై సేతువు గట్టిన నలుని తా
ననుసరించుచు నుండె నంగదుండు

వాలమ్మునే కరవాలమ్ముగా బట్టి
గర్జసేయుచునుండె గాడ్పు పట్టి
ఆకొన్న పులివోలె నంతట తానొచు
విహరించుచుండె విభీషణుండు

తే. వారు వీరననేల నపారమైన
వానరుల దండు కాకుత్థ్స వంశతిలకు
జయమె లక్ష్యమ్ముగా నెంచి జబ్బ జరచి
దురమునం దూకి పోరాడ నురుకుచుండె. 139

ఆ. మేరునగ సముండు భూరిగుణాఢ్యుడు
దశరథాత్మజుండు ధర్మవిదుడు
పుడమిపుత్రి మగడు నడయాడు తేజమై
వనచరాళి మధ్య వరలుచుండె. 140

ఆ. పసిడివన్నెవాడు కసిగల మొనగాడు
కనలిరౌద్రమొలుకు కనులవాడు
రణభయంకరుండు రామానుజుండు వి
ల్లెక్కుపెట్టి మింటి కెగురుచుండె." 141

ఆ. అట్టులాపకుండ నప్రియవచనముల్
బలుకుచున్న మంత్రివరుల జూచి
దనుజవల్లభుండు "విన నొల్ల మీ మాట
లాపు" డనుచు బలికె నాగ్రహించి. 142

తే. "మంత్రిసత్తములార! మీ మాటలందు
పిరికితనమును భీతియు వెల్లువెత్తు
చున్న దటుగాన స్వయముగా జూడవలయు
రండు నా వెంట రాముని దండు జూప." 143

తే. అనుచు వారల దోడ్కొని యాకసమును
దాకుచున్నట్టి రాజసౌధమ్ము నెక్కి
నేల యీనినరీతిని నెగడుచున్న
రామసైన్యము నరసి విభ్రాంతి నందె. 144

ఆ. అయిన బైటబడక నా సైన్య వార్నిధి
యందు నీలిమేఘ మటుల నిల్చి
మెరుగులీనుచున్న మేనితో నలరారు
నతడె యినకులేశు డని యెరింగి. 145

తే. మంత్రు లిరువురు జెప్పిన మాటలందు
అతిశయోక్తి రవంత లేదని గ్రహించి
కొంతకలవర మందియు నంతలోనె
సడియు సవ్వడిలేక తా సర్దుకొనియె. 146

తే. అంత సారణశుకులు సైన్యమ్ములోని
ప్రముఖ నాయకవీరుల పాటవమును
వేరు వేరుగ దెలిసిన మేర దనుజ
నేత కెరిగించి రిసుమంత భీతిలేక. 147

తే. అటుల వా రిర్వురును పల్కినట్టి నుడులు
వినిన లంకేశు డేమని మనమునందు
దలచెనో గాని యొక్కింత కలతజెంది
వడిగ జేరెను నిజ సభా భవనమునకు. 148

తే. చేరి శుకసారణులచూచి చేసినట్టి
ఘనత చాలిక దయ చేయు డని వచించి
వారు వెడలంగనే ననవద్యులైన
సచివులను బిల్చి దానవచక్రవర్తి. 149

తే. ముంచుకొని వచ్చుచున్నట్టి ముప్పు దెలిపి
యుద్ధ మొనరించుటకు ముందె యుర్వితనయ
నాకు తానుగ వశమగు నను వు దెలిపి
బాపవలె మీరె! నా మేని తాపమెల్ల. 150

తే. అంతవారంత యేలిక చింతబాపు
నట్టి తంత్రము యోచించి యసురవిభుని
చెవిని యూదిరి యిక నాదె సీతయన్న
భ్రమకు లోనాయె నా మూర్ఖ రావణుండు. 151

క. అంతట మాయావిగ జగ
మంతట పేర్గన్న దనుజు నతిబలయుతు ధీ
మంతుని విద్యుజ్జిహ్వుని
సంతసమున బిల్చి వాని సాయము గోరెన్. 152

తే. తత్క్షణమె నీవు మాయతో ధరణిజాత
విశ్వసించగ రాముని విల్లు నమ్ము
రక్తసిక్తమ్ముసైన శిరమ్ము సృష్టి
జేసి నా తాపమును మాపు జేయవలయు. 153

ఆ. అని వచించి రత్నహారమ్ము ముందుగా
కనులు చెదరు లీల కాన్కజేసె!
ఆత డంతులేని యానందమున నేగె
ప్రభువు కోర్కె దీర్ప పరుగు లిడుచు. 154

తే. శోకసంతప్త సీత యశోకవనిని
మాటిమాటికి రామనామము జపించు
కొనుచు కన్నీరుతోడుగా గూరుచున్న
తరుణమున ముందు ఖండిత శిరముపడియె. 155

తే. ఆ హఠాత్సంఘటన కామె హడలిపోయి
ఎదుట నున్నట్టి తలను కన్నెత్తి చూచి
బావురని యేడ్చె నది తన భర్త శిరమ
టన్న యావేదనముతోడ కన్ను లలయ. 156

ఆ. అంతలోనె మరల నామె దుఃఖాగ్నిలో
ఆజ్య మటుల బడియె నమ్ము విల్లు
నవియు ప్రాణవిభుని వని నమ్మి యాతల్లి
నెత్తిబాదుకొనుచు నేలనున్న. 157

ఆ. తలను ఒడిని జేర్చి పలుమారు వీక్షించి
ఇంత ఘోరమునకు హేతువేమి?
అకట యిప్ప డెవ్వ రాదుకొందురు నన్ను
ఇంక నేను బ్రతికి యేమి ఫలము? 158

ఆ. అనుచు బేల లీల నాకసమ్మును నేల
కంటనీరుబెట్టు కరణి నేడ్చి
గుండె దిటవుజేసి కొనలేక మరల నా
తల్లి యాత్మవిభుని దలచుకొనుచు. 159

ఆ. రణమునందు దుష్టరావణు వధియించి
రామబాణమహిమ రాక్షసాళి
కెరుక పరచి నన్ను చెరనుండి విడిపించి
ఆదుకొందు వనుచు నాశపడితి. 160

ఆ. కాని యింతలోనె కడు భయానకమైన
పిడుగు నెత్తిమీద బడునటంచు
దలపనైతి ననుచు విలపించు ధరణిజ
యెదుట వాలె రాక్షసేశ్వరుండు. 161

ఆ. వాలి యాామె నరసి "వారిజనేత్ర! నీ
వగపు మాన్పదలచి వచ్చినాడ!
నేను జంపలేదు నీ పతిన్ నా సైన్య
మర్ధరాత్రివేళ హత మొనర్చె. 162

తే. కన్నుమూసెను నీ భర్తయన్న నిజము
నీకు దెలియుటకోసమే నీరజాక్షి!
ఆనవాలుగ బంపితి నతని శిరము
కనుక వగమాని నేను జెప్పునది వినుము. 163

ఉ. చచ్చినవానికై యిటుల స్వాంతము బ్రద్దలుగాగ నేడ్చినన్
వచ్చునె? ప్రాణముల్ తిరిగి, వాని తలంపుల నింకమాని నిన్
మెచ్చిన నన్ను జేరి భువిమీద గలట్టి సమస్త భోగముల్
హెచ్చుగ మించి నీ వనుభవింపుము లంకకు రాణివై సదా." 164

ఆ. అనుచు కపట బుద్ధి దనుజాధిపుడు పల్క
కన్నులెర్రజేసి క్ష్మాతనూజ
"భర్త జచ్చినంత పతితగా మారునే?
పుణ్యశీలయైన పొలతిమిన్న. 165

ఆ. ఇపుడు దెలియ వచ్చె నిది నీవు పన్నిన
కుట్రయనుచు నాకు కుటిలదనుజ!
యిట్టి నీచమైన యెత్తులతో నీవు
నను వశమ్ము జేసికొన తరమ్మె. 166

ఆ. బవరమందు నాదు భర్త నెదుర్కొను
సాహసమ్ములేక శౌర్య ముడిగి
హీనమైన మార్గమెన్ను కొన్నట్టి నీ
పాడుమొగము జూడ పాప మొదవు. 167

ఆ. మ్రోగి తీరు రేపె మూర్ఖుడా! నా భర్త
యుద్ధభేరి చావసిద్ధ పడుము;
రామ బాణమునకు ప్రాణము లర్పించి
సురల నలరజేసి సుగతి గనుము." 168

తే. అనుచు భూజాత మిగుల ధైర్యమున బలికె
నంతలో రాజభటు డొక డరుగుదెంచి
యొడలు నిండిన చెమటను దుడుచుకొనుచు
వినయమున మ్రొక్కి యీా రీతి విన్నవించె. 169

తే. "కోపగించకు దొర! మన కొలువు కూట
మందు మంత్రులు సర్వసైన్యాధిపతియు
చేరి యాలోచనలు పెక్కుజేసి చేసి
నన్ను బంపిరి తమ దర్శనమ్ము గోరి." 170

క. అని భటుడు దెలిపినంతనె
దనుజాధీశుండు మిగుల తల్లడపడుచున్
వెనువెంటనె కడువడిగా
జనియెను సాధ్వీలలామ జానకి మురియన్. 171

ఆ. అసురనేత యట్లు లరిగిన వెంటనే
మాయదారి శిరము మాయమయ్యె!
నంత ధనువు నమ్ము నాదారినే బట్టె
శింశుపమ్ము మనము చివురు దొడిగె. 172

ఆ. వనము వీడినట్టి దనుజనాథుడు సభా
మందిరమ్ము జేరి మంత్రివరులు
రచనజేసినట్టి రణతంత్ర మారసి
వీర దళపతులను జేర బిలిచి. 173

తే. "దనుజవరులార! యుద్ధము తప్పదింక
అప్రమత్తము గావింపు డఖిల సైన్య
వాహినుల" నంచు ధైర్య మేర్పడగ దెలిపి
చనియె నటనుండి తన దివ్యసౌధమునకు. 174

ఆ. మరచిపోదమన్న మరువ శక్యముగాని
కుటిల దానవేంద్రు కుట్రలెల్ల
దలచుకొనుచు నెపుడు దొలగునో యీ బాధ
లనుచు వగచు చుండె నవనితనయ. 175

తే. అంతలో "సీత! నీవింక చింతవిడుము
మంచి రోజులు త్వరగ నీ పంచజేరు"
నన్న కమ్మని వాక్యము లామె చెవిని
బడియె! వెంటనె యా వైపు బారజూచి. 176

ఆ. చెట్టు చాటు నుండి చేరవచ్చిన స్నేహ
శీల సరమ నరసి సీత మురిసి
"ధరణి కన్నమిన్న దయగల హృదయ మ
టన్న ధర్మసూక్తి కద్ద మీవు. 177

ఆ. అమృత తుల్యమౌచు నలరారు నీనుడుల్
రామరక్ష నాకు లంకలోన
నిత్యధర్మపరుడు నీ భర్త నా స్వామి
కాప్తమిత్రుడైన యటులె నీవు. 178

ఆ. ఆది నుండి నన్ను ఆదరమ్మున జూచి
కొంత బాధ పంచు కొంటివమ్మ!
మరల జెప్పుమమ్మ! మంచిమాటలు కొన్ని"
యనుచు బతిమలాడె నవనితనయ. 179

ఆ. చిన్నపిల్లవోలె సీత తన్నడిగిన
సరణి నరసి సరమ జాలిగలిగి
ఆమెవంక మిగుల నాసక్తితో జూచి
యెవరు వినని రీతి నిట్టు లనియె. 180

సీ. "కుటిల దానవనాథు క్రూరత్వమే వాని
ఆయువు నరకాల నణచునమ్మ!
పడగెత్తి బుసకొట్టు కడగండ్లు కలకాల
మొకచోట కాపుర ముండవమ్మ!
మంచి కేనాటికి మరణమ్ము లేదను
పరమసత్యమును నీ వెరుగు మమ్మ!
దుష్ట శిక్షణ తన తొలి ధర్మముగ నెంచు
నీ పతి యనిలోన నెగ్గునమ్మ!

తే. అన్నిటిని మించి స్వచ్ఛమౌ అగ్నివంటి
నీ పవిత్ర శీలమె సదా నిన్ను గాచి
శీఘ్రముగ భర్త యెద మీద జేర్చి తీరు
నమ్మ! సీతమ్మ! నా మాట నమ్ముమమ్మ!" 181

క. అని సరమ జానకీసతి
కనునయ మెనయంగ దెల్పె నంతటిలోనన్
వినిపించెను శ్రీ రాముడు
ధనువును మ్రోగించినట్టి ధ్వని నల్దెసలన్. 182

తే. ఆ మహానాదమును విని యవనిజాత
అద్ది తన పతి వింటి గొంతని తలంచి
మొగ్గ దొడిగిన ధైర్యాన మురిసిపోయె
సరమ సంతోషము మరింత పెరిగిపోయె. 183

తే. దనుజ పురి కుత్తరమునుండి వనచరాళి
రామునమమతి తోడ శౌర్యమ్ము మీర
నష్టదిక్కులు తల్లడ మందునటుల
సమర సంకేత సింహనాదములు జేసె. 184

క. ఆ నాదము వినినంతనె
యే నేరము జేయనట్టి యెందరో దనుజుల్
ప్రాణభయమ్మున వణకిరి
యీనాడీ ముప్పు దప్పు టెట్లో యనుచున్. 185

తే. కోరలను జాచి బుసకొట్టు కోడెత్రాచు
పగిది పగతోడ రగులు రావణవిభుండు
లంకచుట్టును కోట ద్వారములయందు
పెంచె రక్షణ మిగుల దుర్భేద్యముగను. 186

సీ. తూరుపు ద్వారాన మేరు పర్వతధీరు
నసమాన బలుని ప్రహస్తు నుంచె!
దక్షిణమ్మున మహోదరమహాపార్శ్వులన్
సాహసవీరుల జంట నుంచె
పశ్చిమ ద్వారాన పగతుర మాయతో
క్షితిని గూల్చెడు నింద్రజిత్తు నుంచె
నగరమ్ము నడిబొడ్డు నందు మహావీరు
నక్షీణబలు విరూపాక్షు నుంచె

తే. తాను శుకసారణులును నుత్తరమునందు
నరిభయంకరమైన సైన్యమ్ముతోడ
ఇది పగలురేయి యనకుండ ఎల్లప్రొద్దు
భద్రతాచర్యలెల్ల నేర్పాటు జేసె. 187

ఆ. దనుజవిభుని యుద్ధతంత్రంపు వివరము
లెల్ల దెలిసికొనిన యినకులేశు
డాప్తగణము తోడ నన్నియు చర్చించి
యందరకును విధుల నప్పగించె. 188

సీ. నీలుడా! నీవు నీ నేర్పుతో తూరుపు
ద్వారమ్ము ఛేదించి పోరవలయు!
అంగదా! నీవు సైన్యముతోడ దక్షిణ
ద్వారాన నెదురొడ్డి పోరవలయు!

పవనాత్మజా! నీవు పశ్చిమమ్మునగల
ద్వారాన చెలరేగి పోరవలయు!
సౌమిత్రి నీవు నా జంటగా నుత్తర
ద్వారాన నిలబడి పోరవలయు!

తే. తక్కు కపిముఖ్యులును వియత్తలము జేరి
లంక మధ్యనుగల పటాలమ్మునెల్ల
ముప్పతిప్పల బెట్టుచు ముందు ముందు
కోలుకొనలేని రీతిని గూల్చవలయు. 189

తే. అట్టు లతిముఖ్యులగు వారి కానతిచ్చి
వారినెల్లను దోడ్కొని వాయువేగ
మున సువేలాద్రి శిఖరాగ్రమునకు జేరి
చూచె దనుజేశు నగరిని చోద్యముగను. 190

తే. కోటి మణిదీప్తు లెసగ త్రికూటనగము
నందు రాజిల్లుచున్న నాయద్భుతమ్మె
రావణాసురు సామ్రాజ్య రాజధాని
యని విభీషణు డెరిగించె నినకులునకు. 191

ఆ. మొదటిసారి కొండ మొననుండి లంకను
నపరసంధ్య వేళ నరసినట్టి
రామభద్రు డబ్బుర మ్మంది దాని ని
ర్మాణ కౌశలమును బ్రస్తుతించె. 192

ఆ. వాయు సుతుడు లంకవైభవమ్మును గూర్చి
తమకు దెలిపినట్టి దానికన్న
మిన్నయైన రీతి నున్న దౌరా యని
సైన్యగణము గూడ చకిత మాయె. 193

సీ. ఆకాశమున నుండి లోక మచ్చెరువంద
వ్రేలాడు దీపాల డోలలీల
మయశిల్పి దివ్య నిర్మాణ కౌశలమున
కనవద్యరత్న దర్పణము లీల
రావణాధీశుని రమణీయసౌభాగ్య
మును చాటి చెప్ప కేతనము లీల
ఈ రేడు భువనాల నెనలేని విఖ్యాతి
గనిన భూలోక నాకమ్ములీల.

తే. దోచుటయె గాక చీమయు దూరలేని
రీతి నుక్కును గరగి నిర్మించినట్టి
కోట లన్నియు నక్షత్రకూటమునకు
వెరపు గలిగించు రీతిని వరలుచుండె. 194

ఉ. "ఇంత మనోహర మ్మయిన యీ నగరమ్మును రూపుమాప నా
పంతము దీరునే? పుర నివాసు లొనర్చిన పాపమేమి? నే
నింతటి తీవ్ర నిర్ణయము నెందుకు జేసితి? దుష్ట రావణుం
డెంత తెగించినన్ మరల నింకొక యత్నము జేసి చూచెదన్." 195

తే. దాశరథి యట్లు దలచి యందరను జూచి
"చివరి హెచ్చరికగ కపిశ్రేష్ఠుడైన
అంగదుని రాయబారిగ నసురవిభుని
దగ్గరకు బంపవలెనని తలచినాడ." 196

ఆ. అని వచించి రాము డంగదున్ ప్రియమార
బిలిచి తాను జెప్పదలచుకొనిన
సూక్తు లన్ని మిగుల  సుస్పష్టముగ జెప్పి
పంపె దానవేంద్రు పట్నమునకు. 197

తే. అంగదుడు వాయువేగాన నాకసమున
పయన మొనరించి యనుమతి బడయకుండ
వ్రాలె నిర్భీతితోడ రావణుని మ్రోల
నాత డత్యంత దిగ్భ్రాంతి నందులీల. 198

ఆ. కనుల నెర్రజేసి తనవంక జూచెడు
దానవేంద్రు రాజదర్ప మెరిగి
"నిన్ను పెక్కుమార్లు నీటముంచిన వాలి
అనుగు సుతుడ! అంగదాహ్వయుండ. 199

ఆ. దనుజనాథ! నిన్ను దునుమాడుట రణాన
నల్లి నొడిసిపట్టి నలిపి నంత
సేపు బట్టదైన చివరిగా నీ మేలు
చిత్తమందు దలచి చెప్పచుంటి. 200

తే. బ్రతుకుపై తీపి నీకు రవ్వంత యున్న
ఇప్పటికినైన మైథిలి నప్పగించి
మన్ననను గోరు మట్లుగాకున్న నిన్ను
చంపి నీ రాజ్యమును విభీషణున కిడుదు." 201

క. అని తన మాటగ నీ కడ
నినకుల వంశాబ్ధి చంద్రు డెరిగింపు" మనెన్
అని అంగదు డనినంతనె
కనలుచు లంకేశు డతని గని యిట్లనియెన్. 202

చ. "అనుమతి లేకయే యొక నరాధము ధూత నటంచు వచ్చి నీ
ఘనతను నీవె చాటుకొని కర్ణకఠోరములైన పల్కులన్
మన మెరియంగ బ్రేలితివి మర్కట! నీ శిర ముత్తరించి నే
ననిపెద తత్కళేబరము నావనవాసి" కటంచు వాకొనెన్. 203

తే. రావణుని నోట నటుల వెల్వడిన మాట
అంగదుని పౌరుషాగ్నికి ఆజ్యమాయె;
కన్ను లెరుపెక్క నాతడు కదను ద్రొక్కి
పండ్లు గొరుకుచు దనుజేశుపైకి దుమికె. 204

తే. అంతలో నచ్చటనె యున్న యసురవిభుని
అంగరక్షకు లతనిని యడ్డగించి
మిడిసిపడకుర కోతి! నీ మెడను నరికి
మస్తకము కాన్కజేతుము మా విభునకు. 205

తే. అనుచు కత్తులు దూసిన యసురభటుల
నొక్కయుదుటున నంగదు డొడిసిపట్టి
వాలమున జుట్టి రావణుపైకి విసరి
వెంటనే బిగ్గరగ నవ్వి మింటి కెగసె. 206

తే. "అసుర విభుపట్ల నాగ్రహ మెంతయున్న
నణచుకొని శాంతి సౌఖ్యమ్ము లభిలషించి
పంపితిని అంగదుని రాయబారమునకు
కడకు మనమంచికే యది బెడిసికొట్టె. 207

తే. తలుపు తట్టిన అభయమున్ తరిమికొట్టి
దారి సుగమము జేసె నా దనుజనేత
యుద్ధమున" కంచు వానరయోధులెల్ల
భళి భళీయన రామభూపతి వచించె. 208

ఆ. చాలయేండ్లనుండి సంగ్రామమే లేక
గోళ్ళు గిల్లుకొనుచు గూరుచున్న
వనచరాళి మేలి బలపరాక్రమములు
తోకలెత్తి కదనుద్రొక్కసాగె. 209

తే. అపుడు వెంటనె శ్రీరామునాజ్ఞమేర
కర్కసంభవు డఖిల సైన్యమును జూచి
ముందుగా లంక నల్దెసల్ ముట్టడించి
కోటగోడల నెల్లను గూల్చు డనియె. 210

తే. తిరిగి చూచుసరికి శరనిధి చందాన
పొంగి సైన్యమంత ముందు కురికి
తరులు గిరులతోడ పరిఖలు పూడ్చి
ముమ్మరముగ కోట ముట్టడించె. 211

తే. కోటనాలుగు దెసల కాకుత్స్థవిభుని
యగణితమ్మగు కపిసైన్య మాక్రమించె
నన్న వార్తలు విని యసురాధిపుండు
కలత జెందక ధీరత బలికెనిట్లు. 212

ఆ. "దనుజవీరులార! మన పూర్వవిఖ్యాతి
కిదియె నిక్కమైన తుది పరీక్ష!
అమరనాథు గెల్చినట్టి దానవనాథు
పరువు మీరె నిలుపవలయు నేడు. 213

ఉ. చీమలదండు వంటి కపిసేనలు లంకను ముట్టడించుటా?
నా మనసగ్ని గోళమయి నన్ను దహించుచునుండె గాన మీ
రేమరుపాటు నందకయె ఎక్కడజిక్కిన వారి నక్కడే
ఆ మనుజాధముండు భయమందెడు రీతిని మట్టుబెట్టుడీ." 214

తే. అనుచు నావేశభరితమౌ నానతిచ్చి
దనుజనాథుడు సేన నుత్సాహపరచె
తరలె వెంటనె వివిధాయుధములతోడ
వైరులను జంప రాక్షస వీరగణము. 215

తే. ఉత్తర ద్వారమందు మహోగ్రుడైన
నినకులేశుడు కోదండ మెక్కువెట్టి
దుష్ట రావణుమీదనే దృష్టి పెట్టి
మించు నేర్పున పర్యవేక్షించుచుండె. 216

తే. అట్టు లిరు పక్షముల నేత లప్రమత్త
మగణితమునగు సేనల పగరపైకి
బంపి తామును కనులెర్రబడెడులీల
యుద్ధసరణిని గమనించుచుండి రపుడు. 217

సీ. లంకవైపున నుండి రణభేరు లాగక
రోషభీషణముగ మ్రోగుచుండె!
ఆ నాదముల నెల్ల అబ్ధిలోపలముంచి
కపిసేన రౌద్రమ్ము గ్రక్కుచుండె!
క్రక్కిన రౌద్రమే కాలాగ్ని కీలయై
యరివీర గణమును దరుముచుండె!
ఆ వేడి మా ప్రతాపాగ్ని ముం దెంతని
దనుజాస్త్రములు తొడదట్టుచుండె!

తే. ఇట్టు లిరుతెగ లెదురొడ్డి పట్టు విడక
శత్రుపక్షము నొక్కింత సరకు గొనక
సలుపు సమరము దర్శింపవలయునంచు
నమరగణ మెల్ల గుమిగూడె నాకసమున. 218

మంజరి ఇరుపార్శ్వముల సైన్య మెటులైన గెలుపు
సాధించవలెనన్న సంకల్పమునను
ప్రాణాలనే తృణప్రాయముగనెంచి
సలుపు భయంకర సంగ్రామమందు
తరుగంగ బడినట్టి తలలు మొండెములు
ఎగజిమ్ము రుధిరమ్ము ఏరులై పారె!
తన సేన లనిలోన ధర గూలినట్టి
శిరములన్ గని గుండె చెదరి రావణుడు
వీర కుమారుని వెంటనే బిలిచి
మేఘనాదా! నేడు మిక్కుటమ్మైన
ఆవేదనమ్ము న న్నావహించినది
అని లోన మన వీరు లసమాన బలులు
కోతిమూకల ముష్టిఘాతాల వలన
యెందరో ధర గూలి రిది యెంత వింత?
క్షణము జాగైనచో సర్వమ్ము చెడును!
కనుక వెంటనె నీవు కదనరంగమున
దుమికి వైరులనెల్ల తుదముట్ట జేయు
మని యింద్రజిత్తున కాదేశ మొసగె!
నతడు తండ్రికి మ్రొక్కి ఆ క్షణమ్మందె
ఆహవమ్మున కేగ నాయత్తమాయె!
నంతలో శక్రజిత్తాహవమ్మునకు
సైన్య సమేతుడై చనుదెంచుచున్న
వార్త విభీషణు వలన నాలించి

శ్రీరాము డంగదున్ చేరంగ బిలిచి
మేఘనాదునిపైకి మిక్కుటమ్మైన
దండుతో వెంటనే తరలి పొమ్మనియె!
అంగదుం డది గొప్ప యవకాశ మంచు
తొడదట్టి గర్జించి దుమికె ముందునకు. 219

సీ. బహుపరాక్రమ శాలి భానుజుం డొకవైపు
ఉక్కుగుండెల నీలు డొక్కవైపు
అసమానబలు డనిలాత్మజుం డొకవైపు
ఉద్దండుడౌ గజు డొక్కవైపు
శత్రుభీకరుడైన శతవలి యొకవైపు
పిక్కలుబ్బిన ధూమ్రు డొక్కవైపు
ఘనశౌర్యనిధి మహాకాయు డింకొకవైపు
దిక్కుంభి సమమైందు డొక్కవైపు

తే. నప్రమత్తత రిపుల చెండాడుచుండ
శరభుడును విభీషణుడును జాంబవంతు
డాదిగా గల బలయుతు లసురవరుల
తరిమి చంపంగ దొడగిరి త్వరితగతిని. 220

సీ. అగ్నికేతుని బృంద మందున్న నల్వురన్
ఇనకులేశుడు రాము డిలను గూల్చె!
అశని ప్రభువు బట్టి నతిధృతిన్ ద్వివిదుండు
మద్ది చెట్టున మోది మట్టుబెట్టె!
దోర్దండబలుని విద్యున్మాలిని సుషేణు
డక్కసు దీరంగ రక్కి చంపె!
పాపాల గుట్ట విరూపాక్షు డనువాని
నొక బాణమున లక్ష్మణుడు వధించె!

తే. అట్లె దానవ వరుల శస్త్రాస్త్రములకు
పెక్కు వానర ముఖ్యులు బీర ముడిగి
ప్రాణములు వీడి రైనను బవరమందు
గెలు పెవరిని వరించునో తెలియ దాయె. 221

తే. అట్టి యుత్కంఠ యిరువైపు లలము కొనిన
సమయమున మేఘనాదుడు స్వర్ణరథము
మీద సేనాసమేతుడై మిక్కుట మగు
దర్పమున యుద్ధభూమికి తరలివచ్చె. 222

తే. అంత హరిజిత్తు నారసి యంగదుండు
"రమ్ము నీకోసమే రణరంగమందు
కన్నులార్పక నిలబడి కాచియుంటి
నేటితో మూడె దుర్మతీ! నీకు చావు." 223

క. అని యంగదు డనినంతనె
కనుగొలకుల నిప్ప లురల కనలుచు హరిజి
త్తనుపమ బాణత్రయమును
వనచరుపై నేకధాటి వదలెను పెలుచన్. 224

ఆ. వజ్రతుల్యమైన వాయుతనూజుని
మేను మేఘనాదు బాణధాటి
కెంత గాయపడిన నెంచక అంగదుం
డురికి వాని రథము విరుగ దన్నె. 225

తే. సారథిని గుర్రముల గూడ క్షణములోన
ముష్టిఘాతాలతోడ దున్నుటను గాంచి
అంగదుని బాహుబలమున కబ్బురపడి
మేఘనాదుడు వెంటనే మింటి కెగసె. 226

తే. మేఘములలోన దాగి యమోఘమతి భ
యంకరమ్మైన నాగాస్త్ర మదను జూచి
ఘనవిరోధులు రామలక్ష్మణులపైకి
వదలె నతిలాఘముగ నవారితముగ. 227

ఆ. అట్లు క్రూరకర్ము డామేఘనాదుడు
వదలినట్టి నాగపాశజాల
మరి భయంకరులగు నా యన్నదమ్ముల
కదలకుండ పట్టి కట్టివైచె. 228

తే. ధర్మ సంరక్షణార్థము ధరణి మీద
అవతరించిన దివ్య గుణాభిరాము
లట్టులోక ధర్మహీనుని యస్త్రములకు
జిక్కి స్రుక్కుట యెంత విచిత్ర మనుచు. 229

తే. నిఖిల వానర సేన కన్నీరు నింపె
నినకులేశుడు రౌద్రాన నెక్కువెట్టి
నట్టి బాణము పిడికిలి యందు నిలిచి
అనదలీతిని స్వామినే అరయుచుండె 230

తే. స్వప్నమందైన నూహింప జాలనట్టి
సంఘటన కబ్బురంపడి సమర మాగె!
జీవరహితుల మాదిరి చేష్ట లుడిగి
ధరను బడియున్న దశరథాత్మజుల జూచి. 231

ఆ. రావణాత్మజుండు రామలక్ష్మణు లనిన్
మరణ మొంది రనుచు మదిని మురిసి
త్వరితగతిని నేగి తండ్రికీ శుభవార్త
చెవిని వేసె వాని చింత దొలగ. 232

క. వెనువెంటనె దనుజేశుడు
వనమున కాపున్న ముఖ్యవనితలయందున్
తన మెప్పగనిన యసురాం
గన త్రిజటను బిల్వ నంపి కడుదర్పమునన్. 233

తే. త్రిజట! నీకొక శుభవార్త దెలుపుచుంటి
రాముడును వాని తమ్ముడు రణమునందు
జీవములు వీడినా రింద్రజిత్తు వలన
కనుక వైదేహి కీ సత్యమును వచించి. 234

ఆ. పుష్పకమున యుద్ధభూమికి గొంపోయి
రక్తసిక్తమైన రాము శవము
నటులె ప్రక్కనున్న యనుజుని శవమును
రూపవతికి వేగ జూప వలయు. 235

తే. అపుడు జానకి మగనిపై యాశవీడి
నేనె సర్వస్వ మని యెంచి తానె వచ్చి
చేరు నాశయ్యపైనని చెప్పి పంపి
మునిగె మధురోహలందు నా మూర్ఖనేత. 236

తే. అసురవిభుపల్కు నమ్మశక్యమ్ము గాని
దని దలంచియు త్రిజట చేయునది లేక
సీత కడకేగి చెడువార్త చెప్పవలసి
వచ్చె నని తెల్పె వగచి రావణుని మాట. 237

తే. వేయి బాణము లొకమాటె వీనులందు
గ్రుచ్చుకొనినట్లుగా నెంచి కుమిలి కుమిలి
యేడ్చి జానకి "నీ మన సెట్లు లొప్పె?
త్రిజట! యింతటి దుర్వార్త దెలుప నాకు. 238

తే. అనుచు రోదించు చున్నట్టి యవనిజాత
కెన్ని చెప్పట యుచితమో యన్ని చెప్పి
పుష్పకమ్మున దోడ్కొని పోయె త్రిజట
రావణుడు చెప్పి నటు రణరంగమునకు. 239

తే. సమరమును మాని రామలక్ష్మణుల చుట్టు
మూగియున్నట్టి వానరముఖ్యు లెల్ల
ఆకసమ్మున పుష్పక మరుగుదెంచు
శబ్దమును విని మిక్కిలి చకితులైరి. 240

తే. పుష్పకము కొంతదిగి యుద్ధభూమిపైన
తిరుగుచున్నట్టివేళ దగ్గరనెయుండి
జానకీసతి రామలక్ష్మణుల జూచి
వారి దుస్థితిగని యేడ్చె భోరు మనుచు. 241

తే. ఒక్క కడగంటి చూపుతో నుర్వితలము
చలనమును మాన్పి శాసించగలుగునట్టి
పరమశూరులు నెత్తుటి పడుక మీద
చలన రహితులుగా నున్న సరణి దలచి. 242

ఆ. "ఇంద్రజిత్తు వలన నీ మహావీరులు
మడసి రనుచు నమ్మ మనసు రాదు;
కాలనాగులీల కాలమే పగబట్టి
కాటువేసె నకట! మాటువేసి. 243

ఆ. చాలమంది ఋషులు సత్పుత్రులను గని
వసుధలోన మిగుల వాసికెక్కి
బ్రతికి నన్నినాళ్ళు పసుపు కుంకుమలతో
వెలయగల నటంచు పలికినారు. 244

తే. వారి దీవెన లేమాయె! వావి దొరగి
మహిత గుణశాలి మరది నమానుషముగ
పరుషవాక్యాలు బలికిన పాపఫలము
పట్టు విడువక నేడు నా బొట్టు దుడిచె." 245

ఆ. అనుచు శిలలు గరగు నటు విలపించెడు
సీత నరసి త్రిజట "చింతమాను
మమ్మ! నన్ను నమ్ము మసువులు బాయలే
దన్నదమ్ము లిర్వు" రని వచించి. 246

తే. "వారి నెమ్మోము లిసుమంత వాడలేదు
తనువులందున తేజమ్ము తగ్గలేదు
కనుక వెంటనె స్పృహవచ్చి కదనమందు
దేవతలు మెచ్చ జయము సాధింతు రమ్మ! 247

ఆ. అనిన త్రిజట మాట లాలించి వైదేహి
ఆదినుండి యామె యనిన యటులె
అన్ని జరుగుచున్న వనునట్టి చిగురాశ
తోడ పుష్పకమున తోట జేరె. 248

ఆ. పుడమి సెజ్జపైన మూర్ఛిల్లిపడియున్న
పురుష కేసరులను భూరిబలులు
పవనతనయ ముఖ్యవనచరాధిపులంత
నొక్కరీతి జూచుచుండి రంత. 249

తే. అపుడే స్పృహనొందిన యనుపమాన
ధర్మనిరతుడు రాముడు దగ్గరున్న
తమ్మునిం గని "రక్తపు తల్పమందు
కనులుమూసితివా తండ్రి!" యనుచు వగచె. 250

తే. ప్రాణతుల్యుడ వగు నీవు లేని నాడు
సమర మింకేల? రావణు జంపనేల?
పుడమిసుత నయోధ్యకు గొనిపోవనేల?
సతము నిన్నే స్మరించుచు బ్రతుకనేల?" 251

ఆ. అనుచు వగచి వగచి ఆపైని మాటలు
పెకల కటులె మరల పృథ్వి మీద
చేష్ట లుడిగి పడె నచేతనమ్ముగ రాము
డాప్తగణము గొల్లు మనెడు లీల. 252

తే. అన్న కొమరుని పాపకృత్యమ్ము వలన
ప్రాణమాత్రావశిష్టులై వసుధనంటి
యున్న కారణజన్ముల యునికి నరసి
బెంగయును భీతి నందె విభీషణుండు. 253

తే. అంతలోపల నొక్క ఝుంఝూనిలమ్ము
భీతిచే దశదశలు కంపించునటుల
పర్వతమ్ములు గడగడ వణకునటుల
అవనిజమ్ములు ధర గూలు నటుల వీచె. 254

తే. ఆ ప్రభంజన మందుండి యవతరించె
పక్కిరాజు గరుత్మంతు డక్కజముగ
అతని రెక్కల చప్పడు నాలకించి
అదరి పరువిడె సర్వ శస్త్రాస్త్రచయము. 255

తే. అంత గరుడుడు పెనుమూర్ఛ నందియున్న
కోసలేంద్రుని కొమరుల కూర్మి మీర
మెల్లమెల్లగ స్పృశియించి మేలుకొలిపి
అటులె గాయమ్ము లన్ని మాయమ్ము జేసె. 256

తే. క్రొత్త అనుభూతితో మేలుకొనినవారు
కట్టెదుట నున్న పక్షీంద్రు గాంచి లేచి
"అడుగకయె వచ్చి నేడు మమ్మాదుకొనిన
మాననీయుడ! నీమేలు మరువ" మనిరి. 257

ఆ. అంత వైనతేయు డాయన్నదమ్ముల
పారమార్థికతను బ్రస్తుతించి
"రామభద్ర! మరల రణరంగమున నిల్వు
మమరగణము మెచ్చ ననుజుతోడ. 258

ఆ. తిరుగులేని జయము త్వరలోనె సాధించి
పాపి రావణుని సబాంధవముగ
చంపి లోకమునకు శాంతి ప్రదానము
జేసి సుఖము గనుము సీతతోడ." 259

ఆ. అనుచు దెలిపి గరుడు డంజలి ఘటియించి
సెలవు నా కటంచు పలికి మరల
నాకసమున కెగసి అట్టె మాయమ్మాయె
నంద రతనివైపు నరయుచుండ. 260

తే. అంత నిక్ష్వాకుకులజు లనంతమైన
యుత్సుకత తోడ నురికిరి యుద్ధమునకు
వారివెంబడి జయజయ ధ్వానములను
సలిపి అరిగెను వానర సైన్యమెల్ల. 261

ఆ. తొలగె రామలక్ష్మణుల పీడయని నమ్మి
కన్న కలలె మరల గనుచునున్న
అసురవిభుని చెంత కరుదెంచి చారులు
భయము గదుర నిట్లు పలికి రపుడు. 262

తే. "దానవేశ్వర! నాగబంధములు వీడి
కట్లు దెగినట్టి మదమత్తకరులు వోలె
రామలక్ష్మణు లిర్వురు లంకవైపు
అరుగుదెంచుచున్నారు సైన్యమ్ముతోడ. 263

ఆ. గుండె లవియు రీతి గూఢచారులు దెల్పి
నట్టి వార్త విన్న యసురనేత
అగ్గివోలె మండి ఆ బాధ దిగమ్రింగి
పండ్లు గొరికి శిరము బాదుకొనియె. 264

ఆ. దొడ్డవీరుడైన ధూమ్రాక్షు బిలిపించి
గణుతిగన్న సైన్యగణముతోడ
క్షణము జాగులేక సమరభూమికి జని
శత్రుతతిని వేగ జంపు మనియె. 265

తే. కండబలసిన కొదమసింగముల వంటి
ఖరములను బూన్చినట్టి బంగారు రథము
నెక్కి యగణిత సైన్యవాహినుల తోడ
రావణుడు మెచ్చ జనియె ధూమ్రాక్షు డనికి. 266

తే. వాయునందను నాయకత్వమ్మునందు
కపివరుల దండు తరువులు గండశిలలు
మారణాయుధములుగ ధూమ్రాక్షుదండు
నడ్డుకొని గడ్డి గరపిరి నడుగడుగున. 267

తే. గడియ గడియకు నినిని ఉత్కంఠ హెచ్చె
నప్పు డిరు వర్గములయందు నాగ్రహమ్ము,
పట్టుదలయును హెచ్చె! నప్పట్టునందు
జాగు చేసిన జయము చేజారు నను చు. 268

తే. తలచి పావని యొక పర్వతమును బెరికి
విసరె ధూమ్రాక్షు మీదికి భీకరముగ
దానిదెబ్బకు నుగ్గాయె వానియొడలు
చచ్చె సైన్యము సైతము చాలవరకు. 269

క. తక్కిన సైనికు లందరు
దక్కెను ప్రాణము లటంచు దనుజ నగరికిన్
గ్రక్కున జని యధిపతి గని
దిక్కిక నీవే యటంచు దెలిపిరి భీతిన్. 270

తే. వరుస నపజయములకు రావణుడు బెదరి
పొట్ట పగిలిన పాములా బుసలుకొట్టి
వజ్రదంష్ట్రుని బిలిపించి బవరమందు
నసువులను వీడె ధూమ్రాక్షు డని వచించి. 271

తే. యుద్ధ తంత్రమునందు నీకున్న నేర్పు
పణముగా నొడ్డి యా నరపతుల గూల్చి
శత్రుసైన్యము నెల్లను సంహరించి
కోలుపోయిన పరువు చేకూర్చు మనియె. 272

తే. వజ్రదంష్ట్రుడు తలవంచి "ప్రభువరేణ్య!
తమరు నాపైన నిడిన బాధ్యతను నేడె
సఫల మొనరించి రామలక్ష్మణుల తలలు
తెచ్చి మీకిచ్చి ఋణము నే దీర్చుకొనెద. 273

ఆ. అనుచు వజ్రదంష్ట్రు డతి దంభమున బల్కి
అరుల నడల జేయు నరద మెక్కి
లెక్కబెట్ట వీలులేని సైన్యమ్ముతో
చనియె సరభసముగ సమరమునకు. 274

ఉ. కొందరు విచ్చుకత్తులను కొందరు భీకర తోమరమ్ములన్
కొందరు గండ్రగొడ్డళుల కొందరు బంగరుచుట్టుకైదువుల్
కొందరు ముద్గరమ్ములను కొంద రకుంఠిత శూలజాల మి
ట్లందరు చేతి కందిన మహాయుధముల్ గొని దూకి రాజికిన్. 275

ఆ. అరిభయంకరమ్ము లగు నినాదాలతో
వాలి పుత్రువెంట వనచరాళి
వజ్రదంష్ట్రు సైన్యవాహినిపై దూకి
కొల్లగొట్టె వారి గుండె దిటవు. 276

ఆ. అపుడు దనుజసేన హాహారవమ్ములు
నేల దద్దరిల్ల నింగిదాకె!
కోతి గుంపు విసరు కొండల ధాటికి
అరుల శరము లన్ని విరిగి పడియె. 277

తే. వజ్రదంష్ట్రుడు వెంటనే ప్రళయకాల
రుద్రుని విధాన నిరుపమ రౌద్ర మెనయ
బాణవర్షము గురిపించి వాలిసుతుని
తనువు నెల్లను రక్తసిక్త మ్మొనర్చె. 278

తే. అంగదుడు గాయముల కింత బెంగపడక
గంధకరిమీది కురుకు సింగమ్ము కరణి
వజ్రదంష్ట్రునిపై దూకి వాని నటులె
సొమ్మసిల జేసె ముష్టిఘాతమ్ముతోడ. 279

తే. "క్రిందబడినంత మాత్రాన కందుకమ్ము
మరల మీదికి నెగురదే మర్కటాధ
మా!" యనుచు లేచి గదను ముమ్మారు త్రిప్పి
అంగదుని పైకి విసరె దైత్యాగ్రసరుడు. 280

తే. వాలి నందను డతిలాఘవమున గదను
పిడికిటం బట్టి ఛీయని విసిరికొట్టి
చెంత నున్నట్టి దనుజుని చేతి కత్తి
లాగుకొని వజ్రదంష్ట్రు శిరమ్ము నరికె. 281

తే. రామలక్ష్మణు లదిగాంచి ప్రేమమీర
నంగదుని యుద్ధనైపుణ్య మభినుతించి
రాంజనేయుడు సుగ్రీవు డాది ముఖ్య
వనచరులు సైత మానందభరితు లైరి. 282

ఆ. వజ్రదంష్ట్రు మరణవార్త విన్నంతనే
దనుజ నగరమంత తల్లడిల్లె!
పంక్తికంధరునకు భయము రెట్టింపాయె
కాళ్ళక్రింది పుడమి కదలిపోయె. 283

క. అంత నకంపను డను దే
వాంతకు బిలిపించి మడసి రాహవమున, ది
గ్దంతుల కెనయగు వీరు లి
దెంతయు మది నొవ్వజేసె నేమందు నికన్. 284

క. అనిన నకంపను డంతకు
మును పందరు వాగినటులె మూర్ఖతతో నా
మనుజాధము డగు రాముని
దునిమెద నీనాడె యనియె దోర్గర్వమునన్. 285

ఆ. ఆరిపోవు దీప మట్టులా ధూర్తుడు
పుడమి నవ్వుకొనగ మిడిసి పడుచు
కోరి చావుదెచ్చుకొన నేగె నగణిత
వీర రాక్షసాళి వెంట నడువ. 286

ఆ. అతని రథము మీది అరుణపతాకమ్ము
కాంతి నరసి తరచి కపిగణమ్ము
రామభద్ర! మరల రాక్షససైన్యము
వచ్చుచుండె నిచట జచ్చుకొరకు. 287

తే. అనుచు వాలమ్ములను ద్రిప్పి యనుమడించి
నట్టి యుత్సాహమున నింగినంట నెగిరి
చెట్లు, కొండలు, బండలు చేత బూని
సిద్ధ మాయెను కపిసేన యుద్ధమునకు. 288

తే. అంతలో నకంపనుడు భయానకమగు
ధ్వనులు చెలరేగ చతురంగబలముతోడ
కదనభూమికి నరుదెంచి కన్ను లురిమి
బాణవర్షము గురియించె పగరపైన. 289

సీ. అతి దారుణములైన యమ్ములు రాముపై
బెట్టిదమ్ముగ గురిపెట్టి వదలె!
ఆ బాణములు రాము నంటక పూర్వమే
కుముదుండు వానిని గూల్చివైచె!
అంతట మరికొన్ని అస్త్రముల్ సంధించి
విడచె నా దానవ వీరువరుడు
వానిని ద్వివిదుండు వజ్రసమానమౌ
వక్షమ్ము నెదురొడ్డి వసుధ రాల్చె

తే. వారి చేష్టలు గని యకంపనుడు బెదరి
అష్టదిక్కులు గడగడలాడునటుల
శత్రుసైన్యము ధైర్యము సడలునటుల
అరచి గుప్పించె శరపరంపరలు మరల. 290

తే. ఆలసించిన నాహవ మదుపుదప్పె
ననుచు మదినెంచి వెంటనే యనిలసూను
డాగరా! దుష్టదనుజ! నీ యసువు లెల్ల
క్షణములోపల గాలిలో గలసిపోవు. 291

ఆ. అనుచు హెచ్చరించి ఘనవాలమున నొక్క
గిరిని పెల్లగించి కేలనెత్తి
వైరిపైకి విసరె వా డతినిపుణతన్
తిరిగి దాని నటులె త్రిప్పికొట్టె. 292

తే. తన ప్రయత్నము తొలిసారి తప్ప టరసి
చకితుడై యొక్క సాలవృక్షమును బెరికి
కరువలి సుతుండు దానినే గదను జేసి
శిరముపై మోది వానిని ధరను గూల్చె. 293

క. ఎప్ప డకంపను డట్టుల
కుప్పగ రణరంగమందు గూలెనొ యపుడే
తప్పదిక చావు మన కని
చప్పన వెనుదిరిగి చనియె సైన్య మ్మెల్లన్. 294

తే. ప్రబలబలశాలియగు నకంపనుని చావు
రాక్షసాధీశ్వరుని భయభ్రాంతు జేసె;
నిన్ని దుర్ధర వార్తల నేక ధాటి
కలనయిన విందు నని నేను దలపనైతి. 295

తే. అనుచు పలుమార్లు చింతించి యసురనేత
మంత్రు లందర బిలిపించి మంతనములు
సలిపి సైనిక శిబిరముల్ చక్కనరసి
అనికి నీ వేగవలయు ప్రహస్త! యనియె. 296

తే. అసురవల్లభ! సర్వసైనాధిపత్య
మప్పగించుటెగాక నన్ననవరతము
కన్నకొమరుని రీతిని గారవించి
నట్టి ఋణమెల్ల దీర్తునీ యదనునందు. 297

తే. సమరమందున రామలక్ష్మణుల జంపి
వారి మాంసఖండముల రాబందులకును
వేసి నిశ్శేషముగ కపివీరవరుల
హతుల గావించి కూర్తు మీ కాత్మ తృప్తి. 298

తే. అనుచు శపథమ్ము జేసి ప్రహస్తు డనికి
సర్వకేతన మణిమయ స్యందనమ్ము
నెక్కి సైన్యము తనవెంట నేగుదేర
ప్రభువు మన్ననలను గొని పయన మాయె. 299

తే. తూర్పు ద్వారము నందుండి దుర మొనర్ప
నరుగుదెంచుచున్న ప్రహస్తు నరసి
ఓ విభీషణా! ఆ మహాయోధు డెవ్వ
డనుచు బ్రశ్నించె! శ్రీరాము డనుగుసఖుని. 300

క. అంత విభీషణు డవనీ
కాంతునితో నతడు దనుజకాంతుని సైన్య
మ్మంతటికినేత కడుబల
వంతుండు ప్రహస్తు డనెడు వాడని తెలిపెన్. 301

ఆ. అంతలో ప్రహస్తు డాకాశమే నాకు
గొడుగు నే డటంచు గొప్పలెన్నొ
పలికి సైన్యమునకు పలు సూచనలు చేసి
ధనువు నెక్కుపెట్టె తాను గూడ. 302

తే. రెండు వైపుల వీరు లుద్దండలీల
చావు బ్రతుకుల నిసుమంత సరకుగొనక
సలుపుపోరును తిలకించి సమరభూమి
పులకరించిన యొడలితో పొంగిపోయె. 303

క. అపుడు ప్రహస్తుని సచివులు
కపిసేనను బారజూచి కడు దర్పమునన్
రిపుభంజన మనునది, మా
కిపు డబ్బిన విద్యగాదు ఎరుగు మటంచున్. 304

తే. ఖడ్గములు గదల్ చేబూని కదనభూమి
నాల్గువైపుల దిరిగి వనచరగణము
తలలు బ్రద్దలు జేసెడు తంతు నరసి
దొడ్డ బలశాలి జాంబవంతుండు కినిసి. 305

తే. పోరులో దూకి యొక చిన్న భూధరమ్ము
నొంటికరమున బెకలించి యొక్క సచివు
పైకి విసరెను దానితో బ్రద్దలాయె
బావురని పెద్దగా నేడ్చి వాని శిరము. 306

క. మిగిలిన ముగ్వురు సచివుల
పొగ రణగెడులీల మిగుల పూనికతోడన్
నగచరవీరులు కొందరు
పగతో పిడికిళ్ల మోది పడగూల్చి రిలన్. 307

తే. తనకు నాలుగు భుజములై తనరునట్టి
సచివు లతిఘోరముగ వనచరుల వలన
జచ్చుటం గని కుపితుడై రెచ్చిపోయి
ఆగ్రహోదగ్రుడైన ప్రహస్తు డంత. 308

తే. ప్రళయ రుద్రుడుగా మారి రాము నరసి
"మానవాధమ! నీ ప్రాణమానములను
నేడు కోతులమూక కాపాడలేదు;
దురమునం జావ రమ్ము ముందునకు వేగ." 309

తే. అనుచు బాణము సంధించునంతలోన
నిఖిల వానరసైన్యాధినేతయైన
నీలు డాతని ధనువును నేలగూల్చి
హతము గావించె నటులె రథాశ్వములను. 310

తే. అంత నా మహావీరు డొక్కింత బెదరి
మరు నిమేషమె శౌర్యమ్ము మది చెలంగ
దండధరునట్లు భగ్గున మండిపడుచు
స్యందనము డిగ్గి గర్జించి ముందు కురికె. 311

తే. నీలు డాతని నక్కడే నిలువరించి
"ఓరి దానవ! నీ పప్పు లుడక నిచట
ద్వంద్వ యుద్ధమునందు నీ దర్ప మణచి
మోద మొనగూర్తు మా రామభూవిభునకు." 312

ఆ. అనుచు వెక్కిరించి ఆ ప్రహస్తుని బట్టి
ముష్టిఘాతమునను పుడమి ద్రోసె;
కసిగ నతడు లేచి ముసలమ్ముతో మోదె
బలము కొద్ది నీలు ఫాలమందు. 313

క. ఆ దెబ్బకు నెత్తుటి యల
మీదికి లివ్వనుచు లేచి మింటిని దాకెన్!
క్రోధానలుడై నీలుడు
పాదపమున మోది మోది వానిని జంపెన్. 314

తే. అటు ప్రహస్తుడు రక్తపుటర్ణవమున
జచ్చిన తిమింగిలము వోలె చాయదొరగి
కదనభూమిని బడియున్న కరణి నరసి
వాని సైన్యము భీతిల్లి పారిపోయె. 315

ఆ. గండిపడిన చెరువునుండి పారెడు నీర
మటుల పరుగులెత్తు నసుర సైన్య
గణము నరసి కపులు కడుపు లుబ్బెడు రీతి
నలుముఖాల దిరిగి నవ్వుకొనిరి. 316

తే. ఎప్పు డపజయ మనునది యెరుగనట్టి
సర్వసేనాని సైతము జచ్చెనన్న
వార్త చెవిదూరినంత రావణుడు బెదరి
పిచ్చిబట్టిన రీతిని రెచ్చిపోయి. 317

తే. తప్పదిక నేడు నేనె యుద్ధమున కేగి
సత్వరమ్ముగ రామలక్ష్మణుల జంపి
శత్రుసైన్యము రుధిరాన సకలజగతి
నిపుడె యభిషేక మొనరింతు నిచ్చదీర. 318

క. అని లంకేశుడు పలికిన
వెనువెంటనె నిరుపమాన వివిధాయుధముల్
తన మేని భూషణములుగ
చనుదెంచెను స్వర్ణ రథము చయ్యన నటకున్. 319

ఆ. అరదమునకు గట్టి నట్టి వారువముల
కనులు రౌద్ర రసము గ్రక్కుచుండె
పాపరేడులట్టి పగ్గముల్ చేబూని
సారథియును బొంగె సంబరమున. 320

తే. మోహరమునకు జనుచుండె మొదటిసారి
యసురనాథుడు స్వయముగా ననెడు వార్త
మరునిముసమందె లంకలో మారుమ్రోగె!
శూరగణమంత రావణు చుట్టుమూగె. 321

సీ. పలుమారు లవమాన పడిన వేదన నంత
నాగ్రహమ్ముగ కన్నులందు నింపి
పడగెత్తి బుసకొట్టు పౌరుష మ్మంతయు
సహజదర్పమున మీసముల కలది
అనిలోన జయము నా కొనగూర్చరా హరా
యని నీలకంఠుని నాత్మ దలచి
వనజాక్షి సీత నావశ మౌట కీ వేళ
కుదిరె లగ్నమ్మని మదిని మురిసి

తే. కదనుద్రొక్కుచునున్న దోర్గర్వమునకు
ప్రబలసాక్షిగ గన్పట్టు రావణుండు
దనుజ యోధుల జయ జయ ధ్వనుల మధ్య
అగ్నికీలల నెగజిమ్ము నరద మెక్కె. 322

ఆ. అంత నా దానవేశ్వరు ననుమతిగొని
మేఘనాదుఁడు మొదలగు మేటి దనుజ
వీరు లందరు తడయక వారి వారి
వాహనము లెక్కి కదలిరి బవరమునకు. 323

తే. దనుజవిభు డట్లు లంక కుత్తరమునుండి
అగణితమ్మగు దొడ్డ సైన్యమ్ముతోడ
చండమార్తాండు కైవడి సమరభూమి
కరుగుదెంచుట గని రాము డబ్బురపడె. 324

తే. అసురవీరుల తారతమ్యమ్ము లెరిగి
నట్టి ఘనుని విభీషణునపుడు పిలిచి
విడివిడిగ దెల్పు మవ్వారి వివరములను
వేగ నాకని యిక్ష్వాకువిభుడు పలికె. 325

తే. వేదవిదుడైన రావణు సోదరుండు
వైరివర్గమునంగల వీరవరుల
ఒక్కరొక్కరి పుట్టుపూర్వోత్తరముల
శక్తి సామర్థ్యముల దెల్ప సాగె నిట్లు. 326

సీ. "కదనభీకరముగా గంధగజమ్ముపై
నూరేగునతడె మహోదరుండు
పెద్ద పర్వతమంత యెద్దుపై గూర్చుండి
వడిగ నేతెంచెడువాడు త్రిశిరు
డతనికా వైపున నరదమ్ము కంపింప
కొలువైనవాడె నికుంభు డతని
కల్లంత దూరాన తెల్లగుర్రమునెక్కి
చనుదెంచు వాని పిశాచు డండ్రు

తే. సింహకేతన రథముపై చేత నింద్ర
ధనువు బోలిన ధనువుతో నెసగుచున్న
ఆ మహాయోధవరుడె మా యన్నకొడుకు
మేఘనాదు డజేయు డమేయబలుడు. 327

సీ. వేలకొలది దైత్యవీరుల మధ్యలో
అపరంజి రుచులీను నరదమందు
మణిగణ స్థగితమౌ మకుటమ్ము ధరియించి
రత్నరంజిత కుండలములు దాల్చి

తులలేని జాతికెంపుల లీల మెరుపులు
గురిపించు పెను కనుగ్రుడ్లతోడ
ప్రేత పిశాచాల వెంటబెట్టుకవచ్చు
రోషభీషణ కాలరుద్రులీల

తే. ప్రజ్వలించుచు దృష్టి మీపైన నిల్పి
యరుగుదెంచెడు వీరుడే యమరనాథు
దర్ప మవలీల నణచిన దనుజనేత
పాపభయ మింతలేని రావణు డతండె." 328

తే. అని విభీషణు డసుర సైన్యమ్మునందు
గల మహావీరులందరి గతచరిత్ర
పూసగ్రుచ్చిన విధముగా పొల్లులేక
వివరముగ దెల్పె శ్రీరామవిభున కపుడు. 329

క. తనవైరిని తొలిసారిగ
ఘనతరమౌ స్యందమున గాంచిన రాముం
డెనలేని విస్మయమ్మును
గని యాతని యనుజుతోడ కడువడి ననియెన్. 330

తే. "వాని బలదర్ప మతని రూపమ్ములోనె
ప్రతిఫలించుచు నున్న దా బాహువులును
కన్ను లురమును పాలభాగమ్ము బొజ్జ
సైత మాతని శౌర్యమున్ చాటుచుండె. 331

తే. కాని యీ కుటిలుండు నిష్కారణముగ
అవనిసుతయైన నాసతి నపహరించి
మరువరానట్టి యెగ్గును మాకొనర్చె
కనుక ఆ పగ నేదీర్చుకొనెద నేడు. 332

తే. అనుచు వచియించి శ్రీరాము డనుజుగూడి
వైరిభీకరమగు ధనుర్బాణములను
దాల్చి కడు నప్రమత్తుడై ధర్మమునకు
విజయ మొనగూర్తు నేడని వెల్లడించె. 333

తే. రావణుండును శిరమెత్తి రాము నరసి
అతని కన్నులలోని తీక్ష్ణతకు జంకి
అంతలో తేరుకొని తన యనుచరులను
జూచి యీ రీతి వచియించెనాచి తూచి. 334

తే. "పేరుమోసిన రాక్షసవీరులార!
యోధ గణమంత నీరీతి నొక్కచోట
నుండుటను గని పగతుర దండు లంక
జొచ్చి ధ్వంసమ్ము గావించు నిచ్చ కొలది. 335

ఆ. అందువలన నంద రతి శీఘ్రముగ రాజ
ధాని కరిగి యొక్క వానరుండు
లోన దూర వీలులేని చందమ్మున
కాపుగాచి వారి గర్వ మడచి. 336

తే. దనుజపురి వీరదర్పము ధరణికెల్ల
చాటు డని పంపి రాక్షసచక్రవర్తి
రథము బోనిమ్ము వేగ నా రాము దెస క
టంచు సారథి కుగ్రుడై యానతిచ్చె. 337

తే. అనుపమానములైన శస్త్రాస్త్రములను
స్యందనము నిండనింపి రాక్షస విభుండు
కాలమేఘుని విధమున కదనభూమి
కరుగుదెంచుట నరసి వానరవిభుండు. 338

ఆ. పెద్ద పర్వతమును బెకలించి యట్టులే
బంతి వోలె చేతబట్టి దనుజ
నేత కెదురు బోయి నీచాత్మ! చావరా!
అడుగు కదపకుండ ననుచు విసరె. 339

తే. కొండ శిఖరము తనను ఢీకొనకముందె
పరమశివుచేతి శూలము వంటి బాణ
ములను గుప్పించి దానిని ఇలను గూల్చె
సహజ గాంభీర్యమున నిశాచరవిభుండు. 340

తే. అంత నాగక వెంటనే యమరవైరి
వజ్రసమమైన సుగ్రీవు వక్షమునకు
నేరుగా గురివెట్టి ఫణీంద్రతుల్య
మగు శరమ్మును సంధించి యట్టె విడచె. 341

ఆ. అగ్నికీలవంటి ఆ మహాబాణము
ధాటి కర్కజుండు తల్లడిల్లి
బాధ కోర్వలేక పగతుర ముందర
మూడుమార్లు తూలి మూర్ఛనొందె. 342

క. అదిగని గవయ గవాక్షులు
మద మెక్కిన కరులరీతి మాకులు కొండల్
మొదలంట బెరికి రావణు
నెద లక్ష్యము జేసి విసరి రెంతయు కసితో. 343

తే. వాని నెల్ల నిశాచర వల్లభుండు
నాల్గు బాణాలతోడ చూర్ణమ్ముజేసె
నంత పలువురు కపివీరు లదుపు దప్పి
నట్టి క్రోధమ్మునన్ దూకి రతనిపైకి. 344

ఆ. కాని వారి నెల్ల క్షణములో నేలపై
బాణ ఘాతములను బండబెట్టి
శత్రుసేనపైన శరపరంపర గురి
పించె రావణుండు పిడుగులట్లు. 345

తే. అసురవిభు బాణతీవ్రత నడ్డలేక
గుండె చెదరిన సేన కోదండరాము
సన్నిధికి వేగ బరుగెత్తి సర్వలోక
నాయకా! యిక భారము నీయ దనియె. 346

తే. రావణుం డప్పటికె రణరంగమందు
దారుణాస్త్రాల కపిసేన ధైర్యమెల్ల
కొల్లగొట్టుట నారసి కోపగించి
అంజనాసూను డాపాపి కడ్డుదగిలి. 347

తే. "దానవా! దేవయక్షగంధర్వు లెవరు
నిన్ను వధియించలేరని నీకె గాదు
నాకు సైతము దెలియు గీనాడు నిన్ను
దురమునం జంప నున్నది నరులు కపులు. 348

క. నా పిడికిటి ఘాతమ్మున
నీ పెన్నురమున్ బగిల్చి నిఖిలజగమ్ముల్
బాపురె యని నివ్వెరపడ
రూపడగించెదను క్షణములోపల" ననియెన్. 349

ఉ. "ఆపర కోతి! వాగుడికి! నంత బలాఢ్యుడ వీవె యైనచో
చాపము నీ క్షణమ్ముననె స్యందనమందున బారవేసెదన్
చూపుము నీ ప్రతాపమును చోద్య మెలర్పగ జూచి పిమ్మటన్
కోప మడంగ ని న్ననిని గూల్చెద దానవు లెల్ల మెచ్చగన్." 350

క. అని దానవపతి పలికిన
హనుమంతుడు వెక్కిరించి "యసురేంద్రా! నీ
యనుగుంగొమరుని యమపురి
కనిపిన పిడికిలిని మరచి అరవకు" మనియెన్. 351

క. వనచరు నపహాస్యమునకు
దనుజకులాధిపుని మనము తల్లడపడియెన్
కనులెర్ర జేసి పిడికిట
హనుమంతుని రొమ్ము మీద నట్టే చరచెన్. 352

క. లంకేశుని పిడిగ్రుద్దుకు
జంకక కరువలి సుతుండు సత్వరమే ని
శ్శంకగ నాతనియురమున
బింక మ్మణగారు నటుల పిడికిట గ్రుద్దెన్. 353

క. ఆ దెబ్బకు తెగ నరికిన
పాదప మటు లూగి దనుజపతి మూర్ఛిలగా
మోదమ్మున గంతులిడిరి
మాదే తొలి విజయమనుచు మర్కటవీరుల్. 354

తే. అంతలో తేరుకొనినట్టి యసురవిభుడు
కోపగించక కరువలి కొమరు జూచి
"భళిరె! వానర! నీకండబలము విలువ
దెలియ జెప్పితి వరచేతి దెబ్బతోడ." 355

తే. అనిన వెంటనె నాతని హనుమ జూచి
"చిన్నదెబ్బకె యింతగా నన్ను బొగడు
చున్న వీరుడ వనిలోన సురలరాజు
నెటుల గెల్చితివో దెల్పు మిపుడు నాకు:" 356

క. ఆ మాట కసురవల్లభు
రోమము లెరుపెక్కె కనుల రుధిర మ్మొలికెన్
నీమద మిపుడే యణచెద
నో మర్కట!" యనుచు గ్రుద్దె నుద్ధతిమీరన్. 357

తే. దనుజనాయకు ముష్టిఘాతమ్ము వలన
వనచరుని వజ్రదేహమ్ము వశముదప్పె;
నాతడును పట్టు గోల్పోయి యరదమునకు
కొద్దిదూరాన బడె స్పృహ గోలుపోయి. 358

తే. అసురపతి వాయునందను నచట వదలి
మిగులక్రోధమ్ముతో తన మీది కురుకు
నీలు నెదిరించి కాలాగ్ని కీల లెగయు
బాణముల వేగ వర్షించె వాని మీద. 359

తే. నిఖిల వానర సేనాధినేత యయ్యు
నీలుడా బాణముల నడ్డి నిలువలేక
అల్పదేహము ధరియించి యసురవిభుని
తేరుపై నున్న ధ్వజ మెక్కి తిరుగసాగె. 360

తే. బవరమున తన్ను చీకాకుపరచుచున్న
స్వల్పదేహుని గాంచి రావణుడు కినిసి
వేయి నాలుకలున్న ఆగ్నేయబాణ
మునను వానిని మూర్ఛలో మునుగజేసె. 361

తే. అంతమాత్రానకే దానవాధినేత
విజయదర్పము మోమున వెల్లివిరియు
కరణి మీసము దువ్వి లక్ష్మణుని జూచి
ధనువు మ్రోగించె రణభూమి దద్దరిల్ల. 362

తే. అప్పటికె విల్లు చేబూని యసురనాథు
పీచ మణచెడు కాంక్షతో వేచియున్న
లక్ష్మణుం "డోరి పాపాత్మ! రమ్ము! రమ్ము!
పోరునం జచ్చి నీ సుతున్ జేరుకొమ్ము. 363

మ. అని సౌమిత్రి దివంబు దద్దరిలున ట్లావేశ మేపారగా
నణుమాత్రమ్మును భీతిలేక పలికెన్; ఆ పల్కులే బాకులై
దనుజాధీశుని గుండెలందు బొడిచెన్; దానన్ మహోదగ్రుడై
ఘనబాణమ్ముల నాత డేడు విసరెన్ గర్వ ప్రచండోద్ధతిన్. 364

తే. లక్ష్మణుడు సైత మేడు శరములు వదలి
రావణుని సప్తశరముల రాలగొట్టి
పెక్కు బాణమ్ము లొకమాటె వేగ విసరి
చాటె నిక్ష్వాకుకులజుల శౌర్యపటిమ. 365

తే. రావణుడు లక్ష్మణుని శరలాఘవమున
కచ్చెరువుచెంది విలయకాలాగ్నితుల్య
మౌది శంకర వరలబ్ధమైన శరము
మించు క్రోధమ్ముతోడ సంధించి విడిచె. 366

తే. వాడి వేడియు మిళితమై వరలునట్టి
యాశరాఘాతమునకు రామానుజుండు
కొంత తడబడి, మిక్కిలి కోప మెనయ
మరల రావణుతోడ ని ట్మాడ్కి పలికె. 367

ఆ. "ధర్మబద్ధమైన దారుణాస్త్రమ్ముతో
నిన్ను నేల గూల్చి నిఖిల జనుల
మన్ననలను బొంది మా యన్న నానంద
జలధిదేల్తు మిగుల సత్వరముగ." 368

తే. అనుచు రామానుజుండు నోరార బలికి
యొక్క భీకర బాణమ్ము నెక్కుపెట్టి
కర్ణమంటగ లాగి దుష్కర్ముపైకి
వదలె వనచరగణ మెల్ల భళి యనంగ. 369

తే. ఆ మహాస్త్రము భండనభీముడైన
అసురనాథుని వజ్రదేహమ్మునంత
రక్తసిక్తము గావించె! రావణుండు
బాధ దిగమ్రింగి లక్ష్మణు బార జూచి. 370

తే. మాట నోటను రాక బ్రహ్మను దలంచి
యతడు వరముగ నిడిన దివ్యాయుధమును
శక్తి నొకసారి వడిగ లక్ష్మణునిపైకి
వదలె మంత్రించి దానవుల్ భళి యనంగ. 371

క. అది మంటలు వెలిగ్రక్కుచు
కదనస్థలి కంప మొంద కడు భీకరమై
అదయత మోదెను లక్ష్మణు
నెదపై స్పృహదప్పి యాత డిలపై నొరగెన్. 372

తే. రావణుం డంత ముదమున రథము డిగ్గి
అవనిబడియున్న సౌమిత్రి నట్టె లేపి
దనుజనగరికి గొనిపోవ దలచెగాని
యంతలో వాయునందను డడ్డు దగిలి. 373

తే. వాని వక్షః స్థలిన్ మోదె బలము కొలది
హనుమ పిడికిటి పోటు కా యసురనేత
కనుల, ముక్కుల, చెవుల, రక్తమ్ము లొలుక
అటులె మూర్ఛిల్లి పడిపోయె నదుపు దప్పి. 374

తే. అంత మారుతి సౌమిత్రి నచటినుండి
మోసికొనిపోయి రాముని ముందునుంచె!
తమ్ము నొకసారి నా యన్నదాకగాని
యతని నేత్రాలు విప్పారె నద్భుతముగ. 375

తే. పుడమిబడి యున్న సురవైరి మూర్ఛదేరి
పగర దిలకించి సరికొత్త బాణములను
దాల్చి రథమెక్కి యెనలేని దర్ప మెసగ
రణభయంకరుడై సాగె రాముపైకి. 376

తే. వైరి తనవంక గురిపెట్టి వచ్చు టరసి
క్రుద్ధుడైనట్టి యిక్ష్వాకు కులవతంసు
డిదియె యదనని కోదండ మెక్కుపెట్టి
పాపి రావణు దునుమంగ బయలుదేరె. 377

తే. దనుజనాథుడు స్వర్ణరథమ్ము మీద
నఖిల లోక శరణ్యుడ వైన నీవు
వసుధ పై నిల్చి పోరుటా? వలదు స్వామి
రమ్ము! నా భుజస్కంధమే రథము నీకు. 378

తే. అనుచు రాముని బ్రార్థించె నాంజనేయు
డతని కోరిక త్రోసి రాజనగ లేక
తత్క్షణమె వానిభుజముపై దనుజ వైరి
యధివసించెను చిరునగ వంకురింప. 379

క. హనుమద్వాహన మెక్కిన
ఇనకులవంశాబ్ధి సోము డెంతయు కసితో
"దనుజాధమ! యీ దినమున
మును లలరగ నిన్ను గూల్తు భూస్థలి" ననుచున్. 380

తే. పెక్కు శరముల శ్రీరాము డెక్కుపెట్టి
ముందు రావణు రథచక్రములను ద్రుంచి
పిదప సారథి నవలీల సిలుకుమార్చి
అసురనాథుని తల్లడ మందజేసి. 381

తే. మరల నొక భీకరాస్త్ర మా మలిను వక్ష
మునకు గురిపెట్టి వదలె నాయనుపమాన
శరము దెబ్బకు రావణు శౌర్యమెల్ల
నీరుగారెను వాడును నేలబడియె. 382

ఆ. అతని చేతిలోని యమ్ములు సైతము
చాల భీతినంది జారిపోయె!
మరల రాము డొక్క మహితాస్త్రమున వాని
హేమరుచిరమకుట మెగుర గొట్టె. 383

ఆ. అసువులుండి గూడ నసురాధినాథుడు
వెలుగులేని సూర్యబింబమట్లు
శోభ దరిగి చాల సొక్కి యుండుట గాంచి
యినకులావతంసు డిట్టు లనియె. 384

తే. "ఓ నిశాచరనాథ! నీమేన బడిన
గాయములనుండి రక్తముగారుచున్న
దదియునుంగాక నీవును నలసినావు
కనుక నీ పూట వదలితి కనికరించి. 385

తే. పొమ్ము! విశ్రాంతిగొని రేపు రమ్ము మరల
మరచిపోకుండ సరికొత్త శరములున్న
వాని సైతము గొనితెమ్ము! బవరమునకు
సంహరించెద నిన్ను నిస్సంశయముగ." 386

తే. రాము డీరీతి పలికిన రావణుండు
సింహపీడితకరిపోలె చిన్నవోయి
చేయునది లేక తలపైన చేయి వైచి
పురమునన్ దూరె నవమాన భరముతోడ. 387

తే. వీర విక్రమసింహుడై వెలిగినట్టి
రావణుం డట్లు ఘోరపరాజయమ్ము
నంది యొంటరియై యింటి కరుగ టరసి
పరమసంతోష మందె! దిక్పాలగణము. 388

క. కన్నులు మూసిన తెరచిన
పన్నగముల వంటి రామ బాణము లెన్నో
వెన్నంటి తనను దరుముచు
నున్నటు రావణుడు దలచు చుండెను భీతిన్. 389

ఆ. అటుల కొంత తడవు కటకటంబడి దైత్య
కులవిభుండు తేరుకొని సమస్త
హితుల జేర బిలిచి యీ నాటితో మన
పరువు లంక విడిచి పారిపోయె. 390

తే. అనుచు నిర్వేదమున బల్కినట్టి దనుజ
సార్వభౌముని మాటల సార మెరిగి
కొంత చర్చించి యందరు కుంభకర్ణు
బిలిచి యని కంప దగు నని తలచి రపుడు. 391

తే. విభుని యానతిమేరకు వేలమంది
దనుజవీరులు నిద్రలో మునిగియున్న
కుంభకర్ణు నివాసమౌ గుహకు జనిరి
మద్యమాంసాది సకల సామగ్రి తోడ. 392

సీ. అతని యూర్పుల ధాటి నతికష్టమున నెదు
ర్కొని లోన దూరిరి కొంతమంది
తెరచిన వదన గహ్వరమును బొడగని
చెంతబో వెరచిరి కొంతమంది
పెక్కు గాడిదలోండ్రపెట్టిన ట్లనిపించు
గురకకు వెరచిరి కొంతమంది
క్రుళ్ళిన భక్ష్యముల్ గొట్టు కంపునకు ము
క్కులు మూసికొని రట్లె కొంతమంది

తే. కాని తుద కందరును తమ కార్యధర్మ
మెరిగి మెలమెల్లగా లోని కరుగుదెంచి
దనుజపతి కూర్మి సోదరుతల్పమునకు
చుట్టు నిలబడి యొండొరుల్ జూచుకొనుచు. 393

సీ. బండ్లపై దెచ్చిన పచ్చిమాంసమ్మును
గుట్టగా నొకచోట బెట్టినారు!
నెత్తురు నింపిన నిలువెత్తు బానల
నొనరంగ నొకచోట నుంచినారు!
భుగభుగమని పొగ లెగజిమ్ము బోనమ్ము
రాసిగా నొకచోట బోసినారు!
పుల్లపుల్లని యిప్ప కల్లు భాండములను
దెచ్చి వేరొకచోట దింపినారు!

తే. పిదప నా పర్వతాకారు పేరువెట్టి
వేలగొంతుల బెనవైచి పిలిచి పిలిచి
ఫల మొకింతేనియును లేక పటహ భేరి
కాహళమ్ములు మ్రోగింప గడగి రపుడు. 394

చ. అదియును వ్యర్థమాయె! నపు డందున కొందరు వేలసంఖ్యలో
గదలను దాల్చి మేనిపయిగట్టిగ మోదిరి కాని సుంతయున్
కదలిక లేక పోవుటను గాంచి యొకించుక భీతినంది యే
మిది? యిపుడేమి చేయవలె? నెయ్యది మార్గము వీని లేపగన్? 395

ఆ. అనుచు తలలు బాదుకొని కడసారిగా
మావటీంద్రతోడ మదపుటేను
గులను బిల్వనంపి గుండెపై ద్రొక్కించి
రపుడు కుంభకర్ణు డావులించి. 396

ఆ. అట్టి పైకి లేచి యచ్చట రాసులు
పోసియున్న వన్ని వీసమెత్తు
వదలకుండ మెక్కి పిదప నెత్తురు కల్లు
బొట్టు మిగులకుండ పొట్టనింపి. 397

ఆ. బ్రేవు మనుచు త్రేపి భీతితో గడగడ
వణకుచున్న దనుజవరుల జూచి
వారి కంపమునకు కారణ మ్మెరుగక
దనుజవిభుని తమ్ము డనియె నిటుల. 398

ఉ. "ఎందుకు నిద్రలేపితిరి? యేమి ప్రమాదము వచ్చె నింతలో
ముందదినాకు దెల్పుడని మ్రోయ నభఃస్థలి బల్కె; వెంటనే
యందరు ముక్తకంఠమున నాహవవార్తలనెల్ల దెల్పినన్
కొందలమంది యన్న కడకున్ జనుదెంచెద పోయి తెల్పుడీ." 399

ఆ. అనుచు నిద్రమత్తు నరకాలితో దన్ని
తొలుత కాలకృత్యములను దీర్చి
పిదప భూషణములు పీతాంబరమ్ములు
దాల్చి బయలుదేరె! దర్ప మెసగ. 400

తే. కుంభకర్ణుడు నడయాడు కొండవోలె
నగర వీథుల జనుచుండ నగచరాళి
యుత్తర ద్వారదేశము నుండి చూచి
భీతి నందెను యిది యేదో భూత మనుచు. 401

తే. ఎపుడు కలనైన కని విని యెరుగనట్టి
భీకరాకారముగ నెంచి తోకలన్ని
యొక్కసారిగ ముడిచి నల్ దిక్కు లరసి
పరుగుదీసెను రాఘవప్రభువు కడకు. 402

తే. అంత రాముడు వారల ననునయించి
కడువడిగ విల్లు దాల్చి ప్రాకార మెక్కి
మేరు పర్వత తుల్యమై మిన్నుదాకు
వికృతరూపమ్ము బొడగని చకితు డాయె. 403

తే. వెంటనే ప్రక్కనున్న విభీషణు గని
"నెచ్చెలీ! యెవ్వ డాతడు నే నెరుంగ
నిట్టి భయద మహాకాయు నింతవరకు
చిత్రముగ నున్నదేమిటా? చెనటిరూపు." 404

ఆ. అనిన రామభద్రు నరసి విభీషణు
డవును వాని జన్మ మతివిచిత్ర
మంతె గాదు చేష్ట లంతకన్న విచిత్ర
మతని గెలువ జాల రమరు లైన. 405

ఆ. సహజ సిద్ధమైన శౌర్యమ్ము గలవాడు
హరున కైన జంకనట్టివాడు
పుట్టినపుడె యబ్బె పుట్టెడు శక్తులు
వాని కవియె బలము బవరమందు. 406

ఆ. క్షాత్మలేంద్ర! కుంభకర్ణు డాతని పేరు
నాకు రావణునకు నడిమి వాడు
కనులు దెరచినపుడె కనపడ్డ ప్రతిజీవి
నట్టె నమలి మ్రింగినట్టి ఘనుడు. 407

ఆ. ప్రాణికోటి వాని బాధలు పడలేక
శరణుగోరె దివిజ సార్వభౌము:
నతడు యుద్ధమందు నితని దెబ్బకు జంకి
ఆదరింప నలువ నాశ్రయించె. 408

ఆ. అపుడు బ్రహ్మ వీని యాగడమ్ముల రోసి
ప్రాణమున్న శవము భంగి నీవు
సర్వకాలములను చలనమ్ము లేకుండ
నవనిపై బరుండు మని శపించె. 409

ఆ. శాపవార్త దెలిసి చయ్యన రావణుం
డజుని కడకు జేరి యమిత భక్తి
సన్నుతించి "యో ప్రజాపతీ! దయయుంచి
కొంత వెసులుబాటు గూర్చు" మనియె. 410

ఆ. అంత బ్రహ్మ రావణాసురు ప్రార్థన
నాలకించి యాత డారునెలల
కొక్కదినము దప్ప తక్కిన దినములు
గాఢనిద్రలోనె గడుపుచుండు. 411

తే. మేలుకొని యున్నదినమున మేరమీరి
ఆరుమాసాల తిండిని ఆ దినమ్మె
తినుట కనుమతి నొసగితి నని వచించె
నటులె జరుగుచు నున్న దిప్పటికి గూడ. 412

తే. నిన్న నీ బాణధాటికి వెన్ను జూపి
యింటి కరిగిన రావణు డొంటరియయి
నీవె దిక్కని వీనిని నిద్రలేపి
పంపుచున్నట్లు భావింతు బవరమునకు. 413

తే. క్రుద్ధుడై నిద్రలేచిన కుంభకర్ణు
డావు రావురు మనుచు నే డాహమున
కరుగుదేరగ సన్నద్ధు డగుచు నుండె
నని వచించె విభీషణు డవనిపతికి. 414

తే. అంత రాముడు సర్వసేనాధిపతిని
నీలు బిలిపించి వానరజాలమునకు
ధైర్య మొడగూర్చి యప్రమత్తమ్ము చేయు
మనుచు నుద్వేగభరితుడై యానతిచ్చె. 415

తే. అప్ప డంగద వాయుసుతాది ముఖ్య
వీరులే గాక వనచర బృంద మెల్ల
చేతి కందిన మేరకు చెట్లు కొండ
లన్ని బెకలించి సంసిద్ధు లయ్యె రనికి. 416

ఉ. తమ్ముడు నిద్రలేచి తన దగ్గర కాహవభీకరుండుగా
అమ్ములు దాల్చి వచ్చుటను ఆరసి రావణు డార్తి వీడి "రా
రమ్ము సహోదరా! కడు పరాభవ మందితి రాముచేత నీ
వమ్మనుజాధమున్ దునిమి యన్నకు తాపము బాపగా వలెన్." 417

ఆ. అనుచు దానవేంద్రు డతి దూరదృష్టితో
పలికి కుంభకర్ణు బట్టువోలె
పొగడి శత్రువులను దెగటార్చి పూర్వ పై
భవము నాకు గూర్పవలయు ననియె. 418

ఆ. అమర విభుని సైత మరగంటి చూపుతో
అడల గొట్టినట్టి యసురనేత
దర్ప ముడిగి మిగుల దైన్యమ్ముగా తన్ను
బతిమలాడు టరసి గతము తరచి. 419

తే. కుంభకర్ణుడు "దనుజేంద్ర! కోప ముడిగి
వినుము నామాట యెంతటి వీరుడైన
నీతి నియమాలు మరచిన నేత తుదకు
పతన మయి తీరునని గదా! బ్రహ్మవాక్కు. 420

తే. ప్రభువు నిరతము ధర్మనిబద్ధు డగుచు
నడచుకొనవలె నను సత్య మడగ ద్రొక్కి
హితుల గురువుల సలహాల నీసడించి
చేయరానట్టి దుష్కర్మ జేసినావు. 421

తే. అగ్ని శిఖవంటి జానకి నపహరించి
తెచ్చుటే గద నేటి దుఃస్థితికి హేతు;
విప్పటికి నైన తమ్ముడు చెప్పినట్లు
పతికి నా సాధ్వి నర్పించి బ్రతుకు టొప్పు. 422

క. ఇది నాయభిమత మావల
తుది నిర్ణయ మేదొ నీవె తొందరపడకే
పదుగురు మెచ్చగ జేయుము
కదన మ్మనివార్యమైన కాదన"గలనే! 423

ఆ. అనుచు కుంభకర్ణు డన్న సేమము గోరి
హితవు పలికె గాని మతివిహీను
డైన యసురనేత యాత్మావలోకన
మునకు స్వస్తి జెప్పి యనియె నిట్లు. 424

ఆ. "కుంభకర్ణ! నాకు గురుబోధ జేతు వ
టంచు నిన్ను బిలువ నంపలేదు
మేను సడలినంత మృగరాజు దాసోహ
మనునె? మదపుటేనుగునకు జంకి. 425

ఆ. తోడబుట్టినట్టి వాడుగా నా బాధ
కొంచెమైన పంచుకొనుట మాని
పుండుమీద కారమును జల్ల బూనితి
వింత కన్న ద్రోహ మేమి గలదు? 426

ఆ. నీ పరాక్రమమున నా పరాభవమును
క్షణములోన బాపగలిగియుండి
వైరి శరణుగోరి వర్ధిల్లు మని నాకు
జెప్ప నీ కొకింత సిగ్గులేదె?" 427

ఆ. అనుచు దానవేంద్రు డావేశమున బల్కె
నంత కుంభకర్ణు డతని బాధ
నెరిగి నుదుటి వ్రాత నెవ్వడు మార్చలే
డని మనమున దలచి యనియె నిట్లు. 428

తే. "అన్న! నామీద నీకు గలట్టి ప్రేమ
యెంత అవ్యాజ మైనదో యెరుగనట్టి!
కాని ఆ కారణముచేత కటికి నిజము
గొంతు నొక్కంగ లేక వాకొంటి నట్లు. 429

ఆ. అంతెగాని రాము నని లోన నెదిరించ
జంకిగాదు చేవ చచ్చిగాదు
నీకు శత్రువైన నా కెట్లు మిత్రుడౌ
గనుక పగర దునుమ జనెద నిపుడె. 430

తే. రాముతోపాటు వైరి వర్గమ్ము నెల్ల
శత్రుశేషములేకుండ జంపి వారి
రక్త మెల్లను తృప్తిదీరంగ గ్రోలి
తెచ్చెదను శుభవార్త నీ దినమె నీకు." 431

క. తమ్ముని వీరావేశము
కమ్మని విందాయె దనుజకాంతుని చెవికిన్
నెమ్మన మూరట జెందెను
చెమ్మగిలెన్ కనులు ముదము చివురించె నెదన్. 432

ఆ. అంత కుంభకర్ణు నాలింగనము జేసి
రావణుండు వాని రణ కుతూహ
లమును మెచ్చి రామలక్ష్మణులను జంప
వలయు నన్న నంగబలము వలయు. 433

తే. వారికడ లెక్క కెక్కుడౌ వనచరాళి
ఆహవమ్మున గడిదేరినట్టి దున్న
దందుచే నీవు మేటి సైన్యమ్ముతోడ
జనుట మంచిది సోదరా! యని వచించి. 434

తే. వీరగంధము స్వయముగా భూరిదేహ
మంతటికి రాసి ఘోర శూలాయుధమ్ము
కరమునం బిడి తమిదీర శిరము నిమిరి
అరుల దెగటార్చి రావలె నని వచించె. 435

తే. అన్న తనపైన జూపిన యాదరమున
కల్పసంతోషి యగు రావణానుజుండు
మూడుమార్లగ్రజుని పాదములకు మ్రొక్కి
మరలి వచ్చెద వైరుల మట్టుబెట్టి. 436

తే. కాని యటుగాక నాకర్మగాలి తుదకు
నేనె సమరాన నీల్గితి నేని యిదియె
కుంభకర్ణుని తుదివీడుకో లటంచు
దలచు మని తెల్పి యటనుండి తరలి చనియె. 437

తే. క్రుద్ధుడై కుంభకర్ణుడు యుద్ధమునకు
నగణితమ్మగు దనుజసైన్యమ్ముతోడ
కరకుచూపులు బుసకొట్టు కనులతోడ
శత్రుభీకరముగ జను సమయమందు. 438

తే. పుడమి పలుమార్లు కంపించె బొక్కలందు
నక్కియున్నట్టి నక్కలు నిక్కిచూచి
యతని కెదురుగ పరతెంచి యాపకుండ
వెర పొకించుక లేకుండ నరువ సాగె. 439

తే. ఎక్క డెక్కడొ చెట్ల మీదెక్కి యున్న
గ్రద్ద లన్నియు రివ్వున గగనమంట
నెగిరి య మ్మహాకాయుని నెత్తిపైన
ఆడదొడగెను మిక్కిలి యక్కజముగ. 440

క. వానిని దుశ్శకునములుగ
దానవ సైన్యమ్ము దలచి తత్తరపడియెన్
కానీ యా మదమత్తుం
డేనుండగ నేమి చేయు నీ శకునమ్ముల్. 441

తే. అనుచు దోర్గర్వమున సైన్యమునకు దెలిపి
మూడు లోకాలు గడగడలాడునటుల
నతిభయంకర వికటాట్టహాస మొండు
చేసి రణరంగమున దూకె సింగమట్లు. 442

తే. వాని వికృతస్వరూపము వాని నడక
వాని మిడిగ్రుడ్లు కోరలు వాని నోరు
చూచి కపిసేన మిక్కిలి చోద్యమంది
పుట్టకును చెట్టు కొక్కరై పోవు టరసి. 443

తే. అంగదుం డడ్డుకొని యాత డర్కకుల వి
భూషణుని చేత జిచ్చును పోరులోన
అంతవర కోర్చుకొనక దైన్యమ్ముతోడ
పారిపోవుట జాతికి పరువుచేటు. 444

ఆ. ప్రాణభయములేని పౌరుషమ్ము గలట్టి
జాతి మన దటంచు సమరమునకు
నమ్మి పూనుకొనిన నరనాథు విడనాడి
చని బ్రతుకుటకన్న చావుమేలు. 445

ఆ. కనుక వీరులార! కార్యశూరులు కండు!
ధర్మయుద్ధమునకు తరలి రండు
మరల మరల మనకు దొరకదీ యవకాశ
మనుచు వాలితనయు డానతిచ్చె. 446

తే. అంత వానరయోధులాయత్తమైరి
కుంభకర్ణుని దర్పము కొల్లగొట్ట
కొండలును భూరి వృక్షముల్ కోట్లకొలది
పెరికి విసరిరి కసిగ నా వీరుపైకి. 447

తే. కాని యవియెల్ల నా మహాకాయమునకు
కీడొకించుక జేయక క్రిందబడియె;
వాడు రెట్టించినట్టి కోపమ్ముతోడ
ఉఫ్ఫుమని గట్టిగా నోట నూదెనంత. 448

ఆ. దండిమగని నోటి నుండి వెల్వడినట్టి
గాలి ధూళి రేపి కదనభూమి
నెల్ల క్షణములోన నల్లకల్లోలము
జేసి వనచరులను చెదరగొట్టె. 449

సీ. ముందుకురుకుచున్న యెందరో సైనికు
లూపిరాడక మూర్ఛనొందినారు!
కొందరా ధాటికి గువ్వ లట్లంబర
మంటగా నెగిరి యల్లాడినారు!

మరికొంద రతిదూర మందున్న సంద్రాన
బడి దిక్కుదోచక వగచినారు
గుండెధైర్యమ్మును గోలుపోయిన వార
లెక్కడి కక్కడే నక్కినారు!

తే. వారినందర జూచిన వాయునంద
నాది వీరులు కొండల మందకుండ
క్రోధ మెగజిమ్ము నేత్రాల కుంభకర్ణ!
మేను కొండంత గలదని మిడిసిపడకు. 450

తే. నిన్న క్షతగాత్రుడైన మీ యన్న నేడు
ముందుగా నీవు చావరా మోహరమున
పిదప జచ్చెద నేనని వేడుకొనిన
యట్టు లున్నది మంచిదే యది యొకింత. 451

ఆ. అందువలన తొలుత అనిలోన నీ ప్రతా
పమ్ము గ్రుమ్మరించి మమ్ము గెలువ
మంచు కుంభకర్ణు నపహాస్య మొనరించి
దుర మొనర్ప ముందుకురికె రంత. 452

తే. ఆ నరాంతకు డుగ్రుడై యార్భటించి
గదలు శూలాలు వరుసగా పదులు నూర్లు
వేలు గుప్పించి వానరవీరగణము
నడల జేసెను వెంటనే యంగదుండు. 453

ఆ. ఆహవమ్ము బెదర నతిరౌద్రమున నింగి
కెగిరి కుంభకర్ణునెడద మీద
బలము కొలది తన్ని ఫలితమ్ము గానక
పర్వతమును బెరికి పైకి విసిరె. 454

ఆ. కాని యదియు వాని కాయమ్ము ఢీకొని
ముక్కచెక్కలాయె నక్కజముగ
నంతవాడు మిగుల నాగ్రహోదగ్రుడై
అంగదుని శిరమ్ము నందు గ్రుద్దె. 455

క. ఆ దెబ్బకు తలక్రిందై
మేదిని బడి యంగదుండు మిక్కిలి వ్యథతో
స్వేదము కాల్వలు గట్టగ
పాదములను గదుపలేక పడియుండె నటన్. 456

క. అదిగని నీలుడు గవయుడు
మొదలగు సైనికులు కినిసి ముమ్మరముగ నా
పదితలల దనుజు తమ్ముని
మద మణచగ జనిరి గిరులు ప్రాకులతోడన్. 457

తే. వానరులు పైకి విసరిన వానినెల్ల
కుంభకర్ణుడు మధ్యలో గూల్చివైచి
వికటముగ నవ్వి మిక్కిలి భీకరముగ
ననియె నీరీతి రణరంగ మదరు నటుల. 458

ఉ. "మాకులు పర్వతమ్ము లణు మాత్రము నన్ జెనకంగ లేవురా
తోకల మూకలార! కడుదుర్బలు లాయుధ హీనులైన మి
మ్మాకలి దీర మెక్కి ముద మారగ నావల రాము గూల్చి, ము
ల్లోకములందు నాదనుజ లోకపు ఖ్యాతికి వాసి బెంచెదన్." 459

ఆ. అని వచించి మేటి వనచరముఖ్యుల
తరిమి తరిమి శూలధాటితోడ
మూర్ఛ నందజేసి మూతిముందుకు జాపి
మిగిలినట్టి వారి మ్రింగ దొడగె. 460

క. కొందరిని చంపి మ్రింగెను
కొందర ప్రాణములతోనె గ్రుక్కెను నోటన్
కొందరి పీకలు నులిమెను
కొందరి రక్తమ్ము ద్రాగె గుటగుట మనుచున్. 461

క. ఆ దారుణమును బొడగని
పాదపములగిరులగాక బడగూల్తు నినున్
మేదిని పిడికిటి పోటున
యో దానవ! యని కపీంద్రు డుద్ధతి నురికెన్. 462

ఆ. కాని యినతనూజు ఘన ముష్టిఘాతముల్
కుంభకర్ణు రాతిగుండె నింత
గదుపలేకపోయె నదిగని చకితుడై
మరల పెద్ద కొండ బెరికి విసరె. 463

క. అదియును నాఘనదేహుని
యెద ఢీకొని బ్రద్దలాయె: నిక నెటు వీనిన్
తుదముట్టింపం గలనని
మదిలో దినమణిసుతుండు మరిమరి దలచెన్. 464

క. ఇదియే తగు సమయమ్మని
గదలును బాణములతోడ గాదని శూలా
యుధమును రావణుననుజుడు
వదలెను కను లెఱ్ఱజేసి వానరవిభుపై. 465

తే. ఆ మహాశూల మర్కజునంటకుండ
మధ్యలో బట్టుకొని పవమానసుతుడు
బలము వెలయించి రెండు ముక్కలుగ విరిచి
విసరికొట్టెను పుడమిపై కసి దొలంగ. 466

ఆ. కుంభకర్ణు డంత క్రుద్ధుడై యొక మహా
పర్వతమును బెరికి "వానరేంద్ర!
నేడు నీకు చావు మూడెను కాచుకో"
మ్మనుచు భీకరముగ నరచి విసరె. 467

తే. భూరి పర్వతరాజము పోటువలన
ఒడలు నెత్తురు ముద్దాయె నుర్విమీద
నటులె మూర్ఛిల్లిపడియె నా యర్కజుండు
కుంభకర్ణుడు వెంటనే కుతుక మెసగ. 468

తే. సందిటం బట్టి వానిని సమరభూమి
నుండి లంకకు గొంపోవు చుండె నపుడు
వానరేంద్రుని పాలి దైవమ్ములీల
మెల్లమెల్లగ బ్రసరించె చల్లగాలి. 469

తే. మలయ మారుతస్పర్శకు పులకరించి
కనులు దెరచిన దినమణితనయు డంత
కుంభకర్ణుని చెవులు ముక్కులను గొరికి
క్షణములోపల నంతరిక్షమున కెగసి. 470

తే. ఉగ్రుడై లంకవైపున కురుకుచున్న
నీలనీరదరూపు సన్నిధిని వాలె
వింట దొడిగిన బాణము విసరికొట్టి
కపికులేంద్రుని రాముడు కౌగిలించె॥ 471

తే. కుంభకర్ణుడు చిఱ్ఱెత్తి కొండకోన
నదులు జలనిధులెల్లను అదరునటుల
సింహగర్జనజేసి విశిష్టమైన
ముద్గరమ్మును గొని దూకె మోహరమున. 472

ఆ. ఆకలిగొను సింహ మతి భీకరమ్ముగా
తరిమి తరిమి మత్తకరుల జంపు
కరణి యందినంతవరకు వానరులను
హత మొనర్చె రావణానుజుండు. 473

తే. వాని దుశ్చర్య నరసి రామానుజుండు
వాడి బాణాలు సంధించి వరుసబెట్టి
వక్షమును లక్ష్యముగ జేసి కక్షతోడ
వదలి రక్తము గ్రక్కించె వాని నోట. 474

క. సౌమిత్రి బాణధాటికి
నామూర్ఖుని కొవ్వు గరగి అదియే యేర్రై
సామాన్య వనచరాళికి
నామోదము బెంచి తాన మాడగ జేసెన్. 475

తే. వారి కోలాహలము గని మేర మీరి
నట్టి యావేశమున పిచ్చిబట్టి నట్టు
లరచి వానరులనె గాక నడ్డుపడిన
దనుజులను గూడ సివమెత్తి దునుమసాగె. 476

ఉ. అప్పటిదాక మౌనముగ నంతయు జూచుచునున్న రాము డీ
తప్పుల మారి పట్ల దయదాల్చుట నేర మటంచు నెంచి తా
జప్పన బాణమందుకొని "చావగ సిద్ధముగమ్ము దానవా!
యిప్పుడె నిన్నుగూల్చి దనుజేశున కంపెద నీశవ" మ్మనెన్. 477

ఆ. "రామబాణమహిమ రాక్షసుల్ నా చిన్న
తనమునందె దెలిసికొనిరి మూర్ఖ!
నిన్న దెలిసికొనియె నీయన్న రావణు
డీవు దెలిసికొందు విప్వ" డనుచు. 478

ఆ. కుంభకర్ణుపైకి గురిపెట్టి యొకమహా
స్త్రమ్ము వైచె దశరథాత్మజుండు
కాని ఫలము సుంతగానక వేరొక
శరముతోడ భుజము నరికివేసె. 479

ఆ. చెట్టుకొమ్మవోలె క్షితిమీద గూలిన
వాని క్రింద నలిగి దానవ భటు
లెందరో మడిసిరి యందర నొకసారి
కలయ జూచి కుంభకర్ణు డలిగె. 480

ఆ. ఒంటిచేతితోడ నొకమహాసాలమున్
బెరికి మీది మీది కురుకుట గని
అర్కకుల వతంసు డర్ధ చంద్రాకార
బాణ మెక్కువెట్టి వదలె నపుడు. 481

ఆ. రెప్పపాటులోన రెండవ భుజము నా
బాణ ముత్తరించె కాని వాడు
బాధ సరకుగొనక బాహువులకు మారు
కాళ్ళతోనె చెట్ల బెళ్ళగించు. 482

తే. యత్న మొనరించుచుండె నా యదను జూచి
దినకరాన్వయ తిలకుడు తీవ్రమైన
రెండు బాణాలతో వాని రెండు కాళ్ళు
తునియ జేసెను తా నొక్క క్షణములోన. 483

తే. అయిన వాడు పాతాళ గహ్వరమువంటి
నోరు నతిభీకరమ్ముగా బార దెరచి
"ఓరి మానవ! నీదెంత క్రూరబుద్ధి
యనుచు గర్జించె త్రిజగమ్ము లదరు నటుల. 484

తే. కాని శ్రీరాము డించుక కనికరమ్ము
నెంచ కైంద్రాస్త్రమును ప్రయోగించివాని
శిరము ఖండించె నది గిరిశృంగ మటుల
రక్త మోడుచు నెగిరి దూరమున బడియె. 485

తే. అప్పటికి గూడ రాముని యాగ్రహమ్ము
సద్దు మణగక నా దుష్ట శవము నొక్క
మహితశరమున వార్నిధి మధ్యబడగ
జేసి యిక్ష్వాకు వంశము వాసి బెంచె. 486

ఆ. సగము పీడ నేడు సమసిపోయిన దని
కపిగణమ్ము మురిసి గంతు లిడియె;
మునులు రామవిభుని ముక్తకంఠమ్మున
సన్నుతించి రపుడు సంబరమున. 487

ఆ. ఉద్ధతముగ నెగిరి యొడ్డును ఢీకొని
కరగిపోవు కడలి కెరట మటుల
కుంభకర్ణు డనిని గూలి నాడని విని
యటులె మూర్ఛనందె నసురవిభుడు 488

ఆ. రాజధానిలోని రాక్షసు లందరు
ధైర్య ముడిగి శోకతప్తులైరి
రాజవీథులన్ని రణగుణధ్వనులతో
మూరు మ్రోగి మ్రోగి మౌన మూనె. 489

తే. అంతలో మెల్లమెల్లగా యసురనేత
దుస్సహంబైన దుఃఖమున్ తొలగద్రోసి
యెదురుగానున్న నతికాయువదన మరసి
తండ్రి! ముగిసెను నీ పినతండ్రి శకము. 490

తే. అతనిపై బెట్టుకొంటి నా యాశలన్ని
కాని యవి గాలి మేడలై కడలి గలిసె!
కుడిభుజమ్మును త్రుటిలోన గోలుపోతి
నిపుడు నా మనోవేదన కేదిమందు? 491

ఆ. ఎవని బాణధాటి కిల గూలె నా కూర్మి
తమ్ము డతని కేను తగిన శాస్తి
జేయకుండ భువిని జీవించి ఫలమేమి?"
అనుచు వగచుచుండె నంతలోనె. 492

తే. త్రిశిరుడును మహోదరుడును దెబ్బదిన్న
కుంజరము లట్లు లరుదెంచి "కుంభకర్ణు
డనిని మడిసిన మాత్రాన యసురనాథ!
దీను నట్టుల నీవు చింతింప దగునె? 493

తే. ఇపుడె మేమంత రణభూమి కేగుదెంచి
శాత్రవుల నెల్ల దునుమాడి సత్వరముగ
లంకకును నీకు ముదము నిశ్శంక గూర్తు
మనుమతిం" డని వేడగా దనుజవిభుడు. 494

తే. కొమరు నతికాయు గనుగొని కొంతమంది
నసుర వీరుల జతచేసి "యంద రిపుడె
పోయి ముందుగ రాముని పుడమిగూల్చి
తెలుపుడా శుభవార్త నా కలతదీర. 495

తే. అంతియేగాక రణరంగమందు జరుగు
నన్ని వివరము లెప్పటి కపుడు నాకు
దెలియజేయు" డటంచు నా దేశ మొసగి
సరభసమ్మున వారిని సాగనంపె. 496

తే. అపుడు దేవాంతకుండు నరాంతకుండు
త్రిశిరు డతికాయు డందరు నిశితమైన
అస్త్రశస్త్రమ్ములం దాల్చి యని యొనర్ప
బయలుదేరిరసంఖ్యాక బలముతోడ. 497

ఆ. కాని రావణునకు కదనమ్మునం దేమి
జరుగునో యటన్న వెరపు మదిని
విడువనందువలన గడియలు లెక్కించు
కొనుచు నొంటరిగనె కూరుచుండె. 498

తే. రావణుడె వచ్చు నీసారి రణ మొనర్ప
వాని నెటులైన బరిమార్చి బవరమునకు
స్వస్తి పలికెద నంచు నిక్ష్వాకువంశ్యు
డెదురు జూచుచు తా నుండె నింతలోన. 499

తే. చెవులు చిల్లులు పడునట్లు సింహనాద
ములును కాహళధ్వనులును ముమ్మరముగ
మారుమ్రోగుట విని యప్రమత్త మాయె।
సకలవానరసైన్యము సంబరమున. 500

తే. అంతలోపల హనుమంతు డరుగుదెంచి
రామలక్ష్మణులకు మ్రొక్కి "రావణుండు
గాదు వచ్చున దనికి నే గాంచినాడ
పర్వతాగ్రమునందుండి వారినెల్ల. 501

తే. ఇంద్రజిత్తును రావణు డిద్ద రిపుడు
నగరమందున గలరని నాకు దెలిసె;
కాన నావచ్చు వారెంత ఘటికులైన
క్షణములోపల నిక్కడే చత్తు" రనియె. 502

తే. అంత సౌమిత్రి ముదమున నన్ననరసి
"అగ్రజా! నేడు లేదు నీయవసరమ్ము
చిట్టియెలుకల జంపంగ సింహ మేల?
రామశరమున కిమ్ము విశ్రాంతి కొంత." 503

తే. అనుచు లక్ష్మణు డన్నతో ననెనొ లేదొ
త్రిశిరు నసమానమైన నేతృత్వమందు
కడలి యుప్పొంగి దూకెడు కరణి కదన
రంగమును జేరె సైన్య మార్భటులతోడ. 504

తే. వెంటనే యొక్క రామభూవిభుడు దక్క
తక్కువానరయోధు లందరును గలిసి
కదనమున వైరి వర్గము గరువ మడప
ముందు కురికిరి చిరుతలమందవోలె. 505

తే. పగర దెగటార్చుటకు నిరుతెగల వారు
జబ్బ జరచుచు సింహగర్జనలు చేసి
యొక్కసారిగ దలపడి రుద్ధృతముగ
నిలిచి రాముడు గనుచుండె నిబ్బరముగ. 506

క. సమమగు విధమున మొదలై
క్రమక్రమముగ హెచ్చుతగ్గులకు లోనగుచున్
సమర మ్మడుగడుగున తన
గమనమ్మును మార్చి యుత్సుకత హెచ్చించెన్. 507

ఆ. పోరుజరుగుచున్న తీరును గమనించి
తన ప్రతిష్ఠ నిలుపుకొన దలంచి
రామభద్రు డపుడు రణనినాదాలతో
సైనికాళి పౌరుషమును బెంచె. 508

ఉ. రాముడు బాణ మందకయె రౌద్రము సైనికులందు నింపి, "మీ
రేమరుపాటునన్ విజయ మీదిన మందకయుంటిరేని నే
నా మదమత్తు రావణుని యంత మొనర్చుట కొంత జాప్యమౌ
పాముది చిన్నదైన తెగబాదు టవశ్యము పెద్దకర్రతో." 509

తే. అనుచు వీరోచితముగ నా యినకులేశు
డనిన మాటలు వీరుల మనములందు
క్రొత్తయుత్సాహమును నింపె కొండలన్ని
క్షణములోజేరె! వారి హస్తములయందు. 510

తే. కొండలును నాయుధమ్ము లుద్దండలీల
సలుపు సంగ్రామమందు కొండలదె గెలుప
టన్న భావము క్రమముగా నసురులందు
బెరిగి వారల ధైర్యము చెరగిపోయె. 511

తే. అంగదుడు చంపె దొలుత నరాంతకునిని
అటులె నీలుడు దునిమె దేవాంతకునిని
ఆంజనేయుడు త్రిశిరుని హత మొనర్చె
అర్కజుడు మహోదరు జంపె నాక్షణమ్మె. 512

తే. వెంట వచ్చిన నా మహావీరులంత
వనచరులచేత హతులైన వైన మరసి
వారి శవముల నొకసారి బారజూచి
కినిసి యతికాయు డురికె లక్ష్మణునిపైకి. 513

తే. యుద్ధనైపుణ్యమందున నొకరి కొకరు
తీసిపోనట్టి యోధులు తీక్ష్ణముగను
ఒండొరుల జూచుకొనుచు మహోగ్రభంగి
నస్త్రశస్త్రమ్ము లా యిద్ద రందుకొనిరి. 514

ఆ. అట్టి శౌర్యవంతు లతిభీకరమ్ముగా
నిరువు రొకరి కొక్క రెదురు నిలిచి
సలుపు సమరమునకు సాక్షిగా ఒడలెల్ల
కనులు జేసి నింగి కాంచ దొడగె. 515

ఆ. రావణాసురుండు లంకలో గూర్చుండి
క్షేమవార్త యుద్ధభూమినుండి
యెపుడు వచ్చునంచు నెదురు చూచుచునుండె
అమిత సంభ్రమమున అంతలోన. 516

ఆ. చారు లరుగుదెంచి "జయము మహాప్రభో!
సమర మతి భయంకరముగ సాగు
చున్న దచటి వార్త లన్ని మీ కెరిగింప
వచ్చినాము మిగుల త్వరితగతిని. 517

ఆ. అలు పాకింత లేక ననిలోన మనవారు
వరుసబెట్టి పెక్కు వనచరులను
హత మొనర్చి పిదప నతిముఖ్యు లందరు
వీరమరణ మొందినారు దేవ! 518

ఆ. అంత తమ కుమారు డతికాయు డొక్కడే
రాజసమ్ముతోడ రాముదండు
నదురు బెదురులేక తుదముట్టగా జేసి
పోరి లోన తమరిపేరు నిలిపె." 519

తే. అనిన చారుల మాటల కడ్డువచ్చి
చాలు మీ శుభవార్త కల్లోలభరిత
మైన నాయంతరంగము నలరజేసె
నందు కొనుడని కానుక లందర కిడె. 520

తే. "ఇప్వ డెరిగింపు డొక్కడే యెటుల చంపె
నా కుమారుడు జగదేక భీకరులగు
రామలక్ష్మణు లిర్వుర రణమునందు"
ననుచు బ్రశ్నించె దైత్యకులాధిపుండు. 521

ఆ. ఎటుల నశుభవార్త నిప్పడు దెలుపంగ
వలయు ప్రభువుకన్న భయముతోడ
కానుకలను మరల దానవేంద్రుని పాద
యుగళి జేర్చి మిన్నకుండి రంత. 522

ఆ. దనుజ విభునిగుండె దడహెచ్చి దిగ్గన
పైకి లేచి యొకని బట్టి కుదిపి
యేమి జరిగె తెల్పుమీ మౌన మేటికి
అనుచు దిక్కు లదరు నట్టు లరచె. 523

తే. వాడు గడగడ వణకుచు వాస్తవమును
దాచజాలక తుదకెట్లొ ధైర్యమూని
స్వామి! మన చిన్నదొరయు లక్ష్మణుని ధాటి
కాగజాలక కనుమూసె నాహవమున. 524

ఆ. చావు కబురు నెంత చల్లగా
నసురవిభుని గుండె కది త్రిశూల
మాయె! నాత డంత "హో కుమారా!" యని
భవన మదుర నరచి పడియె ధరణి. 525

తే. అనుజు డనిలోన మరణించె నన్న వార్త!
మునిగె జనకుడు మూర్ఛలో ననెడి వార్త!
నాలకించిన యింద్రజి త్తగ్గిమీది
గుగ్గిలమ్మయి చనె కొల్వుకూటమునకు. 526

ఆ. అచట నేలమీద నతి దీనముగ బడి
యున్న తండ్రి నరసి వెన్ను నిమిరి
పిలిచె జనక! యనుచు మెలమెల్ల వెంటనే
తనయు డలర లేచె దనుజవిభుడు. 527

ఆ. అంత నింద్రజిత్తు "చింత మానుము తండ్రి!
యిపుడె సమరభూమి కేగి నేను
సకల వానరులను సహజన్ములగు రామ
లక్ష్మణులను గూల్తు రయ మెలర్ప." 528

ఆ. అనుచు తండ్రి యొద్ద నాశీస్సులను గొని
గంధకరుల వంటి గాడిదలను
బూన్చినట్టి రత్నభూషిత రథమెక్కి
వాయువేగముననుబైలుదేరె. 529

ఆ. అతని ననుసరించె నగణితమ్మగు సేన
భేరి కాహళములు మారుమ్రోగ
సమర రంగమందు సర్వసైన్యము నాపి
రథము డిగ్గి యగ్ని రగులు కొలిపి. 530

ఆ. మిగుల భక్తితోడ మేఘనాదుడు హోమ
విధులు నిర్వహించి వివిధములగు
నస్త్ర శస్త్రములకు నర్చనల్ గావించి
కదలె జముని భంగి కదనమునకు. 531

తే. స్యందనముతోడ మేఘాలచాటు జేరి
అచటినుండియె కపిముఖ్యు లందరి పయి
మంత్ర యుక్తమ్ముగను బహు మహిత శస్త్ర
చయము గుప్పించె కుంభవర్షమ్ము పగిది. 532

ఆ. అగ్నిశిఖలవంటి యా యస్త్రముల ధాటి
నడ్డుకొన దలంచి యంగదాది
కపివరేణ్యు లెంతగా ప్రయత్నించిన
ఫల మొకింతలేక కలత జెంది. 533

ఉ. ఎక్కడినుండి వచ్చెనివి? యెవ్వడు వీనికి సూత్రధారి? తా
నెక్కడ దాగియుండె నని యెంతయు తర్కము జేయు చుండగా
చుక్కలవీథినుండి కడు చోద్య మెలర్పగ ఇంద్రజిత్తు నే
నెక్కడ నున్న నేమి? మిము నిప్పడె గూల్చెద కాచుకొం"డనెన్. 534

ఆ. అపుడు తెలిసిపోయె నత డింద్రజిత్తని
కాని కనులముందు కానఁబడక
దివిని నిల్చి పోరు ధీరు నెదుర్కొని
గెలుపునందు టంత సులభ మగునె? 535

ఆ. అనుచు రామభద్రు డాత్మలో దలపోసి
ప్రక్కనున్న అనుజు బారజూచి
మిగులయుక్తియుక్తముగ మన మిప్పడు
వ్యవహరించవలయు నని వచించె. 536

తే. కాని యీ లోపలనె వాడు కాలభుజగ
సన్నిభములైన యస్త్రశస్త్రాలతోడ
కపికులేంద్రుని నీలు నంగదుని నలుని
భల్లుకాధీశ్వరుని సొమ్మసిల్లజేసి. 537

మ. "వినుమో మానవనాథ! యీ దినమునా విశ్వేశ్వరుం డడ్డినన్
నిను నీతమ్ముని జంపకుండ వదలన్ నిర్నిద్రతన్ కాచు కొ
మ్మని యా రావణుకూర్మి నందనుడు యత్యంతాగ్రహావేశుడై
క్షణ మాలస్యముజేయకుండ వదలెన్ సంధించి బ్రహ్మాస్త్రమున్. 538

తే. అపుడు రాముడు లక్ష్మణు డంతరంగ
మందు నలువను బ్రార్థించి య మ్మహాస్త్ర
మునకు తలయొగ్గి యటులనే మూర్ఛనంది
రంత రావణి యెనలేని సంతసమున. 539

తే. తనను వరియించె గెలుపన్న తలపుతోడ
ధరణి కంపిల్ల సింహనాదమ్ము జేసి
సమర భూమికి స్వస్తి వాచకము బలికి
చనియె లంకకు దోర్గర్వ మెనయు నటుల. 540

తే. అంతవరకును సమర విన్యాసములను
మించు నాసక్తితో దిలకించినట్టి
జలజమిత్రుడు రామలక్ష్మణుల మూర్ఛ
నరయ నోపక నస్తాద్రి కరిగె నంత. 541

తే. వీర విక్రముడైన విభీషణుండు
హనుమచేతికి కాగడా నందజేసి
ప్రాణమాత్రావశిష్టులై బాధపడెడు
వారి నందర నోదార్చవలయు నిప్ప
డనుచు కడువడి వచియించె నతనితోడ. 542

తే. అంత నిర్వురు క్షతగాత్రు లందరగని
అందులో నారిపోయెడు అగ్నివోలె
దోచుచున్నట్టి జాంబవంతుని విశాల
దేహమందున్న బాణసందోహ మరసి. 543

తే. ప్రేమ సాగరుడైన విభీషణునకు
గుండె నీరాయె! మాటలు గొంతులోనె
కొట్టుమిట్టాడె! నట్టులే కొంత తడవు
మదిని జింతించి తుద కిట్లు మాటలాడె. 544

క. తాతా! నీ దేహము నా
ఘాతుకు డస్త్రాల ప్రోవు గావించెను నీ
వీతాప మెట్టు లోర్చితి
వో! తలచిన యంత భీతి యొదవెను మాకున్. 545

క. అనిన విభీషణు కంఠ
ధ్వని విని భల్లూకనేత తహతహపడి యి
ట్లనె! రాక్షసవీరా! మా
హనుమంతుని యునికి దెలుపు మతిశీఘ్రముగన్. 546

ఆ. జ్ఞానవృద్ధుడైన జాంబవంతుం డొక్క
హనుమ యునికి దెలుపు మనుటలోని
యంతరార్థ మేమిటని విభీషణు డెంచి
మనము శంకదొలగ ననియె నిట్లు. 547

ఉ. వానరనేత యర్కజుడు, వాలి తనూజుడు, రామలక్ష్మణుల్
నేనును, నీలుడు న్నలుడు నే డిటనుండగ నొక్క యంజనా
సూనుని గూర్చి నీ వనుట చోద్యముగా గనుపించె గాన నా
మానస శంక తత్క్షణమె మాన్పగ వేడెద ఋక్షనాయకా! 548

తే. సవినయమ్ముగ నటు విభీషణు డడిగిన
ప్రశ్న కాజ్ఞాన వృద్ధుడు "పరమహితుడ!
వాయునందను డొక్కడు బ్రతికియున్న
నతడె బ్రతికించు నీ నాటి హతుల నెల్ల." 549

ఆ. అటుల జాంబవంతు డనిన వెన్వెంటనే
ప్రక్కనున్న హనుమ పరవశించి
వాని పదములంటి "నేను మీ దయవల్ల
బ్రతికి యుంటి నెట్టి బాధలేక. 550

ఆ. అనతిమ్ము తాత! యనిలోన క్షతగాత్రు
లైన వారి కొరకు హతుల కొరకు
ప్రాణ మొడ్డుటకును భయపడ నొక్కింత
స్వామి రామభద్రుసాక్షిగాను." 551

ఆ. అనిన హనుమ పలుకు లాలించి యా వృద్ధ
యోధు డి ట్టులనియె బాధ మరచి
"వేయి మాటలేల? నాయనా! హనుమంత!
నేడు దిక్కుమాకు నీవె తండ్రి! 552

ఆ. ఆలసింపకుండ నాకాశమార్గాన
శీఘ్రగతిని బోయి శీతనగము
మీద డిగ్గి యచట మెరసెడు యోషధీ
పర్వతమును తేరిపార జూచి. 553

తే. ప్రాణములు గోలుపోయిన వారినెల్ల
తిరిగి బ్రతికించు సంజీవకరణి యటులె
సకల వ్రణముల బాపు విశల్యకరణి
వడిగ గాయాల మాన్పు సౌవర్ణకరణి
ముక్కలైనట్టి యవయవములను గూడ
త్వరితముగ నతికించు సంధానకరణి
యనెడు నాలుగు యోషధు లచట గలవు
వాని గొనితెమ్ము వేవేగ వాయుపుత్ర!" 554

క. అని జాంబవంతు డనగనె
హనుమంతుడు గరుడు నట్టు లాకాశపథ
మ్మున జని హిమవత్పర్వత
మున డిగి కైలాసశిఖరమున కెగబ్రాకెన్. 555

తే. అచట నిలుచుండి కనె నొక యద్భుతమ్ము
నదియె మిలమిల మెరయు యోషధుల నగము!
చోద్యముగ దోచుచున్న య చ్చోటి కేగి
హనుమ మురిసెను సఫలత నందినట్లు. 556

ఆ. కాని వీడు మనల గాజేయ వచ్చిన
ట్లున్న దని తలంచి యోషధులటె
మరునిమేష మందు మటుమాయమై పోయె
నా విచిత్ర మరసి హనుమ కినిసి. 557

గీతి. ఓ యోషధీనగమ! యొక్కింత దయలేక
శ్రీరామకార్య మను చింత సైతము లేక
చేసితివి తప్పు! నీ చేష్టలకు నే జడియ
నా బాహుబలముతో నగరాజ! విబుధులు
వెరగంది చూడగా పెళ్ళగించెద చూడు
మని నింగి మార్మోగు నటు సింహనాదమ్ము
జేసి యన్నంత పనిజేసి యా పర్వతము
నరచేత బెట్టుకొని నాత్మలో రఘురాము
దలచుకొని పవమానతనయుండు వినువీథి
దానె యొక సూర్యుడుగ దనరారుచుం బోయి

కదనరంగము మధ్యగల కొండపై వాలె!
సంబరమ్మున విభీషణు డచ్చటికి నేగి
వాయునందన! యింత త్వరితగతి నీ వెట్లు
రాగలిగినా వంచు ప్రణతు లిడి నుతియించె. 558

తే. లలితలలితమ్ము లోషధీలతలనుండి
వెలువడెడు మేలి పరిమళములను బీల్చి
రామలక్ష్మణులే గాక రాముదండు
లోని ప్రతి వ్యక్తి నిద్రమేల్కొనినరీతి. 559

తే. ద్విగుణితోత్సాహమున లేచి విమల తేజ!
నేడు మా ప్రాణదాతవు నీవె యనుచు
వాయునందను వేనోళ్ల బ్రస్తుతించి
కదన కౌతూహలమ్మున గంతు లిడిరి. 560

తే. రణము ప్రారంభమున నుండి రావణుండు
మరణ మొందిన దానవవరుల దేహ
ములను వెనువెంటనే యీడ్చి జలధిలోన
బారవేసెడు రీతి నేర్పాటు జేసె. 561

ఆ. అందువలన నొక్క యసురుని మృతదేహ
మైన గానుపించదాయె నచట
నదియు వానరులకు అడుగని వరమాయె
వారి ముదము మేర మీరిపోయె. 562

క. తన వారందరు కుశల
మ్మని యెరిగిన యినతనూజు డానందమునన్
వనచరముఖ్యుల నందర
గని యిదియే యదను మనకు కదనమ్మునకున్. 563

తే. రావణుడు నేడు మిగుల నైరాశ్యమందు
మునిగి యున్నాడు కుంభకర్ణుని మరణము
కూర్మినందను డతికాయు ఘోరమృతియు
నతని యెదలోన తుదిలేని వ్యధను నింపె. 564

ఆ. వాడు తేరుకొనిన గాడి దప్పను వ్యూహ
మందువలన నేటి యర్ధరాత్రి
లంక ముట్టడించి రాక్షసముఖ్యుల
హత మొనర్చు టుచిత మని వచించె. 565

తే. రాముడును విభీషణుడును లక్ష్మణుండు
తక్కు వనచర వీరు లందరును ముక్త
కంఠమున నర్కతనయుని కౌశలమును
వినుతి గావించి మిక్కిలి వేగిరమున. 566

తే. దివ్విటీలను గొని నాల్గుదెసలనుండి
యొక్కసారిగ లంకకు నురికి కోట
బురుజులకు రాజ ప్రాసాదములకు నిప్పు
బెట్టి రొక్కింత యేనియు భీతిలేక. 567

తే. అంత త్రుటిలోన నా మంట లన్నివైపు
లకును వ్యాపించి ఆ నగరమ్ము నెల్ల
నగ్ని గుండము గావించె నసురవరుల
ఆర్తనాదాలు మార్మ్రోగె నాకసమున. 568

తే. పెక్కు నారాచముల రాము డెక్కువెట్టి
నిమిషమాత్రాన పురగోపురమును గూల్చి
అన్నియెడలను తానెయై ఆగకుండ
బాణవర్షము గురియించె బహుముఖాల. 569

తే. ఉరుము లేకయె పిడుగులు గురిసినట్లు
లంకలోపల బాణవర్షమ్ము గురియు
చుండుట నెరింగి రావణుం డుల్లమందు
భయము క్రోధము హెచ్చి కంపమ్ము నొందె. 570

ఆ. క్షణము జాగుసేయ జరుగు ఘోరమ్మని
తలచి యసురవిభుడు తత్ క్షణమ్మె
కుంభకర్ణుసుతుల కుంభ నికుంభుల
బంపె ప్రోత్సహించి బవరమునకు. 571

ఆ. అతి బలాఢ్యులైన నా యన్నదమ్ములు
వలసినంత సైన్యబలముతోడ
రామలక్ష్మణులను లక్ష్యమ్ముగా గొని
హుంకరించి ముందు కురికిరంత. 572

తే. అంగదుడు కుంభు నచ్చటే యడ్డగించి
అన్ని శక్తులనొడ్డి పోరాడెగాని
అస్త్రవిద్యాప్రవీణుడౌ యతనిముందు
వీరమొక్కటె చాలక వెనుకబడియె. 573

తే. అర్కజుం డది గమనించి ఆగుమోరి
యీవునాచేత జచ్చున ట్టివుడో వ్రాసె
బ్రహ్మ నీఫాలమందు సుస్పష్టముగను
కాచుకొను మిప్పడే నీదు పీచ మడతు. 574

తే. అనుచు బ్రకటించి కుంభుని యట్టిపట్టి
కసిగ పైకెత్తి జలధిలో విసిరికొట్టె
పర్వతము నింగినుండి పైబడినయట్టు
వాని బరువుకు కలగుండు వడియె నబ్ధి. 575

తే. అంతియే గాని వా డిసుమంతయైన
కలత జెందక కడలిలో జలకమాడి
పైకిలేచిన విధమున బర్వులెత్తి
తలపడెను వేగ సూర్యనందనునితోడ. 576

తే. కుపిత సింగము కరణిని కపికులేంద్రు
డమితబలమున కుంభుని యవని ద్రోసి
చావు మిప్పడె యనుచు వక్షమ్ము మీద
ముష్టిఘాతాల పలుమార్లు మోది చంపె. 577

క. అది తిలకించి నికుంభుడు
మదకరి వలె నరచి వేయి మణుగుల బరువౌ
గదచేకొని సుగ్రీవుని
యెదపై సివమెత్తి మోదె నిల కంపింపన్. 578

క. కర్కశముగ దనుజుం డటు
లర్కజు హింసించు టరసి యాగ్రహపరుడై
మర్కటకులభూషణు డుద
యార్క సమానుండు మారుతాత్మజు డంతన్. 579

ఆ. ఆకసమున కెగిరి అట్టె నికుంభుని
మీద దూకి క్రిందు మీదొనర్చి
వాని బాణములను తూనీగలుగ నెంచి
నిర్భయముగ బట్టి నేలగొట్టి. 580

ఆ. గుండెపై దన్ని అతిబలోద్దండు డగుచు
రామకార్యార్థినై వచ్చి లంకనెల్ల
బూదిజేసిన కరువలి పుత్రకుండ!
తరమె నను గెల్వ దానవాధముడ! నీకు. 581

తే. అనిల సుతునకు పిడికిలి ఆయుధమ్ము
దాని ముందర నీ బాణదర్ప మెంత?"
అనుచు నతిరోషమున బల్కి యతనిబట్టి
గిరిగిరం ద్రిప్పి బలిమిమై క్రిందగొట్టి. 582

తే. ఉరముపైనెక్కి కూర్చుండి యొక్కసారి
చచ్చుటకు ముందు నీ పితన్ సంస్మరించు
కొను మని వచించి పిడికిట గ్రుద్ది గ్రుద్ది
హత మొనర్చె నికుంభుని యనిలసుతుడు. 583

ఆ. అంత ఖరుని కొమరు డగు మకరాక్షుడు
దాశరథిని మెరుపుదాడితోడ
చంప దలచి వచ్చె సైన్యసమేతుడై
కాని రాము డింత కలత వడక. 584

తే. రమ్ము! మకరాక్ష! నీ తండ్రి ప్రాణములను
నాడు బలిగొన్న రామబాణమ్ము నేడు
వేచియున్నది నిను జంపు వేడ్క కొరకు
త్వరగ బంపెద నిన్ను నీ తండ్రికడకు. 585

కం. అని జానకీ మనోహరు
డనగన్ మకరాక్షు డిట్టులనె "రామా! నా
జనకుని జంపిన నిను నే
ననిపెద నీ జనకు కడకు నతిశీఘ్రముగా. 586

తే. అపుడు లభియించు నా తండ్రి కాత్మశాంతి
నాకు లభియించు తండ్రిఋణమ్ము దీర్చు
కొంటి నను తృప్తి" యని పల్కి వింటినారి
బాణములు పెక్కు సంధించి వదలె పైకి. 587

తే. కాని యవి యెల్ల శ్రీరాముబాణధాటి
కాగజాలక ముక్కలై యవని గూలె;
భానుకులభూషణుం డంత పావకాస్త్ర
మున నెడద జీల్చి మకరాక్షు దునిమె నపుడు. 588

క. దారుణముగ ఖరతనయుడు
ధారుణి బడి చచ్చు టరసి తక్కిన సైన్య
మ్మారటపడి బవరము విడి
పారెను నల్దెసల ప్రాణభయకంపితమై. 589

క. చివరకు మకరాక్షుండును
బవరమ్మున జచ్చెనన్న వార్తను విని దా
నవపతి కడు కలవరమున
అవురా! యిపు డేది? దారి యని క్రుద్ధుండై. 590

ఆ. మేఘనాద! యనుచు మిన్ను కంపించెడు
లీల నరచి నేల వ్రాలె నటులె!
తండ్రి యార్తితోడ తనను బిల్చుట విని
యేగె నచటి కపుడె యింద్రజిత్తు. 591

**తే. రావణుం డంత సుతుని నోరార బిల్చి**
**మరణమును గెల్చి రామలక్ష్మణులు నేడు**
**హత మొనర్చిరి మకరాక్షు నాహవమున**
**దిక్కుదోచని స్థితిలోన జిక్కుకొంటి.** 592

తే. నేడు బాసటగా నాకు నీవు దక్క
మిగుల లేదొక్క వీరుడీ మేదినీ వ
లయమునం దటుగాన నా రామలక్ష్మ
ణులను రణమున హతమార్చ వలయు నీవె. 593

సీ. అప్రతిమానమై యలరు పరాక్రమ
మున నన్ను మించిన ఘనుడ వీవు
అనిలోన నమరేంద్రు నవలీలగా గెల్చి
హారతుల్ గొనిన సాహసుడ వీవు
నింగినేలకు మధ్య నిల్చి పగరనిండు
గుండెల జీల్చు దక్షుండ వీవు!
కంటికి గనుపించకయె వైరి వర్గమున్
బరిమార్చగలుగు నేర్పరివి నీవు!
తే. ఆలమున నెట్టి యవరోధ మడ్డుపడిన
మడమ ద్రిప్పని అసమవీరుడవు నీవు
శరము సంధించి నరుల నిర్వురను నేడు
కదనమున జంపుటొక లెక్క గాదు తనయ!" 594

ఆ. అటుల తన్ను జనకు డంతగా బొగడుట
కేమి హేతు వనుచు నింద్రజిత్తు
మానసమున పెక్కు మార్లు యోచన సల్పి
ఆచి తూచి చివర కనియె నిట్లు. 595

తే. తండ్రి తనయుని దీవింప దగును గాని
పొగడు టుచితము గా దట్లు పొగడెనేని
ఆయువు హరించు నని పెద్దలనెడు మాట
నేడు నాలోన పెనుభీతి నింపె జనక! 596

ఆ. అందువలన నిప్ప డాలసింపక యాగ
శాల కరిగి శాస్త్రసమ్మతముగ
నగ్నిపూజ జేసి యావల నాహవ
మునకు నేను జనెద ననుచు పలికి. 597

ఆ. సవనశాల కేగి సకల విధులు పూర్తి
జేసి గుండె దిటవు జేసికొనిన
మేఘనాదు డపుడు మిక్కిలి నేర్పుతో
సృష్టి జేసె మాయ సీత నచట. 598

ఆ. అచ్చుగ్రుద్దినట్టు లసలు సీతను బోలి
యున్న మాయ సీత నొక్కమారు
మేఘనాదు డరసి మెలకువలను నేర్చి
యామె నరదమందు నట్టె నిలిపి. 599

కం. జయ మిక తనదేయని ని
ర్భయముగ రణరంగమునకు రావణి చని "యో
నయనాభిరామ! రామా!
భయమందక చివరిసారి భార్యను గనుమా!" 600

తే. అనుచు హేళనగా బల్కి యాకసమున
కనుల కగుపించులీల స్యందనము నిలిపి
అందులో నున్న సీత హాహారవములు
సలుపు విధమున హింసింప సాగె నతడు. 601

తే. రాము డా ఘోర మరసి దిగ్భ్రాంతి చెంది
ఆమె తన భార్య సీతయే యని భ్రమించి
దశదిశలు దద్దరిల్ల సీతా యటంచు
నరచె నది విని హనుమంతు డడలిపోయి. 602

ఆ. తాను ముందు కురికి "దనుజాధమా! యింత
పాపమునకు పాలుపడిన నిన్ను
హత మొనర్చి మోద మా తల్లి కొనగూర్చి
పిదప దనుజవిభుని పీచమణతు." 603

తే. అనుచు పవమానసుతు డొక యద్రినట్టి
పెరికి రావణుసుతునిపై విసరబోయి
అతనితోపాటు సీతకే మగునో యన్న
భయముతో దాని నావల బారవైచె. 604

ఆ. మేఘనాదు డదియె మిక్కిలి యనుకూల
మైన సమయ మనుచు నాత్మ దలచి
ఖడ్గమెత్తి నరికి కల్పిత సీతను
హనుమ చూచునట్లు లవని ద్రోసె. 604

ఆ. "ఇన్నినాళ్ళు రాము డేసాధ్వికోసము
పరితపించె నట్టి భవ్యచరిత
తన్నశోకవనిని తల్లియై దీవించి
త్వరగ తోడితెమ్ము పతి నటంచు. 606

తే. సజల నయనాల బలికిన చల్లనమ్మ
మరణమును కన్నులార నే నరయ వలసె!"
ననుచు బావురు మని యేడ్చి యాంజనేయు
డనిని జాలింపు డని తెల్పె ననుచరులకు. 607

తే. సీత మరణించె నని నమ్మి చింతలోన
మునిగిపోయిరి రామలక్ష్మణులు హనుమ
అనుచు మదినెంచి శక్రజిత్తపుడె సవము
జేయ జనె వేగ నెవరికి చెప్పకుండ. 608

తే. అది నికుంభిల యనెడు దేవాలయమ్ము
శత్రునాశన మాశించి జయము గోరి
మాంసరుధిరాలు వేల్చి హోమమును మంత్ర
సమ్మతమ్ముగ రావణి సలుప దొడగె. 609

ఆ. ఇచట రాముచెంత కేగి గాడ్పుసూను
డశ్రుజలముతోడ నంజలించి
సీత యింద్రజిత్తు చేతిలో మరణించె
ననుచు దెలిపె బాధ నణచుకొనుచు. 610

ఆ. అశనిపాత మాయె నా వార్త జానకీ
పతికి నటులె నేల వాలిపోయె!
అన్న మూర్ఛనందె నని లక్ష్మణుడు గుంది
యొడిని శిరము జేర్చి యనియె నిట్లు. 611

కం. "అన్నా! ధర్మమునకు లే
దన్నా! మరణమ్ము! నమ్ము మన్నా! ననుజూ
డన్నా! యిది కడు మోస
మ్మన్నా!" యని వగచుచుండె నా సమయమునన్. 612

తే. పరమహితుడు విభీషణు డరుగుదెంచి
రామభద్రుని స్థితి గని ప్రేమమూర్తి!
లెమ్ము! సీతమ్మ కిసుమంతలేదు ముప్పు
టంచు వచియించె భూమాత యలరు నటుల. 613

తే. సన్నిహిత మిత్రు డగు విభీషణుని నుడులు
లీలగా విన్న రామభూపాలవరుడు
మూర్ఛలో నుండియే కొంతమోద మంది
లేచి యెదురుగ తన వంక జూచుచున్న. 614

తే. అనుగు చెలికాని మోము కన్నారగాంచి
"ఓ విభీషణా! నీవు నన్నూరడింప
దలచి యటు బల్కితివొ? లేక ధరణిజాత
సేమ మనుమాట సత్యమో? చెప్పు" మనియె. 615

ఆ. అంత నినకులేశు నాత్రమ్ము గని విభీ
షణుడు "రామభద్ర! వినుము నిజము
చెనటి రావణునకు సీతమ్మపై గల
నీచమైన కోర్కె నే నెరుగుదు. 616

తే. పరమపావని జానకిన్ ప్రాణవిభుని
సన్నిధికి జేర్చి భీకరసమర మాపి
హాయిగా లంక నేలుకొ మ్మనుచు నాడు
నేను జెప్పిన హితవు మన్నించకుండ. 617

ఆ. సీత నెందుకొరకు చెరబట్టి తెచ్చితి
నట్టి కోర్కెదీరు నంతవరకు
సకలదనుజజాతి సర్వనాశనమైన
వదల నామె ననుచు బదులు పలికె. 618

తే. అంత వ్యామోహ పీడితు డామె నిపుడు
స్యందనము మీది కెక్కించి సమరభూమి
కేగి యచ్చట జంపుమం చింద్రజిత్తు
కప్పగించునె? కలనైన" నని వచించి. 619

తే. "మాయతో మేఘనాదుడు మనల నెల్ల
అనికి విముఖుల జేయు వ్యూహమ్ముతోడ
పన్నె నీ కుట్ర నిప్పడా పాతకుండు
చనె నికుంభిలయను రహస్యంపు గుడికి. 620

ఆ. అచట వాడు చేయునట్టి యాగము పూర్తి
యైన హరున కైన వాని దునుమ
నలవిగాదు కాన నంతకు ముందట
సమయ మెరిగి వాని జంపవలయు. 621

ఆ. వానియాగ మెవడు ధ్వంసమ్ము జేయునో
నా మహాపురుషుడె యతని జంపు"
నని విధాత దెలిపె నందుచే నా వెంట
లక్ష్మణుని బనుపుము రామభద్ర!" 622

క. అనిన విభీషణు హితవును
విని రాముడు వల్లె యనుచు వెంటనె సౌమి
త్రిని హనుమ నంగదాదుల
ననిపెను హరిజిత్తు నచట హతమార్చుటకై. 623

తే. అంత వారంద రడుగులో అడుగు గలిపి
బిరబిరం జని ఆ నికుంభిలను జేరి
యొక్కచో నిల్చి చూచిరి మిక్కుటమగు
సైన్య సముదాయమును యాగశాలముందు. 624

ఆ. రావణానుజుండు లక్ష్మణుండును తొల్త
సైన్యమును వధింప సాగిరంత
తక్కు వనచరాళి చిక్కిన వారిని
చిక్కినట్లె హతము జేసినారు. 625

తే. లక్షలకొలంది దనుజుల లక్ష్మణుండు
ఒక్క క్షణకాలమందున ఉక్కడంచె;
ఆకసమ్మంటె వారి హాహారవమ్ము
లారణధ్వని కింద్రజి త్తదరి పడియె. 626

ఆ. యాగ మాగిపోయె నర్ధాంతరమ్ముగా
నావిరాయె నా ప్రయత్నమెల్ల
నన్న యాగ్రహమున నగ్నిహోత్రముపోలె
భగ్గు మనుచు మండి పైకిలేచి. 627

తే. మేఘనాదుడు తన సేన మిక్కుటముగ
జచ్చె నన్నట్టి బాధతో రెచ్చిపోయి
లక్ష్మణుని జూచి "మీయన్న రాముకడకు
బంపెదను నీ శవమును నాపగ దొలంగ." 628

తే. అనిన రావణి పలుకుల కడ్డు దగిలి
"యెపుడు నీ యాగ మాగెనో అపుడె నీకు
మూడె చావని తెలిసికో మూర్ఖచిత్త!"
యని వచించె విభీషణుడు డాగ్రహమున. 629

క. తన యత్నము భగ్నము జే
సిన దతడని తెలిసి యింద్రజి త్తిట్లనియెన్
"వినరా! జాతి ద్రోహీ!
నిను వధియించెదను ముందు నిర్దయతోడన్. 630

ఉ. నాపినతండ్రివయ్యు నరనాథుని పక్షముజేరినావు, లం
కాపురి రాజ్యపీఠమును కైవస మాతడు సేయునంచు నీ
పాపము పండె నీ దినము పౌరుష మించుకయున్న నీవు నా
చాపము ధాటికి న్నిలిచి చావు నెదుర్కొనుమో విభీషణా!" 631

క. అని మేఘనాదు డనగనె
కనలి విభీషణుడు "పిల్లకాకీ! నిను నే
దునుమాడలేక గాదుర!
ఇనవంశోత్తముడు బంపె నీ లక్ష్మణునిన్. 632

తే. ఏలయన దుష్టశిక్షణ మీ యుగమున
ధర్మవిదులైన రఘుకులోద్భవుల హక్కు
వారి పదముద్రలందున పాదమూను
భాగ్య మబ్బెను నీ తండ్రి వలన నాకు. 633

తే. కనుక మాటలు చాలించి కదనమందు
చూపరా! నీ ప్రతాపము నేపు మీర
త్వరగ నే జేరవేతు నీ మరణవార్త
నన్ని వివరాలతోడ మీ యయ్య" కిపుడు. 634

తే. ముందె క్రోధానలజ్వాలలందుమండు
చున్న రావణి పినతండ్రియన్న పరుష
వాక్యముల తోడ మధ్యాహ్న వనజమిత్రు
డాయె నది గని దిక్కు లల్లాడిపోయె. 635

తే. హనుమ మూపున గూర్చుండి యసురనాథు
తనయునే జూచుచున్న లక్ష్మణుడు వాని
రౌద్రమును గని నతి భీకర స్వరమున
ననియె నీరీతి విని విభీషణుడు మురియ. 636

తే. "పోరుకై వచ్చి యిటుల నిస్సారమైన
జీరముల తోడ గడపుట వీరుడైన
వాడు జేసెడు పనిగాదు వాగుడాపి
శరము సంధింపు మిపుడైన శౌర్య మున్న." 637

తే. అనుచు సౌమిత్రి పెక్కు శస్త్రాస్త్రములను
విసరె కోపము రెట్టింప నసురుపైకి
ఇంద్రజి త్తగ్గి కెరట మ ట్లెగసి పడుచు
వదలె ప్రతిబాణములు చాల వానిపైకి. 638

క. ఇరువురు సమవిక్రము లటు
పరమాద్భుత సరణి సలుపు బవరమునందున్
శరములు పిడుగుల వర్షము
కరణిని నల్దెసల గురిసె కడు భీకరమై. 639

క. క్రమముగ నుద్రిక్తత ఘన
సమరమ్మున బెరిగి పెరిగి చావులు బ్రతుకుల్
సమముగ దలచుచు నిరు వ
ర్గములును బోరాడసాగె కడు శౌర్యమునన్. 640

ఆ. వరుసబెట్టి విసరు శరములే యురుములై
యెల్ల దెసల దద్దరిల్లజేసె!
రక్తసిక్త మాయె రణరంగ మంతయు
మృతుల సంఖ్య మేర మీరిపోయె. 641

మంజరి. అంతలో రావణి యాలస్యమైన
వైరి వర్గమునకు బలము చేకూరు
నని యెంచి వెంటనే యైదు బాణములు
సంధించి వదలె నా సౌమిత్రి పైకి
నాతడా బాణాల నవలీల ద్రుంచి
ప్రళయభీకరమైన పావకాస్త్రమును
రావణుతనయుపై లాఘవమ్మొప్ప
నొకసారి జపియించి యుగ్రుడై విసరె

నది కాలభుజగమ ట్లమితవేగమున
వచ్చుటం గని వేగ వారుణాస్త్రమున
మేఘనాదుడు దాని మేదినిం గూల్చి
మొనసి తా నసురాస్త్రమును ప్రయోగించె
నినకులోద్భవుడు మహేశ్వరాస్త్రమున
దానిని ఖండించి దర్ప మేపార. 642

తే. ఐంద్రబాణము దాల్చి మహేంద్రతుల్యు
డైన నాయన్న ధర్మాత్ము డైన యెడల
రామనామము జగతికి రక్షయన్న
మాట నిజమైన యెడల నీ మాయదనుజు
శిరము ఖండించు మో దివ్యశరమ! యనుచు
భక్తి నర్చించి వదలె రావణిని దునుమ. 643

ఆ. అదియె రామబాణమై శక్రజిత్తుని
కర్ణకుండలముల కాంతులీను
శిరము దరిగి యెగుర జేసెను నింగికి
మొండె మటులె తూలి పుడమి బడియె. 644

ఆ. మింటి కెగసినట్టి మేఘనాదుని తల
నీరదముల కెల్ల నెత్తు రలది
రాలె నటులె నేల లక్ష్మణుపాదాల
ముందు కపిగణమ్ము చిందులాడ. 645

క. తలవంచి దనుజవీరుని
తల ధరణిని గూలు టరసి తలలెత్తిరి మౌ
నులు సురలు వేదవేత్తలు
తలయెత్తెను శాంతి ముప్పు దలగె నటంచున్. 646

క. మిగిలిన రాక్షస సైన్యము
పగ నంబుధిలోన గలిపి భయవిహ్వలమై
తెగిపడిన తలలకోసము
వగచిన ఫలమేమి యనుచు పరువులు వెట్టెన్. 647

క. జయహే రామానుజ! యను
జయజయ నాదములతోడ సమరాంగణమం
తయు మారుమ్రోగె నా ధ్వని
రయమున బరువెత్తి దూరె రావణు చెవులన్. 648

తే. జయము సౌమిత్రిదేయన్న సత్య మెరిగి
పిడుగులోకవేయి శిరముపై బడినయట్లు
తల్లడిలి యింద్రజిత్తును దలచుకొనుచు
హరహరా! యెట్టి దుర్వార్త నందుకొంటి. 649

తే. అనుచు పుడమిని బడినట్టి యసురనేత
నిజము గాగూడ దీశ్వరా! నేను విన్న
ఘోరదుర్భర వార్త నా కూర్మి సుతుడు
విజయు డని తెల్పు మయ్య! వేవేగ తండ్రి! 650

తే. మనసు చెదరిన సురవైరి కనులు మూసి
హరుని స్మరియించు కొనుచుండె నంతలోనె
జనక! నే వచ్చితిని దిగ్విజయము నంది
కలత నిక వీడి కమ్మని కలలు గనుము. 651

ఆ. అనుచు నెదుట నిలిచినట్టి పుత్రుని జూచి
అట్టిపైకి లేచి యసురనేత
తెలుపు మయ్య! నీవు గెలుపు సాధించిన
వివరమెల్ల నాకు వీను లలర. 652

ఆ. తండ్రి మనసులోని తహతహ గమనించి
ఆలసింపరా దటంచు దలచి
కన్నులందు విజయగర్వ మేపారగా
నింద్రజిత్తు వేగ నిట్టు లనియె. 653

ఉ. చంపితి రామలక్ష్మణుల చంపితి నిర్దయతో విభీషణున్
చంపితి వాయునందనుని చంపితి నంగద జాంబవంతులన్
చంపితి సూర్యపుత్రు నిక చంపుట కెవ్వరులేరు గాన, నీ
కంపము మాని జానకిని కైవసముం బొనరించు కొమ్మికన్. 654

తే. అనుచు చల్లని శుభవార్త నందజేసి
నట్టి తనయుని గుండెకు హత్తుకొనియె
కానియా స్పర్శ యిసుమంతయేని లేక
దనుజనాథుడు వెంటనే కనులు దెరచె. 655

ఆ. ఎదుట గానుపించె నుదుట కుంకుమలేని
ముదిత శ్వేతవస్త్రములు ధరించి
ఆమె మేఘనాదునందాలసతి సులో
చన యటంచు నెరిగి దనుజ విభుడు. 656

ఆ. అటులె నేలబడియె హతవిధీ యనుచు, నా
కేక లంకనంత క్రిందు మీదు
జేసె నసురు లెల్ల చింతలో మునిగిరి
ఇంద్రజిత్తు సతికి నేడ్పుదక్కె. 657

ఆ. అన్న కోర్కె మేర కాహవమ్మందున
సకల దేవగణము సన్నుతింప
శక్రజిత్తు జంపి జయసిద్ధి గాంచిన
రణ భయంకరుండు లక్ష్మణుండు. 658

తే. వేల వానర భల్లూక వీరవరుల
మధ్య నుదయార్క బింబసమాను డగుచు
చనె విభూషణుతోగూడి సంబరమున
అన్నయును సర్కజాడు వేచియున్న కడకు. 659

క. తమ్ముడు బవరమ్మున విజ
యమ్మును సాధించి వచ్చు టారసి సంరం
భమ్మున శ్రీరాముడు రా
రమ్మనుజా! నీకు సాటి రారెవ రనియెన్. 660

తే. అట్లు ప్రియ మారగా బల్కి యంతలోన
లక్ష్మణుని మేని గాయాల రాము డరసి
ప్రక్కనున్న సుషేణుని బారజూచి
వీని నారోగ్యవంతు గావింపు మనియె. 661

ఆ. వైద్య కేసరియగు వరసుషేణుడు కొన్ని
మూలికలను వాడి ఆల మందు
దెబ్బ దినిన వారి దేహమ్ములందలి
గాయములను మాన్పె క్షణములోన. 662

తే. స్వస్థతను బొంది లేచె లక్ష్మణుడు ముందు
వానితో పాటు మొత్తము వనచరాళి
నూతనోత్సాహమున లేచి చేతు లెత్తి
ముక్తకంఠాన బలికె రామునకు జయము. 663

తే. రాణ దరిగిన లంకాపురమ్మునందు
రావణాసురు డంతఃపురమ్మునందు
గ్రీష్మఋతుమధ్యమున ప్రజ్వరిల్లునట్టి
రవి విధమ్మున క్రుద్ధుడై రగులుచుండె. 664

ఆ. రాజధానిలోన ప్రాణాలతో నున్న
యసురవీరు లంద రతని యెదుట
ఉలుకు పలుకులేక నుద్వేగభరితులై
నిలిచియుండి రెంతొ కలతపడుచు. 665

తే. అంత దానవనాథుడు చింత నణచి
రక్త మెగజిమ్ము చున్న నేత్రాల తోడ
దగ్గరున్న మహోదరు దనుజవర్యు
నరసి కరవాలమును దూసి యనియె నిట్లు. 666

తే. "బీర ముడుగని యో మహావీర! వినుము
లంకలో నింక మిగిలిన రాక్షసులను
సిద్ధ మొనరింపు మిప్పుడే యుద్ధమునకు
తిరుగులేనట్టి జయము సిద్ధించు మనకు. 667

తే. నేడు నా బాణములతోడ నింగినెల్ల
గప్పి వైచెద! నేలను కపిగణమ్ము
రక్తమున ముంచి వేసెద! రాము డన్న
పేరు నరకాల ద్రొక్కి చంపెద నటంచు. 668

తే. పంక్తికంఠుడు భీకర స్వరముతోడ
దిక్కు లదరెడు లీల ప్రతిజ్ఞ జేసె
నంతలోపల కడు శక్తిమంతమైన
సేన రణమున కురుక సంసిద్ధ మాయె. 669

ఆ. గదలు, ముద్గరములు, ఖడ్గాలు, శూలాలు
పట్టిసములు చేతబట్టి నిలిచి
కదన కౌతుకమున గర్జించుచున్నట్టి
వీర సైనికులను బారజూచి. 670

ఆ. అసురవిభుడు మురిసి అరిభయంకరులార!
పౌరుషమున కానవాలు మీరు;
సమరవిజయమునకు సైన్య మూపిరియన్న
మాట కర్థ మెరిగి మసలుకొనుడు. 671

ఆ. నేడు నాకు మీకు నిఖిల దానవజాతి
ఖ్యాతి కిది పరీక్ష గాన మనము
వైరి వర్గబలము వారి సామర్థ్యము
నెరిగి కదనమున జయింపవలయు. 672

ఆ. అనుచు హెచ్చరించి అసురేంద్రు డెనిమిది
ఘనతరాశ్వములను గట్టినట్టి
స్యందనమ్ము మీద సహజదర్పముతోడ
కాలయముని లీల కదలె ననికి. 673

ఆ. దానవేంద్రు వెంట సేనాధిపతులంత
కదలి రపుడె వడిగ రథము లెక్కి
వారివెంట సైన్యవాహిని గదలెను
అష్టదిక్తటమ్ము లదరు నటుల. 674

ఆ. దనుజసైన్య మూరు దాటి దాటక ముందె
రాక్షసాధినేత రథము మీది
కేతనాగ్రమందు భీతి సుంతయు లేక
కన్ను లురిమి పెద్ద గ్రద్దవాలె. 675

సీ. దివ్యకాంతులు జిమ్ము దినకరు కిరణాలు
తమము గజాల నేత్రముల కలదె!
వడిగ ముందుకు దూకు వారువమ్ముల కాళ్ళు
మాటిమాటికి తడబాటు నందె!
వెండి మబ్బైన లేకుండనే దివినుండి
వారక నెత్తురు వాన గురిసె!
నక్కల సముదాయ మక్కజ మ్మేపార
నతిభయంకరముగా నరువసాగె!

తే. అసుర నాథుని యెడమ కన్నదుర దొడగె!
యిన్ని దుశ్శకునములు తన్నెదురు కొనిన
నించు కేనియు జంకక పొంచియున్న
చావునెంచక తరలె నా శౌర్యధనుడు. 676

క. తుదిపోరుకు దానవపతి
కదలిన విషయమును వాని గర్జన దెలిపెన్
వనచర ఋక్షాధిపులకు
నినకుల వంశాబ్ధి చంద్రు లిర్వురకు వడిన్. 677

తే వారి రథముల నిర్ఘోష భేరికాహ
ళధ్వనుల మ్రోత ఆహవరంగమంత
మారుమ్రోగిన దయిన నపారమైన
వానరులదండు కలత రవంత లేక. 678

ఆ. కడు కుతూహలమున పిడికిళ్ళు బిగియించి
భీకరముగ నరచి తోకలెత్తి
కదను ద్రొక్కు కొనుచు కపినాథు నేతృత్వ
మందు లంక బెదర ముందు కురికె. 679

ఆ. చాల కాలమునకు సరిజోదుతో పోరు
నట్టి భాగ్య మబ్బె నని తలంచి
కార్యశూరుడైన సూర్యతనూభవు
డసురవిభుని మద మడంప నరిగె. 680

తే. కేల నొక భూధరము నవలీల దాల్చి
కనుల నిప్పలు గ్రక్కుచు దనుజనాథు
వంక కరుదెంచుచున్నట్టి వానరేంద్రు
గని విరూపాక్షు డుగ్రుడై కాలుద్రవ్వి. 681

తే. "ఓరి వానర! ఆగరా! యుద్ధమందు
నీవు దానవపతిముందు నిలువలేవు!
నీకు మగటిమి యున్నచో తోక ముడిచి
పారిపోకుండ నాతోడ బోరరార!" 682

క. అనిన విరూపాక్షుని గని
"ఇనతనయుం డట్టులైన నిల గూల్తు నినున్
మునుముందుగ నా పిమ్మట
దనుజాధీశ్వరుని బట్టి దర్ప మడంతున్. 683

తే. కాదు! నాచేత నున్నది కందుకమ్ము!
పగర బలిగొన నురికెడు పర్వతమ్ము
కాచుకో"మ్మని విసరె నా కపికులేంద్రు
డది విరూపాక్షు త్రుటిలోన హత మొనర్చె. 684

తే. హనుమదంగద జాంబదాది శూరు
లసుర సైన్యముతోడ బోరాడ దొడగి
రర్కజుడు మహోదరవీరు నడ్డగించి
అతడు విసరిన పెనుఖడ్గ మట్టె పట్టి. 685

ఆ. దానితోడ వాని తల నొక్కవ్రేటున
కసిదొలంగ నరికి కాలదన్ని
అసురసేన గుండె లదరంగ గర్జించె
నారవమ్ము దెసల మారుమ్రోగె. 686

తే. అర్క తనయుని వీర విహారమునకు
క్రుద్ధుడై మహాపార్శ్వుడు రుధిర మొలుకు
కనుల నాతని జూచి దోర్గర్వ మడర
పలికె నీ రీతి పటపట పండ్లు గొరికి. 687

క. "ఓరీ వానరనేతా!
నీ రామునికన్న ముందు నిన్ను వధింతున్
మా రావణు నని గెల్చుట
కా రుద్రుండైన జాల డని యెరుగుమురా!" 688

తే. అని మహాపార్శ్వు డనినంత నంగదుండు
సాలవృక్షమ్ముతో మోది స్యందనమును
సారథిని గూల్చి వెంటనే శత్రుభీక
రముగ గర్జించి మిక్కిలి లాఘవమున. 689

తే. రథికునురమున లంఘించి రౌద్ర మెనయ
పిడికిలి బిగించి "చావరా! పిరికిపంద!"
యనుచు పలుమార్లు గ్రుద్ది నా యసురవీరు
హతుని గావించె కపిసమూహమ్ము మురియ. 690

తే. పరమశూరులు సేనాధిపతులు మువ్వు
రట్టు లతిదారుణమ్ముగా నవని గూలు
టరసి దనుజాధినేత మధ్యాహ్న సూర్యు
డటుల భగ్గున మండి దిక్తటము లదర. 691

తే. పెక్కుమారులు గర్జించి నిక్కిచూచి
యెక్క డా రామలక్ష్మణు లెక్కడున్న
హతుల గావింతు వారల నసురలోక
మంత సంతసమున దేలియాడు నటుల. 692

క. అని పంక్తికంఠు డనగా
నినకులవంశాబ్ధి చంద్రు డింత బెదరకే
"వినుమో! దశకంఠా! యీ
దినమున నీ బాధ లన్ని దీరును కనుమా!" 693

క. శ్రీ రాముం డట్లనగనె
నా రాక్షససార్వభౌము "డౌనది నిజమే
పోరాట మందు నిను నే
ఘోరముగా జంపి దీర్చుకొనెదను బాధల్." 694

ఆ. అనుచు హుంకరించి యాకసమ్మును నేల
అదరి బెదరు నట్టు లార్భటించి
ఘనతరాస్త్రములను ధనువున సంధించి
అరిగె రాముదరికి నసురవిభుడు. 695

తే. వెంటనే ప్రక్కనున్న విభీషణుండు
రావణుని కంటబడె పగ రగులుకొనగ
అంత కడు భీకరమ్ముగా అసురనేత
యెగసి పడుచున్న కోపాన నిట్టు లనియె. 696

శా. "తోడంబుట్టిన వాని బోవిడిచి యత్యుత్సాహ మేపారగా
తోడున్ నీడయు నీవె రామ యనుచున్ దుర్వృత్తితో శత్రువున్
వేడన్ సిగ్గు రవంతలేదె? యిక నా విశ్వేశ్వరుండైన కా
పాడన్ లేడుర నిన్ను కాచుకొనరా! పాపాత్మ! నీ ప్రాణముల్." 697

కం. అని యొక శక్త్యాయుధమును
గొని రావణు డనుజుపైన గుప్పించెను దా
నిని ధర బడ గూలిచి ల
క్ష్మణుడు విభీషణుని ప్రాణగండము బాపెన్. 698

ఆ. చావు మూడినట్టి సహజన్ము ప్రాణాల
రక్ష జేసినట్టి లక్ష్మణునకు
బుద్ధి జెప్పదలచి క్రుద్ధుడై రావణు
డతనివంక దిక్కు లదల జూచె. 699

తే. అయిన జంకక లక్ష్మణు డాగ్రహమున
వరుస బాణాలు గుప్పించె మరల మరల
కాని యవి రావణుని వజ్రకాయమునకు
దగిలి ముక్కలుముక్కలై ధరణి బడియె. 700

తే. అంత రామానుజుని జూచి యసురనేత
"నాకవిభు నని గెల్చిన నా కుమారు
శక్రజిత్తును నిలువున జంపినట్టి
పాపి! హాత మార్తు నిన్ను నా పగ దీలంగ." 701

తే. అనుచు మయశిల్పి నిర్మితమైన శక్తి
యనెడు శస్త్రము గ్రహియించి దనుజవిభుడు
దశదిశలు మ్రోగ సింహనాదమ్ము జేసి
శౌర్య మేపార విసరె లక్ష్మణుని పైకి. 702

ఆ. దానిబారినుండి తప్పించుకొనగల
శక్తి సుంతలేదు జమునికైన
యని యెఱింగినట్టి యినకులేశుడు రాము
డనుజు డేమి యగునో యని తలంచి. 703

తే. శుభము చేకూరుగాక! నా సోదరునక
టంచు రాముడు దీవించె నంతలోన
అ మ్మహాశక్తి వేవేగ నరుగుదెంచి
మూర్ఛలోన రామానుజు మునుగజేసె. 704

ఉ. తమ్ముని మూర్ఛ రాఘవుని తల్లడ మందగజేసె నైన దుః
ఖమ్మును మ్రింగి రావణుని ఘాతుకమున్ నిరసించి మేలి బా
ణమ్ములు చేతదాల్చి కపినాథున కాతని నప్పగించి రౌ
ద్రమ్మున పైకి లేచె! రణరంగము తత్తర మందు నట్లుగన్. 705

ఆ. కదనశూరులైన కపిముఖ్యులను జూచి
చాలనాళ్ళ నుండి సమరమందు
పగలు రేయి యనక ప్రాణమ్ము లెదురొడ్డి
పోరి యలసి పోయినారు మీరు. 706

ఆ. ఇన్ని కష్టములకు నెవ్వడు హేతువో
అట్టి దుర్మదాంధు నాహవమున
నేనె చంపవలయు గాన మీ రందరు
సేదదీరుడింక చింతవీడి. 707

సీ. పితృదేవు పలుకును వేదమ్ముగా నెంచి
సింహాసనమును త్యజించినాను!
పినతల్లి కోర్కెపై వనసీమలందున
కాలమ్ము నిశ్చింత గడపినాను!
కందమూలమ్ములే కమ్మని తిండిగా
మించు కూరిమి నారగించినాను!
మునుల బాధించెడు దనుజాధముల జంపి
ఆశ్రమాలకు శాంతినలదినాను!

తే. కాని యేనాడు సీత నా ఖలుడు దొంగి
లించె నానాటి నుండి నే రేయి పవలు
పడిన వేదన నీనాడు బాపుకొందు
సత్వరమ్ముగ రావణు సంహరించి. 708

తే. అంతవరకును మీరెల్ల రనునిమేష
మొక్క కంట లక్ష్మణుని మరొక్కకంట
క్రూర రాక్షసనేత సంహార విధము
జూడు"డని దెల్పి దశరథ సూను డపుడు. 709

తే. ప్రళయకాలాగ్ని విధమున ప్రజ్వరిల్లు
తీక్ష్ణ బాణాలు పెక్కు సంధించి వదలె!
దనుజనాథుని పైకి నుద్దండలీల
రావణుం డడి గాంచి తీవ్రముగ కినిసి. 710

తే. వదలె దివ్యాస్త్రములు చాల వైరిపైకి
అట్టు లిర్వురు విసరిన యమ్ములన్ని
యాకసమ్మున నిగిడి పోరాడ దొడగె
నమరగణ మెల్ల నచ్చెరువందునటుల. 711

ఆ. ఆగకుండ నిర్వు రసహాయశూరులు
సలుపుచున్న నాటి సమరమునకు
పంచభూతములును ప్రత్యక్ష సాక్షులై
చూడదొడగె మిగుల చోద్య మలర. 712

తే. దాశరథి బాణవర్ష మా దనుజవిభుని
తనువు నెల్లను రక్తసిక్తమ్ము జేసె;
కనుల చీకటి ముసిరెను కలత హెచ్చె
అనువుగా లేదు కాలమం చతడు తలచి. 713

తే. చేయునది లేక గాలికి చెదరిపోవు
మేఘశకలమ్ము కరణి నమేయబలుడు
రావణుడు వేగ లంకాపురమ్ము జేరి
దర్పమును వీడి రాజసౌధమున దూరె. 714

తే. రణము చాలించి తమనేత లంక కరుగు
టరసి దానవసేన నిరాశజెందె!
నిండు పున్నమ నాటి వార్నిధి విధాన
చిందులం ద్రొక్కి వానరసేన పొంగె. 715

తే. వైరి తన బాణధాటికి జీర ముడిగి
పారిపోయె నటన్న సంబరముకన్న
రుధిరతల్పమునందు బరుండి యున్న
అనుగుతమ్ముని గని రాము డార్తి చెందె. 716

తే. "తమ్ముడా! యేమిటీ ఘోర దారుణమ్ము
యుద్ధమున నిన్ను గెల్చెడు యోధు డెవడు
మూడు లోకాల లేడని మురిసిపోతి
నిన్నిదినములు నే నిప్పు డేమిసేతు? 717

ఆ. అసలు నీవులేని ఆహవ మ్మదియేల?
రాజ్యమేల? నింక రమణియేల?
లక్ష్మణుండు లేని రాముడు లేడురా!
కనులు దెరచి నన్ను గనుము తండ్రి! 718

తే. చాల సువిశాలమైన యీ జగమునందు
బడయవచ్చును మిత్రుల బడయవచ్చు
భార్యలను, బంధు జనముల, బడయ గలనె?
తోడబుట్టిన నీవంటి దొడ్డవాని?" 719

తే. అనుచు పసిబాలకునిలీల నలమటించు
పుడమిరేనిని గని సుషేణుడు చలించి
లక్ష్మణుని నాడిజూచి "యో రామభద్ర!
వగవ బనిలేదు తమ్ముడు బ్రతికి తీరు." 720

తే. అనుచు ప్రియవచనమ్ముల నాడినట్టి
వైద్యవర్యు సుషేణుని బ్రస్తుతించి
రామభద్రుడు కొంత యూరటను జెంది
యనుగుతమ్ముని ముద్దాడె నాశదీర. 721

తే. వెంటనే సుషేణుడు కపివీరవరుని
పవనసుతు జూచి "యోషధీపర్వతమున
గల విశల్యకరణిని సకాలమందు
తీసికొనిరమ్ము! సౌమిత్రి గాసిదొలగు." 722

క. అని వైద్య విశారదు డన
హనుమంతుడు వాయుగతిని అంబరమార్గ
మ్మున జని నా యోషధి నగ
మును బెకలించుకొని తెచ్చె భుజదర్పమునన్. 723

ఆ. ప్రధన రంగమందు పర్వతమ్మును దించి
యెదురు జూచు రాము నెదుటికేగి
మూలికలను వెదుక నాలస్య మగునని
నగమునటులె దెచ్చి నాడ ననియె. 724

ఆ. అటుల బలికినట్టి అంజనాతనయుని
సాహసమును మెచ్చి సన్నుతించి
"తీర్చలేని ఋణము దినదిన మ్మందించు
చున్న నీకు గలుగు శుభము లెన్నొ." 725

తే. అనుచు దీవించె శ్రీరాము డంతలోన
మూలికలతోడ సౌమిత్రి మూర్ఛబాపె
క్షణములోన సుషేణుడు, వనచరాళి
గంతు లిడె నంతు లేనట్టి సంతసమున. 726

తే. అంత సౌమిత్రి విప్పారినట్టి కనుల
నందరను జూచి తన్ను తా నరసి మురిసి
రెండు చేతులు ముకుళించి నిండుభక్తి
నగ్రజునితోడ శిర మెత్తి యనియె నిట్లు. 727

క. "అన్నా! నీ దీవెనలే
నన్నీ దిన మాదుకొనియె! నా గాయములున్
క్రన్నన దొలగెను మన హను
మన్న కృపన్ సిద్ధమిప్ప డని కే"ననియెన్. 728

చ. అనుజుని పల్కులా యినకులాంబుధి చంద్రు ముఖారవిందమం
దనుపమ కాంతినింపె మదినంటిన నిస్పృహ పారిపోయె లో
చనముల నిప్పలొల్కె దనుజాధిపుపై పగహెచ్చె వెంటనే
ధనువును చేతబట్టి బలదర్పము మీరగ నిట్లు వాకొనెన్. 729

ఉ. "వానరవీరులార! యనివార్యముగా మొదలైన యుద్ధమం
దేనును మీరు లక్ష్మణుడు నిన్ని దినాలుగ బడ్డ కష్టముల్
కానగ రావు రేపు దశకంఠుని గూల్చెద నీ దినమ్మె నా
బాణతతిన్ కనుంగొనుడు పార మెరుంగని సంతసమ్మునన్." 730

తే. అంతలోన విభీషణు డాతురతగ
రాము నారసి "దేవరా! రావణుండు
ఉదయభానుని మ్రింగ రాహువు విధాన
మరల నరుదెంచు చున్నాడు దుర మొనర్ప. 731

తే. అనుచు వచియించె నంతలో నసురనాథు
గర్జ వినిపించె నష్టదిక్తటము లదర;
రాము డటుజూచి "రావణా! రమ్ము! రమ్ము!
ముగియ జేసెద నేటితో మోహరమ్ము." 732

క. అని రాము డనుట తోడనె
దనుజేశుం డాగ్రహమున "దానవవైరీ!
అనిలో నతివాగుడుతో
పని జరుగదు విజయ మెపుడు బలవంతునిదే. 733

ఆ. నిన్న యుద్ధమాపి నే లంక కరిగిన
ఘటన మదిని దలచి గర్వపడకు;
మదియు కలనివ్యూహ మందొక భాగమే
నేడు చూప రమ్ము! నీబలమ్ము!" 734

ఉ. రావణు డట్లు పల్కగనె రాముడు నారిని మీటి "దానవా!
నీవతి శౌర్యవంతుడవు, నీవతి దాంతుడ వాహవమ్మునన్
నీవసమానయోద్ధవని నేను గ్రహించితి కాని, దుర్మతిన్
నీవొనరించినట్టి పలునేరములే హతమార్చు ని"న్ననెన్. 735

క. శ్రీరాముని పరుషోక్తుల
కా రాక్షసనాథు డలిగి యురదముబో ని
మ్మీరో జెటులైనను నే
పోరాటములోన వాని పొగ రణగింతున్. 736

క. అని రథ సారథితో రా
వణు డనెనో లేదొ రామబాణద్వయ మా
తని ఘనతర వక్షమ్మున
గునపములై గ్రుచ్చుకొనియె గుర్రము లడలన్. 737

ఉ. అంత మహోగ్రుడైన దివిజాంతకు డాహవ రంగమంత ది
గ్భ్రాంతిని జెందున ట్లరచి రక్తము జిమ్ము మహాస్త్ర శస్త్రముల్
పంతము మీర రాము పయి బర్వగ జేసెను; వాని నన్నిటిన్
అంతము జేసె నా దశరథాత్మజు డొక్క శిలీముఖమ్మునన్ 738

ఆ. రావణుండు స్వర్ణ రథము నారోహించి
యని యొనర్చుచుండ నినకులేశు
డవని మీద నిల్చి యాతనితో బోరు
వైన మరసి దివిజవల్లభుండు. 739

సీ. వజ్రవైదూర్యముల్ వరభూషణములుగా
నలరారు బంగారు స్యందనమ్ము
వైరి - ముద్గరముతో వరుసగా ముమ్మారు
మోదిన పగలని బొందలమ్ము

దినకరు కిరణాల దీప్తి కావాసమ్మై
యిరులను బొరిగొను నింద్రధనువు
అతిబలాన్వితు నైన ననిలోన వెంటాడి
హతము గావించు శక్త్యాయుధమ్ము

తే. మాతలి కొసంగి వెంటనే భూతలమున
కరిగి రాముని కవి యెల్ల నందజేసి
దుష్టరావణు పదితలల్ దునుము వరకు
"నీవు రథచోదకత్వము నెరపు" మనియె. 740

తే. రణనిపుణు డైన మాతలి రాముజేరి
"దివిజనాథుడు బంపె నీ దివ్య రథము
వజ్రకవచము శక్రచాపమ్ము మరియు
నరిభయంకరమైన శక్త్యాయుధమును. 741

తే. నేను సారథిగా నుందు నీచదాన
వాధినాథుడు నీచేత నాహవమున
హతుడు గావింప బడుదాక" యని వచించి
అధికభక్తిని తలవంచి అంజలించె. 742

తే. దాశరథి మూడుమార్లు స్యందనము చుట్టు
తిరిగి వందన మర్పించి దివిజవిభుని
ఆదరమ్మును మదిలోన నభినుతించి
పలికె ప్రియమార నిట్లు మాతలిని జూచి. 743

తే. "వాసవుని కానుకలు నేటి బవరమందు
ప్రముఖ పాత్ర వహించి రావణుని వధకు
సాయ మొనరించు నాకు నిస్సంశయముగ
సారథీ! తేరుపోనిమ్ము! జయము మనదె!" 744

తే. అనుచు బ్రకటించి శ్రీరాము డరదమెక్కె!
మాతలియు స్వర్ణదండము చేతబట్టి
వారువమ్ములు కసితోడ పరుగుపెట్టె
మేలు మేలను కేకలు మిన్నుముట్టె. 745

తే. దేవరథమందు నుదయార్కదీప్తితోడ
తనను గురిపెట్టి యరుదెంచు నినకులేశు
నరసి యొక్కింత వెరచి లంకాధినేత
పౌరుషమునకు వెంటనే పదనుపెట్టె. 746

క. గంధర్వాస్త్రము ధనువున
సంధించి దశాననుండు జానకిపతిపై
కంధరము గురిగ విసరెను
సైంధవములు దివిజరథము సారథి యడలన్. 747

తే. దాశరథి సైత మొక్క గంధర్వబాణ
మును ప్రయోగించి దానిని పుడమిగూల్చి
అసురవిభుపైకి వదలె దైవాస్త్ర మొండు
గుర్రములు తేరు సారథి గొల్లు మనగ. 748

తే. అసురనాథుడు గూడ దైవాస్త్రముననె
దాని దెగటార్చి మిక్కిలి దారుణమ్ము
ననుపమానమ్ము నగు రాక్షసాస్త్ర మెక్కు
పెట్టి వదలెను రామభూవిభుని పైకి. 749

తే. ఆ మహాస్త్రము కాలసర్పాకృతిగొని
అనలమును గ్రక్కు కోరల నట్టిసాచి
విషము జిమ్ముచు నరుదెంచు విధము నరసి
క్ష్మాతలేంద్రుడు గారుడాస్త్రమును వేసె. 750

ఆ. బద్ధవైరమునకు ప్రత్యక్షసాక్ష్యమౌ
గరుడపక్షి పాము కయ్యమునకు
బూనుకొనిన నేడు పుడమిని గూలునో
నదియె జరిగె రాము డలరునటుల. 751

ఉ. అప్పుడు రాక్షసాధిపుని యాగ్రహమాకసమంటె దేహమున్
నిప్పుల కుంపటాయె! పగ నేత్రములన్ బ్రసరించె, వెంటనే
ముప్పున ముంచివేయగల ముఖ్యశరమ్ములు వేనవేలుగా
గుప్పెను రామభూవిభుని గుండెలు తల్లడ మందునట్లుగన్. 752

ఆ. అమితశక్తిమంతమైన ఆ బాణముల్
రాము నొవ్వజేసి రథములాగు
తురగములను గాయపరచి మాతలికిని
కదనభీతి కొంత గలుగజేసె. 753

తే. రావణుని బాణధాటికి రామభద్రు
డార్తి జెందుట నారసి యమరు లెల్ల
సంబరమ్మును మాని విషణ్ణులైరి
వనచరులు విభీషణుడును వగపు గనిరి. 754

తే. పూర్ణచంద్రుని మ్రింగగా ముందుకురుకు
రాహువు విధాన క్రుద్ధుడై రావణుండు
రెచ్చి దాశరథిని కబళించవచ్చు
టరసి మంటలురేగె మహార్ణవమున. 755

తే. అరుణ వర్ణాంచిత మ్మాయె నాకసమ్ము
కమల బాంధవు కిరణముల్ కాంతితరగె
బుధుడు రోహిణీ నక్షత్రమును గ్రహించె
నీరధితరంగముల ఘోష నింగిముట్టె. 756

ఆ. అంజన మహామహీధర మ్మట్టు లడరి
నిప్పులంగ్రక్కు రాక్షసనేత నరసి
రఘుకులాంబుధి సోముని రాము కనులు
విలయకాలాగ్ని కీలల వెడలగ్రక్కె. 757

ఆ. రగిలిపోవుచున్న రాముని దిలకించి
భూతకోటి బెదరె భూమి వణకె
చెదరి పర్వుబెట్టె సింహశార్దూలముల్
నదులు భీతినంది నడకమానె. 758

సీ. ఏనాడు వెరపన్న దింత యెరుంగని
భూధర శిఖరాగ్రములు చలించె
పరమ భయంకరోత్పాత సూచకముగా
వార్నిధుల్ కల్లోల భరితమాయె!
మెల్లమెల్లగ సాగు మేఘముల్ ప్రళయ భీ
కరముగా గర్జించి పరుగువెట్టె!
కువకువ ధ్వనులతో గూళ్లలో నివసించు
గువ్వ లుద్ధృతముగా గూయదొడగె!

తే. ఆ భయానక ఘటనల కాద్యుడైన
వీరరాఘవు భీకరాకార మరసి
వేయి గుండెల యోద్ధగా పేరుగనిన
రాక్షసాధీశు మొండి ధైర్యమ్ము సడలె. 759

ఉ. రౌద్రము రూపు దాల్చి నటు రామవిభుండు త్రిశూల ధారియౌ
రుద్రుని భంగి రాక్షస కులోద్భవనేతయు సంగరాన ని
ర్నిద్రత నిల్చి భీకర శిలీముఖముల్ ధరియించి యిర్వురున్
భద్రగజమ్ములట్లు బహుభంగుల బోరదొడంగి రుద్ధతిన్. 760

ఆ. ప్రళయ భీకరముగ పరిపంథు లిర్వురు
సలుపుచున్న నాటి సమరమందు
తిరుగులేని జయము వరియించు శ్రీరాము
నని తలంచు చుండె నమరగణము. 761

ఆ. తప్పకుండ గెలుపు తమనేత దేయన్న
అతిశయించినట్టి ఆశతోడ
కన్ను లార్పకుండ కదనరంగమ్మునే
అరయ దొడగె నెల్ల అసుర గణము. 762

సీ. అంతలో లంకేశు డతిశక్తిమంతమౌ
శూలాయుధమ్మును కేలదాల్చి
రథమధ్యమున నిల్చి రాక్షస బృందమ్ము
లరసియానందించు సరణిద్రిప్పి
దాని ప్రభావమ్ము దశరథాత్మజునకు
సింహనాదమ్ముతో జేర్చి తెలిపి
నేడు నీ ప్రాణముల్ నిటలాక్షుడైన కా
పాడలే డనుచు దర్పమున బలికి

తే. అనుపమానమైన నా మహాశూలమ్ము
నాగ్రహమున పేర్చి యార్భటించి
కోటి కనులతోడ గురి జూచి విసరెను
రణము దద్దరిల్ల రాముపైకి. 763

తే. రావణుని చేతినుండి వెల్వడిన శూల
మగ్ని కీలలు గ్రక్కుచు నలరు టరసి
రామభద్రుడు వదలె జలప్రవాహ
మటుల కడు శక్తిమంతమౌ నస్త్రములను. 764

తే. దానవేంద్రుని శూలాయుధమ్ము ముందు
జానకీవల్లభుని పటు శరము లెల్ల
మిడిసి యగ్నిని బడినట్టి మిడుత లాయె
చూచువారల కది కడు చోద్యమాయె. 765

తే. అంత రాముడు మిక్కిలి యాగ్రహమున
అమరవిభు డంపినట్టి శక్త్యాయుధమును
నేత్రముల కద్ది దానవనేత పైకి
పరగ విసరెను మాతలి భళి యనంగ. 766

తే. అతి భయంకరమగు నా మహాయుధమ్ము
వేయినాల్కలు చాచుచు భీకరమగు
ధ్వనులు సేయుచు నరిగి యా దనుజనాథు
నిశిత శూలాయుధమును ఖండించివైచె. 767

క. తనశక్తి కొలది విసరిన
ఘనశూలము ముక్కలౌట గని లంకేశుం
డెనలేని యాగ్రహమ్మును
గనె రథసారథియు కొంత కలవర మందెన్. 768

తే. సమయ మనువని తలచి దాశరథి మరల
తీక్ష్ణబాణాలు కొన్ని సంధించి వదలి
వాయువేగాన వచ్చు రావణు రథాశ్వ
ములను నెత్తుట ముంచె మాతలి బొగడగ. 769

ఆ. అంత తోకద్రొక్కినట్టి కాలాహియై
కసిగ రావణుండు బుసలుకొట్టి
వర్షధారవోలె వాడి బాణములను
వేయదొడగె రామవిభుని పైకి. 770

తే. అపుడు వానర సంచయం బాగ్రహమున
రావణునిపైన గురిపించె రాళ్ళవాన
రామభద్రుని బాణవర్షమ్ము గూడ
తెరపి క్షణమైన లేకుండ గురియసాగె. 771

తే. రాళ్ళ వర్షము బాణవర్షమ్ము గాంచి
మహిత రాక్షస రాజుకు మతిభ్రమించె
తడబడెను వాని కరములు ధనువుబట్ట
పాదములు సైత మొక్కింత పట్టు దప్పె. 772

తే. రాముబాణాలనడ్డి పరాక్రమించు
యత్న మేనియు సలుపక యట్టె నిలిచి
మరణ మాసన్నమైనట్టి మందభాగ్యు
కరణి నున్నట్టి రావణాసురుని జూచి. 773

తే. ప్రభువుసేమమె శ్వాసగా బ్రతుకునట్టి
సారథియు జంకి మిగుల విచారమంది
తనకు తానుగ యోచించి తత్క్షణమ్మె
స్యందనమ్మును ద్రిప్పె నాహవమునుండి. 774

ఆ. సమయశుద్ధిలేని సారథి చర్యతో
దివిజవైరి మదము దెబ్బతినియె!
అరద మదరు నట్టు లరచి వానిని జూచి
యిట్టు లనియె కోప ముట్టిపడగ. 775

క. ఎందుల కనుమతి లేకయె
స్యందనము మరల్చినావు? సమరమ్మున న
న్నెందుకు చులకన చేసితి
వెందుకు నే బ్రతుకవలయు నిక భువిలోనన్. 776

సీ. నందికొమ్ముల వంటి నాబాహువుల యందు
చేవ యొక్కింతయు జావలేదు
పాదరసము కన్న పదనైన బుద్ధి కౌ
శలము రవ్వంతయు సడలలేదు
నిర్నిద్రమైన నా నిశితాస్త్రముల శౌర్య
మణువంతయైన చల్లారలేదు
శత్రుదుర్భేద్యమౌ శారీరక పటుత్వ
మించుకంతేని నశించలేదు

తే. కాని యీనాడు ఘోర సంగ్రామమందు
నీవు నన్నొక పిరికివానిగ దలంచి
రథము వెనుకకు మరలించి రాముముందు
నా పరువు సమస్తము రూపుమాపినావు. 777

ఆ. చాలయేండ్లనుండి సారథిగా గాక
కన్నబిడ్డలాగ నిన్ను జూచి
నందుకింత ద్రోహ మాచరించెద వని
కలను సైత మేను దలపనైతి. 778

తే. దనుజవిభు డెంత తూలనాడిన నొకింత
బాధపడకుండ సారథి "ప్రభువరేణ్య!
మీరు నా కొనరించిన మేలు మరువ
నెన్ని జన్మము లెత్తిన నిది నిజమ్ము. 779

తే. రామభద్రుని బాణవర్షమ్ము వలన
తనువు గాయాలమయమైన తరుణమందు
కొంత విశ్రాంతి మీకొన గూర్పదలచి
రథము వెనుకకు ద్రిప్పితి రణమునుండి. 780

క. పోరున రథికుం డలసిన
వారువములు తొట్రువడిన వైరిబల మ్మే
పారిన నా సమయమ్మున
సారథి జూపింపవలయు సమయస్ఫూర్తిన్. 781

ఆ. అదియు గాక కొన్ని యపశకునమ్ములు
కదనభూమిలోన గానుపించె;
నందువలన కొంత హద్దు నే మీరితి"
ననుచు బలికె వినయ మెనయ నతడు. 782

కం. తనపట్ల సారథికి గల
ఘనతర భక్తికిని ప్రేమ గౌరవముల కా
దనుజాధీశుడు తృప్తిం
గని యిట్లనె నతనితోడ గంభీరముగా. 783

తే. "సూతుడా! లేదు నీ తప్పు సుంతయేని
పొరబడితి నేనె నీతత్త్వ మరయలేక
వేరుగా నీవు మదిని భావించ వల" ద
టంచు ప్రియమార వచియించి యసురనేత. 784

తే. "ఇపుడు పోనిమ్ము స్యందన మినకులేశు
కడకు ఈనాడు వానిని కయ్యమందు
హతుని గావించి గాని నే నడుగు మోప
లంక లో"నని కడుభీకరముగ బలికె. 785

తే. అంతసారథి కడుమోద మంది రథము
క్షణములోపల నిలిపె నిక్ష్వాకుకులున
కభిముఖమ్ముగ తుదిపోరు నరయగోరి
యరుగుదెంచె నగస్త్యు డాహవము కడకు. 786

తే. ముని యగస్త్యుడు వేగ రాముని సమీప
మునకు నరుదెంచి "రాఘవా! పోరిలోన
నసురనాథుని జంపు రహస్య మొండు
నీకు బోధింతు వినుము పరాకు మాని." 787

తే. అనుచు నా మౌనిపుంగవు డాదరమున
దివ్యదాదిత్యమంత్రోపదేశ మొసగి
"మంగళప్రదమైన యీ మంత్ర మీవు
మనన మొనరింపు మయ్య! నీ మనమునందు. 788

తే. భార మంతయు దినకరుపైన వైచి
మూడు మారులు జపియించి మోహరమున
ధనువు సంధింపు; మదియె నా దనుజనాథు
గాథకీనాడె స్వస్తివాక్యమ్ము బలుకు." 789

తే. అనుచు రాముని కెరిగించి నా యతీంద్రు
డటులె వినువీధి కెగసి తా నచటనున్న
అమరనాథుని జతజేరి యాహవమ్ము
నరయ దొడగెను కనురెప్ప లార్పకుండ. 790

తే. అర్కకులభూషణుడు ముని యాన తిడిన
పగిది నాదిత్యమంత్ర జపమ్ముజేసి
"రథము బోనిమ్ము మాతలీ! రాక్షసేంద్రు
దిశకు తప్పక జయము సిద్ధించు మనకు." 791

తే. అనిన వెంటనె మాతలి యసురవిభుని
యెదుట రథమును నిలిపెను ముద మెలర్ప;
రథికు లిరువుర మోముల రాజసమ్ము
వెల్లివిరిసెను రణరంగ ముల్లసిల్ల. 792

తే. బాలభానుని కిరణసంపత్తిలోని
వెలుగు మానవరూపాన వెలసినట్లు
ప్రేమసాగరుడైన శ్రీరామవిభుడు
స్యందనారూఢుడై వెలుగొందు చుండె. 793

తే. రాము జంపెద నీనాడు రణము నంద
టంచు శపథమ్ము జేసిన యసురనేత
జానకీపతి దివ్యతేజస్సు నరసి
చిత్తవిభ్రమ మంది నిశ్చేష్టు డాయె. 794

తే. ఆలమున నిల్చి నేత్రము లార్పకుండ
తన్ను దిలకించు చున్నట్టి దనుజనాథు
నరసి రాముని మదిలోని కరుణ పొంగి
యనియె నీరీతి ప్రియమార నతనితోడ. 795

సీ. పౌలస్త్య నామాన ప్రజల నాల్కలమీద
నర్తనమ్మాడు నున్నతుడ వీవు!
కైలాసగిరి నెత్తి కాలకంఠుని మెప్పు
బడసిన అసమానబలుడ వీవు

అష్టదిక్పాలుర నడలించి వాకిట
నిలిపి సేవలు గొన్న నేత వీవు
ఖ్యాతి గాంచిన రాజనీతిజ్ఞుడవె గాక
వేదశాస్త్రపురాణ వేత్త వీవు

తే. అంతవాడవు కాన నా యనుగు సతిని
అపహరించిన అఘము ని న్నంటకుండ
చెప్పుచున్నాడ హితవు నీ తప్పెరింగి
సీత నర్పింతువేని రక్షింతు నిన్ను." 796

ఆ. ఊహకంద నట్టి ఉత్తమ వాక్యముల్
వైరి నోట జాలువారు టరసి
రాక్షసాధిపుండు రాముని యౌన్నత్య
మునకు మనసులోన మ్రొక్కు లిడియె. 797

ఆ. "ఇంతగొప్ప వాని కేను జేసిన కీడు
నిపుడు దలచి వగచి యేమి ఫలము?
జరుగరాని చెడుగు జరిగెను లంకకు
కోట పరువు బరువు కుప్పగూలె. 798

తే. కన్నబిడ్డలె గాక నా కారణమున
అయిన వారెల్ల మడసిరి యాహవమున
వారి త్యాగము మరచి నే వైరి శరణు
బొందినందున దక్కునే పుణ్య మిపుడు." 799

తే. అనుచు బాగోగు లన్నియు నాత్మ దలచి
శేషప్రశ్నగ మిగిలె నా జీవితమ్ము
బవరమున సమాధానము బడయు టొప్ప
ననుచు భావించి రావణు డనియె నిట్లు. 800

మ. "వినుమో రాఘవ! బద్ధశత్రువగు నన్ ద్వేషింప కీరీతి నా
ఘనతన్ చాటిన నీయుదారతకు నే గావింతు కైమోడ్పు లై
నను సీతన్ విడనాడి నీ శరణమున్ నాజన్మలో వేడ నీ
యనిలో నే విజయమ్ము స్వర్గ ఫలమో ఆశింతు నిశ్చింతగా." 801

క. అని కడు దృఢముగ దెలిపిన
దనుజేశుని నిర్ణయమును దాశరథి మదిన్
కొనియాడి పెక్కుబాణము
లను రౌద్రము తోడ విసరె రావణుమీదన్. 802

తే. పంక్తి కంఠుడు వేగ నా బాణములను
ముద్ధరమ్మున బడగొట్టి భూరిశస్త్ర
ములను గుప్పించి రాము డమోఘ బాణ
పంచకమ్మున వానిని ద్రుంచివైచె. 803

తే. పెరిగె నెనలేని యుత్కంఠ దురమునందు
నంతలో దశగ్రీవుని యరదముపయి
తలవని తలంపుగా వియత్తలమునుండి
కురిసె నెత్తుటి వాన దిక్కరులు బెదర. 804

తే. దనుజపతికి చావు దగ్గర పడెనన్న
వాస్తవమును దెలుప వచ్చినట్లు
లతని చుట్టుమూగి యరువసాగెను గ్రద్ద
లమితకౌతుకమున నాగకుండ. 805

తే. జయము తనదని భావించు సమయమందు
భయము గొలిపెడు కొన్ని యుత్పాతములను
గాంచి కలవరమందె నక్తంచరుండు
సారథికి గూడ ప్రబల సంశయము గలిగె. 806

తే. దశరథుని కూర్మి సుతున కా తరుణమందు
గానుపించెను జయసూచకమ్ము లైన
కొన్ని శుభశకునమ్ములు కన్ను లలర
మాతలికి గూడ పెరిగె నమ్మక మొకింత. 807

క. తనదే గెలుపని తలచిన
యినకులభూషణుడు విసరె నింద్రాస్త్రమ్మున్
దనుజేశుడు వెనువెంటనె
మన మెరియగ వదలె పెక్కు మహితాస్త్రములన్. 808

తే. ఇరువు రసహాయ శూరు లట్లేకధాటి
సరగ గుప్పించు బాణసంచయము నందు
నెవరి బాణము గురిదప్ప దింతగూడ
తెలిసికొన నెట్టు లనిలోన గెలుపు జాడ. 809

సీ. దుశ్శకునమ్ము లీ దోర్దండబలశాలి
నడ్డుకోజాలవం చసుర విభుడు
దానవేంద్రుం డెంత దర్పమ్ము జూపిన
తనదె జయ మ్మని మనుజ విభుడు

చావైన బ్రతుకైన సమరాన నే దేల్చు
కొనెద నీ నాడని దనుజవిభుడు
పంక్తికంఠుని నేడు పరిమార్చకున్న నే
బ్రతుకు టేలంచు శ్రీరామవిభుడు

తే. పట్టుదలకును పగకును పదనుబెట్టి
రౌద్ర ముడుగని శౌర్య మస్త్రముల కలది
ఆలమున సల్పు వీరవిహార మరసి
త్రిజగములు కంపితము లాయె తీవరముగ. 810

తే. నింగితో బోల్చ దగినది నింగి యొకటె!
కడలితో బోల్చ దగినది కడలి యొకటె!
అటులె శ్రీరామునకు సరియైన వీరు
డీ మహీతలమందు శ్రీరాము డొకడె. 811

తే. అనుచు భల్లూకవనచర గణము దలచి
జానకీనాథు యుద్ధకౌశలము నరసి
గెలుపు దగ్గర పడెనన్న తలపుతోడ
వింతగా గంతు లిడసాగె విధులు మరచి. 812

తే. మేరువుకు బోల్చదగినది మేరు వొకటె!
లంకతో బోల్చదగినది లంక యొకటె!
అటులె రావణునకు సరియైనజోదు
వసుమతీ వలయమున రావణు డొకండె. 813

తే. అనుచు రాక్షస వీరసైన్యమ్ము దలచి
దనుజనాథుని యుద్ధ తంత్రమ్ము లరసి
దగ్గ రాయెను జయమను తలపుతోడ
కేక లిడసాగినది లోక భీకరముగ. 814

తే. అంత వ్యూహము మార్చి చక్రాయుధములు
గదలు పరిఘాయుధములు ముద్గరము లాది
పెక్కు దివ్యాయుధమ్ముల నొక్కసారె
వడిగ గుప్పించె దనుజేశు డొడలు మరచి. 815

చ. అని గురిదప్పి రామవిభు నంటక ఆహవరంగమంతట
న్న విరళమై పడం దొడగె నంతట క్ష్మాతలనాథు డుగ్రుడై
పవిసమమైన బాణము లపారముగా గురివెట్టి వైచె నా
దివిజవిరోధిపైకి నలుదిక్కులు తల్లడ మందునట్లుగన్. 816

క. ఇరువురు కడు వడి విసరెడు
శరములు విరజిమ్ము సెగలు సమరస్థలినే
అరుణార్ణవముగ మార్చెను
పెరిగెను కోలాహలమ్ము వినువీథులలో. 817

తే. విజయ మెవ్వరి దనునది విశదపడక
కరగిపోవుచు నున్నది కాల మనుచు
స్వాంతమున నెంచి యొక్క ప్రచండబాణ
మసురవిభుపైకి విసరె నా యవనివిభుడు. 818

తే. అగ్నికీలల జిమ్ముచు నా శరమ్ము
వాయువేగాన బోయి రావణు మనోజ్ఞ
మకర కుండల భూషితమస్తకమును
పుడమి బడగూల్చె దిక్కరుల్ వడకు నటుల. 819

ఆ. కాని యంతలోనె కదన మచ్చెరువంద
నుద్భవించె మరల నొక్క శిరము
అట్టు లెన్ని మారు లర్కకులోద్భవుం
డతని తలను ద్రుంచె నన్నిమార్లు. 820

ఆ. తిరిగి మొలవ దొడగె శిరము లొక్కొకటిగా
యసురవిభుని దర్ప మతిశయింప
మార్పులేని స్థితిని మాతలి గమనించి
యినకులేశుతోడ నిట్టు లనియె. 821

ఆ. "పరమపురుష! మనము వెరగొంద పనిలేదు
నేడు వాని చావు నిశ్చయమ్ము;
వదలు మిపుడు నీవు బ్రహ్మాస్త్రమును వేగ
అదియె నా దురాత్ము హత మొనర్చు." 822

క. అని మాతలి దెలుపగనే
యినకులపతి వేరు మార్గ మిక నేదియు లే
దని మనమున దృఢనిశ్చయ
మునుగొని పరితోషమున సముద్ధతి తోడన్. 823

క. గురు వగు విశ్వామిత్రుడు
వరముగ తన కొసగినట్టి బ్రహ్మాస్త్రమ్మున్
నరనాథుడు కడువడి సుర
లరయగ సంధించి వదలె నసురేశునిపై. 824



సీ. అనిలదేవుడు సైత మాశ్చర్యచకితుడై
గడగడలాడు వేగమ్ముతోడ
పర్వతమ్ములు గూడ భయకంపితమ్ములై
పరువెత్తు రౌద్రరూపమ్ముతోడ
పంచభూతమ్ముల ప్రాణాల నిలువెల్ల
వణకించు గర్జారవమ్ముతోడ
ప్రళయకాలాగ్నినే పరిహాస మొనరించ
జాలెడి నిరుపమజ్వాలతోడ

తే. దివిజు లలరంగ నేగి యా దివ్యశరము
రావణాసురు వక్ష స్థ్సలమును చీల్చి
అతని ప్రాణాలు హరియించి యటులె వచ్చి
పుడమినాథుని అమ్ములపొదిని దూరె. 825

తే. అమరనాథుని నిశిత వజ్రాయుధమున
పక్షములు దెగి పుడమిపై బడిన పర్వ
తము విధమ్మున దశరథాత్మజుని బాణ
మునకు బలియాయె ననిలోన దనుజవిభుడు. 826

తే. ముగిసె నా రాజు శకమన్న వగపుతోడ
అరిభయంకరుడైనట్టి యసురవిభుని
కరమునం దున్న పుత్తడికార్ముకమ్ము
అటులె మెలమెల్లగా జారి అవని బడియె. 827

తే. మూగవోయిన శౌర్యము పుడమిపైన
కాలు గదపక పడియున్న కరణి దోచు
పంక్తికంఠుని మృతకళేబరము నరసి
దనుజసైన్యము చింతతో తరలిపోయె. 828

ఉ. ఆలము లెన్నొ గెల్చి యమరాధిపు సంపద కొల్లగొట్టి ది
క్పాలుర ద్వారపాలకులుగా నిలబెట్టి పరాక్రమోద్ధతిన్
కాల విశృంఖలత్వమును కట్టడిజేసెద నన్న వీరు నా
కాలమె కాటువేసెనని కౌతుకమందె సమస్త లోకముల్. 829

తే. దివిజు లాకసమందుండి యవిరళముగ
భూతలేశ్వరు శిరముపై పూలవాన
విజయ సూచకముగ గురిపించి దుందు
భులను మ్రోగించి రెనలేని మోద మలర. 830

తే. అగ్నికన్న పవిత్రురా లవనిసుతను
క్రూరముగ చెరబట్టిన నేరమునకు
తగిన శిక్ష విధించెను దానవునకు
మనుజ విభుడని మురిసెను వనచరాళి. 831

తే. బుద్ధి దెలిసిన దాదిగా యుద్ధ కాంక్ష
హింసయే శ్వాసగా భువి నెదిగినట్టి
దుష్టదానవనాథుడు శిష్టరక్ష
కుని శరాఘాతమున నేల గూలెనన్న. 832

తే. వార్త సువిశాల జగతికి పండువాయె;
మునిగణము సంబరములోన మునిగిపోయె;
ఆకసము నిర్మల మ్మాయె; నవనితల్లి
యొడలు పులకించి యుర్రూత లూగిపోయె. 833

తే. అన్న లక్ష్యము నెరవేరె నన్న ముదము
లక్ష్మణుని మోముదమ్మిపై లాస్యమాడె!
కపివరేణ్యుల స్తోత్ర వాక్యములు వినుచు
నిర్వికారుడై రాముడు నిలిచియుండె. 834

తే. అంతవరకును మౌనముద్రాంకితు డయి
అన్న పార్థివ దేహమ్ము నరయుచున్న
వీరవిక్రమ ధనుడు విభీషణునకు
ఒక్కపెట్టున పెనుదుఃఖ ముబికి వచ్చె. 835

తే. తడబడెడు పాదములతోడ దానవేంద్రు
శవము దరికేగి కనుల తేజస్సు నరసి
బాధ భరియింపగాలేక బావు రనుచు
వగవ దొడగెను పసిపిల్లవాని లీల. 836

క. "అన్నా! నా హితవును విను
మన్నా! యని వేడుకొంటి నానాడు నినున్
నన్నొక శత్రువుగా గని
క్రన్నన బలియైతి వీవు కదన స్థలికిన్. 837

సీ. అష్టభోగమ్ముల కాలవాలమ్మయి
విఖ్యాతి గనిన జీవితము నీది
కల నైన వైరికి తలవంచి యెరుగని
కదనభీకర పరాక్రమము నీది

ఆయుధ సంపత్తి కాహవనైపుణ్య
గంధ మలందిన కరము నీది
వయసెంత పెరిగిన వార్ధక్య మంటని
అసమాన దివ్యశౌర్యమ్ము నీది

తే. మిత్రసందోహమును కన్నపుత్త్రు లట్లు
మనమునం దెంచి యెక్కుడు మమత పంచి
ఆశిషము లందజేసిన యట్టి నీకు
యిట్టి దుర్గతి గలుగునం చే నెరుంగ. 838

తే. రత్నఖచిత సువర్ణ తల్పమ్మునందు
హాయి తోడుగ శయనించినట్టి నీవు
శవముగా నేలబడియున్న సరణి నరసి
ఆపుకొనలేని వగపు న న్నావహించె." 839

తే. అనుచు తలబాదుకొను విభీషణుని జూచి
పరమపురుషుడు రాముడు పట్టి లేపి
నెనరు జాల్వార నతని కన్నీరు తుడిచి
అనునయించుచు మెలమెల్ల ననియె నిట్లు. 840

తే. "మాననీయుడ! మీ యన్న మరణమునకు
వగవ నేటికి? ఆతడు బవరమందు
అఖిలలోకము లచ్చెరు వందు నటుల
కడవరకు బోరి వీరుడై కన్ను మూసె. 841

తే. జయము వరియించు నొకరినే సమరమందు
రావణుడు గెల్చియున్న నీ రాము డుండ
డిలను జీవించి యను సత్యమెరుగు మీవు
వెలుగుచీకటు లొకచోట నిలువగలవె? 842

తే. ప్రాణభయమున ననినుండి పారిపోక
శూరధర్మము పాటించి వీరమరణ
మంది నాకము జేరినా డసురవిభుడు
ప్రణుతు లందిన దతని పరాక్రమమ్ము. 843

తే. ప్రేగుబంధము నిన్ను నేడ్పించెగాని
కదనధర్మము నీ వెరుంగనిది గాదు
చావు సహజము ప్రాణి కీ జగమునందు
ఆర్తి విడనాడు మీ పరమార్థ మెరిగి." 844

తే. రామభద్రుని హితబోధ రావణాను
జుని వగపు మాన్చి యాతని మనమునందు
పారమార్థిక చింతన పాదుకొలిపి
సంగరక్షేత్ర మంతట శాంతి నింపె. 845

తే. అంతలో రూపుదాల్చిన ఆర్తిలీల
రావణాసురు పట్టపురాణి యైన
పరమసాధ్వి మందోదరి పతిని జూడ
నరుగుదెంచెను రణభూమి కతిరయమున. 846

తే. అరిభయంకరమైన శౌర్యమ్ముతోడ
దిక్పతుల గెల్చి చివరకు దీను నట్లు
చచ్చిపడి యున్న ప్రాణేశు శవము నరసి
వెక్కియేడ్వంగ దొడగె నా వీరవనిత. 847

తే. "సురగరుడసిద్ధ సాధ్య కిన్నరుల వలన
మరణమే లేని నీ వొక నరునిచేత
క్షితిని గూలుట తొల్లి నే జేసికొన్న
కర్మయే గాని వేరొండు కాదు నాథ! 848

తే. నరుడు నిను జంపినా డని నమ్మలేను
చేదు నిజమును కాదని చెప్పలేను
నరుని రూపముగొన్న శ్రీహరియె గాని
మానవుడు గాడు రాముడు దానవేంద్ర! 849

తే. అమరులకు గూడ లోపలి కరుగుదేర
నలవి గానట్టి లంకలో నడుగుమోపి
మర్కటము వేల దనుజుల కర్కశముగ
దురమునం జంపినపుడైన నెరుగ నైతి. 850

తే. తాను శ్రీరాముదూతగా దనుజపురికి
నరుగుదెంచితి నని నిర్భయముగ బలికి
కొలువులో కోతి యెదురొడ్డి నిలిచినపుడె
తెలిసి వచ్చెను నరనాథు దివ్యశక్తి. 851

క. అది గమనించి విభీషణు
డిదియే యనువైన సమయ మినకులపతి కా
మిథిలేశుసుతను జేరిచి
పదుగురిలో నిలుపుకొనుము పరువని తెలిపెన్. 852

ఆ. వాని మాట వినక వైరి సామర్థ్యమున్
సరకు గొనక నీవె సమరమునకు
కాలుద్రవ్వి నాకు గర్భ శోకముగూర్చి
తుదకు నుదుటి బొట్టు దుడిచినావు. 853

తే. నిఖిల దేహేంద్రియమ్ముల నిగ్రహించి
దివ్యశక్తుల నార్జించి త్రిభువనముల
గెలిచి నిలిచిన నీవొక తలిరుబోడి
శీలమును దోచుకొననెంచి చెడితి వకట! 854

ఆ. గర్వ మతిశయించి కామము కనుగప్ప
జ్ఞాన ముడుగునెంత వానికైన
అనుచు దెలిపినాడ వఖిలలోకములకు
అవనిజాత సీత నపహరించి. 855

తే. పృథ్విసుతరూప మృత్యువు నెపుడు నీవు
పట్టి కొనితెచ్చి లంకలో బెట్టినావొ
అపుడె నా తాళిబొట్టున కంటె చెదలు
ఇపుడు నేనెంత వగచిన నేమి ఫలము? 856

ఆ. భర్త సంగరమున పరమపదించిన
వేళ నేడ్వదగదు వీరపత్ని
కాని గతము దలచి కన్నులు దుఃఖాశ్రు
బిందు తతిని వెలికి జిందె నాథ!" 857

ఆ. అటుల తనను తానె ననునయించు కొనుచు
పరమసత్యములను పలికినట్టి
మాననీయ చరిత మందోదరిని జూచి
అవనివిభుడు రాము డనియె నిట్లు. 858

తే. "మానినీమణి! యొక చిన్న మాట వినుము
భర్త మరణించినను పతివ్రతల కంట
దమ్మ! వైధవ్య మిది నిజమమ్మ! నీవు
నిండు ముత్తైదువుగ భువి న్నిలుతు వమ్మ!" 859

తే. అనిన రాముని యౌన్నత్య మాత్మ దలచి
సజల నయనాల నా దయాసాంద్రు నరసి
అర్తి విడి యా మహాసాధ్వి యచటినుండి
వెంటవచ్చిన చెలులు వెన్నంటి నడువ
అరిగె మెలమెల్లగా తన అంతిపురికి. 860

తే. అంత రాముని యానతి ననుసరించి
వినయభూషణుడైన విభీషణుండు
శాస్త్రవిహితమ్ముగా గురుసమ్మతముగ
దహనకాండకు చితిని సిద్ధ మ్మొనర్చె. 861

తే. రంగురంగుల పట్టువస్త్రాల తోడ
మేలి వాసన లెగజిమ్ము పూలతోడ
రావణాసురు శవము నలంకరించి
చితిని ఋత్విగ్జనంబులు చేర్చి రపుడె. 862

క. అంత విభీషణు డుబికెడు
చింతను దిగమ్రింగి నిప్ప చితికంటించెన్
ఎంతటి యోధున కైనను
అంతిమముగ నిదియె జరుగు ననుభావమునన్. 863

తే. అపుడు రాముడు దేవేంద్రు డంపినట్టి
సారథిని బిల్చి తగురీతి సత్కరించి
వందనము లందజేయుము వాసవునకు
అనుచు వచియించె నెనలేని యాదరమున. 864

క. మాతలి సభక్తికమ్ముగ
క్ష్మాతలనాథునకు మ్రొక్కి స్యందనయుతుడై
భూతలమును వీడి సుర
వ్రాతము ముదమంద చేరె స్వర్గపురమ్మున్. 865

తే. అంత రాముడు సుగ్రీవు నభినుతించి
కడు ముదమ్మున గట్టిగా కౌగిలించి
మాననీయుడ! నీ మేలు మరువలేను
నేల సాక్షిగ జన్మ జన్మాలకేను. 866

క. అని వచించి రాము డనుగు తమ్మునిజూచి
ముగిసె నాహవమ్ము ముద మెలర్ప
కాని మిగిలె నొక్క కర్తవ్య మది నీవు
శీఘ్రగతిని పూర్తిజేయవలయు. 867

తే. అగ్రజుని వీడి మనవద్ద కరుగుదెంచి
నపుడు నే జెప్పితిని రావణానుజునకు
నీవె లంకకు రాజని నేడు దాని
నాచరింపుము లక్ష్మణా!" యని వచించె. 868

తే. అన్న మాటను వేదవాక్యముగ దలచి
తత్క్షణమె వేల కోతులదండు తోడ
చనె విభీషణుతో గూడి దనుజపురికి
రాము డానందపడు లీల లక్ష్మణుండు. 869

ఆ. సప్త సాగరముల జలమును వేర్వేరు
పసిడిపాత్రలందు బట్టి తెచ్చి
శాస్త్ర సమ్మతముగ స్నానము జేయించి
పట్టు పుట్టములను కట్టబెట్టి. 870

తే. వేదమంత్రాల నడుమ విభీషణునకు
పురజనులు మంత్రిసత్తముల్ మురియు లీల
రాజ్యపట్టాభిషేకమున్ లక్ష్మణుండు
నియతి దప్పక ముదమార నిర్వహించె. 871

తే. వెంటనే ధర్మవిదుడు విభీషణుండు
సచివ సామంత ముఖ్యుల నుచిత రీతి
సంప్రదాయానుసారము సత్కరించి
సవినయమ్ముగ నిటువల్కె సభను జూచి. 872

సీ. ఈ రేడు లోకాల నేపురికిన్ లేని
ఖ్యాతిగాంచినది లంకాపురమ్ము!
మయశిల్పి నిర్మాణ మహిత కౌశలమున
రూపుదాల్చినది లంకాపురమ్ము!
కాలు జైనను లోన కాలిడ లేడన్న
గణుతి కెక్కినది లంకాపురమ్ము!
అష్ట భోగములందు నమరేంద్రుపురికన్న
నేపు మీరినది లంకాపురమ్ము!

తే. ఇన్ని ఘనతలు నగరాన కిడిన ఘనుడు
సాహసోద్దండ భండన శౌర్యధనుడు
అగ్రజుడు కొల్వుదీరిన ఆసనమున
నేను కూర్చుండ వలసె నయిష్టముగనె. 873

తే. కనుక మీరలు పాలనక్రమమునందు
అరమరలు లేని సహకార మందజేసి
తోడ్పడెద రంచు నేడు నే దోసిలొగ్గి
వేడుకొనుచుంటి దానవవీరులార!" 874

క. అని కడు వినయముతో బలి
కిన నూతనదనుజవిభుని కేరింతలతో
ఘనముగ కొనియాడెను సభ
మనమున రామానుజుండు మరిమరి మురియన్. 875

తే. వెంటనే విభీషణు డతి వేగముగను
దర్పమును వీడి వదినె సౌధమున కరిగి
నేను లంకకు రాజైన నీకు మాత్ర
మెపుడు మరదినె వదినమ్మ! యెరుగు మమ్మ! 876

ఆ. అట్లు భక్తి శ్రద్ధ యలరార బలికిన
మహిత గుణవిశాలు మరది నరసి
"ధర్మనిష్ఠతోడ దానవసామ్రాజ్య
మేలి వాసి కెక్కు మెల్లయెడల. 877

తే. అనుచు మనసార దీవించినట్టి వదిన
కంజలి ఘటించి వెంటనే యచటినుండి
వెడలె సౌమిత్రితోడ విభీషణుండు
ఉర్వినాథుడు శ్రీరాము డున్న యెడకు. 878

తే. అసుర జనములు తనకు పట్టాభిషేక
కాలమున నందజేసిన కానుకలను
విమలభక్తుని పగిది విభీషణుండు
రామలక్ష్మణులకు సమర్పణము జేసె. 879

తే. రాముడా కానుకల వానరాధిపులకు
పేరుపేరున పంచి వివేకమునకు
మారుపేరైన మారుతిం జేర బిలిచి
"అవనిజకు ప్రీతిపాత్రుడ వైన హనుమ! 880

తే. తత్క్షణమె నీవు మిత్రుడు దనుజనాథు
ననుమతింగొని లంకకు జని విషాద
భరిత సీతకు రావణు బవరమందు
నేను పగదీర జంపిన నిజము దెలిపి. 881

తే. ఆమె నలరించి వేవేగ నరుగుదెంచి
తెలుపు మా దేవి నీతోడ బలికినట్టి
వివరముల నెల్ల మనవారి వీను లలర"
ననుచు రాముడు వానికి నానతిడియె. 882

ఆ. ఇంతకన్న భాగ్య మేమి యున్నదని యెంచి
సంతసమున హనుమ గంతు లిడుచు
రామ రామ రామ రామ జానకిరామ
యని మనమున దలచుకొనుచు నరిగి. 883

ఆ. తరువుక్రింద దనుజతరుణుల మధ్యలో
గూడుతోడులేని గువ్వలీల
యుస్సు రస్సు రనుచు నొదిగి కూర్చొనియున్న
సీత నరసి హనుమ చెప్పె నిట్లు. 884

శా. "అమ్మా! నీకొక మేలివార్త నిపుడే నందింపగా వచ్చితిన్
నమ్మన్ శక్యముగాని లీల నరిలో నా దుష్టదైత్యేశు దే
హమ్మున్ వ్రయ్యలు జేసి కూల్చె నిల నీయాత్మేశు డీరేడు లో
కమ్ముల్ మెచ్చ తొలంగి పోయినవి నీ కష్టమ్ములీనాటితో 885

తే. విజయదరహాస వదనుడై విడిదిలోన
యసురనేత విభీషణు డర్కజుండు
నంగదుడు లక్ష్మణుండు తన్నంటియుండ
రాము డున్నాడు మా తల్లి క్షేమ మొప్ప." 886

తే. అనుచు కమ్మని శుభవార్త నందజేసి
వీనులకు విందు జేసిన వినయశీలు
ననిలతనయుని సీత కన్నారగాంచి
హర్ష గద్గదకంఠియై యనియె నిట్లు. 887

తే. "రామభక్తాగ్రగణ్య! నా ప్రాణవిభుడు
దురమునం గెల్చెనన్న సంతోషవార్త
అవనిలోగల సుఖశాంతు లన్ని నేడు
ముందువాలిన ముదము నా కందజేసె. 888

ఉ. నా యెడబాటు మూలమున నాథుడు వేదన నెంత చెందెనో
ఆయన కేను దూరమయి అంతకు మించిన బాధనందితిన్
బాయని దీక్షతో పరమ పాపిని రావణు నేల గూల్చి నా
కాయువు బెంచినా డినకులాంబుధి చంద్రుడు మారుతాత్మజా! 889

తే. మరల నా భర్త ప్రేమాంకమందు జేరి
ఇచట నేబడ్డ కడగండ్ల నెల్ల మరచి
వారి ప్రియవాక్కులను విని పరవశించు
నట్టి భాగ్యము నేటికి నబ్బెనాకు. 890

తే. అనునిమేషము నా పతి కాహవమున
అండగా నిల్చి విజయమ్ము నందజేసి
నట్టి సుగ్రీవ జాంబవదాది ఘనుల
కందజేయుము ముందు నా వందనములు. 891

తే. కడువడిగ నీవు నా స్వామి విడిది కరిగి
వారి దర్శన ప్రాప్తికై ప్రతినిమిషము
కన్ను లలసెడు లీల నే గాంచియుంటి
నన్న సత్యము నెరిగింపు మాంజనేయ! 892

ఆ. ఆదినుండి నీవు మా దంపతులపట్ల
ననుసరించు భక్తి యతులితమ్ము;
లోకమందు మేము నీకీయ దగినది
కానుపించ దేది కపివరేణ్య!" 893

తే. అనుచు తన యెడ నెనలేని యాదరమును
వ్యక్తపరచిన భూజాత నరసి హనుమ
"పూర్వ సుకృతము వలన మీ పుణ్యదంప
తుల హృదయమందు నాకింత నెలవు దక్కె. 894

ఆ. ఇంతకన్ననేది యీ జన్మకాశింప
మాత! పోయివత్తు మరల" ననుచు
చేతులెత్తి మ్రొక్కి సీత దీవెన లంది
చనియె హనుమ రామచంద్రుకడకు. 895

క. తనరాక కొరకు విడిదిని
కనులార్పక జూచుచున్న క్ష్మాతలనాథున్
గని వనచరు లందరు విన
హనుమంతుడు దెలిపె నిటుల నానందముతో. 896

ఆ. "రాఘవేంద్ర! నేను రావణ సంహార
సరణి దెలిపినపుడు సాధ్విసీత
వదనరంగభూమి కదలిన ఆనంద
నాట్యహేల పొగడ నా తరంబె? 897

ఆ. పడితి నిన్నినాళ్ళు భయదమౌ కడగండ్లు
రాక్షసేంద్రు చెరను లంకలోన
వానినెల్ల మరచి ప్రాణేశు నురముపై
తృప్తిదీరసేద దీర్చుకొందు. 898

తే. కనుక జాగొనరింపక క్షణము గూడ
శీఘ్రముగ నేను పతిని దర్శింపవలయు
కూర్మి మరదిని మన్నన గోరవలయు"
ననుచు వచియించె నా తల్లి యినకులేశ! 899

క. అని జానకి సందేశము
హనుమంతుడు దెలియజేసె నతి విపులముగా
ఇనకుల తిలకుడు శ్రద్ధగ
విని యిట్లనె మిత్రుడగు విభీషణుతోడన్. 900

ఆ. "దనుజనాథ! నీవు త్వరితమ్ముగా లంక
కరిగి యచట నుండి ధరణిసుతను
రాజ సంప్రదాయ లాంఛనమ్ములతోడ
నేడె మోద మలర తోడితెమ్ము." 901

తే. అనిన రాముని యానతి అవధరించి
దనుజపతి విభీషణుడు సీతమ్మ నపుడు
రాజవైభవమొప్ప నలంకరింప
జేసి తోడ్కొని వచ్చెను శిబికమీద. 902

ఉ. పల్లకిలోన గూర్చొనిన పావనగాత్ర, ధరిత్రిపుత్రి సం
ఫుల్లసరోజ నేత్ర తన పున్నెము పండినదన్న తృప్తితో
నుల్లమునందు పెక్కు మధురోహలు సందడి జేయుచుండగా
వల్లభు డున్న తావునకు వచ్చెను ముగ్ధమనోహరాకృతిన్. 903

ఆ. శిబిక కన్న ముందు చిరునవ్వుతో విభీ
షణుడు రాముజేరి "సదయహృదయ!
పరమసాధ్వి సీత పల్లకిలో నున్న
దని వచించె మిగుల వినయ మెనయ. 904

ఆ. దూరమైన సీత చేరువైనదటన్న
ముదము రామభద్రు మోమునందు
కలికమునకు గూడ కానుపించకపోవు
టరసి చకితు డాయె నసురవిభుడు. 905

ఆ. కొంత తడవు మౌన మంతట వ్యాపించె
నంతలోన దశరథాత్మజుండు
"దనుజనాథ! నేను ధరణిజన్ వెంటనే
చూడగోరినాడ తోడితెమ్ము." 906

క. అని రాముడు దెలుపగనే
వనచర భల్లూకవరులు వనితామణి సీ
తను జూచు భాగ్య మబ్బిన
దని కడు వడి గంతు లిడిరి యతిమోదమునన్. 907

తే. శరధి పొంగిన రీతి వానరగణమ్ము
పరుగు పరుగున ముందున కురుకు టరసి
బెత్తములు జళిపించుచు భీకరముగ
తరుమసాగిరి వారిని దనుజభటులు. 908

తే. పుడమి వల్లభు డాదృశ్యములను జూచి
జాలిపడి వెంటనే విభీషణుని బిలిచి
"జానకిని చూడగోరిన స్వజనమునకు
నేల కల్గింతు వడ్డంకు లిప్పడీవు. 909

ఆ. సవన సమయమందు సమరభూములయందు
పెండ్లి జరుగునట్టి వేళలందు
పరపురుషులకంట పడవచ్చు వనితలు
దానివలన సుంత తప్పలేదు. 910

ఆ. కాన సమరభూమిలోన కాలిడినట్టి
అవనిజాత నంద రరయ వచ్చు
చేర్చు మిపుడె నీవు సీతను నావద్ద"
కనుచు రాము డతని కానతిచ్చె. 911

క. శ్రీరాముని యాదేశము
నా రాక్షసచక్రవర్తి యవనిజ కటులే
నోరార దెలిపె నంతట
మారాడక నడచె నామె మగని విడిదికిన్. 912

ఆ. దనుజ విభుని వెనుక దినకులేశుని సతి
మోమునిండ మేలిముసుగు దాల్చి
బిడియపడుచు వచ్చి పెనిమిటి కెదురుగా
అవనితల్లి మురియు నటుల నిలిచె. 913

తే. ముసుగు కొద్దిగ తొలగించి మురిపె మెనయ
పతిని కడగంట తిలకించి పరవశించి
తొలి పలకరింపు తనది గావలయునన్న
ఆశతోడ ప్రాణేశ్వరా! యనుచు పిలిచె. 914

ఆ. స్వామి వైపునుండి సవ్వడి లేకుండు
టరసి విస్మయమున మరల మరల
జూచె సీత కాని చూడ డాయెను రాము
డాదరమున పాప మామె వంక. 915

ఆ. ఎప్ప డెపుడు మగని యెద మీద వాలెద
ననుచు వచ్చినట్టి యవనితనయ
ప్రాణనాథునుండి తానేమి యాశించె
నది ఫలించనందు కార్తిజెందె. 916

ఆ. సీతమోములోని చింతను గమనించి
పుడమి రేడు మౌనముద్ర వీడి
ఆదరమున గాక ఆగ్రహమ్మును లేక
ఆమె వంక జూచి యనియె నిట్లు. 917

ఆ. నా పరోక్షమందు పాపి రావణుడు, ని
న్నెప్ప డపహరించె నప్ప డేను
వాని పీచ మడచ పూనితి శపథమ్ము
సమర మందు కొరకు సలిపినాడ. 918

ఉ. కారణ మింతలేక నపకారము నా కొనరించినట్టి యా
క్రూరుని రాక్షసాధముని గూల్చితి నాహవరంగమందు ఈ
డేరెను నా ప్రతిజ్ఞ; దనుజేశుని జేసితి రావణానుజున్
కోరికలేదు నాకు నిను కూరిమి పత్నిగ స్వీకరింపగన్. 919

తే. అల్పమతియైన నొక్క కామాంధునింట
కొన్ని మాసాలు నివసించియున్న సతిని
పౌరుషమ్మున్న యే మగవాడు కూడ
మరల గ్రహియింప నోపడు ధరణితనయ! 920

ఆ. ఇలను పేరుగన్న దిక్ష్వాకువంశము
నిన్ను చేరదీసి నేను దాని
గౌరవమును పాడు గావింపగా జాల"
ననుచు దెలిపె రాము డవనిసుతకు. 921

ఆ. తాను దైవమట్లు తలచి పూజించిన
భర్తనోట అంత పరుషమైన
మాట వినిన సీత మాటలు పెగులక
కుమిలి కుమిలి యేడ్చె గుండె లవియ. 922

తే. ధరణిజాతను తల్లిగా దలచునట్టి
హనుమ రాముని పలుకుల కార్తిజెందె;
కాని బాధను బయటికి గ్రక్కలేక
మదిని దిగమ్రింగి నిలుచుండె మౌనముగను. 923

తే. పరమసౌశీల్యవతియైన వదినె నటుల
అన్న శంకించు టుచితమా యన్న ప్రశ్న
లక్ష్మణుని నెమ్మనమ్మున రగులుకొనియె
అశ్రుజలములు కన్నుల నలముకొనియె. 924

తే. అశనిపాతముకన్న నత్యధికబాధ
ననుభవించెడు వసుమతీతనయ సీత
మగని నెదిరించి మాటాడ మనసు రాక
అనియె నీరీతి మరది లక్ష్మణుని తోడ. 925

తే. "వింటివా! లక్ష్మణా! ప్రాణవిభుడు నేడు
చాల యోచించి యీ మహాజనుల మధ్య
నాకు నోరార విధియించినట్టి శిక్ష!
యిపుడు నా శీలసంపద కిది పరీక్ష 926

ఆ. కాలమునకు కూడ కరుణ నాపయిసుంత
లేదటంచు దెలిసె నీదినమ్ము;
అంటరానిదాన నైతి నా స్వామికి
నేల బ్రతుకవలయు నింక నేను. 927

తే. కనుక సౌమిత్రి! నను నీవు కనికరించి
వేరుగా నెంచ కగ్ని ప్రవేశమునకు
చితిని సిద్ధ పరచుము నా హితవు నెంచి"
అనుచు దృఢముగ బలికె నా యవనిజాత. 928

తే. వదినె పలుకులు సౌమిత్రి హృదయమందు
కలవరము రేపె తడిసిన కనులతోడ
అన్న నారసి అతని కన్సన్నతోడ
విధికి తలవంచి చితిని పేర్పించె నతడు. 929

తే. అంత వైదేహి మౌనముద్రాంకిత యయి
తన మనోహరునకు ప్రదక్షిణము జేసి
గన గన జ్వలించు ఆ చితి కడను నిలిచి
కలగక వచించె గద్గద కంఠి యగుచు. 930

సీ. కల్యాణమాదిగా కాంతుని తోడిదే
దైవసన్నిధియని తలచినాను!
కలనైన నాథుడు కన్పించినంతనే
కర్పూర ఖండమై కరగినాను!
రావణుచెరలోన రామనామజపమ్మె
ప్రాణవాయువుగ నే బ్రతికినాను!
నను మాయతోడ దెచ్చిన మహాపాపాత్ము
చావుకై ప్రార్థనల్ సలిపినాను!

తే. అయిన రాముడు నాశీలమందు తనకు
నమ్మకమ్మింత లేదని నలుగు రెదుట
ననియె కావున దయయుంచి అగ్నిహోత్ర!
శీఘ్రముగ నన్ను నీలోన జేర్చుకొమ్ము. 931

తే. నీకు చెద లంట దనుమాట నిక్కమైన
ఆ మహాసూక్తి నాకును నన్వయింప
జేతువని నమ్మి మిగుల నిశ్చింతతోడ
లీననగు చుంటి నేడు నీలోన తండ్రి! 932

తే. అనుచు దిక్పతు లచ్చెరు వంద పలికి
జన్మనిచ్చిన పుడమిని సంస్మరించి
నింగి నంటెడు మంటల నెగడుచున్న
అగ్నిలో ప్రవేశించె నాయమలచరిత. 933

తే. త్రిదశు లాదృశ్యమును గని యదరిపడిరి
వనచరాధిపు లెల్లరు వగపు గనిరి
అవనినాథుని కనుల నశ్రువులు నిండె
అన్న స్థితి గాంచి లక్ష్మణు డార్తిజెందె. 934

తే. అపుడు పరమేశ్వరుడు బ్రహ్మ అమరనాథు
డచట ప్రత్యక్షమై తమ కమిత భక్తి
మ్రొక్కు లిడి నిల్చియున్నట్టి పుణ్యపురుషు
నినకులేశుని బొడగని యిట్టు లనిరి. 935

ఆ. "అఖిల లోకకర్త! ఆరాధ్యచరితుడా!
అమల హృదయ! సీత అగ్నిలోన
జొచ్చు టరసి యిట్లు చూచిచూడనిరీతి
నుండ హృదయ మెట్టు లొప్పె నీకు? 936

తే. రఘుకులోత్తమ! నీవు నారాయణుడవు!
ధర్మ సంరక్షణార్థము దశరథునకు
పుత్రుడుగ బుట్టినాడ వీ పుడమి మీద
ఆదిలక్ష్మియె సీతగా నవతరించె." 937

తే. ముక్తకంఠమ్ముతోడ నా ముచ్చటట్లు
లనినయంతనె శ్రీరాము డబ్బురపడి
బ్రహ్మరుద్రాదిదేవతా ప్రభువులార!
మదిని దలచితి నేనొక మానవునిగ. 938

తే. అట్లు కాదేని జన్మ రహస్యమెల్ల
తేటతెల్లమ్ముగా నాకు దెల్పు డంచు
వేడుకొని నట్టి శ్రీరామవిభున కప్ప
డజుడు దెల్పెను పూర్వవృత్తాంత మెల్ల. 939

తే. బ్రహ్మ స్వయముగ జేసిన రామవినుతి
అతులితానందమున విన్న అగ్నిదేవు
డపుడు మానవరూపాన నమలచరిత
సీతనెత్తుక లేచెను చితిని వీడి. 940

తే. దినకరుని దివ్యకిరణ సందీప్తితోడ
నవనవోజ్జ్వలమణిభూషణములతోడ
రేకువాడని కుసుమమ్ము రీతి నున్న
అవనిజాతను రాముని కప్పగించి. 941

తే. "రఘుకులోత్తమ! సీత కళంకరహిత
సత్య మీమాట అందుకు సాక్షి నేను!
సాకు లెన్నక నిశ్శంక స్వీకరింపు"
మనుచు నా హవ్యవాహను డానతిచ్చె. 942

తే. అగ్నిదేవుడు బ్రహ్మరుద్రాదు లెదుట
తనదు దేవేరి ఘనసతీత్వమ్మునట్లు
బహుముఖమ్ముల మనసార బ్రస్తుతించి
నందుకా రఘువీరు డానంద మంది. 943

తే. "హవ్యవాహన! జానకి అద్వితీయ
శీలవతి యను నిజము నాచిత్తమందు
కునుకు తీయని కోడియై కూయుచుండు
బ్రహ్మసాక్షిగ నా బహిఃప్రాణ మామె. 944

తే. ధరణిపుత్రి పాతివ్రత్య ధర్మమెదుట
ధర్మదేవత సైతము తలను వంచి
నిలుచు వినయమ్ముతో నని నే నెరుగుదు
కాని యెరుగదు గద! లోక మీ నిజమ్ము. 945

తే. అందుకే యన్ని పరుషోక్తు లాడియామె
మనసు నొప్పించి భగభగమండుచున్న
చితిని దూకిన గాని నిశ్చింతతోడ
నిచట వేచితి నీవు రక్షింతు వనుచు. 946

ఆ. చివర కదియె జరిగె! సీతసౌశీల్యము
విశ్వ మంతటికిని విశద మాయె!
మనసు తేలికాయె! మా దంపతులకు మీ
అసమకరుణ కథ సుఖాంతమాయె." 947

తే. ప్రాణపతి తన్ను గూర్చి దేవతల యెదుట
అనిన ప్రతిమాట కడుశ్రద్ధ నాలకించి
అతిశయించిన సంతోష మాపలేక
పారవశ్యాన పులకించె పడతి సీత. 948

తే. పరమశివు డంత రాముని పారజూచి
"పరమ కంటకుడైన రావణు వధించి
దివిజు లాశించినట్లుగా త్రిజగములకు
తిరుగులేనట్టి శాంతి నందించినావు. 949

తే. ముగిసె వనవాస దీక్షయు ముద మెలర్ప
కనుక జగదేకవీర! తత్క్షణమె నీవు
సీతతో గూడి చనుము సాకేతపురికి
అనుగుతమ్ముడు లక్ష్మణు డనుసరింప. 950

తే. పరమ సద్గుణ భరితుడు భరతు డచట
వేచియున్నాడు నిను జూడ వేయికనుల
అతని నలరించి తల్లుల యార్తిబాపి
అధివసింపుము రాజ్య సింహాసనమున." 951

తే అనుచు ముక్కంటి వచియించె నంతలోన
ప్రక్కనే యున్న సురపతి "రామభద్ర!
నేటి సంతోషవేళ మోమాటపడక
అడుగు మేదేని దాని నే నందజేతు." 952

తే. అనిన వాసవునకు రాము డంజలించి
అడుగ దలచితి నేనె ని న్నమరనాథ!
కదనరంగమునం దసంఖ్యాకులైన
కపులు భల్లుకములు మృతి గాంచినారు. 953

ఉ. బిడ్డల భార్యలన్ విడిచి భీకర యుద్ధమునందు నాకునై
యొడ్డిరి ప్రాణముల్ గనుక నోమహనీయ గుణాఢ్య! వారలన్
దొడ్డ మనస్సు జేసికొని తొందరగా బ్రతికించి యిప్పడే
ర్వడ్డ విషాద మంతయును బాపుము నా కదియే వరమ్మగున్" 954

తే. అటుల వేడిన రాముని యభిమతమ్ము
మేర కమరాధినాథుడు మృతుల కెల్ల
ప్రాణదానము జేసెను పరమశివుడు
పద్మభవుడును సంతోష పడువిధమున. 955

ఆ. కునుకునుండి మేలుకొనినట్లు వారంత
లేచి తమను తాము జూచుకొనుచు
అంతుపొంతులేని ఆనందమున గంతు
లిడిరి నాల్గుదెసల నొడలు మరచి. 956

ఆ. హరుడు, బ్రహ్మ, యింద్రుడా వేడుకను జూచి
పరమ తృప్తితోడ వారి వారి
వాసములకు జనిరి వైభవోపేతులై
అవనివిభుడు రాము డలరునటుల. 957

క. మరణించిన వారందరు
తిరిగి బ్రతికినారలపుడు దివిజేంద్రుకృపన్
ధరణీ సుత నిప్పల నిజ .
పరిశుద్ధత్వమును చాటె ప్రాజ్ఞులు మెచ్చన్. 958

క. అని పరవశించు రాముని
హనుమంతుడు జాంబవంతు డంగదు డాది
త్యుని తనయుడు లక్ష్మణుడును
గని వికసిత వదను లైరి కడు మోదమునన్. 959

తే. అంత రాముని యాదేశ మనుసరించి
విశ్వహితమును గోరు విభీషణుండు
సమరయోధుల నందర సత్కరించి
పుష్పకమ్మును దెప్పించె పురమునుండి. 960

ఆ. చిన్నపాటి స్వర్గ మన్న విధమ్మున
నున్న పుష్పకమ్ము నుర్వినాథు
నెదుట నిలిపి వినయ మేపార దానవ
ప్రభువు కరము మోడ్చి పలికె నిట్లు. 961

సీ. "ఈ విమానము వంటి దీరేడు లోకాల
గాలించి వెదకిన కానబడదు!
అనిలదేవునికన్న నధికమౌ వేగాన
ఆకాశమార్గాన నరుగ గలదు!
అవసరమ్మైనచో అవనికి దిగకుండ
నింగి మధ్యమునందె నిలువగలదు!
ఇంద రన్నదిలేక యెందరినైనను
చిటికెలో గమ్యమ్ము చేర్చగలదు!

తే. స్నిగ్ధ సుందర శిల్పాల సృష్టికర్త
మయుడు నిర్మించె దీనిని మనుజనాథ!
హాయిగా నుండు నిది మీ ప్రయాణమునకు"
అనుచు కడుభక్తితో విభీషణుడు పలికె. 962

క. ఇనకుల తిలకుం డంతట
ఘను డసురాధిపుని గాంచి ఘనమగు నీవా
హనమున జనెద మయోధ్యకు
మన మలరగ నిపుడె వాయుమార్గమునందున్. 963

ఆ. అనుచు దెలిపి రాము డర్ధాంగి నెక్కించె
ముందు నీ వటంచు పుష్పకమున
ఆమె లోని కేగి ఆ కళానైపుణ్య
మరయ దొడగె రెప్ప లార్పకుండ. 964

తే. రాము డంతట వానరరాజు నరసి
"నేటి సంతోషమున గణనీయమ్మైన
పాలు నీదన్న నిజము నా స్వాంతమందు
నేను జీవించినన్నాళ్ళు నిలిచియుండు. 965

తే. నీవు నీ మహాసైన్యమందించినట్టి
సాయమున నేను గెల్చితి సమరమందు
సజ్జనుని తోడి నెయ్యము సకలసౌఖ్య
ములను సమకూర్చు నని నాకు దెలిసె నేడు. 966

తే. ఆలసింపక కిష్కింధ కరుగు మిపుడె
అచట స్త్రీలంత భర్తల యాగమనము
కొరకు చూచుచు నుందురు కోటికనుల
అనుచు సుగ్రీవునకు జెప్పె నవనివిభుడు. 967

తే. అంత నంజలిబద్ధుడై యచటనున్న
దనుజనాథుని తిలకించి యినకులేశు
"ఓ విభీషణ! లంకకు నీవు పోయి
యెట్టి ఆటంకములు లేక యేలుకొనుము." 968

కం. అని శ్రీరాముడు పలుకగ
వినయము దళుకొత్త నా విభీషణు డెలమిన్
"యినకుల తిలకా! నేనును
కనవలె సాకేతపురిని కరుణింపు" మనెన్. 969

తే. అవనివిభు డౌను కాదని యనకముందె
అర్కసుతుడైన సుగ్రీవు డాతురతగ
అందరిని గూడ కరుణతో ననుమతించు
సరసగుణసాంద్ర! నీ వెంట నరుగుదేర. 970

తే. అచట మిము గన్న కౌసల్య నభినుతించి
పిదప భరతుని దర్శించి ముద మెలర్ప
అతులితమ్ముగ జరుగు పట్టాభిషేక
మరయు భాగ్యము కలిగించు మనుచు వేడె." 971

తే. అంత రాముడు సమ్ముదితాత్ము డగుచు
నాప్తగణమంత నేడు న న్ననుసరింతు
మన్న నే గోర దగినది యంతకన్న
నవనిలో లేదు సుగ్రీవ!" యని వచించి. 972

ఉ. ముందుగ జానకీధవుడు పుష్పక మెక్కి మనోహరాకృతిన్
సుందరమందహాసమును చూడ్కుల జిందు అనుంగు పత్ని మో
మందున వెల్గులీనెడు ప్రహర్షముగాంచి "యిలాతనూజ! నీ
యందము మా విమానమున కందము గూర్చె"నటంచు వాకొనెన్.

ఆ. బహుదినాల పిదప ప్రాణవిభుని నోట
వీను లలరుమాట వినిన సీత
స్త్రీకి సహజమైన సిగ్గుతో తన కౌతు
కమును దెల్పె నర్మగర్భితముగ. 974

తే. అప్పటికె లోని కరుదెంచి నట్టి ప్రముఖు
లంద రాదృశ్య మరసి యానందమంది
రంత పుష్పక మాకాశ మలరునటుల
పైకి లేచెను జయజయధ్వనుల నడుమ. 975

ఆ. గగనతలమునందు కనకాద్రి పయనించు
పోల్కి నరుగుచున్న పుష్పకమున
కొలువుదీరియున్న కోదండరాముడు
పత్నివైపు జూచి పలికె నిట్లు. 976

తే. "దనుజ నగరిని దివినుండి గనినయెడల
వింత అనుభూతి మనమున గంతులిడు" న
టంచు పలికిన పతితోడ నవనిజాత
అవును నే నట్లె దలచితి నని వచించె. 977

తే. అంతలో "సీత! అటుచూడు మదియె నేను
అసురనాథుని హతమార్చి నట్టిచోటు!
రావణుని సతి యంతిపురమ్ము, వీడి
భర్త శవమును గనవచ్చె పాప మటకు." 978

ఆ. ఆత్మ విభుని శవము నరయ మందోదరి
ఆహవస్థలమున కరుగుదెంచె
ననిన మాట వినిన యవనిజ కన్నులు
చెమ్మగిల్లె; నపుడు సీత నరసి. 979

ఆ. మనసు మార్చ గోరి యినకులేశుడు "దేవి!
కడలిమీద మేము గట్టినట్టి
సేతు వదియె" ననుచు సీతకు జూపించి
మరల నిట్టు లనియె మనుజవిభుడు. 980

మ. అరరే! విస్మృతి జెందినాడ నదిగో! యావంక గన్గొమ్ము, నీ
కరుదౌ దృశ్యము గానుపించు నది నా యాత్మీయమిత్రుండు వా
నర రాజేంద్రుని ముఖ్యపట్టణము నే నానాడు వాలిన్ వసుం
ధరపై గూల్చిన పావనస్థల మదే ధాత్రీసుతా! గాంచుమా. 981

తే. అనిన రాముని గని సీత "హనుమ నాకు
విశదముగ దెల్పె కిష్కింధ వివరములను
తార మొదలైన రాణుల తక్కినట్టి
వానరస్త్రీల నిపుడీ విమానమందె 982

తే. వెంట తోడ్కొని పోవుద మింటి" కనుచు
నయము భయమును గదుర జానకి వచించె!
నంత రాముడు సముచితమైన కోర్కె
యనుచు దింపించె పుష్పక మవని మీద. 983

తే. పరుగు పరుగున వానరప్రముఖు లంత
పట్టణము జేరి వెంటనే వారి వారి
అనుగు పత్నులతో గూడి యరుగుదెంచి
పుష్పక మ్మెక్కి రెనలేని ముదముతోడ. 984

తే. తార మొదలగు వానర తరుణు లెల్ల
మొదటి సారిగ దరహాస వదనయైన
జానకిని రామభద్రుని సరస నరసి
పరవశమ్మంది భక్తితో ప్రణతు లిడిరి. 985

తే. వెంటనే విమానము వినువీథి కెగసె
మరల రాముడు ప్రియసతి మురియు నటుల
క్రింద గనుపించు సుందరదృశ్యములను
చేతితో జూపుచీ రీతి జెప్పసాగె. 986

సీ. "మెరుపులీనెడు మహామేఘమ ట్లగుపించు
నా కొండనే ఋష్యమూకమండ్రు!
కపివరేణ్యుని నన్ను గలిపి మా మైత్రికి
చనుబాలు బట్టిన శైల మదియె!
పరికించు మయ్యదే పంపాసరోవర
మ్మచట నీ పేరెత్తి యరచినాడ!
అటుచూడు మల్లదే యానాడు నీకోర్కె
కనువుగా కట్టిన ఆకుటిల్లు!

తే. ఇప్పటికి గూడ మన కొరకెదురుజూచు
చందమున నిల్చియున్న దాశ్చర్యముగను
తీపియును చేదు కలసిన జ్ఞాపకాలు
చూడు మనవెంట బరువెత్తుచుండె నేడు. 987

తే. బహుదినమ్ములు దుష్ట రావణుని చెరను
పడిన కడగండ్లు మరచి యా పుడమితనయ
మగని ప్రియవచనములను మనసులోన
మనన మొనరించు కొనసాగె మౌనముగను. 988

తే. గగన మార్గాన జను పుష్పకమును జూచి
వన్యమృగములు నీడనే బాటజేసి
పరుగులిడుచున్న దృశ్యమ్ము నరసి సీత
ఆత్మవిభుతోడ మెల్లగా ననియె మరల. 989

తే. "స్వామి! అడవుల నివసించు జంతువులకు
గూడ దెలిసిన దేమొ యీనాడు మన మ
యోధ్య కరిగెడు శుభవార్త! యున్నచోటు
వదలి పరువెత్తుచుండె పుష్పకము వెంట." 990

తే. అనుచు ప్రియసతి సంతోష మతిశయింప
చెవిని ఊదిన పలుకుల కవనివిభుడు
కడు ముదమ్మంది "జానకీ! కాంచు మదియె
మహిని విఖ్యాతి గనినట్టి మన అయోధ్య. 991

తే. నతుల నర్పింపుమా మహానగరమున" క
టంచు రాముడు సీతతో ననుట నరసి
పుష్పకములోని వారంత మోర లెత్తి
చూచిసంబరమంది రా శోభకపుడు. 992

సీ. అమరాధిపతికైన ఆనందమును గొల్పు
రమణీయ రాజమార్గములతోడ
వాస్తుశిల్పములోని వైవిధ్యమునకు ద
ర్పణము లట్లున్న హర్మ్యములతోడ
వానరమ్ములకైన ధ్యానమం దాసక్తి
గలిగించునట్టి కోవెలలతోడ
తోరణద్వారాన తొండముల్ పైకెత్తి
వరుసగా నిలబడ్డ కరులతోడ
తే. పంచవన్నెల గుర్రాల పంక్తితోడ
తనివిదీరని దివ్యసౌందర్యమునకు
తాను సంకేత మనులీల దనరుచున్న
పురము బొడగని మురిసెను పుష్పకమ్ము. 993

తే. అంతలో భరద్వాజుని ఆశ్రమమ్ము
నరసి రాముడు పుష్పక మచట దింపి
తమ్మునింగూడి లోనికి తరలిపోయి
ఆ మహాముని పాదము లంటి మ్రొక్కి. 994

చం. "మునివర! నేటితో ముగిసి పోయెను నా వనవాసదీక్ష మీ
యనుపమమైన దీవెనల నందిన భాగ్యవశమ్ము చేత నే
దునిమితి యుద్ధరంగమున దుష్ట నిశాచరనాథు పుష్పక
మ్మున జనుదెంచితిన్ ధరణిపుత్రికతో మిము జూచు కోర్కెతో" 995

తే. వినయమున రాము డటు విన్నవించినంత
తాపసశ్రేష్ఠు డగు భరద్వాజమౌని
"అసురనాథుడు జానకి నపహరించి
నది మొదలు నీవు పడినట్టి ఆపదలను. 996

తే. నే నెరుంగుదు రాఘవా! మాననీయ
చరిత యవనిజ పడిన కష్టములు కూడ
నాకు దెలియును; నిన్ను వెన్నంటి యుండి
చేసె లక్ష్మణు డెనలేని సేవ మీకు. 997

తే. ఏది యేమైన మీ మువ్వు రీ దినమ్ము
తిరిగి సుఖముగ నావద్ద కరుగుదెంచి
ఆశ్రమమునకు నాకు ప్రహర్ష మిప్ప
డంద జేసితి రందు కే నభినుతింతు." 998

చం. అని ఋషిపుంగవుం డనిన యంతట రాముడు "తాపసోత్తమా!
ఇనకుల రత్నమౌ భరతు డెట్లు వసుంధర నేలుచుండె, నా
జననియు తక్కు తల్లులును సౌఖ్యముగా మనుచున్నవారె? మీ
కనుదిన మందు చుండుగద యచ్చటి వార్తలు వాని దెల్పుడీ!" 999

కం. అని రాముడు వేడిన నా
మునితిలకుడు మందహాసమున నిట్లనియెన్
"ఇనవంశోత్తమ! భరతుడు
జనపాలనలోన మిగుల సన్నుతి కెక్కెన్. 1000

ఆ. అతని ధర్మదీక్ష అనితర సాధ్యము
అతని గుణగణమ్ము లతులితములు
పాదుకలకు తాను ప్రతినిధిగా నిల్చి
ధరను నేలె నిన్ను దలచుకొనుచు. 1001

ఆ. రాజధానిలోన రాణులు పురజను
లితర పరిజనమ్ము లింతయేని
కొరత లేక మిగుల కుశలులై యున్నారు
వారి గూర్చి చింత వలదు నీకు. 1002

తే. అర్కకులదీప! నేడు నా యాశ్రమమున
విందొసంగ దలచితి మీ బృందమునకు
సీతతో పాటు వానరస్త్రీల గూడ
పిలువు మిచటికి నాకు సంప్రీతి గలుగ." 1003

క. అనిన ముని యానమేరకు
ననుజుడు సౌమిత్రి నంపి యవనీతనయన్
వనచర పత్నుల నితరుల
క్షణమున రప్పించె వారు సంతస మందన్. 1004

కం. అందరు నాశ్రమవాటిక
యం దడుగిడి మౌని నరసి యతులిత భక్తిన్
వందనముల నర్పించిరి
పందిరి పైనున్న చిలుక భళిభళి యనగన్. 1005

తే. మునివతంసుని పర్యవేక్షణమునందు
నింట దొరకని అచ్చటి వంటకముల
తీరుతెన్నుల నెన్నుచు తృప్తిదీర
విందు గుడిచెను రామునిబృందమెల్ల. 1006

తే. అంత జానకి మౌనీంద్రు చెంతకేగి
పదములకు మ్రొక్కి వారి దీవనలు గొనియె
రాము డనిలతనయుని దూరముగ బిలిచి
ప్రేమ జాల్వారు నట్టులీ రీతి బలికె. 1007

ఆ. "హనుమ! నీవు వేగ నాకాశమార్గాన
శృంగబేరపురము జేరి నాకు
కూర్మిమిత్రుడైన గుహుని సందర్శించి
చెప్ప మిచట నేను సేమ" మనుచు. 1008

తే. అవల నాతని సేమ మే నడిగినట్లు
చెప్పి య చ్చోటు విడనాడి శీఘ్రగతిని
నందిగ్రామము జేరి యానంద మొదవ
భవ్యసద్గుణ భరితుని భరతు నరసి. 1009

తే. మొదట నా సేమ మెరిగించి పిదప నీవు
వరుస దప్పక నావనవాస గాథ
నంత వివరించి వాని నానంద పరచి
యెదురు ర"మ్మని చెప్పి పంపించె నతని. 1010

తే. కరువలిసుతుండు గగనమార్గమ్మునందు
గుహుని పురమేగి రాముని కుశలవార్త
దెలిపి యాతని కెనలేని తృప్తి నొసగి
బయలుదేరెను వెంటనే భరతు నరయ. 1011

తే. అగ్రజుని పాదుకలకు తా ననుదినమ్ము
పూజ సల్పుచు అధికారభోగములను
మరచి భరతుడు నందిగ్రామమ్మునుండి
పాలనము జేసె పదునాల్గు వత్సరములు. 1012

కం. వ్రతదీక్షను శ్రీరాముడు
ప్రతిదినమును కాననముల పాటించినటుల్
సతతము భరతుడు సైత
మ్మతిముదమున నాచరించె నా నియమములన్. 1013

ఆ. ఎప్ప డన్న వచ్చు; నెప్ప డీపాదుక
లప్పగింతు; నన్న నెప్పడేను
కాంతు తండ్రి దివ్య కనకసింహాసన;
మందు తనివిదీర" నని భరతుడు. 1014

తే. దృక్కు లన్నియు దక్షిణ దెసకు ద్రిప్పి
ముగియనున్నది నేటితో పుడమివిభుడు
నాడు ప్రియమార నా కిడినట్టి గడువు
ఏమి జరిగెనో? రాడాయె నింతవరకు." 1015

తే. అనుచు నతడు ప్రతిక్షణ మన్నకొరకు
కనులు కాయలుగాయగా కలవరమున
నెదురు జూచుచు నుండగా నింతలోనె
దూరమున నుండి వినిపించె దొడ్డవార్త. 1016

ఉ. "అన్నరుదెంచె నో రఘుకులాంబుధి చంద్ర! అరణ్యవాస మం
దెన్ని యవాంతరమ్ము లెదురెత్తిన జంకక ధర్మదీక్షతో
నన్నిటి బారద్రోలి ముగురమ్మల నిన్నును జూచు కాంక్షతో
నెన్న డయోధ్య వీడ డిక నేల విచారము ఊరడిల్లుమా! 1017

తే. రాముడును జానకీసతి లక్ష్మణుండు
వచ్చియున్నారు ముని భరద్వాజునాశ్ర
మమునకున్; రేపు సూర్యోదయమున నిటకు
ఏగుదెంచెద రిందుకు నేను సాక్షి 1018

తే. అనుచు భరతుని ముందు ప్రత్యక్ష మాయె
హనుమ; వానిని గని యో మహానుభావ!
యింత కమ్మని వార్త నా కెరుగజేసి
నందు కేమిచ్చి నే దీర్చుకొందు ఋణము. 1019

ఆ. అనుచు భరతు డప్పు డానంద బాష్పాల
హనుమ కర్ఘ్య మొసగి యంజలించి
"నిరుపమాన తేజ! నీ వెప్ప రన్నది
తడవుసేయకుండ నుడువు మనియె. 1020

ఆ. అంత నాంజనేయు డతి క్లుప్తముగ తన్ను
గూర్చి తెలిపి పిదప కుటిల దాన
వాధిపుండు సీత నపహరించిన దాది
తిరిగి వచ్చు వరకు జరిగినట్టి. 1021

ఆ. సంఘటనల నెల్ల సత్యబద్ధమ్ముగా
వరుసబెట్టి తెలిపె వాయుతనయు;
డన్న పడిన యిడుమ లన్నియు మది నెంచి
భరతు డంతులేని బాధనందె. 1022

సీ. తైల సంస్కార మింతయులేక పెనగొని
జడలు గట్టిన శిరోజములతోడ
దేహ సౌందర్య ప్రదీప్తికి తెరబెట్టు
దళసరినార వస్త్రములతోడ
తగు పోషణములేక ధరణిపై శయనించ
రంగుమారిన శరీరమ్ము తోడ
షడ్రసోపేత భోజనమును విడనాడి
కందమూలాదుల విందుతోడ

తే. వేద నిధులుగ శ్రీరామ పాదుకలను
దలచి ప్రతినిధిగా తాను నిలిచి రాజ్య
పాలనము సేయు భరతుని భ్రాతృభక్తి
నరసి పవమానతనయు డబ్బురమునందె. 1023

తే. సత్య సౌజన్య సచ్ఛీల శాంతగుణుని
నిన్ను గన్నట్టి కైకమ్మ కన్న అనుగు
తమ్ముునిగ గన్న రామయ్య ధన్యుడన్న
సంబరము నాకు గలిగెనో సరసహృదయ!" 1024

తే. అనిన వెంటనె భరతుడో "యాంజనేయ!
నీవలెనె నేను రాముని సేవకుండ!
నంతకంటెను వేరె ప్రఖ్యాతి యేది
వలదు; ఈ జన్మ కద్దియే వరము నాకు. 1025

మ. అని శత్రుఘ్నుని జేరబిల్చి భరతుం డాహ్లాద మేపార చ
య్యన నీ విప్పు డయోధ్యకేగి పురి నా యక్షేశుధామమ్ముతో
నెనయౌరీతి నలంకృతుల్ సలుపు నట్లేర్పాటు గావింపుమా!
యని యాదేశ మొసంగె తమ్మునకునత్యాసక్తి దీపింపగన్. 1026

కం. తన అన్న దెలిపినంతనె
అనుజుడు పురికేగి యచట నమ్మల తొలుతన్
గని యగ్రజు నాగమన
మ్మును దెలిపెను వారు మిగుల మురిసెడు లీలన్. 1027

తే. పిదప పురవీథులను సభావేదికలను
సకల దేవాలయములను సౌధములను
అతులితోన్నత మగు నలంకృతులతోడ
వెలయ జేసెను తన పర్యవేక్షణమున. 1028

తే. మరల నిన్నేళ్ల పిదప రామయ్య తండ్రి
అమ్మ సీతమ్మతో గూడి యరుగుదెంచు
చుండె నను వార్త నగరము సొబగుబెంచె
పౌరజనముల నానంద వార్ధి ముంచె. 1029

కం. మరునా డరుణోదయమున
భరతుడు మున్ముందు నడువ పట్టపురాణుల్
పురజను లాప్తు లమాత్యులు
గురువులు సేనాధిపతులు కోకొల్లలుగా. 1030

తే. పట్టణము వీడి చతురంగబలముతోడ
జానపద నృత్యగాయక జనముతోడ
అనుపమానము లైన వాద్యములతోడ
వేడ్క గదలిరి రామభూవిభుని జూడ. 1031

ఆ. అటుల కొంత దూర మరిగిరి యంతలో
గగనతలము నందు గానుపించె
భూవిభుండు వచ్చు పుష్పకవాహన
మెల్ల వారి మనము లుల్లసిల్ల. 1032

కం. భరతుని కౌతూహల మం
బరమును చుంబించె నగరవాసుల మోముల్
విరబూసిన కుసుమములై
పరమ రసానంద సౌరభము లెగజిమ్మెన్. 1033

ఆ. పుష్పకమున నున్న భూమినాథుని మేరు
పర్వతమున నున్న భానునటుల
నెంచి భరతు డంజలించెను భక్తితో
నింతలో విమాన మిలను వ్రాలె. 1034

తే. అందులోనుండి రాముడు ముందు డిగ్గి
కరములను మోడ్చి యెదురుగా కాచియున్న
ప్రియసహోదరు బొడగని వేగిరమున
చేతులను సాచి కౌగిట జేర్చుకొనియె. 1035

ఆ. అన్న గుండెపైన నర నిమేషమ్మైన
నిలువకుండ భరతు డిలకు జారి
పాదయుగ్మమునకు ప్రణతుల నర్పించి
పజ్జనున్న వదినె వదన మరసి. 1036

తే. "అన్న సరసన మరల ని న్నరయు భాగ్య
మబ్బె నను మోదమున నయోధ్యాపురమ్ము
పంపె నా చేత స్వాగతవందనమ్ము
నందుకో"మ్మని వదినమ్మ కందజేసి. 1037

కం. భరతుం డటు పిమ్మట వన
చర తిలకుల దరికి నరిగి సాకేతపురీ
స్థిరవాసుల నతులను నా
కరముల నర్పించుచుంటి గైకొను డనియెన్. 1038

తే. కపికులేంద్రుని వేరుగా కౌగిలించి
"భానునందన! నీ స్నేహ పరిమళమ్ము
ప్రేమ సంకేతముగ గుబాళించుచుండు
శాశ్వతమ్ముగ రామరాజ్యమ్మునందు." 1039

క. అని భరతుం డినతనయుని
కొనియాడుట నరసి యతని గుణసంపత్తిన్
మనమున దలచుచు రాముడు
జనని సమీపమున కరిగి సాష్టాంగపడెన్. 1040

ఆ. కన్నులార్ద్రమైన కౌసల్య తనయుని
పరమ సమ్మదమున పట్టిలేపి
శిరము నిమిరి నుదురు చెక్కిళ్ళు ముద్దాడి
పరవశింపజేసె ప్రజల నెల్ల. 1041

తే. అంత శ్రీరాముడు సుమిత్ర చెంత కరిగి
ఆమె కంజలి ఘటియించి అచట నిల్చి
కన్నులార్పక గనుచున్న కైక కెరగి
పిదప గురువుల మంత్రుల పదములంటి. 1042

తే. అటులె మిగిలిన పురజను లందరకును
మౌన వందన మిడి వారి మనసు దోచె!
వెంటనే మారుమ్రోగె మిన్నంటునటుల
ప్రజల జయజయధ్వానముల్ బహు ముఖాల. 1043

తే. భరతు డంతట శ్రీరామపాదుకలను
స్వయముగా నన్న కర్పించి సవినయముగ
"ఇంతకాలము నీ రాజ్య మేలునట్టి
వరము నా కిడినందుకు ప్రణతు" లనియె. 1044

ఆ. అపుడు రామభద్రు డానంద బాష్పము
లనుగుతమ్ము శిరమునందు జిలికి
హత్తుకొనియె గుండె కా దృశ్యమును గాంచి
ముప్పురమ్మ లెంతొ ముదము గనిరి. 1045

తే. మరల దూరాన నున్న సుమంత్రు నరసి
వందన మ్మిడి వారి దీవనల నంది
కడువడి వసిష్ఠునింజేరి కరము మోడ్చి
ప్రణతు లర్పించె భక్తి తత్పరతతోడ. 1046

తే. "కారణ మ్మేదియైన నే దూరమైతి
దివ్యసందేశ మొసగు మీ దీవెనలకు
వాని నెల్లను ఈ వేళ మేనజల్లి
కొరత తీర్పుము దయ యుంచి గురువరేణ్య!" 1047

కం. అని వేడిన దాశరథిని
మునిపుంగవు డభినుతించి భూమీశ్వర! నీ
జనకుని దీవెనలే ని
న్ననుదినమును కాచి బ్రోచు" నని దీవించెన్. 1048

కం. శ్రీరాముం డంతట పరి
వారముతో పుష్పకమున భరతాశ్రమమున్
జేరెను నందిగ్రామము
పారము లేనట్టి హర్షవార్నిధి దేలెన్. 1049

ఆ. రామభద్రు డంత రాజపురోహితు
పాదపద్మములకు ప్రణతు లిడియె!
భరతు డన్న నొక్క బంగరు పీఠిపై
నధివసింప జేసి యనియె నిట్లు. 1050

తే. "అర్కకుల దీప! నే డయోధ్యాపురాన
రాజసింహాసనమ్ము నీ రాక కొరకు
దృక్కులను నందిగ్రామము దెసకు ద్రిప్పి
యెదురు జూచుచు నున్నదీ యదనుకొరకు. 1051

తే. కనుక నామాట మన్నించి కనికరించి
నగరవాసుల కోరిక ననుసరించి
నేటి శుభలగ్నమున నాటిమాట మేర
కధివసింపుము జనకు సింహాసనమున. 1052

తే. నాడు తనకంద నట్టి యానందమంత
వడ్డితో కూడ చెల్లింతు వని దలంచు
చున్న సాకేతపురలక్ష్మి కన్ను లలర
సిద్ధమగు మన్న పట్టాభిషేకమునకు." 1053

కం. అని సవినయముగ వేడిన
యనుజన్ముని మదిని మెచ్చి యటులే గాని
మ్మనె నా యినకులతిలకుడు
కనులను నానందబాష్పకణము లురలగన్. 1054

తే. అంత భరతుని మునివృత్తి కద్వితీయ
చిహ్నముగ పదునాల్గేండ్లు శిరముపైన
విడిది చేసిన నిడుపాటి జడలముడిని
స్వయముగా విప్పి రాముడు స్వస్తి పలికె. 1055

తే. అపుడు రాముడు గురుదేవుననుమతి గొని
తనజటాజూట మంతయు తానె విప్పి
ముప్వు రనుజన్ములను గూడి ముద మెలర్ప
నాచరించెను వడిగ నభ్యంజనమ్ము. 1056

మంజరి. అంత నొక్కొకరుగా నాయన్నదమ్ము
లందరు పట్టు పీతాంబరమ్ములను
ధరియించి మణిగణ స్థగితమ్ములైన
నగలు మేనం దాల్చి నల్వురింద్రులుగ
భాసిల్లి రంత సంబరము పెంపొంద
రాజమాతలు వానరస్త్రీల నెల్ల
సీతమ్మతో పాటు చెలుల సాయమున
నతులితమ్ముగ నలంకృతల గావించి
రంతలో శత్రుఘ్ను ననుమతిం బొంది
మంత్రి సుమంత్రుడు మహిత సితాశ్వ
ములను బూన్చిన రథమ్మును దెచ్చి నిలిపె
నపరంజి రుచులీను నా స్యందనమున
ముందుగా ప్రియమార భూవిభుం డెక్కె!
మరియొక రథములో మానినీమణులు
సీత, కైక, సుమిత్ర, శ్రీరామజనని
కిష్కింధ రాణు లెక్కిరి వెంటవెంట: 1057

సీ. భరతుడు రఘురామ భద్రుని రథమెక్కి
ప్రీతితో పగ్గముల్ చేతబట్టె
శత్రుఘ్ను డొక బంటు సరణి శ్రీరాముని
తలపై సితాతపత్రమ్ము పట్టె
సౌమిత్రి యగ్రజు సన్నిధి న్నిలబడి
వింజామరము బూని వీవ దొడగె
దనుజనాథుడు విభీషణుడు వేరొక్క విం
జామరమ్మును దాల్చి సరస నిలిచె.

తే. ఆకసము నుండి యాదృశ్య మరసి మురిసి
సురగరుడ సిద్ధ సాధ్యకిన్నర గణమ్ము
మధురభక్తి గావించు రామస్తవమ్ము
అష్టదిక్కర్ణముల నెల్ల నలరజేసె. 1058

తే. వెంటనే రామభూపాలవిభుని రథము
దాని వెంబడి రాజమాతల యరదము
సాగె మంగళవాద్య ఘోషముల నడుమ
వర్ణనాతీత జయజయధ్వనుల మధ్య. 1059

తే. అంత శత్రుంజయమ్మును హస్తిపైని
వానరేంద్రుడు రాజవైభవము మీర
మరల దొరకునె యిట్టి సంబరము నాక
టంచు ముందేగు రథముల ననుసరించె. 1060

క. తక్కిన వానరముఖ్యులు
చక్కని తొడవులను దాల్చి సత్వరముగ తా
మెక్కిరి మదగజములపై
యక్కజమును గొల్పునట్టి అధికారములన్. 1061

ఆ. జన సమూహమెల్ల శంఖమ్ము లూదుచు
దుందుభులు చెలంగ చిందు లిడుచు
నినకులేశు తేరి కిరువైపుల నయోధ్య
వరకు సాగి రమిత సరభసముగ. 1062

మ. పదునాల్గేడుల నాడు రాజ్యము తృణప్రాయమ్ముగానెంచి స
మ్ముద మేపారగ కాననమ్ములకు తమ్ముంగూడి సీతమ్మతో
బుధసందోహము మెచ్చ నేమమున నే పుణ్యాత్మకుండేగె నా
సదయుం గాంచెడు భాగ్యమబ్బె ననుచున్ సాకేత ముప్పొంగెదాన్.

ఆ. నగర లక్ష్మి మోము నందనవన మాయె!
దేవళములు పూల తేరులాయె!
వీథులన్ని వింతవేడ్కల కిరవాయె!
రామచంద్ర విభుని రాక వలన. 1064

ఆ. పచ్చతోరణాలు ప్రతి యింట కొలువాయె!
పసరములకు గూడ పండుగాయె
ముగ్గుదీర్చనట్టి ముంగిళ్లు కరువాయె
రాణి జానకమ్మ రాకవలన. 1065

క. పరివార సమేతముగా
దరహాసము వెల్లివిరియ దశరథ సూనుం
డరిగెను నగరము లోనికి
సురనాథుం డమరపురిని జొచ్చిన కరణిన్. 1066

సీ. శ్రవణపేయమ్ముగా స్వస్తి వాచకముల
నుచ్చరించెడు విప్రు లొక్కవంక!
విజయగీతిక లాలపించుచు నరుదెంచు
పెక్కండ్రు గాయకు లొక్కవంక!

సిరిమల్లె సుమములు శిరములపై జల్లు
చక్కని పూబోడు లొక్కవంక!
విలువకందని లీల పులివేషములు దాల్చి
చొక్కియాడెడు కుర్ర లొక్కవంక!

తే. వెంట నడచుచు వెదజల్లు వేడుకలను
తనివిదీరగ నరయుచు ధరణివిభుడు
నగరవీథులు పులకించునట్టు లరిగి
తరుణితో గూడి రాజమందిరము జేరె. 1067

తే. అంత భరతుడు రాముని చెంత నిలిచి
సవినయమ్ముగ నిపుడు నే సలుప దగిన
కార్యమును దెల్పు మని వేడె క్రై మొగిడ్చి
క్షణము యోచించి భూపాలు డనియె నిట్లు. 1068

తే. "సోదరా! ముందు మనరాజ సౌధములను
పరమమిత్రుడు వానరపతికి జూపి
ఉపవనము మధ్యలో నున్న నృపవిలాస
సదనమున నుండు నేర్పాటు సలుపు" మనియె. 1069

తే. భరతు డంతట సుగ్రీవు కరము బట్టి
ప్రాంగణములోన గల దివ్యభవనములను
వేరు వేరుగ ద్రిప్పి చూపించి పిదప
నన్న చెప్పిన సదనమునందు దింపి. 1070

తే. "ఇనతనూభవ! వేరుగా నెంచకుండ
రామపట్టాభిషేక కార్యమ్ము కొరకు
నీవు దయయుంచి నాల్గు వార్నిధుల జలము
వడిగ దెప్పింపు మయ్య! మీ వారినంపి." 1071

ఆ. భరతు డటుల తన్ను ప్రార్థించినంతనే
వానరాధిపుండు వాయునంద
నాది కపివరులను నల్వుర బిలిపించి
చేయ దగిన పనిని చెప్పి పంపె. 1072

ఆ. వారు నల్వు రపుడె వాయువేగముతోడ
సంతసమున నాకసమున కెగిరి
స్వర్ణ ఘటములందు సాగరోదకములు
తెచ్చి రంత భరతు డిచ్చమెచ్చ. 1073

తే. అందరిని పేరు పేరున అభినుతించి
ముని వసిష్ఠుని దరికేగి "పుణ్యజలము
సిద్ధముగ నున్న దిపు డభిషేకమునకు"
అనుచు భక్తియు వినయము నెనయ బలికె. 1074

తే. అంతట వసిష్ఠమౌని సామంత నృపులు
మంత్రివర్యులు పౌరులు మౌనిగణము
అతిముదమ్మున గనుచుండ అవనిసుతను
రామభద్రుని తోడ్తెచ్చి ప్రేమ మీర. 1075

తే. ఆకస మ్మంటు స్తోత్రవాక్యాల నడుమ
వేదమంత్రాలసాక్షిగా విబుధు లలర
రత్నసింహాసనమున నా రాజదంప
తులను గూర్చుండ బెట్టెను సలలితముగ. 1076

తే. అష్ట వసువులు సురపతి కమరపురిని
నెటుల నభిషేక మొనరింతు రటులె యిచట
యోగు లెనమండుగురు నిర్మలోదకముల
చేసి రిక్ష్వాకుపతి కభిషేక మపుడు. 1077

తే. పిదప ఋత్విక్కు లర్చకుల్ విప్రవరులు
పౌరముఖ్యులు మంత్రులు పేరటాండ్రు
పరమసంతోషమున పాలుపంచుకొనిరి
రామవిభు నభిషేక కార్యమ్మునందు. 1078

తే. అంత శత్రుఘ్ను డన్న సింహాసనమ్ము
వెనుక నిలబడి పట్టెను వెల్లగొడుగు
ఇరుగడల విభీషణుడు వానరవిభుండు
వీవనల వీవ దొడగిరి విశ్వపతికి. 1079

తే. సకల దేవతాగణ మాకసమున నిలిచి
దివ్య పరిమళ చందనద్రవ్యములను
విమల చరితుడు సాకేత విభునిపైన
చల్లి రభిషేక సమయాన ఉల్ల మలర. 1080

ఆ. జ్ఞాన వృద్ధుడైన మౌని వసిష్ఠుడు
సకల వేద శాస్త్రసమ్మతముగ
రాముశిరముపైని రత్నకిరీటము
నుంచి దీవెనలను ముంచిపైచె. 1081

తే. వనజబాంధవు డుదయ పర్వతము మీద
కొలువుదీరిన వడువున కూర్మిసుతుడు
తండ్రి సింహాసనము మీద దనరు టరసి
కనుల తొలకాడె కౌసల్యకడుపుతీపి. 1082

ఆ. తానొనర్చినట్టి తప్పచే ఆనాడు
జారిపోయినట్టి సంబరమును
పంచిపెట్టి నేడు భరతు డయోధ్య క
టంచు మోద మందె నతని తల్లి. 1083

తే. కంటిపాపల రీతిని కాననముల
అన్న వదినెల పగలు రేయనక కాచి
పురికి దోడ్కొని వచ్చిన పుత్రు నరసి
అనుపమానంద భరిత యయ్యెను సుమిత్ర. 1084

ఆ. ఆకసమున పక్షు లద్భుత విన్యాస
ములను సలిపి ముదము దెలియజేసె;
మేఘమాలికలును మెరుపులతో తమ
సంతసమును భువికి చాటిచెప్పె. 1085

ఆ. పరవశమున నదులు పరవళ్ళు ద్రొక్కెను
పండు వెన్నెలాయె మండుటెండ;
మొగలిరేకులాయె మోదుగ పూవులు
హర్షబాష్పకలిత యాయె ప్రకృతి. 1086

తే. సస్యవతి యాయె భూమాత సంబరమున
పండ్లతో నిండిపోయెను పాదపములు;
మ్రోడువారిన తీవలు పూలుబూసె
వర్ణనాతీత మానాటి ప్రకృతి మహిమ. 1087

తే. విశ్వమందున్న ఆనంద విభవ మెల్ల
కన్నుల గ్నింపి తనవంక గాంచుచున్న
కపివరేణ్యుల కనుగొని గతము నెంచి
రామభద్రుడు మదిలో దలంచె నిట్లు. 1088

సీ. "ఆహవవిజయాన కన్నియు తానైన
ఇనతనూభవున కేమీయ గలను?
బహుముఖమ్ముల నాత్మబంధువై నిలిచిన
వాయునందనున కేమీయ గలను?

అగ్రజున్ వీడి నా కండదండగ నున్న
ఈ విభీషణున కేమీయ గలను?
కన్న తండ్రి విధాన వెన్నంటియుండిన
ఋక్షవల్లభున కేమీయ గలను?

తే. దండనాయక పాత్ర నుద్దండలీల
నాచరించిన స్నేహితు డంగదునకు
కడలి దాటగ సేతువు గట్టినట్టి
ఎల్ల వనచరవరుల కేమీయ గలను? 1089

తే. అనుచు పలుమారు తర్కించి యవనివిభుడు
తీరునదిగాదు జన్మలో వారి ఋణము
కనుక నేనీయగల్గిన కాన్క లొసగి
చాటుకొనెదను నాకృతజ్ఞతను నేడు." 1090

కం. అని శ్రీరాముం డనుకొని
యనుజన్ముని భరతు బిలిచి యనువగు కాన్కల్
ఘను లందరి కిడ దలచితి
నని తన యభిమతము దెలిపె నా వెనువెంటన్. 1091

తే. భరతు డెనలేని మేలి యాభరణములను
విలువ కందని జలతారు వలిపములను
క్షణములోపల దెప్పించి క్ష్మాతలేంద్రు
ముందు బెట్టించి కడుభక్తి మ్రొక్కి నిలిచె. 1092

తే. అంత రఘురాముడును సీత యాసనమ్ము
వీడి నిలబడి, భరతుడు వినయ మెనయ
చేతి కందించు బహుమతుల్ ప్రీతితోడ
ప్రముఖుల కొసంగ సాగిరి పౌరు లలర. 1093

చ. వరుసగ వార లిర్వురును వానర నేతకు వాలి సూతికిన్
వరదనుజాధినాథునకు భల్లుకరాజుకు నీలముఖ్య స
త్పురుషుల కుత్తమమ్ములగు భూరిబహూకృతు లిచ్చి పిమ్మటన్
పురజను లందరన్ బిలిచి మోదముతో నిడి రెన్నొ కానుకల్ 1094

తే. అంత కిష్కింధ రాణుల కవనిజాత
స్వయముగా పట్టువస్త్రాలు పసిడినగలు
కూర్మి నర్పించె పసుపు కుంకుమలతోడ
ముప్పురత్తల మోముల ముదము దొలుక. 1095

తే. ప్రేమ మీరగ జానకీ రాము లిడిన
దివ్య రత్నాంబరమ్ములు దీప్తు లీను
వజ్రవైదూర్య భూషణావళుల దాల్చి
అతులితానందమును బొంది రతిథు లెల్ల. 1096

తే. రాము డంతట పట్టపురాణివంక
లలిత దరహాస సందీప్తు లలర జూచి
చారుసౌవర్ణమౌక్తికహార మొసగె
నామె మనమున సంతోష మతిశయిల్ల. 1097

క. ముచ్చటపడి నాథుడు తన
కిచ్చిన హారమును సీత హితవరు లెల్లన్
మెచ్చగ వాయుతనూజున
కిచ్చెను జనయిత్రి సుతున కిచ్చిన మాడ్కిన్. 1098

తే. కీశవిభుడును దానవాధీశ ముఖ్య
మాన్యు లెందరొగల సభామండపమున
జానకీమాత పుత్ర వాత్సల్యమునను
తన కిడిన దండ వరముగా దలచి హనుమ. 1099

తే. పారవశ్యాన సీతమ్మ పదములంటి
స్వామి రఘురామవిభున కంజలి ఘటించి
హారతరళమ్ము కన్నుల కద్దుకొనుచు
నంత మెరుగని హర్షాన గంతు లిడియె. 1100

తే. భరతు డంతట వచ్చిన వారి కెల్ల
దివిజవరులకు సైతము చవులు గొలుపు
కమ్మకమ్మని పలువంటకములతోడ
విం దొసంగెను శ్రీరామవిభుడు మెచ్చ. 1101

తే. అవధిలేనంత సంతృప్తి నందినట్టి
యసురపతి విభీషణు డంత నవనిపతికి
నవనిజాతకు వందన మాచరించి
యరిగె లంకానగరి కనుచరులతోడ. 1102

కం. వెనువెంటనె సుగ్రీవుం
డినకులవిభుసెలవునంది హితు లందరితో
తన పట్టపు రాణులతో
చనియెను కిష్కింధ కమిత సంతోషమునన్. 1103

తే. రాము డంతట రాజ్యభారము వహించి
తండ్రి పాలనమే మార్గదర్శకముగ
అఖిల మానవ సౌభాగ్య మాశయముగ
బద్ధకంకణు డాయెను ప్రజలనేల. 1104

తే. అన్ని విధముల తనకు దీటైన వారు
తమ్ము లని యెంచి శ్రీరామధరణివిభుడు
ముగ్గు రనుజన్ములను బిల్చి మోద మలర
మనసులో మాట నీ విధమున వచించె. 1105

తే. "లక్ష్మణా! నిన్ను నే యువరాజు జేయ
దలచితిని కాన నీ సమ్మతమును దెలిపి
పాలనాభారమును కొంత పంచుకొను"మ
టంచు ప్రియమార బలికిన యన్న నరసి. 1106

తే. "ఊర్మిళాపతి అన్న! నా దొక్కమనవి
జీవితాంతము నేను నీ సేవకుడనె!
ధర్మనిరతుడు దానికి తగినవాడు
భరతు డుండగ వేరొక భావ మేల? 1107

తే. కనుక నామాట మన్నించి కాదుకూడ
దనక జనరంజకముగ నీయాశయముల
కనుగుణమ్ముగ ధర నేలినట్టి భరతు
నే యయోధ్యకు యువరాజు జేయు" మనియె. 1108

కం. ఆ మాట వినిన వెంటనె
నా మదిలో భావ మదియె అని శత్రుఘ్నుం
డేమాత్ర మాలసింపక
భూమీశున కెరుకపరచె బుధజను లలరన్. 1109

తే. తమ్ము లిరువురి మదిలోని తల పెరింగి
ధరణిపాలుడు పాలన దక్షుడైన
కూర్మి సోదరుభరతుని కొలువు మెచ్చ
చేసి యువరాజుగా వాని వాసి బెంచె. 1110

ఆ. ప్రేమధాముడైన రామభూపాలుడు
అఖిల జనుల సౌఖ్య మభిలషించి
పెక్కు యాగములను వేదసమ్మతముగా
నిర్జరాళి మెచ్చ నిర్వహించి. 1111

కం. తమ్ముల సహకారముతో
నిమ్మహి పదునొక్కవేల యేండ్లేలెను స్వ
ర్గమ్మును దలపించెడు చం
దమ్మున శ్రీరామవిభుడు ధర్మనిరతుడై. 1112

సీ. రామభూవిభుని పాలనమున ప్రతియిల్లు
నిత్య సౌఖ్యములకు నిలయమాయె!
దేశమంతటిలోన దేహి యనెడు చేయి
పేరుకొక్కటియు గన్పించదాయె!
తనకు తానుగ దొంగతనము నైజము వీడి
మమత కద్దమ్ముగా మారిపోయె!
జాతిభేదము లన్ని నీతిసూత్రాలకు
జోహారు సలిపి దాసోహ మాయె!

తే. పారమార్థిక భిన్నభావమ్ములెల్ల
చిన్నపిల్లలవలె చేయి చేయి కలిపి
ప్రభువు సంకీర్తనములను పాడుకొనుచు
సకలజగతికి కనువిందు సలుపుచుండె. 1113

సీ. ధరణి దప్పిక దీర గురిసెడు వర్షముల్
కరవు కాటకముల తరిమికొట్టె!
పల్లె పట్నము లన్న పక్షపాతములేక
సౌఖ్య మెల్లెడ నివాసమ్ముపెట్టె!
ధర్మము నాల్గుపాదమ్ముల నడచుచు
శాంతికి విజయ ధ్వజమ్ముగట్టె!
కలిమి లేమిని తన కౌగిట బంధించి
సమతకు నీరాజనములు పట్టె!

తే. పాలకుడు ధర్మమార్గానువర్తియైన
జనగణము సైతమా మార్గ మనుసరించు
నన్న సత్యము రామరాజ్యమ్మునందు
గడియ గడియకు మ్రోగె! జేగంటలీల. 1114

సీ. రోగమన్నది యెట్టు లుండునో కలనైన
గాంచి యెరుంగ డొక్కండు గూడ
ముదిమిచే తల ముగ్గుబుట్టగా మారిన
వైధవ్య మెరుగదే వనితగూడ

గర్భశోకమ్మున కంటనీర్వెట్టడు
జనని కన్పించ దెచ్చటను గూడ!
కాగడా చేబూని కడముట్ట వెదకిన
పసిగట్టజాల మాపదలజాడ!

తే. ఎవడు ధనికుడు పేదవా డెవ్వడన్న
దజుడు సైతము గుర్తించ నలవికాని
యటుల గడపిరి రామ రాజ్యమ్మునందు
సకల జనులును సామరస్యమ్ముతోడ. 1115

క. ప్రతి మనుజుడు దృఢకాయుడు
ప్రతి మనుజుడు ధైర్యగుణుడు ప్రతి మనుజుండున్
వితరణకు మారుపేరుగ
బ్రతికెను శ్రీరామవిభుని పాలనమందున్. 1116

ఆ. చదువులేనివాడు సంస్కారహీనుడు
బొంకులాడువాడు పొగరుబోతు
మాటదప్పవాడు మచ్చుకైనను కాన
రాడు రామవిభుని రాజ్యమందు. 1117

సీ. అన్నదమ్ముల మధ్య అనుపమాత్మీయత
ఆరని జ్యోతియై యలరుచుండె!
ఆలుమగల మధ్య ననురాగవల్లరి
సత్యమై నిత్యమై సాగుచుండె
తల్లిబిడ్డలమధ్య నెల్లవేళల ప్రేమ
పెనవేసికొని వెల్లివిరియుచుండె!
ప్రజకు రాజుకు మధ్య పరిపూర్ణ విశ్వాస
మెల్లవేళలను వర్ధిల్లుచుండె!

తే. తండ్రిమాటను శ్రుతియని తనయు డెంచె!
కోడలికి నత్త సర్వదా కూర్మిపంచె!
బాలబాలికా గణము ప్రభాతవేళ
లేచి శ్రీరాము స్తోత్రములే పఠించె. 1118

తే. కాలనియమమ్ములేక వృక్షమ్ము లన్ని
యతులితమ్ముగ భువినెల్ల ఋతువులందు
పూలు కాయలు ఫలములు పుష్కలముగ
నంద జేసెను రామ రాజ్యమ్మునందు. 1119

ఆ. ముమ్మరముగ పంట ముక్కారులను పండె
గంధమాయె చెమట కర్షకులకు
పాడివెల్లువెత్తె పశుసంపదయు హెచ్చె
పెచ్చుపెరిగె పుడమి పచ్చదనము. 1120

ఆ. మృగము లడవులందు మిగుల సఖ్యమ్ముతో
నఖిల మానవాళి యబ్బురపడ
శత్రుభయములేక సహజీవనముజేసె
రామచంద్రనృపతి రాజ్యమందు. 1121

ఆ. సత్యసంధుడైన సాకేత రాముడు
పాలకుడుగ పుడమి నేలినట్టి
కాలమందు జీవకారుణ్యభావము
ప్రాణవాయువాయె! ప్రజలకెల్ల. 1122

ఆ. ఆకసమున సూర్యు డలరారునందాక
నవని రామరాజ్య మనెడు మాట
శాంతిసౌఖ్యములకు సత్యసంకేతమై
నిత్యవర్ధనముగ నిలిచియుండు. 1123

కం. ఈ రామాయణకావ్యము
నే రచియించితిని అనుట నేరము నాచే
శ్రీరాముడు వ్రాయించెను
కారుణ్యామృతము జిల్కి కమనీయముగా. 1124

కం. ప్రతి యింట నుండ దగినది
ప్రతియొక్కరు వినదగినది ప్రతివారలకున్
శ్రుతిహితమై భవహరమై
బ్రతుకును పండించు నదియు రామాయణమే. 1125

సీ. ధ్యానించినంతనే జ్ఞాన సౌరభ మీను
మంత్రపుష్పమ్ము రామాయణమ్ము!
దర్శించినంతనే ధర్మకాంతులు జిమ్ము
మంజుకౌస్తుభము రామాయణమ్ము!
పఠియించినంతనే పరతత్త్వమును తెల్పు
అపరవేదమ్ము రామాయణమ్ము!
సేవించినంతనే జీవాత్మ నలరించు
మధురామృతమ్ము రామాయణమ్ము!

తే. మనన మొనరించు కొలది తన్మయత బెంచి
సచ్చిదానందమయ భావజలధి దేల్చి
ముక్తికిదె మార్గమని తాను ముందు నడచి
మనల నడిపించు జ్యోతి రామాయణమ్ము. 1126

శ్లో. శ్రీరామచంద్రః శ్రితపారిజాతః
సమస్త కల్యాణ గుణాభిరామః
సీతాముఖాంభోరుహచంచరీకో
నిరంతరం మంగళ మాతనోతు. 1127

## శుభమ్

***

శ్రీరామచరితం రామాయణం
సీతమ్మ హృదయం రామాయణం
రామాయణం - నిత్యపారాయణం



ఆరని దీపం రామాయణం
ఆపాత మధురం రామాయణం
అఖిల పాపములు హరియించి
ఆత్మజ్ఞానం వెలయించి
జీవిత నావను తీరము చేర్చే
తరణోపాయం రామాయణం